# పరిచయం

అనాది నుండి, మానవుడు, సమాజం, సామాజిక, ఆర్థిక, పాలనా వ్యవస్థల పురోగతిని క్రమం తప్పకుండా తెల్పేదే చరిత్ర. ప్రగతి అనేది ఒక పరిణామ దశ నుండి మరో పరిణామ దశకు జరిగే మజిలీ లాంటిది. ప్రాచీన శిలాయుగ మానవ దశ నుండి కూడా, ఈ పరిణామ ప్రవాహం అనంతంగా కొనసాగుతూ వస్తూంది. శతాబ్దాల తరబడి కరడుగట్టుకొని, వేళ్లూనుకున్న ఆర్థిక, సామాజిక, పాలనా వ్యవస్థలను మార్చేందుకై, ప్రపంచం లోని వివిధ దేశాల్లోని ప్రజలు విప్లవించాల్సొచ్చింది. విదేశీ వలసవాద, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్నుండి విముక్తికై సాగిన జాతీయ, ఐక్యతా ఉద్యమాలు కూడా, విప్లవ స్వరూపాన్ని దాల్చాయి. ఆధునిక ప్రపంచ చరిత్రలో ఇట్టి విప్లవాలకు ఎనలేని స్థానముంది. ఇంకో మాటలో చెప్పాలంటే, ఈ మహా విప్లవాలు లేకుండా, ఆయా దేశాల, ఖండాల చరిత్ర, అనూహ్యం, అసంబద్ధమౌతుందనడంలో అతిశయోక్తి లేదు.

చరిత్రలో ప్రథమ సంవత్సర స్నాతకోత్తర పాఠ్యాంశాలను అధ్యయనం చేసే, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థులకు, 'ఆధునిక విప్లవాలు' కోర్స్‌గా రూపొందించబడినాయి. విప్లవ చరిత్రతో బాటు, వీటి ప్రభావ ఫలితంగా ఆయా దేశాలు, ఖండాలు మొత్తం ప్రపంచంలోనే, ఆర్థిక, సామాజిక, పాలనా, సాంస్కృతిక వ్యవస్థల్లో సంభవించిన మార్పులు, పరిణామాలను విశ్లేషించడం జరిగింది. ఇట్టి చర్చా వివరణలు, ఆధునిక ప్రపంచ చరిత్రపై చక్కని అవగాహన ఏర్పడేందుకు తోడ్పడతాయని ఆశిస్తున్నాం.

ఈ కోర్స్‌లో మొత్తం ఏడు ఖండాలు, ఇర్వై ఆరు భాగాలున్నాయి. పఠనా సౌలభ్యం కోసం, దీనిని రెండు పుస్తకాలుగా ముద్రించడమౌతూంది. మొదటి పుస్తకంలో, మొదటి మూడు ఖండాలకు సంబంధించిన పదకొండు భాగాలను చేర్చడం జరిగింది. వీటిలో, ఇంగ్లాండ్ లో సంభవించిన ప్యూరిటన్, మహోజ్వల విప్లవాలు, అమెరికన్ విప్లవంగా పేరుగాంచిన అమెరికా స్వాతంత్ర్య సమరం, వివరంగా చర్చించబడ్డాయి. రాజ్యాంగ, పాలనా, ఆర్థిక, మత రంగాల్లో, 17, 18 శతాబ్దాల్లో వచ్చిన ప్రముఖ పరిణామాలను, వీటి అధ్యయనం ద్వారా మీరు గ్రహించగలరని భావిస్తున్నాం. రెండో పుస్తకంలో, చివరి నాల్గు ఖండాలకు చెందిన పదిహేను భాగాలను పొందుపర్చడమైంది. వీటి ద్వారా, విశ్వవిఖ్యాతి గాంచిన ఫ్రెంచ్, రష్యా, చైనా, వియత్నాం విప్లవాలు కూలంకషంగా విశ్లేషించబడ్డాయి. వీటి అధ్యయనం ద్వారా, ప్రాచీన వ్యవస్థలు, సమాజాల్లోని లోపాలు, వీటి విధ్వంసకం, నూతన వ్యవస్థా నిర్మాణ ప్రాతిపదికలు, స్వరూపాన్ని గురించి, విద్యార్థులకు సరైన అవగాహన ఏర్పడగలదని ఆశిస్తున్నాం.

అత్యంత ప్రాధాన్యతగల "ఆధునిక విప్లవాల" గురించి క్షుణ్ణంగా తెలుసుకునేందుకు, ఈ పాఠ్య భాగాలు తోడ్పడగలవని విశ్వవిద్యాలయం ఆశిస్తూంది.

BRAOU

BRAOU

# విషయక్రమం


| | | | పుట నెం. |
|---|---|---|---|
| **ఖండం– IV** | : | **ఫ్రెంచ్ విప్లవం (1789–1799)** | 1 |
| భాగం – 12 | : | ఫ్రాన్స్‌లో విప్లవ పూర్వ రంగం | 2 |
| భాగం – 13 | : | ఫ్రెంచ్ విప్లవ కారణాలు | 16 |
| భాగం – 14 | : | జాతీయ సభ : కార్యకలాపాలు | 31 |
| భాగం – 15 | : | జాతీయ కన్వెన్షన్ | 46 |
| భాగం – 16 | : | నెపోలియన్ బోనాపార్ట్ : విజృంభణ, పతనం | 62 |
| భాగం – 17 | : | ఫ్రెంచ్ విప్లవ ఫలితాలు | 78 |
| **ఖండం –V** | : | **రష్యన్ విప్లవం (1917)** | 88 |
| భాగం – 18 | : | జార్ చక్రవర్తుల పరిపాలనలో రష్యా | 89 |
| భాగం – 19 | : | రష్యన్ విప్లవ కారణాలు | 112 |
| భాగం – 20 | : | 1917 విప్లవ గమనం | 130 |
| భాగం – 21 | : | రష్యన్ విప్లవ ప్రాధాన్యత | 158 |
| **ఖండం –VI** | : | **చైనా విప్లవం (1911–1949)** | 179 |
| భాగం – 22 | : | అంతర్యుద్ధ కాలం నాటి చైనా పరిస్థితులు | 180 |
| భాగం – 23 | : | కొమింగ్‌టాంగ్ – కమ్యూనిస్ట్ ఘర్షణ | 207 |
| భాగం – 24 | : | కమ్యూనిస్ట్ విజయం : కారణాలు, ఫలితాలు, ప్రాముఖ్యత | 227 |
| **ఖండం –VII** | : | **వియత్నాం విప్లవం (1946–1975)** | 245 |
| భాగం – 25 | : | వియత్నాం : ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విముక్తి పోరాటం (1946–1954) | 246 |
| భాగం – 26 | : | ఐక్య వియత్నాంకై పోరాటం : క్రమం, ఫలితాలు, ప్రాముఖ్యత (1961–1975) | 254 |
| | | పాఠ్య ప్రణాళిక | |
| | | మాదిరి పరీక్షా పత్రం | |
| | | అభ్యాసాలు | |


BRAOU

BRAOU

# ఖండం –IV : ఫ్రెంచి విప్లవం (1789 – 1799)

ఈ ఖండంలో ఆరు భాగాలున్నాయి. అవే, 12,13,14,15,16,17 భాగాలు. ఇవి స్థూలంగా, ఫ్రెంచి విప్లవం, నెపోలియన్‌లకు సంబంధించిన ప్రధాన పరిణామాలను చర్చిస్తున్నాయి. పన్నెండో భాగంలో, విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లో నెలకొన్న పరిస్థితులు పరిశీలించబడినాయి. పదమూడో భాగంలో, విప్లవం రావటానికి దోహదమైన కారణాలు వివరించబడినాయి. విప్లవ గమనంలో తొలుతగా ప్రధాన భూమికను నిర్వహించిన జాతీయ సభ కార్యకలాపాలను, పదునాల్గో భాగంలో తెలియజేయడమైంది. విప్లవ అతి క్లిష్ట సమయంలో దేశీయ, విదేశాంగ విధానాలను అత్యంత సమర్థవంతగా నడిపించిన జాతీయ కన్వెన్షన్ గురించి, పదునైదవ భాగంలో చర్చించడం జరిగింది. విప్లవానంతరం చక్రవర్తైన నెపోలియన్ బోనాపార్ట్ విజృంభణ, పతనం, పదహారవ భాగంలో పరిశీలించబడినాయి. ఇకపోతే, చివరిదైన పదిహేడో భాగంలో, ఫ్రెంచి విప్లవ సూత్రాలు, ఫలితాలు, విప్లవ నాయకుల ప్రధాన విశేషాలు, విశ్లేషించబడినాయి.

# భాగం –12 : ఫ్రాన్స్‌లో విప్లవ పూర్వరంగం

విషయక్రమం


12.0 లక్ష్యాలు

12.1 పరిచయం

12.2 ఫ్రాన్స్‌లో విప్లవానికి ముందున్న పరిస్థితులు

12.2.1 ప్రాచీన రాజకీయ వ్యవస్థ : బూర్బన్ వంశ స్థాపన

12.2.2 పదమూడో లూయీ పాలన

12.2.3 పదునాల్గో లూయీ పాలన

12.2.4 పదిహేనో లూయీ పాలన

12.2.5 ప్రాచీన వ్యవస్థలో విప్లవ పూర్వ ప్రభుత్వ యంత్రాంగం

12.2.6 నాటి పాలనా యంత్రాంగం

12.2.7 న్యాయ పాలన

12.3 విప్లవ పూర్వ సాంఘిక వ్యవస్థ

12.3.1 మత వ్యవస్థ

12.3.2 ప్రభువులు

12.3.3 సామాన్య వర్గం

12.3.3.1 మధ్యతరగతివారు

12.3.3.2 కార్మికులు

12.3.3.3 కర్షకులు

12.4 ఆర్థిక విధానం

12.5 సంగ్రహంగా

12.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

12.7 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 12.0 : లక్ష్యాలు

ఈ పాఠ్యభాగం లో ఫ్రాన్స్ లో సంభవించిన విప్లవ ప్రాధాన్యతను ప్రస్తావించడం జరిగింది. విప్లవానికి ముందు ఫ్రాన్స్ దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ఆర్థిక, సాంఘిక పరిస్థితులను వివరించడం జరిగింది. విప్లవాన్నిమీరు సరిగా అర్థం చేసుకోవాలన్నా , విప్లవకాలంలో వచ్చిన మార్పులను నిశితంగా పరిశీలించాలన్నా, విప్లవ పూర్వరంగం లోని పరిస్థితులను పరిగణన లోకి తీసుకోవాలి. ఈ భాగంలో ఆ విషయాలను మీరు ఆకళింపు చేసుకోడంద్వారా, రానున్న పరిణామాలను సరిగ్గా అర్థం చేసుకోగలరు.

## 12.1 పరిచయం

ఇంతకుముందు మీరు ఇంగ్లాండ్ దేశంలో జరిగిన పెక్కు విప్లవాత్మక రాజకీయ మార్పులను, అమెరికా వలసల స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకై చేసిన పోరాటాలను గూర్చి అధ్యయనం చేశారు. ఈ రెండు విప్లవాల్లోను ఆయా జాతి ప్రజల రాజకీయ చైతన్యం, మానవ హక్కుల పోరాటం, వాటి పరిరక్షణకై తీసుకొన్న రాజ్యాంగ భద్రతలను మీరు గమనించి ఉంటారు. 17,18 శతాబ్దాల్లో వచ్చిన ఈ జాగృతి పెక్కు రాజకీయ, సాంఘిక మార్పులను తీసుకురావడమే గాక, మతాన్ని , సంస్కృతిని కూడా ప్రభావితం చేయడం జరిగింది. ఈ కాలంలో ఆదర్శాల ఆలాపన, అభిప్రాయాల అలజడి, పాతకొత్తల మధ్య సంఘర్షణ, మార్పుకై నిరంతర పోరాటం, మనకు కన్పిస్తాయి. ఈ ఘటనలతో ఫ్రెంచి విప్లవం ఒక మహా సంఘటన.

ప్రపంచ విప్లవ చరిత్రలో ఫ్రెంచి విప్లవానికి ఒక ప్రత్యేకత ఉంది. ఫ్రెంచి విప్లవంతో " ఐరోపా చరిత్ర ఒక జాతి, ఒక సంఘటన, ఒక వ్యక్తి చరిత్రగా రూపాంతరం చెందుతుంది. ఆ జాతే ఫ్రాన్స్, ఆ సంఘటనే ఫ్రెంచి విప్లవం, ఆ వ్యక్తే నెపోలియన్" అని చేసిన వ్యాఖ్యానం, వాస్తవానికి దగ్గరగా ఉంది.

ఫ్రెంచి విప్లవం ఆ దేశానికి పరిమితం కాలేదు. దాని ప్రభావంతో ఐరోపాలోని అన్ని దేశాల రాజకీయ వ్యవస్థలు దద్దరిల్లాయి. ఆ విప్లవం నిరంకుశాధికారానికి వెన్నుపోటు పొడిచి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆశయాల ప్రాతిపదికపై, ఒక నూతన శకాన్ని నిర్మించింది. ఫ్రెంచి విప్లవం ఒక సాయుధ సంఘర్షణే కాదు, రాజకీయ, సాంఘిక న్యాయం కోసం జరిగిన సిద్ధాంత పోరాటం. బూజు పట్టినా, బలంగానే ఉన్న పాత వ్యవస్థకు, ఆదర్శప్రేరితమైన నూతన వ్యవస్థకు మధ్య చెలరేగిన సుడిగాలి, ఈ విప్లవం. విప్లవ కారణాలను తెలుసుకొనేముందు ఫ్రాన్స్‌లో ఆనాటికి నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పరిస్థితులు, విప్లవ పూర్వ ప్రాచీన వ్యవస్థను గూర్చి తెలియచెప్పటమే ఈ భాగ లక్ష్యం.

## 12.2 ఫ్రాన్స్‌లో విప్లవానికి పూర్వమున్న పరిస్థితులు

ఫ్రెంచి విప్లవాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే, అప్పటికి ఫ్రాన్స్ దేశంలో ఉన్న రాజకీయ వ్యవస్థల, సాంఘిక, మత పరిస్థితుల అవగాహన అవసరం. ఈ పురాతన వ్యవస్థ కొన్ని శతాబ్దాలుగా పరిణామం చెంది, కాలక్రమేణ స్థిరపడింది. ఆ పరిస్థితులకు పాలకులు, పాలితులు అలవాటుపడ్డారు. అలా నెలకొల్పబడ్డ వ్యవస్థలో (Established Order) మార్పులు అసహజమని ఊహించారు. కాని, అనూహ్యంగా వచ్చిన ఫ్రెంచి విప్లవంతో, అంతకు ముందున్న భూస్వామ్య వ్యవస్థ, నిరంకుశ రాజరికం మట్టికరచి, భావికాల ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థకు పునాదులను వేయటం జరిగింది. రాజ్యపాలనలో, సాంఘిక వ్యవస్థలో, విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఆధునిక రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలకు వరవడి పెట్టడం జరిగింది.

BRAOU

## 12.2.1 ప్రాచీన రాజకీయ వ్యవస్థ : బూర్బన్ వంశ స్థాపన

క్రీ॥శ. 1589 లో నాల్గో హెన్రీ ఫ్రాన్స్ సింహాసనమధిష్టించడంతో, బూర్బన్ రాజవంశ పాలన ప్రారంభమైంది. నాల్గో హెన్రీ 17వ శతాబ్ది ఫ్రెంచి ప్రాబల్యానికి పునాదులు వేశాడు. సామ్రాజ్యానికి వచ్చిన వెంటనే మత కలహాలకు స్వస్తి చెప్పి, శాంతిభద్రతలను స్థాపించాడు. తన దేశ ప్రజల్లో అత్యధికులు కాథలిక్ మతస్థులైనందున, రాజుగా తాను కూడా ఆమతాన్ని అనుసరించడం ఉచితమని కాథలిక్ గా మారాడు. ఫ్రాన్స్ లోని ప్రొటెస్టెంట్ మతస్థులైన హ్యూజినాట్లను తృప్తి పరచడానికి నాంటిస్ శాసనాన్ని (Edict of Nantes) చేయించాడు. ఈ శాసనం ప్రకారం ప్రొటెస్టెంట్లకు, కాథలిక్ లతో సమానంగా రాజకీయ, పౌర హక్కులను ఇవ్వడమే గాక, వీటి పరిరక్షణకై భద్రతలను కూడా కల్పించడం జరిగింది. మత అసహనం రాజ్యం ఏలుతున్న ఈ కాలంలో, ఈ శాసనం మత సహనానికి మచ్చుతునక.

మత కలహాలను నిరోధించిన నాల్గో హెన్రీ స్పెయిన్ దేశంతో సంధి చేసుకొని, ఫ్రాన్స్ ఆర్థిక ప్రగతికి, రాజకీయ సుస్థిరతకు పునాదులను వేశాడు. ఫ్రెంచి ప్రాబల్య నిర్మాణ ప్రయత్నంలో, అతనికి ముఖ్యమంత్రి డ్యూక్ ఆఫ్ సల్లీ (Duke of Sully) ఎంతగానో తోడ్పడ్డాడు. వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి అయినాయి. వర్తక, వ్యాపారాలు పెరిగాయి. ఫ్రాన్స్ వాణిజ్య దేశంగా రూపొందింది. ఆర్థిక స్థితి బాగా మెరుగుపడింది.

నాల్గో హెన్రీ పాలనలో ముఖ్యమైన రాజకీయ మార్పులు వచ్చాయి. ఫ్రాన్స్ లో 16 వ శతాబ్దంలో రాజు అధికారం క్షీణించింది. రాజ్యాధికారం రాజకీయ సుస్థిరతకు ఆలంబన అని భావించిన నాల్గో హెన్రీ, ప్రభువుల అధికారాన్ని అణచివేశాడు. మధ్యయుగ కాలం నాడే ఉన్న ఫ్రెంచి శాసన సభ 'ఎస్టేట్ జనరల్' (Estate General) ను సమావేశపరచడం మానేసి, తన చెప్పుచేతల్లో నుండే ఒక సలహాదారుల సభను (Body of Notables) ను ఏర్పాటు చేశాడు. రాజు శాసనాలను సవరించే అధికారమున్న 'పారిస్ పార్లిమా' (Parlement of Paris) హక్కులను చాల వరకు తగ్గించాడు. ఒక వైపున 'ఉత్తమ పాలకుడు' (Good King) అనే పేరు సంపాదించుకుంటూ, మరోవైపున నిరపేక్ష రాజరిక అధికారాన్ని స్థాపించడానికి నాంది పలికాడు.

BRAOU

## 12.2.2 పదమూడో లూయీ పాలన

నాల్గో హెన్రీ పిదప రాజ్యాధికారానికి వచ్చిన పదమూడో లూయీ పాలనా కాలంలో ఈ నిరపేక్ష రాజ్యాధికారం మరింత పటిష్టమైంది. పదమూడో లూయీ అంత సమర్థుడైన రాజు కాదు. క్లిష్టమైన పాలనా బాధ్యతలన్న ఏవగింపు. సంగీతం, వేట మొదలైన విషయాల్లో ఆసక్తి ఎక్కువ. కాని, అదృష్ట వశాత్తు అతనికి రిష్లూ (Richelieu) అనే ప్రధాన మంత్రి సేవలు లభ్యమయ్యాయి. కార్డినల్ గా మొదలైన రిష్లూ 1624లో ఫ్రాన్స్ దేశ ప్రధాన మంత్రిగా పదవిని స్వీకరించాడు. "నాకు మీరు దయతో ఇచ్చే సర్వాధికారాన్ని నా శాయ శక్తులా ఉపయోగించి, హ్యూజినాట్ల ప్రత్యేక హక్కులను నాశనం చేయడానికీ, ప్రభువుల గర్వాన్ని అణగద్రొక్కడానికీ, ప్రజలు తమ విధులను నిర్వహించేట్లు చూడ్డానికీ, ఫ్రాన్స్ అధినేతలైన మీ పేరును ఇతర దేశాల్లో గుర్తించేటట్లుగా చేయడానికి కృషి చేయగలనని" పదమూడో లూయీ ముందు రిష్లూ తన పదవీ ప్రమాణం చేశాడు. ఈ వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికై, తర్వాత 18 సంవత్సరాలు అచంచలమైన ప్రభు భక్తితో, అకుంఠితమైన పట్టుదలతో, చాణక్య రాజనీతితో, కొన్ని సందర్భాల్లో అతి క్రూరత్వంతోను, పరిపాలన సాగించాడు. 1624 నుండి ఫ్రాన్స్ కు నిజమైన పాలకుడు రిష్లూయే.

తన రాజుకిచ్చిన వాగ్దానం మేరకు, రిష్లూ తన విధానాలను రెండు ముఖ్య భాగాలుగా విభజించాడు. 1. ఆంతరంగికంగా రాజు అధికారానికెట్టి అవరోధాలు ఉండరాదు 2. ఫ్రాన్స్ ఐరోపాలో ప్రముఖ రాజ్యంగా రూపొందాలి. రిష్లూ అనుసరించిన ఆంతరంగిక విధానం వల్ల, ఆదేశంలో నిరపేక్ష నిరంకుశ రాజరికం

ప్రేష్లాని బలపడింది. నాల్గో హెన్రీ "నాంటిస్ శాసనం' ద్వారా కల్పించిన ప్రత్యేక హక్కులతో ఫ్రెంచి హ్యూజినాట్లు ఒక మత సంస్థగానే కాక, ఒక బలమైన రాజకీయ శక్తిగా రూపొందారు. వారికి ప్రత్యేక శాసనాలను జారీ చేశారు. హ్యూజినాట్లు తరచు రాజాజ్ఞలను ధిక్కరించే స్థితికి ఎదగడంతో, జాతి ఐక్యత దెబ్బతింది. అందువల్ల, ప్రథమంగా వీరిని అణచి వేయాలని రిష్‌లూ సంకల్పించాడు. కాథలిక్ మతంలో కార్డినల్ అయిన రిష్‌లూ, మత కారణాలచే హ్యూజినాట్ల హక్కులపై దాడి చేశాడనడం పొరపాటు. కేవలం రాజు అధికారాన్ని ఎదురులేకుండా చేయడానికే, హ్యూజినాట్లపై దాడి చేసి, వీరి కేంద్రమైన 'లా రోషెల్' (La Rochelle) ను పదిహేను రోజులు ముట్టడిచేసి, వశం చేసుకున్నాడు. ఓడిపోయిన హ్యూజినాట్లకు నాంటిస్ శాసనం స్థానే, "అలే రాజశాసనం" (Edict of Alais) ద్వారా మత సదుపాయాలను కల్పించాడు. కాని, పూర్తిగా వారి ప్రత్యేక రాజకీయ అధికారాలను, హక్కులను రద్దుచేశాడు. ఈ శాసనం వల్ల నిజమైన హ్యూజినాట్లకు ఎట్టి నష్టం కలుగలేదని, ప్రభుత్వాన్ని ఎదిరించాలనే విద్రోహులైన హ్యూజినాట్లకే గుణపాఠం చెప్పడం జరిగిందని, రిష్‌లూ వ్యాఖ్యానించాడు.

రాజు అధికారానికి మరో ముఖ్య అవరోధం ప్రభువుల వ్యవస్థ (Nobility), వారి ప్రత్యేక అధికారాలు. ప్రభువులు ఆనవాయితీగా రాష్ట్ర పాలకులుగా నియమితులౌతూ ఉండేవారు. రాజుల బలహీనతను ఆధారం చేసుకొని, తామే రాజ్యాధినేతలమని విర్రవీగేవారు. తరచూ రాజాజ్ఞలను ధిక్కరించేవారు, సైనిక బలాన్ని సమీకరించుకొని, ఈ ప్రభువులు స్వతంత్రంగా వ్యవహరించేవారు. అంతేగాక, వారిలోవారు వివాహ సంబంధాల ద్వారా బంధుత్వాలను నెలకొల్పుకొని, రాజు ఎవరిపైన చర్యతీసుకొన్నా, వారు కలసికట్టుగా నిరోధించేవారు. వీరిని అణచడం రిష్‌లూకు గడ్డు సమస్య. అయితే, పట్టుదలతో వారిపై పోరాటాన్ని సాగించాడు. రాజకీయ కుతంత్రాలకు పాల్పడుతున్నారనే అభియోగంపై, వారి నాయకులను చంపించాడు. తిరుగుబాట్లను క్రూరంగా అణచివేశాడు. ప్రభువుల ప్రాసాదాలను నేలమట్టం చేయించాడు. ఈ విషయంలో రైతులు, నగరవాసులు రిష్‌లూను సమర్థించారు. ప్రభువులు తిరిగి బలపడకుండా వారి అధికారాలను మాత్రం వికేంద్రీకరించాడు. వారి బిరుదులను రద్దు చేయకుండా, అధికారాలను మాత్రం పూర్తిగా "ఇంటెన్‌డెంట్స్" (Intendents) అనే నూతన రాజసేవకులకు బదలాయించాడు. జిల్లాకొక 'ఇంటెన్‌డెంట్' ను రాజే స్వయంగా నియమిస్తాడు. పన్నులు వసూలు చేయడం, న్యాయస్థానాలేర్పాటు, స్థానిక రక్షక భట సైనిక సమీకరణ, శాంతిభద్రతల పరిరక్షణ, వారి విధులు. ఇంతటి విస్తృత అధికారాలున్న "ఇంటెన్‌డెంట్"లను ఫ్రాన్స్‌లోని ముప్పై నియంతలని వ్యవహరించేవారు (Thirty tyrants of France). రాజు నియమించిన ఈ మధ్యతరగతి నూతనోద్యోగులు భయభక్తులతో మెలగుతూ, జాగరూకులై, రిష్‌లూకు చారచక్షువులుగా పనిచేసేవారు. దీంతో, ప్రభువులు సర్వాధికారాలు కోల్పోయి, కేవలం అలంకారప్రాయులుగా మిగిలారు.

హ్యూజినాట్లను (Hugenots), ప్రభువుల నణచివేసి, రిష్‌లూ ఎస్టేట్స్ జనరల్‌ను సమావేశపరచలేదు. పారిస్ పార్లిమా అధికారాలను కేవలం న్యాయ విచారణకే పరిమితం చేశాడు. ప్రముఖుల సలహాదార్ల సభ అధికారాలను పూర్తిగా సలహాలకే వినియోగించాడు. అన్ని అధికారాలను రాజుకు దత్తం చేయడం జరిగింది. ఈ రీతిగా రిష్‌లూ ఫ్రెంచి ప్రభుత్వ స్వభావ స్వరూపాలనే పూర్తిగా మార్చివేశాడు. తన ఆంతరంగిక విధానం ద్వారా ప్రజల విధేయతను, దేశ ఐక్యతను పెంపొందించగా, రాజ్యాధికారాన్ని నిరంకుశంగా, నిరపేక్షంగా మార్పు చేశాడు. అంతేకాక, రిష్‌లూ ఫ్రాన్స్ విదేశాంగ నీతిని కూడా నిర్దేశించి, స్పెయిన్, ఆస్ట్రియా పాలకులైన హేప్స్‌బర్గ్ (Hapsburg) రాజ వంశాధికారానికి గండికొట్టి, బూర్బన్‌ల పేరుప్రతిష్ఠలను ఐరోపా అంతటా విస్తరింపచేశాడు.

రిష్‌లూ తర్వాత ప్రధాన మంత్రిగా వచ్చిన కార్డినల్ మాజరిన్ (Cardinal Mazarin) కూడా ఇదే విధానాన్ని కొనసాగించి, రాజ్యాధికారానికి విరుద్ధంగా వచ్చిన 'ఫ్రాండె' (Fronde)లనే తిరుగుబాట్లను అణచివేశాడు.

BRAOU

ఈ అణచివేత ఫలితంగా, ప్రభువుల స్థితి మరింత అధ్వాన్నమైంది. రాజకీయ , ఆర్థిక విషయాల్లో పారిస్ పార్లమెంట్ జోక్యం రద్దైంది. పారిస్ నగరం నిరాయుధీకరణ చెంది, తమ ఉద్యోగులను ఎన్నుకొనే హక్కును కోల్పోయింది. రాజ్యాధికారాన్ని దెబ్బతీయాలనే ప్రయత్నం విఫలం కావడంతో, రాజు నిరంకుశాధికారం మరింత దృఢ పడింది. ఇది పదునాల్గో లూయీ నిరపేక్ష నిరంకుశ రాజరిక సిద్ధాంతానికి దారితీసింది.

## 12.2.3 పదునాల్గో లూయీ పాలన

మాజరిన్ మరణానంతరం సర్వాధికారాలను హస్తగతం చేసుకొని, ఫ్రెంచి సామ్రాజ్యాధికారాన్ని స్వయంగా చేపట్టిన పదునాల్గో లూయీ, ఫ్రెంచి రాజరిక చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించాడు. క్రీ.శ. 1661 నుండి 1715 వరకు ఫ్రాన్స్‌ను అవిచ్ఛిన్నంగా పాలించాడు. పదునాల్గో లూయీని ఫ్రెంచి చరిత్రలో వైభవోపేతుడైన రాజు (Grand Monarch) గా పిలుస్తారు. ఐరోపా చరిత్రలో 17వ శతాబ్ది ఉత్తరార్థ భాగాన్ని పదునాల్గో లూయీ యుగంగా వ్యవహరిస్తారు.

ఫ్రెంచి విప్లవం నాటికి ఆ దేశంలో నున్న రాజరిక వ్యవస్థ రూపురేఖలు, పదునాల్గో లూయీ కాలంలో సిద్ధాంతీకరణ చేసినవే. నిరంకుశ ప్రభుత్వ సిద్ధాంతీకరణ, నిరపేక్ష రాజరిక స్థాపన, ఈయన పాలనలో పరాకాష్టనందుకున్నాయి. ఫ్రెంచి తత్వజ్ఞుడు బోసే (Bossuet) రాజు దైవాంశసంభూతుడనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించి, రూపుదిద్దాడు. రాజ్య వ్యవస్థలో అత్యున్నతుడు రాజు. జాతి శక్తి, ఔన్నత్యం అతనిలో ప్రతిబింబిస్తాయి. ప్రజల అంగీకారంతో కాక, దైవదత్తమైన అధికారంతో పరిపాలిస్తాడు. రాజు ఒక్క దైవాధికారానికే బాధ్యుడు. అందువల్ల, ఈ పృథ్విపై అతని అధికారాలకెట్టి, ఆంక్షలు, పరిమితులు లేవు. రాజు తన ఇష్టానుసారంగా అధికారాలను చెలాయించవచ్చు. వానిననుసరించుటయే ప్రజల విధ్యుక్త ధర్మం. శాసనాలు చేయడం, పన్నులు విధించడం, వాటిని ఖర్చుపెట్టడం, యుద్ధాలు చేయడం, సంధి చేసుకోవడం, అన్నీ రాజాధికారాలే. ఈ దైవాంశసంభూత సిద్ధాంతాన్ని పదునాల్గో లూయీ త్రికరణ శుద్ధిగా నమ్మి, అమలు పరిచాడు. అతని ప్రాభవంతో ఈ సిద్ధాంతం స్థిరీకరించబడడమే కాక, మిగతా ఐరోపా రాజులకు మార్గదర్శకంగా నిలిచింది. సూర్యుడు జగత్తుకెలా మూలమో, రాజుకూడా ప్రజలకు, రాజ్యాధికారాలకు మూలమని లూయీ ప్రవచించాడు. అందుకే అతన్ని 'సన్‌కింగ్' (Sun King) అని పిలుస్తారు. "నేనే రాజ్యాన్ని, నామాటలే శాసనాలు" అని చెప్పిన లూయీ అధికారాన్ని, నిరంకుశ రాజ్యాధికార అహంకారాన్ని, మీరూహించు కొనగలరు.

పద్నాల్గో లూయీ కేంద్రీకృత ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా రూపొందించాడు. అధికారాలను మునుపటివలె మంత్రులకు దత్తం చేయలేదు. వాటిని తానే స్వయంగా నిర్వహించాడు. వివిధ శాఖాధిపతులైన మంత్రులు, అతని సేవకులు మాత్రమే. అన్ని విధాన నిర్ణయాలు, వాటి అమలు రాజుకే చెందుతాయి. మంత్రులు, ప్రభువులు, రాజోద్యోగులు అతని ఆజ్ఞలకు లోబడి, తమ తమ విధులను నిర్వర్తించాలి. ఇలాంటి విధానం విజయం కావడానికి రాజు కష్టించి పని చేయాలి. నిరంతర కృషి, జాగరూకత, పటిష్ట పాలనకు మూలమని నమ్మిన పద్నాల్గో లూయీ, రాజరికాన్ని ఒక విశిష్ట బాధ్యతగా స్వీకరించాడు.

ఈ విశిష్ట, వినూత్న రాజరికం ప్రజల నాకర్షించాలంటే, దానికి ఒక ప్రత్యేకత ఉండాలి. పద్నాల్గో లూయీ తన వైభవానికి, విశిష్టతకు చిహ్నంగా, పారిస్ నగరానికి పన్నెండు మైళ్ల దూరంలో 'వర్సే' (Versailles) వద్ద ఒక బ్రహ్మాండమైన రాజప్రాసాదాన్ని నిర్మించాడు. వర్సే రాజప్రాసాదంలో కేవలం రాజకుటుంబానికి సేవ చేయడానికి 16 వేలమందిని నియమించాడు. విశాలమైన ఉద్యాన వనాలతో, ఆహ్లాదకరమైన ఆడంబర అలంకరణలతో, అపురూపమైన కట్టడాలతో, శోభాయమానమైన ప్రతిమలతో, వినూత్నంగా రూపొందించిన ఆ రాజ ప్రాసాదం, అందాల అద్దాల భవనం (Hall of Mirrors). పద్నాల్గో

BRAOU

లూయీ ప్రాభవానికి అది ప్రతిబింబం. ఎన్నిక చేసిన మంత్రులను, ఉద్యోగులను, ప్రియురాండ్లను, కళాకారులను ఇక్కడకు రప్పించి, ప్రజలకు దూరంగా, చుక్కల్లో చంద్రునిలా దేదీప్యమానంగా విరాజిల్లాడు. రాజుగారి వ్యక్తిగత సేవలకు కేవలం ప్రభువులు మాత్రమే అర్హులు. లూయీ కొలువులో అనేక మంది శిల్పులను, సాహితీవేత్తలను, సంగీత విద్వాంసులను, చిత్రకారులను పోషించడం జరిగింది. మాన్‌సార్ట్ (Mansart) లు, గిరార్డన్ (Girardan) మొదలైన శిల్పులు, చిత్రకారుడు లేబ్రన్ (Lebrun) ,సంగీత విద్వాంసుడు 'లల్లీ' (Lully) లు, ఈ కాలానికి చెందినవారే. లల్లీ సంగీతానికి ముగ్ధుడైన పద్నాల్గో లూయీ, అతడిని ప్రభువుగా చేసి, కార్యదర్శిగా నియమించడం, నాటి కళాప్రియత్వాని కొక చక్కని ఉదాహరణ. లూయీ పాలనా కాలంలో సారస్వత రంగం కూడా స్వర్ణ యుగమే. నాటక రంగ పితామహుడు 'కార్నీల్' (Corneile), నాటక రచయిత మోలియేర్ (Moliere), విద్వాంసులు, రచయితలు 'రాసీన్' (Racene), లాఫాంటైన్ (La Fontaine) ఈ కాలం నాటివారే.

లూయీ పాలనలో ఫ్రాన్స్ ఆర్థికాభివృద్ధి కూడా గణనీయంగా జరిగింది. ఆర్థిక మంత్రి 'కోల్బర్ట్' (Colbert) సంస్కరణల మూలంగా, వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. నౌకా బలం పెరిగింది. వలసలు స్థాపితమైనాయి. విదేశీ వాణిజ్యం ముమ్మరంగా సాగింది. కాని, ఈ ఆర్థిక ప్రగతి యావత్తూ, రాజప్రాసాద ఆడంబర ఖర్చుల వల్ల, పద్నాల్గో లూయీ నెరపిన యుద్ధాల వల్ల, బూడిదలో పోసిన పన్నీరుగా మారింది.

పద్నాల్గో లూయీ అవలంబించిన విదేశీ విధానం వల్ల, మొత్తం నాల్గు యుద్ధాలు చేయాల్సి వచ్చింది. బూర్బన్ వంశాధిక్యతకోసం, హేప్స్‌బర్గ్ వంశ పతనం కోసం జరిగిన ఈ యుద్ధాల వల్ల, ఫ్రాన్స్‌కు రుణ భారం, పన్నుల భారం అధికమైంది. ప్రజా జీవనం దుఃఖకరమైంది. లూయీ మరణ వార్త విన్న ప్రజలు, విందులు, వినోదాలు, చేసుకున్నారంటే, అతని పేరుప్రతిష్ఠలు ఎంతగా దిగజారాయో విదితం కాగలదు. వైభవోపేయుడని కీర్తి గాంచిన పద్నాల్గో లూయీకి ప్రజాభిప్రాయమిచ్చిన చరమ వీడ్కోలు ఎంత విలక్షణమైంది!

## 12.2.4 పదిహేనో లూయీ పాలన

పద్నాల్గో లూయీ తర్వాత రాజ్యానికి వచ్చిన అతని ముని మనుమడు పదిహేనో లూయీ నిరపేక్ష నిరంకుశ రాజరికాన్నే కొనసాగించాడు. అయితే, అట్టి ప్రభుత్వ నిర్వహణకు సమర్థత, కష్టించి పనిచేయడం అవసరం. ఇవి రెండు అతనిలో లోపించాయి. రాజ్య వ్యవహారాలంటే చిరాకు. విషయ లోలుడు. వేట, జూదం, సుఖాన్వేషణలో కాలం గడిపాడు. పద్నాల్గో లూయీ చనిపోయే ముందు తన పాలన ప్రజలకు కంటగింపుగా మారిందని తెలుసుకొని, మనుమడికి చావు తెలివితో కొన్ని మంచి సలహాలిచ్చాడు. వీలైనంత త్వరలో ప్రజల కష్టనష్టాలను దూరం చేయమని, అనవసర యుద్ధాలకు దిగవద్దని చెప్పాడు. కాని, పదిహేనో లూయీ ఈ సలహాలను విస్మరించడమే గాక, దర్బార్ ఆడంబరాలను మరింత పెంచాడు. ఆర్థిక భారాన్ని మరింత ద్విగుణీకృతం చేశాడు. పైగా ప్రియురాండ్ర ప్రభావంతో రాజ్య వైదేశిక నీతిని నడిపి, అనవసర యుద్ధాలకు దిగాడు. ప్రజలకు, పరిపాలనా బాధ్యతలకు మరింత దూరమయ్యాడు.

పదిహేనో లూయీ పాలన ముగిసేనాటికి ఫ్రాన్స్ రుణ భారం పెరిగింది. ప్రజల అసంతృప్తి మరింత తీవ్రరూపం దాల్చింది. "పారిస్ పార్లిమెా" నిరంకుశ రాజరికాన్ని దుయ్యబట్టింది. సైనిక పరాజయం, ఆర్థిక సంక్షోభం, ప్రజా వ్యతిరేకత ఫ్రెంచి రాజరికాన్ని కుదిపివేశాయి. ఇది గమనించిన పదిహేనో లూయీ "నేనున్నంత కాలం ఎలాగో జరిగిపోతుంది. నా తర్వాత వస్తుంది ప్రళయం" (After me the deluge) అని ఊహించాడు. ఆ ఊహ పదహారో లూయీ కాలంలో నిజమై, ఫ్రెంచి విప్లవం ఫ్రాన్స్ రాజరిక వ్యవస్థనే

కాక, ఐరోపా ఖండాన్నే దద్దరిల్లచేసింది.

పదమూడో లూయీ కాలంలో ప్రారంభమైన నిరంకుశ వ్యవస్థ పద్నాల్గో లూయీ కాలంలో పరాకాష్ఠ నందుకొంది. ఆతర్వాత కాలంలో సమర్థత లోపించిన రాజుల వల్ల, నూతన సిద్ధాంతాల రాజకీయ చైతన్యం మూలంగా, తదితర సాంఘిక, ఆర్థిక విషయాల కారణంగా, ఆ రాజకీయ వ్యవస్థను సవాలు చేయడం జరిగింది. నిరపేక్ష, నిరంకుశ రాజకీయ వ్యవస్థ సిద్ధాంత రీత్యా విప్లవం నాటికి నిలబడి ఉన్నా, ఆచరణలో ఆమోదయోగ్యం కాలేదు. దాని స్థానే కొత్త ప్రయోగాలను ఫ్రెంచి విప్లవం ప్రవేశపెట్టింది. వాటిని రానున్న భాగాల్లో చదవగలరు.

## 12.2.5 ప్రాచీన వ్యవస్థలో విప్లవ పూర్వ ప్రభుత్వ యంత్రాంగం

ప్రప్రథమంలో ఫ్రాన్స్‌లో రాష్ట్రాలు ముఖ్య పాలనా విభాగాలుగా ఉండేవి. వీటిని 'జనరాలిటీ' (Generalite) అని పిలిచేవారు. ఇవి రెండు రకాలు. సరిహద్దు ప్రాంతాల్లోనున్న రాష్ట్రాలను "పాయిస్ డటాస్", (Pay's detats) అని, దేశంలో నున్న రాష్ట్రాలను 'పాయిస్ ద ఎలక్షన్స్' (Pay's d' elections) అని వ్యవహరించేవారు. పదమూడో లూయీ కాలంలో రాష్ట్రాల పాలనలోనే అట్టిపెట్టి, 'ఇంతర దన్సీ'లు (Interdances) అనే మరో రాజకీయ పాలనా విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఒకే రాష్ట్రంలో కొన్ని ఇంతర దన్సీలు, ఒక ఇంతర్ దన్సీలో కొన్ని రాష్ట్రాలు, ఉండడం జరిగింది. దీంతో పాలనా విభాగాలను గూర్చిన గందరగోళమేర్పడింది. రాష్ట్ర గవర్నర్ పదవి సామాన్యంగా భూస్వామి తరగతి వారికే లభించేది. వీరు పేరుకు రాష్ట్రానికి గవర్నర్ అయినా, 'వర్సే' లోనే భోగభాగ్యాలమధ్య కాలం గడిపేవారు. గవర్నర్ జీతం, హోదా, పెద్దవే అయినా, అధికారాలు మాత్రం చాల తక్కువ. మధ్యతరగతి నుండి ఎంపిక అయిన ఇంతర దన్సీలు సర్వాధికారాలను రాజు తరపున చెలాయించేవారు. పన్నుల వసూలు, శాంతిభద్రతల పరిరక్షణ, న్యాయ నిర్వహణ మొదలైన అధికారాలు గల వీరు, రాజుకు విధేయులుగా ఉండేవారు.

పదమూడో లూయీ పాలనా కాలంలో రిష్‌లూ, మాజరిన్ మొదలైన ప్రధాన మంత్రులు నిజ రాజ్యాధికారాన్ని చెలాయించారు. కాని, పదునాల్గో లూయీ యుక్తవయస్కుడు కాగానే, అన్ని అధికారాలను స్వీకరించి, ప్రధాన మంత్రి పదవిని రద్దు చేశాడు. మంత్రులు కేవలం అతని నిర్ణయాలను అమలు పరచే సేవకులుగా గుర్తించాడు. రాజోద్యోగుల్లో ఛాన్స్‌లర్ (chancellor), ఖజానా పర్యవేక్షకుడు (Controller of General Finance), రాజ్య కార్యదర్శులు, రాజ్య పరిషత్తుకు చెందిన నల్గురు సభ్యులు, ముఖ్యులుగా ఉండేవారు. కార్యదర్శుల విధులను స్పష్టంగా నిర్వచించడం జరిగింది. ఖజానా పర్యవేక్షకుడుగా కోల్బర్ట్ (Colbert), పదునాల్గో లూయీ కాలంలో పెక్కు సంస్కరణలు చేయడమే గాక, మిగతా వారికన్నా ప్రముఖునిగా గుర్తించబడడం జరిగింది. కార్యదర్శుల మధ్య తరచు వివాదాలు, అసూయాద్వేషాలు తలెత్తగా, పద్నాల్గో లూయీ వాటిని సమర్థవంతంగా పరిష్కరించేవాడు. ఈ సమర్థత, చొరవ, తర్వాత రాజుల పాలనలో కొరవడి, పాలనా యంత్రాంగం దెబ్బతింది.

## 12.2.6 నాటి పాలనా యంత్రాంగం

నాటి రాజ్య పరిషత్తులో నాలుగు సభలుండేవి: (1) రాజాజ్ఞలను జారీ చేసే సభ. (2) ఆర్థిక విషయాల పర్యవేక్షణ సభ. (3) రాజ్యసభ. (4) ప్రీవి కౌన్సిల్ (Privy council). రెండు సభలు సామాన్యంగా విడివిడిగా సమావేశమై, ప్రభుత్వ విధానాన్ని రూపొందించేవారు. కొన్ని సందర్భాల్లో కలసి సమావేశమయ్యేవారు. రాజ్య సభ విదేశీ విధానాన్ని రూపొందించేది. ఈ సభకు రాజు, ఛాన్స్‌లర్, నలుగురు మంత్రులు మాత్రమే హాజరయ్యేవారు. ప్రీవి కౌన్సిల్ బహుళ ప్రాతినిధ్యం కల విస్తృత మండలి. ఉన్నతోద్యోగులు, న్యాయాధిపతులు,



BRAOU

యువ న్యాయవాదులు ఇందులో సభ్యులు.

రాజ్య పరిషత్తు ఇంటెండెంట్స్ అధికారాలను నిర్ణయిస్తుంది. రాజుకు కేవలం సలహాలనిచ్చే అధికారం మినహా, ఈ సభకు ప్రత్యేక హక్కులు లేవు. రాజు అధికారాన్ని నియంత్రించడానికి వీల్లేదు. రాజు మాటే శాసనం. రాజ్య పరిషత్ అధికారాలను నిర్వచించే చట్టం లేదు. పైగా ఈ సభల సభ్యులు ప్రజా ప్రతినిధులు కాదు. ఆనవాయితీగా వస్తున్న ఆచారాలు, అనుపూర్వీకాలు (Precedents) శాసనాలుగా చలామణి అయ్యేవి. వీటిని రాజ్య ప్రాథమిక శాసనాలు (Fundamental Laws) గా గుర్తించేవారు. రాజు ఎంత స్వతంత్రుడైనా, ప్రాథమిక శాసనాలను కాదనే వాడు కాడు. వాటికి లోబడి, అతడు కొత్త శాసనామైనా చేయవచ్చు. అలా రూపొందించిన నూతన శాసనాలు 'పారిస్ పార్లిమా' లో ధృవీకరణ పొందాలి. ఈ 'పారిస్ పార్లిమా' అధికారాలను కూడా కాలక్రమేణ తగ్గించడం జరిగింది.

ప్రభుత్వ యంత్రాంగంలో స్పష్టమైన శాఖల విభజన లేదు. వివిధ రాజోద్యోగుల అధికారాలను కూడా నిర్దుష్టంగా నిర్వచించలేదు. విధుల నిర్వహణలో, అధికారాల చెలాయింపులో, తరచూ ఘర్షణ ఏర్పడి, ప్రభుత్వ యంత్రాంగంలో పరస్పర సహకారం లోపించేది. ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండేది. అవినీతి, ఆశ్రిత పక్షపాతం వల్ల, పాలనా సమర్ధత దెబ్బతిన్నది. దీర్ఘకాలిక ప్రణాళికలుగాని, విధాన నిర్ణయాలు కాని లేవు. ఈ లోపాలన్నీ, పదిహేనో, పదహారో లూయీల పాలనా కాలంలో కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి. సాంప్రదాయక వ్యవస్థలకు అలవాటు పడ్డ బహుళ ప్రజానీకం, ఈ అసమర్థ, అసంగత ప్రభుత్వ విధానాలకు తలవొగ్గడం ఆనవాయితీగా మారింది.

## 12.2.7 న్యాయ పాలన

ఫ్రెంచి రాజకీయ వ్యవస్థ నిరపేక్ష నిరంకుశ రాచరికంగా నడిచేది. అంటే, రాజే న్యాయాధిపతి. అధికార విభజన అంటూ ఏమి లేదు. న్యాయ నిర్ణయాధికారం రాజు నుండే ఉద్భవిస్తుంది. న్యాయస్థానాలు రాజుపేరిట న్యాయ నిర్ణయాలు చేసేవి. ఫ్రాన్స్‌లో ఇతర వ్యవస్థలాగే న్యాయ వ్యవస్థలోకూడ ఒక క్రమ పద్ధతి, తీరు లోపించాయి. ఎన్నో రకాల న్యాయస్థానాలుండేవి. న్యాయాధిపతి ఉద్యోగాలను ప్రభుత్వం అమ్మేది. ఆ పదవిని కొన్నవారు వాటిని ఆస్తిగా పరిగణించి, వారసులకు దత్తం చేయడమో, మరొకరికి విక్రయించడమో చేసేవారు. ఈ పదవులను తిరిగి కొనుగోలు చేసే శక్తి లేని ప్రభుత్వం, న్యాయస్థానాలను అవసరమున్నా లేకపోయినా, అలాగే కొనసాగించాల్సి వచ్చింది.

ఫ్రాన్స్‌లో మొత్తం 13 ఉన్నత న్యాయాస్థానాలుండేవి. వాటిలో పారిస్ పార్లిమా ప్రముఖమైంది. ఈ పదమూడు అప్పీలు కోర్టులు. క్రింది న్యాయాస్థానాల్లో తీర్పు ఇచ్చే సివిల్, క్రిమినల్ కేసులన్నిటిపైన ఈ న్యాయాస్థానాల్లో అప్పీలు చేసుకోవచ్చు. క్రింది కోర్టుల్లో కూడ కొన్ని అప్పీలు న్యాయాస్థానాలుండేవి. పరిపాలనా విషయాలు, ఆర్థిక నేరాలు, సైనిక, నౌకాదళ వ్యవహారాలు మొదలైన వాటికి ప్రత్యేక న్యాయ స్థానాలుండేవి.

ఫ్రాన్స్ దేశంలో ప్రజలందరికీ వర్తించే "ఉమ్మడి ధర్మ సూత్రాలు" (Common legal code) లేవు. కోల్బర్ట్ తర్వాత నెపోలియన్ వరకు, దీని కొరకు పెద్ద ప్రయత్నం జరగలేదు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో రోమన్ న్యాయసూత్రాలు, మరికొన్ని ప్రాంతాల్లో భూస్వామ్య న్యాయ సూత్రాలను అమలుపరచడం జరిగింది. మౌలికమైన పౌర ధర్మ సూత్రాల్లో కూడా భిన్నత్వం గోచరించేది. వివాహాలు, వారసత్వం, దత్తత, ఆస్తి పంపకం మొదలైన విషయాల్లో ఒకొక్క ప్రాంతానికి ఒక్కో న్యాయసూత్రాలుండేవి. పైగా ఈ న్యాయ స్థానాల భౌగోళిక పరిధి సరిగా నిర్వచించబడలేదు. ఆ కారణంగా, న్యాయస్థానాల మధ్య వివాదాలేర్పడేవి. న్యాయ నిర్ణయాలు చాల ఆలస్యంగా జరిగేవి. న్యాయాధికారులు తమ నిర్ణయాలను అమ్ముకొని, సొమ్ము

చేసుకునేవారు. వారిపైవారికి లంచాలను ముట్టజెప్పేవారు.

ఫ్రాన్స్‌లో మౌలిక న్యాయమనేది (Fundamental Law) లేదు . రాజు తన యిష్టం వచ్చిన చోటుకు ముద్దాయిని విచారణకు పంపవచ్చు. నేరం రుజువు కాకముందే జైలుకు పంపవచ్చు. ఏరకమైన విచారణ లేకుండా, కేవలం ఒక పత్రం ఆధారంగా ఎవరినైనా, ఎన్నిరోజులైనా, నిర్బంధంలో ఉంచవచ్చు. ఈ పత్రాన్ని "లెటర్ డి కాషే" (Letter de Cachet) అని అంటారు. వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి ప్రభువులు, ఉన్నతోద్యోగులు వీటిని సంపాదించి, ప్రత్యర్థులను బాధించేవారు. వ్యక్తిగత హక్కులనేవి లేవు. పైగా ఎంతటి నేరాన్ని చేసిన వాడినైనా రాజు క్షమించవచ్చు. న్యాయస్థానాల తీర్పును రద్దు చేయవచ్చు. నేరాన్ని ఒప్పించ డానికి చిత్రహింసలు పెట్టడం సర్వసామాన్యం.చిన్న నేరాలకు మరణ శిక్షను విధించడం కూడా జరిగేది.

ఉన్నత న్యాయస్థానాలకు ప్రాథమిక సూత్రాల కనుగుణంగా తీర్పునిచ్చే అధికారంతోపాటు, కొత్త శాసనాలను ధృవీకరించే హక్కు కూడ ఉండేది. ఈ కొత్త శాసనాలు న్యాయ సమ్మతమా? కాదా? అనే విషయాన్ని ముందుగా చర్చించి, వాటిని నమోదు చేయాలి. పద్నాల్గో లూయీ కాలం వరకు, ఈ అధికారాలను రాజు పెద్దగా పట్టించుకోలేదు. 'పారిస్ పార్లిమా' తో సహా, మిగతా ఉన్నత న్యాయస్థానాల ధికారం, రాజు అధికారం ముందు తల ఒగ్గింది. అంతేకాక, హ్యూజినాట్లకు పౌరసత్వ హోదాను నిరాకరించడం లో, ప్రభువుల హక్కులను కాపాడడంలో వారు తోడ్పడ్డారు. కాని, కొందరు న్యాయాధిపతులు మాత్రం, నిరంకుశ రాజరికాన్ని ఆమోదించలేదు. పదిహేనోలూయీ కాలంలో, ఆ తర్వాత 'పారిస్ పార్లిమా' తన అధికారాలను గుర్తించింది. దేశంలోని పదమూడు ఉన్నత న్యాయస్థానాలు ఒకే సంస్థ అని, ఆ సంస్థ జాతికి ప్రతినిధియని, మధ్యయుగం నాటి శాసన సభ 'ఎస్టేట్ జనరల్' సమావేశాలు లేనందున, ప్రజలకు ప్రాతి నిధ్యాన్ని తామే స్వీకరించాలని నిర్ణయించారు. అంతేగాక, ప్రాథమిక సూత్రాలకు విరుద్ధంగా చేసేశాసనాలను ఎదిరించి, ప్రజల హక్కులను కాపాడే బాధ్యత తమదేనని వారు తెలిపారు. దీంతో, రాజుకు, న్యాయ వ్యవస్థకు వివాదమేర్పడి, సంఘర్షణకు దారితీసింది. దీని వివరాలను కూడా ముందు భాగాల్లో చదవగలరు.

## 12.3 విప్లవ పూర్వ సాంఘిక వ్యవస్థ

ఫ్రాన్స్‌లో సాంఘిక వ్యవస్థ విలక్షణమైంది. అసమానత్వ పునాదులపై నిర్మితమైంది. సాంఘిక వ్యవస్థలో మూడు వర్గాలుండేవి – మతాచార్యులు, ప్రభువులు, లేదా భూస్వాములు, సామాన్య ప్రజలు. మూడో వర్గాన్ని 'థర్డ్ ఎస్టేట్' (Third Estate) అని కూడా పిలిచేవారు. వీరిలో రోమ్ మతాచార్యులు, ప్రభువులు స్వాధికార వర్గంగా (Privileged) గుర్తింపు పొందారు. అయితే, వీరిలో కూడా చిన్నా, పెద్ద అనే భేదముండేది. సామాన్య ప్రజలకు లేని ఎన్నో స్వాధికారాలు వీరికుండేవి. ఈ వర్గానికి పన్నుల విధింపు నుండి కొన్ని సందర్భాల్లో పూర్తి రాయితీ, మరికొన్ని చోట్ల పాక్షిక రాయితీలుండేవి. స్వచ్ఛందంగా వారిపై వారే పన్నులు వేసుకోవచ్చు. మరొకరికి ఆ అధికారం లేదు. అంతేగాక, వారికి యితరులపై పన్ను విధించే అధికారముంది. సామాన్య ప్రజల్లో కూడా భిన్న వర్గాలుండేవి. అంటే, ప్రతి వర్గంలోను అంతర్గత వర్గాలుండేవి. ఒక్కమాటలో చెప్పాలంటే, ఫ్రెంచి సాంఘిక వ్యవస్థ వర్గభూయిష్టమన్నమాట.

### 12.3.1 మత వ్యవస్థ

స్వాధికార వర్గంలో ఒకరైన మతాచార్యులను 'క్లెర్జీ' (clergy) అంటారు. రెండున్నర కోట్ల ఫ్రెంచి జనాభాలో వీరు కేవలం లక్షా ముప్పైవేలు మాత్రమే. ప్రభువులు కూడా లక్షా సలభై వేల నుండి మాత్రమే. అంటే, వీరుభయులు కలిసి జనాభాలో ఒక శాతం మాత్రమే. మధ్యతరగతి ప్రజల్లో కూడా కొందరికి ప్రత్యేక

 హక్కులుండేవి. వారు కూడా ఒక శాతముండేవారు. ఈ రెండు శాతం ప్రజలు ఎన్నో స్వాధికారాలను,

హక్కులను, రాయితీలను అనుభవించేవారు. మిగతావారంతా సామాన్య ప్రజానీకం.

రోమన్ కాథలిక్ చర్చికి చెందిన మతాచార్యులు రాజ్యంలోని మొదటి ఎస్టేట్‌కు (First Estate) చెందుతారు. చర్చి బలమైంది; సంపన్నమైంది. ఫ్రాన్స్‌లోని 20 శాతం భూములు వీరి అధీనంలో ఉండేవి. వీటి నుండి ఆదాయం పెద్ద ఎత్తున లభించేది. అది కాక, తమ ప్రాంతంలోని మిగతా వ్యవసాయ భూములనుండి కూడా 'టైత్స్' (Tithes), అనే పన్నును వసూలు చేసేవారు. ఇది దేశ వ్యాప్తంగా విధించిన పన్ను. అయినా, ఈ వసూళ్ళు రాజ్యానికి కాక, చర్చికి చెందేవి. అంతేగాక, చర్చి ప్రభుత్వం నుండి కొన్ని రుసుములను వసూలు చేసేది. మొత్తం మీద చర్చి ఆదాయం ఏడాదికి వంద కోట్ల డాలర్లు ఉండేది. వీరి ఆదాయంపై ఎట్టి పన్నులుండేవి కావు. ఫ్రాన్స్‌లో రాజ్యం కాని, స్థానిక పాలనగాని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేవి కావు. కాని, చర్చి మత సంస్థలను నిర్వహించడమే కాక, ఆసుపత్రులను, విద్యా సంస్థలను నడపడం, మొదలైన సేవా కార్యక్రమాలను చేపట్టి, రాజ్యంలో మరో రాజ్యంగా రూపొందింది. కొన్ని సందర్భాల్లో మాత్రం, ప్రభుత్వ ఖజానాకు చర్చి చెల్లింపులు చేసేది.

చర్చి తన సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను సజావుగా నిర్వహించినట్లైయితే, ఎట్టి విమర్శలకు తావుండేదికాదు. కాని, కార్యక్రమాల్లో అవినీతి, ఆశ్రిత పక్షపాతం, దుబారా, ప్రజల విమర్శలకు, ఆగ్రహానికి కారణాలయ్యాయి. పైగా, చర్చి వ్యవస్థలో అక్రమాలు, లోపాలు చోటు చేసుకున్నాయి. చర్చి అధికారుల్లో రెండు వర్గాలున్నాయి. బిషప్‌లు, ఆర్చిబిషప్‌లు, ఆబట్లు మొదలైన ఉన్నత చర్చి అధికారులు ఐదారు వేలకు మించి లేరు. చర్చి ఆదాయంలో అధిక భాగాన్ని వీరు స్వాహా చేసేవారు. విచిత్రమేమంటే, ఈ ఉన్నతాధికారులంతా ప్రభువుల కుటుంబాలకు చెంది, పనిపాటలు చేయడం ఇష్టం లేని వారు. వీరు ఎక్కువగా రాజు కొలువులో ఉంటూ, విందులు, వినోదాలకు అలవాటు పడ్డవారు. విధి నిర్వహణ వారికి తెలియదు. మత సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలియని వీరు, భోగలాలసులు. నీతి నియమాలను వదలి, కేళీవిలాసాల్లో తేలియాడేవారు. స్ట్రాస్‌బర్గ్ ఆర్చిబిషప్ వార్షిక ఆదాయం ఆరోజుల్లో మూడు లక్షల డాలర్లుండేది. బ్రహ్మాండమైన అతని ప్రాసాదంలో, రోజు రెండు వందల మంది అతిథులకు ఆతిథ్యమిచ్చేవాడు. చివరకు కళాయి పాత్రలు కూడా వెండితో చేసినవే. అతిథుల కోసం 180 ఉత్తమాశ్వాలు సిద్ధంగా ఉండేవి. దీన్నిబట్టి చర్చి ఉన్నతాధికారుల జీవన సరళిని ఊహించవచ్చు. వారెప్పుడు తమ ప్రాంతంలో ప్రజల మధ్య ఉండేవారు కాదు.

అదే చర్చి నిర్వహణలో క్రింది స్థాయి ఉద్యోగులను లోయర్ క్లెర్జీ(Lower clergy) అని పిలుస్తారు. సామాన్య ప్రజల నుండి వచ్చిన వేలాది మత పూజారులు, ఈ కోవకు చెందిన వారు. ప్రజల మధ్యన ఉండి, వారు మత విధులను నిర్వహిస్తూ, ప్రజలకు ఊరట కల్గించే వీరి ఆదాయం కేవలం కొన్ని వందల ఫ్రాంకులు మాత్రమే. పూర్తిగా తిండికే సరిపోయేది కాదు. ఆకలితో అలమటిస్తూ, దైవంపై భారం మోపి, తమ విధులను నిర్వహించే ఈ వర్గం, తమ ఉన్నతాధికార వర్గంపై కోపం, అసహనం ప్రదర్శించడంలో ఆశ్చర్యమేమిలేదు. ఈ దళిత వర్గం విప్లవ కాలంలో నూతన సిద్ధాంతాల పట్ల ఆకర్షితులవడం, స్వాధికారాలను రద్దు చేయాలనే ప్రజా ఉద్యమాన్ని బలపరచడం సహజమే కదా!

ఈ కాలంలో చర్చి అప్రతిష్టకు మరో కారణం, జెసూట్లు, జాన్సెనీయులకు (Jansenists) మధ్య చెలరేగిన మత వివాదం. మతం పట్ల నిర్లిప్తత చోటుచేసుకొన్నవారు, జెసూట్లను మూర్ఖులుగా, జాన్సెనీయులను హంతకులుగా చిత్రించారు. ఈ రెండు వర్గాలు మత విషయాలపై పలుసార్లు కయ్యానికి దిగడం, హేతువాదుల అవహేళనకు కారణమైంది. నీతి, నియమాలు లేని మతాధికారుల ప్రవర్తన, కాథలిక్ చర్చి పై ప్రజలకున్న నమ్మకాన్ని భగ్నం చేయడమే కాక, మేధావుల అపహాస్యానికి, విమర్శకు అవకాశాన్ని కల్పించింది. మతాధికారుల అంతఃకలహాలు, చర్చిని మరింత బలహీనపరచగా, అదొక అభివృద్ధి నిరోధక సంస్థగా బహుళ ప్రజానీకం భావించింది.

BRAOU

### 12.3.2 ప్రభువులు

స్వాధికార వర్గానికి చెందిన రెండో తరగతి (Second Estate) భూస్వాములు లేదా ప్రభువులు. మతాధికారుల్లో వలె, వీరిలో కూడా అంతర్గత శ్రేణులుండేవి. ఈ వర్గాలలో ప్రముఖమైనవి రెండు. భూస్వామ్య వ్యవస్థ నుండి ఆవిర్భవించిన సైనిక విధులను నిర్వహించే ప్రభువులు. వీరు కొలువులో ఉండేవారు. వీరు కొద్ది మంది అయినా, రాజు కొలువులో ఉండేవారు. రాజుకు సేవలు చేయడంలో పోటీ పడి, ఉన్నతోద్యోగాల కోసం అవకాశాలను కల్పించుకొన్న విశిష్ట వర్గంగా గుర్తింపు పొందేవారు. రాజు గారి దయ వల్ల వీరి ఆదాయం కూడా ఎక్కువగా నుండేది. భోగభాగ్యాలతో కొలువులోనే ఉంటూ, తమ ఎస్టేట్ నిర్వహణకు ఏజెంట్లను నియమించేవారు. ఈ ఏజెంట్లు ప్రభువుల భూములను సాగుచేసే సేద్యపు రైతులను పీల్చి పిప్పి చేసేవారు. కొలువులోని అన్ని ఉన్నతోద్యోగాలను ఈ వర్గం అనుభవించడం, మిగతా వారి అసూయకు కారణమైంది. ఈ ప్రభువుల స్వాధికారాల్లో దుర్మార్గమైంది వారి 'వేట వినోదం'. ప్రభువులు ఈ వినోదం పేరుతో గుర్రాలపై స్వారి చేస్తూ, రైతుల పొల్లాలోని పంటలను నాశనం చేసినా ప్రశ్నించే వీల్లేదు. అసలే తిండి లేక అలమటించే రైతులు, ప్రభువుల వేట వినోదాన్ని అసహ్యించుకొనేవారు.

2. రాష్ట్రాల్లో వేలాది మంది ప్రభువులుండే వారు. రాజు గారి కటాక్షవీక్షణాలకు నోచుకోని వీరి ఆదాయం, ప్రథమ వర్గం వారితో పోలిస్తే చాలా తక్కువ. ఒక వైపున పని చేయడానికి హెూదా అడ్డు వచ్చేది. సుఖ జీవనం చేద్దామంటే ఆదాయం లేదు. వారి పరిస్థితి త్రిశంకు స్వర్గమే. వారు రైతుల పట్ల కొంత సానుభూతి ప్రదర్శించేవారు. తాము ఉన్నతులమని, తమలో ప్రభువుల రక్తం ప్రవహిస్తుందని మధ్య మధ్య గుర్తువచ్చి, దర్పం చూపేవారు. అయినా, ప్రజల్లో కలిసి పోయి, వారి కష్టనష్టాలను విచారించే వీరి పట్ల రైతులకు గౌరవ భావముండేది. ఈ వర్గానికి చెందిన ప్రభువుల్లో కొందరు సమకాలీన సిద్ధాంతాల పట్ల ఆకర్షితులయ్యేవారు. సామాన్య ప్రజల కోరికలను సానుభూతిగా అర్థం చేసుకున్నారు. మార్పులను వీరు పెద్దగా వ్యతిరేకించలేదు.

### 12.3.3 సామాన్య వర్గం

పై రెండు వర్గాలకు చెందిన మతాచార్యులు, ప్రభువులు మినహా, తదితరులందరూ ఈ వర్గానికి చెందినవారే. వీరు స్వాధికార రహిత వర్గం (Unprivileged). ఉన్నత వర్గాల్లో వలె ఈ వర్గంలో కూడా తీవ్రమైన అంతర్గత భేదాలున్నాయి. భాగ్యవంతుడైన బ్యాంకర్, మేధావి అయిన రచయిత, పేద రైతు, భిక్షగాడు అందరూ ఈ వర్గంలోని వారే. వీరిని స్థూలంగా మూడు రకాలుగా చెప్పవచ్చు.

#### 12.3.3.1 మధ్యతరగతి వారు

కష్టం చేసే వారు తప్ప, వర్తకులు, బ్యాంకర్లు, ఉత్పత్తిదార్లు, డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, రచయితలు, మొదలైన వీరిని "బూర్జువా " (Bourgeosie) అని పిలిచేవారు. వీరు కులీనులు. తెలివితేటలు, సమర్థత, విద్యాజ్ఞానం కలవీరు, ప్రభువులకు ఒక్క స్వాధికారాల్లో తప్ప, ఎందులోనూ తీసిపోరు. వీరు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి రుణాల నిచ్చారు. రాజ్యం దివాలా తీస్తే వారికి నష్టం కలుగుతుంది. కాని, రాజ్య వ్యవస్థను పునర్నిర్మించాలని, ప్రభుత్వ ఖర్చుపై అజమాయిషీ ఉండాలని కోరడంలో అసహజంలేదు. వీరు తమ బాధ్యతలకు అనుగుణంగా హక్కులు కావాలనీ, ఉన్నత వర్గాల స్వాధికారాలు తొలగిపోవాలని ఉద్యమించారు. వర్తక వృత్తుల విషయాల్లో ప్రభుత్వం విధించిన నిర్బంధాలు వారి ప్రగతికి ఆటంకమయ్యాయి. నూతన సిద్ధాంతాలకు ఊపిరిపోసి, ప్రచారం చేశారు. తమకన్న ప్రభువులు దేనిలోను, ఉన్నతులు కాదని, వారికి

ప్రత్యేక అధికారాలిచ్చిన పురాతన వ్యవస్థను భగ్నం చేయడానికి, శ్రామికుల, కర్షకుల తోడ్పాటుతో ఉద్యమం నడపాలని అభిలషించారు.

### 12.3.3.2 కార్మికులు

మధ్య తరగతికి దిగువగా నున్న రెండో సామాన్య వర్గం శ్రామికులు. సుమారు 25 లక్షల మంది పట్టణాల్లో, నగరాల్లో నివసించేవారు. ఫ్రాన్స్ పెద్దగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందలేదు. అందువల్ల వీరి సంఖ్య పెద్దగా పెరగలేదు. వీరు వృత్తి పరమైన సంఘాలుగా సంఘటితమై, వేతనాల పెంపుదలకు, ఉద్యోగ భద్రతకు ఉద్యమించేవారు. వీరి విధానం పారిశ్రామిక ప్రగతికి అవరోధమైందనే విమర్శలో కొంత నిజం లేకపోలేదు.

### 12.3.3.3 కర్షకులు

సామాన్య జనవర్గంలో కర్షకులత్యధిక జనాభా. నిజానికి వారే జాతికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఫ్రాన్స్ వ్యవసాయిక దేశం. దేశంలోని రెండు కోట్ల మంది కర్షకులు జనాభాలో 9/10 వంతుకెక్కువే. వీరిలో పది లక్షల మంది సేద్య బానిసలు. మిగతా వారు స్వేచ్ఛా జీవులుగా పరిగణించబడినా, వారి పరిస్థితి నికృష్టంగా ఉండేది. సగం భూములు చర్చి, ప్రభువు అధీనంలో ఉండగా, మిగతా భూములను ఈ రెండు కోట్ల మంది సాగుచేసి, జీవనం సాగించాలి. కర్షకుల్లో నాలుగు రకాల వారుండేవారు: 1. సొంత భూమిని సాగు చేసుకొనేవారు. 2.కొంత సొంత భూమి, మరికొంత కౌలు భూమిని సాగుచేసుకొనేవారు. 3. పాలుకు భూమిని సాగు చేసేవారు. 4. సేద్య బానిసలు.

రైతులకు సొంత భూమి ఉన్నా, శాసనపరంగా ఆ భూములు జమిందారుల నుండి కౌలుకు తీసుకొన్నట్లుగా పరిగణకు వచ్చేవి. తత్కారణంగా, రైతు భూస్వామికి రకరకాల రుసుములు చెల్లించడమేకాక, సేవలు కూడా చేయాలి. వాస్తవానికి రైతు ఆ భూమిని కొనుగోలు చేశాడు. దాన్ని యిష్టానుసారంగా అనుభవించవచ్చు. కాని, పేద రైతు ప్రభువుకు రుసుములు, ప్రభుత్వానికి పన్నులు, చర్చికి బైతులు చెల్లించాలి. పరోక్షపు పన్నులు కూడా విధింపబడేవి. వచ్చిన పంటలో 50 శాతానికి మించి ఈ చెల్లింపులుండేవి. భూమి అమ్మినపుడు పన్ను, రోడ్లు, వంతెనల వాడకానికి రుసుములు, ప్రభువుల గుత్తాధిపత్యంలో నున్న ధాన్యం మిల్లు, రొట్టెల తయారీ, బేకరీ మొదలైన వాటికి కిరాయి చెల్లించగా, ఆదాయంలో 20 శాతం మిగిలేది. దుర్భర దారిద్రంతో అలమటించే వారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు వారి స్థితి కడు దయనీయంగా మారింది. భిక్షగాళ్లుగా మారేవారు. ఆరు లక్షల జనాభా ఉండే పారిస్ నగరంలో, లక్ష మందికి పైగా తిండిలేక, అడుక్కుతినేవారు. వారికి నూతన సిద్ధాంతాలను గూర్చి అవగాహన, ఆలోచనలు అవగతం కాక పోవచ్చు. కాని, తమ పరిస్థితులు మారాలని, దానికై తమపై విధించిన అన్యాక్రాంత ఆర్థిక భారాలు తొలగి పోవాలని ఆశించడంలో, ఆశ్చర్యమేమీలేదు.

## 12.4 ఆర్థిక విధానం

ఫ్రెంచి ప్రాచీన వ్యవస్థలో ఆర్థిక విధానం అన్యాయం, అక్రమం, అస్తవ్యస్తమైంది. పన్నుల విధింపుకొక పద్ధతి లేదు. పన్నుభారం స్వాధికార వర్గం మీద లేదు. ఆ గాడిద బరువును కార్మిక,కర్షక వర్గాలే మోసేవి. పన్నుల వసూళ్లలో లంచగొండితనం, దౌర్జన్యం, వేధింపు, పరిపాటి. అందువల్ల వసూలు అయిన మొత్తంలో,

కొంత భాగమే ప్రభుత్వ ఖజానాలో జమయ్యేది. పద్నాల్గో లూయీ కాలం నుండి కొలువు ఖర్చు, సైనిక వ్యయం విపరీతంగా పెరిగింది. ఆ కారణంగా పరోక్ష పన్నులధికమయ్యాయి. అవి చాలక, ఉద్యోగాలను సృష్టించి అమ్మడం, మధ్య తరగతి బ్యాంకర్ల నుండి అప్పులు తీసుకోవడం, కొన్ని సందర్భాల్లో రాజు భూముల నమ్మడం, మొదలైన చర్యలు కూడా సర్వసామాన్యమయ్యాయి. 'టైల్' (Taille), లేదా భూమిశిస్తు, తల పన్ను (Poll Tax), ఆదాయంలో 20 వ భాగం పన్ను, ప్రత్యక్ష పన్నులు, ఇవి పూర్తిగా మూడో వర్గం వారే చెల్లించాలి. ఇవికాక, 'కార్వీ' (Corvee) అనే వెట్టిచాకిరి నిర్బంధమైంది. రాజమార్గాలను నిర్మించడం, సైనిక దళాలకు రవాణా సౌకర్యాలను కల్పించడం, మొదలైన పనులను ఎట్టి ప్రతిఫలం ఆశించకుండా చేయాలి. పరోక్షపు పన్నుల్లో 'గాబిలీ' (Gabelle) అనే ఉప్పు పన్ను, ఆబ్కారీ పన్ను, పొగాకు పన్ను ముఖ్యమైనవి. ఈ పన్నుల వసూలు కూడా క్రూరంగా ఉండేది. అవసరమున్నా, లేకపోయినా, నిర్ణీతమైన మొత్తంలో ఉప్పును కొనాలి. అలా చేయకపోతే వారిని బంధించి, కొన్ని సందర్భాల్లో నౌకలను లాగే బానిసలుగా పంపేవారు. ఏడాదికి సగటున నాలుగు వేల ఇండ్లను జప్తు చేసేవారు. 4 వేల మందిని జైలుకు పంపేవారు. పీడిత అసమానతలున్నవారు, ఏమి చెల్లించకలేక పోవడం, లేనివారు భారమంతా మోయాల్సి రావడం, ప్రాచీన ఫ్రెంచి ఆర్థిక విధాన దౌర్భాగ్యం.

## 12.5 సంగ్రహంగా

ఫ్రెంచి విప్లవానికి ముందు ఫ్రాన్స్‌లో వంద సంవత్సరాలుగా సాంప్రదాయబద్ధంగా నెలకొన్న కొన్ని పరిస్థితులను సమీక్షించాలి. నిరపేక్ష, నిరంకుశ రాజరిక వ్యవస్థ అవతరణ, ఆచరణలో దాని వైఫల్యం, రాజుల ఆడంబరం, ప్రజా సమస్యల పట్ల అనూహ్య నిర్లక్ష్యం, రాజ్య వ్యవస్థను బలహీనపరచాయి. సాంఘిక అసమానత, ఉన్నత వర్గాల స్వాధికారాలు, చర్చిలో అవినీతి, మతంపట్ల ప్రజల్లో నిరాసక్తత, ఏవగింపు, సామాన్య ప్రజల కడగండ్లు, ఆర్థిక విధాన లోపాల వల్ల నాటి వ్యవస్థ దుర్గంధపూరితమైంది. ఆ వ్యవస్థలో మార్పు రావాలనే ఆకాంక్ష, కొందరిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం మరికొందరిలో జనించగా, బహుళ ప్రజానీకం ఆ ఉద్యమానికి సానుభూతి, మద్దతును తెలపడంలో, ఫ్రెంచి విప్లవం ప్రారంభమైంది.

## 12.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి

1. ఫ్రాన్స్ దేశంలో విప్లవానికి ముందున్న రాజకీయ పరిస్థితులను వివరించండి.
2. 'బూర్బన్ రాజుల పాలన విప్లవానికి ముఖ్య కారణమైంది'. ఈ అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?
3. విప్లవ పూర్వరంగంలో ఫ్రెంచి ఆర్థిక , సాంఘిక వ్యవస్థల్లో నున్న అసమానత్వాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి

1. ఫ్రెంచి విప్లవ ప్రాధాన్యత ఎట్టిది?
2. రిష్‌లూ విధానాలు ఫ్రెంచి రాజ్య వ్యవస్థపై ఎటువంటి ప్రభావాన్ని వేశాయి?
3. విప్లవ పూర్వ న్యాయ వ్యవస్థను పరిశీలించండి.

BRAOU

## 12.7 ఉపయుక్త గ్రంథాలు


1. H.A.L Fisher : History of Europe
2. C.J. H. Hayes : A political and cultural History of Modern Europe, Vols.1 & 2
3. Kettlebey, C.D.M : A History of Modern Times
4. V.D. Mahajan : History of Modern Europe Since1789
5. C.D. Hazen : Modern Europe upto 1945
6. Lowell : Eve of the French Revolution
7. పి. శ్రీరామశర్మ : ఫ్రెంచి విప్లవం, తెలుగు అకాడమి ప్రచురణ.


BRAOU

Dr. BRAOU LIBRARY
Acc. No: CM-0117
Class No:

# భాగం – 13 : ఫ్రెంచి విప్లవ కారణాలు

విషయక్రమం


13.0 : లక్ష్యాలు

13.1 : పరిచయం

13.2 : ఫ్రెంచి విప్లవ కారణాలు : రాజకీయ కారణాలు : పాలనా వ్యవస్థ లోపాలు

13.2.1 : రాజరిక లోపాలు

13.3 : సాంఘిక కారణాలు

13.4 : ఆర్థిక కారణాలు

13.4.1 : ఆర్థిక మంత్రుల విఫల యత్నాలు

13.4.2 : పారిస్ పార్లిమెంటుతో ఘర్షణ

13.5 : తత్వజ్ఞుల ప్రభావం

13.5.1 : మాంటెస్క్యూ

13.5.2 : వోల్టేర్

13.5.3 : రూసో

13.5.4 : తదితర తత్వవేత్తలు

13.6 : అమెరికా స్వాతంత్ర్య యుద్ధం

13.7 : విప్లవ తక్షణ కారణం

13.8 : విప్లవ ప్రారంభం : ఎస్టేట్ జనరల్ సమావేశం

13.8.1 : సమావేశ వివాదాలు

13.8.2 : టెన్నిస్ కోర్ట్ ప్రమాణం

13.9 : సంగ్రహంగా

13.10 : పరీక్ష నమూనా ప్రశ్నలు

13.11 : ఉపయుక్త గ్రంథాలు


## 13.0 లక్ష్యాలు

ఈ పాఠ్యభాగ అధ్యయనం ద్వారా ఫ్రాన్స్‌లో విప్లవం రావడానికి గల కారణాలను, మీరు క్షుణ్ణంగా గ్రహించగల్గాలి. ప్రతి విప్లవానికి కొన్ని రాజకీయ, ఆర్థిక, సాంఘిక కారణాలుంటాయి.

ఇంతకు ముందే మీరు ఇంగ్లాండ్, అమెరికాల్లో వచ్చిన విప్లవాలను, వాటి కారణాలను చదివి ఉన్నారు. మీరు ఈ భాగంలో చదవబోయే కారణాలను వీటితో పోల్చి చూసి, విశ్లేషించగల్గాలి.

ప్రముఖంగా, ఈ భాగంలో ఫ్రెంచి విప్లవంపై తత్వజ్ఞుల ప్రభావాన్ని మీరు గమనించ గల్గాలి.

ఐరోపా ఖండమంతటా కూడా ప్రాచీన రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలు అనాదరణ, అసంతృప్తికి

హేతువులై, నిరుపయోగాలుకాగా, ఫ్రాన్స్‌లోనే ఎందుకు ప్రథమంగా 1789లో విప్లవం ప్రారంభమైందనే విషయాన్ని, మీరు ఈ పాఠ్యభాగ అధ్యయనం ద్వారా గ్రహించగల్గాలి.

## 13.1 పరిచయం

18వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌ను మినహాయించి, మిగతా ఐరోపా దేశాలతో పోల్చిచూస్తే, ఫ్రాన్స్ పరిస్థితి మెరుగ్గా ఉంది. పరిశ్రమలు, వర్తకవ్యాపారాలు, పెట్టుబడులు సంతృప్తికరంగానే ఉన్నాయి. మధ్యతరగతి ప్రజల సంపాదన కూడ పెరుగుతూనే వచ్చింది. వారు సాహిత్యం, కళల పట్ల ఆదరణ చూపేవారు. మిగతా ఐరోపా దేశాలు ఫ్రెంచి కళాపోషణను హర్షించాయి. అంతేకాక, ఫ్రాన్స్ ఐరోపాలో వైజ్ఞానిక చైతన్యానికి కేంద్రంగా భావించడం జరిగింది. అక్కడ శాస్త్రవేత్తలు, సంఘ సంస్కరణాభిలాషులు పెద్ద సంఖ్యలో ఉండడమేగాక, సామాజిక వ్యవస్థపై పలుకుబడి, పట్టును సాధించారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేది. కాని, మిగతా ఐరోపా దేశాలతో పోలిస్తే, వారు మెరుగే. ఫ్రాన్స్‌లో మధ్యతరగతివారే కాక, కొందరు మతాచార్యులు, ప్రభువులు కూడ ప్రగతిశీల భావాలతో ఆకర్షితులయ్యారు. అయినా, మిగతా ఐరోపా రాజ్యాల్లో కాకుండా, ఫ్రాన్స్‌లోనే ఒక బ్రహ్మాండమైన విప్లవం ప్రారంభమైంది. ఈ విశిష్ట విప్లవం ఐరోపా సంతటినీ ప్రభావితం చేయడమే కాక, ప్రపంచ చరిత్రలోనే నూతన రాజకీయ భావాలకు, ప్రయోగాలకు నాంది పలికింది. 1917లో వచ్చిన రష్యా విప్లవం వరకు ఇంతటి ప్రజాస్పందన కల మరో విప్లవం మనకు చరిత్రలో కన్పించదు. ఈ విప్లవ ప్రారంభానికి ఫ్రాన్స్‌లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను మనం విశ్లేషించాలి. ఈ విశ్లేషణను వివిధ రంగాల్లో విప్లవ కారణాలుగా మనం చదువుతాం. ఈ కారణాలను మనం విడివిడిగా చదివినా, నాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక తదితర రంగాలు ఒకదానిపై మరొకటి ప్రభావాన్ని చూపాయి. నాటి ఫ్రెంచి తత్వజ్ఞులు ఆనాటి ఫ్రెంచి వ్యవస్థను అన్ని కోణాల్లో తీవ్రంగా విమర్శించారు. గుణాత్మక మార్పుల నభిలషించారు. వారి అభిప్రాయాలకు ప్రజాభిప్రాయం మద్దతును పలికింది. పర్యవసానమే ఈ మహా విప్లవం.

B R A O U

## 13.2 ఫ్రెంచి విప్లవ కారణాలు : రాజకీయ కారణాలు : పాలనా వ్యవస్థ లోపాలు

సమకాలీన రాజకీయ తాత్విక చింతనతో పరిశీలిస్తే, ఫ్రెంచి రాజకీయ, సాంఘిక వ్యవస్థలను పూర్తిగా సంస్కరించాలి. అయితే, ఇదే పరిస్థితి మిగతా ఐరోపా రాజ్యాలలోనూ ఉంది. ఫ్రాన్స్‌లోని రాజకీయ వ్యవస్థలో ఒక క్రమ పద్ధతికాని, ఆలోచనకాని లేదు. ప్రభుత్వ యంత్రాంగం శాస్త్రీయంగా అభివృద్ధి చెందలేదు. అవసరాలను బట్టి మారుతూ, అస్తవ్యస్తంగా చారిత్రక గతిలో పరిణామం చెందింది. విశృంఖలతకు, గందరగోళానికి నిలయమైంది. కాలక్రమేణా ఎన్నో నూతన రాజకీయ వ్యవస్థలు, అధికారులు, పాత వ్యవస్థలను, అధికారులను తొలిగించకుండానే నియమితులైనారు. దాంతో ఏ వ్యవస్థ న్యాయబద్ధమైందో, ఏ అధికారి ఆజ్ఞలను మన్నించాలో కూడ తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒక వైపు రాజాధికారం నిరపేక్ష, నిరంకుశ రాజరికంగా చెప్పడం జరిగింది. కాని, వాస్తవానికి సరిగా నిర్వచించిన అధికారాలు, ఒకరి అధికారంపై ఆధారపడాల్సి వచ్చేది. మధ్యయుగకాలం నుండి ఫ్రాన్స్‌ను జిల్లాలుగా విభజించడమైంది. జిల్లా అధికారులను బాలిఫ్‌లు (Baliff), సెన్షలస్ (Seneschals) అని పిలిచేవారు. వారు ప్రస్తుతం అలంకారప్రాయులే. అంతేకాక, ఫ్రాన్స్ ఎప్పటినుండో రాష్ట్రాలుగా విభజితమైంది. వాటన్నింటికీ గవర్నర్లు ఉండేవారు. కొన్ని రాష్ట్రాల్లో స్థానిక పార్లమెంట్‌లు, లేదా ఎస్టేట్‌లుండేవి. రిషేలూ ప్రధాన మంత్రిగా ఉన్న కాలంలో, ఫ్రాన్స్

'ఇంటెండెన్సీలు' (Intendancies) గా విభజితమై, వాటి పాలనకై 'ఇంటెండెంట్లు' (Intendants) నియమితమైనారు. ఈ విభజనలే గాక, ఫ్రాన్స్‌లో న్యాయపాలన సంబంధంగా జిల్లాలు, ప్రతి జిల్లాకు ఒక న్యాయస్థానం లేక పార్లమెంట్ ఉండేవి. మతపరమైన విభాగాలు, ప్రతి విభాగానికి ఒక బిషప్, లేదా ఆర్చ్‌బిషప్ ఆధ్వర్యం వహించేవారు. విద్యాసంబంధంగా జిల్లాల విభజన, ప్రతి జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం ఉండేది. ప్రతి పట్టణానికి రెండు శాసన మండలులుండేవి. అయితే, ఇవి ఏవీ ఒకే పద్ధతిలో ఎన్నిక కావడం కాని, ఒకే రకమైన అధికారాలను కల్గివుండేవి కావు. ఫ్రెంచి ప్రభుత్వంలో సమర్థత, క్రమపద్ధతి లోపించాయి. రాజుగారి నిరంకుశాధికారాలకన్నా, వ్యవస్థలోని విశృంఖలత, ఇష్టారీతి, ద్వంద్వ నీతి, ఈ అసమర్థతకు ప్రముఖ కారణం. నిరపేక్ష నిరంకుశ రాజరిక సిద్ధాంతం పద్నాల్గోలూయీ తర్వాత ఆచరణలో పూర్తిగా విఫలమైంది.

ఈ అనిశ్చిత, అక్రమ తబ్బిబ్బు ఒక రాజకీయ వ్యవస్థకే పరిమితం కాలేదు. 18వ శతాబ్ది ఫ్రాన్స్‌లో తూకాల్లో, కొలతల్లో నిర్దిష్ట ప్రమాణాలు లేవు. ఇవి ప్రాంత ప్రాంతాలకూ మారేవి. చివరకు నాణాల ముద్రింపులో కూడ భిన్నత్వం ఉండేది. పన్నుల వైరుధ్యం విపరీతం. దేశం మొత్తానికి ఒకే రకమైన న్యాయ స్మృతులు లేవు. ఒక ప్రాంతంలో న్యాయబద్ధమైన పని, మరో ప్రాంతంలో నేరంగా పరిగణన పొందేది. ఒక చోట చేసిన నేరానికి చిన్న శిక్ష పడ్తే, అదే నేరానికి మరో చోట ఉరి తీసేవారు. ఫ్రాన్స్‌లో నాలుగు వందల రకాల న్యాయ స్మృతులున్నాయంటే, మీరు ఆశ్చర్యపడుతున్నారు కదూ! కాని, అది నిజం. ఇదే రకమైన స్థితి ఆర్థిక రంగంలో పన్నుల వసూలులో కన్పిస్తుంది. ఆ వివరాలను తర్వాత చదువబోతున్నాం.

ఇంత అసమర్థత, గందరగోళం ఉన్న రాజకీయ వ్యవస్థలో, నిరంకుశ ఇష్టారాజ్య ప్రవృత్తి క్రూరమైంది, దారుణమైంది. రాజునుగాని, ప్రభువునుగాని, మతాచార్యునిగాని విమర్శించిన వ్యక్తిని "లెటర్ డి కాషే" (Letter de cachet) అనే రాజ్య శాసనం ద్వారా నిర్బంధించి, కారాగారంలో వేస్తారు. ఎట్టి విచారణ లేకుండా ఎన్నాళ్లైనా వారిని జైల్లో వుంచవచ్చు. మత విషయాల్లో "ప్రొటెస్టాంట్లకు" తదితర మత సంస్థలకు గుర్తింపు ఇచ్చిన పాత శాసనాలు ఇంకా న్యాయ స్మృతుల్లో మిగిలి ఉన్నందున, వాటిని బట్టి కాథలిక్కులు కాని వారిపై తరచు నేరారోపణ, విచారణ, వేధింపులు జరిగేవి. ప్రతి ప్రగతిశీల రచయితపైన, రచనలపైన, రాజ్యపరమైన, మతపరమైన ఆంక్షలుండేవి. ఇది వారి భావ ప్రకటనను నిషేధించక పోయినా, తరచు వారిని వేధించడానికి ఉపయుక్తంగా ఉండేవి.

పైన చెప్పిన పరిస్థితులు ఒక్క ఫ్రాన్స్‌కే పరిమితం కాలేదు. అన్ని ఐరోపా రాజ్యాల్లో ఇవే పరిస్థితులుండేవి. ఇంకా కొన్ని రాజ్యాల్లో ఇంతకన్నా దారుణమైన స్థితి నెలకొంది. అయినా ఫ్రాన్స్‌లో విప్లవం రావడానికి ముఖ్యంగా ఆదేశంలోని మేధావులు, వారి విమర్శనాశక్తియే కారణం. మధ్యతరగతి అభివృద్ధి కావడమే కాక, రాజకీయ ప్రాబల్యం కోసం అర్రులు చాచి, నూతన సిద్ధాంతాలకు ప్రచారాన్ని కల్పించారు. ఇవిగాక, రెండు ప్రత్యేక కారణాలున్నాయి. ఫ్రెంచి రాజరికం అసమర్థతకు ఆలవాలం కాగా, ఫ్రెంచి ఖజానా దివాలా తీసింది. ప్రస్తుతం రాజరిక అసమర్థతను వివరంగా చూద్దాం.

## 13.2.1 రాజరిక లోపాలు

బూర్బన్ రాజుల్లో సమర్థతతో పాలించిన ఆఖరి రాజు, పద్నాల్గో లూయీ. తెలివితేటలతో పాటు, కష్టించి పనిచేసేవాడు. పాలన ఆఖరి కాలంలో తన తప్పిదాలను తెలుసుకొన్న పద్నాల్గో లూయీ, తన మనుమడు, కాబోయే రాజు పదిహేనో లూయీని మరణ శయ్య దగ్గరికి పిలిపించి, ఆ ఏడేండ్ల బాలునికి చక్కని సలహా నిచ్చాడు: "బాబూ! నీవు త్వరలో ఒక మహా రాజ్యాధినేతవు కానున్నావు. ఈ వైభవానికి కారణమైన దైవాన్ని విస్మరించవద్దు. పొరుగువారితో శాంతిగా జీవించటం నేర్చుకో; యుద్ధాలు చేయడంలో, ఆడంబర ఖర్చులు చేయడంలో నన్ను అనుసరించవద్దు. నీవు చేసే ప్రతి పనికి సలహాలను స్వీకరించు; ప్రజల కష్టాలను వీలైనంత త్వరలో తీర్చడానికి ప్రయత్నించు; ఆ పని నేను చేయలేకపోయాను."

ఈ ఉచిత సలహాను పదిహేనో లూయీ పాలనాకాలంలో అతి దారుణంగా విస్మరించడం జరిగింది. ఫ్రాన్స్ ఐరోపాలోని ముఖ్య యుద్ధాల్లో పాల్గొంటూ వచ్చింది. ఆస్ట్రియా వారసత్వ యుద్ధం, సప్తవర్ష సంగ్రామం మొదలైన యుద్ధాల్లో పాల్గొనడం వల్ల, విపరీతంగా ధన ప్రాణాలను నష్టపోయింది. ఏవో కొన్ని చిన్న భూభాగాలు సంక్రమించినా, ఇంగ్లాండ్‌తో పోరు వల్ల, ఫ్రాన్స్ తన అమెరికా, ఇండియాల్లోని వలస ప్రాంతాలన్నింటిని కోల్పోయి, నౌకా బలంలో, వాణిజ్యంలో రెండో శ్రేణి రాజ్యంగా మారింది. అంతేగాక, పదిహేనో లూయీ విలాసప్రియుడు. అతనికి ఎందరో వెలయాండ్రు. చివరకు రాజ్య వ్యవహారాల్లో కూడ ఈ బుట్ట బొమ్మల సలహాలను వినేవాడు. నాటి ఇంగ్లాండ్ ప్రభుత్వంలో ఉన్నత, మధ్యతరగతి చురుకుగా పాల్గొనేవారు. ఫ్రాన్స్‌లో ఉన్న ప్రభువులు స్వార్థపరులు. బాధ్యతలను ఏనాడు గుర్తించలేదు. మధ్యతరగతి ప్రజలు వారికి ప్రభుత్వంలో ఎట్టి చోటూలేదు. ఈ పరిస్థితిలో 15వ లూయీ ప్రభుత్వంలో ప్రతిభకు చోటు లేదు. వెలయాండ్రకు మాత్రమే పలుకుబడి ఉండేది.

పదిహేనో లూయీ రాజ్యానికి వచ్చినప్పుడు ప్రజలతనిని ప్రియమైన రాజుగా (Louis the Beloved) పిలిచారు. కాని, ఒక్క కొలువులోని ప్రభువులే అతని ఆదరణకు నోచుకొన్నారు. వీరు రాజుగారిని, ఖజానాను దివాలా తీయించారు. అయితే, 'వర్సే'లో వైభవానికి లోటు రాలేదు. రాజ ప్రసాదం ద్విగుణీకృత అందాలతో, భోగాలతో విరాజిల్లింది. అందాల ఆటకత్తెలతో విలసిల్లింది. ప్రభువులు, మతాచార్యులు మరింత భోగలాలసులయ్యారు. అయితే, 'వర్సే' రాజప్రాసాదమే ఫ్రాన్స్ దేశం కాదుకదా! పారిస్ నగరంలో, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల స్థితి, మరీ నికృష్టంగా మారింది. పన్నుల భారమధికమైంది. సంస్కరణ ఆశలడుగంటాయి. ప్రియమైన రాజును ప్రజలు అసహ్యించుకొన్నారు. ప్రజల మధ్యకు వెళ్లితే, ఛీత్కారాలు మాత్రమే వచ్చేవి. దాంతో, పదిహేనో లూయీ రాజ ప్రాసాదానికే పరిమితమయ్యాడు. అంత్య కాలంలో తన స్థితిని సరిగానే అంచనా వేసుకొన్న పదిహేనో లూయీ " ఈ వ్యవస్థ నేను బతికినంత కాలముంటుందిలే; నా వారసుడు వాడే జాగ్రత పడతాడు. నా తర్వాత ప్రళయం వస్తుంది ". అని చెప్పిన మాటలు నిజమయ్యాయి.

పదిహేనో లూయీ వారసుడు, అతడి మనుమడు పదహారో లూయీ (Louis XVI ). 1774లో సామ్రాజ్యాధినేతయ్యాడు. అతడు స్వతహాగా ఉత్తముడు, ఉదారుడు. అయితే, పదహారో లూయీకి రాజ్యాన్ని పాలించే విజ్ఞత, సమర్థత లోపించాయి. ప్రభుత్వాన్ని శాసించగల ధీరత్వం, క్రూరత్వం లేవు. ప్రశాంత వాతావరణంలో నావను దరిచేర్చగలడేమో కాని, నాటి తుఫాను సంద్రంలో చుక్కాని వేయగల నేర్పు లేదు. పైగా దృఢ చిత్తుడు గాదు. ఎవ్వరే సలహా చెప్పినా వినేవాడు. ఫ్రాన్స్‌కు బద్ధ శత్రువైన ఆస్ట్రియా దేశ రాజకుమారి మేరీ ఆంటోనెట్ (Marie Antoniette) ను పదహారో లూయీ వివాహం చేసుకోడం, ఆదేశ ప్రజలు హర్షించలేదు. రాజ్యానికి వచ్చిన ఏడేండ్లలోగా పదహారో లూయీ తన తాత ముత్తాతల తప్పిదాలకు, దుబారాకు, తన మెతక వైఖరికి, మూల్యం చెల్లించాల్సి వచ్చింది. 1789 విప్లవంలో అధికారాలను కోల్పోయి, 1792లో ప్రాణాలనే పోగొట్టుకోవాల్సివచ్చింది. ఆ వివరాలను తర్వాత చదువుతారు.

## 13.3 సాంఘిక కారణాలు

ఫ్రాన్స్‌లో సాంప్రదాయకంగా, సాంఘిక వ్యవస్థలో రెండు ముఖ్య వర్గాలున్న విషయాన్ని ఇంతకు ముందు భాగంలో చదివాం. మొదటి తరగతి స్వాధికార వర్గం (Privileged Class). వీరికి అధికారాలు, ఆదాయాలు తప్ప, బాధ్యతలు పెద్దగా లేవు. ఈ వర్గంలో రెండు తరగతులున్నాయి - మతాచార్యులు (Clergy) , ప్రభువులు, (Nobles). మతాచార్యులను మొదటి ఎస్టేట్ అని వ్యవహరించేవారు. మొదటి ఎస్టేట్‌లో కూడా ఉన్నత మతాచార్యులు (Upper Clergy), సామాన్య మతాచార్యులు (Lower Clergy)

B R A O U

అనే భేదాలుండేవి. ఉన్నత మతాచార్యులు ధనవంతులు; భవంతుల్లో నివసిస్తూ ఎన్నో ఆస్తిపాస్తులు కల్గి, విలాసాలతో, ఆడంబరాలతో జీవనం సాగించగా, సామాన్య మతాచార్యులు ప్రజల మధ్య మత విధులను నిర్వహిస్తూ, అతి సామాన్యమైన కొన్ని సందర్భాల్లో పేదరిక బతుకులను ఈడ్చేవారు.

రెండో ఎస్టేట్ లో ప్రభువులు, భూస్వాములు సభ్యులు. ఉన్నత మతాచార్యుల వలె వీరు కూడా పన్నులు చెల్లించాల్సిన పనిలేదు. మధ్యయుగంలో వీరికి శాంతి భద్రతల పరిరక్షణ మరికొన్ని బాధ్యతలున్నా, పద్నాల్గో లూయీ కాలం నుండి వారు తమ తమ నెలవులను వదలి, కొలువు చేరి, రాజ సేవలో రాజప్రాసాద భోగ భాగ్యాల్లో తరించేవారు. వీరు నాటినుండి కేవలం అలంకారప్రాయులుగా మారారు. వారి జీవన సరళి సామాన్య ప్రజలకు ఏవగింపుగా ఉండేది.

రెండో తరగతి అస్వాధికార వర్గం (Unprivileged class). దీన్ని 'మూడో ఎస్టేట్' (Third Estate) అంటారు. ఇందులో సభ్యులు మధ్యతరగతి వారు, కర్షకులు, కార్మికులు. మధ్యతరగతివారి ఆర్థిక స్థితి బాగానే ఉండేది. మేధావి వర్గమైన వారు పన్నులు చెల్లించినా, సంతృప్తికరమైన జీవనం సాగించేవారు. వారిలో రాజకీయ చైతన్యం మెండు. కార్మిక, కర్షక వర్గం వారికి బాధ్యతలు తప్ప, అధికారాలు లేవు. రాజ్య నిర్వహణకు పన్నులు (Taxes), ప్రభువులకు రుసుములు (Dues), మతానికి నిర్బంధ చెల్లింపులు (Tithes), కానుకలను సమర్పించుకోవడంలో, ఆదాయంలో ఐదోవంతు మిగిలి, దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించేవారు. పెరుగుతున్న జనాభా, ధరల కారణంగా ఈ పీడిత తాడిత ప్రజలు మార్పును కోరడం సహజమే. వారి అసంతృప్తిని, అసహనాన్ని గమనించిన తెలివితేటలు, ఆర్థిక స్థోమత కల్గిన మధ్యతరగతి నాయకులు స్వాధికార వర్గ సాంఘిక ఆధిక్యతను గర్హించారు. రాజాధికార నిరంకుశత్వాన్ని ద్వేషించారు. వారే విప్లవానికి నాయకత్వం వహించారు.

సాంఘిక అసమానత విప్లవ కారణాల్లో ముఖ్యమైంది. మొదటి రెండు ఎస్టేట్లకు, మూడో ఎస్టేట్ కు మధ్య ఉన్న అంతరాలు తీవ్రమైనవి. మతాచార్యులు, ప్రభువులకు అన్ని అధికారాలుండడమే గాక, కేవలం 23 శాతంగా ఉన్న వారు, రాజ్యంలోని సగం భూములను అనుభవించేవారు. పైగా తమ సంపదలను బట్టి పన్నులు చెల్లించనవసరం లేదు. ఈ అంతరాన్ని 'ఆబె సయీస్' (Abbe Sieyes) అనే ఫ్రెంచి తత్వజ్ఞుడు ఈ ప్రశ్నలు, సమాధానాల ద్వారా చక్కగా వివరించాడు :

ప్ర: మూడో ఎస్టేట్ అంటే ఏమిటి?

స:– ఫ్రాన్స్ సాంఘిక వ్యవస్థలో అది సర్వస్వం (నూటికి 98 మందికి పైగా ఈ వర్గం వారే)

ప్ర:– నేటివరకు దాని పరిస్థితి ఏమిటి?

స:– శూన్యం.

ప్ర:– ఈనాడు దానికి కావాల్సినదేమిటి?

స:– వ్యవస్థలో కొంత పరిగణన.

మూడో ఎస్టేట్ కు కొంత పరిగణన కావాలంటే, వారికి కొన్ని అధికారాలు, హక్కులు సంక్రమించాలి. ఆ అధికారాలను, హక్కులను ఇంగ్లాండ్ లో శాసనాల ద్వారా క్రమేణ ఇవ్వటం జరిగింది. అందువల్ల, అక్కడ పెద్దగా హింసగాని, విప్లవంగాని రాలేదు. కాని, ఫ్రాన్స్ లో రాజరికానికి ఆ తెలివితేటలు, ముందు చూపు కాని లేవు. అక్కడ ప్రభువులు, మతాచార్యులు అంత ఉదారబుద్ధిని ప్రదర్శించలేదు. ఫ్రాన్స్ లో నూటికి తొంభై మంది తిండి లేక చస్తే, మిగతావారు అరగక మరణించారని నానుడి. ఆ కారణంగా ఫ్రాన్స్ లో విప్లవం రావడమే కాక, విప్లవ సిద్ధాంతాలలో సాంఘిక సమానత్వం (social equality) అగ్రస్థానాన్ని అలంకరించింది. 1789 విప్లవం నిరంకుశాధికారంపై తిరుగుబాటు కన్నా, సాంఘిక అసమానతపై తిరుగుబాటని పెక్కు మంది చరిత్రకారుల అభిప్రాయం.



BRAOU

## 13.4 ఆర్థిక కారణాలు

ఫ్రెంచి ప్రభుత్వ ఆర్థిక దుస్థితి విప్లవానికి ముఖ్య కారణం. "విప్లవానికి ఆర్థిక కారణాలు మౌలికమైన"వని ఫిషర్ (Fisher) అభిప్రాయపడ్డాడు. పైన చెప్పిన కారణాలెన్ని ఉన్నా, దేశ ఆర్థిక పరిస్థితి సరిగా ఉండి ఉంటే, విప్లవం అంత తొందరగా వచ్చేది కాదని భావన. పద్నాల్గో లూయీ వైభవం, ఐరోపా ఆధిక్యతకై చేసిన నాలుగు యుద్ధాలతో ఖజానా దివాలా తీసింది. పదిహేనో లూయీ కూడా ఆడంబరాలపై, వెలయాండ్రపై, యుద్ధాలపై విపరీతమైన దుబారా చేశాడు. పదహారో లూయీ రాజ్యానికి వచ్చే సమయానికి ఆర్థిక పరిస్థితి మరీ నికృష్టంగా మారింది. అయినా, అమెరికా స్వాతంత్ర్య యుద్ధంలో ఫ్రాన్స్ పాల్గొనడం, నష్టపోవడం జరిగింది.

ఫ్రాన్స్‌లో పరిశ్రమలు, వ్యాపారం, వ్యవసాయం, మిగతా ఐరోపా రాజ్యాలతో పోల్చి చూస్తే, సంతృప్తికరంగానే ఉన్నాయి. ఆర్థిక స్థితి అంత దారుణంగా లేదు. వచ్చిన లోపమంతా ఆర్థిక విషయాల్లో కూడా అసమానతలు చోటు చేసుకోవడమే. దేశంలో సగం సంపద ననుభవిస్తున్న మతాచార్యులు, ప్రభువులు, పన్నులు చెల్లించనవసరం లేదు. కాని, ఆర్థిక భారాన్ని పూర్తిగా మూడో ఎస్టేట్ వారే భరించాల్సి వచ్చింది. విప్లవానికి ముందు, రాజ్య ఆదాయంలో కేవలం 20 శాతం ప్రజావసరాలపై ఖర్చు చేయగా, 80 శాతం సైన్యం పైన, అప్పులు తీర్చడంలోను ఖర్చయ్యేది. అంటే, ఈ వ్యయమంతా నిర్మాణాత్మకమైంది కాదు (Unproductive). ఈ వ్యయాన్ని తగ్గించడం కూడా నాటి ప్రభుత్వానికి సాధ్యంకాదు; వ్యయభారాన్ని స్వాధికార వర్గాలు కొంతవరకు మోయడానికి అంగీకరించి ఉంటే, సమస్య అంత క్లిష్ట మయ్యేది కాదు. ప్రభువులను, మతాచార్యులను ఈ పన్నులు చెల్లించమని అడగడానికి రాజు ఇష్టపడలేదు.

1786 నాటికి రాజ్య రుణభారం అర్వై కోట్ల డాలర్లు చేరాక, దీనికి వడ్డీ చెల్లించాలి. అది కాక, ప్రతి సంవత్సరం రెండున్నర కోట్ల డాలర్ల అప్పును కొత్తగా చేయాల్సి వచ్చింది. అప్పులు పుట్టడం కూడా కష్ట సాధ్యమైంది. వివిధ ఆర్థిక కార్యదర్శులు ఆర్థిక విషయాలను సరిదిద్దటానికి బదులు, కొత్త రుణాలను సేకరించడంలో నిమగ్నమయ్యారు.

### 13.4.1 ఆర్థిక మంత్రుల విఫల యత్నాలు

ఈ పరిస్థితుల్లో ఆదాయం పెంచడానికి ఒకే ఒక మార్గం. పన్నుల విధానంలోని అసమానతలను తొలగించడమంటే, నాటి సాంఘిక వ్యవస్థలోని స్వాధికార వర్గం పై కూడా పన్నుల భారాన్ని మోపాలి. పదహారో లూయీ రాజ్యానికి రాగానే "టర్గో" (Turgot) అనే మేధావి ఆర్థిక మంత్రిగా నియమితుడైనాడు. వోల్టేర్ స్నేహితుడు. ఎన్‌సైక్లోపీడియా రచయితల్లో ఒకడైన 'టర్గో' పెక్కు సంస్కరణలను ప్రతిపాదించాడు. పరిశ్రమలు, వ్యాపారంపై ఆంక్షలను తొలగించాలని, స్వాధికార వర్గం పై కూడా కొంత ఆర్థిక భారాన్ని మోపి, బడుగు వర్గాలపై పన్నులు తగ్గించాలని తలపోశాడు. తిండి పదార్థాలపై పన్నులు రద్దు చేయడానికి, రహదారుల నిర్మాణంలో వెట్టి చాకిరిని తొలగించాలని ప్రతిపాదించాడు. ఈ సంస్కరణలకు అగ్ర వర్గాలనుండి తీవ్ర విముఖత వచ్చింది. మతాచార్యులు, ప్రభువులు తమ స్వాధికారాలను ఏమాత్రం తగ్గించుకోవడానికి ఇష్టపడలేదు. కొలువులోని వారికి భృతులు తగ్గిపోతాయని వారు కూడా 'టర్గో' ను వ్యతిరేకించారు. గుత్త సంస్థానాధిపతుల సంస్కరణల వల్ల అల్లర్లు జరిగి, 'టర్గో' 1776లో బర్తరఫ్ అయ్యాడు.

BRAOU

సిద్ధాంతవాదైన 'టర్గో' స్థానంలో వ్యాపారస్థుడైన జాక్విస్ నెకర్ (Jacques Necker) ఆర్థిక మంత్రిగా నియమితుడైనాడు. నెకర్ తెలివితేటలు, పట్టుదల గల బ్యాంకర్. అతని భార్య కూడా కులీన వర్గాల్లో పలుకుబడిగల మహిళ. తన పదేళ్ళ పదవీకాలంలో నెకర్ తన బ్యాంకింగ్ కౌశలంతో ఆర్థిక వ్యవస్థ వ్యవహారాలను చక్కదిద్దడానికి ప్రయత్నించాడు. తన బ్యాంకర్ స్నేహితుల నుండి రుణాలు సేకరించడమే గాక, పన్నుల వసూళ్లను మెరుగుపరచాడు. అంతేగాక, ప్రప్రథమంగా రాజ్య ఆదాయ వ్యయపట్టికను ప్రచురించాడు. ఇది రాజ వర్గాల ఆగ్రహానికి కారణమైంది. రాజు చేస్తున్న దుబారా ప్రజలకు తెలియడం వారికిష్టం లేదు. ముఖ్యంగా రాణిగారు 'నెకర్' "ఆదాయ వ్యయ పట్టిక' ప్రకటనపై మండిపడింది. అసలే ఆమె అంటే ఫ్రెంచి ప్రజలకు సదభిప్రాయం లేదు ఆస్ట్రియా రాకుమార్తైన మేరి ఆంటోనెట్‌ను వారు ఎన్నడూ గౌరవించలేదు. మేరీ ఆంటోనెట్, పదహారో లూయీ సోదరులు, ఆప్తమిత్రులైన ప్రభువులు, నెకర్‌ను బర్తరఫ్ చేయాల్సిందిగా రాజుపై ఒత్తిడి చేశారు. మంచివాడేకాని మేధకుడైన రాజు నెకర్‌ను పదవినుండి తొలగించగా, రాజ్యానికి పెట్టుబడి పెట్టినవారు తలపట్టుకున్నారు.

నెకర్ స్థానంలో అనామకుడైన 'కలోన్' (Colonne) అనే వ్యక్తిని ఆర్థిక మంత్రిగా నియమించారు. అప్పటికి ఫ్రాన్స్ అమెరికా స్వాతంత్ర్య యుద్ధంలో ఉంది. ఈ యుద్ధంలో తమ సహజ ప్రతిద్వంది అయిన ఇంగ్లాండ్‌ను పరాభవించామన్న తృప్తిని పొందగా, ఖజానా మాత్రం ఖాళీ అయింది. ఈ యుద్ధంలో విపరీతమైన ఖర్చు అయింది. 'కలోన్' విపరీతమైన వడ్డీ రేట్లపై కొంత మొత్తాన్ని సేకరించగలిగాడు. కాని, ఆర్థిక పరిస్థితిలో ఎట్టి మార్పు లేదు. ఇట్టి అనివార్య, అసాధారణ, పరిస్థితుల్లో రాజు గత్యంతరం లేక, 'ముఖ్యుల సభను (Assembly of Notables) సమావేశపరిచాడు. 145 మంది ఉన్న ఈసభలో ప్రముఖ ప్రభువులు, బిషప్‌లు, న్యాయాధికారులు, సభ్యులు. వీరు స్వాధికారవర్గంపై పన్నులు వేయడానికి అనుమతిస్తారని రాజు దురాశపడ్డాడు. వారు అంతటి నిస్వార్థపరులుకాదు. 'ముఖ్యుల సభ' కొన్ని నిర్ణయాలను చేసింది. రహదారుల నిర్మాణంలో నిర్బంధ ఉచిత చాకిరీని రద్దు చేసింది; రాష్ట్ర శాసన సభలను పునరుద్ధరించింది; 'కలోన్'ను బర్తరఫ్ చేయమని చెప్పింది. అయితే, పన్నుల విషయం వచ్చేసరికి, ఆ విషయాన్ని ఎస్టేట్ జనరల్‌కు వదలి వేయాలని సిఫారస్ చేసింది. 'కలోన్' స్థానంలో ఆర్చ్‌బిషప్ 'బ్రియన్' (Brienne) ఆర్థిక మంత్రి అయ్యాడు. ఇతడు 'ముఖ్యుల సభలో' ప్రముఖ వ్యక్తి. సభను మంచి చేసుకోవడానికి ఖజానా లెక్కలన్నింటినీ వారికందజేశాడు. రాష్ట్రీయ శాసన సభల్లో వర్గ విభేధాన్ని తొలగిస్తానని చెప్పాడు. కొత్తగా విధించే భూమి శిస్తు, ఆర్థిక లోటును తీర్చే వరకే పరిమితమౌతుందని హామీనిచ్చాడు. అయితే 'ప్రముఖుల సభ' రాజీ పడడానికి, కొన్ని షరతులను విధించింది. ప్రతి ప్రభుత్వ శాఖ ఖర్చుపై నియంత్రణ ఉండాలనీ, రాజ్య ఆదాయ వ్యయాలపై క్రమబద్ధమైన 'ఆడిట్'ను జరపాలని, ఈ నియంత్రణాధికారాన్ని స్వతంత్రాధికారాలున్న ఆర్థిక సమితి కివ్వాలని, ఆ సమితిలో తమ సభ్యులకు ప్రాతినిధ్యముండాలని కోరింది. ఈ కోరికల మేరకు, 'బ్రియన్' మరో ప్రణాళికను రూపొందించారు. అందులో పెద్దగా కొత్త విషయాలేమి లేవు. ఆర్థిక సంబంధ విషయాలన్నింటికి 'పారిస్ పార్లిమా' సమ్మతికాని, లేదా ఎస్టేట్ జనరల్ సమ్మతికాని, ఉండి తీరాలని, సభ పట్టుబట్టింది. దీంతో రాజు 'పెద్దల సభ' కు ధన్యవాదాలను తెలియజేస్తూ, రద్దు చేశాడు.

## 13.4.2 పారిస్ పార్లిమాతో ఘర్షణ

ఆర్థిక సమస్య పరిష్కారానికి ఎస్టేట్ జనరల్‌ను సమావేశ పరచడం రాజు కిష్టం లేదు. కావున, ఒకే మార్గముంది. 'పారిస్ పార్లిమా' ను మంచి చేసుకోవాలి, లేదా భయపెట్టి లొంగతీసుకోవాలి. ఈ పరిస్థితుల్లో బ్రియన్ ప్రణాళికలోని శాసనాలన్నింటినీ ఆమోదించి నమోదు చేయమంటే 'పారిస్ పార్లిమా' అంగీకరించక పోవచ్చునని భావించి, వాటిలో కొన్నింటినే వారి ఆమోదానికి పెట్టారు. 'పారిస్ పార్లిమా' ద్రవ్య సంబంధం

BRAOU

లేని కొన్ని శాసనాలను రిజిష్టర్ చేసి, మిగిలిన వాటిని నమోదు చేసే అధికారం ఒక్క ఎస్టేట్ జనరల్‌కు మాత్రమే ఉందని చెప్పింది. అంతట పదహారో లూయీ మంత్రుల సలహాలపై తానే న్యాయ వేదిక నలంకరించి, మిగతా శాసనాలను రిజిష్టర్ చేయించాడు. ఈ రిజిస్ట్రేషన్ చట్ట సమ్మతం కాదని, చెల్లదని 'పారిస్ పార్లిమా' ప్రకటించింది. రాజు 'పార్లమెంట్'ను పారిస్ నుండి బహిష్కరించాడు. దీనికి తోడు, విదేశీ వ్యవహారాల్లో సంక్లిష్ట పరిస్థితి ఏర్పడింది. డచ్ వారికి సాయం చేయగలనని ఫ్రాన్స్ ప్రకటించింది. ఆ మాట నిలబెట్టుకోవడానికి బొక్కసంలో చిల్లి గవ్వ కూడా లేదు.

ఈ పరిస్థితుల్లో 'బ్రియన్' తిరిగి 'పారిస్ పార్లిమా' తో రాజీ సంప్రతింపు చేశాడు. రాజీ ప్రకారం 'పారిస్ పార్లిమా' తిరిగి సమావేశమైంది. పాత పన్నులు సరిపోవు. అప్పులు తీసుకరావాలన్నా పార్లమెంట్ సమ్మతి కావాలి. ఎస్టేట్ జనరల్‌ను సమావేశ పరచగలనని రాజు హామీనివ్వడంతో, 'పారిస్ పార్లిమా' కొత్త అప్పులకు సమ్మతిని తెలిపింది. 'పారిస్ పార్లిమా' తన సమక్షంలోనే సమావేశం కావాలని, అప్పుడే ఎస్టేట్స్ జనరల్ సమావేశం జరుగుతుందని, అయితే దానికి సలహానిచ్చే అధికారం మాత్రమే కలదని 16 వ లూయీ ప్రకటించాడు. దీనికి పార్లిమాలోని న్యాయాధిపతులు అభ్యంతరాన్ని తెలిపారు. దాన్ని లెక్క చేయక, రాజు పార్లిమా సమావేశాన్ని న్యాయవేదికగా మార్చాడు. ఈ చర్య న్యాయ విరుద్ధమని చెప్పిన ఆర్లియన్స్ ప్రభువును పదవినుండి తొలగించి, ప్రతికూలురైన న్యాయాధిపతులను నిర్బంధించాడు. నిర్బంధంలో ఉంచి, శాసనాలను రిజిష్టర్ చేయించడం అక్రమమని పార్లిమా వాదించింది. తిరిగి రాజకీయ ప్రతిష్టంభన ఏర్పడింది. పార్లిమా లోని న్యాయాధిపతులకు తలవొగ్గడం తన సార్వభౌమాధికారానికి ఆంక్షలు విధించడమేనని రాజు వాదించగా, రాజ్యంలో ప్రతి వ్యక్తికి స్వాతంత్ర్యముందని, రాజరికం కేవలం వంశపారంపర్యమని, పన్నులకు సమ్మతించే అధికారం ఒక్క ఎస్టేట్ జనరల్‌కే ఉందని, న్యాయాధిపతులను తొలగించే అధికారం ఎవరికీ లేదని పార్లిమా ఉద్ఘాటించింది. అంతేగాక, పార్లిమాను రద్దు చేస్తే, తిరిగి ఏర్పరచే న్యాయస్థానాల్లో తాము పనిచేయమని మూకుమ్మడిగా ప్రమాణం చేశారు. ఈ ప్రతిష్టంభన తొలగింపునకు ఎస్టేట్స్ జనరల్ సమావేశమొక్కటే శరణ్యమని చెప్పాడు.

అయినా రాజు న్యాయవేదిక నేర్పరిచాడు. పార్లిమా నాయకులను నిర్బంధించాడు. కొత్త శాసనాలను రిజిష్టర్ చేశాడు. శాసనాలను రిజిష్టర్ చేసే అధికారాన్ని పార్లిమాకు తీసివేస్తూ, న్యాయాధిపతుల ఉద్యోగాలనమ్మే పద్ధతిని రద్దు చేశాడు. క్రొత్తగా 47 ఉన్నత న్యాయస్థానాలను నెలకొల్పుతారు. ప్రజలను బుజ్జగించడానికి కోర్ట్ ఫీజును తగ్గిస్తూ, నేర విచారణలో హింసా పద్ధతిని రద్దు చేశారు. శాసనాలను క్రోడీకరించగలమని వాగ్దానం చేశారు. ఈ శాసనాలకు రాష్ట్ర శాసన సభలు, దిగువ న్యాయస్థానాలు, మతాధికారులు అధిక్షేపణ తెలిపారు. పారిస్ తదితర నగరాల్లో అల్లర్లు జరిగాయి. సైనికులు కూడా తిరుగుబాటులో చేరే పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి విషమిస్తుందని గమనించిన 'బ్రియన్', ఎస్టేట్ జనరల్‌ను 1789 మే 1వ తేదీన సమావేశపరుస్తానని ప్రకటించి, రాజీనామా చేశాడు. అతని స్థానంలో పదహారో లూయీ 'నెకర్'ను నియమించి, పార్లిమాను పునరుద్ధరించాడు. ఎస్టేట్ జనరల్ లో మూడు వర్గాలుంటాయని, ప్రతి ఎస్టేట్‌కు సమాన ప్రాతినిధ్యముంటుందని, ప్రతి ఎస్టేట్ విడివిడిగా తీర్మానాలు చేస్తుందని, పార్లిమా ప్రకటించింది. దీనికి రాజు అంగీకరించాడు. 175 సంవత్సరాల తర్వాత తిరిగి ఎస్టేట్ జనరల్ సమావేశమైంది. ఆ సమావేశమే విప్లవానికి దారితీసింది. దాన్ని గురించి వివరంగా తర్వాత చదువుతారు.

## 13.5 తత్వజ్ఞుల ప్రభావం

ఫ్రెంచి విప్లవంపై తత్వజ్ఞుల ప్రభావమపారం. పద్దెనిమిదో శతాబ్దాన్ని విజ్ఞాన యుగంగా చెప్పవచ్చు. ఐరోపా అంతటా ఈ వైజ్ఞానిక ప్రగతి కన్పించినా, ఫ్రాన్స్‌లో ఈ నూతన అభిప్రాయాల అలజడి పాత వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా, నూతన వ్యవస్థకు ఊపిరిగా రూపొందింది. నూతన సిద్ధాంతాలు ప్రజలలో మొత్తం 

పట్ల మూఢ విశ్వాసాల్ని తగ్గించి, డీయిజం"(Deism)మొదలైన సిద్ధాంతాలకు విశేష ప్రచారాన్ని కల్పించాయి. ఫ్రాన్స్‌లో విప్లవ భావాలపై విశేష ప్రభావాన్ని చూపిన తత్వజ్ఞులు త్రిమూర్తులు.

### 13.5.1 మాంటెస్క్యూ (1689–1755)

చక్కని హాస్యభావాలు గల సమర్థుడైన న్యాయవాది. మానవ వ్యవస్థలను కూలంకషంగా మథించాడు. మంచి రచయిత. "ది స్పిరిట్ ఆఫ్ లాస్" (The Spirit of Laws) అనే గ్రంథాన్ని రచించాడు. అతని రచనలు ఊహాలోకపు స్వాప్నిక జగత్తును కూర్చి కాక, శాస్త్రీయ హేతువాద రీతిలో చక్కని మితభావ ధోరణిలో సాగాయి. నిరంకుశ ప్రభుత్వాధికారానికన్న బాధ్యతాయుత ప్రభుత్వం మేలని సిద్ధాంతీకరించాడు. బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనకు 'అధికార వికేంద్రీకరణ' (Separation of Powers) ఆవశ్యకమని, రాజ్య అధికారాలను శాసన, కార్యనిర్వాహక, న్యాయాధికారాలుగా విభజించాలని, అట్టి విభాగంలోనే వ్యక్తిగత స్వేచ్ఛ పరిరక్షితమౌతుందనీ వివరించాడు. లేకుంటే, నిరంకుశత్వం ఏర్పడుతుందని చెప్పాడు. అంతేగాక, ఫ్రాన్స్‌లో ప్రాచీన కాలం నుండి ఉన్న వ్యవస్థలను, శాసనాలను, ఆనవాయితీలను విశ్లేషించాడు. ఈ విశ్లేషణ ఫ్రాన్స్‌లో పద్నాల్గో లూయీ కాలంలో నెలకొన్న దైవాంశ సంభూత రాజరికం లోని బూటకాన్ని బహిర్గతం చేసింది.

మాంటెస్క్యూ తీవ్రవాది కాదు. అతనికి కాథలిక్ మతంలో, రాజరికంలో విశ్వాసముంది. అయితే, చర్చిలోని దురాగతాలను, రాజరిక నిరంకుశత్వాన్ని మంద్ర స్థాయిలో విమర్శించాడు. నిరంకుశ రాజరికం పండు కోసుకోవడానికి చెట్టు నరకడం లాంటిదని చెప్పాడు. ఫ్రెంచి వ్యవస్థలను ఇంగ్లాండ్‌లో వచ్చిన వ్యవస్థలతో పోల్చి, లోటుపాట్లను బహిర్గతం చేశాడు. అతని గ్రంథం 'స్పిరిట్ ఆఫ్ లాస్'ను 18 నెలల్లో 22 సార్లు ముద్రించడం జరిగింది. మాంటెస్క్యూ సిద్ధాంతాలు ఫ్రాన్స్ లోని విప్లవాల ముందున్న వ్యవస్థల ఔచిత్యాన్ని ప్రశ్నించడం జరిగింది.

### 13.5.2 వోల్టేర్

ఫ్రెంచి తత్వజ్ఞుల్లో మహోన్నత వ్యక్తి వోల్టేర్ (1694 - 1778). తన జీవిత కాలమంతా భిన్నమైన ఎన్నో రచనలను చేశాడు. చరిత్ర, పద్యం, గద్యం, నాటకం, ఊహా చిత్రాలతో, నాటి నమ్మకాలను, ఆచారాలను దుయ్యబట్టాడు. నాటి వ్యవస్థలను, వాటిని నిర్వహిస్తున్న వ్యక్తులను, అవహేళన చేశాడు. ప్రభువులపై, మతాచార్యులపై, వ్యంగోక్తులను విసిరాడు. అతనిపై ఆగ్రహించిన వారు, అతనిని గూండాలచే కొట్టించారు. ఖైదు పత్రాన్ని పొంది, బాస్టిల్ జైలులో బంధించారు. దేశాన్ని వదలిపెట్టే షరతుపై అతన్ని వదలివేశారు. 1726లో ఇంగ్లాండ్‌కు వెళ్లిన వోల్టేర్, ఆదేశపు సాంఘిక, రాజకీయ వాతావరణం మూలంగా ప్రభావితుడై, అక్కడున్న మూడు సంవత్సరాల కాలంలో "లెటర్స్ ఢి ల ఆంగ్లస్ట్ర (Letters de la Anglastre) అనే గ్రంథంలో తన అనుభవాలను వర్ణించగా, ఫ్రాన్స్ ప్రభుత్వం ఆ గ్రంథాన్ని తగలబెట్టించింది. ఇంగ్లాండ్ లో చట్టపరమైన రాజ్యాంగం, భావ స్వాతంత్ర్యం, మధ్యతరగతి ప్రజలకు హోదా, గౌరవం, పౌర హక్కులు, మేధావులకు స్వేచ్ఛ కలవని, అవి ఫ్రాన్స్‌లో లేవని వోల్టేర్ విశదీకరించాడు. వోల్టేర్ ఫ్రాన్స్‌కు తిరిగి వచ్చినా, ప్రభుత్వ దమన నీతికి వెరచి, తిరిగి పారిపోయి, లోరేన్ లో 15 సంవత్సరాలు ప్రవాస జీవితాన్ని గడిపాడు. ప్రష్యా ప్రాజ్ఞ నిరంకుశ రాజైన "ఫ్రెడరిక్ ది గ్రేట్' (Frederick the Great) ఆహ్వానంపై, బెర్లిన్ దర్శించాడు. ఫ్రెడరిక్ అధికార దాహాన్ని గమనించి, బెర్లిన్ నుండి స్విస్ సరిహద్దుల్లో నున్న 'ఫెర్నీ' (Ferni) నగరంలో ప్రవేశించి, స్వేచ్ఛగా బతికాడు. ఈ కాలమంతా ఎన్నో రచనలను చేశాడు.

హేతువాద ఆవశ్యకతను, మతంతో సహన బుద్ధిని ప్రవచించాడు. మత దురంహకారాన్ని దుయ్యబట్టి,

B R A O U

చర్చి అధికారాన్ని నిరసించాడు. 'అప్రతిష్ఠాకరమైన చర్చి అధికారాన్ని నాశనం చెయ్యండి' అనే అతని నినాదం, మతాచార్యులను భయభ్రాంతులను చేసింది. బైబిల్‌కు వ్యతిరేకంగా ప్రచార గ్రంథమొకటి రాశాడు. అయితే, అతడు నాస్తికుడు కాదు. భగవంతుడున్నాడని, మానవునిలోని అంతర్వాణి పిలుపు ముఖ్యమని, మతంలోని దుష్ట విశ్వాసాలను ఎదురించాలని నమ్మాడు. 1764లో రచించిన 'ఫిలసాఫికల్ డిక్షనరీ' (Philosophical Dictionary) లో మతం, మత మౌఢ్యం, ఆత్మ స్వాతంత్ర్యం, భావ స్వాతంత్ర్యం అనే విషయాలను విశ్లేషించాడు.

చివరకు 1778లో తిరిగి, 84 సంవత్సరాల వయస్సులో వోల్టేర్ తిరిగి తన దేశం వచ్చాడు. పారిస్ నగరంలో లక్షలాది ప్రజలు అతనికి బ్రహ్మాండమైన స్వాగతమిచ్చి, నీరాజనాలిచ్చారు. వోల్టేర్ చరిత్రలో మహోన్నత వ్యక్తిగా నిల్చిపోయాడు. తత్వజ్ఞుల చరిత్రలో వోల్టేర్ యుగమని, చరిత్రకారులు వ్రాశారు. జీవిత కాలమంతా తన సిద్ధాంతాలపై ఎడతెరిపిలేని పోరాటాన్ని సాగించాడు. ప్రజాస్వామ్యంలో నమ్మకం లేని 'వోల్టేర్' ప్రాజ్ఞ నిరంకుశ పరిపాలనను కోరాడు. వంద ఎలుకల పాలన కన్నా, ఒక సింహం పాలన మేలని భావించాడు. నిరంకుశత్వాన్ని ఏ రూపంలో నయినా సమర్థించ లేదు.

### 13.5.3 రూసో

ఫ్రెంచి విప్లవంపై అందరికన్నా ఎక్కువ ప్రభావాన్ని నెరపిన మూడో మహనీయుడు, రూసో (Rousseau,1712-78). జీన్‌జాక్వెస్ రూసో జీవితాన్ని అర్థం చేసుకోవడానికి, అతని 'కన్‌ఫెషన్స్' (Confessions) ను చదవాలి. ఈ గ్రంథంలో తన జీవితానుభవాలు, కాలక్రమేణ మారుతూ వచ్చిన అతని ఆలోచనలు, విశదీకరించబడినాయి. బాల్యంలో తల్లిదండ్రుల శిక్షణ లోపించింది. 16 ఏండ్ల వయస్సులో జెనీవా నగరాన్ని వదలి పారిపోయాడు. దేశ దిమ్మరిగా మారాడు. ఏ పని దొరికితే ఆపని చేశాడు. ఎందరో అమ్మాయిల వొకరి తర్వాత వొకరిని ప్రేమించి, భంగపడ్డాడు. ఆ కాలంలోనే కొంత విజ్ఞానాన్ని సముపార్జించాడు. ఆ తర్వాత పారిస్ నగరం చేరి, మేధావుల పొత్తుకై ఎన్నో ప్రయత్నాలు చేశాడు. వారితో పాటు సమావేశాల్లో పాల్గొనాలని తిరుగులు చూశాడు. కాని, అతని వేషభాషలు, జ్ఞానం వారికి నచ్చలేదు. ఈ దుఃఖకాలంలో 'రూసో' ఆత్మహత్యా ప్రయత్నం చేసి, అందులో కూడా విఫలుడయ్యాడు. విజ్ఞాన శాస్త్రాభివృద్ధి, కళాభివృద్ధి నీతిని పెంచాయా, లేక అవినీతిని పెంచాయా అనే విషయంపై, అకాడమీ వారు నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతిని పొందిన 'రూసో'లో ఆత్మవిశ్వాసం జీవం పోసుకుంది. పునరుజ్జీవన శక్తితో దుఃఖాన్ని విస్మరించి, రచనా కార్యక్రమాన్ని ముమ్మరం చేశాడు. ఆ రచనలు 'రూసో' ప్రతిభ కద్దం పట్టాయి. మరెవ్వరి రచనలుకూడా సమకాలీన కాలంలో అంతటి పేరు ప్రఖ్యాతులను, సామాజిక వ్యవస్థలపై అంతటి ప్రభావాన్ని సాధించలేకపోయాయి. అతడు ప్రచురించిన గ్రంథాల్లో "ది ఆరిజన్ ఆఫ్ ఇనీక్వాలిటీ (The Origin of Inequality), ది న్యూ హెలోసి, (The New Heiosi), 1761, ఎమిల్ (Emile)1762, ముఖ్యమైనవి కాగా, 'ది సోషల్ కాంట్రాక్ట్' (The Social contract) 1762, తలమానికం.

అది హేతువాదయుగం. ఆ యుగంలో అంతర్వాణికి స్థానం లేదు. ఆయుగ నమ్మకాలకెదురీది, అంతర్వాణి ప్రబోధాన్ని వినమని మృదువుగా మందలించిన యుగకర్త, 'రూసో'. "కలల్లో కూడా మీరు ఊహించని విషయాలెన్నో ఈ ప్రపంచంలో వున్నాయి. మనస్సు చేసే తర్కం సరైన ఫలితాల నివ్వదు. దాన్ని వినడంకంటే, అంతర్వాణి బోధనలు వినడం ఉచితం. నా అర్హతకు తగ్గ గుర్తింపు ఈ సంఘంలో ఇవ్వక పోవడానికి, హేతువాదమే కారణం. ప్రపంచమంతటా నాలాంటి అమాయకులు నీతిగా, నిజాయితీగా, దయతో వుంటారు. ముందు తప్పులు చేసినా, తర్వాత విచారిస్తారు. ఈ సామాజిక వ్యవస్థలో కొద్దిమంది భోగభాగ్యాలతో తులతూగుతూ ఉంటే, మిగతా వారంతా దారిద్ర్యంలో ఉన్నారు. ఈ సంఘంలో కొద్దిమంది

ఉన్నతాధికారులు చాలమందిని కించపరుస్తారు. విద్యా విధానం పవిత్రతను, మానవత్వాన్ని రూపుమాపుతుంది. ఈ దుర్గంధ వాతావరణాన్ని ప్రక్షాళన చేయగల శక్తి తర్కానికి లేదు. అంతర్వాణి ప్రబోధంతో నడిచే మనుషులున్న వ్యవస్థలోనే సంతోషం లభిస్తుంది. తాను ప్రకృతికి సమీపంలో ఉంటానని" 'రూసో' వివరించాడు. ఈ రూసో వాదాన్ని మేధావులు అవహేళన చేశారు. ప్రభుత్వం, మతం అతని గ్రంథాలను నిషేధించాయి. 'రూసో'ను ఎన్నో కష్టాలు పెట్టారు. దేశ దిమ్మరిగా మరలా 'రూసో' తన ఆరోగ్యాన్ని, మతిస్థిమితాన్ని కోల్పోయి, దయనీయ పరిస్థితిలో మరణించాడు. కాని, అతని కీర్తి, రచనలు అజరామరంగా నిలిచాయి.

'రూసో' రచనల్లో 'సోషల్ కాంట్రాక్ట్' (Social Contract) అతి ముఖ్యమైంది. ఆంగ్ల మేధావి లాక్ (Locke) వలె, రూసో కూడా, జీవించడం, స్వేచ్ఛ, ఆస్తి అనే సహజమైన హక్కులు ప్రతి వ్యక్తికి ఉన్నాయని వాదించాడు. ఈ హక్కులకు భద్రత ఇవ్వలేని ఏ ప్రభుత్వ వ్యవస్థకు విధేయత చూప నవసరం లేదు. రాజ్య వ్యవస్థ వ్యక్తి, ప్రభుత్వానికి మధ్య ఏర్పడ్డ ఒక ఒప్పందం. అయితే, వ్యక్తుల అంగీకారం లేకుండా, వారి స్వేచ్ఛ, తదితర హక్కులనూ, బలవంతంగా పాలనా వ్యవస్థ కైవసం చేసుకొంది. రూసో ఒక నూతన సామాజిక వ్యవస్థను ఊహించాడు. ఆ వ్యవస్థలో వ్యక్తి, తన శక్తినీ, దేహాన్ని, హక్కులనూ, ప్రజాభిప్రాయానికి (General will) దత్తం చేస్తాడు. సంఘంలోని వ్యక్తులభిప్రాయాలు సామాజిక వ్యవస్థ అభిప్రాయంలో ఇమిడియున్నాయని గ్రహించి, సహజంగా తనకు సంక్రమించిన హక్కులను, స్వాతంత్ర్యాన్ని, ప్రజాభిప్రాయానికి వదలిపెడతాడు. ఈ వాదన వల్ల ప్రజలే సార్వభౌములనీ, పాలకుల అధికారాలు ప్రజల అంగీకారంపైన ఆధారపడతాయని, నూతన విప్లవ సిద్ధాంతం ఆవిర్భవించింది. నిరపేక్ష నిరంకుశ రాజరిక రోజుల్లో, మానవులందరికీ సమాన హక్కులున్న సంస్థలను స్థాపిస్తే, వారి హృదయంలోని మంచితనం విజయాన్ని సాధించితీరుతుందన్న 'రూసో' వాదన, ఆణిముత్యం. "మానవుడు స్వేచ్ఛతో జన్మించాడు. కాని, అన్ని చోట్ల శృంఖలాబద్ధుడు" అని వాపోతూ మొదలైన 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథం, ఫ్రెంచి నిరంకుశ ప్రభుత్వం పైన, భూస్వామ్య వ్యవస్థపైన, చావు దెబ్బ తీసింది.

రూసో రాజకీయ ప్రభావం ఫ్రాన్స్‌కే పరిమితం కాలేదు. ఐరోపా నంతటిని ప్రభావితం చేసింది. అతని 'సామాజిక ఒప్పంద సిద్ధాంతం' చారిత్రక రీత్యా ఆమోదయోగ్యం కాకపోయినా, పాలకులు తమ బాధ్యతలను గుర్తించాలని, బాధ్యతారహిత ప్రభుత్వాన్ని ప్రజలు ఆమోదించనవసరం లేదని, స్పష్టం చేయడం జరిగింది. రూసో ప్రజల్లో అర్పడానికి వీల్లేని ఆశలను రగిలించి, జాతిని నిద్రాణం నుండి మేల్కొల్పటాన్ని మోర్లే (Morley) ప్రస్తుతించగా, అతని ప్రజా సార్వభౌమాధికారం, విప్లవానికి యుద్ధ శంఖారావంగా మారిందని, ప్రొఫెసర్ సాల్విన్ (Prof. Salwain) వ్యాఖ్యానించాడు.

## 13.5.4 తదితర తత్వవేత్తలు

పైన చెప్పిన త్రిమూర్తులు కాక, ఎందరో పెద్ద, చిన్న మేధావులు నాటి నూతన పోకడలను శాసించారు. డెనిస్ డిడెరాట్ (Diderot) మరికొందరు మేధావులు కలిసి, 35 సంపుటాల్లో 'విజ్ఞాన సర్వస్వాన్ని' (Encyclopedia) ప్రచురించారు. రాజకీయాలు, మతం, నీతి, వేదాంతం, ఆర్థికశాస్త్రం తదితర విషయాలపై వెలువరించిన భావాలు, ప్రజలను విజ్ఞానవంతులుగా చేశాయి. 'డిడెరాట్' సంపాదకుడుగా చేసిన నిశితమైన వ్యాఖ్యానాలలో, మానవుని కోసం ఆశయం స్పష్టంగా కన్పిస్తుంది. హోల్‌బాచ్ (Holbach) రాజుల దురలవాట్లను దుయ్యబట్టి, బానిస ప్రజల విముక్తిని కోరాడు. రాజకీయ, మత తప్పిదాలు ప్రపంచాన్ని దుఃఖ సాగరంగా మార్చాయని వాపోయాడు.

మరో వైపున ఆర్థిక విషయాలను విమర్శించే మరో మేధావి వర్గాన్ని 'ఫిజియోక్రాట్లు' (Physiocrats) గా అభివర్ణించారు. వీరి దృష్టిలో భూమియే సర్వసంపదలకు మూలం. భౌతిక ప్రపంచంలో లాగే, సామాజిక వ్యవస్థలో కూడా కొన్ని సూత్రాలకు కట్టుబడి ఉండాలని, ఆ సూత్రాలను కనుగొని, ఆ మేరకు సంపూర్ణ



BRAOU

స్వేచ్ఛనివ్వాలని వారి వాదన. పరస్పరాధారం, సహజ ఆస్తి హక్కు, స్వేచ్ఛగా ఉత్పత్తి, పంపిణీ చేసే వ్యవస్థలు ముఖ్యమని భావించారు. ప్రాజ్ఞనిరంకుశ ప్రభుత్వముచితమని వారు భావించారు. ఈ వర్గం వారు ఆడమ్ స్మిత్ (Adam Smith) రచనలచే ప్రభావితులయ్యారు. ఆర్థిక రంగంలో పెక్కు సంస్కరణలను అభిలషించారు.

ఈ నూతన భావాలు దేశమంతటా ఆలోచనా మందిరాలు, క్లబ్బుల ద్వారా విస్తృత ప్రచారాన్ని పొందాయి. ఈ మేధావుల వల్లనే ఫ్రెంచి విప్లవం వచ్చిందని కొందరి అభిప్రాయం. మేధావుల ఆలోచనలకు, 1789 విప్లవానికి మధ్య సంబంధం, పరోక్షమైందని థామ్సన్ (Thomson) అభిప్రాయపడాడు. "ఈ విశిష్ట రచయితల ఆలోచనలు విత్తనాలుగా భూమి పై పడి, పంటగా మారాయని" మాలే (Mallet) వ్యాఖ్యానించాడు. విప్లవ ఘట్టాలను గమనించిన ఒక తత్వవేత్త, ఇదంతా "మేము చేయాలని కోరింది కాదు. దౌర్జన్యంతో మార్పు తీసుకొని రావాలని మేమనుకోలేదు. ఇంత త్వరగా చర్య తీసుకోవాలని అనుకోలేదు" అని చెప్పాడు. కాని, నాటి మేధావులు విప్లవానికి వలసిన సిద్ధాంతాల నందించారు. 'స్వేచ్ఛ' సమానత్వం, సౌభ్రాతృత్వం వీరి రచనల నుండే రూపొందాయి. ప్రజల్లో నున్న అంధకార మత విశ్వాసాలను, మూఢ రాజ భక్తిని సడలించడానికి, ప్రజా శక్తి ఎంత గొప్పదో విశదీకరించడానికి, మేధావుల రచనలు దోహదం చేశాయి.

## 13.6 అమెరికా స్వాతంత్ర్య యుద్ధం

అమెరికా స్వాతంత్ర్య యుద్ధాన్ని విప్లవానికి ఒక పరోక్ష కారణంగా చెప్పవచ్చు. అమెరికా వలసలు ఇంగ్లాండ్‌పై ప్రకటించిన స్వాతంత్ర్య యుద్ధంలో, ఫ్రాన్స్ వాటిని ఆర్థికంగా, సైనికంగా బలపరిచింది. ఇంగ్లాండ్ ఓడిపోవడం, అమెరికా సంయుక్త రాష్ట్రాలు స్వతంత్ర రాజ్యంగా అవతరించడాన్ని మీరు చదివారు. దీని వల్ల, ఇంగ్లాండ్ తనకు చేసిన పరాభవానికి, ఫ్రాన్స్ కొంతవరకు పగతీర్చుకొన్నట్లైంది.

అయితే, ఈ యుద్ధం వల్ల ఫ్రాన్స్‌కు ఎట్టి లాభం చేకూరలేదు. భూభాగాలు రాలేదు. అసలే ఆర్థిక యిబ్బందుల్లో నున్న ఫ్రెంచి ప్రభుత్వం, మరింత దివాలా తీసింది. పైగా, అమెరికా స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొన్న వేలాది మంది ఫ్రెంచి సైనికులు, యుద్ధ ప్రకటనలోని సాంఘిక సమానత, ప్రాథమిక స్వేచ్ఛ, బాధ్యతాయుతమైన ప్రభుత్వ వ్యవస్థ మొదలైన ప్రజాస్వామ్య సిద్ధాంతాలచే ఆకర్షితమై, వాటిని తమదేశంలో కూడా ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు.

## 13.7. విప్లవ తక్షణ కారణం

ప్రజా తిరుగుబాటుకు వెరచిన పదహారో లూయి, ఎస్టేట్ జనరల్ సమావేశాన్ని ఏర్పరచడానికి అంగీకరించాడని, ఆసభ 1789 మే ఒకటో తేదీన సమావేశం కావాలని ప్రకటించాడని, మనం చదివాం. ఎస్టేట్ జనరల్ కొత్తగా వచ్చిన వ్యవస్థ కాదు. 175 సంవత్సరాలు దాన్ని సమావేశ పరచక పోయినా, సిద్ధాంత రీత్యా అది ఫ్రెంచి ప్రభుత్వంలో ఒక అంతర్భాగం. 1302 లో మొదటి సారిగా సమావేశమైన సభ, 1614 వరకు కొనసాగింది. ఈ ఎస్టేట్ జనరల్‌లో మూడు సభలున్నాయి. ఎన్నికల ద్వారా ఇవి మతాచార్యులకు, ప్రభువులకు, సామాన్య ప్రజలకు ప్రాతినిథ్యం వహిస్తాయి. వీనిని ఒకటో, రెండో, మూడో ఎస్టేట్‌లని వ్యవహరిస్తారు. ఒక్కో ఎస్టేట్ ప్రత్యేకంగా కూర్చొని, వారి ముందుంచిన విషయాలపై ఓటు చేస్తారు. మూడు ఎస్టేట్లలో రెండు ఎస్టేట్లు అంగీకరిస్తే, ఆ విషయాన్ని అంగీకరించినట్లే. సామాన్యంగా రాజు చెప్పిన ప్రతి దానికి, మొదటి రెండు సభలు అంగీకారాన్ని తెలుపుతాయి. కాకపోయినా, వాటి అధికారం సలహాల వరకే పరిమితం. ఎన్నో పర్యాయాలు వారి సలహాలను రాజు విస్మరించే వాడు. విరుద్ధంగా కూడా నిర్ణయాలు చేసేవాడు. అట్టి ఎస్టేట్ జనరల్‌ను 1788-89లో సమావేశపరచడం, మారిన పరిస్థితుల వల్ల, పైన చెప్పిన వివిధ కారణాల వల్ల ప్రమాదకరమేకాని, గత్యంతరం లేకపోయింది.

## 13.8 విప్లవ ప్రారంభం: 'ఎస్టేట్ జనరల్' సమావేశం

1788–89 శీతాకాలంలో మధ్య యుగం నాటి పద్ధతిలో దేశమంతటా మూడు ఎస్టేట్ లకు ఎన్నికలు జరిగాయి. సాంప్రదాయబద్ధంగా రాజు కోరిక మేరకు ఓటర్లు, తమ ప్రాంత సమస్యలపైన వారి ప్రతినిధులకు, ప్రభుత్వానికి నివేదికలను తయారుచేశారు. ప్రతి ప్రాంతంలోను మూడు ఎస్టేట్ ల ప్రతినిధులకు ప్రత్యేక నివేదికలను రూపొందించడం జరిగింది. వీటిని కహీర్ (cahier) లనేవారు. ఎన్నికలు జరిగే సమాయానికి ఈ కహీర్లను పరిశీలిస్తే , ఫ్రెంచి ప్రజలు తమ రాజు అనుకున్న దానికన్నా ఎక్కువగా ప్రభుత్వంలో సంస్కరణలను అభిలషిస్తున్నారనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. కహీర్లు మృదువైన భాషలోనే రాజరికం పట్ల నమ్మకాన్ని, విధేయతను తెలియజేశాయి. కాని, వీటి కోరికల్లో నాటి ప్రగతిశీల రాజకీయ సిద్ధాంతాల ప్రభావం ద్యోతకమౌతుంది. ప్రభుత్వంలో, సాంఘిక వ్యవస్థల్లో, మౌలికమైన, సహేతుకమైన మార్పులను వాంఛించారు. ముఖ్యంగా మూడో ఎస్టేట్ కహీర్లలో సాంఘిక అసమానత్వం పోవాలని, జాతి అంతా ఒకటిగా ఉండాలని, సమగ్రత, సమత్వం కావాలని, స్పష్టం చేయడం జరిగింది. అంతేగాక, కొత్త పన్నులు కావాలంటే ఈ మార్పులను ముందుగా చేపట్టాలనే ధ్వని కూడా, వీటిలో కన్పిస్తుంది. మూడో ఎస్టేట్ ప్రతినిధులు ఈ కహీర్లను అమలుపరచడానికి సుముఖతను వ్యక్తం చేశారు. వారిలో ఎక్కువ మంది లాయర్లు, జడ్జీలు, మేధావులు; పదిమంది మాత్రమే దళిత వర్గం వారు. వారంతా ఇంగ్లాండ్ లో వచ్చిన రాజకీయ మార్పులు, అమెరికా స్వాతంత్ర్య యుద్ధానంతరం ప్రజలకు లభించిన రాజ్యాంగ హక్కుల వల్ల ప్రేరణ పొందారు. ఒకప్పుడు మూడో ఎస్టేట్ కు ప్రాధాన్యత లేదు. రాజు గారి ఆజ్ఞలను వినడం, విని శిరసావహించడం మాత్రమే తెలుసు. కాని, గత రెండు శతాబ్దాలుగా మధ్యతరగతి వారు సుసంపన్నులై, సమకాలీన సిద్ధాంతాలను ఆకళింపు చేసుకోడం జరిగింది. కాల క్రమేణా ప్రభువులు, మతాచార్యుల కన్నా, వీరు జాతికి ప్రాతినిధ్యం వహించారు. అట్టి మధ్యతరగతి వారు పాలనా వ్యవస్థలో పాలుపంచుకోవాలని ఆశించడంలో ఆశ్చర్యం లేదు.

మూడో ఎస్టేట్ కు విప్లవ కాలంలో ఇద్దరు ప్రముఖ నాయకులున్నారు, – మిరాబు (Mirabeau), ఆబె సయీస్ (Abbe Sieyes), పుట్టుకతో ప్రభువుల సంతతికి చెందినా, వీరు సామాన్య ప్రజల ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. మిరాబు చిన్నప్పటి నుండి దుందుడుకు మనిషి. అతని తండ్రి కొడుకు నదుపులో పెట్టలేక, పెక్కుసార్లు రాజు అనుమతి పత్రంతో కారాగారం లో నుంచేవాడు. విడుదలైన ప్రతిసారి మిరాబు మరీ రెచ్చిపోయేవాడు. అట్టి మిరాబుకు 1789 రాజకీయ పరిస్థితి, నాయకుడు కావడానికి చక్కని అవకాశమిచ్చింది. రెండేళ్ళపాటు, 1791లో చనిపోయే వరకు, మిరాబు అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా, మహా నాయకుడుగా, మూడో ఎస్టేట్ ప్రధాన వక్తగా భాసించాడు. ఆబె సయీస్ మతాచార్యుడు. అయితే, మతం కన్నా, నాటి తత్వశాస్త్రం, రాజకీయాలు అతనికి బాగా వంటపట్టాయి. మూడో ఎస్టేట్ కు పరిగణన కావాలని ప్రశ్నల, సమాధానాల ద్వారా తెలియచెప్పినదతడే.

### 13.8.1 సమావేశ వాదవివాదాలు

1789 మే నెల్లో 'ఎస్టేట్ జనరల్' సమావేశమైంది. అయితే, ఎన్నిక పత్రాలను ఎవరు సరిచూడాలనే విషయంపై వివాదమేర్పడింది. ఈ అధికారం రాజ్య పరిషత్తుకుందని వాదించడం జరిగింది. దీన్ని నెకర్ తిరస్కరించాడు. రాజు నెకర్ ను సమర్థించడంతో, ప్రతిష్టంభనేర్పడి, సమావేశం 5వ తేదీవరకు వాయిదాపడింది. రాజు గారి కనుకూలంగా ఉంటుందని, యీ సమావేశాలను 'వర్సెల్స్'లో ఏర్పాటుచేశారు. అక్కడ మొదటి నుండి మూడో వర్గం ప్రతినిధులను చిన్నచూపు చూశారు. ఎస్టేట్ జనరల్ ప్రతినిధులకు పరిచయం చేసేటప్పుడు, మూడో ఎస్టేట్ వారిని కొన్ని గంటలు నిలబెట్టి, ఆఖరిగా పరిచయం చేశారు. వారికి ప్రత్యేక దుస్తులను నిర్దేశించారు. ఆ దుస్తులలోనే వారు ప్రతినిధుల ఊరేగింపులో పాల్గొనాలని ఆదేశించారు. ఈ



BRAOU

అవమానభారాన్నుండి వారు వచ్చినప్పుడు ప్రజల జయజయధ్వానాలను విని, ఊరట చెందారు. అంతేగాక, రాజు దగ్గరకి వెళ్ళినపుడు తాము మోకరిల్లి ప్రమాణం చేయమని స్పష్టం చేశారు.

మూడు ఎస్టేట్ ప్రతినిధులు "మెనస్‌ప్లెజర్స్" హాలులో, మే 5వ తేదీన సమావేశమయ్యారు. పదహారో లూయీ ప్రారంభోపన్యాసం చేయగా, ఆతర్వాత రాజ్యముద్రాధికారి 'బెరన్ తిన్', ఆర్థిక మంత్రి 'నెకర్' ఉపన్యసించారు. వారి ఉపన్యాసాల్లో రాజ్యాంగ సంస్కరణలను గూర్చి ప్రస్తావించలేదు. వీటిని గూర్చి ప్రభుత్వమే చొరవ తీసికొని ఉంటే , విప్లవం వచ్చేది కాదని, అట్టి మహదావకాశాన్ని చేజేతులా జారవిడుచుకొన్నారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

ప్రభుత్వ విధానం మూడో ఎస్టేట్‌ను కలవరపరిచింది. పురాతన వ్యవస్థను మార్చాలనే సంకల్పం, ఫ్రెంచి ప్రభుత్వానికి లేదని విశదమైంది. జాతి ప్రతినిధులుగా వారు 'వర్సై' వచ్చారు. జాతి ప్రజల ఆశలకు, ఆశయాలకు, వారు సమాధానం చెప్పాల్సి ఉంది. ఎన్నికల పత్రాలను సరిచూసే విషయంలో తిరిగి వివాదమేర్పడి, సభ మరుసటి రోజుకు వాయిదా పడింది. ఒక్కొక్క ఎస్టేట్ వారు, ఒక్కొక్క హాలులో ప్రత్యేకంగా సమావేశం కావాలని, ఎన్నికల పత్రాలను ఎస్టేట్ పరంగా పరిశీలించగలరని ప్రకటించారు. దీనికి మొదటి రెండు ఎస్టేట్‌లు అంగీకరించగా, మూడో ఎస్టేట్ వారు, అందరూ కలిసి ఒకే చోట సమావేశం కావాలని పట్టుబట్టారు. ప్రత్యేకంగా కూర్చోడానికి వారు నిరాకరించారు. అంతేగాక, ఎస్టేట్ పరంగాకాక, నిర్ణయాలపై ఓటింగ్ వ్యక్తిపరంగా జరగాలని వాదించారు. అందరి సమక్షంలో ఎన్నిక పత్రాలను సరిచూస్తే, పై వర్గాల వారు ఆ తర్వాత వ్యక్తి ఓటింగ్‌కు అభ్యంతరం చెప్పడానికి వీలు లేదు. విడిగా కూర్చుంటే, సంస్కరణల అమలుకు మూడో ఎస్టేట్, ప్రభువుల పైనకాని, లేదా మతాచార్యుల పైగాని ఆధారపడాలి. ఈ వివాదం కొనసాగుతుండగా, 'మూడో ఎస్టేట్', వారు తమకు తామే సామాన్య ప్రతినిధులనే (Commons) పేరుతో వ్యవహరించసాగారు. మూడో ఎస్టేట్ కోరికను మన్నించకుండా, ప్రభువులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మత ప్రతినిధుల్లో కొంత మందికి కామన్స్ వారి వాదన నచ్చినందున, వారు రాజీ చేయాలని ప్రయత్నించారు. ప్రభువులు రాజీ యత్నాలను తిరస్కరించారు. మతాధికార్ల ప్రతినిధులను తమతో కలిసి పొమ్మని, కామన్స్ వారు ఆహ్వానించారు. దిక్కుతోచని బిషప్పులు రాజును జోక్యం చేసుకొమ్మని అర్థించారు.

ఇంతలో కామన్స్ ప్రతినిధులు 'ఆబె సయీస్' తీర్మానాన్ని బలపరుస్తూ, మొదటి రెండు వర్గాల ప్రతినిధులను తమతో కలువమని కోరారు. సభ్యుల పేర్లు పిలిచినపుడు ఎవరు రాకపోయినా, వారి సభ్యత్వాన్ని నిరాకరించినట్లుగా భావిస్తామని చెప్పారు. సభ్యుల పేర్లు పిలిచినపుడు ప్రభువుల ప్రతినిధులు రాలేదు; కాని, మతాధికారుల ప్రతినిధులు ఎక్కువమంది హాజరయ్యారు. వీరంతా కలిసి, జూన్ 17వ తేదీన తమ సమావేశాన్ని జాతీయ సభగా ప్రకటించారు. జాతీయ సభకు మాత్రమే పన్నులు విధించే అధికారం ఉందని ప్రకటించారు. ఈ తీర్మానాన్ని రాజు ఆమోదానికి పంపారు. ఇది రాజు సార్వభౌమాధికారానికి సవాలు. పైగా ప్రభువులు, మూడో వర్గాన్ని అదుపులో పెట్టకపోతే పరిస్థితి చేయిదాటి పోతుందని లూయీకి నూరిపోశారు.

### 13.8.2 టెన్నిస్ కోర్ట్ ప్రమాణం (Oath of Tennis Court)

జూన్ 20 వ తేదీన కామన్స్ సభ్యులు 'వర్సై'లోని తమ సభా భవనానికి వెళ్లగా, ఆ భవనం మూసి వేసి ఉంది. సైనికుల కాపలా ఉంది. భవనంలో మరమ్మత్తులు జరుగుతున్నాయని ప్రకటన అంటించి ఉంది. ఈ అవమానానికి కోపోద్రేకులైన ప్రతినిధులు, చేరువగానున్న 'టెన్నిస్ కోర్ట్'లో ప్రవేశించి , ఉద్వేగ ఉత్సాహాల మధ్య, ఊర్ధ్వాభిముఖమైన హస్తాలతో, జాతీయ శాసన సభ్యులుగా ప్రమాణం చేశారు. దేశానికొక రాజ్యాంగాన్ని రూపొందించే వరకు, ఎట్టి విపత్కర పరిస్థితుల్లోనైనా విడిపోమని ప్రమాణం చేశారు. ఈ టెన్నిస్

BRAOU

కోర్ట్ శపథమే, ఫ్రెంచి విప్లవానికి నాంది. రాజు అనుమతి లేకుండా, అతని ఇష్టానికి విరుద్ధంగా ఒక ప్రకటనతో కామన్స్ జాతీయ శాసన సభగా ప్రకటించుకోవడం, రాజ్యాంగాన్ని రూపొందించే బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టడం, ప్రజాధికారానికి ప్రారంభం, నిరంకుశ రాజాధికారానికి చరమగీతం.

ప్రకటించిన ఈ జాతీయ శాసన సభ ఏ పరిస్థితుల నెదుర్కొన్నదీ, విప్లవాన్ని ఎలా సాధించిందీ, ఆ పిదప ఈ సభ ఎట్టి సంస్కరణలను అమలుపరచిందీ, వచ్చే భాగంలో వివరంగా చదువుతారు.

## 13.9 సంగ్రహంగా

సంగ్రహంగా, ఈ భాగంలో ఫ్రెంచి విప్లవ కారణాలను విశ్లేషించడం జరిగింది. రాజకీయ ఆర్థిక, సాంఘిక కారణాలకు తోడుగా, తత్వజ్ఞుల ప్రభావం ఈ విప్లవంలో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ఈ కారణాల ఫలితంగా, ప్రజల అసంతృప్తి విప్లవ సంఘటనలకు దారితీయడాన్ని, వివరించడమైంది.

## 13.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. ఫ్రెంచి విప్లవ రాజకీయ కారణాలను పరిశీలించండి
2. 'ఫ్రెంచి విప్లవం రాజకీయ స్వేచ్ఛకన్నా, సాంఘిక అసమానతపై ఎక్కువగా పోరాటాన్ని జరిపింది'. నిజమేనా? చర్చించండి.
3. 'ఫ్రెంచి విప్లవానికి ఆర్థిక కారణాలే మూలం' అనే వాదనను మీరు అంగీకరిస్తారా?
4. ఫ్రెంచి విప్లవ ఆవిర్భావానికి తత్వజ్ఞులు ఎలా తోడ్పడ్డారు?

II. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి

1. 1789 ఎస్టేట్ జనరల్ సమావేశ ప్రాముఖ్యతను తెల్పండి.
2. టెన్నిస్ కోర్ట్ ప్రమాణమంటే మీకు తెలిసిందేమిటి?

## 13.11 ఉపయుక్త గ్రంథాలు


C.J.H. Hayes : Europe upto 1870

C.D. Hazen : Modern Europe upto 1945

H.A.L Fisher : History of Europe

C.D.M. Kettelby : A History of Modern Times

V.D. Mahajan : History of Modern Europe Since 1789


BRAOU

# భాగం – 14 జాతీయ సభ : కార్యకలాపాలు

విషయ క్రమం


14.0 : లక్ష్యాలు

14.1 : పరిచయం

14.2 : బాస్టిల్ కోట పతనం

14.2.1 : విప్లవ పురోగతి

14.2.2 : విప్లవ వ్యాప్తి

14.2.3 : పారిస్ స్త్రీల ఆకలి యాత్ర

14.3 : జాతీయ సభ : సంస్కరణలు

14.3.1 : సాంఘిక సమానత్వ సాధన

14.3.2 : మానవ హక్కుల ప్రకటన

14.3.3 : నూతన పాలనా వ్యవస్థ

14.3.4. : జాతీయతత్వ ప్రచారం

14.3.5. : ఆర్థిక విషయాలు

14.3.6. : చర్చిలో సంబంధాలు

14.3.7 : నూతన రాజ్యాంగం

14.3.7.1: నూతన రాజ్యాంగ విశ్లేషణ

14.4 : రాజు పలాయనం

14.5 : సంగ్రహంగా

14.6 : పరీక్ష నమూనా ప్రశ్నలు

14.7 : ఉపయుక్త గ్రంథాలు


## 14.0: లక్ష్యాలు

ఈ పాఠ్యభాగ అధ్యయనం ద్వారా ఫ్రెంచి విప్లవ ప్రారంభం, పురోగతి, వ్యాప్తి, విప్లవ సంబంధితమైన బాస్టిల్ కోట పతనం , ఫ్రాన్స్ స్త్రీల ఆకలి యాత్ర మొదలైన సంఘటనల గురించి తెలిసికోగల్గాలి.

ఆ తర్వాత, జాతీయ శాసనసభ సమావేశం కావడం, ఆ సమావేశంలో పెక్కు విప్లవాత్మక సంస్కరణలు జరగడాన్ని గ్రహించగల్గాలి. ఆ సంస్కరణలను విప్లవ పూర్వ రంగ పరిస్థితులతో పోల్చి చూసి, విప్లవ ప్రాధాన్యతను గమనించగల్గాలి. చివరగా, ఆ సంస్కరణలు ఎంత వరకు విప్లవ ఆశయాలను నెరవేర్చగల్గాయో విశ్లేషించగల్గాలి.

## 14.1 : పరిచయం

ఇంతకు ముందు భాగంలో ఫ్రెంచి విప్లవ కారణాలను, ఎస్టేట్స్ జనరల్‌కు జరిగిన ఎన్నికల ఫలితంగా నూతన సభల ఏర్పాటు, అందులో మూడో ఎస్టేట్ టెన్నిస్ కోర్ట్ ప్రమాణంలో జాతీయ శాసన సభగా ప్రకటించుకోవడం చదివాం. ఈ జాతీయ సభ కుదురుగా కూర్చొని కార్యక్రమాలు నిర్వహించడానికి పెక్కు అడ్డంకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. జాతీయ శాసన సభకు మద్దతుగా ఫ్రెంచి ప్రజల ప్రతిస్పందన విప్లవంగా మారింది. ఆ విప్లవ సంఘటనలను ముందుగా విశ్లేషించి, ఆ తర్వాత జాతీయ శాసన సభ తలపెట్టిన విప్లవాత్మక సంస్కరణలను పరిశీలిద్దాం.

## 14.2 : బాస్టిల్ కోట పతనం

మిరాబు (Mirabeau), (Abbe Sieyes) అబె సియాస్‌ల నాయకత్వంలో, మూడో ఎస్టేట్ టెన్నిస్ కోర్ట్ ప్రమాణం చేసి, జాతీయ శాసన సభగా రూపాంతరం చెందింది. ఫ్రాన్స్ దేశానికి నూతన రాజ్యాంగాన్ని రచించగలమని ప్రకటించింది. ఇది రాజరిక అధికారానికి సవాల్. ఈ పరిస్థితుల్లో రాజు ఏమి చేయాలి? బల ప్రయోగం ద్వారా ఈ విప్లవ శక్తులను అణచడం ఒక్కటే మార్గం. అయితే, దాని వల్ల అతని ఆర్థిక ఇబ్బందులు తొలగిపోవు. పైగా, అది వినాశకరమైన అంతర్యుద్ధానికి దారితీస్తుంది. ఈ వాస్తవాన్ని గమనించిన పదహారో లూయీ జరిగిన విషయాలు ఏమి తెలీనట్లు నటించి, మూడు ఎస్టేట్‌లను విడివిడిగా సమావేశమై, కార్యక్రమాలు నిర్వహించమని ఆదేశించాడు. అయితే, మూడో ఎస్టేట్‌కు చెందిన ప్రతినిధులు ఈ కపట నాటకానికి మోసపోలేదు. తామే జాతీయ శాసన సభ అని మరోసారి ప్రకటించుకొన్నారు. వారితో మొదటి, రెండో ఎస్టేట్‌లకు చెందిన కొందరు ప్రతినిధులు చేరారు. మిరాబు రాజాజ్ఞలను ధిక్కరిస్తూ "ఇక్కడ మేము ప్రజాభిప్రాయం వల్ల ఉన్నాం. తూటాలకు బలిచేసే వరకు మేము ఇక్కడే ఉంటాం" అని ప్రకటించాడు.(" We are here by the will of the people. We shall not leave except at the point of bayonet ") దీంతో, పదహారో లూయీ తన ఆదేశాలను మార్చవలసి వచ్చింది. వారం రోజుల తర్జనభర్జనల పిదప, తన ఆదేశాలను మారుస్తూ, మూడు ఎస్టేట్‌లు కలిసి కూర్చొని ఉమ్మడిగా ఓటు చేయమని, జాతీయ రాజ్యాంగ సభగా కార్యక్రమాలు నిర్వహించమని ఆదేశించాడు. దీంతో, 1789 జూన్ నెలాఖరు రాజ్యాంగ సంక్షోభం ముగిసినట్లే కన్పించింది. రాజు అనుమతితో ప్రభువులు, మతాచార్యులు, సామాన్య ప్రతినిధులతో కలిసిపోయారు. జాతీయ శాసన సభ జాతీయ రాజ్యాంగ సభగా మారింది. సాంప్రదాయబద్ధమైన రాజరిక వ్యవస్థలో, సాంఘిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రాగలవని, వ్యక్తిగత స్వేచ్ఛ, సాంఘిక సమానత్వం, ప్రజాస్వామ్య జాతీయత, ఈ మార్పుల్లో ప్రముఖంగా ప్రతిబింబించగలవని మధ్యతరగతి ప్రజలు ఆకాంక్షించారు.

కాని, జాతీయ రాజ్యాంగ సభ తన కార్యక్రమాన్ని ప్రారంభించక ముందే, పదహారో లూయీ మరోసారి తన మనసు మార్చుకున్నాడు. జూలై మొదటి వారంలో తూర్పు సరిహద్దున ఉన్న భద్రతా దళాలను పారిస్‌కు చేరువగా తీసుకు రావడం జరిగింది. కొంత సైన్యాన్ని వర్సై (Versailles) ప్రాంతంలో కూడ మోహరించాడు. దీన్నిబట్టి జాతీయ రాజ్యాంగ సభ విప్లవాత్మకంగా వ్యవహరిస్తే, పదహారో లూయీ బలప్రయోగానికి సన్నద్ధమవుతున్నాడని విదితమైంది. సైన్యాన్ని ఉపసంహరించమని శాసన సభ కోరింది. రాజు దానికి అంగీకరించలేదు. పైగా ప్రజలు ఇష్టపడ్డ ఆర్థిక మంత్రి నెకర్ (Necker) ను బర్తరఫ్ చేశాడు. ఈ పరిస్థితుల్లో పారిస్ నగరం శాసన సభకు మద్దతుగా నిల్చింది. నిరంతరం కడగళ్ల పాలవుతున్న పారిస్ ప్రజలు తమ ప్రయోజనాలను ఒక్క జాతీయ సభ మాత్రమే తీర్చగలదని భావించారు. కామిల్ డెస్‌మౌలిన్స్ (Camille desmoulins) అనే యువ పత్రికా విలేఖరి ప్రజలనుద్దేశించి ఆవేశపూరిత ప్రసంగం చేశాడు. "ఒక్క నిమిషం కూడా కాలయాపన చేయడానికి వీల్లేదు. మనం చేయాల్సిన పని ఒక్కటే; అదే ఆయుధాలను పోగు

చేయడం".

రెచ్చిపోయిన ప్రజలు ఊరేగింపుగా దొరికిన ఆయుధాలతో వీధుల్లో వీరవిహారంచేశారు. మూడు రోజులపాటు నగరమంతా బీభత్సకాండ చెలరేగింది. గుంపులను చెదరగొట్టడానికి ప్రభుత్వ అశ్వికదళం వచ్చింది. ఘర్షణలో పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ లోపుగా కొంతమంది సైనికులు విప్లవ భావాల మూలంగా ప్రేరితులై, వారిలో చేరిపోయారు. దుకాణాలు దోపిడీకి గురైనాయి. ప్రభుత్వాధికారులను తొలగించారు. రక్షణకై, దారులకు అడ్డంకులను నిర్మించారు. మూడో రోజున, అంటే 1789 జూలై 14వ తేదీన, ఆయుధాల కోసం ప్రజలు ఇన్‌వాలిడ్స్ హాల్ వద్దకు చేరగా, కొన్నివేల తుపాకులు దొరికాయి. అక్కడి నుండి పారిస్‌కు తూర్పున ఉన్న బాస్టిల్ (Bastille) కోట జైలుకు చేరిన ప్రజా సమూహం ఆ కోటను ముట్టడించారు. బాస్టిల్ కోట పది అడుగుల మందం, 90 అడుగుల ఎత్తుగల గోడలతో భయంకరంగా ఉంటుంది. ఒకప్పుడు ఈ చెరసాల్లో రాజకీయ ఖైదీలను చిత్రహింసలకు గురిచేసేవారు. పదహారో లూయీ కాలం నుండి అక్కడ ఎట్టి రాజకీయ ఖైదీలను ఉంచలేదు. అయినా, ప్రజల దృష్టిలో అది రాజ నిరంకుశత్వానికి, దుర్మార్గానికి ప్రతీక. దీన్ని వశం చేసుకొని, ఆయుధాలను కొల్లగొట్టి, వాటి ద్వారా జాతీయ శాసన సభను రక్షించాలని ప్రజలు తలపోశారు.

బాస్టిల్ గవర్నర్ ఈ ప్రజా సమూహాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నాడు. కాని, సైనిక దళం పరిమితం. ఆహారం కూడ తక్కువే. సైనిక దళానికి యుద్ధం చేయాలనే కోరిక కూడ లేదు. అయినా, మొండిగా ప్రజలతో గవర్నర్ తలపడ్డాడు. కొద్ది గంటల్లోనే కోట ప్రజల వశమైంది. దాన్ని కాపాడుతున్న స్విస్ (Swiss) కిరాయి సైన్యాన్ని దారుణంగా చంపడం జరిగింది.

## 14.2.1 విప్లవ పురోగతి

బాస్టిల్ కోట పతనం విప్లవ కాలంలో ప్రప్రథమ ప్రముఖ హింసాత్మక సంఘటన. జూలై 14వ తేదీన జరిగిన ఈ సంఘటననే ఫ్రెంచి ప్రజలు ఈనాటికి కూడా వారి స్వాతంత్ర్య దినోత్సవంగా వేడుకలు జరుపుకొంటారు. ప్రజలు రాజు పక్షాన గాక, పూర్తిగా జాతీయ సభ పక్షానే ఉన్నారనే వాస్తవాన్ని ఈ సంఘటన స్పష్టం చేసింది. జాతీయ శాసన సభ శాసనాలకు ప్రజా బలం, శక్తిని కల్పించింది. అంతేకాక, పారిస్ నగరం రాచరిక అధికారం నుండి స్వతంత్రమైంది. ఈ అల్లరుల సమయంలోనే, పారిస్ లోని పుర ప్రముఖులు తమ సొంత ప్రభుత్వాన్ని, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పర్చుకొన్నారు. ఇంతకు ముందు ఎస్టేట్ జనరల్‌ను ఎన్నుకొనే ప్రతినిధులకు ఓటు చేసిన వారే స్థానిక ప్రభుత్వ సభ్యులుగా అధికారాన్ని చేపట్టారు. ఈ స్థానిక ప్రభుత్వాన్ని 'కమ్యూన్' అని వ్యవహరించారు. వీరు ప్రభుత్వం నియమించిన అధికారుల స్థానే, స్థానిక అధికారులను, వర్తక శ్రేణి అధికారులను ఎన్నుకొంటారు. నగర పాలనలో ఇది విప్లవాత్మక మార్పు. ఈ నూతన స్థానిక ప్రభుత్వానికి మద్దతుగా, జాతీయ రక్షణ దళాన్ని ఏర్పాటుచేశారు. అనతి కాలంలోనే ఇందులో 50 వేల మంది చేరారు. పదునాల్గో లూయీ తొలి కాలంలో పారిస్ నగరం రాజధానిగా ఉండేది. ఆ తర్వాత 1789 లోనే, పారిస్ నగరం ఫ్రాన్స్‌కు నాయకత్వం వహించింది. నాటి వరకు వర్సై (Versailles)అధికార కేంద్రంగా ఉంది.

బాస్టిల్ పతనాన్ని పదహారో లూయీ భయాందోళనలతో గమనించాడు. వేట నుండి తిరిగి వచ్చిన రాజుకు బాస్టిల్ పతనం గూర్చి చెప్పగా, ఇది తిరుగుబాటు కదా, అని ఆశ్చర్యపోగా, అక్కడున్న ప్రభువు, 'ఇది విప్లవమండీ', అని చెప్పాడు. లూయీ ఈ సంఘటన ప్రాధాన్యతను గుర్తించాడు. జాతీయ సభ పరిసరాలనుండి సైన్యాన్ని ఉపసంహరించడమే గాక, 'నెకర్' ను తిరిగి ఆర్థికమంత్రిగా నియమించాడు. పారిస్ నగర నూతన ప్రభుత్వాన్ని గుర్తించాడు. జాతీయ రక్షణ దళానికి అధిపతిగా, ఉదారవాదియైన లఫాయేట్ నియామకాన్ని ధృవీకరించాడు. పారిస్ నగరాన్ని దర్శించి, నూతన జాతీయ పతాకమైన త్రివర్ణ పతాకానికి వందనం చేశాడు. అడ్డడానికి వీల్లేని విషయాలను అనుభవించక తప్పదని సమాధానపడ్డాడు.



BRAOU

పదహారో లూయీని కొందరు ప్రభువులు పిరికివానిగా తలచారు. అతని పాలనలో తమకు భద్రత లేదని తలచారు. పురాతన వ్యవస్థ కూలిపోవడం వీరు భరించలేకపోయారు. వీరంతా ఆర్లియన్స్ ప్రభువు ( Duke of Arleans) నాయకత్వంలో దేశాన్ని వదలి, రైన్ (Rhine) నదీ సరిహద్దులలో ప్రవాస జీవనాన్ని సాగించారు. వారిని ఎమిగ్రేలు (Emigres) అంటారు. నిరంతర విప్లవానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, పాతరోజులు రాక పోతాయా అని, ఎదురు చూస్తూ కాలం గడిపారు. ఇకపోతే, ఫ్రాన్స్‌లో ప్రజలదే పై చేయి. ప్రథమంలో జాతీయ సభ ద్వారా, తర్వాత హింసాకాండ ద్వారా, తాము కోరింది సాధించారు.

## 14.2.2 : విప్లవ వ్యాప్తి

నెకర్‌ను పదహారో లూయీ బర్తరఫ్ చేయగా, పారిస్ లో వచ్చిన విప్లవాన్ని మనం చూచాం. అదే రీతిలో, మిగతా రాష్ట్ర రాజధానుల్లో కూడా, భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రదర్శనతోపాటు లూటీలు, దహనాలు సర్వసామాన్యం అన్న విషయం మనకు తెలుసు. స్థానిక కోశాగారాలను కొల్లగొట్టడం జరిగింది. ఆయుధాగారాల్లోని తుపాకులను, తూటాలను స్వాధీనం చేసుకొన్నారు. కొన్ని నగరాల్లో సైనిక దళాలు ఏర్పడి, గవర్నర్లను, మతాధికారులను బంధించారు. బాస్టిల్ పతనం వారికి మరింత ధైర్యాన్నిచ్చింది. మధ్యతరగతివారు అధికార పదవులన్నింటినీ ఆక్రమించుకున్నారు. కొన్నిచోట్ల శాంతియుతంగా, మరికొన్నిచోట్ల దౌర్జన్యపూరితంగా, పురపాలక సంఘాలను వశం చేసుకొన్నారు. ఈ నూతన పట్టణ ప్రభుత్వాలు రాజాజ్ఞలను మన్నించలేదు. రాజ్యాంగ సభ ఉత్తర్వులను మాత్రమే పాటించగలమని ప్రకటించాయి. దీనితో రాజ్య కేంద్ర అధికారం క్షీణించింది. నూతన పురపాలక సంఘాలు ఒక దానితో మరొకటి సహాయ ఒడంబడికలు చేసుకొని, పురపాలక సమాఖ్యగా రూపొందాయి. స్థానిక స్వపరిపాలనను ప్రారంభించాయి. పారిస్ ప్రజలు మరికొంత ముందుకుపోయి, పురపాలక ప్రభుత్వం పైన కూడా సర్వవేక్షణాధికారాన్ని స్వీకరించారు. జాతీయ సార్వభౌమాధికారమంటే ప్రత్యక్ష ప్రజాస్వామ్యమని వారి ఆలోచన.

పారిస్ విప్లవ ప్రభావం పట్టణాల నుండి పల్లెపల్లెలకు వ్యాపించింది. పెక్కు ప్రాంతాల్లో రైతులు ప్రభువులపై తిరుగుబాటు చేసి, వారి భవనాలను , కోటలను తగలబెట్టారు. మతాచార్యుల మఠాలను దగ్ధం చేశారు. లూటీ చేశారు. తమపై విధించిన జమీందారీ హక్కుల పత్రాలను ఆమంటల్లో మసి చేశారు. కొందరు ప్రభువులను హత్యచేశారు. మరి కొందరు పట్టణాలకు వలసపోగా, కొందరు దేశాన్ని వదలిపోయారు. కొంతమంది ప్రభువులు రైతుల కోర్కెలను పూర్తిగా మన్నించి, ఉండిపోయారు. మొత్తం మీద, విప్లవం పట్టణాలకు, పల్లెలకు పాకి, పురాతన వ్యవస్థను భగ్నం చేసింది.

ఈ పురాతన వ్యవస్థ స్థానే, నూతన ప్రభుత్వ మేర్పడాలి. ఒక వైపున ప్రజా విప్లవం దేశ వ్యాప్తంగా సంక్షోభాన్ని సృష్టిస్తుంటే, మరోవైపున రాజ్యాంగ సభ ఎడతెగని చర్చల్లో నిమగ్నమైంది. మానవ హక్కుల ప్రకటనకిది సరైన సమయం కాదా? అనే చర్చ మొదలైంది. భిన్నాభిప్రాయాలతో ఎంతో కాలం గడిచింది. రాజ్యంగ రచన పూర్తి చేసి, ఆ తర్వాత హక్కుల పత్రాన్ని తయారుచేయవచ్చని ప్రభువులు వాదించారు. అసలు విషయాలను చర్చించకుండా, పూర్తిగా సిద్ధాంతాలను, సూత్రాలను చర్చించడం మొదలుపెట్టారు. ఇదంతా కాలయాపనకై చేస్తున్న కుట్ర అని కొందరు భావించారు. ప్రజా విప్లవం వల్ల ఉత్పన్నమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు పట్టుబట్టారు. పర్యవసానంగా, ఆగస్ట్ 14 వ తేదీన నోయిల్స్ (Noyles) ప్రభువు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానంలో పన్నుల సమానత్వం, శాసనరీత్యా శిక్ష అందరికి సమానంగా ఉండటం, ప్రభుత్వోద్యోగాల్లో సమానావకాశం, మత స్వాతంత్ర్యం మొదలైన అంశాలున్నాయి, వీటిని గురించి వివరంగా, మనం తర్వాత చదువుతాం. మానవ హక్కులను గూర్చి, ఆగస్ట్ 20-26 తేదీల మధ్య చర్చలు జరిగాయి. మానవునికి సహజంగా సంక్రమించే హక్కులు పవిత్రమైనవని, వాటిని ఎవరూ తీసివేయడానికి వీల్లేదని చెప్పడం జరిగింది. స్వాతంత్ర్యం, ఆస్తి హక్కు, భద్రత, దౌర్జన్యాన్ని ఎదుర్కోడం, మొదలైనవి ప్రాథమిక హక్కులుగా చెప్పారు. వ్యక్తి స్వాతంత్ర్యం,

భావ స్వాతంత్ర్యానికి, విస్తృత పరిధిని కల్పించారు. కారణం చెప్పకుండా నిర్బంధించే అధికారాన్ని రద్దు చేశారు. దేశంలోని సంస్థల అధికారాలన్నీ, జాతి నుండే వచ్చాయని స్పష్టం చేశారు. ఈ రీతిగా ఆగస్ట్ మొదటి వారంలో రాజ్యాంగ సభ ఆమోదించిన విప్లవాత్మక శాసనాలకు, 16-20 తేదీల మధ్య ప్రకటించిన మానవ హక్కులకు, పదహారో లూయీ తన సమ్మతిని ప్రకటించలేదు. దీనికి రాజు సమ్మతి అనవసరమని, ఇవన్నీ రాజ్యాంగంలో భాగాలని , రాజ్యాగం రాజుకు ముందునుండే వుందని కొందరు వాదించారు. దీంతో, మరో రాజకీయ సంక్షోభమేర్పడింది.

## 14.2.3.పారిస్ స్త్రీల ఆకలి యాత్ర

రాజ్యాంగ సభలో చీలికలు వచ్చాయి. రాజ్యాంగ సభ చేసిన నూతన శాసనాలను ఆమోదించండం ఆత్మ హత్యా సదృశమని రాజుకు ప్రభువులు, రాణి నూరి పోశారు. నూతన రాజ్యాంగ మార్పులు ఎట్టి అవరోధాలు లేకుండా జరిగిపోగలవనే ఆశ, అడియాశగా మారింది. రాజుగారిలో బాస్టిల్ పతనానంతరం వచ్చిన మార్పు గుణాత్మకమైంది కాదని తేలిపోయింది. భార్యపైన అమితమైన ప్రేమ, స్నేహితులపట్ల ఆదరణ, ఎవరు ఏమి చెప్పినా వినే మంచితనం, పదహారోలూయీకి శాపాలుగా మారాయి. రాజ్యాంగ సభ ప్రతిపాదించిన తీవ్రమైన సంస్కరణలను, రాణి గట్టిగా వ్యతిరేకించింది. రాజ్యాధికారం యధావిధిగా కొనసాగాలని ఆమె పట్టుదల. విందులు ఆడంబరాలు, పించన్లు పోతాయని కొలువులోని వారి భయం. వీరంతా కలసి, రాజ్యాంగ సభ తీర్మానాలను ఆమోదించవద్దని పట్టుబట్టారు. బలహీనుడైన పదహారో లూయీ వీరి సలహాలకు తలొగ్గాడు. ఫలితంగా, రాజ్యంగ సభ ప్రతినిధులపైన, పారిస్ ప్రజలపైన, బల ప్రయోగానికి మరో ప్రయత్నం జరిగింది.

ఈ ప్రయత్నంలో భాగంగా, 'ఫ్లాండర్స్' (Flanders) లో ఉన్న విధేయులైన రాజు సైనికులను పిలిపించాలని నిశ్చయించారు. 1789 అక్టోబర్ 1వ తేదీన, రానున్న సైనికుల గౌరవార్థం, వర్సే రాజ ప్రాసాద రక్షకదళం గొప్ప విందును ఏర్పాటు చేసింది. విందులో పెద్ద ఎత్తున తాగి తందనాలాడారు. విందుకు రాజ దంపతులు రాగానే, జయజయధ్వానాలను చేశారు. వారు సైనికులకు త్రివర్ణ పతాకాలను పంచిపెట్టగా, వారు మహోత్సవంగా వాటిని కాళ్లకింద తోసేసి, తొక్కి, విప్లవాన్ని అవమానపర్చారు. ఈ వార్త పారిస్ నగరంలో చేరి, కార్చిచ్చులా వ్యాపించింది. రాజు, సైనికులు కలసి, జాతిని అవమానపర్చారని వారు ఆగ్రహోదగ్రులైనారు. పైగా, పారిస్‌లో గత కొద్ది రోజులుగా తిండిలేదు. ఆకలితో, ఆవేశంతో పారిస్ నగరం మండిపోయింది. సామాన్య ప్రజలు ఆకలితో, అలమటిస్తూ ఉంటే ,రాజ ప్రాసాదంలో జరిగిన ఈ విందు దుబారా వారిని రెచ్చగొట్టింది. ఈ సైనిక దళం రాజ్యాంగ సభ స్వేచ్ఛను హరించగలదని వారు మరింత భయపడ్డారు.

1789 అక్టోబర్ 5వ తేదీన ఒక విచిత్ర, వినూత్న ప్రజా నిరసన దృశ్యం ప్రారంభమైంది. రాజుకు గుణపాఠం నేర్పాలనే సంకల్పంతో, పారిస్ లోని కడుపేదలైన స్త్రీలు ఆకలితో, ఆగ్రహంతో, వీరావేశంతో తమకు దొరికిన కర్రలు, కత్తులు, కొడవళ్లు ధరించి, 'మాకు రొట్టె కావాలి' అని కేకలు వేస్తూ,' వర్సే' నగరం వైపు పురోగమించారు. పారిస్, వర్సే మధ్యనున్న 12 మైళ్ల దూరం, వారి కేకలతో ప్రతిధ్వనించింది. వీరిని ఆపడానికి సాధ్యంకాని జాతీయ రక్షణ దళాధికారి, లఫాయేట్ కొద్ది ఎడంగా వారితోపాటు బయలుదేరాడు. ఈ స్త్రీల ఆకలి యాత్ర ఎలా పరిణమిస్తుందోనని ఆందోళన పడ్డాడు. లఫాయేట్ (Lafayette) వర్సే చేరేసరికి, పారిస్ స్త్రీల సమూహం రాజ ప్రాసాదాన్ని చుట్టుముట్టి, తిట్లతో , కేకలతో "రొట్టైనా ఇవ్వండీ, లేదా రక్తమన్నా ఇవ్వండి" అని హాహాకారాలు చేశారు. ప్రాసాదంలోకి వారు రాకుండా కొంతవరకు సైనికులు నిరోధించగల్గినా, వారి బలం క్షీణించసాగింది. లఫాయేట్ సైన్యాన్ని వెనక్కుపొమ్మని చెప్పి, రాజును కాపాడే బాధ్యతను స్వీకరించాడు. ఆ రాత్రి అంతా దుర్భరంగా, భయంకరంగా గడిచింది తెల్లవారుజామున కల్లా

కొందరు రాజ ప్రాసాదంలోకి చొచ్చుకొనిపోయి, రాణి గారి రక్షక దళాన్ని చంపివేశారు.

తెల్లవారే సరికి రాజు తెలివికూడా తెల్లారింది. ఈ స్త్రీ సమూహంతో పారిస్ నగరానికి వెళ్లడానికి అంగీకరించాడు. అక్టోబర్ 6వ తేదీన పారిస్ స్త్రీలు తిరుగు ప్రయాణాన్ని మొదలుపెట్టారు. వీరి ఆవేశం తగ్గింది. ఈ యాత్ర మధ్యలో రాజుగారు, రాణీగారు, వారి పిల్లలు ఒక పెద్ద వాహనంలో ఆసీనులు కాగా, లఫాయేట్ (Lafayette) తన దళంతో వారిని అనుసరించాడు. "రొట్టెలు చేసేవాడు, అతని భార్య, చిన్న వంటవాడు మాతో వస్తున్నారు. మాకు రొట్టెలు దొరుకుతాయి" ("We are bringing back the baker and the baker's wife and the baker's son") అని పాటలు పాడుతూ, స్త్రీసందోహం రాజకుటుంబాన్ని పారిస్ నగరానికి తీసుకొచ్చారు. నాటి నుండి రాజ కుటుంబం తిరిగి వర్సై వెళ్లలేదు. పదహారో లూయీని పారిస్‌లోని ట్యూలరీస్ రాజప్రాసాదంలో ఉంచారు. వాస్తవానికి అతడు పారిస్ ప్రజల బందీయే. వెంటనే జాతీయ శాసన సభ కూడా తన సమావేశాలను పారిస్ నగరానికి మార్చింది. 1789 అక్టోబర్ నుండి విప్లవానికి పారిస్ నగరం కేంద్రమైంది.

## 14.3 జాతీయ సభ : సంస్కరణలు

బాస్టిల్ పతనం, పారిస్ స్త్రీల ఆకలి యాత్ర, ఫ్రెంచి విప్లవ ఘట్టాలలో ప్రముఖమైన దృశ్యాలు. ఈ రెండు ఘటనల మూలంగా, జాతీయ శాసన సభ రాజ ఆంక్షల నుండి స్వతంత్రమైంది. విప్లవానికి పారిస్ ప్రజల ఉత్సాహాన్ని, ఉద్వేగాలను వినియోగించుకుంది. వాస్తవానికి పారిస్ ప్రజలే విప్లవాన్ని నిర్దేశించారు. జూలై 14 వ తేదీ నుండి జరిగిన సంఘటనల వల్ల, ఫ్రాన్స్ లో పురాతన వ్యవస్థ అంతమైన విషయం మనకు విదితమే. ఒక వ్యవస్థను రద్దు చేయడం సులభమే. దాని స్థానంలో నూతన వ్యవస్థా నిర్మాణం అంత సులభమైన విషయం కాదు. రాజు అధికారం క్షీణించింది. ఉన్నత వర్గాల సాంప్రదాయ స్వాధికారాలు నశించాయి. బహుకాలంగా ఉన్న వ్యవస్థలు భగ్నమయ్యాయి. వాటిస్థానే ఒక నూతన ప్రభుత్వ యంత్రాంగాన్ని, సాంఘిక వ్యవస్థను నిర్మించాలి. అవి నాటి ప్రగతిశీల ఆశయాలను ప్రతిబింబించడమే గాక, అరాచకం నుండి సుస్థిరతను నెలకొల్పాలి. ఈ బృహత్తర బాధ్యతను జాతీయ రాజ్యాంగ సభ 1789 అక్టోబర్ నుండి, 1781 సెప్టెంబర్ వరకు నిర్వహించింది. సభలో వివిధ వర్గాల మధ్య అభిప్రాయ భేదాలున్నా, తరచూ దాని విధుల్లో పారిస్ ప్రజలు జోక్యం చేసుకున్నా, తదితర అవాంతరాలు ఏర్పడ్డా, రాజ్యాంగ సభ కార్య నిర్వహణలో విజయాన్ని సాధించింది.

" విప్లవ కాలమంతటిలోనూ, జాతీయ రాజ్యాంగ సభా కార్యక్రమాలు ఎంతో నిర్మాణాత్మకమైనవి, శాశ్వతమైనవి " అని హేస్ (Hayes " Indeed the work of National Constituent Assembly was by far the most constructive and enduring of the whole revolutionary era") వ్యాఖ్యానించాడు.

### 14.3.1 : సాంఘిక సమానత్వ సాధన

జాతీయ సభ సాధించిన విజయాల్లో సాంఘిక సమానత్వ స్థాపన బృహత్తరమైంది. అన్నింటిలోను విప్లవాత్మకమైంది. జూలై విప్లవం నాటి నుండి నగరాల్లో, పల్లెల్లో జరిగిన విధ్వంస కాండను గూర్చి మనం చదివాం. ఊహించని రీతిలో హింసాత్మక చర్యలు జరిగాయి. ఎందరో ప్రభువులను వధించడం జరిగింది. వారి భవనాలు నేల మట్టమయ్యాయి. ఈ దౌర్జన్య చర్యలను గూర్చిన వార్తలు రోజూ సభకు తెలిజేసేవారు. సభ్యులు ఈ అనూహ్య హింసాకాండను గమనించి ఆందోళన చెందారు. 1789 ఆగస్ట్ 4 వ తేదీన ప్రత్యేక పరిశోధక బృందం విధ్వంసకాండపై సుదీర్ఘమైన నివేదికను సభకు సమర్పించింది. తక్షణ చర్యలను చేపట్టి, హింసను మాన్పించాలని సూచించింది. ఈ విషయం పై చర్చల్లో పాల్గొంటూ, లఫాయేట్ బంధువైన ఒక ప్రభువు హింసాత్మక చర్యలకు రైతుల బాధ్యత లేదని, వారు ఉన్నత వర్గాల ఆస్తులపై దాడి చేశారంటే దానికి

BRAOU

కారణం సాంఘిక వ్యవస్థలోని అసాధారణ అసమానతలు, స్వాధికారాలు మాత్రమేనని, కావున ముందుగా ఆ అసమానతలను తొలగించడం అత్యంత ఆవశ్యకమని ఉద్ఘాటించాడు. వెంటనే రాజ్యాంగ సభ ఒక శాసనం చేస్తూ, పన్నుల విధింపులో సమానత్వాన్ని ప్రకటించింది. భూస్వాములకు, తదితరులకు చెల్లిస్తూ వచ్చిన రుసుములన్నింటినీ రద్దు చేశారు. సభలో కనీవినీ ఎరగని రీతిలో ప్రభువులంతా ఒకరి తర్వాత ఒకరు లేచి, తమ స్వాధికారాలను, హక్కులను వదులుకుంటున్నట్లు పోటీపడి ప్రకటించారు. మతాచార్యులు కూడా వారిని అనుసరించారు. భూస్వామ్య వ్యవస్థ, సేద్య బానిసత్వం రద్దయ్యాయి. ప్రభువుల న్యాయస్థానాలను తొలగించారు. టైత్‌లు, తదితర మతపరమైన రుసుములు, రాయితీలు, స్వాధికారాలు ఒక్కసారిగా రద్దు చేయబడ్డాయి. ఉద్యోగాల అమ్మకం నిషేధించబడింది. ఆ ఉద్రేక ఉద్వేగాల మధ్య, సర్వ స్వాధికారాలు తుడిచి పెట్టుకుపోయాయి. ఆగస్ట్ 4వ తేది రాత్రి అంతా ఉత్సాహం అలానే కొనసాగింది. ఒక వారం దినాలలో ఈ ప్రకటనలన్నీ శాసన రూపం దాల్చాయి. భూస్వామ్య వ్యవస్థ రద్దు శాసనం పై రాజు సంతకం చేశాడు. కొన్ని సంవత్సరాలుగా ఈ సంస్కరణలను తీసుక రావలెనని తాపత్రయపడిన మంత్రుల ప్రయత్నాలన్నీ, ఒక్క రోజులో వారు కోరిన దానికి మించి సాధింపబడ్డాయి. " ఆగస్ట్ రోజులు" (August Days)గా చెప్పే ఈ కాలంలో, ఫ్రాన్స్ పురాతన వ్యవస్థ రద్దు చట్టబద్ధమైంది. దాని స్థానంలో ఆధునిక వ్యక్తిత్వ సాంఘిక వ్యవస్థ రూపుదాల్చింది.

ఈ విప్లవాత్మక సాంఘిక మార్పులకు స్వాధికార వర్గాల ఉత్సాహం, త్యాగం కారణమని కొందరు వాదించక పోలేదు. ఉత్సాహం విషయంలో అనుమానం లేదు. కాని, త్యాగబుద్ధిని మాత్రం శంకించక తప్పదు. భయం వల్ల త్యాగ నిరతి ఏర్పడిందనే వాస్తవాన్ని మనం గమనించాలి. రైతుల విధ్వంస కాండకు వెరచిన వారు తమంతట తామే స్వాధికారాలను వదులుకొంటే, మర్యాదైనా మిగులుతుందని, అంతేకాక, తిరిగి రైతులే కొన్ని రాయితీలను ఇవ్వగలరని వీరు భావించారు. అంతేగాక, తాము పోగొట్టుకొన్న ఆస్తులకు ప్రతిఫలాన్ని రాబట్టుకోడానికి రాజ్యాంగసభలో ప్రయత్నాలను ప్రారంభించారు. మిగతా సాంఘిక సమానత్వ సంస్కరణలకు అవరోధాలను కల్పించారు. సభలో సభ్యులు కాని ప్రభువుల్లో కొందరు కర్మ సిద్ధాంతాన్ని నమ్మితే, కొందరు అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టారు. మరికొందరు దేశాన్ని వదలి, విప్లవ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు. ఏది ఏమైనా, ఈ ఆగస్ట్ దినాల్లో భూస్వామ్య వ్యవస్థ రద్దు వాస్తవ రూపాన్ని దాల్చింది. ఫ్రెంచి విప్లవ ఫలితాల్లో ఇది అద్వితీయమైన చర్య. ఈ చర్యవల్ల లాభపడ్డవారు విప్లవ హితులుగా, నష్టపడ్డవారు విప్లవ శత్రువులుగా మారారు.

"ఆగస్ట్ 4 వ తేది, విప్లవంలో అతి ముఖ్యమైన తేది.......... అది విప్లవ గమనంలో ఒక ముఖ్య ఘట్టం. ఆ తర్వాత కాల ప్రకృతిని నిర్దేశించింది." (The night of August 4th is one of great dates of the Revolution... It marked one of the great stages in the revolutionary movement and it determined the character of the period which follows it ) అని క్రాప్టోకిన్ వ్యాఖ్యానించాడు. "భూస్వామ్య అధికారాలను, ఆర్థిక స్వాధికారాలను ప్రభువులు, మతాచార్యులు వదులుకోవడం, వారి స్వచ్ఛంద దయాగుణం కాదు. భయం, అనుమానం, ఆలోచన వారిని అట్టి చర్యకు పురికొల్పింది". (The surrender of the feudal rights and fiscal immunities by the aristocracy and clergy was not the product of spontaneous generosity. Fear, calculation and suspicion inspired the action....") అనే దానికై, వారు ముందే వ్యూహ రచన చేశారని గుడ్‌విన్ (Goodwin)అభిప్రాయపడ్డాడు.

## 14.3.2. : మానవ హక్కుల ప్రకటన

1789 ఆగస్ట్ 27వ తేదీన రాజ్యాంగ సభ మానవ హక్కుల ప్రకటనా పత్రాన్ని ఆమోదించింది. ఇది ఆ సభ చేసిన మహత్తర కార్యాల్లో రెండవదని చెప్పొచ్చు. ఫ్రాన్స్‌లో పురాతన వ్యవస్థ, ప్రభుత్వం

శిథిలమయ్యాయి. వాటి స్థానంలో నూతన ప్రభుత్వం, వ్యవస్థను, ఎలాంటి పునాదులపై నిర్మించాలన్నదే సభ వివరంగా చర్చించింది. ఇంగ్లాడ్‌లో ప్రజా హక్కులను పరిరక్షించే మాగ్నాకార్టా (Magna Carta), బిల్ ఆఫ్ రైట్స్ (Bill of Rights)ఉండగా, అమెరికా స్వాతంత్ర్య యుద్ధానంతరం హక్కుల పత్రాన్ని రాజ్యాంగంలో పొందుపర్చింది. విప్లవ ఫ్రాన్స్ " మానవ పౌర హక్కుల ప్రకటన" ను శాసనబద్ధం చేసింది. ఈ ప్రకటన రూసో సిద్ధాంతాలవల్ల ప్రేరితమై, ఇంగ్లాండ్, అమెరికా రాజ్యాంగాల్లోని కొన్ని సూత్రాలను గ్రహించి, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాల వేదికగా రూపొందింది. తర్వాత కాలంలో వచ్చిన రాజకీయతత్వ చింతనను ఎంతగానో ప్రభావితం చేసింది. జాతీయ రాజ్యాంగ సభ ప్రకటించిన హక్కుల్లో ముఖ్యమైనవి కొన్నింటిని ఇక్కడ పొందు పర్చడమైంది.

1. మానవులందరు స్వేచ్ఛగా , సమానంగా పుట్టడమేకాక, అలాగే జీవిస్తారు. రాజ్యావసరాలకు అనుగుణంగానే ఎట్టి సాంఘిక ప్రత్యేకతలనైనా గుర్తించాలి.
2. ఏ రాజకీయ సంస్థైనా, మానవుల సహజ, అనియమ హక్కుల పరిరక్షణనే సలక్ష్యంగా భావించాలి.స్వేచ్ఛ, ఆస్తి హక్కు, భద్రత, దోపిడి నుండి రక్షణే ఈ హక్కులు.
3. స్వేచ్ఛ అంటే ఇతరులకు హాని కలుగకుండా ఏదైనా చేయడానికి అనుమతించడం.
4. ఆలోచనలను, అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించే విలువైన హక్కు అందరికీ ఉంటుంది.
5. చట్ట ప్రకారం తప్ప, ఏ వ్యక్తిపై కూడా నేరం మోపరాదు; నిర్బంధించరాదు. చెరసాల్లో వేయరాదు.
6. ప్రైవేట్ ఆస్తి పవిత్రమైంది. అమూల్యమైంది. కాని, చట్టరీత్యా ఆమోదాన్ని పొంది, ప్రజావసరాలకు మాత్రమే అట్టి ఆస్తిని గ్రహించొచ్చు. ఆ సందర్భంలో కూడా, ఆస్తి సొంతదారునికి సరైన ప్రతిఫలాన్ని చెల్లించాలి.
7. ప్రజాభిప్రాయ ప్రతిస్పందనే శాసనం కాగా, ప్రతి పౌరునికి నేరుగా, లేదా తన ప్రతినిధుల ద్వారా, శాసనాన్ని రూపొందించే కార్యక్రమంలో పాల్గొనే హక్కు ఉంటుంది.
8. సార్వభౌమాధికారం జాతికే చెందుతుంది. కాని, జాతి ఆమోదంలేని ఏ సంస్థకాని, వ్యక్తిగాని ఆ అధికారాన్ని చెలాయించవీల్లేదు.
9. రాజ్య ఆర్థిక విషయాలపై అజమాయిషీ చేసే హక్కు ప్రజలకు ఉంది.
10. రాజ్యంలోని అందరు అధికారులు ప్రజలకు బాధ్యత వహించాలి.
11. అందరి ప్రజలకు మత స్వేచ్ఛ ఉంది.

మానవ పౌర హక్కుల ప్రకటన " నెపోలియన్ సైన్యాలకన్నా బలమైందని (Stronger than all the armies of Napoleon)లార్డ్ ఆక్టన్ (Lord Acton)వ్యాఖ్యానించాడు. ఈ ప్రకటన ఐరోపాలోని విప్లవ వాదులకు, సంస్కరణాభిలాషులకు రెండు దశాబ్దాలపాటు ఒక విప్లవ ప్రకటనగా, నినాదంగా నిల్చిపోయింది. ఇంగ్లాండ్ దేశంలో హక్కుల ప్రకటన రాజాధికారానికి ప్రతిగా, ఆదేశ ప్రజల చారిత్రక, న్యాయ హక్కులను వివరిస్తుంది. కాని, ఫ్రాన్స్ దేశ హక్కుల పత్రం విశ్వవ్యాప్తంగా మానవ జాతి హక్కుల ప్రకటనలా వెలువడింది. అన్ని జాతుల ఆశలుఆశయాలకు దర్పణంగా నిల్చింది. అయితే, ఈ హక్కుల ప్రకటనలో ఎట్టి ఆర్థిక సిద్ధాంతాలను చెప్పలేదు. అంతేకాక, కొన్ని అంశాలు వాస్తవికతకు దూరంగా, సిద్ధాంతరీత్యా మాత్రమే నిలబడగలవు. అయినా, ఈ మానవ హక్కుల ప్రకటన పురాతన వ్యవస్థకు చరమ గీతం, నూతన శకానికి నాంది.

కొంతమంది చరిత్రకారులు ఫ్రెంచి విప్లవాన్ని బూర్జువా విప్లవంగా పిలుస్తారు. అంటే, విప్లవం మధ్యతరగతి వారిచే ప్రేరేపించబడటమే గాక, వారి ప్రయోజనాలను సరిరక్షించడానికి కూడా ఉద్దేశితమైందని వాదన. ఈ వాదనలో కొంత నిజం లేకపోలేదు. ముఖ్యంగా, ఆస్తి హక్కును పవిత్రమైందిగా ప్రకటించడం, ఎవరి ఆస్తినైనా ప్రజా ప్రయోజనాలకై తీసుకోవాల్సివస్తే, వారికి సరైన ప్రతిఫలాన్ని చెల్లించాలనే ప్రకటన,



BRAOU

ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తుంది. హక్కుల ప్రకటన ఫ్రెంచి ప్రభుత్వ సంస్కరణకై చేసిన ప్రయత్నమని, అందులో హక్కులను మాత్రం చెప్పడం జరిగింది. కాని, విధులను నిర్వచించలేదని డేవిడ్ థామ్సన్ అభిప్రాయం. మానవ హక్కుల నిర్వచనం సార్వభౌమాధికారం జాతికి మాత్రమే చెందుతుందని, ప్రజాభిప్రాయ ప్రకటన మాత్రమే అనే సిద్ధాంతాలపై జరిగింది. ఈ సిద్ధాంతాలు ఒక్క ఫ్రాన్స్‌కే గాక, ఐరోపా లోని అన్ని రాజ్యాల పురాతన వ్యవస్థలకు గొడ్డలిపెట్టు. అందువల్ల, 19వ శతాబ్ది ఉదార వాదానికి ఈ ప్రకటన ఒక అధికార పత్రంగా, ప్రజాస్వామ్య, రిపబ్లికన్ సిద్ధాంతాల చరిత్రలో మైలు రాయిగా నిల్చిపోయింది. నాడు భూస్వామ్య వ్యవస్థ రద్దుకై ప్రయోగించిన స్వేచ్ఛ, సమానత్వ సిద్ధాంతాలు, ఈ నాటికి కూడా నిరంకుశ ప్రభుత్వాలపై తిరుగుబాటుకు ప్రజల ఆయుధాలుగా నిల్చిపోయాయి. 19వ శతాబ్దంలో వచ్చిన జాతీయ రాజ్యాంగ శాసన పురోగతికి, ఈ మానవ హక్కుల ప్రకటన సిద్ధాంతపరమైన న్యాయబద్ధతను కల్పించింది.

## 14.3.3 నూతన పాలనా వ్యవస్థ

ఫ్రెంచి విప్లవ కారణాల వివరణలో, ఆనాటి రాజకీయ వ్యవస్థలో క్రమపద్ధతికాని, ఆలోచనగాని లేదని, ప్రభుత్వ యంత్రాంగం అస్తవ్యస్థంగా రూపొందిందని, ఏ వ్యవస్థ, ఏ అధికారం న్యాయబద్ధమో తేల్చి చెప్పడం కష్టమని, పాలనా విభాగాలు గందరగోళంగా ఉండేవని చెప్పడం జరిగింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి రాజ్యాంగ సభ పెక్కు చర్యలను తీసుకొంది. ఇంతకు ముందున్న ఎన్నోరకాలైన పాలనా విభాగాలు - రాష్ట్రాలు, గవర్నమెంట్లు, ఇంటెండెన్సీలు, పార్లమెంట్‌లు, బెలేజీలన్నీ పూర్తిగా రద్దయ్యాయి. ఫ్రాన్స్ దేశాన్ని నూతనంగా 83 పాలనా విభాగాలుగా విభజించడం జరిగింది. వీటిని 'డిపార్ట్‌మెంట్లని (Departments) వ్యవహరిస్తారు. వీలైనంతవరకు జనాభాలో, విస్తీర్ణతలో సమరూపతను కల్పించారు. ఆ ప్రాంతం లోని నదులు, కొండలు, తదితర ప్రకృతి వనరుల పేర్లను వాటి కివ్వడం జరిగింది. ప్రతి డిపార్ట్‌మెంట్‌ను జిల్లాలుగా, కమ్యూన్‌లుగా పునర్విభజన చేశారు. ఈ పాలనా విభాగాలు నేటికి కూడా కొనసాగుతున్నాయి. స్థానిక ప్రభుత్వాధికారులను ప్రజలే ఎన్నుకుంటారు. స్థానిక ప్రభుత్వ మండలులకు విస్తృతాధికారాలను దత్తత చేయడం జరిగింది. నియామకాల్లో, అధికారాల్లో, రాజ జోక్యాన్ని తొలగించడం జరిగింది. నూతన న్యాయస్థానాలను నెలకొల్పారు. న్యాయాధికారులను కూడా ప్రజలే ఎన్నిక చేస్తారు. నాటి న్యాయ శాసనాలను అందరికి అర్థమయ్యే రీతిలో క్రమబద్ధం చేయాలనే ప్రయత్నాలు జరిగాయి. కాని, ఈ పని నెపోలియన్ పాలనా కాలంలోనే సఫలీకృతమైంది. చిత్రహింస, ఉరి శిక్షలను రద్దుచేశారు. పార్లమెంట్‌లు రద్దైనాయి. న్యాయ శాఖ యంత్రాంగాన్ని పునర్నిర్మించడం జరిగింది. కమ్యూన్, లేదా కాంటన్‌లలో న్యాయమూర్తులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరిస్తారు వీటిపై అప్పీళ్ళను విచారించడానికి జిల్లా స్థాయిలో న్యాయస్థానాలను ఏర్పర్చారు. క్రిమినల్, సివిల్ కేసులకు ప్రత్యేక న్యాయస్థానాలుండేవి. క్రిమినల్ కేసుల్లో జ్యూరీ పద్ధతిని కూడా ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కోర్టులన్నింటి పైన అప్పీళ్లకు, సుప్రీం సివిల్, క్రిమినల్ కోర్ట్‌లను 1790 మే నెల్లో ఏర్పర్చారు. దేశద్రోహ నేరాలకు ప్రత్యేక ఉన్నత న్యాయస్థానాన్ని స్థాపించారు.

## 14.3.4 జాతీయ తత్వ ప్రచారం (Spread of Nationalism)

జాతీయ శాసనసభ తలపెట్టిన ప్రతి సంస్కరణ వెనుక, జాతీయ సమైక్యత, ఫ్రెంచి ప్రజల సార్వభౌమాధికారం అనే నినాదాలు స్పష్టంగా గోచరిస్తాయి. జాతీయతా భావం ఒక్కసారిగా కట్టలు తెంచుకొని ప్రవహించడం, ఈ విప్లవ లక్షణాల్లో అతి ముఖ్యమైంది. ఈ భావం ప్రాతిపదికగానే దేశ భక్తి ఇనుమడించింది. ఫ్రెంచి ప్రజలందరిని సమానంగా గుర్తించడం జరిగింది. నూతన పాలనా వ్యవస్థ కూడా జాతీయతా భావం ఆధారంగానే పునర్నిర్మితమైంది. "జాతీయ సభ", "జాతీయ రక్షణ దళం",జాతిలోనే సార్వభౌమాధికారం ఉందని చెప్పడం, ఏ వ్యక్తికీ కాని, సంస్థకు కాని జాతి నుండి ఆవిర్భవించని అధికారం



BRAOU

లేదని ప్రకటించడం, మొదలైన విషయాలు నాటి జాతీయతా పునర్వికాస నిదర్శనాలు.

ఈ జాతీయతా భావాల్ని విప్లవకారులు ఎంతో ఉత్సాహంతో ప్రచారం చేశారు. జాతీయ విద్యా విధానాన్ని, జాతీయ సైనిక సర్వీస్‌ను అమలుపర్చారు. ఈ ప్రచారంలో భాగంగా ఆడంబరమైన వేడుకలను జరిపారు. 1790 జూలై 14 వ తేదీని స్వాతంత్ర్య ప్రథమ వార్షికోత్సవంగా ప్రకటించారు. ఆరోజున ఫ్రెంచి జాతీయ దినోత్సవంగా జరిపారు. ఆరోజున ఫ్రాన్స్ దేశం నలుమూలలనుండి వచ్చిన 50 వేల ప్రతినిధులు, 14 వేల జాతీయ సైనిక దళం, పారిస్‌లోని సైనిక కవాతు స్థలంలో రాజు, సభా సభ్యుల ముందు సమావేశం అయ్యారు. కొన్నివేల మంది ప్రజలు చూస్తుండగా, 1200 మంది సంగీతాన్ని ఆలపించగా, ఎందరో మతాచార్యులు ప్రార్థనలు జరుపగా, ఊర్ధ్వముఖ హస్తాలతో జాతి పట్ల తమ విధేయతను ప్రకటించారు. ఈ బ్రహ్మాండమైన వేడుకలు ప్రజల నాకర్షించాయి. నాటినుండి ప్రతి పట్టణంలో, పల్లెలో ఈ జాతీయ వేడుకలు జరిగాయి. జాతికి అంకితం చేస్తూ, శిలాఫలకాలు వెలశాయి. మానవ హక్కుల ప్రకటనలను ఆశిలాఫలకాలపై రాయడమే గాక, జాతీయతను చాటి చెప్పే ఎన్నో వేడుకలు జరిగేవి.

ఈ జాతీయతా ప్రభావంలో, ఫ్రాన్స్‌లో వ్యవస్థలు పునర్నిర్మితమై పటిష్టం కావడమే గాక, విప్లవ వాదుల్లో జాతీయ స్వయంనిర్ణయాధికారాన్ని పురికొల్పడమైంది. పాత ఒడంబడికలతో ఎట్టి ప్రమేయం లేకుండా, ఫ్రెంచి జాతీయులు ఎక్కడున్న వారైనా ఫ్రాన్స్‌లో కలిసిపోవాలన్న పట్టుదల వచ్చింది. రైన్ (Rhine)నదీ ప్రాంతంలో ఫ్రెంచి ప్రజలున్న ఎవిగ్నాన్ (Avignon) నగరం పోప్ ఆధిపత్యంలో ఉండేది. 1791 లో అక్కడ పోప్ చెప్పిన అభ్యంతరాలను లెక్క చేయకుండా, ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఫలితంగా, ఆ నగరం ఫ్రాన్స్ లో అంతర్భాగంగా ప్రకటించబడింది. దీనితో ప్రజాభిప్రాయ సేకరణ అనే ప్రక్రియ ప్రారంభమై, అంతర్జాతీయ సంబంధాల్లో కూడా తీవ్రమైన మార్పులకు దోహదం చేసింది.

### 14.3.5 ఆర్థిక విషయాలు

ఫ్రెంచి విప్లవ కారణాల్లో ఆర్థిక విషయాల ముఖ్య పాత్రను మీరు చదివున్నారు. ఆర్థిక లోటును ఎలా ఎదుర్కోవాలో తెలియకనే, పదహారో లూయీ సర్వ ప్రయత్నాలు చేసి, ఆఖరుకు ఎస్టేట్ జనరల్ సమావేశాన్ని ఏర్పర్చడం, ఆ తర్వాత అది విప్లవానికి దారితీయడం, మనకు తెలిసిన విషయమే. జాతీయ శాసన సభ తొలి రోజుల్లో ఆర్థిక స్థితి అగమ్యగోచరంగా, అరాచకంగా మారింది. ప్రజలు పాత పన్నులను చెల్లించడానికి నిరాకరించారు. నూతన పన్నుల విధానం రూపొందలేదు. జాతీయ సమైక్యత, ఆర్థిక స్వేచ్ఛ అనే పేరున, పురాతన పరోక్ష పన్నుల విధానం రద్దైంది. కొత్తగా రుణాలు ఇవ్వడానికి బాంకర్లు సుముఖంగా లేరు. ప్రత్యక్ష పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచడానికై, భూమి శిస్తు, ఆదాయం పన్ను, చరాస్తి పన్ను, పేటెంట్ (Patent)అనే వర్తక లాభం పన్నును, విధించారు. ఈ పన్నుల వసూల్లో స్థానికాధికారులు శ్రద్ధ చూపలేదు. పన్నులు కట్టాలనే బాధ్యత ప్రజలకు తెలిసి రాలేదు. ఈ పరిస్థితుల్లో జాతీయ సభ కొన్ని అసాధారణ చర్యలను తలపెట్టింది. 1789 నవంబర్ నెల్లో, ఫ్రాన్స్‌లోని చర్చి ఆస్తులన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది. కొన్ని వందల మిలియన్ల డాల్లర్ల విలువైన ఆస్తిని హామీగా ఉంచి, " అసిగ్నాట్స్" అనే పేరున కాగితపు నోట్లను చలామణిలో పెట్టింది. అయితే, ఈ కరెన్సీని అదుపులో ఉంచినంతకాలం ఫర్వాలేదు. ఆర్థిక లోటు పెరిగిన కొద్దీ, వీటి ముద్రణను ఎక్కువ చేశారు. దాంతో, వాటి విలువ పడిపోవడమే గాక, 1791 నాటికి ద్రవ్యోల్బణం ఏర్పడింది. ఆ తర్వాత కాలంలో "అసిగ్నాట్లను" రద్దు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే, "అసిగ్నాట్ల" వల్ల తాత్కాలికంగా ఆర్థిక యిబ్బందులను అధిగమించగల్గారు. కాని, ఆనాటి సంస్కరణల్లో ఇదొక తప్పటడుగని చెప్పక తప్పదు.

### 14.3.6. చర్చితో సంబంధాలు



జాతీయ శాసన సభ చర్చి విషయాల్లో పెక్కు అనూహ్యమైన చర్యలను తీసుకున్నది. ఆచరణలో

BRAOU

జాతీయ సార్వభౌమ సిద్ధాంతానికున్న ప్రాముఖ్యత, ఈ విషయంలో విదితమైంది. 1789 నవంబర్ నెల్లో చర్చి ఆస్తులను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం, 1790 ఫిబ్రవరి నెల్లో మఠాలను , చర్చి సంస్థలను అణచి వేసింది. 1790 ఏప్రిల్ నెల్లో అందరికీ మతస్వేచ్ఛ కలదని ప్రకటించారు. 1790 జూలైలో మతాధికారులకు సివిల్ రాజ్యాంగాన్ని (Civil constitution of clergy) ప్రకటించింది. నూతన పరిపాలనా వ్యవస్థ కనుగుణంగా చర్చిని మార్చాలనే ప్రయత్నం జరిగింది. ఈసివిల్ రాజ్యాంగం ప్రకారం (1) మతపరమైన "డయసీస్"ల పరిమాణాన్ని పరిపాలనా విభాగాలైన "డిపార్ట్‌మెంట్ ల పరిమాణంలో సరిచేశారు. (2) మతాధికారులందరూ ఎన్నిక ద్వారానే అధికారం పొందాలి. (3) బిషప్‌లుగా ఎన్నికైనవారు తమ పదవీ లాంఛనాలను 'పోప్' నుండి గాక, నగర బిషప్‌ల నుండి పొందాలి. (4) మతాధికారులకు రాజ్యమే నెలసరి జీతాలు ఇస్తుంది. పెద్ద మతాచార్యుల జీతాలను తగ్గించి, చిన్న మతాచార్యుల జీతాలను పెంచుతారు. (5) బిషప్‌లు, పూజారులు తమ తమ ప్రాంతాల్లోనే నివాసం ఉంటూ, ఆధ్యాత్మిక విషయాల్లోనే నిమగ్నం కావాలి. క్రమశిక్షణ తప్పితే వారి ఉద్యోగాలు పోతాయి.

ఈ సివిల్ రాజ్యాంగానికి గత్యంతరం లేక, రాజు ఆమోదముద్రను వేశాడు. శాసనాన్ని అసలు పర్చడంలో తీవ్ర ప్రతికూలం ఏర్పడగా, ఉద్యోగంలో ఉన్న మతాచార్యులందరూ ఈ సివిల్ రాజ్యాంగానికి బద్ధులమై ఉండగలమని ప్రమాణం చేయాలని, లేకుంటే బర్తరఫ్ అవుతారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ రాజ్యాంగాన్ని ఆమోదించవద్దని, ఆమోదిస్తే మత బహిష్కరణకు గురి కావాల్సి వస్తుందనీ 'పోప్' బెదిరించాడు. దీంతో, మతాచార్యుల్లో రెండు వర్గాలేర్పడ్డాయి. సివిల్ రాజ్యాంగానికి బద్ధులం కాగలమని ప్రమాణం చేసిన వారు జ్యూరీ క్లెర్జీ (Jury clergy) అని,నిరాకరించిన వారు నాన్ జ్యూరింగ్ క్లెర్జీ (non-juring clergy) అని,వ్యవహరించడం జరిగింది. ఏడుగురు బిషప్‌లు, క్రింది తరగతి మతాచార్యుల్లో సగం మంది మాత్రమే ప్రమాణం చేశారు. అంటే, మతాధికారుల్లో విప్లవ సంస్కరణలకు ప్రతికూలురు అధికమనే వాస్తవం తెలియవచ్చింది. ఈ రెండు వర్గాలు విభేదాల కారణంగా శత్రుకూటాలుగా మారాయి. ప్రమాణం చెయ్యని మతాచార్యులను విప్లవవాదులుగ, ప్రజాశత్రువులుగా పరిగణించారు. 'పోప్' తో ఫ్రాన్స్‌కు సంబంధాలు తెగిపోయాయి. అంతవరకు విప్లవానికనుగుణంగా ఉన్న దిగువ మతాచార్యులు కొంతవరకు విప్లవ వ్యతిరేకులయ్యారు, దేశంలో అంతర్యుద్ధ బీజాలను నాటడం జరిగింది. ప్రజల్లో అత్యధికులకు ఇంకా మతమంటే మూర్ఖ విశ్వాసముంది.

B R A O U

## 14.3.7. నూతన రాజ్యాంగం

ఈ జాతీయ శాసన సభ యిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ, మరోవైపున ఈ నూతన రాజ్యాంగ రచన చేసింది. అందువల్ల, ఈ సభను జాతీయ రాజ్యాంగ సభ అని కూడా పిలుస్తాం. 1791 లో రాజ్యాంగ రచన పూర్తైంది. మరోదారి లేని రాజుదానికి ఆమోదముద్ర, వేస్తే అమల్లోకి వచ్చింది. అది ఫ్రాన్స్ ప్రథమ లిఖిత రాజ్యాంగం. అది ఐరోపాలోని మొట్టమొదటి రాజ్యాంగం. అమెరికా రాజ్యాంగం 1789లో అమల్లోకి వచ్చింది.

1791 రాజ్యాంగం, అమెరికా రాజ్యాంగ పద్ధతిలో 'మాంటెస్క్యూ' (Montesqueue) అధికార పృథఃకరణను అమలుపర్చింది. శాసన, కార్యనిర్వాహక, న్యాయాధికారాలు వేరై, వాటికై ప్రత్యేక సంస్థలు ఏర్పడ్డాయి. అయితే, ఇవన్నీ ప్రజాభిప్రాయం నుండే ఉత్పన్నం కావాలి. శాసనాధికారాన్ని "శాసన సభ అనే ఒకే ఒక సభకు ఇవ్వడం జరిగింది. దీని సభ్యులను పరోక్షంగా ఎన్నుకొంటారు. ప్రజలు కొంతమంది 'ఎలక్టారులను' (Electors) ఎన్నుకుంటే, వారు సభ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ విషయంలో కూడా, విప్లవ నాయకులైన మధ్యతరగతి వారు, కార్మిక, కర్షక వర్గాలను నమ్మలేదన్నమాట. వారికి నేరుగా ఓటింగ్ హక్కు యిస్తే, తమకు ప్రమాదం ఏర్పడగలదని భావించారు. అంతేకాక, ఓటింగ్ హక్కును కూడా

అందరికివ్వలేదు. పన్నులు చెల్లించే వారిని మాత్రమే యాక్టివ్ సిటిజెన్స్ (active citizens) గా గుర్తించి, ఓటింగ్ హక్కు నిచ్చారు. అంతేగాక, ఆస్తిగల వారికి మాత్రమే, ఉద్యోగ అర్హతను కల్పించడం జరిగింది. ఈ సభలో 745 మంది సభ్యులుంటారు. రెండేళ్లకోసారి వీరిని ఎన్నుకొంటారు.

కార్యనిర్వాహకాధికారం రాజుకు నామమాత్రంగా లభించింది. రాజరికం వంశపారంపర్యం. శాసన సభ చేసిన శాసనాలపై, రాజుకు తాత్కాలిక వీటో (Veto) అధికార మివ్వడం జరిగింది. స్థానిక ప్రభుత్వం, సైన్యం, మతాచార్యులు, నావికాబలం, మొదలైన వాటి మీద రాజుఅధికారాన్ని తొలగించడం జరిగింది. అతని మంత్రులు సభలో కూర్చోరాదు. 1789-91 మధ్య, రాజు అధికారం పూర్తిగా క్షీణించింది.

న్యాయాధికారం పూర్తిగా మారింది. న్యాయాధికారులు ఇంతకు ముందు తమ పదవులను,హెూదాలను కొనుగోలు చేసేవారు. ఆ పదవులను తమతమ పిల్లలకు బదలాయించొచ్చు. నూతన రాజ్యాంగం ప్రకారం న్యాయాధికారులను ప్రజలు 2-4 సంవత్సరాలకు ఎన్నుకొంటారు. క్రిమినల్ కేసుల్లో జ్యూరీ పద్ధతిని ప్రవేశపెట్టారు. 1791 రాజ్యాంగం ఫ్రెంచి పాలనా వ్యవస్థలో ఒక ప్రగతిశీలక చర్య. అయినా, ఆ ప్రయోగం ఎక్కువ కాలం నిలవలేదు. సరిగా పనిచేయలేదు. స్వయంపాలనలో అది మొదటి విలువైన ప్రయోగం. అనుభవరాహిత్యం వల్ల, సరైన అవగాహన లేనందువల్ల, ఎన్నో విషయాల్లో భవిష్యత్తులో ఇబ్బందులేర్పడ్డాయి. శాసన, కార్యనిర్వాహకాధికారాలను పూర్తిగా వేరుచేసినందున సమన్వయం లోపించింది. ("The constitution of 1791 represented an improvement in French Government. Yet, it did not work well, and did not last long. As a first experiment in the art of self - government, it had its value, but it revealed in experience and poor judgement in several points which prepared trouble for the future") అని, హేజన్ వ్యాఖ్యానించాడు. అంతేకాక ,పౌరుల్లో 'ఏక్టివ్', 'పాసివ్' అనే భేదాన్ని సృష్టించడం, మానవ హక్కుల ప్రకటనను ఉల్లంఘించడమే. ఆ అధికార వికేంద్రీకరణ వల్ల జాతీయ ప్రభుత్వ సమర్ధత లోపించింది. ఫ్రాన్స్ 83 విభాగాలుగా మారి, వాటి మధ్య సమన్వయం కుదరక, జాతీయ లక్ష్యాలను విస్మరించడం జరిగింది.

## 14.3.7.1 నూతన రాజ్యాంగ విశ్లేషణ

జాతీయ శాసన సభ ఫ్రాన్స్‌లోని పురాతన వ్యవస్థ పునాదులను పెకలించింది. భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసింది. పాత పాలనా యంత్రాంగాన్ని, ఆర్థిక విధానాన్ని, న్యాయ వ్యస్థను భగ్నం చేసింది. చర్చి విషయంలో విపరీతమైన మార్పులు చేసింది. ఇవికాక, నిర్మాణాత్మకమైన పెక్కు మార్పులను చేసింది. ప్రజలు ప్రాతినిధ్యం వహించే సులభతరమైన పాలనా పద్ధతిని ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలో శాసన సభకు ప్రజా మద్దతు బాసటగా నిల్చింది. సామాన్య ప్రజలు నెరపిన విప్లవం వల్ల, స్వాధికార వర్గాలు ధైర్యాన్ని కోల్పోయాయి. ఆ కారణంగా, ఈ సంస్కరణలకు అవరోధాలను కల్పించలేక పోయారు. జాతీయ శాసన సభ అరాచక శక్తులను ప్రోత్సహించి, ప్రమాదకరమైన సిద్ధాంతాలను ప్రవచించి, 'సమూహపాలన' (Mob rule) ను ప్రవేశపెట్టిందనే విమర్శ కూడా లేకపోలేదు. మతపరంగా ప్రజల మధ్య విభేదాలు సృష్టించబడ్డాయనీ, మధ్యతరగతి వారు రాజకీయాధికారాన్ని చేపట్టడానికి కుట్ర పన్నారనే విమర్శలు కూడా కొంత వరకు నిజమే. శాసన సభ సంస్కరణల్లో కొన్ని రద్దు కావడం కూడా జరిగింది. కాని, మొత్తం మీద, పెక్కు సంస్కరణలు చిరస్మరణీయంగా మిగిలిపోయి, ఐరోపా ప్రజలనే కాక, ప్రపంచం లోనే పీడిత, తాడిత వర్గాలకు ఆదర్శాలుగా నిల్చాయి. తిరుగుబాటు సిద్ధాంతాలకు ఊపిరి పోశాయి. నూతన రాజకీయ వ్యవస్థ ద్వారా ఫ్రాన్స్ జాతీయ సమైక్యతకు దారులు వేయడం జరిగింది. ఒకే న్యాయ శాసనాలు, ఒకే రీతి పన్నులు, మొదలైన శాసనాల ద్వారా, ఒక సాంఘిక పౌర విప్లవాన్ని సాధించడం జరిగింది. వ్యక్తిగత గౌరవం సామాన్య ప్రజలకు కూడా కలదని చాటి చెప్పింది. ప్రజాభిప్రాయంలోనే ప్రభుత్వ మనుగడ ఉందని స్పష్టం చేసింది. శాసన సభ చేసిన మార్పులు, శాసనాలు కేవలం ఆదేశానికి పరిమితంగా కన్పిస్తాయి. కాని, వాస్తవానికి అవి విదేశ సంబంధాలను కూడా నిర్దేశించాయి. ముఖ్యంగా,



BRAOU

భూస్వామ్య వ్యవస్థ రద్దు ఐరోపా రాజ్యాలన్నింటిని కలవరపర్చింది. మత సంస్కరణలు పోప్‌ను, ఫ్రెంచి ప్రజలున్న కొన్ని ప్రాంతాల్లోని మతాధికారులను దెబ్బతీశాయి. పర్యవసానంగా, ఫ్రాన్స్ విదేశీ సంబంధాల్లో పెక్కు మార్పులు వచ్చాయి. వీటిని గూర్చి తర్వాత పాఠాల్లో వివరంగా చూడగలం.

"రాజ్యాంగ సభ కృషి నిస్సందేహంగా మధ్య తరగతి వారి పనే. కాని, జాతి సాంప్రదాయాల్లో రాజకీయ సమానత్వ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టడం, ఒక మనిషిపై మనిషికున్న అధికారాలను తొలగించడం, సమానత్వం అనే భావనను కల్పించి, అసమానతలపై తిరుగుబాటు శక్తిని కల్పించడం, నిజంగా అసాధరణమైన సాధనే"...... అని క్రాపోట్కిన్ వ్యాఖ్యానించాడు. శాసన సభలో చెలరేగుతున్న విప్లవ భావాగ్నికి వీధుల్లో నుండి (ప్రజల నుండి) వీచిన గాలి అనవసరమైందని లూయీ బ్లాంక్(Louis Blank) చెబుతూ, "విధ్వంసక ఆశయాలను సృష్టించిందని" (Every rising was full of thoughts) ప్రతి తిరుగుబాటులోను ఎన్నో ఆలోచనలున్నాయని ప్రశంసించాడు. వీధిలోని మనిషి ప్రతి ఘట్టంలోను, పునర్నిర్మాణ కృషిలో శాసన సభను ముందుకు పోయేటట్టుగా నడిపించగలడనే వాదం కూడా నిజమే.

## 14.4 రాజు పలాయనం

జాతీయ శాసన సభ 1791 సెప్టెంబర్‌లో తన పనిని పూర్తిచేసింది. కాని, ఈ లోపుగా జూన్ నెల్లో పదహారో లూయీ దేశం వదలి పారిపోవడానికి ప్రయత్నించాడు. మొదటి నుండి విప్లవ కార్యక్రమానికి పదహారో లూయీ వ్యతిరేకాన్ని చూపుతూనే వచ్చాడు. బాస్టిల్ పతనం, వర్సే ఆకలి యాత్రల సందర్భంగా సైనిక బలాన్ని ఉపయోగించి విప్లవ వాదులను అణచడానికి ప్రయత్నాలు చేయడం, అవి విఫలం కావడం, మనం చదివి ఉన్నాం. తప్పనిసరై తాను పారిస్ రాజ ప్రాసాదంలో ప్రజల మధ్య ఉంటూ, విప్లవానికి తాను అనుకూలుడనే ప్రకటించుకున్నాడు. మానసికంగా అతనిలో మార్పు రాలేదు. శాసన సభ పెక్కు విప్లవ సంస్కరణలు చేపట్టగా, వీలైతే వాటిని తిరస్కరించడానికి, విప్లవవాదులను అణచడానికి రహస్య ప్రయత్నాలను ప్రారంభించాడు. విప్లవ వాదుల్లో కొందరిని చేరదీసి, వారి సాయంతో విప్లవాన్ని కూలదోయాలని ఆశించాడు. జాతీయ రక్షక దళం అధిపతి 'లఫాయెట్', రాజ్యాంగ సభలో మహా వక్తగా పేరుగాంచిన మిరాబోలను ఉపయోగించుకోవాలని, వారి అధికార దాహాన్ని తన అవసరాలకు వాడుకోవాలని ప్రయత్నించడంలో విఫలుడయ్యాడు. పైగా, రైన్ నదీ ప్రాంతంలో నివాసాన్ని కల్పించుకొన్న పారిపోయిన ప్రభువులు, మతాచార్యులు, ఒక పోటీ ప్రభుత్వాన్ని సాగించాలనుకొన్నారు. వారి నుండి రాజు, రాణి గార్లకు తరచు సందేశాలు వచ్చేవి. రాణి 'మేరీ ఆంటోనిట్' ఆస్ట్రియా దేశ రాకుమార్తె. అధికారాన్ని కోల్పోయి ప్రజల మధ్య బందీగా జీవనాన్ని సాగించడం, ఆమెకు కంటకప్రాయంగా తోచింది. మొదట్లో పదహారో లూయీ లఫాయేట్,ఆపైన మిరాబోల మీద ఆధారపడి, విదేశీ జోక్యంతోనైనా సరే తిరిగి అధికారాన్ని పొందాలని యత్నించాడు. దానికై,ఎంతో ధనాన్ని ఖర్చుపెట్టాడు. అయినా, ఫలితం లేకపోయింది.

చివరకు ఒకే మార్గం మిగిలింది. విదేశీ సాయాన్ని అర్థించాలి. సరిగ్గా అదే సమయంలో మత విషయంగా సంఘర్షణలు ప్రారంభమయ్యాయి. ప్రమాణం చేయ నిరాకరించిన 'నాన్ జ్యూరీ' మతాధికారులను రాజు సమర్థించాడు. 'పారిస్' నూతన పురపాలక ప్రభుత్వం మంత్రి వర్గాన్ని మార్చాలని పట్టుబట్టింది. మత అంతర్యుద్ధం ప్రారంభం కాగానే, కొందరు రాజరికం బదులు గణతంత్ర రాజ్యం కావాలని ఆందోళన ప్రారంభించారు. ఈ ఆందోళనలను అణచడానికి, 'లఫాయేట్' మరికొందరు సైనికాధికారులు పెక్కు విప్లవ వ్యతిరేక చర్యలకు పూనుకున్నారు. అంతకు ముందే, పదహారో లూయీ ఆస్ట్రియా, స్పెయిన్, రాజుల సాయాన్ని కోరాడు. ఫ్రెంచి రాజ్యాంగ చట్టాన్ని బహిరంగంగా ఖండించి, రాజు సకుటుంబంగా ఏదైన సురక్షిత ప్రాంతానికి తరలాల్సిందే తప్ప, తాము సాయం చేయలేమని వారు సూచించారు. అంతరవకు ఆస్ట్రియా రాకుమారుడైన 'లియోపాల్డ్' (Leopald) విప్లవ సంస్కరణలను చిత్తశుద్ధితో అంగీకరించి, అక్కడే ఉండిపొమ్మని రాజ దంపతులకు సలహా యిచ్చాడు. కాని, ప్రష్యా (Prussia) రాజు ఫ్రెడరిక్ విలియం 

ఎమిగ్రీల(Emigrees) అభ్యర్థనలను స్వీకరించి, ఆస్ట్రియా తరపున ఫ్రాన్స్‌పై పోరాడటానికి సంసిద్ధతను తెలిపాడు. వారు ఒక ఒడంబడికను చేసుకొన్నారు. అంతకు ముందు రోజే, లియోపాల్డ్‌కు(Leopald) సోదరి మేరీ ఆంటోనిట్ జాబు వచ్చింది. తాము సకుటుంబంగా పారిపోవడానికి వ్యూహం తయారైందని తెలిపింది.

రాణి ఆంతరంగిక మిత్రుడైన 'ఫర్సన్' (Furson) అనే వ్యక్తి రాజ కుటుంబం పారిపోవడానికి అతి జాగ్రత్తగా ఏర్పాట్లు చేశాడు. రాజు పారిపోగలడని విప్లవవాది మార్గెట్ (Marget) అనుమానపడ్డాడు. లఫాయేట్ రాజప్రాసాదం తనిఖీకి వెళ్లే సరికే, రాజ కుటుంబం తప్పించుకుపోయింది. బహుశా వారు కాపలావారిని మంచి చేసుకొని ఉంటారు. ఈశాన్య సరిహద్దుల్లో సైన్యాధిపతిగాఉన్న జనరల్ 'బాయిలే' అయితే రాజ పక్షం చేరి, ఆ కుటుంబాన్ని రక్షించడానికి మార్గమధ్యంగా అక్కడ సైనిక బృందాలను కాపు ఉంచాడు. కాని, రాజు అజాగ్రత్తగా వ్యవహరించాడు. తాపీగా ప్రయాణం చేసి, మొదటి మజిలీకే నాలుగు గంటలు ఆలస్యంగా చేరటంతో, మిగతా మజిలీల వారు ఆరోజుకు రాజుగారు రావడం లేదని నిర్లక్ష్యంగా ఉన్నారు. ఈ లోపునే కొందరు రాజుగారు ప్రచ్ఛన్న వేషంలో ఉన్నా గుర్తించగల్గారు. వారి నాయకులు 'వరేన్స్' చేరి, ప్రజలను మేలుకొల్పి, ఐర్ నదీ వంతెనపై అడ్డుగోడలను నిర్మించి, రాజుగారి బగ్గీని ఆపివేశారు. రాజుగారిని గుర్తించడం జరిగింది. ఈ వార్త పారిస్ చేరగానే, రాజ్యాంగ సభ రాజుగారిని వెనక్కుతీసుకొని రావడానికి మనుషులను పంపారు. తిరుగు ప్రయాణంలో రాజుగారిని ప్రజలు అవహేళన చేశారు. రాజ కుటుంబం అవమానాల పాలైంది. కొన్ని చోట్ల దౌర్జన్యాలు జరిపారు. పారిస్ నగరంలో ఏ ఒక్కరూ రాజుకు నమస్కరించలేదు. రాజు టూయిలర్స్ భవనం చేరి, బ్రతుకు జీవుడా అనుకున్నాడు. జాతీయ శాసన సభ చాల విజ్ఞతతో ఉద్రేకానికి లోనుకాకుండా, తన కార్యక్రమాలను కొనసాగించింది. రాజు గారిని తాత్కాలిక పదవి నుండి తొలగిస్తూ, అతని వీటో అధికారాన్ని రద్దుచేసింది. కార్యనిర్వహణాధికారాన్ని సభయే స్వీకరించి, మంత్రులకు ఆదేశాలిచ్చింది. ఈ పలాయనం విషాదాంతంగా ముగియడంతో, రాజుగారి పైనున్న కొద్దిపాటి గౌరవం కూడా తుడిచిపెట్టుకపోయింది. రాజును ఖైదు చేయాలని, రాజరికాన్ని రద్దుచేసి, గణతంత్ర రాజ్యాన్ని ప్రకటించాలని ఆందోళన చేశారు. కాని, అలా చేస్తే విదేశీ యుద్ధం వస్తుందని తలచిన సభ, ఈ విజ్ఞప్తులను తోసివేసింది. ఈ ప్రజాందోళన సందర్భంగా జరిగిన కాల్పుల్లో కొందరు చనిపోయారు. దీంతో రాజుగారిని సమర్థించే మితవాద నాయకత్వం మరి అపఖ్యాతి పాలైంది. రాజు మారినట్లు నటించినా, ప్రజల కతనిపై నమ్మకం కుదరలేదు.

ఆ తర్వాత జరిగిన సంఘటనలను, రాజరికం రద్దు, విదేశీ యుద్ధం, తదితర అంశాలను, వచ్చే పాఠ్యభాగంలో చదవగలం.

## 14.5 సంగ్రహంగా

సంగ్రహంగా ఈ భాగంలో విప్లవ గమనాన్ని చదివారు. జాతీయ శాసన సభ ఏర్పాటు, విప్లవ సిద్ధాంతాలకు రూపకల్పన చేయడం, ఆ రూపకల్పన వివిధ శాసనాలుగా రూపొందడాన్ని వివరించడమేగాక, సంస్కరణల ప్రాధాన్యత కూడా ప్రస్తావించడమైంది.

## 14.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. ఈ క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. ఫ్రెంచి విప్లవ ప్రారంభం నుండి జాతీయ శాసన సభా సమావేశం వరకు జరిగిన సంఘటనలను వివరించండి
2. జాతీయ శాసన సభ సంస్కరణలను విమర్శనాత్మకంగా విశ్లేషించండి

BRAOU

II. ఈ క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. బాస్టిల్ కోట పతన ప్రాముఖ్యతను వివరించండి
2. పారిస్ స్త్రీల ఆకలియాత్ర ఫ్రెంచి విప్లవ గమనంపై ఎటువంటి ప్రభావాన్ని చూపింది?
3. రాజు పలాయనం ఎటువంటి పరిణామాలకు దారితీసింది?

## 14.7 ఉపయుక్త గ్రంథాలు


H.A.L Fisher : **History of Europe**

C.D Hazen : **History of Modern Europe since 1789**

C.J.H. Hayes : **Modern Europe upto 1870**

V..D Mahajan : **History of Modern Europe since 1789**

Carlyle : **The French Revoluion**

Lord Acton : **Lectures on the French Revolution**


BRAOU

రచయిత : శ్రీ ఎ.వి. కోటిరెడ్డి

# భాగం–15 : జాతీయ కన్వెన్షన్

విషయ క్రమం

15.0 లక్ష్యాలు

15.1 పరిచయం

15.2 రాజకీయ సంక్షోభం

15.2.1 మితవాదులు

15.2.2 తీవ్రవాదులు

15.2.3. తీవ్రవాద సంఘాలు, లేక క్లబ్బులు

15.3. విదేశీ యుద్ధం : ప్రయత్నాలు

15.3.1 యుద్ధ గమనం

15.4. ఫ్రెంచి రిపబ్లిక్ ఏర్పాటు

15.4.1 జాతీయ కన్వెన్షన్ సాధించిన విజయాలు

15.4.2 పదహారో లూయీ భవిష్యత్తు

15.4.3 విదేశీ యుద్ధ కొనసాగింపు

15.4.4 జాతీయ సైన్యం

15.4.5 భీతావహ పాలన

15.4.6 విప్లవ సంస్కరణలు

15.4.7 మత సంస్కరణలు

15.4.8 సామ్యవాద సంస్కరణలు

15.4.9 నూతన రాజ్యాంగం

15.5. రిపబ్లిక్ వైఫల్యం

15.5.1 డైరెక్టరీ

15.5.2 భిన్న వర్గాలు

15.6. సంగ్రహంగా

15.7. పరీక్ష నమూనా ప్రశ్నలు

15.8. ఉపయుక్త గ్రంథాలు

## 15.0 లక్ష్యాలు

ఈ పాఠ్యభాగం ద్వారా రాజ్యాంగబద్ధ రాజరికానికి మితవాదుల నుండి, అంతకన్నా ప్రముఖంగా తీవ్రవాదుల నుండి వచ్చిన సవాళ్లను అర్థం చేసుకోగల్గాలి. ఫ్రెంచి విప్లవం పట్ల విదేశీ వ్యతిరేకత పర్యవసానంగా వచ్చిన యుద్ధం, ఆ యుద్ధంలో జాతీయ సైన్యాలు సాధించిన విజయాలు, ఫలితంగా రాజరికం భ్రష్టుపట్టి



BRAOU

ఫ్రాన్స్ రిపబ్లిక్‌గా అంతరించడాన్ని గ్రహించగల్గాలి.

ఫ్రాన్స్ రిపబ్లిక్‌గా మారినపిదప, జాతీయ కన్వెన్షన్ చేసిన సంస్కరణలు విప్లవాత్మకమైనవి, గుణాత్మకమైనవి కూడా. ముఖ్యంగా మతం పట్ల చూపిన నిరాదరణ, సామ్యవాద సంస్కరణలు, నాటి తీవ్రవాదుల అభిప్రాయాలకు ప్రతీకలనే విషయాన్ని తెలుసుకోగల్గాలి.

ఇదే భాగంలో రిపబ్లిక్ వైఫల్యాన్ని కూడా మీరు చూడగలరు. జరిగిన సంఘటనలను మీరు మిగతా విప్లవాలతో పోల్చి విశ్లేషించగల్గాలి.

## 15.1: పరిచయం

ఇంతకు ముందు పాఠ్యభాగంలో రాజ కుటుంబం ఫ్రాన్స్ నుండి పారిపోవడానికి ప్రయత్నించడంలో విఫలం కావడం, రాజును పదవి నుండి తొలగించడాన్ని గూర్చి చదివున్నాం. ఇట్టి రాజ్యాంగబద్ధ రాజరిక వైఫల్యానికి, రాజరిక ప్రవర్తనే కాక, మరి కొన్ని ముఖ్య కారణాలు కూడా లేకపోలేదు.

## 15.2 : రాజకీయ సంక్షోభం

1791 లో ఆమోదించిన లిఖిత రాజ్యాంగాన్ననుసరించి, ఎన్నికలు జరిగి, ప్రథమ శాసన సభ అక్టోబర్ 1 వ తేదీన సమావేశమైంది. అంటే, అందులోని 745 మంది సభ్యులందరూ కొత్తవారే. రాజ్యాంగాన్ని రచించిన సభా సభ్యులు తెలివితక్కువగా త్యాగం పేరుతో నూతన రాజ్యాంగం ప్రకారం ఎన్నుకొనే సభకు పోటీచేయకూడదని శాసనం చేశారు. నూతన సభా సభ్యులు అనుభం లేనివారు. వారిలో చాలా మంది తీవ్రవాదులు.

1789-91 మధ్య, జాతీయ రాజ్యాంగ సభ చేసిన శాసనాలను, నిర్ణయాలను, ఫ్రెంచి ప్రజల్లోని కొన్ని వర్గాల వారు ఆమోదించలేదు. మరి కొందరు సంతృప్తి చెందలేదు. కొందరి దృష్టిలో విప్లవం అనుకున్న దానికన్నా విపరీత పరిపాలనకు దారితీసింది. కాన, దాన్ని వెనుక దారి పట్టించాలి. వీరు మిత వాదులు (Reactionaries) మరికొందరి దృష్టిలో విప్లవం కాని, రాజ్యాంగ సభకాని, గుణాత్మక , ముఖ్య మార్పులను తీసుకరాలేదు. కాన, దాన్ని మరింత ముందుకు నడిపించాలి. వీరు తీవ్రవాదులు( Radicals).

### 15.2.1. : మితవాదులు

స్వాధికారాలుండి వాటిని పోగొట్టుకున్న ప్రభువుల్లో అత్యధికులు, మరో సివిల్ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రమాణం చేయ నిరాకరించిన నాన్ జ్యూరీ మతాచార్యులు, మితవాదులుగా మారారు. బాస్టిల్ పతనం, గ్రామీణ ప్రాంతాల్లో హింసాకాండ చెలరేగిన తొలి రోజుల్లోనే, పెక్కు మంది ప్రభువులు ఫ్రాన్స్‌ను వదలి పోయారు. ఆ తర్వాత మత విరుద్ధ శాసనాలు సభలో చర్చింపబడుతున్న సందర్భంలో, మతాచార్యుల్లో పెక్కుమంది వీరి ననుసరించారు. ఇలా పారిపోయిన మితవాదులైన ప్రభువులు, మతాచార్యులు, ఫ్రాన్స్ ఉత్తర , తూర్పు సరిహద్దుల్లో పెద్ద ఎత్తున ప్రవాసులుగా స్థిరపడ్డారు. ముఖ్యంగా 'రైన్' ప్రాంతంలోని కొబ్లెంజ్ (Coblenz) లో వారు గణనీయంగా వున్నారు. వీరిని 'ఎమిగ్రీలు' (Emigrees) అని వ్యవహరించేవారు. రాజుగారి తమ్ముడైన 'కౌంట్ ఆఫ్ ఆర్టియస్' (Count of Artios) నాయకత్వంలో వారు విప్లవానికి వ్యతిరేకంగా పత్రికలు, కరపత్రాలు, కుట్రల ద్వారా నిరంతర పోరాటాన్ని కొనసాగించారు. వారికి ఫ్రెంచి రాజ



BRAOU

కుటుంబ సానుభూతి ఉంది. రహస్య మంతనాలను చేసేవారు. ' మిరాబు' బ్రతికి ఉన్నంత కాలం విప్లవ సంస్కరణలను ఆమోదించమని ప్రవాసులతో మంతనాలు సాగించవద్దని రాజుకు నచ్చచెప్పేవారు. కాని, అతడు చనిపోయిన తర్వాత రాజుగారు ప్రవాసులను చేరడానికి పలాయనం చిత్తగించడం, అది విఫలం కావడం మనకు తెలుసు. తిరిగి వచ్చిన పదహారో లూయీ రాజ్యాంగబద్ధునిగా ఉండగలనని ప్రమాణం చేసినా, ప్రజలు అతని మాటలను నమ్మలేదు. రాణి మేరి 'ఆంటోనిట్' ఆస్ట్రియా రాకుమారి. ఆమె అంటే ప్రజల కిష్టం లేదు. పైగా రాణిగారు ప్రవాసులతో, విదేశీ ప్రభుత్వాలతో, రహస్య మంతనాలు చేస్తున్నట్లు అనుమానాలు ఏర్పడ్డాయి. రాజుగారి సోదరుల్లో పెద్దవాడు తప్పించుకొని పోయి, ప్రవాసుల్లో చేరాడు. దీంతో, రాజ కుటుంబంపై ప్రజలకు ఆగ్రహం, అసహ్య భావం ఏర్పడ్డాయి. మితవాదుల ప్రభావం ప్రవాసులకు, రాజ కుటుంబానికి మాత్రమే పరిమితం కాలేదు. ఫ్రాన్స్‌లోని కొందరు ప్రముఖులు గణనీయమైన సంఖ్యలో మితవాదాన్ని బలపర్చారు. శాసన సభలోని కొందరు సభ్యులు ప్రభుత్వాన్ని భంగపరచడానికి, ఇబ్బంది పెట్టడానికి, ఆచరణ యోగ్యంకాని, తీవ్రమైన కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టేవారు. పెద్ద నగరాల్లో కులీనులు, ఉన్నత, మధ్యతరగతివారు ' మితవాద క్లబ్బులను' ఏర్పర్చుకొన్నారు. పశ్చిమ ఫ్రాన్స్‌లోని బ్రిటనీ, లా వెండీ (La vendee) జిల్లాల్లోని రైతులు విప్లవానికి వ్యతిరేకులుగా మారారు. రాజ్యాంగ సభ కాథలిక్ మతానికి విరుద్ధంగా చేసిన శాసనాలను వీరు ఇష్టపలేదు. మతం పట్ల అధిక వ్యామోహం కలవారు 1791-92 మధ్య, ముఖ్యంగా లా వెండీలో, ఎన్నో తిరుగుబాట్లు చేశారు. తీవ్రవాదులు వారి ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చింది.

### 15.2.2 : తీవ్రవాదులు

1791 రాజ్యాంగబద్ధ రాజరికానికి మితవాదుల నుండి వ్యతిరేకత వున్నా, అంతకన్నా ప్రమాదకరమైన వ్యతిరేకత అతివాదుల నుండి వచ్చింది. వీరి దృష్టిలో విప్లవం అనుకున్నంత మేరకు మార్పులను సాధించలేదు. ఇంకా ఎన్నో విప్లవాత్మక శాసనాలను చట్టబద్ధం చేయాల్సి ఉంది. 1789-91 మధ్య వచ్చిన రాజకీయ, సాంఘిక మార్పుల వల్ల లాభం పొందిన మధ్యతరగతి నుండి ఈ తీవ్రవాద నాయకత్వం ఆవిర్భవించింది. సాధించిన విజయాల వల్ల, వారి ఉత్సాహం పెరిగింది. రాజుగారి ప్రవర్తన, మితవాదుల పోకడలు, వారి పట్టుదలను పెంచాయి. జాతీయవాద ప్రేరణ, రూసో తదితర 18వ శతాబ్ది మేధావుల నూతన రాజకీయ, సాంఘిక సిద్ధాంతాల ప్రభావం, వారిని మరింత కార్యోన్ముఖులను చేసింది. రాజు పట్ల విశ్వాసంకన్నా, ప్రజలపై నమ్మకం ఉంచడం ఉచితమని, రాజరికం కన్నా గణతంత్ర రాజ్య స్థాపన మేలని, విప్లవ లక్ష్యం ప్రజాస్వామ్య ప్రభుత్వ ఏర్పాటని వారి ప్రగాఢ విశ్వాసం. రాజ్యాంగంలో కృత్రిమంగా సృష్టించిన 'ఏక్టివ్', 'పాసివ్' (Active, Passive) పౌరసత్వం రద్దు కావాలని వారు కోరారు. మతానికి ఇచ్చిన రాయితీలను కూడా పూర్తిగా తీసివేయాలని, జ్యూరీ మతాచార్యులకిచ్చిన కొద్దిపాటి స్వాధికారాలను కూడా రద్దు చేయాలని, నిజమైన సమానత్వాన్ని ఇవ్వాలనీ, వారు విశ్వసించారు. అంతేగాక, పురాతన వ్యవస్థ పట్ల సానుభూతి చూపుతున్న ప్రభువులు, మతాచార్యుల పట్ల కఠిన వైఖరి నవలంబించి, శిక్షించాలని ఉద్ఘాటించారు.

ఈ నాయకుల్లో కొందరు వ్యక్తిగత స్వేచ్ఛ, జాతీయ సమైక్యతల పట్ల, మరింత ఆసక్తి ఉన్న పట్టణాల్లో నివసిస్తున్న కార్మిక వర్గ ఆర్థిక దుస్థితి పట్ల సానుభూతి ప్రదర్శించి, వారి పరిస్థితులను మెరుగుపర్చడానికి శ్రద్ధ చూపారు. 1789లో రైతుల్లో నెలకొన్న అసంతృప్తి, అశాంతి లక్షణాలు, 1791 లో కార్మిక వర్గాల్లో ప్రస్ఫుటంగా కనిపించాయి. వీరికి కూడా కొన్ని స్వేచ్ఛలు , హక్కులను వాగ్దానం చేయడం 

BRAOU

జరిగింది. రైతుల విషయంలో భూస్వామ్య వ్యవస్థ రద్దు, వెట్టిచాకిరి రద్దు జరిగాయి. భూస్వాముల భూములు కూడా వారికి పంచి వేయడం జరిగింది. కాని, కార్మిక వర్గాలకు అట్టి ప్రయోజనాలు చేకూరలేదు. వారికెట్టి ఆస్తులు చేకూరలేదు. రాజుగారిని బలవంతంగా పారిస్ నగరానికి తీసుకవచ్చినా, వారు అనుకొన్న 'రొట్టె' లభ్యం కాలేదు. 1791 రాజ్యాంగం ప్రకారం వారికి ప్రభుత్వ నిర్వహణలో ఎట్టి అవకాశాన్నివ్వడం జరగలేదు. దీంతో, వారిలో ప్రభుత్వం మారినా తమ స్థితిగతుల్లో ఎట్టి మార్పు రాలేదని నిరాశ, అసంతృప్తి, ఆగ్రహం చోటుచేసుకొన్నాయి. వారి భావనను తీవ్ర నాయకత్వం రెచ్చగొట్టింది. ఈ పరిస్థితుల్లో తీవ్రవాద నాయత్వంలోనే మార్పులొచ్చాయి. నూతన నాయకత్వం ఏర్పడింది. ఇంతవరకు 'మూడో' ఎస్టేట్‌కు చెందిన మధ్యతరగతివారు, ఉదారులైన మిరాబు వంటి ప్రభువులు, అచనీయిన్ వంటి మతాచార్యులు కలిసి, విప్లవానికి నాయకత్వం వహించారు. మధ్యతరగతివారు, కార్మిక వర్గంలో కలిసిపోయి, వారి ప్రయోజనాలను కాపాడ్డానికి నూతన నాయకత్వాన్ని చేపట్టారు. జాతీయత, గణతంత్ర రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలనే ఈ తీవ్రవాద మధ్యతరగతి నాయకత్వ ప్రయత్నాలు, జిజ్ఞాస, ఆవేశం వెనక, కొంత స్వార్థం లేకపోలేదని విమర్శకుల అభిప్రాయం. వారి ప్రయోజనాల్లో ఏవర్గం వారినైనా వారు పావులుగా వాడగలరని, వారికి కార్మిక వర్గం అందుబాటులో కన్పించిందని, ఈ నాయత్వం పై కొందరు అభిప్రాయపడ్డారు. ఈ విమర్శల్లో నిజం లేకపోలేదు.

## 15.2.3 : తీవ్రవాద సంఘాలు, లేదా క్లబ్బులు

పారిస్ నగర కేంద్రంగా తీవ్రవాద కలాపాలు 1791-92 లో చురుకుగా సాగాయి. పత్రికా వ్యాసంగం, కరపత్రాలు, రెచ్చగొట్టే ఉపన్యాసాల ద్వారా ప్రచారం విస్తృతంగా జరిగింది. ప్రజా సమూహ ఉద్రేకాన్ని, మధ్యతరగతి ప్రజల ఆలోచనా శక్తిని వారు వాడుకున్నారు. ఈ ప్రచారం విప్లవ క్లబ్బుల ద్వారా మరింత పటిష్టంగా సాగింది. ఈ క్లబ్బులకు కొంత చరిత్ర ఉంది. 1789లో వర్సేలో ఎస్టేట్ జనరల్ సభ్యులు తరచూ భోజన సమయాల్లో కలుస్తూ, పెక్కు విషయాలను చర్చించేవారు. అంతేగాక, ఒక అభిప్రాయం గల వారు తరచూ ఒకే చోట విందు ఆరగించేవారు. ఈ విధంగా రాజకీయ నాయకులు సమావేశమయ్యేసరికి, వాటిని 'ఈటింగ్' క్లబ్బులుగా(Eating Clubs) వ్యవహరించేవారు. 1791 నాటికి సమావేశాలు అలవాటుగా మారి, పారిస్ లోని ప్రతి హొటల్ కేఫ్, రాజకీయ నాయకుల సమావేశ కేంద్రాలుగా మారాయి. ఏటిలో కొన్ని మితవాదులకు, మరికొన్ని రాజ్యాంగబద్ధులకు పరిమితం కాగా, అత్యధిక క్లబ్బులు తీవ్రవాదుల కార్యకలాపాలకు కేంద్రాలుగా రూపొందాయి. వీటిలో ముఖ్యమైనవి 'కార్డీలియర్' (Cordilier), 'జాకోబిన్' (Jacobin) క్లబ్బులు. " మానవ పౌర హక్కుల సంఘ మిత్రులం" అనే పేరుతో ఏర్పడ్డ 'కార్డీలియర్' సంఘం, ఆది నుండి తీవ్రవాదంతో, మరీ తీవ్రంగా కార్యకలాపాలను సాగించింది. దాని సభ్యులంతా పారిస్ లోని అతి తీవ్రవాదులు. " రాజ్యాంగ స్నేహితుల సంఘం (Society of the Friends of the constitution) అనే పేరున ఏర్పడిన జాకోబిన్ సంఘం, ప్రథమంలో మితవాదులైన మిరాబు, ఆబె సయీస్, లఫాయేట్"ల నాయకత్వంలో నడిచింది. కాని, అనతికాలం లోనే రాబస్పియర్ (Robespierre) నాయకత్వంలో ఈ సంఘం కూడా, కార్డీలియర్ క్లబ్బు వలె, తీవ్రవాద సంఘంగా మారింది. కార్డీలియర్, జాకోబిన్ అనే మఠాలను ప్రభుత్వం వశం చేసుకుంది. ఈ రెండు చోట్ల సమావేశం అయ్యే ఈ క్లబ్బులు ఆ పేర్లనే గ్రహించడం విడ్డూరం కదా !

BRAOU

పారిస్ నగరం కేంద్రంగా ఈ తీవ్రవాద ఉద్యమం దేశం నలుమూలలకు విస్తరించింది. ఫ్రెంచి నగరాల్లోని అన్ని క్లబ్‌ల కేంద్రాల్లో, పారిస్ కేంద్రానికి నిరంతరం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. జాకోబిన్ క్లబ్ అతి సమర్థవంతమైన పద్ధతిలో వ్యవస్థీకరించబడగా, సభ్యులు ఎంతో ఉత్సాహ ఉద్వేగాలతో పనిచేసేవారు. వీరికి సమర్థవంతమైన నాయకత్వం ఉంది.

## 15.3 విదేశీ యుద్ధం : ప్రయత్నాలు

రాజ్యాంగబద్ధ రాజరిక వైఫల్యానికి, ఫ్రాన్స్‌లోని నాటి రాజకీయ సంక్షోభానికి, విదేశీ యుద్ధం కూడా తోడైంది. ఐరోపా లోని రాజ్యాలన్నీ ఒక్క ఇంగ్లాండ్‌ను మినహాయిస్తే, నిరపేక్ష నిరంకుశ రాజరికానికే కట్టుబడి ఉన్నాయి. అంతేకాక, ఆ దేశాలన్నింటిలోను వర్గతారతమ్యాలు మధ్యయుగం నాటి నుండి పదిలంగా ఉన్నాయి. ఆ వర్గ తారతమ్యాలను ఫ్రెంచ్ విప్లవం సవాల్ చేసింది. ఆయా దేశాల్లో విప్లవం రావడానికి కావలసిన ప్రజాభిప్రాయం కూడా పెంపొందలేదు. ఇంగ్లాండ్ లో రాజ్యాంగబద్ధ రాజరికం ఉంది. ఫ్రాన్స్ విప్లవం తొలి రోజుల్లో వారు కూడా ఇంగ్లాడ్ పద్ధతిన, రాజరికాన్ని కోరుతున్నారని, బ్రిటీష్ రాజనీతిజ్ఞులు సంతసించారు. అయితే, విప్లవం మరి ముందుకుపోయి, పురాతన వ్యవస్థకే సవాల్‌గా పరిణమించడం, రాజరికంపై తిరుగుబాటు సందర్భంగా జరిగిన హింసాకాండ, వారిని కూడా భయభ్రాంతుల్ని చేసింది. సాంఘికంగా, రాజకీయంగా, అందరూ సమానులే అన్న సిద్ధాంతం, వారికి రుచించ లేదు. 1790 లో బ్రిటీష్ రాజకీయ తత్వవేత్త ఎడ్మండ్ బర్క్ (Edmund Burke) "రిఫ్లక్షన్స్ ఆన్ రివల్యూషన్ ఇన్ ఫ్రాన్స్" (Reflections on the Revolution in France) అనే వ్యాసాల సంపుటిలో, ఫ్రెంచి విప్లవాన్ని 'మంద పాలన' (Mob rule) గా, విచక్షణ లేని తిరుగుబాటుగా, అతి తీవ్రంగా విమర్శించాడు. తీవ్రవాద విప్లవం స్థానంలో మితవాద అభివృద్ధి మేలని, చాటి చెప్పాడు. ఈ విప్లవ విమర్శనా గ్రంథం అన్ని భాషల్లోకి అనువదించబడి, ప్రభువులు, మతాచార్యుల ప్రశంసల నందుకొంది. రష్యా రాణీ రెండో కాథరిన్ (Catherine - II) బర్క్‌ను స్వయంగా అభినందించగా, మిగతా రాజు లెందరో అభినందన సందేశాలు, బహుమతులను పంపారు. ఫ్రెంచి విప్లవం సాంప్రదాయ నాగరికత, సాంఘిక వ్యవస్థలపై చెలరేగిన దుర్మార్గ తిరుగుబాటుగా వారంతా భావించారు.

ఈ నేపథ్యంలో స్పెయిన్, రెండు సిసిలీలను పాలిస్తున్న బూర్బన్ రాజులు, ఫ్రెంచి విప్లవాన్ని వ్యతిరేకించడానికి ప్రత్యేక కారణాలున్నాయి. ఫ్రాన్స్ రాజు బూర్బన్ (Bourbon) వంశస్థుడు. అతనికి జరిగిన నష్టం, కష్టం, స్పెయిన్ రాజుకు కూడా వస్తుంది. ఇక పోతే, ఫ్రెంచి రాణి మేరీ ఆంటోనిట్, హేబ్స్‌బర్గ్ వంశానికి చెందిన ఆస్ట్రియా రాజకుమార్తె. ఆమె సోదరుడు ఆదర్శ ప్రాజ్ఞ చక్రవర్తి రెండో జోసఫ్ మరణానంతరం, మరో సోదరుడు " రెండో లియోపాల్డ్ (Leopald-II) ఆస్ట్రియా రాజయ్యాడు. అతడు పవిత్ర రోమన్ చక్రవర్తి కూడా. మేరి ఆంటోనిట్ విప్లవ వాదుల బారినుండి కాపాడమని సోదరునికి ఎన్నో వేడుకలను పంపింది. పైగా, ఆస్ట్రియా పాలనలోనున్న "నెదర్లాండ్స్"లో కూడా విప్లవ భావాలు బాగా ప్రచారంలో ఉన్నాయి. అక్కడ విప్లవం వస్తే, వారు ఫ్రాన్స్‌తో సంలీనం కాగలమని కోరగలరు. చక్రవర్తిగా జర్మనీని, తదితర ప్రాంతాలను ఫ్రెంచి ప్రభావం నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది. ఈ కారణాలవల్ల ఆస్ట్రియా రాజు ఐరోపాలో పురాతన వ్యవస్థ కొనసాగింపుకు కంకణం కట్టుకోవడమేగాక, ఫ్రాన్స్‌లో రాజరిక అధికార పునరుద్ధరణకు ప్రయత్నాలను చేశాడు. ప్రష్యా రాజు రెండో ఫ్రెడరిక్ విలియం అతనికి తోడయ్యాడు. అతడు తన పూర్వీకుల పద్ధతిని విడనాడి, సైన్యాన్ని నిర్లక్ష్యం చేసి, వెలయాండ్రపై దుబారా ఖర్చుపెట్టి, ఆస్ట్రియాతో ఫ్రాన్స్‌కు విరుద్ధంగా చేతులు కలపడానికి అంగీకరించాడు. వీరిద్దరూ కలిసి ,1791



BRAOU

ఆగస్ట్‌లో ప్రకటన చేస్తూ, ఫ్రాన్స్‌లో రాజరికాన్ని, శాంతిభద్రతలను పరిరక్షించడం, ఐరోపా చక్రవర్తులందరి విధియని ఉద్ఘాటించారు. ఈ ప్రకటన కేవలం బెదిరింపుకు మాత్రమే. వారి సైన్యాలు యుద్ధానికి సన్నద్ధంగా లేవు.

కాని, ఫ్రాన్స్‌లో ఈ ప్రకటన విపరీత పరిణామాలకు దారితీసింది. తమ ఆంతరంగిక విషయాల్లో విదేశీ నియంతల జోక్యానికి, ఫ్రెంచి ప్రజలు తీవ్రంగా నిరసించారు. విప్లవవాదుల్లో, దేశ భక్తుల్లో , వీరోత్సాహం పెల్లుబికింది. ఆస్ట్రియా-ప్రష్యాల యుద్ధం ఫ్రాన్స్‌లోని అన్ని వర్గాలకు, వేర్వేరు కారణాలవల్ల అవసరంగా తోచింది. యుద్ధం వల్ల తనకు విముక్తి వస్తుందని రాణి గారు, ఆమె సహచర బృందం భావించింది. యుద్ధంలో ఫ్రాన్స్ ఓడిపోతే, తమ పురాతన వైభవం వస్తుంది, గెలిస్తే ,రాజ కుటుంబ ప్రతిష్ట పెరిగి, రాజ్యాంగబద్ధంగానైనా కొంత అధికారాన్నైనా చేజిక్కించుకోవచ్చునని భావించారు. యుద్ధంలో విజయం సాధించి, తన పేరు ప్రతిష్టలను పెంచుకోవాలని లఫాయేట్, అతని రాజ్యాంగ పక్షం తలంచింది. తీవ్రవాదులు కూడా యుద్ధం వల్ల రాజరికం మరింత భ్రష్టుపట్టి, గణతంత్ర రాజ్యం ఏర్పడగలదని, అంతేగాక, మిగతా ఐరోపా రాజ్య ప్రజలను కూడా వారి నియంతలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి, ప్రజాస్వామ్య సిద్ధాంతాలను ప్రచారం చేయవచ్చని భావించారు. విదేశీ యుద్ధం తప్పనిసరి అనిపించింది.

అయితే, ఈ పరిస్థితుల్లో నిర్ణయం చేయాల్సిన శాసన సభలో భిన్నమైన వర్గాలు, అభిప్రాయాలున్నాయి. సభలోని 750 సభ్యులలో 350 మంది ఏ వర్గానికి చెందని స్వతంత్రులు. వారు ప్రతి విషయంలోను మంచి చెడులను బట్టి, తమ ప్రయోజనాలను బట్టి, ఓటు చేసేవారు. మిగతా సభ్యుల్లో రెండు వర్గాలున్నాయి. “ఫ్యూయిలాంట్స్” (Feuillants) 1791 రాజ్యాంగాన్ని బలపర్చే రాజ్యాంగబద్ధ రాజకీయ పక్షం వారు. వారిని, సభలో మితవాదులుగా చెప్పవచ్చు. రెండో వర్గం వారు గిరాండిస్ట్‌లు (Girondists). వీరు గిరాండి రాష్ట్రం నుండి అత్యధికంగా ఎన్నికైనందున, వారికి ఆ పేరు వచ్చింది. వీరు తీవ్రవాదులు, దేశభక్తులు. ఆదర్శాలతో ఆడుకుంటూ, ఆచరణను గూర్చి ఆలోచించని మేధావులు, గొప్ప వక్తలు. ఫ్రాన్స్‌లో గణతంత్ర రాజ్యాన్ని స్థాపించాలని కోరిక. పారిస్ న్యాయవాది బ్రిసట్ (Brissot) వారి నాయకుడు. వెర్న్యాడ్ (Vergniuad) అనర్గ ప్రముఖ వక్త. వారిలో మేధావులు, వేదాంతులు ఎందరో ఉన్నారు. డ్యూమొరిజ్ (Dumouriez) యుద్ధ విషయంలో ప్రజ్ఞాశాలి. వీరందరూ మేడమ్ రోలాండ్ (Madam Roland) గృహంలో రాజకీయ సమావేశాలను జరిపేవారు.

## 15.3.1 : యుద్ధ గమనం

శాసన సభ ఆంతరంగిక విషయాల్లో ఎట్టి నిర్ణయాలను తీసుకోలేదు. యుద్ధం అన్ని వర్గాల వారిని కలిపివేసింది. అందరూ విదేశీ యుద్ధానికి సన్నద్ధమయ్యారు. మారట్ (Marat), రాబస్పియర్ (Robespierre) వంటి వీరులు మాత్రం, యుద్ధం వల్ల సైనిక నియంతృత్వం రాగలదని భయపడ్డారు. ఈ యుద్ధ సంరంభంలో గిరాండిస్ట్‌లు అధికారాన్ని చేజిక్కించుకొని, తమ సరిహద్దుల నుండి ఆస్ట్రియా సైన్యాలను ఉపసంహరించమని, దాని భూభాగంలోనున్న ఎమిగ్రీలను పంపివేయమని, ఆస్ట్రియా చక్రవర్తిని కోరారు. దాని కతడు అంగీకరింపక పోగా, 1792 ఏప్రిల్ నెల్లో, యుద్ధాన్ని ప్రకటించాల్సిందిగా ఫ్రెంచి రాజును బలవంతం చేశారు. ఆస్ట్రియాలో రెండో లియోపాల్డ్ మరణించి, అతని కుమారుడు ఫ్రాన్సిస్ రాజయ్యాడు. రెండో ఫ్రాన్సిస్ ప్రష్యా రాజైన విలియమ్‌ను కలిసి, 80 వేల సైన్యంతో ఫ్రాన్స్‌పై

దండెత్తడానికి సన్నద్ధమయ్యాడు. దీంతో విప్లవానికి, ఐరోపాలోని పురాతన వ్యవస్థకు, సంఘర్షణ 1792లో ప్రారంభమై, సుమారు 23 సంవత్సరాలు కొనసాగింది. ఇది ఐరోపా ఖండాన్ని యావత్తు కలచి వేసింది.

ఫ్రెంచి జాతి ఎంతో ఉత్సాహంతో యుద్ధంలో పాల్గొన్నది. విప్లవ సిద్ధాంతాల కోసం, ఆశయ సాధన కోసం పోరాడుతున్నామనే ఊహ, వారికి శక్తి నిచ్చింది. స్వేచ్ఛా సంకేతాలుగా, ఎర్ర టోపీలను ధరించి, యుద్ధ గీతాలను పాడుతూ, ముందుకు సాగారు. కాని, యుద్ధానికొక ఉత్సాహమే చాలదు. సైన్యానికి సరైన పద్ధతి కాని, ఆయుధాలు కాని, లేవు. ఆహార సరఫరాలంతంత మాత్రమే. లఫాయేట్‌కు సమర్ధతకన్నా ఆశ ఎక్కువ. ఫలితంగా, ఫ్రెంచి సైన్యాలు మొదట ఎన్నో అపజయాలను పొందింది. ఆస్ట్రియా, నెదర్లాండ్ దాడి విఫలమైంది. తూర్పున మిత్ర రాజ్యాల సైన్యాధిపతి బ్రన్స్‌విక్ (Brunswick) ప్రభువు ఫ్రాన్స్‌లో సునాయాసంగా ప్రవేశించి, పారిస్ వైపు సాగాడు. రాజకుటుంబం విదేశీ సైన్యాలకు రహస్యాలు అందజేస్తున్న నదంతి బయలుదేరింది. 1792 జూన్ 20వ తేదీన స్త్రీలు, కార్మికులు, బొగ్గుపనివారు, రాజప్రాసాదం ముందు పెద్ద ప్రదర్శన జరిపారు. రాజును బెదిరించారు. అయితే, దౌర్జన్యం ఏమీ జరగలేదు. జూన్ 25వ తేదీన మిత్ర రాజ్యాల సైన్యాధిపతి ఫ్రెంచి ప్రజల నుద్దేశించి ఒక ప్రకటనచేస్తూ, ఫ్రాన్స్‌లో అరాచకాన్ని అణచడమే తన కార్యక్రమమని, రాజుగారి అధికారాన్ని పునరుద్ధరించడం తన ధ్యేయమని, ప్రకటించాడు. అంతేగాక , రాజకుటుంబానికి ఎవరు హాని తలపెట్టినా, వారిపై ఆస్ట్రియా, ప్రష్యా సైన్యాలు ఊహకందని రీతిలో ప్రతీకారాన్ని తీర్చుకోగలవని, పారిస్ నగరాన్ని సర్వనాశనం చేయగలమని హెచ్చరించాడు. ఈ హెచ్చరిక ఫ్రెంచి రాజరికానికి చరమ గీతాన్ని పాడింది. రాజ కుటుంబం, శత్రు సైన్యాలు, ఒకటయ్యాయని నిరూపితమైంది.

## 15.4 ఫ్రెంచి రిపబ్లిక్ ఏర్పాటు

ఫలితంగా, 1792 ఆగస్ట్ 9,10 తేదీల్లో, పారిస్ నగరంలో సాయుధ తిరుగుబాటు జరిగింది. తీవ్రవాదులు రాజ్యాంగబద్ధ రాజరికాన్ని కాదని, ఒక విప్లవ సంఘాన్ని ఏర్పర్చాచారు. 'డాంటన్' (Danton) దానికి నాయకత్వం వహించాడు. రాజప్రాసాదం చేరి, అక్కడున్న దళాలను వధించారు. రాజు, రాణి, శాసన సభా ప్రాంగణం లోకి పారిపోయారు. ఆగస్ట్ 10 వ తేదీన భయకంపితులైన శాసన సభ సభ్యులు రాజును తాత్కాలికంగా పదవి నుండి తొలగిస్తూ, ఫ్రాన్స్‌కు కొత్త రాజ్యాంగాన్ని రచించడానికి, జాతీయ కన్వెన్షన్‌ను ఎన్నుకోవాలని తీర్మానించారు. ఈ ఎన్నికలు సెప్టెంబర్ 20 వ తేదీకి పూర్తయ్యాయి. ఈ మధ్య కాలంలో ఫ్రాన్స్ పూర్తిగా అరాచకమైంది. రాజకుటుంబాన్ని టెంపుల్ కారాగారంలో నిర్బంధించడమైంది. 'లఫాయట్' ఈ తిరుగుబాటు సంగీకరించక, మిత్ర సైన్యాలకు లొంగిపోయాడు. మిత్ర సైన్యాలు ఫ్రాన్స్‌లోకి మరింత చొచ్చుకపోయాయి. ప్రజల్లో మరింత భయం పెరిగింది. విప్లవ 'కమ్యూన్' అధికారాన్ని చేజిక్కించుకొంది. డాంటన్ నియంతగా మారాడు. విప్లవానికి వ్యతిరేకులైన దేశీయుల, విదేశీయుల గుండెల్లో భయంకర వాతావరణాన్ని సృష్టించాలనేది, అతని విధానం.

సైన్యాలు దాడి చేశాయని తెలియగానే, పారిస్ లోని రాజరిక సానుభూతిపరులను ఊచకోత కోశారు. రెండు వేల మందిని స్త్రీలు, పిల్లలతో సహా, వధించడం జరిగింది. ఎందరో మతాచార్యులు, ప్రభువులు, న్యాయాధికారులు నిహతులయ్యారు. ఈలోపుగా 'డాంటన్' ఫ్రెంచి సైన్యంలో నూతనోత్సాహాన్ని కల్గించి, 'వర్సే' వద్ద ప్రప్రథమంగా మిత్ర సైన్యాలను ఓడించాడు. పారిస్ నగరం విదేశీ దాడి నుండి రక్షింపబడిందని



BRAOU

తెలియగానే, కొత్తగా ఎన్నుకోబడిన జాతీయ కన్వెన్షన్, ఫ్రాన్స్‌లో రాజరికాన్ని రద్దు చేసింది. 1792 సెప్టెంబర్ 22వ తేదీని, రిపబ్లిక్ మొదటి సంవత్సరంగా ప్రకటించారు. ఎమిగ్రీలను శాశ్వతంగా దేశం నుండి బహిష్కరించారు.

## 15.4.1 : జాతీయ కన్వెన్షన్ సాధించిన విజయాలు

జాతీయ కన్వెన్షన్ మూడు సంవత్సరాల పాటు సమావేశమైంది. విప్లవ నిర్మాణాత్మక కృషిలో రెండో ఘట్టాన్ని ప్రారంభించారు. అది సాధించిన విజయాలను స్థూలంగా రెండు విభాగాలుగా చెప్పొచ్చు. ప్రథమంగా విదేశీ యుద్ధంలో విజయ పరంపరను కొనసాగించి, విప్లవం మొదట సాధించిన సాంఘిక, రాజకీయ మార్పులను సుస్థిరపరచడం. ప్రజాస్వామ్య పద్ధతిలో నూతన రిపబ్లిక్ ప్రభుత్వాన్ని స్థాపించడం, నూతన వ్యవస్థను ఏర్పర్చడం, రెండో ఘట్టం.

జాతీయ కన్వెన్షన్ సాధించిన విజయాలను ప్రస్తావించే ముందు, సభలోని సభ్యులను గూర్చి తెలుసుకోవాలి. ఎన్నికల్లో మగవారందరూ పాల్గొనవచ్చని చెప్పినా, భయం వల్ల పది శాతం మాత్రమే ఓటు వేశారు. ఫలితంగా, రాటుదేలిన తీవ్రవాదులు పెద్ద సంఖ్యలో ఎన్నికయ్యారు. గిరాండికి చెందిన రెండు వందల మంది సభ్యులు బ్రిసోట్ (Brissot), వెర్న్యూడ్ (Vergniuad), టామ్ పెయిన్ (Tom Paine) నాయకత్వంలో ఉండగా, వీరికన్నా తీవ్రవాదులైనవారు నూరుమంది 'జాకోబిన్లు', డాంటన్, రాబస్పియర్, సెయింట్ జస్ట్ ల నాయకత్వంలో ఉన్నారు. వీరు గాలరీల్లో పై సీట్లలో కూర్చునేవారు. అందుకని, వారిని మౌంట్ నిష్టులని కూడా పిలుస్తారు. గిరాండిస్ట్‌లు ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ను కోరారు. కాని, పారిస్ నగర కార్మిక వర్గాలను నమ్మలేదు. జాకోబిన్లు పారిస్ నగరవాసులకు స్నేహితులు. ఈ రెండు వర్గాల మధ్య, సభలోని అత్యధిక సభ్యులుండేవారు. వారు అవసరాన్ని బట్టి, విషయాలపై, విధానాలపై ఓటు వేసేవారు. ఆబె సఈస్ వారి నాయకుడు. ప్రథమంలో వారు గిరాండిస్ట్‌లతో కలిసి, ఓటు చేసేవారు. కాని, జాకోబిన్ల ప్రభావం పెరగ్గానే, వారితో కలిసి ఓటు వేశారు.

BRAOU

జాతీయ కన్వెన్షన్ ముందు ఎన్నో కఠిన సమస్యలున్నాయి. పదవీచ్యుతుడైన రాజును ఏం చేయాలి? ఆతర్వాత దేశ రక్షణ, భద్రతను చూడాలి; విదేశీ దండయాత్రలను తిప్పికొట్టాలి; ఫ్రాన్స్‌లోని ఆంతరంగిక తిరుగుబాట్లను అణచాలి; దేశానికి సుస్థిరమైన ప్రభుత్వ యంత్రాంగాన్ని రూపొందించాలి; విప్లవ ఫలితాలను మరింత సుస్థిరపర్చి ముందుకు పోవాలి. అంతేగాక, దేశానికి ఒక నూతన గణతంత్ర రాజ్యాంగాన్ని రచించాలి. "చరిత్రలో బహుశా జాతీయ కన్వెన్షన్ ముందున్న క్లిష్టతరమైన బాధ్యతలను ఏ శాసన సభ ఎదుర్కొని ఉండదు. (Perhaps no legislative body in history has been called upon to solve such knotty problems as those which confronted the National Convention)) అని, హేస్ (Hayes) వ్యాఖ్యానించాడు. ఈ విషయాలన్నింటినీ సభ ఒకే కాలంలో పరిష్కరించినా, పాఠకుల సులువుకై వాటిని క్రమబద్ధంగా చదవగలరు.

## 15.4.2 పదహారో లూయీ భవిష్యత్తు

రాజరికాన్ని రద్దు చేసిన పిదప, పదహారో లూయీని విచారణ చేయాలని రాజ్యాంగ పరిషత్తు నిర్ణయించి, ఈ నిర్ణయాన్ని తీసుకోవడానికి ముందు, విస్తృత చర్చలు జరిగాయి. రాజు దేశం నుండి

పారిపోవడానికి ప్రయత్నించడం నేరమే. అయినా, అతడ్ని తిరిగి తీసికొని వచ్చి, కొన్ని అధికారాలిచ్చారు. పైగా ఇప్పుడు పదవీచ్యుతుని చేశారు. కాని, శిక్షను అమలు పరచినట్లే. అందువల్ల, తిరిగి అంతకు ముందు చేసిన నేరాల పేరున వేరే శిక్ష అవసరం లేదని కొందరు వాదించారు. ఆగస్ట్ 10 విప్లవంతో, పాత రాజ్యాంగం రద్దైంది. కానీ, రాజుకు అధికారాలు లేవు. విప్లవ ప్రతికూలురుతో చేతులు కలిపినందున, రాజునుకూడా సామాన్య పౌరుని వలెనే విచారించి, శిక్షింపదగునని 'జాకోబిన్లు' వాదించారు. రాజు దోషియని ఆగస్ట్ విప్లవం నిర్ణయించిందని, అందువల్ల మరో విచారణ అనవసరమని, ఏ శిక్ష వేయాలి అన్నది మాత్రమే నిర్ణయించాలని, రాబస్పియర్ వాదించాడు. ముద్దాయి చెప్పేది వినకుండా శిక్ష వేయడం ఉచితం కాదని పరిషత్తు భావించింది.

విచారణ సందర్భంగా పదహారో లూయీ రెండు పర్యాయాలు సభకు వచ్చాడు. నేరారోపణలు చదివి, వినిపించారు. అతని తరపున వకీలు గేసేబ్ అద్భుతంగా వాదించాడు. కాని, లూయీ దాచిపెట్టిన రహస్య పత్రాలున్న పెట్టె ఒకటి దొరికింది. అందులో సభా సభ్యులను కొనడానికి ఖర్చుపెట్టిన లెక్కలు, విదేశీయులతో జరిపిన మంతనాలకు సంబంధించిన పత్రాలు దొరకడంతో, పదహారో లూయీ దోషియని తేలింది. అయినా, శిక్షను గురించి ఓటింగ్ జరగాలని గిరాండిన్‌లు పట్టుబట్టారు. సభ్యుల్లో 707 మంది రాజు దోషి యని చెప్పారు. శిక్షకు సంబంధించి, శిరచ్ఛేదం చేయాలని 387 మంది చెప్పగా, 334 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. 1793 జనవరి 21వ తేదీన పదహారో లూయీని గిలిటన్ చేశారు. వధ్యశిలకు తీసుకొనిపోయే సందర్భంలో పదహారో లూయీ చూపిన నిబ్బరం, చావును చిరునవ్వుతో ఎదుర్కొన్న ధైర్యం, రాజ దర్పం అతని పాలనా కాలమంతటికి గర్వించదగిన సంఘటన.

### 15.4.3 విదేశీ యుద్ధ కొనసాగింపు

నేషనల్ కన్వెన్షన్ విదేశీ యుద్ధంలో విజయాలను సాధించింది. ఆస్ట్రియా, ప్రష్యాల దండయాత్రను త్రిప్పి కొట్టింది. వామీ యుద్ధంలో విజయం పిదప, డ్యూమొరిజ్ (Dumouriez) వెనుతిరిగిపోతున్న విదేశీ సైన్యాలను వెంటాడి, రైన్ నదిని దాటి, ఆస్ట్రియన్ నెదర్లాండ్స్‌లోకి ప్రవేశించాడు. బ్రసెల్స్ నగరం స్వాధీనమైంది. అనతికాలంలోనే నెదర్లాండ్స్ పూర్తిగా వశమైంది. ఆదేశ ప్రజలు ఫ్రెంచి సైన్యాన్ని విముక్త దళంగా భావించారు. ఈ పురోగతిని కొనసాగిస్తే, ఐరోపా రాజ్యాలన్నింటిలోను పురాతన వ్యవస్థ భగ్నం కాగలదని ఆశించారు. ఈ విజయాలతో ఉత్సాహం చెందిన జాతీయ కన్వెన్షన్, 1792 డిసెంబర్‌లో ఒక చారిత్రాత్మక, విప్లవాత్మక ప్రకటనను చేసింది.

"ఎవరైతే ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం ఇవ్వ నిరాకరిస్తారో రాజులతో, స్వాధికార వర్గాలతో చేతులు కలుపుతారో, వారిని ఫ్రెంచి జాతి శత్రువులుగా పరిగణిస్తుంది. ఏయే దేశాల్లో ఫ్రెంచి రిపబ్లిక్ సైన్యాలు ప్రవేశించాయో, ఆయా ప్రజలు సమానత్వాన్ని సాధించి, స్వేచ్ఛా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని స్థాపించుకొనే వరకు, ప్రజా సార్వభౌమాధికారం ఏర్పడే వరకు, ఫ్రాన్స్ ఎట్టి ఒడంబడిక చేసుకోదు. ఆయుధ విసర్జన చేయదు." ఈ ప్రకటన ద్వారా జాతీయ కన్వెన్షన్ స్వేచ్ఛ, సమానత్వం మొదలైన విప్లవ సిద్ధాంతాలను ఐరోపా రాజ్యాలన్నింటిలోనూ ప్రచారం చేయాలని భావించింది. అంతేగాక, ఈ ప్రకటన ఐరోపా రాజులందరికి సవాల్; నియంత్రుత్వ ప్రభుత్వాలకు ఫ్రెంచి రిపబ్లిక్ స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్య జాతీయ యత్నం అనే పేరున చేసిన హెచ్చరిక, ఐరోపా రాజ్యాల్లోని మధ్య తరగతి ప్రజల్లో ఫ్రెంచి విప్లవం పట్ల సానుభూతి ఉంది. కాని, రష్యా, ఆస్ట్రియా, ప్రష్యా, స్పెయిన్, ఇంగ్లాండ్ రాజ్యాల్లో, సామాన్య ప్రజలకు

రాజరికం పట్ల ఇంకా విశ్వాసం వదల్లేదు. పదహారో లూయీ వధ ఈ దేశాల్లోని ఉన్నత వర్గాలను ఫ్రెంచి విప్లవానికి మరింత శత్రువులుగా మార్చింది. ఫ్రాన్స్‌లో కూడా లూయీ చావు అంతర్యుద్ధానికి దారి తీసింది. డ్యూమొరిజ్ కూడా తీవ్రవాదుల విధానానికి విసిగి, ఆస్ట్రియాకు వెళ్ళిపోయాడు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఫ్రెంచి రిపబ్లిక్‌ను కూలదోయడానికి, ఆస్ట్రియా ప్రష్యా, ఇంగ్లాండ్, హాలెండ్, స్పెయిన్, సార్డీనియాల మహత్తర సంకీర్ణ కూటమి ఏర్పడింది. ఈ సంకీర్ణ సైన్యాలు బెల్జియం, రైన్ ప్రాంతాన్ని ఆక్రమించుకొని, పారిస్ నగరం వైపు బయలుదేరాయి. ఫ్రాన్స్ పరాజయం తప్పదని భావించారు.

## 15.4.4 జాతీయ సైన్యం

ఈ విపత్కర పరిస్థితిని ఎదుర్కోడంలో ఫ్రెంచి రిపబ్లిక్ ఎనలేని ధైర్యసాహసాలను చూపింది. రాజరికం కన్నా సమర్థమైన, బహుముఖ ప్రజ్ఞ కల ప్రభుత్వంగా నిరూపించుకొంది. కార్నాట్ (Carnot) నాయకత్వం లో, తదితర జాకోబిన్ల సమర్థనతో, ప్రపంచ చరిత్రలోనే అద్వితీయమైన సైనిక విధానాన్ని ప్రవేశపెట్టారు. 1793 ఫిబ్రవరిలో అయిదు లక్షల నిర్బంధ సైన్యాన్ని సమాయత్తం చేశారు. ఆగస్ట్ నెల్లో 18–25 సంవత్సరాల మధ్య యువకులు సైన్యంలో చేరాలని శాసనాన్ని చేశారు. ఈ జాతీయ సైన్యం అనే నూతన ప్రక్రియను సమర్థవంతంగా రూపొందించడానికి, కార్నాట్ రాత్రింబవళ్లు శ్రమించాడు. అభ్యంతరాలను త్రోసి పుచ్చాడు. యువకులకు సైనిక శిక్షణ నిచ్చాడు. సరిహద్దులకు పంపాడు. యుద్ధ వ్యూహాలను తయారు చేసి, విశ్వాసపాత్రులచే అమలుపర్చాడు. వారిలో యుద్ధపటిమను, ఉత్సాహాన్ని పెంపొందించాడు. 1793 డిసెంబర్ నాటికి ఫ్రెంచి సైనిక దళం ఏడున్నర లక్షలు దాటింది. వీరంతా విప్లవ సిద్ధాంతాలచే ఉత్తేజం పొందిన వారు. విప్లవ విజయం కోసం ప్రాణ త్యాగానికి వెనుదీయని వారు. ఫ్రెంచి పరాజయం వల్ల ఇంతవరకు విప్లవం సాధించిన విజయాలు, దాని వల్ల తమకు కల్గిన ప్రయోజనాలు దెబ్బతినగలవని భావించిన మధ్యతరగతి ప్రజలు, ఈ సైనిక చర్యలకు మద్దతును తెల్పగా, రైతులు, పనివారు సైన్యంలో చేరి, విప్లవ నినాదాలను పలుకుతూ, విప్లవ యుద్ధ గీతాలను ఆలాపిస్తూ, ముందుకు సాగారు. ఈ నూతన సైనిక శక్తిని రూపొందించడంలో, 'కార్నాట్' ఎన్నో కొత్త ప్రయోగాలను చేశాడు. సైనిక సరఫరాలను సుగమం చేసి, నాటి పోకడలపై పర్యవేక్షణను పెట్టాడు. ఏ సైనికాధికారిపైన అనుమానం కల్గినా, వెంటనే మరణ దండన విధించాడు. సైన్యాన్ని డివిజన్లుగా విభజించాడు. ఎందరో యువ రిపబ్లికన్ సైన్యాధికారులావిర్భవించారు. "ఈ సైనిక విధానం, జాతి యావత్తూ యుద్ధంలో ఉంది" అన్న సిద్ధాంతంపై రూపకల్పన చేయబడింది. ఒకనాటి వృత్తిపరమైన అలసత్వంతో కూడిన చిన్న సైన్యం స్థానంలో, ప్రతిభను ఆధారం చేసుకున్న యువక సైనిక శక్తి రూపొందింది.

బహుశా పదహారో లూయీ ఉండివుంటే, సంకీర్ణ కూటమి బలాన్ని చూచి, లొంగిపోయేవాడు. కాని, రిపబ్లిక్ సైన్యం విదేశీ సైన్యాలను ధైర్యంగా ఎదుర్కొన్నది. దేశంనుండి పారద్రోలింది. నెదర్లాండ్స్, రైన్, సవాయ్, పిరనీస్ ప్రాంతాల్లో పురోగమించింది. నాటివరకు రక్షణ వ్యూహ రచయితగా పేరుగాంచిన కార్నాట్ విజయ సారథి గా కీర్తించబడటం జరిగింది. 1795 నాటికి సంకీర్ణ కూటమి భగ్నమైంది. స్పెయిన్ రాజు నాల్గో ఛార్లెస్ రిపబ్లిక్‌ను సమర్థించగలనని చెప్పగా, ప్రష్యా రాజు ఫ్రాన్స్‌కు 'రైన్' ప్రాంతంలో స్వేచ్ఛ నిచ్చాడు. ఫ్రెంచి సైన్యాలు హాలెండ్ రాజును తొలగించి, ఆదేశాన్ని బటేవియన్ (Batavian) రిపబ్లిక్‌గా ప్రకటించాయి. ఆస్ట్రియన్ నెదర్లాండ్స్ వారి వశమైంది. ఒక్క ఇంగ్లాడ్, ఆస్ట్రియా, సార్డీనియాలు మాత్రమే కూటమిలో మిగిలి పోయాయి.

BRAOU

ఈ బ్రహ్మాండ సైనిక విజయాల వల్ల కొంత నష్టం కూడా లేక పోలేదు. అత్యధిక ఫ్రెంచి ప్రజల్లో అసహన సైనికోన్మాదం చోటు చేసుకుంది. విప్లవానికి జాతీయ సైన్యం గర్వకారణంగా చెప్పడం జరిగింది. దానివల్ల, అన్నిపౌర కార్యకలాపాలను సైనికావసరాలకై బలిపెట్టడం జరిగింది. సైన్యం కోసం పొలాల నుండి రైతులు, కర్మాగారాల నుండి కార్మికులను తరలించడం జరిగింది. యుద్ధ ఖర్చులకై ఫ్రెంచి వ్యాపారం, పరిశ్రమలపై, మోయలేని భారాన్ని మోపడం జరిగింది. అంతేగాక, జయించిన ప్రాంతాల్లో సైన్యాలు విచ్చలవిడిగా, దోపిడీ, దౌర్జన్యాలను జరిపాయి. ఆదేశాల రాజులేకాక, సామాన్య ప్రజలు కూడా భయభ్రాంతులయ్యారు.

### 15.4.5 భీతావహ పాలన (Reign of Terror)

ఫ్రాన్స్‌లో నిర్బంధ సైనిక శిక్షణ వల్ల ఏర్పడ్డ అసంతృప్తిని ఆధారంగా చేసుకొని, మితవాద ఆందోళన కారులు రాజరిక, కాథలిక్ చర్చి అధికారాల పునరుద్ధరణకై, లావెండీలో రైతుల తిరుగుబాటును రెచ్చగొట్టారు. పారిస్ నగర కార్మికుల తీవ్రవాదాన్ని వ్యతిరేకించిన మధ్య తరగతివారు కూడా, లయాన్స్, బార్డే , మార్సే నగరాల్లో అల్లర్లను సృష్టించారు. ఈ ఆంతరంగిక సంక్షోభం వల్ల విదేశీయుద్ధ పురోగతి దెబ్బతినడమే కాక, విప్లవ సిద్ధాంతాలకే విఘాతం ఏర్పడగలదు. విదేశీ విధానంలో అవలంబించిన కఠిన విధానాన్ని కన్నా ఎక్కువ మోతాదులో, ఆంతరంగిక అలజడిని అణచడానికి జాతీయ కన్వెన్షన్ చర్యలను గైకొన్నది.

1793లో జాతీయ కన్వెన్షన్ దేశ ఉన్నత కార్యనిర్వహణాధికారాన్ని తొమ్మిది మంది సభ్యులున్న "ప్రజా రక్షణ" సంఘానికి (Commitee of Public Safety) అప్పగించింది. ఇందులో కార్నాట్, రాబస్పియర్, సెయింట్ జస్ట్ మొదలైన తీవ్రవాద జాకోబిన్ నాయకులున్నారు. వీరు రహస్యంగా రాజ్య మంత్రులను నిర్దేశించి, స్థానికాధికారులను నియమించి, దేశ పాలనను హస్తగతం చేసుకున్నారు. విదేశీ సంబంధాలు, సైన్య పర్యవేక్షణ, విప్లవానికి ప్రజల సహకారాన్ని సంపాదించడం మొదలైన విధులన్నీ, వారు చేపట్టారు. 1793-1794 మధ్య, ప్రజా రక్షణ సంఘ ఆంతరంగిక కార్యకలాప కాలాన్ని, భీతావహ పాలనగా చెప్పతగును. విప్లవ వ్యతిరేకుల గుండెల్లో తీవ్రమైన భయాందోళనలను కల్గించడం వారి విధానం. ఈ విధానాన్ని ప్రవేశపెట్టడానికి, ప్రజా రక్షణ సంఘం రెండు ఉప సంఘాలను నియమించింది. "సామాన్య భద్రతా" (Committee of General Security) సంఘానికి దేశమంతటా శాంతిభద్రతల పర్యవేక్షణ, పోలీస్ అధికారాలనివ్వడం జరిగింది. " విప్లవ విచారణా సంఘానికి' (Revolutionary Tribunal) రిపబ్లిక్ రాజ్యానికి వ్యతిరేకులైన ఎవరినైనా విచారించి, శిక్షించే అధికారాన్నివ్వడం జరిగింది. అనుమానంపై ఎవ్వరినైనా నిర్బంధించే (Law of Suspects)శాసనాన్ని చేశారు. ఎమిగ్రీలతో సంబంధం ఉన్న ప్రభువులను కూడా నిర్బంధించొచ్చు.

ఈ నియంతృత్వ అధికారాలతో, ఫ్రాన్స్ తీవ్రవాదాన్ని అనుసరించింది. ఈ భీతావహ పాలన కాలంలో, ఒక్క పారిస్ నగరంలోనే 5000 మంది 'గిలటిన్' అయ్యారు. రాణి మేరీ ఆంటోనిట్, ఫిలిప్ ఎగలైట్, మేడమ్ రోలాండ్ మొదలైన ప్రముఖులను వధించడం జరిగింది. ఈ భయానక పాలన రాష్ట్రాలకు కూడా వ్యాపించింది. విప్లవ వ్యతిరేకులను ఏరి, శిక్షించడానికి, స్థానిక న్యాయ సంఘాలు ఏర్పడ్డాయి. ఈ విప్లవ ప్రభుత్వాన్ని ఎదిరించడానికి ప్రయత్నించిన 'లయాన్స్' నగరాన్ని ధ్వంసం చేయడం జరిగింది. నాంటిస్ నగరంలో వందలాది మందిని సామూహికంగా నదిలో ముంచి చంపారు. సుమారు 15 వేలమంది



BRAOU

దుర్మరణం పాలయ్యారు. రాజరికవాదులను, మితవాదులను ఇష్టారీతిగా చంపడం, భయానక పాలనలో ఒక దురదృష్టకర సంఘటన. అదికాక, తీవ్రవాదుల్లో పెక్కు వర్గాలున్నాయి. వాటి మధ్య వైరం పెరుగుతూ వచ్చింది. ఒక వర్గం మరో వర్గాన్ని అంతమొందించే ప్రయత్నాలు చేయడం, మహా దురదృష్టకరమైన ఉదంతం. రాజుగారి ఉరిని ఆపడానికి గిరాండిస్టులు ప్రయత్నించారు. అంతేగాక, డ్యూమోరిజ్ సైన్యాన్ని వదలి, ఆస్ట్రియాకు చేరాడు: పారిస్ నగర ఆధిక్యతకు విరుద్ధంగా తిరుగుబాటు చేయడానికి, రాష్ట్రాలను కోరాడు. దీంతో, గిరాండిస్టులు మితవాదులతో చేతులు కలిపారనే అభియోగంపై, కన్వెన్షన్ నుండి '23' మంది సభ్యులను తొలగించారు. గిరాండిస్ట్‌లభిమాని 'మారట్'ను హత్య చేయడంతో, గిరాండిస్ట్ నాయకులు బ్రిసాట్, (Brissot), వెర్గ్నాడ్ (Vergnuid) మొదలైన వారిని గిలిటన్ చేశారు. ఆ తర్వాత, పారిస్ కమ్యూన్ నాయకులు మరింత ముందుకుపోయి, నగరంలోని చర్చిలన్నింటినీ మూసి వేసి, నిరీశ్వరవాదాన్ని అమలుపర్చారు. 1794 ఏప్రిల్ నెల్లో, ఈ భయానక పాలనా చర్యలకు కొంతవరకు విసుగుచెందిన డాంటన్, కొంత సమాధాన వైఖరి నవలంబించాలని కోరగా, అతడు, అతని స్నేహితుడు డెస్‌మౌలిన్స్ (Desmoulins) లను ఉరితీశారు. 'రాబస్పియర్' అధికారనికి వచ్చి, 'రూసో' కోరిన పద్ధతిలో "రిపబ్లిక్ ఆఫ్ వర్చ్యూ" (Republic of Virtue) ను స్థాపించాలని వ్యర్థ ప్రయత్నం చేశాడు. 1794 జూలై నెల్లో, జాతీయ కన్వెన్షన్ లోని మితవాద సభ్యులు, రాబస్పియర్‌ను, సెయింట్ జస్ట్‌ను, గిలటిన్‌కు పంపడంతో భయానక పాలన ముగిసింది.

ఈ భయానక పాలన పెక్కు చరిత్రకారుల విమర్శలకు గురైంది. ఈ కాలంలో జరిగిన దురంతాలు, అమాయకుల కడగండ్లు, విప్లవానికి చెడ్డపేరును తెచ్చాయి. కొందరీ పాలనను విప్లవ ముఖ్య లక్షణంగా కూడా చిత్రించారు. భయానక పాలనను వెర్రెక్కిన 'మార్షల్ లా' (Marshal Law) గా వ్యాఖ్యానించారు. మేడమ్ రోలాండ్‌ను గిలటిన్ చేసే ముందు, "స్వేచ్ఛ పేరుతో ఎన్ని అక్రమాలు జరుగుతున్నాయి" అని వాపోయింది. ఈ కాలంలో ఎన్నో దురాగతాలు, దుర్మార్గాలు జరిగాయన్న మాట వాస్తవం. అయితే, ఒక రాజకీయ , సాంఘిక సంక్షోభంలో, పురోగమనంలో, భయానక పాలన ఒక చెడు సంఘటన మాత్రమేనని, ఆ పాలన వల్లనే దేశంలో అరాచక శక్తులను అణచివేసి, విప్లవ ప్రతికూలురైన, స్వదేశీ, విదేశీ శక్తులను ఓడించడానికి వీలైందని 'హేస్' అభిప్రాయపడ్డాడు. భయానక పాలన లేకపోతే, ఈ శక్తులన్నీ కలసి, విప్లవ మౌలిక సిద్ధాంతాలను, ప్రముఖ సంస్కరణలను నాశనం చేసేవని, విప్లవ పరిరక్షణకై నాడు జరిగిన చర్యలు దుర్మార్గమైనవైనా, సమర్థనీయమని కొందరి భావన. రాబస్పియర్ మరణంతో భయానక పాలన ముగిసింది. అయితే, అప్పటికే పాలనా లక్ష్యం నెరవేరింది. ఫ్రాన్స్‌లోని విప్లవాన్ని కాపాడడం జరిగింది. భయానక పాలనాంతాన్ని 'థెర్మిడోర్ ప్రతీకార' (Thermidorian Reaction) మంటారు. దీంతో, నేషనల్ కన్వెన్షన్ తన సంస్కరణ కార్యక్రమాన్ని కొనసాగించడానికి వీలు కలిగింది. ఆ తర్వాత కూడా కొన్ని సందర్భాల్లో, మిత వాదులు, మరికొన్ని సార్లు తీవ్రవాదులు, జాతీయ కన్వెన్షన్ పనికి అవరోధాలు కల్పించాలని తిరుగుబాట్లు చేసినా, వాటిని సులభంగా అణచి వేయడం జరిగింది. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా, జాతీయ కన్వెన్షన్ పెక్కు నిర్మాణాత్మక, సృజనాత్మక సంస్కరణలను చేసి, విప్లవ సిద్ధాంతాలను మరింత రూపకల్పన చేసింది.

## 15.4.6 విప్లవ సంస్కరణలు

అంతర్గత సంక్షోభం, విదేశీ యుద్ధం మొదలైన విపత్కర పరిస్థితుల్లో కూడా, జాతీయ కన్వెన్షన్ కొన్ని ముఖ్యమైన, నిర్మాణాత్మకమైన సంస్కరణలను చేయగల్గింది. ఫ్రాన్స్‌లో నూతన పద్ధతుల, వ్యవస్థల నిర్మాణానికి, ఈ సంస్కరణలు దోహదం చేశాయి. ప్రతి సంస్కరణ వెనక, జాతీయత అనే సిద్ధాంతం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. 1793 ఆగస్ట్‌లో ప్రవేశపెట్టిన నిర్బంధ సైనిక శిక్షణ, జాతీయ సైనిక వ్యవస్థకు మూలమైంది. 'యువకులు యుద్ధం చేయాలి, వివాహితులు ఆయుధాలను తయారుచేసి, యుద్ధ సరఫరాలను చూడాలి. మహిళలు గుడారాలు, దుస్తులను తయారుచేయడమే కాక, ఆస్పత్రుల్లో పనిచేయాలి. చిన్నపిల్లలు బట్టల తయారీలో సహకరించాలి. వృద్ధులు యుద్ధ సైనికులను ప్రోత్సహిస్తూ, వారికి ధైర్యాన్ని నూరిపోయాలి. రాజు పట్ల ఏహ్య భావాన్ని, రిపబ్లిక్ ఐక్యతను ప్రోత్సహించాల"ని చెప్పడం జరిగింది. ఈ ప్రకటనలో కొంత వాగాడంబరం కనిపించినా, జాతీయతా దృష్టి స్పష్టంగా కన్పిస్తుంది.

జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడానికై, కన్వెన్షన్‌కు ముందు జాతీయ శాసన సభ, చేసిన శాసనాలను మరింత విస్తృతపర్చింది. "రిపబ్లిక్ అంతటా ఒకే రకమైన, అవిభాజ్యమైన "జాతీయ బోధనను ప్రవేశపెట్టాలని, అది ఒక ఫ్రెంచి భాషలోనే జరగాలని" ఆదేశించింది. ఉన్నత విద్యను పునర్వ్యవస్థీకరించడం జరిగింది. 1794 లో పాలిటెక్నిక్‌లు స్థాపించబడినాయి. ఇందులో, సివిల్, మిలటరీ ఇంజనీర్లకు శిక్షణ నిచ్చేవారు. 1793లో 'మ్యూజియం ఆఫ్ నాచురల్ హిస్టరీ' ని స్థాపించడం జరిగింది. శాస్త్రజ్ఞులకు పరిశోధనార్థం, విరివిగా ధన సహాయాన్ని చేశారు. పరిశ్రమలకు సంబంధించిన మ్యూజియం, కళాశాల స్థాపితమైనాయి. 1794లో మూడు వైద్య కళాశాలలను స్థాపించడం జరిగింది. ప్రతిభ నాధారంగా విద్యార్థులను చేర్చుకొనేవారు. పాత విశ్వవిద్యాలయాల స్థానంలో, 1795లో 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ (National Institute)ను స్థాపించారు. ఇందులో గణితం, భౌతిక శాస్త్రాలకు, రాజకీయ, సాంఘిక శాస్త్రాలకు, సాహిత్యం, లలిత కళలకు, మూడు ప్రత్యేక విభాగాలను కల్పించారు. అదే విధంగా, దేశం మొత్తానికి సమగ్రమైన ఒకే న్యాయ సూత్రాలను క్రోడీకరించే క్లిష్ట కార్యక్రమాన్ని చేపట్టింది. పెక్కు సాంఘిక సంస్కరణలను న్యాయ సూత్రాల్లో చేర్చారు. అప్పు చెల్లించకపోతే, జైల్లో వేసే విధానాన్ని తొలగించారు. ఫ్రెంచి వలసల్లో నీగ్రో బానిసత్వాన్ని నిషేధించడం జరిగింది. ఆస్తిలో మగవారితో బాటు, స్త్రీలకు కూడా హక్కును కల్పించడం జరిగింది. ఆస్తిని ఒక్క ప్రథమ సంతానమేకాక, బిడ్డలందరూ సమానంగా పంచుకోవాలి. వ్యాపార సంబంధంగా, దేశమంతటికి ఒకే శాసనాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా, ఒక కొత్త కొలతల, తూకాల పద్ధతిని ప్రవేశపెట్టారు. దీన్నే మెట్రిక్ పద్ధతిగా పిలుస్తారు. ఈ పద్ధతి ఫ్రాన్స్‌లో విజయవంతమైంది. ఆతర్వాత, ఐరోపా రాజ్యాలు కూడా ఈ పద్ధతిలోని సులువును, నిర్దోషిత్వాన్ని గమనించి, మెట్రిక్ విధానాన్ని అనుసరించాయి. మన దేశంలో కూడా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, మెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

## 15.4.7 మత సంస్కరణలు

మత విషయాల్లో జాతీయ కన్వెన్షన్ తీవ్రమైన ప్రయత్నాలు చేసింది. జాతీయతా సిద్ధాంతానికి మత ప్రాధాన్యతను ఆపాదిస్తూ, సాంప్రదాయ క్రైస్తవ వ్యవస్థ పట్ల తీవ్ర విముఖతను వ్యక్తం చేశారు. భీతావహ పాలనా కాలంలో మతాచార్యులను విప్లవ వ్యతిరేకులుగా ప్రకటించి, క్రైస్తవ మతానికి విరుద్ధంగా పెక్కు



BRAOU

శాసనాలను చేశారు. కొత్త విప్లవ క్యాలెండర్ ను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ఏడాదికి 12 నెలలు; ప్రతి నెలకు మూడు వారాలు; వారానికి పది రోజులు ; ఆదివారం సెలవు దినం కాదు; వారంలో పదో రోజు సెలవు దినం; 360 రోజుల తర్వాత మిగిలిన అయిదు రోజులు జాతీయ శెలవు దినాలు. నెలల పేర్లను మార్చారు. కొత్త కాలెండర్ తేదీలు రిపబ్లిక్ స్థాపనైన 1792 సెప్టెంబర్ 22 నుండి మొదలవుతాయి. అంతేగాక, కన్వెన్షన్ చర్చిలను "హేతువాద దేవాలయాలుగా" (Temples of Reason) మార్చింది. ఎందరో కాథలిక్ బిషప్పులు, తదితర మతాచార్యులు మతాన్ని వదులుకుంటున్నట్లు ప్రకటించారు. పారిస్ కమ్యూన్ నాయకత్వంలో నిరీశ్వరవాదం వ్యాప్తమై, నాటర్ డామ్ చర్చిలో హేతువాద దేవాలయానికి శంఖుస్థాపన జరిగింది. మతం పూర్తిగా వ్యక్తిగతమైన విషయమని, ప్రభుత్వానికి దాంతో ఎట్టి సంబంధముండరాదని ప్రకటించారు. ఏ ప్రభుత్వం కూడా మత సంస్థలను స్థాపించడం గాని, నిర్వహించడం గాని చేయరాదు. అయితే, 1795 నాటికి కొంత మార్పు వచ్చింది. మతాచార్యులపై ఆంక్షలను, శాసనాలను కొనసాగిస్తూనే, అన్ని మతాల పట్ల సహనాన్ని చూపగలమని ప్రకటించారు. క్రైస్తవ ప్రార్థనలకై వారి దేవాలయాలను వారికి తిరిగి ఇచ్చి వేయడం జరిగింది.

### 15.4.8 సామ్యవాద సంస్కరణలు

జాకోబిన్లు అధికారంలో ఉన్న కాలంలో, పెక్కు తీవ్రవాద సంస్కరణలను చేపట్టడం జరిగింది. ఆర్థిక రంగంలో వీటిని సామ్యవాద సంస్కరణలుగా చెప్పొచ్చు. ఎమిగ్రీల ఆస్తులు ప్రభుత్వ పరమై, వాటిని దళిత వర్గాల శ్రేయస్సుకు వినియోగించారు. పెద్దపెద్ద భూస్వాముల ఎస్టేట్ లను చిన్న చిన్న భాగాలుగా విభజించి, సులభ వాయిదా పద్ధతిలో అమ్మకానికి పెట్టారు. ఇంతకు ముందు ఎవ్వరి ఆస్తులు తీసుకొన్నా, ప్రతిఫలమివ్వాలనే శాసనం ఉండేది. దాన్ని కూడా రద్దు చేశారు. "ఇన్నాళ్లు భాగ్యవంతులు పేదల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేశారు. ఇప్పుడు వారికి శిక్ష విధించవలసిందే" అని, మారట్ ఈ శాసనాన్ని సమర్థించాడు.

ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడానికి నిర్బంధ రుణ సేకరణ చేశారు. పెద్ద ఆస్తులపై పన్నులుగా వీటిని భావించొచ్చు. ధరలు పెరగకుండా ఎన్నో శాసనాలను చేశారు. ప్రతి వస్తువుకు గరిష్ఠ ధరను నిర్ణయించడం, ధాన్యం, తదితర నిత్యావసర వస్తువుల ధరలను నిర్ణయించడమే గాక, జీతాల పైన కూడా నియంత్రణను విధించి, వినిమయ ధరలు పెరగకుండా జాగ్రత్తపడ్డారు. అందరూ సమానమేనన్న సిద్ధాంతానికి పరిపూర్ణతను కల్పిస్తూ, ప్రజలందరూ పౌరులేనని ప్రకటించారు. మేరీ ఆంటోనిట్ మరణకాండకు అయిదు ఫ్రాంకులను మాత్రమే ఖర్చుపెట్టినట్లు, అధికార పత్రాల్లో చూపారు. ఇంతకు ముందున్న ఆడంబర దుస్తుల స్థానంలో, అందరూ మామూలు వస్త్రధారణను మొదలుపెట్టారు. అయితే, జాకోబిన్ల ఆధిక్యత తొలగిన తర్వాత, జాతీయ కన్వెన్షన్ పై పారిస్ ప్రజల అదుపు, అధికారం క్షీణించాయి. ఆ తర్వాత వచ్చిన 'థెర్మిడోర్ ప్రతీకార' దినాల్లో, తిరిగి మధ్యతరగతి వారు తమకు సానుకూలమైన శాసనాలను చేశారు. గరిష్ట ధరల శాసనం, అనుమానంపై నిర్బంధించే శాసనాలను రద్దు చేశారు. విప్లవ విచారణా సంఘం రద్దైంది. అయితే, చివర వరకు కన్వెన్షన్ రిపబ్లిక్ సిద్ధాంతాలకు మాత్రం కట్టుబడి వుంది.

### 15.4.9 నూతన రాజ్యాంగం

నూతన రాజ్యాంగ రచనకై జాతీయ కన్వెన్షన్ ఏర్పాటైన విషయం మీకు తెలుసు. 1793లో ఈ

రాజ్యాంగ రచన పూర్తైంది. కాని, విదేశీ యుద్ధం వల్ల, భయానక పాలన వల్ల, దానిని అమలు పర్చలేకపోయారు. ఆ రాజ్యాంగం పూర్తిగా రూసో సిద్ధాంతాలచే ప్రేరితమైన గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థలను పొందుపర్చింది. 1795 నాటికి తీవ్రవాదం తగ్గిపోయి, థెర్మిడోర్ రియాక్షన్ రావడం మనం చూశాం. ఫలితంగా, రాజ్యాంగంలో మార్పులు జరిగాయి. ఆ నూతన రాజ్యాంగాన్ని 1795లో అమలు చేశారు. దీనిని మూడో సంవత్సర రాజ్యాంగ (Constitution of the Year III) మంటారు. అంటే, కాలెండర్‌ను రిపబ్లిక్ అయిన 1792 నుండి మాత్రమే లెక్కలోకి తీసుకున్నారు.

ఈ నూతన రాజ్యాంగం ప్రకారం శాసనాధికారాలను రెండు సభల కివ్వడం జరిగింది. దిగువ సభలో 500 మంది సభ్యులుంటారు. వీరు శాసనాలను ప్రతిపాదిస్తారు. ఎగువ సభలో 250 మంది సభ్యులుంటారు. వీరు శాసనాలను పరిశీలించి, చట్టబద్ధం చేస్తారు. రెండు సభలకు సభ్యులను పరోక్షంగా ఎన్నుకోవడమే గాక, ఓటింగ్ హక్కును కూడా పరిమితం చేయడం జరిగింది. దీన్నిబట్టి, తిరిగి విప్లవం మధ్యతరగతి వర్గ ప్రయోజనాలకు పరిమితమైనట్లు కన్పిస్తుంది. కార్యనిర్వాహక అధికారాన్ని అయిదుగురు సభ్యులుండే డైరక్టరీకి అప్పగించారు. వీరిని శాసన సభ ఎన్నుకుంటారు. డైరక్టరీ మంత్రులను నియమించడం, శాసనాల అమలును పర్యవేక్షించడాన్ని చేస్తారు.

## 15.5 రిపబ్లిక్ వైఫల్యం

1792లో స్థాపితమైన ఫ్రెంచి రిపబ్లిక్‌కు ,1795లో రాజ్యాంగబద్ధతను కల్పించడం జరిగింది. ఈ రిపబ్లిక్‌ను పేరుకు 1804 వరకు కొనసాగించినా, వాస్తవానికి నాలుగేళ్లపాటు మాత్రమే కొనసాగింది. డైరక్టరీ అధికారం 1799 నాటికి ముగిసింది. ఈ డైరక్టరీ వైఫల్యానికి రెండు ముఖ్య కారణాలున్నాయి. డైరక్టరీ సమర్ధవంతమైన ప్రభుత్వాన్ని అందించడంలో పూర్తిగా విఫలం కాగా, మరో వైపున సైనిక తత్వం ప్రబలి, విజయాలను సాధించిన సైనిక నాయకుడు ఆ ప్రజలకు ఆరాధ్య వ్యక్తిగా ఎదిగాడు.

ఆరు సంవత్సరాల పాటు విప్లవ తీవ్రవాదం ప్రబలిన ఫ్రాన్స్ దేశంలో ఆ విప్లవం పటిష్టం కావాలంటే, సమర్థమైన, సమగ్రమైన, వివేకవంతమైన నాయకత్వం కావాలి. కాని, దురదృష్టవశాత్తు డైరక్టరీ సభ్యుల్లో అట్టి సమర్ధత, నిజాయితీ, పట్టుదల లోపించింది. పైగా వారు స్వార్ధపరులు. రాజ్య సంక్షేమం బదులు స్వలాభాన్ని ఆశించే వారి పాలనా కాలంలో, ప్రభుత్వంలో కుట్రలు, దగాలు, చోటు చేసుకున్నాయి, కొత్త శాసన సభలకు ఎన్నికైన సభ్యుల్లో రాజరికవాదులు, మితవాదులు గణనీయంగా ఉన్నారు. వారు రిపబ్లిక్ రాజ్యాంగాన్ని కూలదోయడానికి సిద్ధంగా వున్నారు. మరో వైపున తీవ్రవాదులు విప్లవం కేవలం మధ్యతరగతి వారి ప్రయోజనాలనే పరిరక్షించిందని, కార్మిక వర్గ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం జరిగిందని భావించి, సంపదనంతా సమాజపరం చేయాలని తిరుగుబాటును లేవదీశారు. ఈ తిరుగుబాటు నాయకుడు బాఫుట్ (Bafeut). 1797లో అతనిని ఉరి తీశారు.

### 15.5.2 భిన్న వర్గాలు

ఈ రీతిగా రిపబ్లిక్ మితవాదుల నుండి, తీవ్రవాదుల నుండి సవాళ్లను ఎదుర్కొనాల్సి వచ్చింది. దీనికి తోడు, ఆర్థిక పరిస్థితి గడ్డుగా మారింది. ఎక్కడ చూచినా అవినీతి, లంచగొండితనం, డైరక్టరీ సభ్యులు దుబారా ఖర్చులను చేయడం, విలాసవంతంగా గడపడం, పైగా ఆస్తులను సంపాదించడంలో పోటీ పడ్డారు. పైగా, జాతీయ సైన్యం పెద్ద ఆర్థిక భారంగా మారింది. పది లక్షల మందిని రాజ్యం పోషించాలి. ఇంతకు ముందు విడుదల చేసిన "ఎసిగ్నొట్లు" విలువ పూర్తిగా పడిపోయి, కొనుగోలు శక్తిని కోల్పోయింది. 1797లో పాక్షిక దివాలా ప్రకటితమైంది. అప్పులపై వడ్డీలను చెల్లించలేమని, 'ఎసిగ్నొట్ల'ను రద్దు చేస్తున్నామని ప్రకటించారు.

అంటే, విప్లవానికి ముందు రాజరికం ఎలాంటి ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నదో, అట్టి స్థితే డైరక్టరీ. అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమై, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది.

అయితే, విదేశీ యుద్ధాల్లో ఫ్రెంచి సైన్యం విజయ పరంపరలను కొనసాగించింది. డైరెక్టరీ అధికారానికి వచ్చేసరికి, ఫ్రాన్స్‌కు విరుద్ధంగా ఆస్ట్రియా, ఇంగ్లాండ్, సార్డీయాలు యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాయి. ఫ్రెంచి సైన్యాన్ని రైన్ మీదుగా దక్షిణ జర్మనీలో, ఆతర్వాత ఆస్ట్రియా పై దండయాత్ర చేయడానికి పంపాలని, వ్యూహాన్ని పన్ని, పేరెన్నికగన్న సైన్యాధిపతులను ఆ పనికై నియమించారు. మరో వైపున, పశ్చిమ ఇటలీలోని ఆల్ప్స్ మీదుగా మరో సైనిక దళాన్ని పంపాలని తలంచి, ఈ ఇటలీ సైనిక దళాధిపత్యాన్ని యువకుడైన నెపోలియన్‌కు అప్పగించారు. 1796లో పేరెన్నికగన్న సైనికాధిపతులు దక్షిణ జర్మనీలో పురోగమించలేక, సైనిక వైఫల్యాలను పొందగా, ఇటలీలో నెపోలియన్ బ్రహ్మాండమైన విజయాలను సాధించి, హీరోగా మారాడు. అతని ఇటలీ దండయాత్ర ఒక సాహస కార్యంగా మారింది. డైరక్టరీ అసమర్థపాలనతో విసిగిన ప్రజలకు, నెపోలియన్ ఫ్రాన్స్ దేశ రక్షకుడుగా (Man of the Home) కన్పించాడు. ఫ్రెంచి ప్రజల ఉద్రేక, ఉద్వేగ భావాలను బాగా అర్థం చేసుకున్న నెపోలియన్, అవకాశాన్ని వృధా చేయక, డైరక్టరీని తొలగించి, అధికార అందలాన్ని అంచెలంచెలుగా అధిరోహించాడు. ఆసక్తికర విషయాలన్నింటినీ వచ్చే భాగంలో వివరంగా చదువుకోగలం.

## 15.6 . సంగ్రహంగా

సంగ్రహంగా, ఈ భాగంలో రాజ్యాంగబద్ధ రాజరిక వైఫల్యానికి దారి తీసిన పరిస్థితులు, ఆ కాలంలో ఏర్పడ్డ భిన్నమైన వర్గాలు, వారి సిద్ధాంతాలను చెప్పడం జరిగింది. రాజరిక వైఫల్యం రిపబ్లిక్ అవతరణకు దారి తీయగా, జాతీయ కన్వెన్షన్ ఏర్పడి, తీవ్రవాద ప్రచారంలో గుణాత్మక సంస్కరణలను చేయడం జరిగింది.

## 15.7. పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి

1. ఫ్రాన్స్‌లో రాజ్యాంగబద్ధ రాజరిక వైఫల్య కారణాలను విశ్లేషించండి
2. జాతీయ కన్వెన్షన్ సంస్కరణలను తులనాత్మకంగా పరిశీలించండి
3. భీతావహ పాలనలో జరిగిన సంఘటనలను వివరించి, వాటి చారిత్రక ప్రాధాన్యతను వివరించండి

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. ఫ్రెంచి విప్లవ గమనంపై, విదేశీ యుద్ధ ప్రభావమెలా పడింది?
2. ఫ్రెంచి రిపబ్లిక్ ఏర్పాటు ప్రాధాన్యతను తెల్పండి
4. ఫ్రెంచి రిపబ్లిక్ ఎందుకు వైఫల్యతను పొందింది?

## 15.8 . ఉపయుక్త గ్రంథాలు


H.A.L Fisher : **History of Europe**

C.J.H Hayes : **Modern Europe upto 1870**

C.D Hazen : **History of Modern Europe Since 1789**

Lord Acton : **Lectures on the French Revolution**

Gardiner B.M : **The French Revolution**

V.D. Mahajan : **History of Modern Europe since 1789**

పి. శ్రీరామశర్మ : ఫ్రెంచి విప్లవం, తెలుగు అకాడమి ప్రచురణ


రచయిత : శ్రీ ఎ.వి. కోటిరెడ్డి



BRAOU

# భాగం –16 : నెపోలియన్ బోనపార్ట్ : విజృంభణ, పతనం

విషయక్రమం


16.0 లక్ష్యాలు

16.1 పరిచయం

16.2 అధికార హస్తగతం

16.3 నెపోలియన్ వ్యక్తిత్వం

16.4 మొదటి కాన్సల్‌గా నెపోలియన్

16.4.1 నెపోలియన్ సంస్కరణలు

16.4.2 కేంద్రీకృత ప్రభుత్వ స్థాపన

16.4.3 ఆర్థిక సంస్కరణలు

16.4.4 జాతీయ విద్యావిధానం

16.4.5 న్యాయ స్మృతులు

16.4.6 చర్చితో ఒప్పందం

16.4.7 ప్రజాహిత కార్యాలు

16.5 చక్రవర్తి నెపోలియన్

16.5.1 తృతీయ సంకీర్ణ రాజ్యాల కూటమి ఏర్పాటు

16.5.2 నెపోలియన్ విజయపరంపరలు

16.5.3 ఆస్ట్రియా

16.5.4 ప్రష్యా

16.5.5 రష్యా

16.6 భూఖండ విధానం

16.6.2 జాతీయ తిరుగుబాట్లు : స్పెయిన్

16.6.2.1 ఆస్ట్రియా

16.6.2.2 రష్యాపై దండయాత్ర

16.6.2.3 నెపోలియన్ ఓటమి

16.7 నెపోలియన్ ఆఖరి రోజులు

16.8 నెపోలియన్ ఘనత

16.9 సంగ్రహంగా

16.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

16.11 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 16.0 లక్ష్యాలు

ఈ భాగం ద్వారా రిపబ్లిక్ వైఫల్యాన్ని ఆధారం చేసుకొని, నెపోలియన్ తన తెలివితేటలతో, ప్రజ్ఞ ప్రాభవాలతో ఫ్రాన్స్ అధికారాన్ని హస్తగతం చేసుకొని, ఆ తరవాత చక్రవర్తి గా ప్రకటించుకొని, రాజరికాన్ని పునరుద్ధరించడాన్ని అవగాహన చేసుకోగలగాలి.

నెపోలియన్ తన ప్రథమ పరిపాలనా కాలంలో కాన్సల్ గా చేసిన నిర్మాణాత్మక సంస్కరణలు, చక్రవర్తిగా నెరపిన యుద్ధాల గురించి తెలుసుకోగలగాలి, ఈ పాఠ్యభాగంలో నెపోలియన్ ఒక సంస్కర్తగా, విజేతగా భాసిల్లగలగడాన్ని గ్రహించగలగాలి.

అయితే, ఇదే భాగంలో నెపోలియన్ అత్యున్నత స్థానానికి ఎదిగి, పెక్కు కారణాల వల్ల పతనం చెందడాన్ని కూడా, గ్రహించగల్గాలి. పతనానికి ముఖ్యమైన మూడు కారణాలను – భూఖండ విధానం, రష్యా దండయాత్ర, జాతీయ తిరుగుబాట్లను ముఖ్యంగా మీరు గమనించి, విశ్లేషించ గల్గాలి.

## 16.1 : పరిచయం

ప్రపంచ చరిత్రలో యోధాగ్రేసరులైన విజేతలెందరో ఉన్నారు. పరిపాలనా సామర్థ్యం కల చక్రవర్తులున్నారు. ఈ రెండు సామర్థ్యాలు సమ్మేళన చెందడం అరుదు. అట్టి పాలకుల్లో నెపోలియన్ అగ్రగణ్యుడు. సంస్కర్తగా, సైనికాధికారిగా పరిపాలనాదక్షునిగా, విజేతగా, ఐరోపాఖండ చరిత్రను దాదాపు రెండు దశాబ్దాలు శాసించిన నెపోలియన్, తాను 'విప్లవ సుతునిగా" (Son of the Revolution) చెప్పుకున్నాడు.

నెపోలియన్ బోనపార్ట్ కార్సికా (Corsica) అనే ఇటలీ ద్వీపంలో 1769 ఆగస్ట్ 15 వ తేదీన జన్మించాడు. ఈ ద్వీపాన్ని ఫ్రాన్స్ జెనీవా నుండి కొనుగోలు చేసింది. "నా దేశం చనిపోతున్న రోజుల్లో నేను జన్మించాను" (I was born when my country was dying) అని నెపోలియన్ రాశాడు. ఉత్తమ విద్యకై ఎన్నికై, నెపోలియన్ బ్రీయన్ (Brienne), పారిస్ నగరాల్లో సైనిక విద్య నభ్యసించాడు, తన ద్వీప స్వాతంత్ర్యోద్యమానికి నాయకుడు కావాలని ఆకాంక్షించిన నెపోలియన్‌కు, ఫ్రెంచి విప్లవ ఫలితంగా తన ప్రతిభా విశేషాలను వ్యక్తం చేసుకోవడానికి మరింత విస్తృతమైన పరిధి ఏర్పడింది. 17 ఏట సైన్యంలో అధికారిగా చేరిన నెపోలియన్, విప్లవ కాలంలో జాకోబిన్లను కొంత కాలం సమర్థించాడు. జాతీయ కన్వెన్షన్ తన సంస్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కాలంలో, 1795లో పారిస్ వాసులు తీవ్రవాదుల నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. ఒక సైనిక పటాలం ఆ తిరుగుబాటు నణచివేసింది. ఆ పటాలానికి నాయకత్వం వహించిన నెపోలియన్, ప్రప్రథమంగా తన సామర్థ్యాన్ని చూపాడు. 1796లో జోసఫిన్‌ను వివాహం చేసుకొన్నాడు.

## 16.2. అధికార హస్తగతం

డైరక్టరీ పాలన పట్ల ప్రజలు విసుగుచెందారని, ఆంతరంగికంగా సంక్షోభం ఏర్పడిందని మనం చదివున్నాం. కాని, విదేశీ దండయాత్రలో డైరక్టరీ ఘన విజయాలను సాధిస్తూ వచ్చింది. నాటికి ఫ్రాన్స్, ఆస్ట్రియా, ఇంగ్లాండ్, సార్డీనియాలు యుద్ధంలో ఉన్నాయి. ఆస్ట్రియాను ఓడించడానికి 'రైన్' ప్రాంతం



BRAOU

నుండి ఒక బృహత్తర సైన్యాన్ని పేరుపడ్డ సైనికాధికారుల నేతృత్వంలో పంపడం జరిగింది. ఉత్తర ఇటలీ గుండా నెపోలియన్ నాయకత్వంలో మరొక సైనిక దళం ఆస్ట్రియాపై దండయాత్రకు పూనుకుంది. పెద్ద పెద్ద సైనికాధికారులు ఎట్టి పురోగమనాన్ని సాధించలేకపోయారు. కాని, నెపోలియన్ 'ఆల్ప్సను' దాటి, సార్డీనియాను ఓడించి, ఆస్ట్రియా సైనిక విభాగాలను ఏడింటిని మట్టి కరిపించాడు, ఆస్ట్రియా సంధికై వేడుకున్నది. ఈ ఇటాలియన్ దండయాత్రలో నెపోలియన్ గౌరవ ప్రతిష్టలు పెరిగాయి. ఫ్రెంచి ప్రజలు అతన్ని కీర్తించారు. నెపోలియన్‌ను "లిటిల్ కార్పొరల్ (Little Corporal) అని ప్రేమగా పిలువడం జరిగింది. ఇటలీ దండయాత్ర సందర్భంగా నెపోలియన్ పెక్కు సందర్భాల్లో స్వతంత్రంగా వ్యవహరించాడు. డైరక్టరీ ఆదేశాలను ఖాతర్ చేయలేదు. ఇటలీలో అతడు రాజకీయాలను కూడ నడిపాడు. కొన్ని రాజ్యాలను అంతం చేశాడు. మరికొన్నింటిని సృష్టించాడు. నాటికి ఇటలీ ఐక్య రాజ్యం కాదు. జెనీవా రిపబ్లిక్ పేరు మార్చి, వారికి ఫ్రెంచి రాజ్యాంగ పద్ధతిలో కొత్త రాజ్యాంగాన్నిచ్చాడు. పార్మా (Parma), మొదీనా (Modena) పాలకుల నుండేగాక, పోప్ నుండి కూడా విధేయతను పొందాడు. వెనీస్ రిపబ్లిక్‌ను జయించాడు. 1797లో ఆస్ట్రియాతో కాంపో ఫోర్మియా (Campo Formia) సంధిని చేసుకొన్నాడు. ఈ సంధి ఫలితంగా, ఫ్రాన్స్, బెల్జియం నెదర్లాండ్స్‌ను ఆక్రమించుకోవడాన్ని, ఆస్ట్రియా అంగీకరించింది. రైన్ ప్రాంతంలో కొంత భాగాన్ని ఆస్ట్రియా ఫ్రాన్స్ కిచ్చింది. ఇటలీ పై ఆస్ట్రియా ఆధిపత్యం తొలగిపోయి, రైన్ ప్రాంతంలో ఆధిక్యత ఏర్పడింది. మొదటి సంకీర్ణ కూటమి చావు దెబ్బతిన్నది.

నెపోలియన్ ఇటలీని ఓడించడమేకాక, ఆదేశ సంపదను, కళాఖండాలను దోచుకున్నాడు. పోప్ 20 మిలియన్ల ఫ్రాంకులను చెల్లించాడు.

ఫ్రెంచి రాజులు వంద సంవత్సరాలుగా ఆస్ట్రియాను ఓడించడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తే, నెపోలియన్ ఆ కార్యక్రమాన్ని కొద్ది కాలంలో సాధించి, ఫ్రెంచి ప్రజల చేత కీర్తింపబడటం జరిగింది. డైరక్టరీ నెపోలియన్ పలుకుబడిని చూచి, అసూయ పడింది. అంతకు మించి భయపడింది. ఫలితంగా, అతనిని ఇంగ్లాండ్, ఇండియాల మధ్య రాకపోకలకు ప్రతిష్టంభనను కల్పించమని, ఈజిప్ట్‌కు పంపింది. ఇక్కడ నెపోలియన్ పెద్ద విజయాలను సాధించలేకపోయినా, ఫ్రెంచి సైనిక విజయాలను గూర్చి అతిశయోక్తులతో నివేదికలను పంపేవాడు. దీంతో, ఫ్రాన్స్‌లో అతని పట్ల గౌరవప్రపత్తులు పెరిగాయి.

ఫ్రెంచి రిపబ్లిక్ చుట్టూ చిన్నచిన్న రిపబ్లిక్‌లు ఏర్పడ్డాయి. హాలెండ్ కూడా రిపబ్లిక్‌గా మారింది. వీటన్నింటికి ఫ్రాన్స్ మద్దతు నిచ్చింది. ఫ్రెంచి ప్రాబల్యానికి వెరచిన ఇంగ్లాండ్, ఆస్ట్రియా, రష్యాలను కలుపుకొని, రెండో సంకీర్ణ కూటమిగా ఏర్పడ్డాయి. ఈ కూటమి పెక్కు విజయాలను సాధించింది. ఫ్రాన్స్ మద్దతు నిచ్చిన రిపబ్లిక్ అన్నీ కూలిపోయాయి. ఫ్రాన్స్ పరాభవాన్ని పొందింది. ఈ తరుణంలో నెపోలియన్ ఫ్రాన్స్‌లో ప్రవేశించాడు. దేశాన్ని, తమ గౌరవాన్ని ఒక్క నెపోలియన్ మాత్రమే రక్షించగలడని ఫ్రెంచి ప్రజలు భావించారు. నెపోలియన్‌కు ప్రతిచోట బ్రహ్మాండమైన స్వాగత మివ్వడం జరిగింది. ప్రజాభిప్రాయాన్ని అంచనా వేయడంలో దిట్టైన నెపోలియన్, అబె సయీస్ (Abbe Sieyes) సాయంతో, రెండు శాసన సభలను , డైరక్టర్ల నివాసాలను , విధేయులైన సైనిక దళాలతో చుట్టుముట్టాడు. బలప్రయోగంతోనాటి ప్రభుత్వాన్ని రద్దు చేసి, తనను సర్వసైన్యాధ్యక్షునిగా ప్రకటించుకున్నాడు. నూతన రాజ్యాంగాన్ని ప్రకటించాడు. ఈ రాజ్యాంగం ప్రకారం సర్వాధికారాలు మొదటి కన్సల్ (First Consul) కు చెందుతాయి. మిగతా ఇద్దరు కన్సల్‌లు, శాసన సభలు, అతని అధికారానికి లోబడి పనిచేస్తాయి. ప్రజలు

ఈ రాజ్యాంగాన్ని ఆమోదించారు. నెపోలియన్ మొదటి కన్సల్‌గా ఎన్నుకోబడ్డాడు. అధికారాలన్నీ అతని చేతిలో కేంద్రీకృతమయ్యాయి. ఈ విధంగా ఫ్రెంచి విప్లవం ప్రారంభమైన ఒక దశాబ్దానికే, ప్రజా ప్రభుత్వం సైనిక నియంతృత్వానికి దాసోహమన్నది.

## 16.3 : నెపోలియన్ వ్యక్తిత్వం

నెపోలియన్ పాలనా కాలాన్ని రెండు భాగాలుగా విభజింపదగును. క్రీ.శ. 1799-1804 వరకు మొదటి కన్సల్‌గా, 1804-1815 వరకు ఫ్రెంచి చక్రవర్తిగా, నెపోలియన్ ఎనలేని అధికారాన్ని చెలాయించాడు. ఫ్రాన్స్ దేశాన్నే కాక, ఐరోపా ఖండాన్ని నిర్దేశించాడు. సంక్షోభంలో ముంచాడు. ఫ్రాన్స్ దేశానికి ప్రహసునిగా వచ్చిన నెపోలియన్ అధికార ప్రాభవానికి, నాటి పరిస్థితులే కాక, అతని వ్యక్తిగత సమర్థత తోడైంది. నెపోలియన్‌కు తన సమర్థతపై అపారమైన విశ్వాసముండేది. స్వార్థం, అత్యాశ, అహంకారం, ఆత్మ స్తుతి కలపోసిన అతని వ్యక్తిత్వం విలక్షణమైంది. సర్వకాల సర్వావస్థలందు విశ్వవిఖ్యాతి పొందే ప్రయత్నాలను గూర్చి యోచించలేదు. తన ప్రపంచ ప్రఖ్యాతి విధి లిఖితమని, తాను యుగపురుషుడనని కొన్ని సందర్భాల్లో మూఢంగా నమ్మేవాడు. నాటి ఫ్రాన్స్ దేశ పరిస్థితి ఈ నమ్మకానికి బలమిచ్చింది. ప్రపంచ సైనిక తత్వానికి అతడు వారసుడయ్యాడు. ఆనాడున్న పరిస్థితులను తన అధికార ప్రాభవానికి అనుగుణంగా తీర్చిదిద్దుకున్నాడు. సైనిక దళాలకతడు ఆరాధ్యుడు. ప్రతి సైనికుని పేరుతో గుర్తుంచుకొని, వారిని పలకరించి, ప్రోత్సహించి, వారితో కలిసిపోయి, వారి గౌరవప్రపత్తులనే గాక, విశ్వాసాన్ని చూరగొన్నాడు. నిద్రలో కూడా తన సైనిక దళాల పేర్లను చెప్పేడివాడు. అంతేగాక, నెపోలియన్ తాను కోరినదాన్ని సాధించడానికి ఎట్టి ప్రయత్నాలకైనా వెనుదీయడు. పెద్దగా సిద్ధాంతాలను పట్టించుకోడు. పాప భీతి లేదు. "కపటాలాడడం, మోసం చేయడం అనే క్లిష్టమైన కళలలో నెపోలియన్ అద్వితీయుడని" ఫిషర్ (Fisher) వ్యాఖ్యానించాడు. ("In the difficult arts of lying and deception, Napoleon is unsurpassed".)

## 16.4 : మొదటి కన్సల్‌గా నెపోలియన్ (First Consulate) 1799-1804

విదేశీ దండయాత్ర భయానికి వెరచిన ఫ్రెంచి ప్రజలు నెపోలియన్ నూతన రాజ్యాంగాన్ని, అధికార హస్తగతాన్ని సులభంగా అంగీకరించారు. రెండో సంకీర్ణ కూటమి రాజ్యాలు కేంపో ఫార్మియా సంధిలో ఫ్రాన్స్ పొందిన లాభాలను తుడిచిపెట్టి, ఇటలీ, రైన్ ప్రాంతంలో తిరిగి తమ ఆధిక్యతను చాటుకున్నారు. ఈ పరిస్థితుల్లో మొదటి కాన్సల్‌గా అధికారానికి వచ్చిన నెపోలియన్, తన తెలివితేటలను, రాజకీయ చతురతను ప్రయోగించి, రష్యా చక్రవర్తి పాల్‌ను ఈ కూటమి నుండి నిష్క్రమింప చేశాడు. నెపోలియన్ పొగడ్తలకు ఉబ్బిపోయిన మతి స్థిమితం లేని పాల్, సంకీర్ణ కూటమి నుండి వైదొలగడమే కాకుండా, రష్యా, ప్రష్యా, స్వీడన్, డెన్మార్క్‌లతో కలిసి, ఇంగ్లాండ్‌కు విరుద్ధంగా "సాయుధ తటస్థ విధానాన్ని (Armed neutrality) ప్రకటించారు. ఇదే కాలంలో నెపోలియన్ ఆస్ట్రియాపై దాడికి సర్వసన్నద్ధమై, రెండో ఇటాలియన్ దండయాత్రను ప్రారంభించాడు. ఆల్ప్స్ దాటి, పో ప్రాంతాన్ని ఆక్రమించుకొని, 1800 జూన్‌లో మారెంగో (Marengo) యుద్ధంలో ఆస్ట్రియాను మరోసారి చిత్తుగా ఓడించాడు. మరో ఫ్రెంచి సైన్యం దక్షిణ జర్మనీలో ఆస్ట్రియాపై విజయాన్ని సాధించింది. గత్యంతరం లేని ఆస్ట్రియా శాంతి సంధికై వేడుకొని, 'లునెవిల్లీ, (Lunevilli) సంధిలో రెండో సంకీర్ణ కూటమి నుండి వైదొలగడానికి, ఉత్తర ఇటలీ ఫ్రాన్స్ ఆధిక్యతను గుర్తించడానికి అంగీకరించింది. దీంతో, కూటమిలో ఒక్క ఇంగ్లాండ్ మాత్రమే



BRAOU

మిగిలిపోయింది. 1793 నుండి ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల మధ్య పోరాటం సాగుతూనే ఉంది. లార్డ్ నెల్సన్ (Lord Nelson) నాయకత్వంలో, ఫ్రాన్స్ తన సముద్రాధిపత్యాన్ని కొనసాగించింది. అయితే, ఐరోపా భాగంలో ఫ్రాన్స్‌ను ఓడించడం సాధ్యం కాదనే విషయాన్ని ఇంగ్లాండు గుర్తించింది. ఫలితంగా, ఈ రెండు దేశాలు 'అమియన్స్' (Treaty of Amienes) అనే తాత్కాలిక యుద్ధ విరమణ సంధిని చేసుకొన్నాయి. ఇంగ్లాండ్ తాను జయించిన వలసల్లో, సిలోన్, ట్రినిడాడ్, మినహా, మిగతా వాటిని తిరిగి ఇచ్చివేయడానికి అంగీకరించింది.

ఈ రీతిగా నెపోలియన్ మొదటి కన్సల్‌గా ఫ్రాన్స్‌కు అనుకూలమైన ఒడంబడికలను సాధించాడు. రెండో సంకీర్ణ కూటమి భగ్నమయింది. ఫ్రాన్స్, సరిహద్దులు రైన్ ప్రాంతం వరకు విస్తరించాయి. స్పెయిన్, హాలెండ్ తదితర ఇటలీ రిపబ్లిక్‌లు అతని చెప్పుచేతుల్లో ఉన్నాయి. శాంతియుత వాతావరణంలో నెపోలియన్ ఫ్రాన్స్ దేశంలో ఎక్కువ సంస్కరణలు చేయడానికి, రాజ్య వ్యవస్థలను పునర్నిర్మించడానికి అవకాశం కల్గింది. "ఫ్రెంచి వ్యవస్థల అభివృద్ధిలో మొదటి కన్సల్‌గా నెపోలియన్ చేసిన కృషి ప్రముఖమైంది. పది కాలాలపాటు నిల్చిపోయింది." అని హేస్ వ్యాఖ్యానించాడు. ("The Consulate was the period of Bonaparte's chief and most enduring contributions in the development of French institutions")

## 16.4.1 : నెపోలియన్ సంస్కరణలు

నెపోలియన్ ప్రవేశపెట్టిన సంస్కరణలను క్రింది విధంగా చర్చించొచ్చు.

## 16.4.2 కేంద్రీకృత ప్రభుత్వ స్థాపన

ఫ్రాన్స్‌లో స్థానిక పాలన యావత్తు నెపోలియన్ కాలంలో కేంద్రీకృతమైంది. 1800లో చేసిన శాసనం ప్రకారం స్థానిక సంస్థలన్నీ మొదటి కన్సల్ అధికారం క్రిందికి తీసుకరాబడ్డాయి. డిపార్ట్‌మెంట్‌లు, చిన్నచిన్న జిల్లాల్లో ఎన్నుకొనే స్థానికాధికారులకు స్వస్తి చెప్పబడి, వారు ప్రిఫెక్ట్‌ల, సబ్ ప్రిఫెక్ట్‌ల, అధికార పరిధిలోకి వచ్చారు. వారందరినీ నెపోలియన్ నియమిస్తాడు. వారు మొదటి కన్సల్‌కే బాధ్యత వహించాలి. స్థానిక మండళ్లు కొనసాగాయి. అవి సంవత్సరంలో 15 రోజులు మాత్రమే సమావేశమై, పన్నుల వసూలును మాత్రమే చూడాలి. అవి ప్రిఫెక్ట్‌లకు సలహా మండళ్లుగా మాత్రమే పని చేస్తాయి. చిన్న చిన్న కమ్యూన్‌లు మేయర్‌ను, ప్రిఫెక్ట్‌లను నియమించడం, లక్ష జనాభా దాటిన నగరాల మేయర్‌ను నేరుగా మొదటి కన్సల్ చేతనే నియమించడం జరుగుతున్నాయి.

ఈ నూతన కేంద్ర ప్రభుత్వంలో ప్రజాభిప్రాయం వ్యక్తం చేయడానికి పెద్దగా అవకాశం లేదు. అయితే, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తక్షణమే సరైన పద్ధతిలో, సమరూపతలో అమలుపర్చడానికి వీలు కల్గింది. రిష్‌లూ కాలంలో ప్రవేశపెట్టిన కేంద్రీకృత వ్యవస్థయే పునరావృతమైంది. సమర్థమైన రక్షక దళం, విధేయత కల్గిన సైనిక శక్తి, పటిష్టమైన పత్రికా ఆంక్షలు ఈ కేంద్రీకృత వ్యవస్థకు బాసటగా నిల్చాయి. నెపోలియన్ ఆంతరంగిక సంస్కరణలన్నింటిలోను జాతీయ కేంద్రీకరణ ,సైనిక నియంతృత్వాన్ని ప్రవేశపెట్టాడు. వ్యక్తి స్వేచ్ఛను పణంగా పెట్టాడు. తన సంస్కరణలన్నింటిలోను నెపోలియన్ ఒక విప్లవవాదిగా కాక, నియంతృత్వ అధికారిగా కనిపిస్తాడు. ఇంతటి కేంద్రీకృత అధికారాలు బూర్బన్ రాజులకు లేవు. 31 సంవత్సరాల నెపోలియన్ అధికారానికి వచ్చిన కొద్ది వారాల్లో ఈ నూతన వ్యవస్థను

రూపొందించడం, అతని సమర్థతకు చిహ్నంగా చరిత్రకారులు శ్లాఘించారు.

### 16.4.3 ఆర్థిక సంస్కరణలు

1789లో విప్లవం రావడానికి, పురాతన వ్యవస్థ కూలడానికి, 1799లో డైరక్టరీ విఫలం కావడానికీ, ఆర్థిక దుస్థితియే ముఖ్య కారణం. అట్టి పరిస్థితి ఏర్పడకుండా నెపోలియన్ చాల, ముందు జాగ్రత్తలు తీసుకొన్నాడు. పన్నుల వసూళ్లను సమర్థవంతంగా నిర్వహించి, రాజ్య ఆదాయాన్ని పెంచాడు. అవినీతిపరులైన అధికారులను కఠినంగా శిక్షించాడు. ఇతర దేశాల్లో ఉన్న ఫ్రెంచి సైన్యం పోషణ, ఖర్చులు ఆయాదేశాల పైనే విధించాడు. పెక్కు పొదుపు చర్యలను చేపట్టాడు. ప్రభుత్వ ఖర్చును తగ్గించాడు. క్రీ.శ. 1800లో మెరుగుపడ్డ ఆర్థిక స్థితికి పరాకాష్ఠగా ఫ్రెంచి బ్యాంక్‌ను స్థాపించాడు. ప్రపంచం లోని ఆర్థిక సంస్థల్లో అది ప్రముఖమైందిగా గణుతికెక్కింది.

### 16.4.4 జాతీయ విద్యా విధానం

జాతికంతకు ఒకే విద్యా విధానాన్ని రూపొందించడానికి నెపోలియన్ ఎంతో శ్రమపడ్డాడు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. ఫ్రెంచి, లాటిన్ భాషలు, వ్యాకరణం, ప్రాథమిక శాస్త్ర విజ్ఞానాన్ని బోధించడానికై, సెకండరీ పాఠశాలలు జాతీయ ప్రభుత్వ అజమాయిషీలో స్థాపించడం జరిగింది. ప్రతి ముఖ్య నగరంలో ఒక ఉన్నత పాఠశాల వెలిసింది. రాజ్యం చేత నియమితులైన ఉపాధ్యాయులు ఈ పాఠశాలల్లో అన్ని రంగాల్లో ఉన్నత విద్యను నేర్పుతారు. సాంకేతిక విద్యను, సైనిక శిక్షణను, సివిల్ సర్వీస్ తయారీకి ప్రత్యేక విద్యాలయాలు రాజ్య నియంత్రణలోనే బోధన చేస్తాయి. విద్యావిధానం, విద్యా ప్రమాణాలను, పర్యవేక్షించడానికి ఫ్రెంచి విశ్వవిద్యాలయాన్ని స్థాపించడమైంది. దీని ముఖ్యాధికారులందరినీ మొదటి కాన్సల్ నియమిస్తాడు. విశ్వవిద్యాలయానుమతి లేకుండా, ఏ ప్రైవేట్ విద్యా సంస్థలను స్థాపించరాదు. ఎవరు అందులో బోధించరాదు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వటానికి పారిస్‌లో నార్మల్ స్కూల్ స్థాపితమైంది. 1795లో భౌతిక శాస్త్రం, గణితం, సాహిత్యం, లలితకళల అభివృద్ధికై, "ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రాన్స్" (The Institute of France) స్థాపితమైంది. అన్ని విద్యాలయాల్లోను నైతిక బోధనలు, మతం పట్ల విశ్వాసం, రాజ్యాధినేతపట్ల విధేయతను ప్రచారం చేయాలి. ఆనాడు విద్యార్థులకు పాఠ్యాంశాల్లో చేర్చిన కొన్ని ప్రశ్నలు, సమాధానాలను చూస్తే, నాటి విద్యా విధాన లక్ష్యం స్పష్టం కాగలదు.

ప్రశ్న : పాలకుల పట్ల క్రైస్తవుల విధులేమి? ప్రత్యేకంగా నెపోలియన్ చక్రవర్తి పట్ల వారికున్న బాధ్యత లేమి?

సమాధానం: పాలకులైన వారి పట్ల క్రైస్తవులు, ముఖ్యంగా మన చక్రవర్తియైన నెపోలియ... ప్రేమ ..., అభిమానం, విధేయత, సైనిక సేవ, ప్రభు భక్తిని చూపి, రాజ్య రక్షణకు, నిర్వహణకు కావాల్సిన పన్నులను చెల్లించాలి. చక్రవర్తి క్షేమానికి, రాజ్య సంక్షేమానికి ప్రార్థనలు జరపాలి.

ప్రశ్న : చక్రవర్తి పట్ల ఈ విధులన్నీ ఎందుకు నిర్వహించాలి?

సమాధానం : ప్రథమంగా రాజ్యాలను సృష్టించి, వివిధ వ్యక్తులకప్పగించే దేవుడు, మనకు ... సార్వభౌముని ప్రసాదించాడు. కాన, చక్రవర్తిని గౌరవించి, కొలవడం, దేవుని గౌరవించి, కొలవడం మాత్రమే, ఇలాంటి ప్రశ్న పరంపరలతో, రాజ్యం పట్ల, నెపోలియన్ పట్ల విధేయత, భక్తి కలిగేటట్లుగా చిన్నారి

BRAOU

హృదయాల్లో బీజాలు నాటడం, ఒక ప్రముఖ లక్ష్యం.

నెపోలియన్ స్త్రీ విద్య పట్ల శ్రద్ధ చూపాడు. వారిని ఆదర్శ గృహిణులుగా రూపొందించడం లక్ష్యంగా, వారి పాఠ్యాంశాలు రూపొందించబడ్డాయి. నెపోలియన్ మాటల్లో వారికి ముఖ్యంగా మత బోధన ఉండాలి. వారికి ఆలోచన ముఖ్యం కాదు. చెప్పినదాన్ని విశ్వసించాలి. అందంగా ఉండడం, చక్కని ఆతిథ్యమివ్వడం వారు నేర్చుకోవాలి. వారికివి గాక కొద్దిగా లెక్కలు రాయడం, ఫ్రెంచి భాషను నేర్వాలి. వీరు లాటిన్, విదేశీ భాషలు నేర్చుకోకుండా జాగ్రత్తపడాలి. యుక్తవయస్కులైన అమ్మాయిలకు కొంత భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రాన్ని నేర్పొచ్చు. మొత్తం మీద సంవత్సరంలో మూడు వంతుల కాలమైనా, ఏదో ఒక పనిని చేస్తూండాలి. పిల్లలకు బట్టలు తయారు చేయడం, భర్తను, పిల్లలను సంరక్షణ చేయడం వారు నేర్చుకోవాలి. నాట్యం అవసరమే కాని, వెర్రి గంతులు వేయకూడదు. సంగీతం అవసరమేకాని, అది గాత్రానికి పరిమితం కావాలి. మహిళా విద్యాసంస్థల్లో ఒక్క ప్రధానాచార్యుడు తప్ప, మిగతావారంతా స్త్రీలైయుండాలి. తోట పని కూడా వారే చేయాలి.....వివాహమే వారి అంతిమ లక్ష్యం.

నెపోలియన్ విద్యా విధానం పట్ల శ్రద్ధ చూపినా, రాజ్య నిర్వహణలో పెద్దగా విద్యా ప్రగతి కన్పించలేదు. ప్రథమంలో అనుభవమున్న ఉపాధ్యాయులు లేక, ఆ తర్వాత డబ్బులేక, ఈ విధానం కుంటు పడింది. ఫ్రెంచి పిల్లల్లో సగం మంది కాథలిక్ చర్చి నిర్వహించిన పాఠశాలల్లోనే ఉండిపోయారు.

## 16.4.5 న్యాయ స్మృతులు (Codes of Laws)

నెపోలియన్ సంస్కరణల్లో న్యాయ స్మృతుల రూపకల్పన చిరస్మరణీయమైంది. ఫ్రెంచి విప్లవ కారణాలు చెబుతూ, ఫ్రాన్స్ దేశంలో ఎన్నో రకాలైన పరస్పర విరుద్ధమైన న్యాయస్మృతులుండేవని, దేశానికంతటికీ ఒకే రకమైన న్యాయ స్మృతులను రూపొందించాలని విప్లవ నాయకులు కోరారని మనం చదివున్నాం. ప్రజలకర్థమయ్యే రీతిలో, సులభతరమైన, ఏకరూపత కల జాతీయ న్యాయ స్మృతులు వారి ఆకాంక్ష. 1791 రాజ్యాంగంలో అట్టి ప్రయత్నం చేయగలమని వాగ్దానం చేయడం జరిగింది. జాతీయ కన్వెన్షన్ ఆ పనిని కొంత వరకు ముందుకు తీసుకుపోయింది. కాని, నాటి విప్లవ నాయకులు మరికొన్ని ముఖ్య రాజకీయ విషయాల్లో, విదేశీ యుద్ధంలో నిమగ్నం కావడం వల్ల, న్యాయవాదుల జాప్య ధోరణి, అతి జాగ్రత్తవల్ల ఏర్పడ్డ నిదానం వల్ల, ఆపని పూర్తి కాలేదు.

నెపోలియన్ మొదటి కన్సల్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ బృహత్తర కార్యాన్ని చేపట్టాడు. వివిధ న్యాయ స్మృతుల రూపకల్పనకై సంఘాలను నియమించాడు. తానే స్వయంగా ఆ సమావేశాలకు హాజరై, తన వివేక దృష్టిని, తెలివితేటలను ప్రదర్శించాడు. న్యాయ స్మృతులను నెపోలియన్ రచించాడనేమాట అవాస్తవం కాదు. వాటిని నిర్దుష్ట రూపంలో పొందుపర్చడానికి, ప్రజామోదం సంపాదించడానికి, అతని కృషి ఎంతైనా వుంది. ఈ న్యాయ స్మృతుల్లో కొన్నిలోపాలున్నా, మొత్తం మీద అవి స్పష్టంగా, సమగ్రంగా, న్యాయబద్ధంగా, రూపొందాయి. 1804లో సివిల్ న్యాయ స్మృతి (civil code), ఆ తర్వాత సివిల్ ప్రొసీజర్ కోడ్ (civil procedurecode) క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ (Criminal procedure code), శిక్షా స్మృతి (Criminal law), చివరకు వ్యాపార స్మృతి (commercial code) వెలువడ్డాయి.

ఈ న్యాయ స్మృతులు ఐరోపా రాజ్యాలన్నింటికీనీ ఆదర్శప్రాయంగా నిలిచాయి. విప్లవ ఫలాలైన సాంఘిక సమానత, మత సహనం, బానిసత్వ విముక్తి, భూస్వామ్యాధికారాల రద్దను ఈ స్మృతుల్లో చట్టబద్ధం చేయడం జరిగింది. సివిల్ కోడ్ తయారీలో కొన్ని లోపాలున్నాయనే విమర్శకు స్పందించిన ఫిషర్ 68

BRAOU

(Fisher), "ఆధునిక కాలంలో జర్మన్లకు పదిహేను సంవత్సరాలు పట్టిన పనిని నెపోలియన్ నాలుగు నెలల్లో పూర్తి చేశాడని, ఏ న్యాయస్మృతి లేకుండా ఉండేదానికన్నా, కొద్దిలోపాలతో న్యాయ స్మృతి రూపొందడం ఉచితమని, ఒక్క శాసనం రెండు వందల ఆచారాలకన్న మిన్నయని సమాధానమిచ్చారు. నెపోలియన్ న్యాయ స్మృతులు ప్రముఖంగా జాతీయమైనవి. ఫ్రాన్స్‌లో లోపించిన శాసన ఏకరూపతను అవి కల్పించాయి. వాటిలో 'విప్లవ సారాంశం' విప్లవాన్ని సరిదిద్దే ప్రయత్నంగా 'లీగెర్ షో' (Leo Ger show) ప్రస్తుతించాడు. సివిల్ న్యాయం ఈ స్మృతుల్లో మత ప్రభావం నుండి విముక్తమైంది. చర్చి వద్దన్నా విడాకుల శాసనాన్ని పొందుపర్చడం జరిగింది. అయితే, కుటుంబంలో తండ్రి అధికారాన్ని గుర్తించడం జరిగింది. ఆస్తిని నిర్వహించే అధికారం స్త్రీలకు లేదు. వారసులందరికీ ఆస్తిలో సమాన హక్కును కల్పించడం జరిగింది. విప్లవ సంస్కరణనే నెపోలియన్ న్యాయ స్మృతులు కల్పించడం జరిగింది. నెపోలియన్ న్యాయస్మృతులను ఒక్క ఫ్రాన్స్‌లోనే కాక, అతడు జయించిన రాజ్యాల్లో కూడా ప్రవేశపెట్టాడు. కొన్ని కఠిన శిక్షలను కొనసాగించడం జరిగింది. మొత్తం మీద నెపోలియన్ న్యాయస్మృతులు ప్రపంచ చరిత్రలోనే సులభమైన, అనువైన ప్రజ్ఞ శాసనాలుగా కీర్తించడం జరిగింది. నెపోలియన్‌ను చరిత్రకారులు 'రెండో జస్టీనియన్' (Second Justinian) గా ప్రస్తుతించారు.

## 16.4.6. చర్చిలో ఒప్పందం

ఫ్రెంచి విప్లవ కాలంలో చర్చి అధికారానికి, రాజ్యాధికారానికి మధ్య తీవ్ర సంఘర్షణ ఏర్పడడం, జాతీయ శాసన సభ చర్చి ఆస్తులను కైవసం చేసుకొని ఎపిస్కొపేట్లను విడుదల చేయడం, సివిల్ రాజ్యాంగానికి చర్చి మతాచార్యులు బద్ధులై ఉండాలని, వారి జీతభత్యాలను ప్రభుత్వమే చెల్లించగలదని శాసించడం, మీకు తెలుసు. వీటిని పోప్ మత విరుద్ధ చర్యలుగా ప్రకటించాడు. జాతీయ కన్వెన్షన్ మరికొంత ముందుకు పోయి, చర్చీల స్థానంలో "హేతువాద దేవాలయాలను" స్థాపించి, పెక్కు మత విరుద్ధ చర్యలను గైకొనడం, మనకు తెలుసు.

అయితే, విప్లవం పట్ల సానుభూతి కల మతాచార్యులు కూడా, ఈ దుందుడుకు చర్యలకు విసిగి, విప్లవ వ్యతిరేకులుగా మారారు. నాన్ జ్యూరీ మతాచార్యులు పల్లెలకు పోయి, రైతుల్లో విప్లవ వ్యతిరేక ప్రచారాన్ని చేయగా, జ్యూరీ మతాచార్యులు మనుషులు లేని చర్చీల్లో ప్రార్థన చేసేవారు. మతాచార్యుల జీతాలను చెల్లించడం, రానురాను ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది.

ఈ పరిస్థితుల్లో నెపోలియన్ అధికారానికి వచ్చాడు. అతని దృష్టిలో మతం ఇంకా సజీవమైన శక్తియే. ప్రపంచంలో కొన్ని అసాధారణ శక్తులున్నాయని, వాటిలో మత మొకటని భావించాడు. అది సాంఘిక వ్యవస్థలో ఒక అద్భుతం. కాన, మతమనేది చాలా అవసరమని, అయితే, అది ప్రభుత్వం చేతిలో ఉండాలని ఆశించాడు. మతాల్లో నమ్మకం లేకపోయినా, తనకు దైవంలో నమ్మకం ఉందని ప్రకటించాడు. ప్రజా బాహుళ్యంలో కాథలిక్ చర్చి గల విశేష ప్రాభవాన్ని గమనించిన నెపోలియన్, చర్చితో వైరం కన్నా సఖ్యతయే మేలని భావించాడు. అనేక చర్యల పిదప, 'పోప్ పయస్ (Pope Pius) తో 1802లో ఒక అంగీకారానికి వచ్చాడు. దీన్నే కంకార్డట్ (Concordat) అంటారు. ఈ అంగీకారం ప్రకారం, చర్చి ఆస్తులను ప్రభుత్వం కైవసం చేసుకోవడం, మతాలను రద్దు చేయడం, మతాచార్యుల జీతాలను చెల్లించడం, మొదలైన విషయాలకు పోప్ అంగీకారాన్ని తెలుపగా, మతాచార్యులను అధికార ప్రతిష్ఠాపన చేయడాన్ని పోప్ హక్కుగా గుర్తించడం జరిగింది. అంటే, చర్చి ప్రాబల్యాన్ని ప్రభుత్వాధికారానికి ముడివేయడం జరిగింది. నెపోలియన్ తాను

చార్లేమాన్ వారసుడనని, పోప్ అధికారాన్ని కేవలం మతానికి పరిమితం చేయాలని ఆశించాడు. అయితే, ఈ అంగీకారం వల్ల పోప్‌కు అధికారాన్ని సన్నగిల్లినా, ప్రతిష్ఠ మిగిలింది. ఈ అంగీకారాన్ని సమర్థిస్తూ, "ప్రజలకు మతం కావాలి, అయితే, అది ప్రభుత్వం చేతిలో ఉండాలి" అని, "మతంలో నాకు అవతారాల రహస్యం కన్పించదు, కాని సాంఘిక వ్యవస్థ రహస్యం ద్యోతకం కాగలదని," "అసమానతలు లేకుండా సాంఘిక వ్యవస్థ అసాధ్యం. నైతిక సూత్రాలు లేని అసమానత భరింపరానిది. మతం లేని నైతిక సూత్రాలు ఆమోదయోగ్యం కావు" అని, నెపోలియన్ వ్యాఖ్యానం చేశాడు.

నెపోలియన్ మతంతో చేసుకొన్న ఈ సఖ్యత పట్ల ప్రజాబాహుళ్యం హర్షం వెలిబుచ్చినా, కొందరు మేధావులు, రాజకీయ, సైనిక నాయకులు వ్యతిరేకించారు. ఈ అంగీకారం తర్వాత కూడా, నెపోలియన్, పోప్‌ల మధ్య, పెక్కు సార్లు తీవ్ర భేదాలు తలెత్తాయి. ఏమైనా, మొత్తం మీద ఈ అంగీకారం ఉభయకుశలోపరిగా 1905 వరకు కొనసాగింది.

### 16.4.7 ప్రజాహిత కార్యాలు (Public works)

నెపోలియన్ పరిమితమైన ఆర్థిక వనరులతో ఖైదీలను నియోగించి, అనేక ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టాడు. విశాలమైన రహదార్లను వేయించాడు. కాలువలను త్రవ్వించి, వంతెనలను నిర్మించాడు. ముఖ్యమైన రేవు పట్టణాలను అభివృద్ధి చేయడం జరిగింది. రవాణా, వార్తా సౌకర్యాలు మెరుగుపడి, వర్తక వ్యాపారాలు ముమ్మరంగా సాగాయి. 1811 నాటికి విశాలమైన 229 రహదార్లను నిర్మించడం జరిగింది. పారిస్ నగరం నుండి రాజ్యంలోని నలుమూలలకు ప్రయాణం సులభతరమైంది. రేవు పట్టణాలు నావికావసరాలకు, వాణిజ్యావసరాలకు వీలుగా రూపుదిద్దుకొన్నాయి.

అంతేగాక, ఎంతో శ్రమతో, ఖర్చుతో, రాజ్య ప్రాసాదాలు పునరుద్ధరితమై, నూతనాలంకారాలతో తీర్చిదిద్దడం జరిగింది. స్థూపాలు వెలిశాయి. పారిస్ నగరాన్ని శోభాయమానంగా ప్రతిమలతో, కట్టడాలతో, వాస్తువిశేషాలతో అలంకరించడం జరిగింది. జయించిన రాజ్యాల నుండి కొల్లగొట్టి తెచ్చిన శిల్పాలు, కళాఖండాలు, వస్తువిశేషాలు పారిస్ నగరానికి వన్నె తెచ్చాయి. ఆ నగర జనాభా నెపోలియన్ పాలనా కాలంలో రెండింతలై, ఐరోపాలో భోగభాగ్యమైన నగరంగా మారింది.

నెపోలియన్ ఫ్రాన్స్ వలస రాజ్య పునరుద్ధరణకు కొన్ని ప్రయత్నాలు చేశాడు. కాని, అవి ఫలించలేదు. ఈ ఒక్క వైఫల్యం మినహా, నెపోలియన్ కన్సలేట్ కాలంలో సాధించిన సంస్కరణలు అభినందనీయమైనవి. ఈ కాలమంతటా నెపోలియన్ తాను "విప్లవ సుతునిగా' (Son of Revolution) చెప్పుకున్నాడు; విప్లవ సిద్ధాంతాలకు తాను ప్రతీకనని చాటుకున్నాడు. విప్లవం వల్లనే అతడు ఉద్భవించిన మాట సత్యం. విప్లవ ఫలాలను పరిరక్షిస్తున్నానని పలికిన మాటల్లో కొంత అసత్యం లేకపోలేదు. "సమానతకు ప్రాధాన్యమిచ్చి, స్వేచ్ఛకు తిలోదకాలిచ్చాడు". "ఫ్రెంచి ప్రజలకు కావాల్సింది సమానతయే కాని, స్వేచ్ఛ కాదు" అని ప్రకటించాడు. ప్రభుత్వానికి గణనీయమైన సేవ చేసిన వారికి 'లీజియన్ ఆఫ్ ఆనర్' (Legion of Honour) ను కల్పించి, సమానత్వంలో కూడా కొంత వెలితిని కల్పించాడు. సౌభ్రాతృత్వం అనే సిద్ధాంతాన్ని అంతర్జాతీయంగా కాక, జాతీయపరంగా ఆమోదించాడు. ఈ లోపాలున్నా, ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాల పరిరక్షణలో, ఐరోపా రాజ్యాల్లో వాటిని వ్యాప్తి చేయడంలో, విప్లవ ఫలాలను అందించడానికి నెరపిన సంస్కరణల్లో, నెపోలియన్ నిర్వహించిన పాత్ర అద్వితీయమైంది. 'నెపోలియన్ యుద్ధ విజయాలు తాత్కాలికమైనవైనా, అతని సంస్కరణ కార్యక్రమాలను గట్టి పునాదులపై నిర్మించడం జరిగింది'. అని ఫిషర్ చేసిన వ్యాఖ్య సముచితమైందే. ("If the conquests of Napoleon are ephemeral, 

his civilian work in France was built upon granite". (Fisher )

## 16.5 చక్రవర్తిగా నెపోలియన్ (1804-1815)

నెపోలియన్ పాలనకు వ్యతిరేకత లేకపోలేదు. కాని, అతని సమర్థత, సంస్కరణలు ప్రజానురంజకాలు. క్రీ.శ.1802లో జీవిత కాలానికి కన్సల్‌గా ఎన్నికైన నెపోలియన్‌ను, క్రీ.శ.1804 డిశంబర్‌లో ఫ్రెంచి చక్రవర్తిగా ప్రజలు ఎన్నుకొన్నారు. డిశంబర్ 2 వ తేదీన రాజలాంఛనాలతో పోప్ సమక్షంలో ఫ్రెంచి చక్రవర్తిగా అధికారాన్ని స్వీకరించాడు. మొదటి కన్సల్‌గా నెపోలియన్ శాంతియుత విజయాలను సాధిస్తే, చక్రవర్తి గా ఒక దశాబ్ది కాలం సైనిక దండయాత్రలతో, రాజ్య విస్తరణ కాంక్షతో, ఐరోపా ఖండాన్ని యావత్తూ సంక్షోభపర్చాడు.

### 16.5.1 తృతీయ సంకీర్ణ రాజ్యాల కూటమి ఏర్పాటు

క్రీ.శ. 1802లో నెపోలియన్ ఇంగ్లాండ్‌తో చేసుకొన్న శాంతి సంధి, కొద్ది కాలంలోనే విఫలమైంది. నెపోలియన్ నెదర్లాండ్స్‌పైన, ఇటలీలో, రైన్ నదీ ప్రాంతంలో, స్పెయిన్‌లో ప్రాబల్యాన్ని పెంచుకోవడంతో, ఇంగ్లాండ్ తన వలస వ్యాపారం దెబ్బతింటుందని భయపడింది. వలస రాజ్య స్థాపనకు నెపోలియన్ ప్రయత్నించడంతో, ఇంగ్లాండ్ ఫ్రాన్స్‌పై యుద్ధాన్ని ప్రకటించింది. ఇంగ్లాండ్ నాశనమైతే తప్ప, ఫ్రాన్స్ వలసల్లో, వాణిజ్యంలో అభివృద్ధి చెందనేరదని నిశ్చితాభిప్రాయుడైన నెపోలియన్ , ఇంగ్లాండ్‌పై దండయాత్రకు సర్వసన్నాహాలు చేయసాగాడు. దీనికి సమాధానంగా, ఇంగ్లాండ్ తన నావికా సంపత్తిని వృద్ధి చేయడమే గాక, క్రీ.శ.1805లో ఆస్ట్రియా, రష్యా, స్వీడన్ లతో కలిసి, నెపోలియన్‌ను పడగొట్టడానికై, తృతీయ సంకీర్ణ రాజ్యాల కూటమిని ఏర్పర్చింది. గతంలో జరిగిన పరాభవాలను నెమరు వేసుకున్న ఆస్ట్రియా, నెపోలియన్ చక్రవర్తి బిరుదును స్వీకరించడం సహించలేకపోయింది. రష్యాలో అధికారానికి వచ్చిన కొత్త జార్ అలెగ్జాండర్, తన సైనిక పోషణకై ఇంగ్లాండ్‌పై ఆధారపడ్డాడు. ఉదారవాదిగా నటించే అలెగ్జాండర్ నెపోలియన్‌ను నియంతగా భావించాడు. ప్రష్యాను కూడా ఈ కూటమిలో చేర్చడానికి ఇంగ్లాండ్ ప్రయత్నించింది. కాని, పిరికివాడైన మూడో విలియం, తటస్థ వైఖరిని అవలంబించాడు. ఈ కూటమి సైన్యాలు ఫ్రాన్స్ తూర్పు సరిహద్దుపై దాడి చేయడానికి సమాయత్తమైనాయి.

### 16.5.2 నెపోలియన్ విజయ పరంపరలు

తృతీయ సంకీర్ణ రాజ్యాలకూటమి ఫ్రాన్స్ పై దాడి చేయకమునుపే, నెపోలియన్ ఇంగ్లాడ్ దండయాత్రను వాయిదా వేసి, తన సైన్యంతో ఆస్ట్రియన్లపై వర్టెంబర్గ్(Wartemburg)లోని ఉల్మ్ (Ul వద్ద మెరుపు దాడి చేశాడు. యాభైవేల సైన్యంతో సహా, ఆస్ట్రియా సైన్యాధిపతి లొంగిపోయాడు. ఫ్రె సైన్యం వియన్నా నగరం వైపు పురోగమించింది. ఈ విజయాన్ని సాధించిన మరుసటి రోజే, ట్రఫా (Trafalgar) యుద్ధంలో ఫ్రెంచి, స్పానిష్ నౌకాబలం ఇంగ్లాండ్ చేతుల్లో తీవ్ర పరాజయాన్ని పొంది నాటి నుండి నెపోలియన్ బ్రిటిష్ వారి సముద్రాధిపత్యాన్ని సవాలు చేయడంలో సఫలత పొందలేదు

### 16.5.3 ఆస్ట్రియా

ఈ నావికా పరాజయంపై పెద్దగా ఆందోళన చెందని నెపోలియన్, వియన్నాను ఆక్రమించు ఆస్టర్ లిట్జ్ (Austerlitz) వద్ద ఆస్ట్రియా, రష్యా సంలీన సైన్యాన్ని, క్రీ.శ.1805 డిశంబర్ 2వ తేదీన చి ఓడించాడు. దీని ఫలితంగా ఆస్ట్రియా కూటమి నుండి వైదొలగింది. ప్రెస్‌బర్గ్ (Presburg) సంధి వెనీషియాను వదులుకొని, నెపోలియన్‌ను, ఇటలీ రాజుగా గుర్తించింది. అంతేగాక, టైరాల్ (T

బవేరియా (Bavaria) కొన్ని జర్మన్ భూభాగాలను వర్టెంబర్గ్‌కు దత్తం చేసింది. ఆస్ట్రియా దీంతో ముప్పైలక్షల జనాభాను, బోలెడంత ఆదాయాన్ని పోగొట్టుకొని, రెండో తరగతి రాజ్యంగా మారింది.

### 16.5.4 ప్రష్యా

తృతీయ సంకీర్ణ రాజ్యాల కూటమి నుండి ఆస్ట్రియా వైదొలగేసరికి, ప్రష్యా కూటమిలో చేరింది. జర్మనీ నుండి ఫ్రెంచి సైన్యాలను తరలించడానికి నెపోలియన్ అంగీకరించలేదు. ప్రష్యా రాజు మూడో విలియం ఫ్రెడరిక్, రాణి ప్రోద్బలంతో క్రీ.శ. 1806లో ఫ్రాన్స్‌పై యుద్ధాన్ని ప్రకటించాడు. రష్యా సహాయం రాకముందే, ప్రష్యా సైన్యాలు ఫ్రెంచి సైన్యాలతో తలపడాల్సి వచ్చింది. జీనా (Jeena) యుద్ధంలో ప్రష్యన్లు పూర్తిగా ఓడిపోయారు. ఆ దేశపు ప్రతిష్ఠ ధ్వంసమైంది. ప్రష్యాలోని అధిక భాగాన్ని ఆక్రమించుకున్న నెపోలియన్, బెర్లిన్ నగరంలో విజయోత్సాహంతో ప్రవేశించాడు.

### 16.5.5. రష్యా

కూటమిలో ఇంకా రష్యా మిగిలిపోయింది. చలికాలం దాటగానే, క్రీ.శ.1807 జూన్ నెల్లో, నెపోలియన్ ప్రష్యా సహాయార్థమై వచ్చిన రష్యా సైన్యంపై యుద్ధాన్ని ప్రకటించాడు. ఫ్రీడ్‌లాండ్ (Fried land) యుద్ధంలో రష్యా సైన్యాలు ఘోర పరాజయాన్ని పొందడంతో, అలెగ్జాండర్ సంధికై వేడుకొన్నాడు. టిల్సిట్ (Tilsit) వద్ద ఫ్రాన్స్, రష్యా, ప్రష్యాల మధ్య సంధి జరిగింది. నెపోలియన్ రష్యాపై ఎట్టి ఆంక్షలను విధించలేదు. ఇంగ్లాండ్‌పై తాను చేయబోయే యుద్ధంలో రష్యా సాయం కోరాడు. తూర్పు ఐరోపాలో రష్యా ప్రాముఖ్యతను గుర్తించినట్లు నెపోలియన్ నటించాడు. టర్కీ, ఫిన్‌లాండ్‌ల్లో రష్యా ఆశలకు తాను అవరోధం కల్పించనని సూచించాడు. నెపోలియన్ వ్యక్తిత్వానికి, ఉదారతకు సమ్మోహితుడైన అలెగ్జాండర్, 'నీవు', 'నేను' తప్పిస్తే ఐరోపా ఎక్కడుంది? అని, నెపోలియన్ పట్ల తన గౌరవాన్ని వెల్లడించాడు.

టిల్సిట్ సంధి కారణంగా, ప్రష్యా శిక్షను పొందింది. ఆ దేశం నుండి పోలాండ్ భూభాగాన్ని గ్రహించి, వార్సా (Warsaw) రాజ్యంగా, సాక్సనీ (Saxony) ఎలక్టార్ కివ్వడం జరిగింది. ప్రష్యా అర్ధ భూభాగాన్ని కోల్పోవడమేకాక, యుద్ధ ఖర్చుల నిమిత్తం పెద్ద మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చింది. ఆ మొత్తం చెల్లించేవరకు, ఫ్రెంచి సైన్యాలు ప్రష్యా భూభాగంపై ఉంటాయి. ప్రష్యా సైన్యం నలభై రెండు వేలకు పరిమితమైంది. టిల్సిట్ సంధితో, మూడో సంకీర్ణ రాజ్యాల కూటమి విచ్ఛిన్నమైంది. స్వీడన్‌పై రష్యా, డెన్మార్క్ సైన్యాలను నెపోలియన్ ప్రయోగించాడు. క్రీ.శ. 1809లో స్వీడన్, ఫిన్‌లాండ్‌ను, రష్యా ఆక్రమణకు వదలివేసింది. ఇంగ్లాండ్‌పై నెపోలియన్ జరిపే ఆర్థిక యుద్ధంలో, స్వీడన్ నెపోలియన్‌కు సాయపడతానని మాట యిచ్చింది.

ఈ విజయాలతో నెపోలియన్ కీర్తి పరాకాష్ఠ నందుకుంది. ఫ్రెంచి చక్రవర్తిగా, ఇటలీ రాజుగా, నెపోలియన్ గుర్తింపును పొందాడు. అతని సోదరుడు జోసఫ్, నేపుల్స్ రాజుగా, ఇంకో సోదరుడు లూయీ హాలెండ్ రాజుగా అంగీకరించబడ్డారు. స్పెయిన్, డెన్మార్క్, రష్యాలు అతని పలుకుబడి లోకి వచ్చాయి. ప్రష్యా, ఆస్ట్రియాలు రెండో తరగతి రాజ్యాలుగా మారాయి. నెపోలియన్ తన అధికార మంత్ర దండంతో, జర్మనీలోని మూడు వందల రాజ్యాలను వందకు లోపుగా తగ్గించివేసి, పెక్కు జర్మన్ భూభాగాలను ఆక్రమించుకున్నాడు. ఫ్రెంచి ఆక్రమణలోని ఈ భూభాగాలు, మరికొన్ని జర్మన్ రాజ్యాలు, పవిత్ర రోమన్ సామ్రాజ్యం నుండి విడిపోయిన ఒక సమాఖ్యగా ఏర్పడ్డాయి. పవిత్ర రోమన్ చక్రవర్తి అధికారాన్ని నెపోలియన్ తిరస్కరించడంతో, ఆస్ట్రియన్ హేబ్స్‌బర్గ్ రాజు రెండో ఫ్రాన్సిస్, చక్రవర్తి పదవిని త్యజించక తప్పలేదు. మొదటి ఫ్రాన్సిస్ కాలం నుండి, పధ్నాల్గో లూయీ వరకు, బూర్బన్ రాజులు సాధించలేని ఈ విజయాన్ని నెపోలియన్ సాధించాడు. క్రీ.శ. 1808 నాటికి, జర్మనీ యావత్తు నెపోలియన్ దయాదాక్షిణ్యాలపై



BRAOU

ఆధారపడింది. జయించిన ఈ రాజ్యాలన్నింటిలోను నెపోలియన్ సాంఘిక సమానత, భూస్వామ్య విధాన రద్దు, మొదలైన విప్లవ సిద్ధాంతాలను ప్రవేశపెట్టాడు.

## 16.6. నెపోలియన్ పతనం

క్రీ.శ. 1808 నాటికి అత్యున్నత స్థాయిని చేరుకున్న నెపోలియన్ అధికార ప్రాభవాలు క్రమంగా క్షీణించాయి. దీనికి ముఖ్య కారణాలు నెపోలియన్ రాజ్య వ్యవస్థలోని లోపాలు. వ్యక్తిగతంగా నెపోలియన్ ఎంత గొప్పవాడైనప్పటికీ, వ్యక్తి సమర్థతకు ఒక హద్దు ఉంటుంది. ఇందుకు తోడు, నెపోలియన్ రాజ్యానికి బల ప్రయోగమే ప్రాతిపదిక. క్రమంగా ఆయన సైన్యం వివిధ జాతుల సంకీర్ణమై, బలాన్ని కోల్పోయింది. నిరంతర యుద్ధాలు ఏరాజ్యాన్ని కలకాలం నిలుపలేవు. భూఖండ విధానం (continental system), జాతీయ తిరుగుబాట్లు, రష్యా దండయాత్ర వైఫల్యం, విమోచన యుద్ధం, పై కారణాలకు తోడై, నెపోలియన్ పతనానికి దారితీశాయి. నెపోలియన్ సామ్రాజ్యం ప్రపంచ చరిత్రలో ఒక ఘటనగానే మిగిలిపోయింది.

### 16.6.1 భూఖండ విధానం (Continental Sysem))

నెపోలియన్‌కు, ఇంగ్లాండ్‌కు మధ్య జరిగిన ఒక సూక్ష్మమైన ఆర్థిక ప్రచ్ఛన్న యుద్ధాన్ని, భూఖండ విధానంగా వర్ణిస్తారు. క్రీ.శ. 1808 నాటికి ఐరోపా ఖండంలో ఫ్రాన్స్ కెదురులేదు. అదే విధంగా, సముద్రాలపై ఇంగ్లాండ్ ఆధిక్యతకు తిరుగులేదు. భూయుద్ధంలో ఫ్రాన్స్‌ను ఓడించడం ఎంత దుర్లభమో, సముద్రంపై ఇంగ్లాండ్‌ను ఓడించడం ఫ్రాన్స్‌కు అంత దుస్సాధ్యం. ఈ పరిస్థితుల్లో ఇంగ్లాండ్‌ను లొంగదీసుకోవడానికి నెపోలియన్ కొత్త వ్యూహాలను పన్నాడు. 17, 18, శతాబ్దాల్లో ఇంగ్లాండ్ వర్తక వ్యాపారాలు బాగా అభివృద్ధిచెంది, ఇంగ్లాండ్ ప్రజల్లో పెక్కు మంది వర్తకంపై ఆధారపడ్డారు. ఈ వర్తక వ్యాపారాలను స్థంభింపజేసిన పక్షంలో ఇంగ్లాండ్ తన పాదాక్రాంతం కాక తప్పదని తలంచిన నెపోలియన్, వర్తక జాతి (Nation of Shopkeepers) పై ప్రచ్ఛన్న ఆర్థిక యుద్ధాన్ని ప్రకటించాడు. ఇంగ్లాండ్ ఎగుమతి, దిగుమతులను అరికట్టి, ఆ దేశ ఆర్థిక విధానాన్ని ధ్వంసం చేయాలనే ఎత్తుగడలో, తన ప్రాబల్యంలో ఉన్న ఐరోపా రాజ్యాలను పావులుగా ఉపయోగించాలని అభిప్రాయపడ్డాడు. క్రీ.శ. 1806లో బెర్లిన్ శాసనం ద్వారా బ్రిటిష్ దీవులపై నిర్బంధాన్ని ప్రకటించాడు. ఇంగ్లాండ్‌కు సరుకులను సరఫరా చేసే నౌకలు, ఫ్రెంచి రేవు పట్టణాల్లో కాని, దాని మిత్ర రాజ్య రేవు పట్టణాల్లో కాని ఆగకూడదని ఆదేశించాడు. క్రీ.శ. 1807 లో వార్సా, మిలాన్ శాసనాల ద్వారా ఇంగ్లాండ్‌తో వ్యాపారం చేస్తున్న ఏ తటస్థ నౌకలనైనా నిర్బంధించే అధికారం తమకు ఉందని ఉద్ఘాటించాడు. క్రీ.శ. 1810లో చేసిన ఫాంటెనాబ్లూ శాసనం ప్రకారం, నెపోలియన్ రాజ్యాల్లో కన్పించిన ఏ బ్రిటీష్ వస్తువునైనా ప్రభుత్వాధీనం చేసుకోగలడని బెదిరించాడు.

ఈ శాసనాలకు వ్యతిరేకంగా ఇంగ్లాండ్ "ఆర్డర్స్ ఇన్ కౌన్సిల్" (Orders in Council) అనే శాసనాన్ని చేసింది . దీని ప్రకారం ఫ్రాన్స్‌తో గాని, ఫ్రెంచి రాజ్యాలతో గాని వ్యాపారం చేస్తున్న తటస్థ రాజ్యాల నౌకలను శోధించడానికి, అధీనం చేసుకోవడానికి తమకధికారం ఉందని ప్రకటించింది. ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో తీవ్రంగా నష్టపడింది తటస్థ రాజ్యాలు. సముద్రాధిపత్యం గల ఇంగ్లాండ్ తన శాసనాలను ఫ్రాన్స్ కంటే సమర్థవంతంగా అమలుపర్చగల్గింది. తటస్థ రాజ్యాలు ఫ్రాన్స్ , ఇంగ్లాండ్ విధానాలను ప్రతిఘటించాయి. ఈ ప్రతిఘటనలో ఎక్కువగా దెబ్బతిన్నది నెపోలియన్.

నెపోలియన్ భూఖండ విధాన అమలుకు తన శక్తులన్నింటిని ధారపోశాడు. తన ప్రాబల్యం లో ఉన్న రాజ్యాలన్నింటిని ఈ విధానాన్ని అనుసరింప చేయటానికి సర్వప్రయత్నం చేశాడు. టిల్సిట్ సంధి తర్వాత రష్యా , ప్రష్యాలు ఈ విధానంలో నెపోలియన్‌తో చేరాయి. సోదరులు పాలిస్తున్న ఇటలీ, హాలెండ్‌లు ఈ విధానానికి కట్టుబడ్డాయి. ఈ విధానాన్ని తిరస్కరించిన పోప్ బంధితుడై , ఫ్రాన్స్‌కు తరలించబడ్డాడు.

నెపోలియన్ ఈ విధానాన్ని పోర్చుగల్ పై రుద్దడానికి ప్రయత్నించాడు. క్రీ.శ.1703 నుండి ఇంగ్లాండ్ తో సన్నిహిత వర్తక సంబంధాలేర్పరుచుకున్న పోర్చుగల్, ఈ విధానాన్ని ప్రతిఘటించింది. కుపితుడైన నెపోలియన్, స్పెయిన్ లోని రాజకీయ అవ్యవస్థతను ఆధారంగా చేసుకొని, ఆదేశ భూభాగం గుండా ఫ్రెంచి సైన్యాన్ని తరలించి, పోర్చుగల్ ను కబళించాడు. పోర్చుగల్ రాజవంశం బ్రిటిష్ వారి రక్షణలో బ్రెజిల్ కు తరలి వెళ్లింది. నెపోలియన్ విధానాన్ని, బలహీనుడైన తమ రాజును, స్పెయిన్ ప్రజలు నిరసించారు. దాంతో, నాల్గో చార్లెస్ తన కుమారుడైన ఏడో ఫెర్డినాండ్ ను రాజుగా ప్రకటించి, పదవీ విరమణ చేశాడు. నెపోలియన్ అధికారానికి వెరచిన ఈ బూర్బన్ రాజులు అతని ప్రభావానికి లోనై, స్పెయిన్ రాజ్యంపై తమ హక్కులను వదలుకున్నారు. తక్షణమే నెపోలియన్ తన సోదరుడైన జోసెఫ్ బోనాపార్ట్ ను స్పెయిన్ రాజుగా ప్రకటించాడు. జోసెఫ్ స్పెయిన్ లో కూడా భూఖండ విధానాన్ని గట్టిగా అమలుపర్చాడు. ఈ విధానానికి ప్రతిఘటనగా జాతీయ తిరుగుబాట్లు జరిగాయి.

## 16.6.2 జాతీయ తిరుగుబాట్లు : స్పెయిన్

క్రీ.శ. 1808 వరకు నెపోలియన్, రాజరికాలతో యుద్ధం చేస్తూ వచ్చాడు. కాని, స్పెయిన్ ఆక్రమణ నుండి నిజమైన జాతీయ సైన్యాలను ఎదుర్కోవాల్సొచ్చింది. స్పానిష్ ప్రజలు జోసెఫ్ ను విదేశీయునిగా అసహ్యించుకున్నారు. చిన్న వర్గాల ప్రజలు విదేశీ జోక్యాన్ని నిరసించారు. పెక్కు విప్లవ సంఘాలు ఏర్పడ్డాయి. అనేక సాయుధ తిరుగుబాట్లు జరిగాయి. క్రీ.శ. 1808 ఆగస్ట్ నాటికి ఈ తిరుగుబాట్లు విప్లవంగా మారి, జోసెఫ్ ను స్పెయిన్ నుండి తరిమి వేశాయి. ఈ సంఘటనను పురస్కరించుకొని ఇంగ్లాండ్ విదేశాంగ మంత్రి కానింగ్, నెపోలియన్ పై యుద్ధాన్ని ప్రకటించే ఏ దేశానికైనా తమ మద్దతు లభించగలదని ప్రకటించాడు. ఈ ప్రకటన ననుసరించి బ్రిటిష్ సైన్యం 'డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ (Duke of Wellington)నాయకత్వంలో పోర్చుగల్, స్పెయిన్ లలో ప్రవేశించి, ఫ్రెంచి సైన్యాలను తరిమివేశాయి. ఈ ద్వీపకల్ప యుద్ధం క్రీ.శ. 1813 వరకు కొనసాగింది.

ఫ్రెంచి పరాజాయాన్ని విన్న నెపోలియన్, తక్షణమే స్పెయిన్ ప్రవేశించి, బ్రిటిష్ సైన్యాన్ని ఓడించి, జోసెఫ్ ను తిరిగి స్పెయిన్ రాజుగా నియమించాడు. కాని, ఈ విజయం తాత్కాలికమైంది. నెపోలియన్ దృష్టి మిగతా ముఖ్య విషయాల వైపు ప్రసరించగానే, స్పెయిన్ తిరిగి తిరుగుబాటు చేసింది. అందుకే చరిత్రకారులు, స్పెయిన్ నెపోలియన్ ను తినివేసిన రాచపుండు (Spanish ulcer) గా వర్ణిస్తారు.

### 16.6.2.1 ఆస్ట్రియా

స్పెయిన్ సంఘటనలతో ఆస్ట్రియా ధైర్యాన్ని పుంజుకుంది. పరాభవంతో దహించుకుపోతున్న ఈ దేశం, నెపోలియన్ పై పగ తీర్చుకోవడానికి పెక్కు సైనిక సంస్కరణలను చేసింది. చార్లెస్ నాయకత్వంలో జాతి యావత్తు సైన్యంగా రూపొందింది. నెపోలియన్ స్పెయిన్ లో తిరుగుబాటును అణచే సందర్భంగా, క్రీ.శ. 1809 ఏప్రిల్ లో ఆస్ట్రియా యుద్ధాన్ని ప్రకటించి, బవేరియా నాక్రమించుకున్నాడు. నెపోలియన్ తన సైన్యాన్ని ఆస్ట్రియా వైపు మరలించి, చార్లెస్ ను 'వేగ్రాం (Wagram) యుద్ధంలో ఓడించాడు. ఆస్ట్రియా చక్రవర్తి వియన్నా సంధి కంగీకరించాడు. ఈ సంధి ప్రకారం ఆస్ట్రియా అనేక భూభాగాలను, 45 లక్షల జనాభాను పోగొట్టుకుంది. అంతేకాక, దేశ సైన్యం లక్షా ఏభైవేలకు పరిమితమైంది. ఆస్ట్రియా, యుద్ధ ఖర్చుల నిమిత్తం పెద్ద మొత్తాన్ని చెల్లించింది. ఇంగ్లాండ్ తో వర్తక సంబంధాలను నిలిపివేయాల్సొచ్చింది. ఆస్ట్రియా రాకుమారి మేరియా లూసా (Maria Louisa) ను నెపోలియన్ వివాహమాడాడు. ఆస్ట్రియా తనకు జరిగిన పరాభావాన్ని మరచిపోలేదు.

ప్రష్యాలో కూడా జాతీయ భావం, నెపోలియన్ పై పగ తీర్చుకోవాలన్న వాంఛ, వృద్ధి చెందాయి. స్టీన్, హార్డెన్ బర్గ్ ల నాయకత్వంలో, సైనిక పునర్నిర్మాణం, దేశాభివృద్ధికై పెక్కు సంస్కరణలను

తలపెట్టడం జరిగింది. ప్రష్యా సైన్యం 42 వేలకు పరిమితమైంది. దీన్ని అధిగమించడానికి, ఒక సైన్యం తర్ఫీదు పొందగానే వారిని యింటికి పంపివేసి, మరో 42 వేల సైన్యానికి తర్ఫీదునిచ్చేవారు. ఈ విషయాలు తెలిసిన నెపోలియన్ ప్రష్యాను బెదిరించాడు. కాని, ప్రష్యా విమోచన కోసం ప్రయత్నాలను కొనసాగించింది.

### 16.6.2.2 రష్యాపై దండయాత్ర

క్రీ.శ. 1807లో జరిగిన 'టిల్సిట్' సమావేశంలో రష్యా చక్రవర్తి అలెగ్జాండర్, నెపోలియన్ అనుయాయుడయ్యాడు. కాని, అనేక కారణాల వల్ల, వీరి మధ్య సంబంధాలు క్రీ.శ. 1812 నాటికల్లా చెడిపోయి, యుద్ధానికి దారితీసాయి.

తూర్పు ఐరోపాలో రష్యా ప్రయోజనాలను గౌరవిస్తానన్న నెపోలియన్, అడుగడుగునా రష్యా విస్తరణకు అడ్డపడుతూ వచ్చాడు. పైగా, వార్సా రాజ్యంగా పోలెండ్‌లో కొంత భాగాన్ని తిరిగి స్థాపించడం, హేబ్స్‌బర్గ్ రాకుమారిని నెపోలియన్ వివాహమాడ్డం, అలెగ్జాండర్‌కు కోప కారణాలైనాయి.అన్నింటిని మించి, నెపోలియన్ భూఖండ విధానం వల్ల రష్యా ఆర్థిక స్థితి అధ్వాన్నమైంది. ప్రముఖంగా వ్యావసాయిక దేశమైన రష్యా, పెక్కు దిగుమతులకు ఇంగ్లాండ్‌పై ఆధారపడింది. ప్రజాభిప్రాయానికి వెరచిన అలెగ్జాండర్, భూఖండ విధానాన్ని కొంతవరకు మానివేయవలసి వచ్చింది. దీన్ని నెపోలియన్ క్షమించలేకపోయాడు. ఈ కారణాల ఫలితంగా, నెపోలియన్ రష్యాపై యుద్ధాన్ని ప్రకటించాడు. రష్యా దండయాత్రకై నెపోలియన్ ఆరు లక్షల బలవత్తర సైన్యాన్ని సమాయత్తపర్చాడు. జార్ అలెగ్జాండర్ ప్రతిచర్యలను గైకొన్నాడు. ఇంగ్లాండ్‌తో సమాధానపడి, విదేశ మధ్యవర్తిత్వంలో, తురుష్కులతో శాంతి చేసుకున్నాడు. కాని, రష్యా సైన్యం 1,75,000 మాత్రమే.

జూన్ 24, 1812 న నెపోలియన్ నిమెన్ (Nimen) నదిని దాటి, రష్యాలో ప్రవేశించాడు.ఫ్రెంచి సైన్యాలు సంఖ్యాబలంలో, ఆయుధ సంపత్తిలో, క్రమశిక్షణలో, రష్యా సైన్యాలకన్నా మిన్న అయినవి. రష్యన్‌ల బలహీనత వారికి తోడ్పడింది. పురోగమిస్తున్న నెపోలియన్ సైన్యాల ధాటికి నిలువలేక, రష్యా సైన్యాలు తిరోగమనం చేశాయి. సెప్టెంబర్ కల్లా మాస్కో నగరం ఫ్రెంచి వారి వశమైంది. నగర వాసులు పారిపోయారు. సరఫరాలు సరిగా రానందున, చలికాలం ప్రవేశిస్తున్నందున, నెపోలియన్ మాస్కో నగరాన్ని వదలి, తిరిగి వెళ్ళాల్సొచ్చింది. అక్టోబర్‌లో మొదలైన ఆ తిరుగు ప్రయాణం, ఒక విషాద ఘట్టంగా మారింది. విపరీతమైన చలి, మంచు, నిర్జనమైన భూభాగాలు, ఆహారం కొరత, వీటికి తోడుగా రష్యా సైన్యాల దాడులు,ఈ తిరోగమనాన్ని ఓటమిగా మార్చాయి. బరువైన ఆయుధాలతో, చినిగిపోయిన దుస్తులతో, అలసిపోయిన ఫ్రెంచి సైన్య గమనానికి ప్రకృతి అవరోధాలు తోడుకాగా, 5 లక్షల మంది తమ ప్రాణాలను కోల్పోయారు. మిగిలిన సైన్యం అతి దయనీయ స్థితిలో జర్మనీలో పునఃప్రవేశం చేసింది. ఈ విధంగా రష్యా దండయాత్ర ఘోరంగా విఫలమైంది.

### 16.6.2.3. నెపోలియన్ ఓటమి

జార్ అలెగ్జాండర్ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ప్రష్యా, స్వీడన్‌లతో సంధి చేసుకొని, 1813 లో ఐరోపా స్వేచ్ఛకై, ఫ్రాన్స్‌పై యుద్ధాన్ని ప్రకటించాడు. ఈ విపత్కర పరిస్థితుల్లో కూడా, నెపోలియన్ తన సైనిక ప్రజ్ఞా ప్రాభవాలను ప్రదర్శించి, రష్యా, ప్రష్యా, సైన్యాలను 'లుట్జన్', (Lutzen) యుద్ధంలో ఓడించాడు. ఈ కాలయాపనను తన కనువుగా వినియోగించుకొని, క్రీ.శ. 1813 నాటికి ఆస్ట్రియా, రష్యా ప్రష్యా మరికొన్ని చిన్న రాజ్యాలతో కలిసిన నాల్గో సంకీర్ణ రాజ్యాల కూటమిని రూపొందించింది. 5 లక్షల బలంగల యీ సంయుక్త సైన్యాలు క్రీ.శ. 1813 అక్టోబర్ 13-19 తేదీల మధ్య 'లిప్‌జిగ్' (Lipzig) యుద్ధంలో నెపోలియన్‌ను ఓడించాయి. ఈ యుద్ధాన్ని సంయుక్త రాజ్యాల యుద్ధంగా పిలుస్తారు. ఈ



Dr. BRAOU LIBRARY Acc. No: CM-0117 Class No:

ఓటమితో నెపోలియన్ స్థాపించిన ఐరోపాలోని రాజ్యాలు "పేక ముక్కల మేడల్లా" విచ్ఛిన్నమైనాయి. తరిగిపోయిన సైన్యంతో నెపోలియన్ యుద్ధాన్ని తెలివితక్కువగా కొనసాగించాడు. సంయుక్త రాజ్యాల సైన్యాలు ఫ్రాన్స్ ప్రవేశించి, పారిస్‌ను అన్ని వైపుల నుండి ముట్టడిచేశాయి. ఇంత క్లిష్టపరిస్థితుల్లోను నెపోలియన్ కొన్ని మెరుపు విజయాలను సాధించలేకపోలేదు. కాని, చివరకు పారిస్ లొంగిపోయింది. 'ఫాంటెనాబ్లూ' సంధి ప్రకారం, నెపోలియన్ ఫ్రెంచి సామ్రాజ్యంపై తన హక్కులను వదులుకొని, 'ఎల్బా' (Elba) దీవికి ప్రవాసం వెళ్లాడు. ఆ ద్వీపానికి చక్రవర్తిగా నియమితుడైనాడు.

## 16.7 నెపోలియన్ ఆఖరి రోజులు

నెపోలియన్ అనంతరం, బూర్బన్ రాజు పద్దెనిమిదో లూయీ ఫ్రెంచి రాజయ్యాడు. విశాల ఫ్రెంచి సామ్రాజ్యమే స్వల్పంగా కనిపించిన నెపోలియన్‌కు ఎల్బా దీవి పాలన ఏపాటిది ? అనేక వ్యక్తిగత నిర్బంధాలకు లోనైన నెపోలియన్, క్రీ.శ. 1815లో 'ఎల్బా' దీవి నుండి తప్పించుకొని, చిన్న సైన్యంతో ఫ్రెంచి భూభాగంపై అడుగుపెట్టాడు. అతడ్ని నిర్బంధించమని పంపిన ఫ్రెంచి సైన్యం, నెపోలియన్ "వర్థిల్లు గాక" అని, నినాదాలను చేసింది. ప్రజలు బ్రహ్మాండమైన స్వాగతమిచ్చారు. నెపోలియన్‌ను బోనులో బంధించగలనని ప్రగల్భాలు పలికిన ఫ్రెంచి రాజు పలాయనం చిత్తగించడంతో, నెపోలియన్ పారిస్‌లో తన అధికారాన్ని పునఃస్థాపించాడు. బెదిరిపోయిన ఐరోపా సంయుక్త రాజ్యాలు తమ విభేదాలను విస్మరించి, నెపోలియన్‌పై యుద్ధాన్ని ప్రకటించాయి. క్రీ.శ. 1815 జూన్ 18 వ తేదీన 'వాటర్లూ' (Waterloo) యుద్ధంలో నెపోలియన్ ను "డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్" ఓడించాడు. రెండోసారి అతడు రాజ్యాధికారాన్ని త్యజించాడు. నెపోలియన్ బ్రిటీష్ వారి రక్షణ కోరాడు. అతడ్ని అట్లాంటిక్ లోని 'సెయింట్ హెలీనా (St. Helena) ద్వీపానికి పంపారు.

ఈ చిన్న ద్వీపంలో ఐదున్నర సంవత్సరాలు నెపోలియన్ జీవితం అతి విషాదకరమైన పరిస్థితుల్లో గడిచింది. తన జీవిత విశేషాలను గ్రంథస్థం చేస్తూ, క్రీ.శ. 1821 మే నెల 5వ తేదీన, సెయింట్ హెలీనా ద్వీపంలో నెపోలియన్ మరణించాడు. దీంతో, ఐరోపా చరిత్రలో నెపోలియన్ యుగం ముగిసింది.

## 16.8 నెపోలియన్ ఘనత

నెపోలియన్ ఒక అద్భుత వ్యక్తి. తీవ్రమైన కోర్కెలు ,అద్భుతమైన ఊహా శక్తి, చమత్కార చాతుర్యం గల నెపోలియన్, ఒక సైనిక వ్యూహ రచయితయేకాదు. గొప్ప పరిపాలనాదక్షుడు కూడా. ప్రేమించడంలో, ప్రేమింపబడటంలో ఉన్న మాధుర్యాన్ని, చేదును, సమానంగా చవి చూశాడు. ఒక్కోసారి దుర్మార్గంగా, మోటుగా కన్పిస్తాడు. కాని, అతనిలో క్షమ, ఔదార్యం , కావ్యశృంగారం సమ్మేళనం చెందాయి. స్నేహశీలుడు. చిన్ననాటి స్నేహితులను పదిలంగా దాచుకొన్నాడు. బంధువులను రాజ్యాలతో, బిరుదులతో సత్కరించాడు.

నెపోలియన్ జ్ఞాపక శక్తి అద్వితీయమైంది. ప్రతి విషయాన్ని , వ్యూహాన్ని రెండు సంవత్సరాల ముందుగానే మనసులో రూపకల్పన చేసుకొనేవాడు. " యుద్ధ భూమిలో విజయాలను సాధించేముందే, వాటిని తన ఆలోచనల్లోనే జయించేవాడు." యుద్ధ భూమిలో నెపోలియన్ 40 వేల మంది సైనికులకు సాటియని, వెల్లింగ్టన్ శ్లాఘించాడు. నెపోలియన్ గొప్పవక్త, రచయిత, పత్రికా రంగంలో ఆకునూరుడు. యుద్ధ సమాచార పితామహుడు. స్వీయ ప్రచారంలో, హావ భావ ప్రకటనలో విశేషమైన ప్రతిభగల వ్యక్తి అని, ఫిషర్ అభిప్రాయం. ఆధునిక కాలంలో అతడు ఒక మహోన్నత నాయకుడని 'విగ్నెట్' (Vignet) భావించగా, అతడు ఐరోపా ఐక్య నియంత యని కొందరు విమర్శించారు. అతడు గొప్ప అవకాశవాదియని

BRAOU

డేవిడ్ థామ్సన్ భావించగా, అద్భుతమైన మేధాసంపత్తి, ప్రతిభల్లో అతని కెవరు దీటురారని గ్రాంట్, టెంపర్లీ (Grant and Temperly) వ్యాఖ్యానించారు. నెపోలియన్‌తో పోల్చదగ్గ వ్యక్తి ఒక్క జూలియస్ సీజర్ మాత్రమేనని హాలెండ్ రోజ్, అతని మేధాసంపత్తి నమ్మ శక్యంగా లేదని టాలీరాండ్, అభిప్రాయం. మేధస్సు, శక్తి, అద్భుతంగా సమ్మేళనమై, నెపోలియన్‌ను ఒక ఆకర్షణీయమైన మానవాతీత వ్యక్తిగా రూపొందించాయని, హెరాల్డ్ శ్లాఘించాడు. ఏమైనా, ఆకాలాన్ని నెపోలియన్ యుగంగా శాసించిన ఒక చారిత్రక నాయకునిగా అతడు చిరస్మరణీయుడు.

## 16.9. సంగ్రహంగా

సంగ్రహంగా, ఈ భాగంలో ఒక సామాన్య వ్యక్తి అయిన నెపోలియన్, తన ప్రజ్ఞాపాటవాలతో, సునిశిత మేధస్సుతో ఒక దేశ అధిపతిగా, చక్రవర్తిగా ఎదగడం గమనించాం. నెపోలియన్ ఒక సంస్కర్తగా సాధించిన శాంతి విజయాలు, చక్రవర్తిగా సాధించి, పోగొట్టుకున్న యుద్ధ విజయాలను వివరించడమైంది.

## 16.10. పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. నెపోలియన్ ఏ రీతిగా అధికారాన్ని హస్తగతం చేసుకున్నది వివరించి, ఆయన వ్యక్తిత్వ ప్రతిభను వివరించండి.
2. నెపోలియన్ మొదటి కన్సల్‌గా చేసిన సంస్కరణలను పరిశీలించండి.
3. నెపోలియన్ విజయాలను విశ్లేషించి, అతని వైభవ పరాకాష్టను పరిశీలించండి
4. నెపోలియన్ పతన కారణాలను తులనాత్మకంగా విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. భూఖండ విధాన అర్థం, లక్ష్యాలు, ఫలితాలను గూర్చి విమర్శనాత్మకంగా రాయండి
2. నెపోలియన్ ఘనత ఎట్టిది ?

## 16.11. ఉపయుక్త గ్రంథాలు


C.D. Hazen : **Modern Europe upto 1945**
Hassal : **Life of Napoleon**
Ludwig, E. : **Napoleon**
Rose J.H. : **Life of Napoleon**
C.J.H. Hayes : **Modern Europe upto 1870**
H.A.L. Fisher : **Bonapartism**


రచయిత : శ్రీ ఎ.వి. కోటిరెడ్డి

BRAOU

# భాగం –17 : ఫ్రెంచి విప్లవ ఫలితాలు

విషయక్రమం


17.0 లక్ష్యాలు

17.1 పరిచయం

17.2 విప్లవ నాయకులు

17.2.1 మిరాబు

17.2.2 మారట్

17.2.3 డాంటన్

17.2.4 రాబస్పియర్

17.2.5 కార్నట్

17.3 విప్లవ స్వభావం

17.4 విప్లవ ఫలితాలు

17.4.1 ప్రజా సార్వభౌమాధికారం

17.4.2 సమానత్వం

17.4.3 స్వేచ్ఛ

17.4.4 జాతీయతత్వ ప్రచారం

17.4.5 మానవతావాదం

17.4.6 కాల్పనిక యుగ ఉద్యమం

17.4.7 సామ్యవాద సిద్ధాంత ఛాయలు

17.4.8 ఫ్రాన్స్ దేశాభివృద్ధి

17.5 ఫ్రెంచి, ఆంగ్ల విప్లవాల మధ్య పోలికలు

17.6 సంగ్రహంగా

17.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

17.8 ఉపయుక్త గ్రంథాలు


## 17.0 లక్ష్యాలు

ఇంతకు ముందు భాగంలో మీరు విప్లవ కారణాలను, పురోగతిని గురించి అధ్యయనం చేశారు. ఈ భాగాధ్యయనం ద్వారా, విప్లవ కాలంలో ప్రముఖులైన నాయకుల గురించి, విప్లవ స్వభావాన్ని గూర్చి విశ్లేషించగలగాలి. అంతేకాక, ఫ్రెంచి విప్లవం వల్ల వివిధ రంగాల్లో వచ్చిన ఫలితాలను కూడా తెలుసుకొని, ఫలితాలు ఎలా చరిత్ర గతిని ప్రభావితం చేశాయో గ్రహించగల్గాలి. ఇంకా, ఈ పాఠ్యభాగ అధ్యయనం ద్వారా, ఆంగ్లేయ విప్లవానికి, ఫ్రెంచి విప్లవానికి గల పోలికలను కూడా తెలుసుకోగలగాలి.

BRAOU

## 17.1 పరిచయం

ఇంత వరకు మనం ఫ్రెంచి విప్లవ కారణాలను, దాని గమనాన్ని, నెపోలియన్ జీవిత విశేషాలను విశదంగా చదివున్నాం. ఈ ఆఖరి భాగంలో ఆ విప్లవం వల్ల వచ్చిన మార్పులను విమర్శనాత్మకంగా పరిశీలించగలం. ఫలితాలను చదివే ముందు, కొంతమంది విప్లవ నాయకులను గూర్చిన సంక్షిప్త పరిచయాన్ని పొందు పర్చడమైంది.

## 17.2 విప్లవ నాయకులు

మిరాబు, మారట్, డాంటన్, రాబస్పియర్, కార్నట్‌లు ప్రముఖ విప్లవ నాయకులు. వీరి గుణగణాలు, స్వభావ, పాత్రలను క్లుప్తంగా సమీక్షిద్దాం.

### 17.2.1 మిరాబు (Mirabeau)

మిరాబు తండ్రి, కుటుంబ నిర్వహణ చేతగాని ఒక ప్రభువు. ఆ కారణంగా, బాల్యం నుండే మిరాబు అల్లరి చిల్లరగా తయారయ్యాడు. అతని గొడవలు భరించలేక, తండ్రే ఎన్నో సార్లు మిరాబును నిర్బంధించమని అధికారులను కోరేవాడు. మిరాబు యువకుడిగా విస్తృతంగా దేశాటనం చేశాడు. ఇంగ్లాండ్ వెళ్లాడు. ఈ పర్యటనలే అతనికెన్నో విషయాలను నేర్పాయి. తాను ప్రభువైనా, 1789 లో మూడో ఎస్టేట్ ప్రతినిధిగా ఎన్నికయ్యాడు. సామాన్య ప్రజల నాయకుడయ్యాడు. టెన్నిస్ కోర్ట్ శపథం తర్వాత మూడు ఎస్టేట్‌లు కలిసే సమావేశం కావాలని, తమను చంపినా కదిలేది లేదని, గంభీరంగా ప్రకటించారు. మిరాబు జాతీయ శాసన సభ నాయకునిగా, అధ్యక్షునిగా, ఎన్నికయ్యాడు.

మిరాబు మితవాది. జాకోబిన్ల తీవ్ర కార్యకలాపాలు నచ్చక, ఆ క్లబ్‌కు రాజీనామా చేశాడు. ఫ్రాన్స్‌లో ఇంగ్లాండ్ పద్ధతిలోని పార్లమెంటరీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అతని కోరిక. రాజు శాసన సభ సలహాలను స్వీకరించి, రాజ్యాంగబద్ధంగా, కార్యనిర్వాహక అధిపతిగా ఉండాలని మిరాబు ఆశించాడు. దానికై కృషి చేశాడు. మిరాబు ప్రతిపాదనలను సభ తిరస్కరించగా, జాకోబిన్లు అతనిని దేశ ద్రోహిగా, రాజుతో చేతులు కలుపుతున్న వ్యక్తిగా చిత్రించారు. మరో వైపున రాజు కూడా మిరాబును పూర్తిగా నమ్మలేదు. ఈ గొడవలన్నింటికి మిరాబుయే మూల కారణమని రాణీగారి విశ్వాసం. మిరాబు రాజుగారి నుండి అప్పులు తీర్చడానికి కొంత డబ్బు తీసుకోవడం, ఆ విషయాన్ని అతడే స్వయంగా చెప్పడంతో, జాతీయ సభకు అతనిలో నమ్మకం పోయింది. అతడు చేసిన ప్రతి రాజీ ప్రయత్నాన్ని అపార్థం చేసుకోవడం జరిగింది. 1791 లో అతడు మరణించే నాటికి, "నేను చేసిన ప్రతిపని వినాశనానికి తోడ్పడింది" అని వాపోయాడు. మిరాబుకు వ్యక్తిగతంగా ఎన్ని దుర్వ్యసనాలున్నా, ఎంతటి అనాకారైనా, రాజకీయంగా వాస్తవవాది, ముందుచూపున్న రాజనీతిజ్ఞుడు. అతడు చేసిన రాజీ ప్రయత్నాలు మంచివే అయినా, ఆ విప్లవ వాతావరణంలో విఫలమయ్యాయి. రాజు, సభ ఒకరితొనొకరు సహకరించ నిరాకరించినపుడు, "రాజరికం, అధికారం, జాతి యావత్తు నశిస్తుంది" అని బాధ పడ్డాడు. బ్రతికున్నంతకాలం సభలో అతని గంభీర స్వరం నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఫ్రాన్స్ పురాతన వ్యవస్థను కదలించిన మిరాబును "మండే గుండె, మనస్సు" గల వ్యక్తిగా కెటిల్‌బీ (Ketelbey) చెప్పగా, 'మేధస్సు, అల్పత్వం, ప్రాభవం, అవమానం సమ్మేళనంగా అతని జీవితం" గడిచిందని ప్రొఫెసర్ సాల్వమిని (Prof. Salvemini) వ్యాఖ్యానించాడు.

### 17.2.2 మారట్ (Marat)

మారట్ రాజకీయాల్లో ప్రవేశించకుండా ఉన్నట్లయితే, చరిత్రలో ఒక శాస్త్రవేత్తగా, రచయితగా

BRAOU

మిగిలిపోయేవాడు. మంచి డాక్టర్‌గా పేరు పొంది, స్కాట్లండ్‌లోని విశ్వవిద్యాలయం నుండి గౌరవ పట్టా పుచ్చుకున్నాడు. కొన్నాళ్లు ఆర్లియాన్స్ ప్రభువు కొలువులో ఉండేవాడు. 1789 లో ఎస్టేట్ జనరల్ సమావేశాల సందర్భంగా, అతని దృష్టి రాజకీయాల వైపు మళ్లింది. ఫ్రాన్స్‌లో రాజ్యాంగాన్ని ఇంగ్లాండ్ పద్ధతిలో రూపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాలు 'మారట్' కు నచ్చలేదు. మారట్ దృష్టిలో ఇంగ్లాండ్ లో ఉన్నది కులీన పాలన కాని, ప్రజా పాలన కాదు. కాని, ఫ్రాన్స్‌లో నిజమైన ప్రజా పాలన రావాలని, ప్రభుత్వంలో ప్రజలకు విస్తృత ప్రమేయముండాలని ఆశించాడు. 1791-92 మధ్య, 'ప్రజల స్నేహితుడు' (Ami du people) అనే పత్రికకు సంపాదకత్వం వహించి, దాని ద్వారా రాజ కొలువును, ప్రభువులు, మతాచార్యులను దుయ్యబట్టాడు. కొన్ని సందర్భాల్లో జాతీయ శాసన సభా కార్యకలాపాలను కూడా విమర్శించాడు. మారట్ ఏ పార్టీ సభ్యుడు కాదు. తాను నమ్మిన విశ్వాసాలకై అన్ని త్యాగాలు చేశాడు. పేదరికం, కష్టాలు, బాధలు, దౌర్జన్యం, వీటిలో దేనికి వెరచలేదు. చీకటి గుయ్యారాలలో తలదాచుకొంటూ, అతి భయంకరమైన జబ్బులు కూడా తెచ్చుకొన్నాడు. అయినా, తన విప్లవ కార్యక్రమాన్ని కొనసాగించాడు. అతడు ప్రజలను ప్రేమించాడు. ప్రజలతనిని ప్రేమించారు. ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో అవసరమైతే, రక్తపాతానికి, హింసకు కూడా మద్దతు పలికాడు. 1793లో జరిగిన తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. దాని ఫలితంగా సభ నుండి గిరాండి (Girandist) సభ్యులను బహిష్కరించడం జరిగింది. మారట్ ప్రభుత్వపు గుండెల్లో నిద్రపోయాడు. ప్రజా హృదయాల్లో ప్రతిస్పందించాడు. 1793 లో హత్య చేయబడిన మారట్‌ను, కొందరు రక్తపిపాసిగా చిత్రించినా, విప్లవ సాఫల్యం కోసం కొన్ని తలలు తెగడంలో తప్పులేదని, అతడు ఎన్నియో కలలు కన్నాడు. అతని తెలివితేటలు అమోఘమైనవి. నిజాయితీ నిలకడైంది. పేదల పట్ల ప్రేమ నిరంతరమైంది. అతని ఉపన్యాసాలు, పసభావాలు, హింసకైనా వెరవని ప్రవృత్తి, మారట్‌ను ఒక నియంతగా చిత్రించాయి. సభలోని సభ్యులందరిలోను అతడంటే అందరికీ భయం, ఏహ్య భావం ఏర్పడ్డాయి. ఏమైనా, మారట్ ఒక నిజమైన విప్లవవాది. ప్రజామిత్రుడు.

### 17.2.3 డాంటన్ (Danton)

వ్యవసాయదారుని కుమారుడైన డాంటన్, న్యాయ శాస్త్రాన్ని అభ్యసించిన 'లాయర్' అయ్యాడు. విప్లవానికి ముందు తెలివిగల యువ న్యాయవాదిగా, ఉదారవాదిగా, పేరు గడించాడు. పుస్తక పఠనమన్న ఎంతో ఇష్టం. అతని అందమైన వర్చస్సు, గంభీరమైన గొంతు, అతనికి ఆభరణాలు. వాగ్వివాదంలో ఎవరినైనా జయించగల వక్త. తన ఉపన్యాసాల ద్వారా ప్రజల నుద్రేకపరుస్తూ, తాను మాత్రం ప్రశాంతంగా ఉండేవాడు. మధ్యతరగతికి చెందిన డాంటన్, పారిస్ నగర కార్మిక వర్గ సంక్షేమానికి కంకణం కట్టుకొన్నాడు. మిరాబుతో స్నేహం కలిపిన తొలి ఫ్రెంచి విప్లవ రోజుల్లో, రాజకీయాల్లో చురుకుగా పాల్గొని, తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నాడు. మారట్‌తో కలిసి, 1790లో కార్డీలియర్ (Cordilier) క్లబ్ ను, స్థాపించి, రాజ వ్యతిరేక కార్యకలాపాల్లో నిమగ్నమయ్యాడు. పారిస్ కమ్యూన్‌లో డాంటన్ అతి ముఖ్యమైన వ్యక్తి. రిపబ్లికన్ భావాలను విస్తృతంగా ప్రచారం చేశాడు. క్రూరంగా, ధైర్యంగా కన్పించినా, రక్తపిపాసి కాదు. అవసరాలను బట్టి పరిస్థితులను మార్చుకోవాలనే వాస్తవ రాజకీయ నాయకుడు, విదేశీ యుద్ధం, జాతీయ కన్వెన్షన్ కార్యకలాపాలను దెబ్బతీయగలదని భావించిన సందర్భంగా, భీతావహ పాలనను, నిరంకుశాధికారాన్ని ప్రవేశపెట్టడంతో, 'డాంటన్' ప్రముఖ పాత్ర వహించాడు. 1792లో మిత్ర రాజ్యాల సైన్యాలు ఫ్రాన్స్‌ను చుట్టిముట్టి, ఫ్రెంచి రాజుకు ఎలాంటి ప్రమాదం జరిగినా విపరీత పరిణామాలు రాగలవని హెచ్చరించగా, పారిస్‌లో వచ్చిన తిరుగుబాటుకు డాంటన్ నాయకత్వం వహించాడు. ఆ సందర్భంగానే "శత్రువును ఆపాలంటే రాజరిక మిత్రులను భయపెట్టాలి. ధైర్యం, అత్యంత ధైర్యం, నిరంతర ధైర్యం, అవసరం" మనే

సినాదమిచ్చాడు. భీతావహపాలన సందర్భంగా జరిగిన హింసాకాండను గూర్చి చదివాం. డాంటన్ ఫ్రెంచి సైన్యంలో ప్రవేశపెట్టిన నూతనోత్సాహ ధైర్యాలను గూర్చి కూడా చూశాం. ప్రథమంలో రాబస్పియర్‌తో కలిసి పని చేసినా, వారి మధ్య విభేదాలు పొడ సూపినందువల్ల, డాంటన్‌ను కూడా గిలిటన్‌కు పంపడం జరిగింది.

డాంటన్ రాజనీతిజ్ఞుడు. ఫ్రాన్స్‌లో రిపబ్లిక్ సుస్థిరం కాగానే, అన్ని వర్గాల వారిని కలపాలని ప్రయత్నించాడు. జాకోబిన్లలో, అందరికన్నా డాంటన్ దుర్మార్గుడు, రక్తపిపాసి యని చిత్రించడమైంది. కాని, అది వాస్తవం కాదు. పరిస్థితులు ఆ రోజున అట్టి విధానాన్ని నిర్దేశించాయి. అతని పలుకుబడి, పేరుప్రతిష్ఠలు ఇతర నాయకులకు అసూయను కల్గించాయి. రాబస్పియర్ అతనిని నిర్బంధించి, విప్లవ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నాడనే నేరాన్ని ఆపాదించాడు. ఆ సందర్భంగా 'డాంటన్', భీతావహ పాలనలోని దుర్మార్గాలు, దురాగతాలు, నచ్చలేదని, రాణిని ఉరితీసే ప్రయత్నాన్ని నిరోధించడంలో విఫలుడయ్యాడని, గిరాండిస్ట్‌ల ఊచకోత తన కేడ్పును తెప్పించిందని చెప్పాడు. డాంటన్ బాగా ఆస్తి సంపాదించి, దాన్ని రక్షించుకోడానికి శాంతిని కోరుతున్నాడని, అవకాశవాదియని, విప్లవానికి శత్రువుగా మారాడనే అభియోగాలపై, గిలటిన్‌కు పంపడం జరిగింది.

### 17.2.4 రాబస్పియర్ (Robespierre)

మధ్య తరగతి కుటుంబానికి చెందిన రాబస్పియర్, పారిస్ విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రాన్ని అభ్యసించి, కొన్నాళ్లు న్యాయవాద వృత్తిని చేపట్టాడు. క్రిమినల్ జడ్జిగా వచ్చిన నియమావకాశాన్ని, ఉరి శిక్ష విధించడం ఇష్టంలేక వదులుకొన్నాడు. మంచి వక్తగా, రచయితగా పేరుపొందాడు. రూసో సిద్ధాంతాలను మనసారా నమ్మి, ఆచరించాచ్చని ప్రయత్నించాడు. 1789లో మూడో ఎస్టేట్ ప్రతినిధిగా ఎన్నికై, తీవ్రవాదుల్లో చేరాడు. వారు కేవలం సభలో ముప్పైమందే. అందువల్ల వారి మాట చెల్లేది కాదు. అందువల్ల, పారిస్ ప్రజల మద్దతును కోరి, జాకోబిన్ క్లబ్ సభ్యునిగా చేరాడు. ఆ క్లబ్ నాయకత్వాన్ని రాబస్పియర్ స్వీకరించే నాటికి, అందులో ఉన్న కొద్ది మంది మితవాదులు కూడా రాజీనామా చేశారు. నాటి నుండి జాకోబిన్ క్లబ్ సాంఘిక ప్రజాస్వామ్య స్థాపనకు అనవరత కృషి జరిపింది. దాని ప్రముఖ సంధాత రాబిస్పియర్.

BRAOU

భీతావహ పాలనా కాలంలో డాంటన్‌తో కలిసి పనిచేశాడు. డాంటన్ పలుకుబడి తగ్గగానే, తాను నాయకత్వం వహించి, జాతీయ కన్వెన్షన్, పారిస్ కమ్యూన్ ప్రజా రక్షణ సమితిలో అపారమైన అధికారాన్ని చెలాయించాడు. సెయింట్ జస్ట్ సహాయంతో, నిరంకుశాధికారాలనొంది కొంతమంది ప్రత్యర్థులను దేశద్రోహులుగా చిత్రించి, వధించాడు. 1794లో మరి కొందరి ప్రత్యర్థులపై దేశద్రోహాన్ని ఆరోపిస్తూ, జాతీయ కన్వెన్షన్‌లో ప్రసంగించాడు. అప్పటికే అతని విధానాలకు విసిగిన సభ, రాబస్పియర్ ప్రతిపాదనలను తిరస్కరించింది. కాని, జాకోబిన్ క్లబ్ సమర్థించింది. తిరిగి రాబస్పియర్ జాతీయ కన్వెన్షన్‌లో ప్రవేశించి ప్రసంగించాలని ప్రయత్నించగా, అతనిని, సెయింట్ జస్ట్‌ను అరెస్ట్ చేసి, విచారణకు పంపించారు. కొంత గందరగోళం పిదప, చివరకు 1794 జూలై నెల్లో రాబస్పియర్‌ను గిలటిన్ చేయడం, చరిత్ర పునరావృతమవుతుందనే నానుడికి నిదర్శనం.

రాబస్పియర్ పై పెక్కు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సామాన్య ప్రజలతనిని ఆరాధించగా, కొందరతని చూసి భయపడ్డారు. మరికొందరు ఏహ్యపడ్డారు. కొందరు చరిత్రకారులు అతనిని మానవతావాదిగా, సాంఘిక న్యాయం కోసం పోరాడిన మనిషిగా చిత్రించగా, మరికొందరి దృష్టిలో అతడు అత్యాశపరుడు, కుట్రదారుడు, మోసగాడు. రాబస్పియర్ తాను చేస్తున్న ప్రతి పని ప్రజల కోసమే అని భ్రమించాడు. వ్యక్తిగతంగా చాలా నిరాడంబరంగా, సన్యాసిలా జీవించేవాడు. "దేశభక్తులందరిలోను అధికంగా అనుమానితుడైన,

"నైరాశ్య వ్యక్తిని నేను" అని తానే చెప్పుకున్నాడు. పారిస్‌లో అత్యంత అభిమాన మిత్రుడైన వ్యక్తి రాబస్పియర్. అతని కెందరో అభిమానులు, నిజమైన స్నేహితులుండేవారు. కాని, యుద్ధం, హింసా వాతావరణంలో ఫ్రాన్స్‌ను పునరుజ్జీవనం చేయాలనే అతని ప్రయత్నం విఫలం కావడం, విషాదకరమైన విషయం. అతనిలో ఎన్నో మంచి గుణాలున్నాయని, కాని స్వతహాగా అతడు పిరికివాడని, పిరికివాళ్లే క్రూరంగా వ్యవహరిస్తారని గ్రాంట్ అండ్ టెంపర్లీలు (Grant ani Temperley) అభిప్రాయపడగా, ఫ్రెంచి విప్లవ నాయకుల్లో రాబస్పియర్ చిరస్మరణీయుడని, గొప్ప వక్త అని, ఆదర్శవాది అని, ప్రజల సార్వభౌమాధికారం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, గణతంత్ర రాజ్యం మొదలైన సిద్ధాంతాలెన్నో అవిభాజ్యాలని భావించాడని, డేవిడ్ థామ్సన్ వ్యాఖ్యానించాడు.

### 17.2.5 కార్నట్ (Carnot)

జాతీయ కన్వెన్షన్ సమావేశం నాటి నాయకుల్లో కార్నట్ కూడ ప్రముఖుడు. విదేశీ యుద్ధాన్ని ఎదుర్కొనడానికి ఫ్రాన్స్ చరిత్రలోనే కాక, ప్రపంచ చరిత్రలోనే ప్రథమంగా ప్రవేశపెట్టిన నిర్బంధ సైనిక విధానానికి మూల పురుషుడు. రాత్రింబవళ్లు కృషి చేసి, ఎందరినో సైన్యంలో చేర్చి, వారికి తర్ఫీదు నిచ్చి, కొద్దికాలంలో బ్రహ్మాండమైన సైన్యాన్ని సమాయత్తం చేశాడు. "జాతీయ సైన్యం" అనే శక్తిని రూపొందించి, సైన్యంలో ఎన్నో సంస్కరణలను చేశాడు. విదేశీ సైన్యాన్ని పారద్రోలి, విప్లవ సైనాన్ని విజయపథంలో నడిపించిన వ్యక్తి కార్నట్. సెయింట్ జస్ట్ కూడా ఈ కృషిలో కార్నట్‌కు ఎంతో సహాయపడ్డాడు.

## 17.3 విప్లవ స్వభావం

ఫ్రెంచి విప్లవం ఆ దేశానికి పరిమితం కాలేదు. దాని ప్రభావం ఒక ఫ్రెంచి వ్యవస్థలనే నియంత్రించలేదు. ఆధునిక కాల విప్లవాలలో ఇంగ్లాండ్ విప్లవ ప్రభావం ఆదేశంలో ప్రజల హక్కుల పరిరక్షణకు, రాజ్యాంగబద్ధ రాజరికానికి దారితీసింది. అమెరికా వలస పాలన నుండి విముక్త లిఖిత రాజ్యాంగం, పౌరుల ప్రాథమిక హక్కులు, అధికార విభజన, ప్రజాస్వామ్యం, మొదలైన ఎన్నో ఆధునిక భావాలకు, పోకడలకు నాంది పలికినా, ఆ ప్రభావం కేవలం ఆ దేశానికే పరిమితమైంది. ఆ గాలులు సముద్రాలు దాటి, అటు ఐరోపాను గాని, ఇటు ఆసియానుగాని, పెద్దగా తాక లేదు.

ఫ్రెంచి విప్లవం ఒక మహా ప్రభంజనం. దాని తాకిడిలో ఫ్రాన్సే కాక, ఐరోపా పురాతన వ్యవస్థలన్నీ దద్దరిల్లాయి. ఆ విప్లవ సిద్ధాంతాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, రానున్న కాలాల్లో పీడిత, తాడిత ప్రజలకు నినాదాలుగా, ఆశాజ్యోతులుగా వెలిశాయి. ఐరోపాను, ప్రపంచాన్ని నూత్న భావ సంచయంతో ఉత్తేజితం చేశాయి. సాంస్కృతిక పునరుజ్జీవనం నాడు మొదలైన ఆధునిక యుగారంభం, ఫ్రెంచి విప్లవంతో గమ్యం చేరింది. మధ్యయుగ రాజకీయ, సాంఘిక ఆర్థిక, వ్యవస్థను తారుమారు చేసి, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, జాతీయతత్వం అనే నూతన శకాన్ని ఆవిష్కరించింది. అందువల్ల, ఫ్రెంచి విప్లవాన్ని రెండో సాంస్కృతిక పునరుజ్జీవనంగా (Second Renaissance), ప్రొఫెసర్ మిచెలెట్ (Michelet) వ్యాఖ్యానించాడు. అయితే, యింతకు ముందు భాగంలో మనం విప్లవ కాలంలో జరిగిన కొన్ని పొరపాట్లు, హింసాకాండ, స్వార్థాలు, సైనిక నియంతృత్వాలను చదివున్నాం. అంతేగాక, యీ విప్లవాన్ని కొన్ని వర్గాలు తమ స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకోవడం, నాటి సంస్కరణల్లో ఒక లోపం. నిశితంగా పరిశీలిస్తే, ఈ విప్లవ కాలంలో ఏనాడు సామాన్య ప్రజల్లో అతి సామాన్యులైన వారికెట్టి హక్కులు రాలేదు. వారి ప్రతినిధులను ఎన్నుకొనే హక్కు కూడా ఇవ్వలేదు. ఈ విప్లవం మధ్యతరగతి వారిచే ప్రేరితమై, వారి ప్రయోజనాల కొరకే ముందుకు సాగిందనే విమర్శలో నిజం లేకపోలేదు. విప్లవ గమనాన్ని చూస్తే, ఒక విషయం స్పష్టంగా కన్పిస్తుంది. విప్లవ నాయకులు ప్రతి ఒక్కసారి పై వర్గం నుండే వచ్చారు. జాతీయ శాసన

BRAOU

సభా కాలంలో మూడో ఎస్టేట్‌కు సమాన ప్రతిపత్తి నివ్వాలని, మతాచార్యుల, ప్రభువుల స్వాధికారాలు తొలగిపోవాలని జరిగిన ఉద్యమానికి నాయకులు, ప్రభువుల వర్గం నుండి వచ్చారు. అదే రీతిగా, రెండో దశలో పారిస్ ప్రజల, కార్మికుల హక్కులపై జరిగిన పోరాటంలో, సంస్కరణల్లో నాయకత్వం వహించిన జాకోబిన్లు, మధ్యతరగతికి చెందిన మేధావులు. ఫ్రెంచి విప్లవంలో వచ్చిన ఒడుదుడుకులు, వర్గ పోరాటం, కొన్ని సందర్భాల్లో అనుచిత దౌర్జన్యకాండ, స్వార్థశక్తుల ప్రమేయం, మొదలైనవన్నీ ఏ సామాన్య విప్లవంలో జరిగే సహజ సంఘటనలే. అందువల్ల, ఈ మహా విప్లవ కాలంలో జరిగిన పై సంఘటనలను ఆధారం చేసుకొని, విప్లవ ప్రాధాన్యతను కించపర్చడానికి వీల్లేదు. వాస్తవానికి ఆ విప్లవం ఒక మహోన్నత చారిత్రక సంఘటన.

1789 జూలై 14 బాస్టిల్‌కోట పతనాన్ని ఫ్రెంచి విప్లవ దినంగా, స్వాతంత్ర్యదినంగా, వేడుక జరుపుకుంటారు. వాస్తవానికి విప్లవం నాలుగు దశల్లో జరిగిందని పలువురి చరిత్రకారుల అభిప్రాయం. 1788 విప్లవ తొలి దశలో కులీన వర్గం విజయాన్ని సాధించింది. ఆర్థిక మంత్రులు, ప్రముఖుల సభ, పారిస్ పార్లిమా ఇందులో ప్రధానపాత్ర వహించాయి. ఏ రాజరికం అయితే ఈ కులీన వర్గాల స్వాధికారాలను ఇన్నాళ్ళుగా పరిరక్షిస్తూ వచ్చిందో, ఆ రాజరిక అధికారాలను తగ్గించడం జరిగింది. రెండో దశలో విప్లవం, మధ్య తరగతి వారిచే ప్రభావితమైంది. ఈ కాలంలో ఉదారవీరులైన ప్రభువులు, న్యాయవాదులు, మేధావులు నాయకత్వం వహించారు. ఎస్టేట్ జనరల్ సమావేశం, మూడో ఎస్టేట్ తన ప్రాధాన్యతా ప్రతిపత్తులకై జరిపిన పోరాటం. జాతీయ శాసన సభా సమావేశంలో మధ్య తరగతి వారి ప్రయోజనాలకు అనుగుణంగా జరిగిన నిర్ణయాలు మనకు తెలిసినవే. మూడో దశలో విప్లవం నగరాలకు వ్యాపించింది. అప్పటికి విప్లవ కారణంగా అస్తవ్యస్థ స్థితి ఏర్పడడమేకాక, నిరుద్యోగం, ఆహార కొరత ప్రబలాయి. కార్మికులు, రోజువారి జీతాలవారు పలు ఇబ్బందులు పడ్డారు. తినడానికి రొట్టె, చలి నుండి కాపాడుకోవడానికి కర్ర పుల్లలు లేని దీనస్థితి ఏర్పడింది. ఈ చిన్న చిన్న దుకాణాదారులు దివాలా తీశారు. ఈ అసంతృప్తి తీవ్రవాదానికి దారి తీసింది. ఆ కాలంలోనే తీవ్రవాద భావాలు, సామ్యవాద ధోరణులు ప్రబలాయి. విప్లవం కేవలం మధ్యతరగతి ప్రయోజనాలను మాత్రమే పరిరక్షించిందని, దానివల్ల కార్మికులకెట్టి లాభం చేకూరలేదని తలచారు. జాతీయ కన్వెన్షన్ సమావేశంలో వచ్చిన సంస్కరణలు, ఈ భావాలకు ప్రతీకలు. ఆఖరి దశలో గ్రామీణ వాసులు, రైతులు కూడా విప్లవ భాగస్వాములయ్యారు. విప్లవం నాలుగు దశలుగా జరిగి, భిన్నమైన సాంఘిక వర్గాలచే ప్రభావితమై, పురోగమించింది. అందువల్ల, ఫ్రెంచి విప్లవంలో భావ సంఘర్షణతోపాటు, వర్గ సంఘర్షణ కూడా ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

## 17.4 విప్లవ ఫలితాలు

పురాతన వ్యవస్థలకు, ఆధునిక భావాలకు మధ్య జరిగినది క్షీర సాగరం. ఆమధనం నుండి ఎన్నో నూతన పోకడలు, ఆశయాలు, ఆశలు చిగురించాయి. ఆధనిక కాలానికి వసంతగీతం పాడాయి. ఈ విప్లవం వల్ల వచ్చిన కొన్ని ముఖ్య ఫలితాలను ఇంతకు ముందే యాధృచ్ఛికంగా చదివినా, మరోసారి ఇక్కడ పునశ్చరణ చేసుకోవాలి.

### 17.4.1 ప్రజా సార్వభౌమాధికారం (Popular Sovereignty)

ఫ్రెంచి విప్లవ ప్రారంభంలో జాతీయ శాసన సభ చేసిన 'మానవ హక్కుల ప్రకటన' సార్వభౌమాధికారం ప్రజలకే చెందుతుందని, శాసనం ప్రజాభిప్రాయ ప్రతిస్పందన, అని స్పష్టంగా చెప్పడం జరిగింది. ప్రభుత్వ వ్యవస్థ, యంత్రాంగం ప్రజా సంక్షేమమే ఏకైక లక్ష్యంగా వ్యవహరించాలి. అయితే, మధ్యయుగ కాలం నుండి కొంత మంది ప్రాజ్ఞ నిరంకుశ రాజులు ఈ ధ్యేయమే తమ పాలనా లక్ష్యమని చెప్పకపోలేదు. ప్రష్యాను పాలించిన ఫ్రెడరిక్, ఆస్ట్రియాను పాలించిన రెండో జోసెఫ్, అట్టి ప్రాజ్ఞ నిరంకుశ రాజులు. అయితే, ఫ్రెంచి

BRAOU

విప్లవం ప్రజలే స్వయంగా తమ క్షేమమేమిటో నిర్ణయించుకోవాలని, దానికి కావలసిన చర్యలను తీసుకోవాలని ఉద్ఘాటించింది. ఈ సార్వభౌమాధికారంలో సాటి ప్రజలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలనే గురుతర బాధ్యత కూడా ఉన్నది. ఈ సిద్ధాంతానికి మొదట్లో కొందరి వ్యతిరేకత కనిపించినా, కాలక్రమేణ అన్ని రాజ్యాల్లోని పాలకులు, పాలితులు ఆమోదించారు. ప్రజా సార్వభౌమాధికార సిద్ధాంతాన్ని ప్రముఖంగా మధ్యతరగతి మేధావులు, ప్రజలు విస్తృతంగా ప్రచారం చేశారు.

## 17.4.2 సమానత్వం (Equality)

చట్టం ముందు ప్రజలందరూ సమానులే. కావున, పుట్టుకతో కాని, సంపదతో కాని, వచ్చిన స్వాధికారాలు అనుచితం, వాటిని రద్దు చేయాలి అనేది విప్లవ సిద్ధాంతాల్లో ప్రముఖమైంది. ఫ్రెంచి విప్లవ కాలంలో సేద్య బానిసత్వం, భూస్వామ్య వ్యవస్థ, రైతుల వెట్టిచాకిరి, మొదలైన ఆంక్షలు, నీగ్రో బానిసత్వం రద్దైనాయి. ఆర్థిక సంస్థల, మత సంస్థల నియంత్రాధికారాలు తొలగిపోయాయి. మత స్వేచ్ఛ నివ్వడం జరిగింది. పత్రికా స్వేచ్ఛ, విద్యాస్వేచ్ఛ, సమావేశస్వేచ్ఛ, వాక్స్వాతంత్ర్యాలను గుర్తించడం జరిగింది. స్త్రీలకు కూడా సమాన హక్కులుండాలనే ఉద్యమాన్ని, 1792లో మేరీవూల్‌స్టోన్ క్రాఫ్ట్ (Mary Wooll stone Craft) నడిపించింది.

## 17.4.3 స్వేచ్ఛ

'స్వేచ్ఛ' అనే పదం ఫ్రెంచి విప్లవ కాలంలో ఊపిరి పోసుకుంది. నెపోలియన్ నియంతృత్వంలో,లేదా భీతావహ పాలనలో, ఈ సిద్ధాంతం కొంత మరుగున పడ్డా, మొత్తం మీద ఈ నినాదం ప్రపంచ వ్యాప్తమైంది. నాటి సంస్కరణ వాదులకు, విప్లవ వాదులకు 'స్వేచ్ఛ' అనే పదం సమర శంఖారావంగా మారింది. వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు, రాజకీయ, మత స్వేచ్ఛలను సాధించడం జరిగింది. అయితే, ఆర్థిక స్వేచ్ఛ కొంత రవకు దుర్వినియోగమై, తర్వాత కాలంలో దోపిడి విధానానికి,పెట్టుబడిదారి వ్యవస్థకు దారితీసింది. ప్రజల చేత ఎన్నుకోబడిన శాసన సభలు మాత్రమే ఈ ప్రజల స్వేచ్ఛను ప్రతిబింబించగలవని భావించారు.

## 17.4.4 జాతీయ తత్వ ప్రచారం (Spread of Nationalisim)

జాతీయతత్వం ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాల్లో మరో మణిపూస. ఫలితాలలో మరో మైలురాయి. విప్లవానికి ముందు ప్రజలు రాజ్య వ్యవస్థలో రాజుకు, సాంఘిక వ్యవస్థలో ప్రభువుకు, మత వ్యవస్థలో మతాచార్యులకు విధేయత ప్రకటించేవారు. రాజు, ప్రభువు, మతాచార్యుడు వీరు ముగ్గురూ పురాతన వ్యవస్థకు మూలస్తంభాలు. ఈ మూడింటి స్థానంలో స్వేచ్ఛ, సమానత్వం, జాతీయ తత్వం,ఆధునిక వ్యవస్థలో మూల సిద్ధాంతాలుగా నిల్చాయి. నేటి వరకు ప్రజలకు రాజే దేశం, దేశమే రాజు. కాని, విప్లవ కాలంలో దేశ ప్రయోజనాలు రాజ ప్రయోజనాలు వేరని తెలుసుకున్నారు. పదహారో లూయీ దేశం వదలి పారిపోవడానికి ప్రయత్నించడం, వారి నమ్మకం మరీ బలపడింది. రాజభక్తి బదులు దేశభక్తి ప్రబలింది. విదేశీ యుద్ధంలో 'జాతీయ విపత్తు ఏర్పడిందనే భయంతో, ఫ్రెంచి జాతి యావత్తు సర్వ సన్నద్ధమైంది. జాతీయ సైన్యం, జాతీయ రక్షక దళం, జాతీయ విద్యా విధానం, జాతీయ తత్వాన్ని ప్రేరేపించి, ఉత్తేజితులను చేశాయి. ఈ జాతీయ తత్వం అనతి కాలంలోనే ఐరోపా అంతటికి విస్తరించింది. అంతే కాదు, ఈ జాతీయ రాజ్యాల్లో వచ్చిన చైతన్యమే, నెపోలియన్ పతనానికి కారణమైంది. "సుశిక్షితమైన సైన్యాల కన్నా ప్రజా బలమే మిన్న "అని, స్పెయిన్ సైన్యాలు నిరూపించాయి. ఈ జాతీయతత్వం వియన్నా సమావేశం తర్వాత కొంత తెరమరుగయినా, 1830, 1840 ఉదార విప్లవాల్లో సజీవంగా కన్పించింది. ఇటలీ, జర్మనీ ఏకీకరణోద్యమాల్లో, తూర్పు ఐరోపాలో తురుష్క పాలనకు విరుద్ధంగా వచ్చిన సెర్బియా, గ్రీస్, రుమేనియా, బల్గేరియా, తిరుగుబాట్లలో

రష్యాకు వ్యతిరేకంగా పోలెండ్ జరిపిన పోరాటంలో, ఈ జాతీయ తత్వం బ్రహ్మాండమైన పాత్రను నిర్వహించింది. 19వ శతాబ్ది నాటికి ఈ జాతీయ తత్వం ఆసియా ఖండాన్ని కూడ ప్రభావితం చేసింది. 20వ శతాబ్దంలో వచ్చిన ఆసియా పునరుజ్జీవనం, ఆఫ్రికా స్వాతంత్రోద్యమాలకు జాతీయ తత్వమే ముఖ్య ప్రేరణ.

### 17.4.5 మానవతా వాదం (Humanism)

ఫ్రెంచి విప్లవం మానవతా వాదాన్ని ప్రోత్సహించింది. బానిసత్వ రద్దు, ప్రజా బాహుళ్యం కోసం సంస్కరణలు, కారాగారాల్లో పరిస్థితులను మెరుగుపర్చడం మొదలైన సంస్కరణలు జరిగాయి. వ్యవస్థలు, చర్చి అధికారం కన్నా, వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యమని చాటి చెప్పడం జరిగింది. ఐరోపాలో, ముఖ్యంగా ఫ్రాన్స్‌లో, మతాధికారుల అధికారాలు క్షీణించాయి. అంధకార విశ్వాసాలు పోయి, హేతువాదం, దైవశాస్త్రం బదులు తత్వశాస్త్రం, విస్తృత ప్రచారాన్ని పొందాయి. పరమత సహనం, లౌకిక తత్వం, ఫ్రాన్స్ నుండి ఐరోపాకు వ్యాపించాయి. "ఫ్రెంచి విప్లవ సైన్యాలు జాతీయ గీతాన్ని పాడుతూ, చర్చిలోని దీపాల వద్ద తమ పైపులను ముట్టించుకోవడానికి ఆగేవారని" లిప్సన్ వ్యాఖ్యానించాడు.

### 17.4.6 కాల్పనిక యుగ ఉద్యమం (Romantic movement)

ఫ్రెంచి విప్లవం కాల్పనిక యుగ పునరుద్ధరణకు, వ్యక్తిత్వవాదం ప్రబలడానికి దోహదం చేసింది. సాంప్రదాయాలను ఛేదించుకొని, స్వచ్ఛమైన ఆలోచనలపై జీవించే పద్ధతికి ఒరవడి పెట్టింది. ఈ కాలంలో వచ్చిన విక్టర్ హ్యూగో (Victor Hugo) నవల 'లే మిసరబుల్స్' (Les Miserables), 'సౌతే' (Sowthey) జోన్ ఆఫ్ ఆర్క్ (Joan of Arc) రాసిన 'గోథే' (Gothe) 'ఫాస్ట్' (Faust), కోల్‌రిడ్జ్, షెల్లీ, వర్డ్స్‌వర్త్ మొదలైన కవుల రచనలు, ఈ కాల్పనిక ఉద్యమానికి ప్రతీకలు.

BRAOU

### 17.4.7 సామ్యవాద సిద్ధాంత ఛాయలు (Socialist images)

ఫ్రెంచి విప్లవ కాలంలో సామ్యవాద సిద్ధాంత ఛాయలు కూడా కన్పిస్తాయి. ఆస్తి హక్కుపై ఎన్నో ఆంక్షలు వచ్చాయి. ప్రజోపయోగం కోసం ప్రైవేట్ ఆస్తులను ప్రభుత్వం తీసుకోవడం, ప్రభుత్వం వశం చేసుకొన్న ఆస్తులకు ప్రతిఫలం కూడా ఇవ్వక్కరలేదని చెప్పిన జాకోబిన్ల వాదనలన్నీ, సామ్యవాద సిద్ధాంతాలే. ఈ సిద్ధాంతాలు విస్తృత ప్రచారాన్ని పొందాయి. సామ్యవాదమనేది ఒక ఊహాజనిత సిద్ధాంతం. ఒక రాజకీయ కార్యాచరణ పథకంగా మారింది. ఫ్రెంచి విప్లవం కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు వారసత్వంగా నిల్చిపోయిందని క్రాప్టోకిన్ (Kroptokin) వ్యాఖ్యానించాడు. ఫ్రెంచి విప్లవం ముందు సామ్యవాదం అంకురించగా, దాన్ని కార్ల్‌మార్క్స్ విశ్వవిఖ్యాతం చేసాడు. (French Revolution laid the egg of socialism which was later hatched by Karl Marx)

### 17.4.8 ఫ్రాన్స్ దేశాభివృద్ధి

పైన చెప్పిన ఫలితాలు ఫ్రాన్స్‌కే కాక, ఐరోపాను, ప్రపంచాన్ని కూడా ప్రభావితం చేసాయి. ఫ్రాన్స్‌కు సంబంధించి, ఈ విప్లవం వల్ల ఆ దేశం బలపడింది. సంపన్నమైంది. విప్లవానికి ముందు ఎన్నో జీవితావసర వస్తువుల కొరత తీవ్రంగా ఉండేది. 1790 నుండి ఆదేశ ఉత్పాదక శక్తి బాగా పెరిగింది. విప్లవ కాల నాలుగు సంవత్సరాల్లో వ్యవసాయం బాగా అభివృద్ధి చెందింది. ఆర్థిక స్థితి కూడా మెరుగుపడింది. ఈ

పటిష్ఠ ఆర్థిక శక్తి వల్లనే, ఫ్రెంచి రిపబ్లిక్ నిలబడగల్గింది. నెపోలియన్ యుద్ధాలు చేయగలిగాడు. 1815 లో ఫ్రాన్స్ పరాజయం పొందగా, మిత్ర రాజ్యాలు ఆ దేశంలో యుద్ధం వల్ల కల్గిన అపార నష్టంతో తీవ్ర దుర్భిక్షం, పేదరికం, ఉంటుందని తలచారు. కాని, వాస్తవానికి పదహారో లూయి కాలం నాటి కన్నా, ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయి. ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలు అక్కడి రైతులను కూడా ఉత్తేజపర్చాయి. కొద్ది కాలంలోనే వారు వ్యవసాయం ద్వారా స్వయంసమృద్ధిని సాధించారు. ఇన్ని యుద్ధాలు చేసినా, 1800 నాటికి ఐరోపా రాజ్యాలన్నింటిలోను, ఉత్పాదక శక్తిలో ఫ్రాన్స్‌యే అగ్రగామి. వారి సంపద వలసల నుండి కొల్లగొట్టింది కాదు. వారి స్వయం కృషితో, శ్రమతో పంటలు పండించారు. పరిశ్రమలను నడిపించారు. అంతేకాక, భూస్వామ్య పద్ధతి, సేద్య బానిసత్వ రద్దుతో, ఫ్రాన్స్‌లోని రైతులందరూ ఒక్కసారిగా స్వేచ్ఛను పొందడమేకాక, వారి వ్యక్తిత్వ ప్రకటనకు అవకాశం కల్గింది. ఈ మార్పు మిగతా ఐరోపా రాజ్యాల్లో రావడానికి చాల కాలం పట్టింది. ఫ్రెంచి ప్రజలు సమానత్వం, స్వేచ్ఛలతో ప్రత్యేక వ్యక్తులుగా భాసించారు.

ఆధునిక కాలంలో రష్యా విప్లవం, ఫ్రెంచి విప్లవ ప్రాధాన్యతను కొంతవరకు మరుగుపర్చింది. నాజీ, ఫాసిస్ట్ సిద్ధాంతాలు ఫ్రెంచి విప్లవ సిద్ధాంతాలైన స్వేచ్ఛ, సమానత్వాలను మంటగలిపాయి. అయినా, ఫ్రెంచి విప్లవం, దాని ఫలితాలు, కొన్ని ప్రేరణ చేసిన సిద్ధాంతాలు, ఈనాటికి కూడా సజీవమైననవే. ఒక్కమాటలో చెప్పాలంటే, ఈనాటి సామ్యవాద సిద్ధాంతాలకు, కమ్యూనిస్ట్ ఆచరణలకు, వ్యక్తి శ్రేయోదాయక సిద్ధాంతాలకు, ప్రజా సార్వభౌమాధికారానికి, ప్రజల ప్రాథమిక హక్కులకు మూలం, ఊపిరి, ఫ్రెంచి విప్లవమే. "క్రైస్తవ, ఇస్లాం మతాల వలె ఫ్రెంచి విప్లవం ప్రపంచ ఉద్యమమని, ఆచార్య లేకీ (Prof. Lacky) వ్యాఖ్యానించాడు.

## 17.5 ఫ్రెంచి, ఆంగ్ల విప్లవాల మధ్య పోలికలు

1789 ఫ్రెంచి విప్లవాన్ని, ఇంగ్లాండ్‌లో 1642-49 మధ్య వచ్చిన 'ప్యూరిటన్' (Puritan) విప్లవం తోను, 1688లో వచ్చిన 'రక్తరహిత (Bloodless) విప్లవం తోను, పోల్చి చూడొచ్చు. ఇంగ్లాండ్‌లో విప్లవాలు చాలా వరకు రాజకీయ ప్రాధాన్యాన్ని కల్గినవి. నిరపేక్ష నిరంకుశాధికారాలు కల రాజాధికారాలపై ఆంక్షలను విధించి, కొన్ని అధికారాలను ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంట్‌కు దత్తం చేయటమే, వాటి లక్ష్యం. ఫ్రెంచి విప్లవంలో రాజ్యాధికారాల బదలాయింపుకన్నా, సాంఘిక అసమానత్వం ముఖ్య ప్రేరణ. నిరపేక్ష నిరంకుశ రాజ్యాధికారాన్ని ఫ్రెంచి ప్రజలు చాలా రోజులుగా ఆమోదించారు. దాన్ని గూర్చి పెద్దగా బాధపడలేదు. ముఖ్యంగా సాంఘిక వ్యవస్థలో ఉన్న అసమానతలు, తత్కారణంగా ఆర్థికంగా సామాన్య ప్రజలపై మోపిన భారం, వారిని బాధించాయి, కలవరపెట్టాయి. సాంఘిక సమానత్వ లక్ష్య సాధనకే ఈ విప్లవ నాయకులు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ఇంగ్లాండ్‌లో వచ్చిన విప్లవం మితవాద ప్రభావితమైంది. కాలానుగుణంగా వచ్చిన సాంప్రదాయాల నుండి, చరిత్ర నుండి, విప్లవాత్మక మార్పులను కోరలేదు, సాధించలేదు. సాంప్రదాయ బద్ధులైన ప్రజల హక్కులను రాజు గౌరవించి, రక్షణ కల్పించే లక్ష్యంతోనే, ఇంగ్లాండ్ విప్లవం పురోగతిని సాధించింది. కాని, ఫ్రెంచి విప్లవం పురాతన వ్యవస్థను కూకటి వేళ్లతో పెకలించింది.

ఇంగ్లాండ్‌లో విప్లవం మధ్యతరగతి ప్రజలకు రాజ్యాధికారాన్ని యిచ్చిందన్నమాట నిజమే. కాని, వారు ఆ అధికారాన్ని కులీన వర్గంతో పంచుకున్నారు. మధ్యతరగతి వారు సంపన్నులయ్యారు. వారి వర్తక వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. కాని, కులీన ఆస్తులను, స్వాధికారాలను ఆ విప్లవం నష్టపర్చలేదు. కొన్ని సందర్భాల్లో వారి అధికారాలు, ఆస్తులు పెరిగాయి కూడ. కాని, ఫ్రెంచి విప్లవంలో భూస్వామ్య స్వాధికారాలపై రైతుల తిరుగుబాట్లు ముఖ్యమైన ఘటన. 17వ శతాబ్దం నుండి ప్రభువులు, మతాధికారుల స్వామ్యంలో ఉన్న భూములను రైతులాక్రమించుకోవడం, ఫ్రెంచి విప్లవ పునాదిగా పేర్కొనొచ్చు. ఈ పునాదిపైనే మధ్య

BRAOU

తరగతి వారు తమ హక్కుల్లకై పోరాటాన్ని సాగించారు. ఐదేండ్లపాటు భూస్వాములపై రైతులు జరిపిన పోరాటమే, సమానత్వ సాధన, గణతంత్ర రాజ్య భావం, వ్యావసాయిక సామ్యవాదం మొదలైన విప్లవాదర్శాలకు దోహదం చేసింది. అందువల్ల, ఫ్రెంచి విప్లవం ఇంగ్లాండ్ విప్లవం కన్నా భిన్నమైంది. తీవ్రమైంది కూడా. స్థూలమైన, విస్తృతమైన ప్రాతిపదికపై కొనసాగింది. స్థిరమైన ఫలితాలను సాధించింది.

## 17.6 సంగ్రహంగా

1. విప్లవ గమనాన్ని, గతిని, విశేషంగా ప్రభావితం చేసిన విప్లవ నాయకులైన మిరాబు, మారట్, డాంటన్, రాబిస్పియర్, కార్నట్ గుణగణాలు, స్వభావ, పాత్రలను క్లుప్తంగా సమీక్షించడం జరిగింది.
2. ఫ్రెంచి విప్లవ దేశీయ, ఐరోపీయ ప్రభావంతో పాటు, విప్లవ ప్రయోజనాలు, నాయకత్వం, ఫ్రాన్స్‌లో మధ్య తరగతి వారికి లభించినట్లు గ్రహించడం జరిగింది.
3. ప్రజాసార్వభౌమాధికారం, స్వేచ్ఛ, సమానత్వం, జాతీయ తత్వ ప్రచారంతో కూడిన పలు ఫ్రెంచి విప్లవ ఫలితాలను వివరించడం జరిగింది.
4. ఫ్రెంచి విప్లవం, ఆంగ్ల విప్లవాలకంటే భిన్నమైంది, తీవ్రమైంది, విస్తృతమైందిగా గుర్తించడం జరిగింది.

## 17.7 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.
   1. ఫ్రెంచి విప్లవ ఫలితాలను సమీక్షించండి.
   2. ఫ్రెంచి విప్లవం వర్గ సంఘర్షణ అని చెప్పడానికి గల కారణాలను ఉదాహరణలతో తెల్పండి.
   3. మిరాబు, మారట్, డాంటన్, రాబిస్పియర్‌లు ఫ్రెంచి విప్లవ గమనంలో నిర్వహించిన పాత్రను పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి.
   1. ఫ్రెంచి విప్లవ స్వభావాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
   2. ఫ్రెంచి, ఆంగ్ల విప్లవాల మధ్య పోలికలు, భేదాలను తెల్పండి.

## 17.8 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| 1. | C.J.H. Hayes | **Europe since 1500** |
| 2. | C.D. Hazen | **Europe since 1815** |
| 3. | V.D. MahaJan | **History of Modern Europe since 1789** |
| 4. | Lord Acton | **Lectures on French Revolution** |
| 5. | Gardiner B.M. | **The French Revolution** |
| 6. | H.A.L. Fisher | **History of Europe** |
| 7. | పి. శ్రీరామ శర్మ | ఫ్రెంచి విప్లవం, తెలుగు అకాడమి ప్రచురణ |


రచయిత : శ్రీ ఎ.వి. కోటిరెడ్డి



BRAOU

# ఖండం –5 : రష్యన్ విప్లవం (1917)

ఈ ఖండంలో మొత్తం నాలుగు భాగాలున్నాయి. (భాగం 18 నుండి భాగం 21 వరకు). ఇందులోని మొదటి భాగం జార్ చక్రవర్తుల పరిపాలనలో రష్యా గురించి, 1905లో ప్రజ్వరిల్లిన విప్లవం గురించి తెల్పుతుంది. 19వ భాగంలో రష్యన్ విప్లవ కారణాలను వివరించడం జరిగింది. 20వ భాగంలో విప్లవ గమనం గురించి తెల్పడం జరిగింది. చివరి భాగంలో (21భాగం) రష్యన్ విప్లవం ఎదుర్కొన్న సవాళ్లు, విప్లవ ప్రాధాన్యతల విశదీకరణ ఉంది.

ఈ శతాబ్దం రెండో దశకంలో ప్రజ్వరిల్లిన రష్యన్ కమ్యూనిస్ట్ విప్లవం, మొత్తం ప్రపంచ చరిత్రనే మార్చి వేసిన మహత్తర సంఘటన. పీడితులైన కార్మిక, కర్షక వర్గాలు, సుదీర్ఘ పోరాటానంతరం జార్ చక్రవర్తి నిరంకుశాధికారాన్ని తొలగించి, అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాయి. వీరి పోరాట ఫలితమే, అక్టోబర్ మహా విప్లవం. రష్యాలో రాజకీయాధికారాన్ని చేపట్టిన శ్రామిక వర్గం, విజయవంతంగా పరిపాలనను నిర్వహించింది. ప్రగతి పథంలో అక్టోబర్ మహా విప్లవం ఒక మలుపు. విప్లవం వల్ల, రష్యాలో నూతన సామాజిక వ్యవస్థ ఆవిర్భవించింది. రష్యన్ విప్లవోద్యమ నాయకులందరూ సామ్యవాదాన్ని గాఢంగా నమ్మారు. కారల్ మార్క్స్ సిద్ధాంతాలను విశ్వసించారు. ఈ మహత్తర విప్లవం సామాన్య ప్రజానీకంలో, నిద్రాణ శక్తిని మేల్కొల్పింది. అక్టోబర్ మహావిప్లవం విజయవంతమైంది. లెనిన్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కాని, ఇంటా బయటా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అంతర్యుద్ధం చెలరేగింది. విదేశాలు సైనిక జోక్యం చేసుకున్నాయి. అయినా విప్లవ ప్రతీఘాతుక శక్తుల్ని అణచివేసి, కమ్యూనిస్ట్ ప్రభుత్వం స్థిరపడింది. వెంటనే, ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి పూనుకొని, అనేక శాసనాలను ప్రవేశపెట్టింది.

అయితే, కాలచక్ర పరిణామ ప్రవాహంలో ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం 1990 వరకు ప్రపంచంలోని రెండు అగ్రరాజ్యాల్లో ఒకటైన సోవియట్ యూనియన్, గోర్బచేవ్ ఆర్థిక ఉదారవాద, స్వేచ్ఛావాద ప్రభావానికి లోనై, దానిలో యథాతథంగా ఇమడలేక, 1991లో ఛిన్నాభిన్నమై, యూనియన్‌కు బదులుగా స్వతంత్ర ప్రతిపత్తిగల కమ్యూనిస్ట్ రాజ్యాలేర్పడ్డాయి. ఇది ఇటీవలి విప్లవాత్మక పరిణామం. రాజకీయ తత్వాలు, విధానాలు కూడా, చారిత్రక పరిణామ ప్రవాహంలో తీవ్ర మార్పులకు గురౌతాయనే విషయాన్నిది రుజువు చేస్తుంది.

BRAOU

# భాగం –18 : జార్ చక్రవర్తుల పరిపాలనలో రష్యా

విషయక్రమం


18.0 లక్ష్యాలు

18.1 పరిచయం

18.2 మొదటి అలెగ్జాండర్ చక్రవర్తి కాలంనాటి రష్యా

18.2.1 సెమ్యేనోవ్ రెజిమెంట్ తిరుగుబాటు

18.2.2 యూనియన్ ఆఫ్ సాల్వేషన్

18.2.3 దక్షిణ సంఘం, ఉత్తర సంఘం

18.2.4 మొదటి అలెగ్జాండర్ మరణం : డిసెంబరిస్ట్ తిరుగుబాటుకు దారితీసిన సంఘటనలు

18.2.5 డిసెంబరిస్ట్ ఉద్యమ వైఫల్యం

18.3 మొదటి నికలస్ ఆంతరంగిక విధానం

18.3.1 మొదటి నికలస్ విదేశాంగ విధానం

18.3.2 మొదటి నికలస్ పరిపాలనా కాలంలో సాంస్కృతిక ప్రగతి

18.3.2.1 స్లావోఫిల్స్: ఇవాన్ కిరీవిస్కీ, ఖొమియాకోవ్

18.3.2.2 పాశ్చాత్యవాదులు

18.3.3 మార్క్స్ కంటె ముందు విప్లవోద్యమ ప్రముఖులు: అలెగ్జాండర్ హెర్జన్, మైఖేల్ బకూనిన్, యన్.జి. ఛెర్నిషెవిస్కీ

18.4 రెండవ అలెగ్జాండర్ సంస్కరణలు

18.4.1 ఫ్యూడల్ దాస్యవిధాన రద్దు : ఫలితాలు

18.4.2 రష్యన్ అతివాద తత్వం (Russian Extremism) : విద్యార్థి సంస్థలు : లాండ్ అండ్ లిబర్టీ వర్గం

18.4.3 శూన్యవాదం (Nihilism)

18.4.3.1 విప్లవోద్యమంలో పాల్గొన్న ఉన్నత తరగతికి, మధ్యతరగతికి చెందిన వారు, సామాన్యులు

18.4.4 మార్క్సిస్ట్ ఉద్యమ ప్రారంభానికి దారితీసిన సంఘటనలు

18.4.5 జార్ రెండవ అలెగ్జాండర్ హత్య : ఫలితాలు

18.5 మూడవ అలెగ్జాండర్ (1881–1894) : పెట్టుబడిదారీ వ్యవస్థాభివృద్ధి : మార్క్సిస్ట్ భావాల వ్యాప్తి

18.5.1 మూడవ అలెగ్జాండర్‌పై హత్యాప్రయత్నం : ఫలితాలు

18.5.2 నరోద్నిక్‌లు : ప్రధాన విప్లవకారులు

18.5.3 మొదటి మార్క్సియన్ సోషలిస్ట్ వ్యవస్థ: లిబరేషన్ ఆఫ్ లేబర్ : మార్క్సిస్ట్ సారస్వత వ్యాప్తి

18.5.4 పరిశ్రమల అభివృద్ధి : విద్యార్థి, కార్మిక వర్గాల్లో విప్లవ భావాల ప్రచారం

18.6 రెండో నికలస్ (1894–1917)

18.6.1 లెనిన్ రాసిన మొదటి గ్రంథం

18.6.2 రష్యాలోని యూదులు విప్లవోద్యములో పాల్గొనడం

18.6.3 రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ మొదటి సమావేశం

18.6.4 బోల్షివిక్, మెన్షివిక్‌ల చీలిక : రెండు వర్గాల మధ్య మౌళిక విభేదాలు

18.6.5 సామ్యవాద విప్లవకారులు : పార్టీ లక్ష్యాలు

18.6.5.1 రష్యాలో మధ్యతరగతి వర్గ ఆవిర్భావం: కేడెట్ పార్టీ

18.6.5.2 1905 విప్లవం ప్రజ్వరిల్లే వరకు దొర్లిన 80 సంవత్సరాల చరిత్ర సమీక్ష

18.7 1905 విప్లవం

18.7.1 1905 విప్లవం ప్రజ్వరిల్లడానికి కారణాలు

18.7.1.1 జార్జిగేపన్ నాయకత్వంలో జార్‌కు సమర్పించిన వినతిపత్రం

18.7.1.2 బ్లడీ సన్‌డే (రక్తసిక్త రవివారం) సంఘటన ప్రభావం

18.7.1.3 పోటెమ్‌కిన్ (Potemkin) తిరుగుబాటు

18.7.1.4 రైల్వే కార్మికుల సమ్మె : సార్వత్రిక సమ్మె

18.7.2 1095 అక్టోబర్ రాజ్యాంగ ప్రణాళిక

18.7.2.1 సోవియట్ల స్థాపన

18.7.2.2 కర్షకుల తిరుగుబాటు

18.7.2.3 సెయింట్‌పీటర్స్‌బర్గ్, మాస్కో నగరాల్లో తీవ్రమైన సంఘర్షణలు : సాయుధ తిరుగుబాటు

18.7.3 1905 విప్లవం వల్ల వివిధ వర్గాల ప్రజలకు కల్గిన అనుభవం

18.8 సంగ్రహంగా

18.9 పరీక్ష నమూనా ప్రశ్నలు

18.10 ఉపయుక్త గ్రంథాలు

BRAOU

## 18.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవటంవల్ల ఈ క్రింది విషయాలను తెలుసుకోగలగాలి.

- 19వ శతాబ్దంలో జార్ చక్రవర్తుల ( మొదటి అలెగ్జాండర్ , మొదటి నికలస్, రెండో అలెగ్జాండర్, మూడో అలెగ్జాండర్, రెండో నికలస్) నిరంకుశ పరిపాలనలో రష్యన్ ప్రజలు అనుభవించిన బాధలు, రష్యాలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు;
- జార్ చక్రవర్తుల నియంతృత్వానికి వ్యతిరేకంగా 19వ శతాబ్దంలో సమాజంలోని వివిధ వర్గాలు – సైనికులు, యువత, ఉన్నత కుటుంబాలకు చెందిన వారు, వైజ్ఞానికులు, మధ్యతరగతి వర్గం , సామాన్య ప్రజానీకం,కర్షకులు, మార్క్సిస్ట్ ఉద్యమం వల్ల ప్రభావితులైన కార్మికులు – నిర్వహించిన ఉద్యమాలు;
- రష్యాలో ఆవిర్భవించిన రాజకీయ పార్టీలు;
- జార్ల నిరంకుశ నియంతృత్వానికి వ్యతిరేకంగా 1905 లో ప్రజ్వరిల్లిన విప్లవం.

## 18.1 పరిచయం

చారిత్రకంగా పరిశీలిస్తే బోల్షివిక్ విప్లవ (7, నవంబర్ 1917) బీజాలు మూరేళ్ల క్రితమే మొలకెత్తాయి. రష్యాలో బోల్షివిక్ విప్లవానికి పూర్వమే భావ విప్లవం 19 వ శతాబ్దంలో మొదలైంది.

19వ శతాబ్దం మధ్య కాలం వరకు రష్యా ప్రధానంగా వ్యావసాయక దేశం. చాలా మంది ప్రజలు గ్రామాల్లో నివసించేవారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రష్యాలో పరిశ్రమలు ఏర్పడ్డాయి. చాలా పరిశ్రమలను విదేశీయులే స్థాపించారు. కాని, పశ్చిమ యిరోపా దేశాల్లో లాగే పారిశ్రామికీకరణ జరగలేదు.

19వ శతాబ్దం పూర్వభాగంలో రష్యన్ సామాజిక అభివృద్ధిపై రెండు భిన్న దృక్పథాలు గల వర్గాలు ( స్లావోఫిల్స్, లేక సాంప్రదాయక వర్గం; పాశ్చాత్యవాదులు , లేక విప్లవకారుల వర్గం) తమ ప్రభావాన్ని స్పష్టంగా కనపర్చాయి.

రెండో అలెగ్జాండర్ ప్రవేశపెట్టిన కర్షక సంస్కరణల తర్వాత, విద్యార్థుల్లో నూతన భావాలు చివురించి, కొత్త ఆశలు మొలకెత్తాయి, ఆ విద్యార్థులే విప్లవ సంఘాలను స్థాపించారు. రష్యన్ అతివాదశక్తం వృద్ధి చెందింది.

1876లో రష్యాలో మార్క్సిస్ట్ ఉద్యమానికి మూల పురుషుడు ప్లెఖనోవ్ నాయకత్వంలో మొదటిసారి కార్మికులు ప్రదర్శన జరిపారు. నిరంకుశ ప్రభుత్వానికి, విప్లవకారులకు మధ్య సంఘర్షణ తీవ్రమైంది. ఉగ్రవాద ఉద్యమం బలపడింది. విప్లవకారులను ప్రభుత్వం కఠినంగా శిక్షించింది.

జార్ రెండో అలెగ్జాండర్ ను విప్లవకారులు హత్య చేసిన తర్వాత, ప్రభుత్వం ప్రముఖ విప్లవకారులను ఉరి తీసింది.

సామాజిక విప్లవానికి సమయం ఆసన్నం కాలేదు. కనక, విప్లవ యోధులు నిరంకుశత్వంతో జరిపిన పోరాటం విఫలమైంది.

జార్ మూడో అలెగ్జాండర్, రెండో నికలస్ పరిపాలనల్లో కూడా, వారి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగాయి. రాజకీయ పార్టీలు ఏర్పడ్డాయి.

మొదటిసారి రష్యన్ సామాన్య ప్రజానీకం 1905 లో జారిస్ట్ నిరంకుశ నియంతృత్వంతో

BRAOU

సంఘర్షణకు తలపడ్డారు. అదే 1905 రష్యన్ విప్లవం. చిట్టచివరకు ఈ విప్లవాన్ని జార్ అణచివేశాడు. లెనిన్ 1905 విప్లవాన్ని, 1917 విప్లవానికి నాందీగా ప్రకటించాడు. ఈ విప్లవం విఫలమైనా, 1917 లో జరగబోయే విప్లవం విజయం కాడానికి కారణమైన శక్తులను అర్థం చేసుకోడానికి తోడ్పడింది.

## 18.2. మొదటి అలెగ్జాండర్ చక్రవర్తి కాలం నాటి రష్యా

నెపోలియన్ చక్రవర్తి రష్యాపై దండెత్తే నాటికి, రష్యాను మొదటి అలెగ్జాండర్ చక్రవర్తి పరిపాలిస్తున్నాడు. నెపోలియన్ సైన్యాలు చిత్తుగా ఓడిపోయాయి. రష్యన్ దండయాత్ర వైఫల్యం నెపోలియన్ పతనానికి దారితీసింది. నెపోలియన్‌ను వ్యతిరేకించిన మిత్ర రాజ్యాల సైన్యాలు ఫ్రాన్స్‌లోకి చొచ్చుకొచ్చాయి. నెపోలియన్ పతనానంతరం రష్యా ఐరోపాలో ప్రధానమైన అగ్రరాజ్యంగా రూపొందింది. ఫ్రాన్స్‌లో ప్రవేశించి నెపోలియన్ సైన్యాలతో పోరాడిన రష్యన్ సైనికులు, యువకులైన సైనికాధికారులు ఫ్రాన్స్‌లోని రాజ్యాంగ విధానాన్ని, సాంఘిక సంస్కరణలను పరిశీలించి, రష్యాకు తిరిగి వచ్చారు. వారిలో విప్లవ భావాలు మొలకెత్తాయి.

### 18.2.1 సెమ్యోనోవ్ (Semyenov) రెజిమెంట్ తిరుగుబాటు

సెమ్యోనోవ్ గార్డ్ రెజిమెంట్ లోని చాలామంది అధికారులు "Union of Salvation" అనే సంఘాన్ని 1816 లో స్థాపించారు. ఈ యువ సైనికాధికారుల్లో ప్రముఖుడు, కల్నల్ పావెల్ పెస్టెల్. సామాన్య ప్రజానీకానికి, కులీనులకు, సంపన్నులకు మధ్య సంఘర్షణ తప్పదని పెస్టెల్ నమ్మాడు. సెమ్యోనోవ్ రెజిమెంట్‌లో తిరుగుబాటు ప్రజ్వరిల్లింది. కాని, ఈ తిరుగుబాటును ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. సుమారు 1815 నాటికి, రష్యా మధ్యయుగ సంకెళ్ళను తెంచుకుని, నూతన శకాన్ని ప్రారంభించడానికి ప్రయత్నిస్తోంది.

BRAOU

### 18.2.1. యూనియన్ ఆఫ్ సాల్వేషన్

యూనియన్ ఆఫ్ సాల్వేషన్ "Union of Salvation" 1821 లో రెండు వర్గాలుగా చీలిపోయి, (1) దక్షిణ సంఘం (2) ఉత్తర సంఘాలుగా ఏర్పడ్డాయి.

### 18.2.3 దక్షిణ సంఘం : ఉత్తర సంఘం

దక్షిణ సంఘంలో పావెల్ పెస్టెల్ ప్రముఖ పాత్ర నిర్వహించాడు. అతడు తన స్వీయచరిత్రలో రాజకీయ భావాలు తనలో ఎలాంటి మార్పును తెచ్చాయో వివరించాడు. రాజ్యాంగబద్ధ రాజరిక భావాలు మొదట పొడసూపాయి. అటు తర్వాత అవి గణతంత్రభావాలుగా మారాయి. రష్యన్ జార్‌లను సైనిక తిరుగుబాటు ద్వారా తొలగించి, సైనిక నియంతృత్వాన్ని స్థాపించాలని, ఆ తర్వాత గణతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, పెస్టెల్ సూచించాడు. రష్యా కేంద్రీకృత రాజ్యంగా రూపుదిద్దుకోవాలని పెస్టెల్ అభిప్రాయపడ్డాడు. పెస్టెల్ తీవ్ర భావాల వల్ల ప్రభావితులైన దక్షిణ సంఘ సభ్యులు మౌలికమైన సాంఘిక విప్లవాన్ని తీసుకురావాలని అనుకోలేదు.

ఉత్తర సంఘంలో సభ్యులు కులీన వర్గానికి చెందినవారు. వీరిలో ముఖ్యులు, రాకుమారుడు నికిటా

మూరావీవ్, రాకుమారుడు ట్రూబెట్జ్ కోయ్‌లు. వీరు రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థను నెలకొల్పాలని, రష్యాను 13 రాష్ట్రాలుగా విభజించి, సమాఖ్య పద్ధతిని (Federal System) ప్రవేశపెట్టాలని భావించారు.

### 18.2.4 మొదటి అలెగ్జాండర్ మరణం : డిసెంబరిస్ట్ తిరుగుబాటుకు దారితీసిన సంఘటనలు :

జార్ మొదటి అలెగ్జాండర్ 1825 డిసెంబర్‌లో మరణించాడు. అతనికి ఇద్దరు సోదరులు కాన్‌స్టన్‌టైన్, నికలస్. కాన్‌స్టన్‌టైన్ పోలెండ్‌లో రాజప్రతినిధిగా ఉండేవాడు. జార్ మొదటి అలెగ్జాండర్ చనిపోయిన తర్వాత, కాన్‌స్టన్‌టైన్ రాజ్యాధికారాన్ని చేపట్టడానికి ఒప్పుకోలేదు. పోలెండ్ రాజధాని వార్సా (Warsaw) లో తన సోదరుడు నికలస్‌కు అనుకూలంగా, రాజ్యపరిత్యాగాన్ని చేశాడు. ఈ సంగతి నికలస్‌కు తెలియదు. మొదటి అలెగ్జాండర్ మరణించగానే, నికలస్, ఇతర అధికార ప్రముఖులు కాన్‌స్టన్‌టైన్‌ను జార్ చక్రవర్తి గా గుర్తించి, ప్రమాణ స్వీకారం చేశారు.

ఇలా అస్తవ్యస్త పరిస్థితి కొంతకాలం కొనసాగింది. సైన్యంలో అసంతృప్తి ప్రజ్వరిల్లింది. తిరుగుబాటు నాయకులు – ( పెస్టెల్) (Pestel) , ఎ పోస్టల్ (A postal ) , సెర్జీమురావీవ్ ( (Sergi Muraviev) లు – ఈ గందరగోళ పరిస్థితుల్లో మాస్కో పటాలంలోని సైనికులను నికలస్‌కు అనుకూలంగా ప్రమాణ స్వీకారం చేయవద్దని కోరారు. సెనేట్ స్క్వేర్ లో సమావేశమైన సైనికులు, కాన్‌స్టన్‌టైన్‌నే జార్ చక్రవర్తిగా గుర్తిస్తామని ప్రకటించి, రాజ్యాంగం కావాలని కోరారు.

చిట్టచివరకు నికలస్ 1825 డిసెంబర్ 14 వ తేదీన, కాన్‌స్టన్‌టైన్ రాజ్యపరిత్యాగం చేసిన సంగతి ప్రకటించి, తనకు అనుకూలంగా రాజ్య మంతటా ప్రమాణ స్వీకారం జరగాలని ఆదేశించాడు.

### 18.2.5. డిసెంబరిస్ట్ ఉద్యమ వైఫల్యం

తిరుగుబాటుకు నాయకత్వం వహించిన మాస్కో పటాలానికి ఇతర పటాలాల మద్దతు లభించనందువల్ల, తిరుగుబాటు విఫలమైంది. ఈ తిరుగుబాటు 1825 డిసెంబర్‌లో జరగడంవల్ల, డిసెంబరిస్ట్ ఉద్యమంగా పేరుపొందింది.

డిసెంబరిస్ట్ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన అయిదుగురు నాయకులను – పెస్టెల్ , రిలీవ్ మురావీవ్, ఎపోస్టల్, బెస్టుజెవ్ రూమి, న్కఖోవ్‌స్కీ) ఉరితీశారు. చాలామంది అనుమానితులను సైబీరియాలో ప్రవాసానికి పంపారు.

ఈ విధంగా డిసెంబరిస్ట్ ఉద్యమం విఫలమైంది. సామాన్య ప్రజానీకం విప్లవ వీరుల భావాలను అర్థం చేసుకుని సహాయం చేయకపోవడంవల్లనే, ఇది విఫలమైంది. ఈ ఉద్యమం విఫలమైనా, నాయకుల త్యాగం వృధా కాలేదు. ఎందరో దేశభక్తులు దేశంలో చైతన్యాన్ని రేకెత్తించడానికి తమ సర్వస్వాన్ని త్యాగం చేశారు. తిరుగుబాటులో పాల్గొని త్యాగాలు చేసిన వీరులను, ప్రముఖ రష్యన్ కవులు పుష్కిన్, నెక్రసోవ్ లు ప్రశంసించారు.

## 18.3 మొదటి నికలస్ ( 1825–55) : ఆంతరంగిక విధానం

30 సంవత్సరాల పరిపాలనలో మొదటి నికలస్ నిరంకుశత్వం పరాకాష్టకు చేరుకుంది. ఇతడు కరుడు గట్టిన సాంప్రదాయవాది. పాశ్చాత్య భావాల వ్యాప్తిని తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈభావాల వ్యాప్తివల్ల, ప్రజల్లో

విప్లవ భావాలు రేకెత్తుతాయని భావించాడు. అందువల్ల ప్రభుత్వం విదేశీ గ్రంథాలను కఠినంగా సెన్సార్ చేసింది. విదేశీ యాత్రలపై నిర్బంధాలను విధించింది. రష్యన్ యువకులు విదేశాల్లో చదవకూడదని శాసించింది. తత్వశాస్త్ర (Philosophy) అధ్యయనాన్ని రష్యన్ విశ్వవిద్యాలయాల నుండి వెలివేసింది. ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారాన్ని అదుపు చెయ్యడానికి పత్రికలను కఠినంగా సెన్సార్ (Sensor) చేసింది. 1826 లో ఏర్పాటు చేసిన రహస్య పోలీస్ వ్యవస్థ ఉక్కు పాదాల క్రింద, వాక్సభా, పత్రికా స్వాతంత్ర్యాలు నలిగిపోయాయి. ప్రభుత్వం అనుమానితులను ఎలాంటి విచారణ చెయ్యకుండా, దూర ప్రాంతాలకు బహిష్కరించింది. ఈ రహస్య పోలీస్ వ్యవస్థ రష్యా చరిత్రలోనే విషాదకర ఘట్టం.

## 18.3.1 మొదటి నికలస్ విదేశాంగ విధానం

మొదటి నికలస్ విదేశాంగ విధానంలో నిరంకుశత్వాన్ని సమర్థించి, విప్లవోద్యమాలకు శత్రువయ్యాడు. మానవ ప్రగతికే ఎదురీదడానికి ప్రయత్నించాడు.

ఫ్రాన్స్‌లో ప్రజ్వరిల్లిన 1830, 1848 విప్లవాలు ఎన్నో దేశాలకు దావానలంలా వ్యాపించినా, రష్యాను మాత్రం తాక లేదు. 1830 లో ఫ్రాన్స్ లో ప్రజ్వరిల్లిన విప్లవం వల్ల ప్రభావితులై తిరుగుబాటు చేసిన పోలీస్ ప్రజలను, నికలస్ అణచివేశాడు. 1848 విప్లవం సాంప్రదాయకవ్యవస్థ కంచుకోట అయిన ఆస్ట్రియా - హంగేరీ సామ్రాజ్యాన్ని కుదిపివేసింది. ఆస్ట్రియా - హంగేరీ లో తిరుగుబాటు నణచడానికి మొదటి నికలస్ తోడ్పడ్డాడు. ఈ విధంగా ఇతడు ఐరోపా ఖండంలో ప్రజాస్వామ్యానికి శత్రువయ్యాడు.

రష్యా పారిశ్రామిక రంగంలో బలహీనతలు క్రిమియా యుద్ధంలో బహిర్గతమయ్యాయి. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఆర్థిక, సాంకేతిక రంగాల్లో బలహీనంగా ఉన్న రష్యాను ఈ యుద్ధంలో ఓడించాయి. యుద్ధంలో రష్యా ఓడిపోవడంవల్ల జార్ చక్రవర్తుల అధికారం బలహీనమైంది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తి - ముఖ్యంగా విద్యావంతుల్లో, కర్షక వర్గంలో ప్రబలింది.

## 18.3.2 మొదటి నికలస్ పరిపాలనా కాలంలో సాంస్కృతిక ప్రగతి

మొదటి నికలస్ నిరంకుశంగా పరిపాలించినా, అతని హయాంలో రష్యా సాంస్కృతిక రంగంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. పుష్కిన్ (Pushkin), లెర్మంటోవ్ (Lermentov )లు రష్యన్ సాహిత్యంలో ప్రముఖ కవులు. గగోల్ (Gogol) వ్యంగ్య రచయిత. టాల్‌స్టాయ్ (Tolstoy), టర్గెనీవ్ (Turgeniev), దోస్తోవిస్కీ (Dostoevsky) ల నవలలు రష్యన్ సాహితీ రంగాన్ని, తద్వారా సమాజాన్ని ప్రభావితం చేశాయి.

19 వ శతాబ్దం పూర్వ భాగంలో పశ్చిమ ఐరోపా నుండి ఎన్నో నూతన భావాలు రష్యాలో చాలా నెమ్మదిగా వ్యాపించాయి. రష్యన్ సాంఘికాభివృద్ధి పై రెండు భిన్నదృక్పథాలున్న వర్గాలు తమ ప్రభావాన్ని స్పష్టంగా కనపర్చాయి. మొదటి వర్గం వారిని స్లావోఫిల్స్ (Slavophiles) అని, రెండో బృందం వారిని పాశ్చాత్యవాదుల (Westernisers) ని అంటారు.

### 18.3.2.1 స్లావోఫిల్స్ : ఇవాన్ కిరీవ్‌స్కీ, ఖోమియకోవ్

స్లావోఫిల్స్ మధ్యయుగం నాటి రష్యానే ఆదర్శంగా తీసుకున్నారు. వీరిని రష్యా చరిత్రలో సాంప్రదాయ వర్గంగా భావించొచ్చు. పశ్చిమ ఐరోపా పతనం కాడానికి సిద్ధంగా ఉందని వీరు భావించారు.

శాస్త్రీయ, కళారంగాల్లో రష్యా చాలా విజయాలు సాధిస్తుందని వీరు నమ్మారు. వీరిలో ప్రముఖులు ఇవాన్ కిరీవ్‌స్కీ(Ivan Kireevsky) ఖొమియకోవ్ (Khomiakov) లు. ఇవాన్ కిరీవ్‌స్కీ కర్షకుని నిజమైన క్రైస్తవునిగా పరిగణించాడు. ఖొమియకోవ్ సనాతన రష్యన్ చర్చిని సమర్థించాడు.

### 18.3.2.2 పాశ్చాత్యవాదులు (Westernisers)

రెండో బృందంవారు పాశ్చాత్యవాదులు. విప్లవకారులందరూ ఈ బృందంలో వారే. రష్యాకు పశ్చిమ ఐరోపా దేశాల సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా, ఆదేశాల రాజ్యాంగ విధానం, చట్టాలు, సాంఘికాభివృద్ధి కూడా చాలా అవసరమని ఈ వర్గంవారు నమ్మారు. పాశ్చాత్యవాదులు రష్యన్ కర్షక సమాజం (Russian Peasant Community) అనే ఒకే ఒక సాంప్రదాయక రష్యన్ సంస్థను ఆమోదించారు. గ్రామాల్లోని భూములపై కర్షక సమాజం ఆధిపత్యం వహించడంవల్ల (Common ownership of land), భవిష్యత్తులో సామ్యవాద వ్యవస్థా సమాజానికి దీన్ని బీజంగా భావించారు. ఈ వర్గంలో ప్రముఖుడు వి.జి. బైలిన్‌స్కీ (V.G. Byelinsky)

### 18.3.3. మార్క్స్ కంటె ముందు విప్లవోద్యమ ప్రముఖులు : అలెగ్జాండర్ హెర్జన్, మైఖేల్ బకూనిన్, యన్.జి. ఛెర్నిషెవిస్కీ

మార్క్స్ (Marx) భావాలు రష్యాలో ప్రచారం కాక ముందు, విప్లవోద్యమ కార్యక్రమాలను ముగ్గురు ప్రముఖులు - అలెగ్జాండర్ హెర్జన్ ( 1812-1870), మైఖేల్ బకూనిన్ ( 1814-1876), యన్.జి. ఛెర్నిషెవిస్కీ (1828-1889) - నిర్వహించారు.

హెర్జన్ రష్యాలో రైతుకే భవిష్యత్తులో ప్రాధాన్యత ఉంటుందని గాఢంగా నమ్మాడు. బూర్జువా (మధ్యతరగతి) ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానాల ప్రభావానికి లోను కాకుండానే, రష్యా సామ్యవాద ధ్యేయాన్ని చేరుతుందని హెర్జన్ ఆశించాడు. ఇతడు బెల్(Bell) అనే పత్రికను నిర్వహించాడు. గ్రామ సమాజం ద్వారా రష్యాలో సామ్యవాదాన్ని స్థాపించవచ్చని హెర్జన్ అభిప్రాయపడ్డాడు. హెర్జన్ సిద్ధాంతం, ఆ తరం విప్లవ వాదుల భావాలపై చెరగని ముద్ర వేసింది. తర్వాత తరంవారు హెర్జన్‌ను మితవాదిగా పరిగణించారు.

బకూన్ ( 1814-76) రష్యన్ అరాచక వాదానికి (Anarchism) మూల పురుషుడు. బకూనిన్ 1840 లో రష్యానుండి వెళ్లిపోయాడు. ప్రభుత్వం తిరిగి రమ్మని అతన్ని ఆదేశించింది. కాని, అతడు ఖాతర్ చేయలేదు. అందువల్ల ప్రభుత్వం అతన్ని బహిష్కరించింది. బకూనిన్ ప్రేగ్, డ్రెసెడెన్‌ల్లో జరిగిన తిరుగుబాట్లలో పాల్గొని పట్టుబడ్డాడు. ఆస్ట్రియన్ ప్రభుత్వం బకూనిన్ ను నిర్బంధించి, రష్యాకు బందీగా పంపింది. రష్యన్ ప్రభుత్వం ఇతన్ని సైబీరియాకు బహిష్కరించింది. సైబీరియా నుండి తప్పించుకుని, అమెరికా మీదుగా ఐరోపా ఖండానికి తిరిగి వచ్చాడు. కారల్ మార్క్స్‌కు బలమైన ప్రత్యర్థి అయ్యాడు. వారి తగాదాల వల్ల, మొదటి ఇంటర్‌నేషనల్ (First International) చిన్నాభిన్నమైంది.

1868 లో "యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ డెమోక్రసి" (Union of Socialist Democracy) అనే సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ నాస్తిక భావా1868 లోలను ప్రోత్సహించింది. భూమి, కార్మికుల సాధనాలు, పెట్టుబడి, సమాజ సమిష్టి ఆస్తి కావాలని, కూలీలు వీటిని వాడుకోవాలనీ, ఈ సంస్థ కోరింది. స్త్రీ , పురుష వివక్షత లేకుండా రాజకీయ , సాంఘిక, ఆర్థిక సమానత్వాన్ని సాధించడం, ఈ వ్యవస్థ ఆదర్శం. రాజ్యం ,



BRAOU

మతం, కుటుంబం మొదలైన వ్యవస్థలన్నింటినీ పూర్తిగా నాశనం చేస్తే తప్ప, మానవాళి స్వాతంత్ర్యం పొందదని, బకూనిన్ భావించాడు.

బకూనిన్ తిరుగుబాటు సిద్ధాంతం స్విట్జర్లాండ్ లో చదువుతున్న రష్యన్ విద్యార్థులను ఆకర్షించింది. అతని ముఖ్యశిష్యుడు నెకియేవ్, మాస్కోలో ఒక రహస్య సంస్థను స్థాపించాడు. కాని, పోలీసులు కనుక్కోడంవల్ల, ఆ సంస్థ పతనమైంది.

యన్.జి.ఛెర్నిషెవిస్కీ( 1828-1889) విప్లవ మేధావి. కర్షక సామ్యవాదాన్ని బలపర్చాడు. రాజకీయ మార్పుకన్నా సాంఘిక మార్పు ముఖ్యమని ప్రకటించాడు. మార్క్సిస్ట్ భావాలకు బాగా చేరువయ్యాడు. "ది కంటెంపొరరి" (The Contemporary) అనే తీవ్రవాద పత్రికను 1862 లో నిర్బంధితమయ్యేవరకు నిర్వహించాడు. 1862 లో ప్రభుత్వం ఛెర్నిషెవిస్కీని నిర్బంధించి, సైబీరియాకు ప్రవాసం పంపించింది. సమకాలీన విద్యార్థి సంఘాలను, యువతను, అతని రచనలు విస్తృతంగా ప్రభావితం చేశాయి. శూన్యవాదం (Nihilism) ఆవిర్భావానికి అతని రచనలు దోహదం చేశాయి. సైబీరియా నుండి తిరిగి రావడానికి ప్రభుత్వం అతనికి అనుమతిని ఇచ్చింది. అప్పటికతడు శారీరకంగా, మానసికంగా చాలా కృశించాడు.

మొదటి నికలస్ పరిపాలనా కాలంలో రచయితలపై నిఘా చాలా తీవ్రంగా ఉండేది. గూఢచారులు రచయితల సమావేశాల్లో పాల్గొనేవారు. రహస్యాలన్నీ సేకరించిన తర్వాత వారిని నిర్బంధించేవారు. ప్రభుత్వం వారిని దేశ బహిష్కారం చేస్తూ ఉండేది. నికలస్ పరిపాలనలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలు.

## 18.4 : రెండో అలెగ్జాండర్ ( 1855-1881) సంస్కరణలు

రెండో అలెగ్జాండర్ రాజ్యానికి వచ్చేటప్పటికి, క్రిమియా యుద్ధం ( 1854-56) ఇంకా కొనసాగుతూనే ఉంది. 1856 పారిస్ సంధితో ఈ యుద్ధం ముగిసింది. ఇతడు అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజకీయ ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాడు. ప్రభుత్వం సెన్సార్ నిబంధనలను సడలించింది. విశ్వవిద్యాలయాలపై గతంలో విధించిన నిర్బంధాలను తొలగించాడు.

BRAOU

### 18.4.1 ఫ్యూడల్ దాస్య విధానం రద్దు : ఫలితాలు

రెండో అలెగ్జాండర్ రాజ్యానికి వచ్చేటప్పటికి, ఫ్యూడల్ దాస్య విధానం (Serfdom) వల్ల రష్యన్ కర్షకులు హీనమైన పరిస్థితుల్లో ఉండేవారు. వారిలో పెరుగుతున్న అసంతృప్తి, అలజడివల్ల తన అధికారానికి ముప్పు వాటిల్లుతుందని భయపడి, దేశంలో ఫ్యూడల్ దాస్య విధానాన్ని నిర్మూలించడానికి, 1861లో రెండో అలెగ్జాండర్ కర్షక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. బానిస వ్యవస్థను రద్దు చేసి, రెండో అలెగ్జాండర్ 40 లక్షల మంది రష్యన్ కర్షకులకు స్వేచ్ఛనిచ్చాడు. అట్టడుగున ఉన్న కర్షకులు మేల్కొని విమోచనం చెందే లోపలే, ప్రభుత్వం వారికి స్వేచ్ఛ నివ్వడం తెలివైన చర్యగా జార్ భావించాడు. అలెగ్జాండర్ నిర్మాణాత్మక రాజనీతి విధానాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని గుర్తించాడు. సమాజంలోని అన్ని వర్గాల వారు బానిసల విముక్తిని, మానవతా దృక్పథంతో మాత్రమే గాక, తమ మనుగడకే అవసరమని గుర్తించారు. బానిసల విమోచనం జాతి ప్రగతికి మొదటి మెట్టని సంస్కరణవాదులందరూ అంగీకరించారు. కర్షకులను సంతృప్తిపర్చడానికి సంస్కరణలను ప్రవేశపెట్టినా, గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని నిరుపేదలు ఎక్కువగా ఉంటున్నందువల్ల, తరచుగా భూస్వాములకు వ్యతిరేకంగా వారు తిరుగబడేవారు.

## 18.4.2 : రష్యన్ అతివాదతత్వం (Russian Extremism) : విద్యార్థి సంస్థలు :

### లాండ్ అండ్ లిబర్టీ వర్గం :

రెండో అలెగ్జాండర్ సంస్కరణలను ప్రవేశపెట్టిన తర్వాత, విద్యార్థుల్లో, విద్యావంతుల్లో నూతన భావాలు చిగురించి, కొత్త ఆశలు మొలకెత్తాయి. ఆ విద్యార్థుల నుండే విప్లవకారులావిర్భవించారు. విప్లవ సంఘాలను స్థాపించారు.

అలెగ్జాండర్ బానిస వ్యవస్థను రద్దు చేసిన సంవత్సరం( 1861) లోనే, "గ్రేట్ రష్యన్(Great Russian) అనే సంతకంతో జారీ అయిన మూడు ప్రకటనల్లో రైతులకు ఎక్కువ భూమినివ్వాలని, రాజ్యాంగ పరిషత్తు సమావేశం కావాలనీ, విప్లవకారులు కోరారు. తమ కోర్కెలను ఆమోదించకపోతే, హింసకు పాల్పడతామని విప్లవకారులు హెచ్చరించారు.

1870-80ల మధ్య, లాండ్ అండ్ లిబర్టీ (Land and Liberty) అనే బాగా పలుకుబడి ఉన్న విప్లవకారుల బృందం, ప్రముఖ పాత్రను నిర్వహించింది. జైచ్‌నెవ్‌స్కీ (Zaichnevsky) అనే విద్యార్థి "యంగ్ రష్యా" (Young Russia) అనే పేరుతో, హింసాయుత కార్యక్రమం ద్వారా విప్లవాన్ని సమర్థిస్తూ రాశాడు. అలాగే, ఇషూటిన్ అనే మరో విద్యార్థినాయకత్వంలో, "హెల్" అనే పేరుతో వేరొక బృందం ఉంది. ప్రజారాజ్యాంగం (Popular Constitution) కావాలనే కోరికను ప్రభుత్వం ఆమోదించపోతే, దౌర్జన్య చర్యలకు పూనుకోకతప్పదని చెప్పడాన్ని సమర్థించింది.

19వ శతాబ్దంలో సాంఘిక మార్పును సూచించే పాశ్చాత్య సిద్ధాంతాలు ప్రబలాయి. ఇవి రష్యాలో విజ్ఞానవంతులైన యువక బృందానికి చేరే నాటికి, ఆ భావాల తీవ్రత హెచ్చింది. రష్యన్ జార్‌ల నిరంకుశపాలనకు వ్యతిరేకంగా సహజంగా కలిగిన మానసిక ప్రవృత్తి వల్లే, రష్యన్ అతివాదతత్వం (Russian Extremism) వృద్ధి చెందింది. రష్యన్ ప్రజల్లో మధ్య తరగతి ప్రజలకుండాల్సిన లక్షణాలైన పొదుపు, దూరదృష్టి, మితవాద భావాలు ఆనాడు లేవు.

విద్యార్థి విప్లవ సంఘాలు సామాన్య ప్రజానీకంలో పలుకుబడిని సంపాదించుకోలేకపోయాయి. 19వ శతాబ్ది ఏడు ఎనిమిది దశాబ్దాల్లో, విద్యావంతుల దృక్పథంలో, సాంఘిక, మానసిక రంగాల్లో ముఖ్యమైన మార్పులు వచ్చాయి. అనేక మంది యువతులు విశ్వవిద్యాలయాల్లో చేరారు. విప్లవాత్మక భావాలను ప్రబోధించారు. రష్యన్ విప్లవోద్యమంలో చాలా మంది స్త్రీలు పాల్గొన్నారు.

## 18.4.3 శూన్యవాదం (Nihilism)

భౌతిక వాదం (Meterialism), ప్రజాస్వామ్యం (Democratism) గాఢమైన నిరాశా దృక్పథంలో వెల్లువలా విజృంభించిన భావమే శూన్యవాదం. డార్విన్, బకిల్, కామ్ట్ (Comte), హెర్బర్ట్ స్పెన్సర్, ఫ్యూర్‌బాక్ (Fuerbach) లు, శూన్యవాదానికి మూలపురుషులు. శూన్యవాదులు విజ్ఞాన శాస్త్రాన్ని ఆరాధించారు. సౌందర్యోపాసనను నిరసించారు. శూన్యవాదం రష్యన్ జార్‌ల నిరంకుశ పరిపాలనను, ఆ పాలనలో రష్యన్ జీవన విధానాన్ని వ్యతిరేకించింది. 1860-70 ల మధ్య, శూన్యవాదం చాలామంది రష్యన్ యువకులను ఆకర్షించింది. ప్రభువుల వర్గంతోపాటు మధ్య తరగతి ప్రజలు కూడా పాఠశాలల్లో, కాలేజీల్లో

చదువుకుని, చురుగ్గా విప్లవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### 18.4.3.1 : విప్లవోద్యమంలో పాల్గొన్న ఉన్నత, మధ్యతరగతులకు చెందినవారూ సామాన్యులు

1870-80 ల మధ్య, ఉన్నత కుటుంబాలతో పాటు, మధ్యతరగతివారు, సామాన్యులు కూడా విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. క్రోపోట్కిన్ (Kropotkin), సోఫియా పెరోవ్‌స్కాయా (Sofia Perovskaya)లవంటి ఉన్నత కుటుంబీకులే కాకుండా, పీటర్ అలెక్సీవ్ (Peter Alekseev), జిల్యబోవ్ (Zhelyabov) వంటి సామాన్యులు కూడా పాల్గొన్నారు. జిల్యబోవ్ బానిస కొడుకు. "పీపుల్స్ విల్" (People's will) వర్గాన్ని స్థాపించాడు. పీటర్ అలెక్సీవ్ బట్టలు నేసేవాడు.

1872 లో విప్లవ కార్యక్రమాలు విస్తరించాయి. విద్యావంతులైన ఉన్నత కుటుంబ యువతీయువకులు పల్లెటూళ్లకు వెళ్లి, వైద్యులుగా, అధ్యాపకులుగా స్థిరపడ్డారు. వీరే ప్రజల్లో సామ్యవాద భావాలను ప్రచారం చేశారు. బకూనిన్, లేవ్‌రోవ్ (Lavrov), కచేవ్ (Kachev) సామ్యవాద భావాల వల్ల ప్రభావితులైన రష్యన్ విద్యార్థులు, జ్యూరిచ్‌లో చదువు పూర్తిచేసుకుని, స్వదేశానికి తిరిగి వచ్చారు. ఈ విద్యార్థులే కొత్త ఉద్యమ వ్యాప్తికి కృషి చేశారు.

సెయింట్ పీటర్స్ బర్గ్‌లో సామ్యవాదబృందం నికలస్ ష్చైకోవ్‌స్కీ (Nicholoas Tschaikovsky) నాయకత్వంలో పుంజుకుంది. విద్యావంతులు, ఆదర్శప్రాయులైన యువకులు సమాజం పట్ల తమ బాధ్యతలను గుర్తించి, గ్రామాల్లోకి వెళ్లి సామ్యవాదం, స్వేచ్ఛ, సమానత్వాల గురించి ఎన్నో ఉపన్యాసాలిచ్చారు. కాని, వారికి నిరాశే ఎదురైంది. గ్రామాల్లో రైతులు వీరిని నమ్మలేదు. పోలీస్‌లకు అప్పగించారు. ఇతర విప్లవ కారులను పోలీస్‌లు నిర్బంధించారు. 1877 - 78 లో చాలా మంది యువకులను మాస్కో, సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో విచారించి, కఠినంగా శిక్షించారు.

BRAOU

### 18.4.4 : మార్క్సిస్ట్ ఉద్యమ ప్రారంభానికి దారితీసిన సంఘటనలు

1876 లో మొదటిసారి కార్మికులు ప్రముఖ మార్క్సిస్ట్, రష్యాలో మార్క్సిస్ట్ ఉద్యమానికి మూల పురుషుడు ప్లెఖనోవ్ నాయకత్వంలో ప్రదర్శన జరిపారు. కార్మికుల, విద్యార్థుల సభలో పాల్గొని, వారి నుత్తేజపరుస్తూ మాట్లాడాడు. పోలీస్‌లు సమావేశాన్ని చెదరగొట్టారు.

1878 లో కొందరు విప్లవకారులు ఉద్యమాన్ని సంఘటితం చెయ్యడానికి, "లాండ్ అండ్ లిబర్టీ" (Land and Liberty ) అనే రహస్య వార్తాపత్రిక పేరును అనుకరించి, "లాండ్ అండ్ లిబర్టీ" (Land and Liberty) అనే మొదటి విప్లవ పార్టీని స్థాపించారు.

కాలక్రమేణా, నిరంకుశ ప్రభుత్వానికి, విప్లవకారులకు మధ్య సంఘర్షణ తీవ్రమైంది. ఉగ్రవాద ఉద్యమం బలపడింది. ప్రముఖ విప్లవకారులు సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో ఉన్నత పోలీస్, గూఢచారి శాఖల అధికారులను హత్య చేశారు. ప్రభుత్వం విప్లవ కారులను కఠినంగా శిక్షించింది.

ఉగ్రవాదులు బలపడ్డంవల్ల లాండ్ అండ్ లిబర్టీ పార్టీ చీలిపోయింది. ఉగ్రవాదులు "పీపుల్స్ లిబర్టీ" (People's Liberty ) అనే పేరుతో, మరో పార్టీని స్థాపించుకున్నారు. జార్‌ను హత్య చెయ్యడమే ఈ

వర్గంవారి ప్రధాన ఉద్దేశ్యం. ఈ వర్గంవారు రైతులకు భూమి, కార్మికులకు ఫ్యాక్టరీలు చెందాలనే నినాదాన్ని ప్రోత్సహించారు. నిరంకుశత్వాన్ని నిర్మూలించి, సామ్యవాద వ్యవస్థను, ప్రజాప్రభుత్వాన్ని స్థాపించాలనుకున్నారు. ఈ వర్గం ప్రజాస్వామ్య సామ్యవాద విప్లవాన్ని సాధించాలని, కార్యక్రమాన్ని తయారు చేసుకున్నారు. శ్రామిక వర్గం, పెట్టుబడిదారీ వర్గాల మధ్య సంఘర్షణ, ముఖ్యమైన సామాజిక సమస్య కాదని వారి భావన. సమస్త పీడిత ప్రజానీకం నిరంకుశత్వంపై తలపడ్డమే ప్రధాన సామాజిక సమస్యని వారి భావన. అందువల్ల, మార్క్సిస్ట్ దృక్పథంలో పీపుల్స్ లిబర్టీ సభ్యులు సామ్యవాదులు కారు.

### 18.4.5 జార్ రెండో అలెగ్జాండర్ హత్య : ఫలితాలు

జార్ రెండో అలెగ్జాండర్‌ను విప్లవకారులు 1881, మార్చి 1 తేదీన హత్య చేశారు. రహస్య పోలీస్ వ్యవస్థ అసమర్థతవల్ల కుట్ర జయప్రదమైంది. విప్లవకారులు ఉదారవాదుల సహకారాన్నీ, సానుభూతిని పొందారు. ఉదారవాదులు విప్లవకారుల ఉగ్రవాద కార్యక్రమాలను ఆమోదించకపోయినా, జార్‌ల నిరంకుశత్వాన్ని మాత్రం తీవ్రంగా గర్హించారు.

జార్ హత్య జరిగిన తర్వాత, త్వరలోనే ప్రభుత్వం గూఢచారుల సహాయంతో చాలామంది విప్లవకారులను నిర్బంధించింది. హత్యతో సంబంధం ఉన్న ప్రముఖ విప్లవకారులైన జిల్యబోవ్, మైఖేలోవ్, సోఫియా పెరోవ్‌స్కాయాలను ఉరితీశారు.

సామాజిక విప్లవానికి సమయం ఆసన్నం కాలేదు కనుక, విప్లవ యోధులు నిరంకుశత్వంతో జరిపిన పోరాటం విఫలమైంది.

---

## 18.5 మూడో అలెగ్జాండర్ (1881–1894) : పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి : మార్క్సిస్ట్ భావాల వ్యాప్తి

---

రెండో అలెగ్జాండర్ హత్యానంతరం మూడో అలెగ్జాండర్ జార్ అయ్యాడు. ఇతడు తీవ్రమైన నిరంకుశ విధానాన్ని అనుసరించాడు. స్థానిక స్వపరిపాలనలో రెండో అలెగ్జాండర్ ప్రవేశపెట్టిన సంస్కరణలపై నిర్బంధాలను విధించాడు.

19వ శతాబ్ది 9వ దశాబ్దంలో (1880-90) విప్లవ కారుల్లో నిరుత్సాహం, స్తబ్దత ఏర్పడింది. ప్రభుత్వం అనుసరించిన దమన నీతి, నిరంకుశ విధానాలకంటె, విప్లవ ధ్యేయం స్పష్టంగా లేకపోవడంవల్ల విప్లవకారుల ఉత్సాహం తగ్గుముఖం పట్టింది. ఉగ్రవాదం పట్ల ప్రజల్లో ఆకర్షణ తగ్గింది. పెట్టుబడిదారీ వ్యవస్థ రష్యాలో అభివృద్ధి చెందింది. మార్క్సిస్ట్ భావాలు రష్యాలో వ్యాపించాయి. అందువల్ల, కర్షక సామ్యవాదాన్ని (Peasant Socialism) బలపర్చే సిద్ధాంతాలు బలహీనమయ్యాయి. రష్యన్ విజ్ఞానులను టాల్‌స్టాయ్ రచనలు ప్రభావితం చేశాయి.

### 18.5.1 మూడో అలెగ్జాండర్‌పై హత్యా ప్రయత్నం : ఫలితాలు

1887, మార్చి 1 వ తేదీన మూడో అలెగ్జాండర్‌పై హత్యా ప్రయత్నం జరిగింది, కాని, కుట్ర విఫలమైంది. కుట్రలో పాల్గొన్న విద్యార్థులను నిర్బంధించి, న్యాయస్థానంలో విచారణ జరిపి, ఉరితీశారు.



BRAOU

వారిలో ప్రముఖుడు అలెగ్జాండర్ ఉలియనోవ్. ఉలియనోవ్ న్యాయస్థానంలో నేరాన్ని అంగీకరించలేదు. న్యాయస్థానంలో వాదిస్తూ, స్వేచ్ఛను కోరే వ్యక్తి నిరంకుశ ప్రభుత్వంతో జరిపే సంఘర్షణలో హింసా విధానాన్ని అనుసరించడాన్ని సమర్థించాడు. ఆశయాల బలం మాత్రమే ఉన్న అల్ప సంఖ్యాక వర్గం, తమ హక్కులను కాపాడుకోడానికి ప్రయత్నించింది. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిపే సంఘర్షణలో, హింసాత్మక పద్ధతులను అనుసరించడాన్ని అతడు సమర్థించాడు.

1887 లో అలెగ్జాండర్ ఉలియనోవ్ మరణం, అతని తమ్ముడైన వ్లాడిమిర్ (Vladimir) లో గొప్ప మార్పును తెచ్చింది. హైస్కూల్లో చదివే రోజుల్లోనే వ్లాడిమిర్ మానసికంగా విప్లవకారుడు. 30 సంవత్సరాల తర్వాత ఇతడే లెనిన్ (Lenin) అనే పేరుతో రష్యాలో ప్రజ్వరిల్లిన బోల్షివిక్ విప్లవానికి రథ సారథి. రోమనావ్‌ల నియంతృత్వాన్ని తొలగించి శ్రామిక నియంతృత్వాన్ని ప్రవేశపెట్టాడు.

### 18.5.2 నరోద్నిక్‌లు : ప్రధాన విప్లవకారులు

19వ శతాబ్దంలో ఎనిమిది, తొమ్మిది, పది దశాబ్దాల్లో నరోద్నిక్‌లు (Narodniks) రష్యాలో ప్రధాన విప్లవకారులు. వారు రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందలేదని భావించారు. అందువల్ల, రష్యాలో ఫ్యూడలిజం బదులు సోషలిజం ఏర్పడాలని వారు వాదించారు. నరోద్నిక్‌లు కర్షక విప్లవ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. నిరంకుశవాదులను నిర్మూలించి, రష్యాలో సోషలిస్ట్ వ్యవస్థను స్థాపించగలమని వారు భావించారు. నరోద్నిక్‌లు రష్యాలో స్థాపించాలనుకున్న సోషలిస్ట్ వ్యవస్థ, గ్రామీణ ప్రాంతాల్లోని సమిష్టి ఆస్తిని పోలి వుంటుంది. కాలక్రమేణా నరోద్నిక్‌లు సామాజికవాదు (Social Revolutionaries) లయ్యారు. ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు యన్.కె. మైఖైలవ్‌స్కీ (N.K. Mikhailovsky) నరోద్నిక్‌ల భావాలను దృఢంగా సమర్థించాడు.

### 18.5.3 'లిబరేషన్ ఆఫ్ లేబర్' : మొదటి మార్క్సియన్ సోషలిస్ట్ వ్యవస్థ : మార్క్సిస్ట్ సారస్వత వ్యాప్తి

లా అండ్ లిబర్టీ (Law and Liberty), పీపుల్స్ లిబర్టీ (People's Liberty) ల్లోని మాజీ సభ్యులు 1883 లో విదేశాల్లో, లిబరేషన్ ఆఫ్ లేబర్ (Liberation of Labour) అనే మొదటి మార్క్సియన్ సోషలిస్ట్ వ్యవస్థను స్థాపించారు. ఈ వ్యవస్థలోని ముఖ్య సభ్యులైన ప్లెఖనోవ్, ఆక్సిల్‌గాడ్, రష్యాలోని పరిణామాలను మార్క్సిస్ట్ దృక్పథంతో అన్వయించి, ప్రచురించారు. మార్క్స్ రచించిన గ్రంథాలను రష్యన్ భాషలో అనువదించి, రష్యాకు రహస్యంగా చేర్చారు. జారిస్ట్ నియంతృత్వానికి వ్యతిరేకంగా కొనసాగించే పోరాటంలో శ్రామిక వర్గం, నాయకత్వం వహించి, పేదవారైన కర్షకులతో కలిసి పోరాటాన్ని కొనసాగించి, అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలని వారు భావించారు. ఈ భావాలనే రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ ఉద్యమ (Russian Social Democratic Movement) స్వరూపాన్ని తెలియచేసే ప్రకటనలో వివరించారు. మార్క్సిస్ట్ సారస్వతాన్ని రష్యన్ ప్రభుత్వం నిషేధించింది.

### 18.5.4 రష్యాలో పరిశ్రమల అభివృద్ధి : విద్యార్థి, కార్మిక వర్గాల్లో విప్లవ భావాల ప్రచారం

1890 తర్వాత విప్లవోద్యమంలో కొన్ని మార్పులొచ్చాయి. పరిశ్రమలు ఎక్కువగా అభివృద్ధి చెందాయి. సోషల్ డెమోక్రాటిక్ ఉద్యమ నాయకులు విశ్వవిద్యాలయ విద్యార్థుల్లోనే కాకుండా, కార్మికుల్లో కూడా తీవ్రంగా తమ భావాలను ప్రచారం చేశారు. పెట్టుబడిదారీ విధానంలోని అన్ని అంచెలను



BRAOU

అధిగమించాలనే సోషల్ డెమోక్రాట్ల సిద్ధాంతం బలపడింది.

## 18.6 రెండో నికలస్ (1894–1917)

1894లో మూడో అలెగ్జాండర్ మరణించిన తర్వాత, రెండో నికలస్ (1894–1917) జార్ అయ్యాడు. ఇతడు కూడా తండ్రిలాగే నిరంకుశత్వాన్ని అనుసరించాడు.

### 18.6.1 లెనిన్ రాసిన మొదటి గ్రంథం

1894లో చట్టాన్ని అతిక్రమించి, తన మొదటి రాజకీయ గ్రంథాన్ని "వాట్ ది ఫ్రెండ్స్ ఆఫ్ ది పీపుల్ ఆర్ అండ్ హౌదె ఫైట్ ది సోషల్ డెమోక్రాట్స్" (What the "Friends of the people" Are and how they fight the Social Democrats) లెనిన్ రాశాడు. ఈ పుస్తకంలో లెనిన్ నరోద్నిక్కుల విధానాన్ని తీవ్రంగా విమర్శించాడు, నరోద్నిక్కులకు వ్యతిరేకంగా లెనిన్, అతని సహచరులు, కర్షక వర్గం కాక కార్మిక వర్గమే రష్యాలో ప్రధానమైన విప్లవ శక్తి అని భావిస్తుండేవారు.

1895 వరకూ లెనిన్ సెంట్‌పీటర్స్‌బర్గ్ విప్లవకారుల బృందంలో ప్రముఖ పాత్ర నిర్వహించాడు. 1896లో ఈ వర్గం "యూనియన్ ఆఫ్ స్ట్రగుల్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ ది వర్కింగ్ క్లాస్" (Union of Struggle for the Liberation of the working class) అనే సంస్థాన్ని శ్రామిక వర్గ విమోచనం కోసం పోరాడటానికి స్థాపించింది. ఇలాంటి సంఘాలే, మాస్కో, కీవ్ (Kiev) మొదలైన ఇతర నగరాల్లో కూడా ఏర్పడ్డాయి.

### 18.6.2 రష్యాలోని యూదులు విప్లవోద్యమంలో పాల్గొనటం

రష్యన్ జార్‌లు, యూదుల (Jews) పట్ల తీవ్రమైన వ్యతిరేక విధానాన్ని అనుసరించారు. వారికి సామ్రాజ్యంలో చాలా ప్రాంతాల్లో నివసించే హక్కు లేదు. ఈ విధానానికి నిరసనగా చాలామంది విప్లవోద్యమంలో చేరారు. లిథూనియా,పోలెండ్, రష్యాల్లోని యూదులు " జనరల్ జ్యూయిష్ వర్కర్స్ యూనియన్ ఇన్ లిథూనియా, పోలెండ్ అండ్ రష్యా" (General Jewish Workers Union in Lithuania, Poland and Russia) అనే శ్రామికవర్గ సమాఖ్యను 1897లో విల్నాలో ఒక సమావేశంలో స్థాపించారు. రష్యాలో చాలామంది యూదులు విప్లవోద్యమానికి నాయకత్వం వహించారు. ఎందరో యూదులు విప్లవోద్యమంలో పాల్గొన్నారు. పోలిష్ ఫిన్నిష్ , జార్జియన్, ఆర్మీనియన్ అల్పసంఖ్యాక జాతులు కూడా విప్లవోద్యమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ దమననీతి పూర్తిగా అన్ని అవకాశాలను రష్యన్లకే పరిమితం చేయడం వల్ల, రష్యనేతర జాతులు విప్లవోద్యమంలో చేరాయి.

### 18.6.3 రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ మొదటి సమావేశం

రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ (RUSSIAN SOCIAL DEMOCRATIC LABOUR PARTY) (R.S.D.L.P) మొదటి సమావేశం 1898 మార్చి 14వ తేదీన మిన్‌స్క్ (Minsk) లో సమావేశమైంది. శ్రామిక వర్గాలను సమీకరించడానికి ఈ పార్టీ పూనుకుంది. ఈ పార్టీ ఒక వార్తాపత్రికను ప్రకటించడానికి నిశ్చయించింది. ప్రణాళికను విడుదల చేసింది. రాజకీయ స్వేచ్ఛను సాధించడం శ్రామిక వర్గ ధ్యేయాల్లో మొదటి మెట్టని, వ్యక్తి దోపిడీకి అవకాశం లేని సామాజిక వ్యవస్థను సృష్టించాలని ప్రణాళిక తెల్పింది. రష్యన్ శ్రామికవర్గ నిరంకుశత్వాన్ని నిర్మూలించి, పెట్టుబడిదారీ వ్యవస్థతోను, మధ్యతరగతి వర్గంతోను ఇతోధిక శక్తితో పోరాడి, సామ్యవాదం సంపూర్ణ విజయాన్ని సాధించేటట్లు కృషి చేయాలని ప్రణాళిక వివరించింది.



BRAOU

ఈ పార్టీ 1903 లో బోల్షివిక్, మెన్షివిక్ అనే రెండు వర్గాలుగా చీలిపోయింది.

రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ 1900 డిసెంబర్‌లో, (ఇస్క్రా) (Iskra-the spark) అనే వార్తా పత్రికను ప్రారంభించి, మొదటి సంచికను జర్మనీలోని స్టట్‌గార్ట్ నుండి ప్రచురించింది. ఇస్క్రా సంపాదక వర్గంలో ముగ్గురు అనుభవజ్ఞులు – ప్లెఖనోవ్, ఏక్సెల్‌రాడ్, వీరాజసూలిచ్‌లు – ముగ్గురు యువతరానికి చెందిన విప్లవకారులు – లెనిన్, మార్టోవ్, పొట్రెసోవ్‌లు – ఉండేవారు. కొంత కాలం ట్రాట్స్కీ (Trotsky) కూడా సంపాదక వర్గంలో ఉన్నాడు.

సంపాదక వర్గంలోని సహచరులు లెనిన్ భావాలతో ఏకీభవించక పోయినా, అతని వ్యక్తిత్వ ప్రభావం వల్ల ఇస్క్రాలో అతని భావాలకే ప్రాముఖ్యతనిచ్చారు.

1902 లో లెనిన్ " వాట్ ఈజ్ టుబి డన్ " (What is to be done) అనే కరపత్రాన్ని ప్రచురించాడు. రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ వ్యవస్థ పశ్చిమ ఐరోపాలో ఉండే సోషల్ డెమోక్రాటిక్ పార్టీల వ్యవస్థకు భిన్నంగా ఉండాలని సూచించాడు. భవిష్యత్తులో ఆవిర్భవించబోయే కమ్యూనిస్ట్ పార్టీ విధానాన్ని, లక్ష్యాలను ఈ కరపత్రం వివరించింది. పటిష్ఠమైన విప్లవకారుల వ్యవస్థ సహాయంతో రష్యా స్వరూపాన్నే మార్చవచ్చని లెనిన్ భావించాడు. పార్టీలో తీవ్రమైన క్రమశిక్షణ, అధికార కేంద్రీకరణ అవసరమని లెనిన్ విశ్వసించాడు.

## 18.6.4 బోల్షివిక్ – మెన్షివిక్‌ల చీలిక : రెండు వర్గాల మధ్య మౌలిక విభేదాలు

1903 జూలై – ఆగస్ట్‌లో జరిగిన సమావేశంలో రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ వర్కర్స్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయింది. సమావేశానికి వచ్చిన ప్రతినిధుల్లో ఇస్క్రా (Iskra) భావాలను సమర్థించేవారు, అధిక సంఖ్యాకులైన లెనిన్ సహచరులకు, జూలియస్ మార్టోవ్ సహచరులకు అభిప్రాయ భేదాలు తలెత్తాయి. కొంత కాలం తర్వాత మార్టోవ్ గొప్ప మెన్షివిక్ నాయకుడయ్యాడు.

పార్టీ సభ్యత్వానికి కావాల్సిన అర్హతల గురించి భేదాభిప్రాయాలు వచ్చాయి. విప్లవానికి అంకితమైన వారు మాత్రమే పార్టీలో సభ్యులుగా చేరాలని, లెనిన్ ఖచ్చితంగా అభిప్రాయపడ్డాడు. అందువల్ల, కఠినమైన నిబంధనలను ప్రవేశపెట్టాలని లెనిన్ నిశ్చయించాడు. సభ్యుడు పార్టీ వ్యవస్థ చూపిన మార్గంలో ఎల్లప్పుడూ సహకరిస్తే చాలని మార్టోవ్ అభిప్రాయపడ్డాడు.

పార్టీ సభ్యత్వం విషయంలో మాత్రం, మార్టోవ్ విజయాన్ని సాధించాడు. ఇతర ముఖ్య సమస్యలపట్ల లెనిన్‌కు కాంగ్రెస్ లోని అధిక సంఖ్యాకులు మద్దతు నివ్వడం వల్ల, లెనిన్ సహచరులను 'బోల్షివిక్స్' (Bolsheviks) అని, లెనిన్ ను వ్యతిరేకించినవారిని 'మెన్షివిక్స్' (Mensheviks) అని పిల్చారు. (రష్యన్ భాషలో 'బోల్షివిక్ అంటే అధిక సంఖ్యాకులని, 'మెన్షివిక్' అంటే అల్ప సంఖ్యాకులని అర్థం).

కాంగ్రెస్‌లో తనకున్న మెజారిటీ సహాయంతో, లెనిన్ ఇస్క్రా (Iskra) సంపాదక వర్గాన్ని పునర్వ్యవస్థీకరించాడు. తనతోపాటు ప్లెఖనోవ్, మార్టోవ్‌లను మాత్రమే సంపాదక వర్గంలో ఉంచి, తన వ్యతిరేకులను తొలగించాడు. సంపాదక వర్గాన్ని పునర్వ్యవస్థీకరించి ఇస్క్రా పత్రికా విధానాన్ని తను అనుకొన్నట్లు మలచవచ్చని లెనిన్ భావించాడు. లెనిన్, ప్లెఖనోవ్‌ల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. లెనిన్ ఇస్క్రా నుండి విడిపోయాడు. ఇస్క్రా మెన్షివిక్కుల స్వాధీనమైంది.

బోల్షివిక్, మెన్షివిక్ నాయకుల మధ్య తలెత్తిన భేదాభిప్రాయాలే, కాలక్రమేణా భిన్నమైన ఆర్థిక, రాజకీయ సిద్ధాంతాలకు దారితీశాయి.

బోల్షివిక్కులు, మెన్షివిక్కులు మార్క్స్‌ను (Marx) ప్రమాణంగా అంగీకరించారు. రష్యా పారిశ్రామికంగా

వెనుకబడి ఉండడంవల్ల, శ్రామిక వర్గం రష్యా జనాభాలో చాలా తక్కువ శాతం కావడం వల్ల, బూర్జువా విప్లవానికే (Liberal democratic revolution) రష్యాలో పరిస్థితి అనుకూలంగా ఉందని మెన్షివిక్కులు భావించారు. బూర్జువా విప్లవం వల్ల నిరంకుశత్వం నాశనమౌతుందని, వాక్స్వా, పత్రికా స్వాతంత్ర్యాలు సిద్ధిస్తాయనీ, ట్రేడ్ యూనియన్ వ్యవస్థలను స్థాపించవచ్చనీ, వీరు విశ్వసించారు. బూర్జువా విప్లవం విజయవంతం కావడంవల్ల రష్యాలో సాంస్కృతిక, పారిశ్రామిక రంగాల్లో ప్రగతిని సాధించిన తర్వాత, తుదకు సామ్యవాద సమాజ వ్యవస్థను నెలకొల్పవచ్చని, మెన్షివిక్కులు గాఢంగా నమ్మారు. మెన్షివిక్ పార్టీ బలమైన జాతీయ వాదంతో మితవాద సోషలిజంను జోడించింది. మెన్షివిక్కులు, ముఖ్యంగా ప్లెఖనోవ్, రైతులను నమ్మలేదు. వారిని బలీయమైన అభివృద్ధి నిరోధక వర్గంగా భావించారు. అందువల్ల, సామ్యవాదేతర ఉదార భావ ప్రతిపక్షాలతో (Non-Socalist Liberal opposition parties) సహకరించడానికి ఇష్టపడ్డారు. రష్యాలో ప్రజాస్వామిక విప్లవం ముందు విజయవంతం కావాలని, తర్వాతే సామ్యవాద విప్లవం (Socalist Revolution) జరుగుతుందనే అభిప్రాయంతో, లెనిన్ కూడా ఏకీభవించాడు. శ్రామిక వర్గానికి మిత్రులు కర్షకులేకాని, మధ్యతరగతి లిబరల్స్ కాదని, లెనిన్ గాఢంగా విశ్వసించాడు. శ్రామిక, కర్షక వర్గాల ప్రజాస్వామిక నియంతృత్వం ( Democratic Dictatorship of the Proletariat and the Peasantry) అనే సూత్రాన్ని లెనిన్ ప్రచారం చేశాడు.

రష్యన్ మార్క్సిజంలో మూడో మార్గానికి ట్రాట్స్కీ ప్రాతినిధ్యం వహించాడు. శ్రామిక వర్గం మధ్యతరగతి వర్గ సహాయసహకారాలు లేకుండా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్నాడు. లెనిన్ సిద్ధాంతం - శ్రామిక, కర్షక వర్గాల ప్రజాస్వామిక నియంతృత్వం) కూడా ట్రాట్స్కీని సంతృప్తిపర్చలేదు.

ఆర్థికంగా అభివృద్ధిని సాధించిన దేశాల్లో విప్లవం ప్రజ్వరిల్లడానికి సహాయ పడితేనే రష్యన్ విప్లవం విజయవంతమౌతుందని ట్రాట్స్కీ భావించాడు. అలా జరక్కపోతే, దేశం వెనుకబడి ఉండటంవల్లను, రైతుల సాంప్రదాయకస్వభావం వల్లనూ, విప్లవ ప్రభుత్వ పతనమౌతుందని ట్రాట్స్కీ భావించాడు.

### 18.6.5 సామ్యవాద విప్లవకారులు : పార్టీ లక్ష్యాలు

సామ్యవాద విప్లవకారులు (Socalist Revolutionaries) విప్లవోద్యమంలో మార్క్సిస్టేతర శక్తికి ప్రాతినిధ్యం వహించారు. గతంలో వీరే నరోద్నిక్కులు. వీరు సోషల్ డెమొక్రాటిక్ లిబరల్ వర్కర్స్ పార్టీతో పోటీపడ్డారు. 1880 తర్వాత రష్యాలో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందటంవల్ల కార్మిక వర్గానికి లభించిన ప్రాధాన్యతను, ఈ వర్గం వారు గుర్తించారు. అయినా, విప్లవోద్యమానికి ప్రధాన శక్తి రైతులే కాని, శ్రామిక వర్గం కాదని, వీరు భావించారు. భూమిని జాతీయం చెయ్యాలని, భూస్వాముల ఆస్తులను రైతుల లాభం కోసం బలవంతంగా స్వాధీనం చేసుకోవాలనీ, ఈ పార్టీ కోరింది. సోషలిస్ట్ రివల్యూషనరీ పార్టీలోని ఒక రహస్య వర్గం 1902 లో గ్రెగరీ గెర్షూనీ (Gregory Gershuni) నాయకత్వంలో, రాజకీయ హత్యలను నిర్వహించింది. అతన్ని నిర్బంధించిన తర్వాతే, ఈ వర్గానికి ఇవ్నో అజీవ్ (Evno Azeev) నాయకుడయ్యాడు. ఈ వర్గం వారు దేశంలో ప్రముఖులైన నాయకులను, రాజకుటుంబీకులను హత్య చేశారు. ఇవ్నో అజీవ్ ఈ వర్గానికి నాయకుడే కాక, రహస్య పోలీస్ వ్యవస్థకు ప్రధాన అధికారి కూడా. పోలీస్ అధికారులు రహస్యవర్గాల్లో విప్లవ చర్యలను ప్రోత్సహించడానికి చేరినట్లు ప్రవేశించి, తర్వాత సభ్యులను నిర్బంధించేవారు. సామ్యవాద విప్లవకారులు పెద్ద పార్టీయే అయినా, సంఘటిత వ్యవస్థ, క్రమశిక్షణ లేకపోవడంవల్ల, ఈ పార్టీ విఫలమైంది.

#### 18.6.5.1 రష్యాలో మధ్య తరగతి వర్గ ఆవిర్భావం : కేడెట్ పార్టీ (Cadet Party)

రష్యాలో సంఘటితమైన ఉదార భావ మధ్య తరగతి వర్గం (Organised middle class liberalists)

క్రమేణా అభివృద్ధి చెందింది. రష్యన్ విప్లవ గమ్యాన్ని నిర్ణయించడంలో, ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించాలి. 1905లో మధ్యతరగతి ఉదార భావాలను, ఆశయాలను ప్రతిబింబించే పార్టీ (Constitutional Democratic or Cadet Party) స్థాపన జరిగింది. కేడెట్ పార్టీ ఒక్కటే సామ్యవాదేతర రాజకీయ వ్యవస్థ (Non-Socalist political organisation). ఈ పార్టీ రాజ్యాంగబద్ధ రాజరికం ఏర్పడాలనీ, సివిల్ హక్కులను ప్రవేశపెట్టాలనీ కోరింది. జాతి భేదాన్ని రద్దు చెయ్యాలని ప్రకటించింది. ఈ పార్టీ శ్రామిక వర్గ అభ్యుదయాన్ని దృష్టిలో ఉంచుకుని, సంస్కరణలను ప్రవేశపెట్టి, శాసనాలను చెయ్యాలని గాఢంగా అభిప్రాయపడింది. భూస్వాములకు న్యాయమైన నష్టపరిహారాన్ని ఇచ్చి, రైతులకు లాభం కలిగే పద్ధతుల్లో భూములను పంచి పెట్టాలని ఈ పార్టీ సూచించింది.

1905లో జార్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రజ్వరిల్లినప్పుడు, కేడెట్ (Cadet) పార్టీ తీవ్ర భావాలను ప్రచురించింది. 1917లో జారిస్ట్ వ్యవస్థ పతనమైన తర్వాత, ఈ పార్టీ ప్రైవేట్ ఆస్తిని, పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించి, సామాజిక విప్లవ ఉధృతాన్ని అడ్డడానికి ప్రయత్నించింది. ఈ పార్టీ చాలా బలంగా పుంజుకుంది.

### 18.6.5.2 : 1905 విప్లవం ప్రజ్వరిల్లే వరకు దొర్లిన 80 సంవత్సరాల చరిత్ర సమీక్ష

డిసెంబరిస్ట్ ఉద్యమం జరిగిన 80 సంవత్సరాల తర్వాత, అంటే 1905 లో, రష్యాలో ప్రజ్వరిల్లిన విప్లవం గొప్ప సంచలనాన్ని రేకెత్తించింది. ఈ 80 సంవత్సరాల్లో (1825-1905) విప్లవాత్మక భావాలతో చైతన్యవంతమైన ఎన్నో సంఘాలు మొలకెత్తి, వృద్ధి చెందాయి. మధ్య యుగం నాటి నుండి పాతుకుపోయిన నిరంకుశ ప్రభుత్వంతో విప్లవకారులు సంఘర్షణకు తలపడ్డారు. గూఢచారుల పరిశోధనలవల్ల, దేశద్రోహుల వెన్నుపోటు వల్ల, ప్రభుత్వం ఎందరో విప్లవ కారులను నిర్బంధించింది. విప్లవ సంఘాలు విచ్ఛిన్న మయ్యాయి. ఎందరో అజ్ఞాతవీరులు జార్ల నిరంకుశ నియంతృత్వంతో జరిగిన సంఘర్షణలో తమ ప్రాణాలను సైతం లక్ష్య పెట్టకుండా పోరాడి, రష్యన్ సామాన్య ప్రజానీకంలో చైతన్యాన్ని రగిలించారు.

BRAOU

## 18.7 : 1905 విప్లవం

మొదటిసారి రష్యన్ సామాన్య ప్రజానీకం 1905లో జారిస్ట్ నిరంకుశ నియంతృత్వంతో సంఘర్షణకు తలపడ్డారు. అదే 1905 రష్యన్ విప్లవం.

### 18.7.1 1905 విప్లవం ప్రజ్వరిల్లడానికి కారణాలు

జపాన్‌తో జరిగిన యుద్ధంలో పరాజయం, అంతరంగిక పరిస్థితి క్లిష్టమవడం, విప్లవోద్యమాన్ని సమర్థించిన రాజకీయ పార్టీల ప్రోద్బలం, ఈ ఉద్యమంలో సామాన్య ప్రజలు అసంఖ్యాకంగా పాల్గోడానికి కారణమయ్యాయి. 1890-1900 మధ్య, రష్యాలో పరిశ్రమలు వేగంగా అభివృద్ధి చెందాయి. కార్మికోద్యమం 1903లో బలపడి, అభివృద్ధి చెందింది. కార్మికులు 1903లో బాకూ (Baku) చమురు గనుల్లో సమ్మె చేశారు. అలాగే టిఫ్లిస్, బటూమ్, ఒడెస్సా, కీవ్ నగరాల్లో కూడా సమ్మె వ్యాపించింది. కార్మికులు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు, ప్రజాస్వామిక రాజ్యాంగం కావాలని నినాదాలు చేస్తూ, పెద్ద ప్రదర్శనలు జరిపారు.

1902లో పేద రైతులు ఖార్కోవ్, (Kharkov) పుల్టావా (Pultava) రాష్ట్రాల్లోని చాలా జిల్లాల్లోని భూస్వాముల ఎస్టేట్లపై దాడిచేసి దోచుకున్నారు. పేద రైతాంగం నుండి అనుకోకుండా కార్మిక వర్గానికి

సహాయం లభించింది. దేశంలో పరిస్థితి విషమించడంతో, ప్రజల దృష్టిని ఆంతరంగిక సమస్యల నుండి మళ్లించాలనే ఉద్దేశ్యంతో, జపాన్‌పై రష్యా యుద్ధానికి సిద్ధమైంది. 1904 లో రష్యా-జపాన్ ల మధ్య యుద్ధం మొదలైంది. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోవడంతో, 1905 విప్లవానికి నాంది జరిగింది. జపాన్ సైన్యాలు పోర్ట్ ఆర్థర్‌ను ముట్టడించి, రష్యన్ సైన్యాలను చిత్తుగా ఓడించాయి. ఈ యుద్ధంలో రష్యా ఓడిపోవడంతో, ప్రభుత్వ ప్రతిష్ఠ మంటగలిసింది. దేశంలో అశాంతి ప్రబలింది. విప్లవోద్యమం రెట్టింపైన ఉత్సాహంతో ముందుకు ఉరికింది.

1905లో రష్యాలో అన్ని పార్టీలు నిరంకుశ ప్రభుత్వాన్ని అంతమొందించాలని, రాజ్యాంగాన్ని ఆమోదించాలనీ, ఏకగ్రీవంగా కోరాయి. 1905 విప్లవ ఆశయం, రాజ్యాంగాన్ని సాధించడం. అందువల్ల, 1905 విప్లవాన్ని ప్రజా విప్లవంగా పరిగణించొచ్చు.

### 18.7.1.1 జార్జి గేపన్ నాయకత్వంలో జార్‌కు సమర్పించిన వినతి పత్రం

1905లో సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో పెద్ద సమ్మె మొదలైంది. 1905 జనవరి 22 ఆదివారం నాడు, సమ్మె చేస్తున్న రెండు లక్షలమంది కార్మికులు వారి కుటుంబాలతో సహా, జార్జి గేపన్ అనే మత ప్రచారకుని నాయకత్వంలో,"వింటర్ పాలెస్"(Winter Palace) కు ఊరేగింపుగా వెళ్లి, జార్ రెండో నికలస్‌కు కోర్కెల పత్రాన్నిచ్చారు. అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చెయ్యాలని, ఆ వినతి పత్రంలో కోరారు. నిర్బంధ విద్యా విధానాన్ని అమలు జరపాలని, సివిల్ హక్కులను ప్రభుత్వం గుర్తించాలనీ, విజ్ఞప్తి చేశారు. పెట్టుబడిదారీ వర్గానికి, శ్రామిక వర్గానికి, మధ్య సంబంధాలను క్రమబద్ధం చెయ్యాలని కోరారు. కార్మికులకు ఫ్యాక్టరీల్లో 8 గంటల పనిని, రోజుకు 1 రూబుల్ కనీస వేతనాన్ని యివ్వాలని, వినతి పత్రంలో పేర్కొన్నారు. చాలామంది రష్యన్లు జార్‌ను తండ్రిగా భావించారు. జార్ ఔదార్యాన్ని, న్యాయ బుద్ధిని, గుడ్డిగా నమ్మారు. కాని, వారికి నిరాశే ఎదురైంది. జార్ కాని, అతని ప్రతినిధి కాని, వినతి పత్రాన్ని అందుకోలేదు. అధికారులు సమ్మె చేస్తున్నవారికి గట్టిగా గుణపాఠం చెప్పాలనే ఉద్దేశ్యంతో, వేలాది కార్మికులను భార్యాబిడ్డలతో సహా, మారణహోమానికి బలి చేశారు. ఎంతో దారుణమైన రక్తపాతం ఆనాడు జరిగింది కనుకనే, ఆ రోజును "రక్తపాత రవివారంగా" (BLOODY SUNDAY) పిల్చారు.

BRAOU

### 18.7.1.2 బ్లడీ సన్‌డే (రక్తపాత రవివారం) సంఘటన ప్రభావం

బ్లడీ సన్‌డే నాడు సామాన్య ప్రజలకు జారిస్ట్ నియంతృత్వ నిజరూపం తెలిసింది. 'బ్లడీ సన్‌డే' వార్తలు రష్యా అంతటా తెలిసాయి. కార్మిక, కర్షక వర్గాలు అసంఖ్యాకంగా ఉద్యమాలను చేపట్టాయి. జారిస్ట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రష్యన్ ప్రజలందరూ సమైక్యంగా సంఘటితులయ్యారు అందువల్ల, 1905 విప్లవాన్ని ప్రజా విప్లవంగా పరిగణించొచ్చు. దూరదృష్టితో పరిశీలించిన తర్వాత, లెనిన్ కూడా ఇదే అభిప్రాయాన్ని ప్రకటించాడు.

" The revolutionary uprising of the proletariat accomplished in a single day what would have taken months and years under the ordinary everyday living conditions of the down trodden" (V.I.Lenin)

'బ్లడీ సన్‌డే' నాటి దారుణ సంఘటన పట్ల, రష్యన్ ప్రభుత్వపు దమనకాండ పట్ల, ఫ్రాన్స్, ఇటలీ, బెల్జియం, జర్మనీ, దక్షిణ అమెరికాల్లోని కార్మికులు సమావేశాలను జరిపి, తమ తీవ్ర నిరసనను ప్రకటించారు.

1905 విప్లవోద్యమంలో ప్రజలు అసంఖ్యాకంగా పాల్గొన్నారు. కాని, దురదృష్టవశాత్తు ఈ ఉద్యమానికి సమర్థవంతమైన నాయకత్వం లేదు. 1905 అక్టోబర్ 30న ప్రభుత్వం రాజ్యాంగాన్ని ప్రకటించేవరకు, ఎక్కువ మంది విద్యావంతులు, కొందరు భూస్వాములు, పారిశ్రామికవేత్తలు తమ సానుభూతిని ప్రకటించి, ఈ ఉద్యమానికి మద్దతునిచ్చారు.

పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనడంవల్ల, ఈ ఉద్యమం చాలా త్వరగా వ్యాపించింది. కాని, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నాయకత్వం లేకపోవడం వల్లనూ, స్పష్టమైన కార్యక్రమం లేకపోవడంవల్లనూ, చివరకు ఈ విప్లవం విఫలమైంది.

రష్యా-జపాన్ యుద్ధం ముగిసిన తర్వాత, ప్రభుత్వం ప్రజల అసంతృప్తిని తగ్గించడానికి కొన్ని రాజకీయ సంస్కరణలను ప్రవేశపెట్టింది. 1905 ఆగస్ట్, 19న స్టేట్ కౌన్సిల్ ఆధారంగా ఇంపీరియల్ డ్యూమా (Imperial Duma) ను ఏర్పాటు చేసింది. ఈ ప్రణాళికనే బులిగిన్ (Bulygin) ప్రణాళిక అంటారు. ఇంపీరియల్ డ్యూమా సభ్యులు పరోక్ష ఎన్నిక ద్వారా ఎన్నికౌతారు. ప్రభుత్వం ఓటింగ్ హక్కును పరిమితం చేసింది. ఈ సభ సలహాలివ్వడానికే పరిమితమైంది.. ఈ సభకు ఎలాంటి అధికారాలు లేవు. అందువల్ల, ప్రతిపక్షాలు అసంతృప్తి చెందాయి. దేశంలో అల్లర్లు తగ్గలేదు.

## 18.7.1.3 పొటెమ్‌కిన్ తిరుగుబాటు

రష్యా- జపాన్ యుద్ధంలో రష్యా ఓడిపోయిన తర్వాత, రష్యాలోనే నౌకాదళం తిరుగుబాటు చేసింది. పొటెమ్‌కిన్ (POTEMKIN) నౌక సిబ్బంది తిరగబడ్డారు. ఈ నౌక ఒడెస్సా (Odessa) రేవులోకి ఎర్ర జెండా ఎగురవేసుకుని వచ్చింది. ఒడెస్సా రేవులో పెద్ద సమ్మె జరుగుతోంది. పొటెమ్‌కిన్‌కు మరో ఓడ తోడు కావడంతో, తిరుగుబాటుదార్ల బలం పెరిగింది. చిట్టచివరకు ప్రభుత్వం ఈ తిరుగుబాటును అణచివేసింది. 1905 నవంబర్‌లో క్రాన్‌స్టాడ్ స్థావరంలోను, క్రిమియాలోని సెబాస్టపూల్ నౌకాశ్రయంలోను జరిగిన తిరుగుబాట్లను కూడా, చిట్టచివరకు ప్రభుత్వం అణచివేసింది. నూతన భావాలున్న సుశిక్షితులైన కార్మికులు ఎక్కువ మంది సైన్యంలో కంటె నౌకా దళంలో చేరారు. అందువల్ల, 1905, 1917 సంవత్సరాల్లో విప్లవోద్యమ ప్రభావం సైన్యంలో కంటె నౌకాదళంలో త్వరగా వ్యాపించింది. వేలాది ప్రజలు నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ, ప్రదర్శనల్లో పాల్గొన్నారు. రాజధాని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో బ్రహ్మాండమైన సమ్మె జరిగింది. విప్లవకారులు బాంబులను తయారుచేశారు. తుపాకులను కాజేశారు. ఈ విప్లవానికి అమెరికాలో గొప్ప మద్దతు లభించింది.

## 18.7.1.4 రైల్వే కార్మికుల సమ్మె: సార్వత్రిక సమ్మె

ఈ విధంగా దేశం అట్టుడికి పోతూ ఉంటే, సామాన్య ప్రజానీకం విజయం సాధిస్తే వచ్చే పరిణామాలకు భయపడి, రష్యాలోని మధ్యతరగతి వర్గం కేడెట్ (Constitutional Democrats) పార్టీని స్థాపించింది. వీరు ఇంగ్లాండ్‌లో లాగే, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కోరారు. రాజ్యాంగబద్ధ రాజరిక వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలని కోరారు.

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమ్మె చేస్తున్న కార్మికులు నగరంలో చాలా ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాట్స్కీ నాయకత్వంలో కార్మికులు సోవియట్‌లను ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీల్లోను, దుకాణాల్లోను, కార్మికులు ప్రతినిధులను ఎన్నుకున్నారు. మాస్కో, ఇతర నగరాల్లో కూడా, సోవియట్‌లను ఏర్పాటు చేశారు. సోవియట్లకు, జార్ ప్రభుత్వానికి మధ్య అధికారాల గురించి సంఘర్షణ జరిగింది.

1905 అక్టోబర్ 20వ తేదీన రైల్వే కార్మికుల సమ్మె ప్రారంభమై, విప్లవోద్యమంలో చాలా ముఖ్యమైన సంఘటనగా ప్రాధాన్యతను సంతరించుకుంది. దేశంలో 7,50,000 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్మికులు స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు జరగాలని, రాజ్యాంగ పరిషత్తు సమావేశం కావాలని, రాజకీయ ఖైదీలను విడుదల చెయ్యాలనీ, కోరారు. 1905 అక్టోబర్ 23న రైల్వే కార్మికుల సమ్మె సార్వత్రిక సమ్మెగా (General strike) మారింది. ఈ సమ్మె పూర్తిగా విజయవంతమైంది. దేశంలో ప్రజా జీవనం స్తంభించింది. అంతే కాకుండా, ప్రభుత్వం సైనికుల విశ్వాసాన్ని కోల్పోయింది. నౌకా దళం ఎదురుతిరిగింది.



BRAOU

## 18.7.2 1905 అక్టోబర్ రాజ్యాంగ ప్రణాళిక

ఈ విధంగా దేశంలో పరిస్థితులు పూర్తిగా దిగజారి పోవడంతో, 1905, అక్టోబర్ 28వ తేదీన చిట్టచివరకు జార్ రాజ్యాంగాన్ని ప్రకటించడానికి నిశ్చయించి, ప్రధాన మంత్రి కౌంట్ విట్టీని రాజ్యాంగ ప్రణాళికను తయారుచేయమని ఆదేశించాడు. 1905, అక్టోబర్ 30 వ తేదీన రాజ్యాంగ ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ ప్రణాళిక ప్రకారం, వ్యక్తి స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, సమావేశ స్వేచ్ఛ లభించాయి. కార్మికులు యూనియన్‌లను ఏర్పర్చుకునే హక్కును గుర్తించింది. అక్టోబర్ ప్రణాళికను రష్యన్ హక్కుల చట్టంగా భావించొచ్చు. ఇంపీరియల్ డ్యూమా అనుమతి లేందే శాసనాలను అమలు జరపరాదని ప్రకటించింది. పరిపాలనా యంత్రాంగ చర్యలు న్యాయమైనవో, కావో నిర్ణయించే హక్కును ప్రజా ప్రతినిధులకు ఇచ్చింది. అక్టోబర్ ప్రణాళికను ప్రకటించగానే దేశంలో ఉద్రిక్తత తగ్గింది. ప్రభుత్వం రాజకీయ ఖైదీలకు శిక్షలను తగ్గించింది. రైతులపై పన్నుల భారాన్ని తగ్గించింది. పత్రికలపై సెన్సార్ నిబంధనలను తొలగించింది. అక్టోబర్ ప్రణాళికలోని ఉదార భావాలు రష్యన్ చరిత్రలో చాలా మార్పును తెచ్చాయి. ఈ ప్రణాళిక విప్లవోద్యమంలో చీలికను తెచ్చింది. రష్యా- జపాన్ యుద్ధం ముగిసిన తర్వాత ఆగ్నేయాసియా నుండి రష్యన్ సైన్యం తిరిగి వచ్చింది. ఈ రెండు సంఘటనలు 1905 విప్లవాన్ని అంతమొందించి, రాజ వంశాన్ని కాపాడాయి.

ఉన్నత వర్గం, మధ్యతరగతి వర్గాల్లో ఎక్కువ మంది అక్టోబర్ ప్రణాళికను ఆమోదించారు. ఈ ప్రణాళికతో కేడెట్ పార్టీ సంతృప్తి చెందింది. ప్రభుత్వంపై అజమాయిషీ మధ్య తరగతి వర్గం నుండి శ్రామిక వర్గానికి మారడాన్ని, వ్యాపారులు వ్యతిరేకించారు.

సోషల్ డెమోక్రాట్లు, ఇతర తీవ్రవాద పార్టీలు మాత్రమే రాజీ విధానాన్ని తిరస్కరించి, విప్లవాన్ని నిర్వహించడానికి సిద్ధమయ్యాయి. కాని, వారి హింసాయుత కార్యక్రమాలకు సామాన్య ప్రజానీకం, మధ్యతరగతి వర్గం, ఉన్నత తరగతి వర్గం మద్దతు నివ్వలేదు. అందువల్ల, ఈ పార్టీల కార్యక్రమాలు విఫలమయ్యాయి. అక్టోబర్ ప్రణాళిక ద్వారా ప్రభుత్వం "విభజించి పాలించు" (Divide and Rule) అనే సిద్ధాంతాన్ని బుద్ధిపూర్వకంగా అనుకున్నా, అనుకోకపోయినా, ఈ ప్రణాళికే విప్లవోద్యమంలో విభజనకు దోహదంచేసింది. దేశంలో జరుగుతున్న సాధారణ సమ్మెకు కేడెట్ పార్టీ మద్దతును ఉపసంహరించింది. ఈ చర్యే విప్లవోద్యమ పతనానికి దారితీసింది. రాజ్యాంగాన్ని ప్రకటించిన తర్వాత, మితవాద, సామ్యవాద పార్టీల మధ్య భేదాభిప్రాయాలు ఎక్కువయ్యాయి.

### 18.7.2.1 సోవియట్ల స్థాపన

అక్టోబర్ ప్రణాళికను ప్రకటించడానికి 4 రోజులముందు, 1905 అక్టోబర్ 26వ తేదీన సుమారు 40 మంది ప్రతినిధులు సెయింట్‌పీటర్స్‌బర్గ్ టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్‌లో సమావేశమై, సోవియట్ వ్యవస్థను స్థాపించారు. ఈ సోవియట్ 1905 విప్లవ వ్యాప్తికి చాలా కృషి చేసింది. ఈ సోవియట్ వ్యవస్థే, 1917లో బోల్షివిక్ విప్లవం జరిగిన తర్వాత ఏర్పడ్డ వ్యవస్థకు, మూలం. రష్యాలోని అన్ని పెద్ద నగరాల్లోను, చిన్న పట్టణాల్లోను, సోవియట్లు ఆవిర్భవించాయి. ఈ సోవియట్, రష్యా కార్మికోద్యమాన్ని, విప్లవోద్యమాన్ని వ్యాపింపచేయడానికి తోడ్పడింది. 1905 విప్లవ కాలంలో సెయింట్‌పీటర్స్‌బర్గ్ కార్యనిర్వాహక కమిటీలో, లియాన్ ట్రాట్స్కీ ప్రముఖ పాత్రను నిర్వహించాడు.

సెయింట్‌పీటర్స్‌బర్గ్ సోవియట్‌లో బోల్షివిక్‌లు, మెన్షివిక్‌లు, సోషలిస్ట్ రివల్యూషనరీలు, ఏ పార్టీకి చెందని వారు సభ్యులుగా ఉండేవారు. సెంట్ పీటర్స్ బర్గ్ సోవియట్‌లో ఏ పార్టీకి మెజారిటీ రాలేదు. ఏ పార్టీకి మెజారిటీ రానందువల్ల క్రమశిక్షణ లోపించి, సోవియట్ వ్యవస్థ మెరుగ్గా పనిచేయకపోవచ్చనే అనుమానాన్ని, లెనిన్ వెలిబుచ్చాడు. 1905 సంవత్సరాంతంలో లెనిన్ 'సోవియట్' కార్మికుల ఆశయాల



BRAOU

స్థాపనకు పోరాటాన్ని నిర్వహించే వ్యవస్థని ప్రకటించాడు. కొన్ని లోపాలున్నప్పటికీ, అధికారాన్ని నిర్వహించే వ్యవస్థలుగా సోవియట్లను, లెనిన్ 1906, మార్చిలో గుర్తించాడు.

### 18.7.2.2 : కర్షకుల తిరుగుబాటు

1905 లో గ్రామీణ జిల్లాల్లో అశాంతి ప్రజ్వరిల్లింది. 1905 ఆగస్ట్ 13, 14 తేదీల్లో కర్షక ప్రతినిధులు, విప్లవ పార్టీల ప్రతినిధులు మాస్కోలో రహస్యంగా సమావేశమయ్యారు. ఈ సమావేశం లో వీరు ప్రైవేట్ ఆస్తిని రద్దు చేయాలని, భూమి ఉమ్మడి ఆస్తి కావాలనే తీర్మానాలను ఆమోదించారు.

1905 నవంబర్ లో కర్షకులు హింసాయుత విధానాన్ని అనుసరించి, అనేక రాష్ట్రాల్లో తిరుగుబాటు చేశారు. కర్షకోద్యమం వర్గ పోరాటంగా మారింది. భూస్వాముల ఎస్టేట్ లు దోపిడీలో, దహనకాండలో నాశనమయ్యాయి.

1905 నవంబర్ 19న రెండో రైతాంగ యూనియన్ కాంగ్రెస్ (Second Peasants Union Congress) మాస్కోలో సమావేశమై, భూమిని జాతీయం చెయ్యాలనే తీర్మానాన్ని ఆమోదించింది. భూమిని కూలీల సహాయం లేకుండా దున్నే వాళ్లకు మాత్రమే చెందాలనే తీర్మానాన్ని, కాంగ్రెస్ సభ్యులు ఆమోదించారు. 1906 జూన్ వరకూ కూడా, కర్షకోద్యమం కొన్ని ప్రాంతాల్లో బలంగానే కొనసాగింది. కాని, ప్రభుత్వ దమనకాండవల్ల, పట్టణాల్లో విప్లవోద్యమం క్షీణించడం వల్లను, కర్షకుల తిరుగుబాటు అంతమైంది.

### 18.7.2.3 సెయింట్‌పీటర్స్‌బర్గ్, మాస్కో నగరాల్లో తీవ్రమైన సంఘర్షణలు : సాయుధ తిరుగుబాటు

BRAOU

లెనిన్, అతని భార్య కృప్స్కాయా (Krupskaya) తమ సహచరులతో కలిసి, ప్రవాసం నుండి 1905 నవంబర్ లో రష్యాకు తిరిగి వచ్చారు. 1905 నవంబర్, డిసెంబర్ నెలల్లో సెయింట్‌పీటర్స్‌బర్గ్, మాస్కో నగరాల్లో తీవ్రమైన సంఘర్షణలు చెలరేగాయి. క్రాన్‌స్టాడ్ లో తిరుగుబాటు చేసిన నావికులను కోర్ట్ మార్షల్ చేసినందుకు, రష్యాలో కొన్ని ప్రాంతాల్లో సైనిక శాసనాన్ని ప్రవేశపెట్టినందుకు నిరసనగా, సెయింట్‌పీటర్స్‌బర్గ్ సోవియట్ రెండో సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చింది. కాని, ఈ సమ్మెకు మొదటి సమ్మెకు లభించినంత మద్దతు లభించలేదు.

1905 డిసెంబర్ 15వ తేదీన అన్ని పార్టీలకు చెందిన సోవియట్ సభ్యులు, ప్రభుత్వానికి పన్నులు కట్టవద్దని, సేవింగ్స్ బ్యాంకుల్లోని డిపాజిట్లను తీసివేయాల్సిందని, వేతనాల చెల్లింపు బంగారంలోనే జరగాలని విజ్ఞప్తి చేశారు.

1905 డిసెంబర్ 16న సోవియట్ సాయుధ తిరుగుబాటుకు కార్యక్రమాన్ని చర్చిస్తూ ఉండగా, ప్రభుత్వం ట్రాట్స్కీతో సహా కార్యవర్గ సభ్యులందర్నీ నిర్బంధించింది. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో ఎలాంటి సంఘర్షణలు జరగలేదు. లెనిన్ నాయకత్వంలో మాస్కోలోని కార్మికులు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె సాయుధ పోరాటంగా మారింది. మాస్కో శివార్లను చాలా రోజులవరకు విప్లవకారులు ఆక్రమించుకున్నారు, 1905, డిసెంబర్ 28న వారం రోజులు మాస్కో నగర వీధుల్లో గొరిల్లా పోరాటం సాగిన తర్వాత, ప్రభుత్వ సైన్యాలు ఈ తిరుగుబాటును అణచివేశాయి. పోలీస్‌లు లెనిన్, కృప్స్కాయాలను నిర్బంధించడానికి వచ్చారు. కొద్ది నిమిషాలకు ముందే వారు తప్పించుకుని వెళ్లిపోయారు. ట్రాట్స్కీని ప్రభుత్వం సైబీరియాకు ప్రవాసానికి పంపింది.

### 18.7.3 1905 విప్లవం : వివిధ వర్గాల ప్రజల అనుభవాలు

1905 జనవరిలో 'బ్లడీ సన్ డే' నాడు మొదలైన విప్లవం, డిసెంబర్ నెల్లో మాస్కోలోని కార్మికుల సాయుధ సంఘర్షణ విఫలం కావడంతో, ముగిసింది.

1905 విప్లవం విప్లవకారులకు గొప్ప అనుభవాన్నిచ్చింది. సంఘర్షణ ప్రజ్వరిల్లినప్పుడు కేడెట్ పార్టీని నమ్మడానికి లేదని, విప్లవకారులు భావించారు. ఈ విప్లవం విఫలం కావడంవల్ల, మెన్షివిక్ లు తమకు పరిపాలించే అనుభవం లేదని భావించారు. సైనికులు సహకరించకపోతే, సమర్థవంతమైన నాయకత్వంలో కూడా తిరుగుబాటు విఫలమౌతుందని, బోల్షివిక్ లు గ్రహించారు.

రెండో నికలస్ ఈ విప్లవం నుండి ఏ గుణపాఠాన్ని నేర్చుకోలేదు. అంతులేని అధికారం తనకుందని, తన అధికారాన్ని ఎవరూ సవాల్ చెయ్యలేరని దృఢంగా నమ్మాడు. విప్లవోద్యమ కాలంలో ప్రజలకు ఇచ్చిన కొద్దిపాటి రాయితీలను రద్దు చేశాడు.

1905 నాటి విప్లవ సంఘటనలు, భవిష్యత్తులో జరగనున్న భయంకరమైన ప్రధాన సంఘర్షణకు నాంది (Dress rehearsal) అని, రష్యన్ పాలకులు గుర్తించలేదు.

లెనిన్ 1905 విప్లవాన్ని 1917 విప్లవానికి నాంది అని ప్రకటించాడు. ఈ విప్లవం విఫలమైనా, 1917లో జరగబోయే విప్లవ విజయానికి కారణమైన శక్తులను అర్థం చేసుకోడానికి తోడ్పడింది.

1905 లో రాజకీయ ఒత్తిడులకు లొంగిపోయి, ప్రజలకు అనేక రాయితీలనిచ్చి రెండో నికలస్ పొరపాటు చేశాడని, అతనికి సన్నిహిత సహచరులు నచ్చచెప్పారు. భవిష్యత్తులో ఆందోళనలు ప్రజ్వరిల్లినా, దృఢంగా వ్యవహరించాల్సిందని సలహానిచ్చారు.

విప్లవోద్యమ నాయకులు తిరిగి రాజకీయ రంగంపై తమ పాత్రలను నిర్వహించే లోపల, ఐరోపా ఖండంలో ఇదివరకెన్నడూ కనీవినీ ఎరగని దారుణ మారణ హింసాకాండ, మొదటి ప్రపంచ యుద్ధంతో మొదలైంది. ఈ యుద్ధం భీకరంగా సాగుతున్న రోజుల్లో ఒకే సంవత్సరంలో (1917) రెండు విప్లవాలు ప్రజ్వరిల్లి, రష్యన్ సామాజిక వ్యవస్థను పూర్తిగా మార్చివేశాయి.

---

### 18.8 సంగ్రహంగా

---

మొదటి అలెగ్జాండర్ మొదటి నికలస్‌ల పరిపాలనలో రష్యాలో సామాన్య ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేక, చాలా బాధలు పడ్డారు. వీరి నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ, సైనికులు, యువత, సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, ఉద్యమాలను నిర్వహించారు.

రెండో అలెగ్జాండర్ ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల ప్రజల్లో కొత్త ఆశలు మొలకెత్తినా, ఫలితం శూన్యమే. రెండో అలెగ్జాండర్‌ను హత్య చేసిన తర్వాత, ప్రభుత్వం విప్లవకారులను కఠినంగా శిక్షించింది. విప్లవ యోధులు నిరంకుశత్వంతో జరిపిన పోరాటంలో విజయాన్ని సాధించలేకపోయారు.

మూడో అలెగ్జాండర్ (1881-1894) పరిపాలనా కాలంలో, పెట్టుబడిదారీ వ్యవస్థ రష్యాలో అభివృద్ధి చెందింది. మార్క్సిస్ట్ భావాలు రష్యాలో వ్యాపించాయి. మూడో అలెగ్జాండర్ పై జరిగిన హత్యా ప్రయత్నం విఫలం కావడంతో, కుట్రలో పాల్గొన్న ప్రముఖ విద్యార్థులను ఉరితీశారు. వీరిలో ప్రముఖుడు అలెగ్జాండర్ ఉలియనోవ్. ఇతడు లెనిన్ సోదరుడు. మూడో అలెగ్జాండర్ పరిపాలనా కాలంలో నరోద్నిక్ లు రష్యాలో ప్రధాన విప్లవకారులుగా పరిగణన పొందారు.

BRAOU

1890 తర్వాత పరిశ్రమలు ఎక్కువగా అభివృద్ధి చెందడంవల్ల, విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థుల్లోనే కాకుండా, కార్మికుల్లో కూడా మార్క్సిస్ట్ భావాలు వ్యాపించాయి.

రెండో నికలస్ (1894-1917) కూడా నిరంకుశంగానే పరిపాలించాడు.

లెనిన్ నరోద్నిక్‌ల వధలను ఘాటుగా విమర్శించాడు

రష్యాలో చాలామంది యూదులు విప్లవోద్యమంలో పాల్గొన్నారు.

రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ శ్రామిక వర్గాలను సమీకరించడానికి కృషి చేసింది. ఈ పార్టీ బోల్షివిక్, మెన్షివిక్ అని రెండు వర్గాలుగా చీలిపోయింది (1903) లెనిన్ సహచరులను "బోల్షివిక్స్" అని, లెనిన్‌ను వ్యతిరేకించిన వారిని "మెన్షివిక్స్' అని పిల్చారు.

సామ్యవాద విప్లవకారులు విప్లవోద్యమంలో మార్క్సిస్టేతర శక్తికి ప్రాతినిధ్యం వహించారు.

1905లో మధ్యతరగతివారు కేడెట్ (Cadet) పార్టీని స్థాపించారు. ఈ పార్టీ ఒక్కటే సామ్యవాదేతర రాజకీయపార్టీ. కేడెట్ పార్టీ 1905 విప్లవంలో ప్రముఖ పాత్రను నిర్వహించింది.

మొదటిసారి సామాన్య ప్రజలు 1905లో జార్‌తో సంఘర్షణకు తలపడ్డారు. అదే 1905 విప్లవం. ఈ ఉద్యమంలో సామాన్య ప్రజలు అసంఖ్యాకంగా పాల్గొన్నారు. రష్యా - జపాన్ యుద్ధంలో రష్యా ఓటమి, ఆంతరంగిక పరిస్థితి క్లిష్టంకావడం, అనేక రాజకీయ పార్టీలు విప్లవంలో పాల్గొనడం, కార్మికోద్యమం బలపడ్డం. ఈ విప్లవం ప్రజ్వరిల్లడానికి ముఖ్య కారణాలు. పేద రైతాంగం నుండి కార్మిక వర్గానికి సహాయం లభించింది.

1905 జనవరి 22 ఆదివారం నాడు బ్లడీ సన్‌డే (Bloody Sunday) నాడు విప్లవం ప్రారంభమైంది. ఆ రోజు సామాన్య ప్రజలకు జారిస్ట్ నియంతృత్వ నిజరూపం తెలిసింది. డిసెంబర్ నెల్లో మాస్కోలోని కార్మికుల సాయుధ సంఘర్షణ విఫలం కావడంతో, ఈ విప్లవం ముగిసింది.

లెనిన్ 1905 విప్లవాన్ని 1917 విప్లవానికి నాంది అని ప్రకటించాడు.

## 18.9 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. మొదటి నికలస్ చక్రవర్తి కాలంనాటి ఆంతరంగిక, విదేశాంగ విధానాలను, సాంస్కృతిక ప్రగతిని సమీక్షించండి
2. రెండో అలెగ్జాండర్ చక్రవర్తి ప్రవేశపెట్టిన సంస్కరణలు, వాటి ప్రభావాన్ని విమర్శనాత్మకంగా విశ్లేషించండి.
3. మూడో అలెగ్జాండర్ పాలనాకాలంలో రష్యాలోని ఆంతరంగిక, ఆర్థిక పరిస్థితిని పరిశీలించండి
4. రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ ఆవిర్భావాన్ని తెల్పి, ఆ పార్టీలో చీలికకు దారితీసిన కారణాలను, చీలిక స్వరూపాన్ని, చర్చించండి.

5. 1905 విప్లవం ప్రజ్వరిల్లడానికి దోహదమైన కారణాలను విశ్లేషించండి.
6. 1905 అక్టోబర్ రాజ్యాంగ ప్రణాళిక ముఖ్య లక్షణాలను తెల్పి, దీని తయారీ తదనంతరం రష్యాలో సంభవించిన ముఖ్య పరిణామాలను సమీక్షించండి

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. డిసెంబరిస్ట్ తిరుగుబాటుకు దారితీసిన పరిస్థితులను, దీని వైఫల్యతకు గల కారణాలను, ఫలితాలను పరిశీలించండి
2. కారల్ మార్క్స్ భావాలు ప్రచారం కాక ముందు రష్యాలో విప్లవోద్యమ కార్యక్రమాలను నిర్వహించిన ప్రముఖుల కృషిని వివరించండి
3. 1905 విప్లవం వల్ల వివిధ వర్గాల ప్రజలకు కల్గిన అనుభవాన్ని తెల్పండి

## 18.10: ఉపయుక్త గ్రంథాలు


1. William Henry Chamberlin : **Russian Revolution Vols. 1 & 2**
2. Ivar Spector : **The First Russian Revolution - its impact on Asia**
3. Edward Hallet Carr : **The Bolshevik Revolution ( 1917 - 23)**
4. Hill Christopher : **Lenin and The Russian Revolution**
5. E.Lipson : **Europe in the 19th and 20th Centuries**
6. Harcave Sydney : **Russia, a History**
7. Waren Bartlet Walsh : **Russia and the Soviet Union**
8. Robert Goldston : **The Russian Revolution**
9. Ivar Spector : **An Introduction to Russian History and Culture**


B R A O U

రచయిత : శ్రీ జె.యస్. ప్రకాశరావ్

# భాగం – 19 : రష్యన్ విప్లవ కారణాలు


19.0 : లక్ష్యాలు

19.1 : పరిచయం

19.2 : కారణాలు

19.2.1 : రష్యన్ కర్షకుని దైన్య పరిస్థితి

19.2.2 : రష్యాలో వాణిజ్య పారిశ్రామికాభివృద్ధి

19.2.3 : రష్యన్ మధ్యతరగతి వర్గ ఆవిర్భావం

19.2.4 : రష్యన్ శ్రామిక వర్గ ఆవిర్భావం

19.2.5 : ప్రభుత్వ పాలనా వ్యవస్థ లోని లోపాలు

19.2.6 : ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో భూస్వాముల పాత్ర

19.2.7 : సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి

19.2.8 : రష్యన్ ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడుల ప్రభావం

19.2.9 : రష్యన్ సామ్రాజ్యంలో విచ్ఛిన్నకర శక్తుల ప్రభావం

19.3 : మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా ఎదుర్కొన్న సమస్యలు

19.3.1 : విప్లవం రగుల్కొడానికి లెనిన్ నిర్వచించిన సూత్రం

19.3.2 : రష్యాలో అసమ్మతి వర్గ ఆవిర్భావం

19.3.3 : రెండో నికలస్ వ్యక్తిత్వం

19.3.4 : గ్రెగరీ రస్పుటిన్ (Gregory Rasputin)

19.3.5 : పరిపాలనా వ్యవస్థపై రస్పుటిన్ ప్రభావం : రస్పుటిన్ హత్య

19.3.6 : మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా పాత్ర

19.4 : సంగ్రహంగా

19.5 : పరీక్ష నమూనా ప్రశ్నలు

19.6 : ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 19.0 : లక్ష్యాలు

★ ఈ భాగాన్ని చదవడం వల్ల, ఈ క్రింది విషయాలను తెలుసుకోగల్గాలి.

★ 19వ శతాబ్దంలో రష్యాలో కార్మికుల దుస్థితి.

★ రష్యాలో పారిశ్రామికభివృద్ధి – మధ్యతరగతి వర్గం, కార్మిక వర్గాల ఆవిర్భావం.

★ ప్రభుత్వ పాలనా వ్యవస్థలోని లోపాలు.

★ రష్యన్ ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడుల ప్రభావం.

★ రెండో నికలస్ వ్యక్తిత్వం.

★ జార్ దంపతులపై, రష్యా పాలనా వ్యవస్థపై,గ్రెగరీ రస్పుటిన్ ప్రభావం.

★ మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా ఓడిపోవడం వల్ల ఏర్పడ్డ పరిస్థితి.

## 19.1: పరిచయం

రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లడానికి కారణాలను పరిశీలించినప్పుడు, రష్యాలో కార్మికుల దుస్థితిని గురించి తెలుసుకోగల్గాలి. రష్యాలో పారిశ్రామికాభివృద్ధి, మధ్యతరగతి వర్గం, కార్మిక వర్గాల ఆవిర్భావం, విప్లవం ప్రజ్వరిల్లడానికి ఎలా తోడ్పడ్డాయో అంచనా వేయగల్గాలి. ప్రభుత్వ పాలనా వ్యవస్థలోని లోపాలు, రష్యన్ ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడుల ప్రభావం, విప్లవోద్యమం రగుల్కొడానికి ఎలా కారణమయ్యాయో విమర్శించగల్గాలి. రెండో నికలస్ వ్యక్తిత్వం, జార్ దంపతులపై గ్రెగరీ రస్పుటిన్ ప్రభావం, ఎలా విప్లవం ప్రజ్వరిల్లడానికి దారితీశాయో అంచనా వేయగల్గాలి.

BRAOU

18వ భాగంలో జార్ చక్రవర్తుల నిరంకుశ పరిపాలనలో మగ్గిన ప్రజలు ఆ నియంతృత్వాన్ని వ్యతిరేకించి, 19వ శతాబ్దంలో ఎలా పోరాటాన్ని జరిపారో వివరంగా పరిశీలించాం. 1905 వరకు విప్లవాత్మక భావాలతో చైతన్యవంతమైన కొన్ని సంఘాలు, కొందరు వ్యక్తులు నిరంకుశ ప్రభుత్వంతో జరిపిన సంఘర్షణ విఫలమైంది.

1905 జనవరిలో ప్రజ్వరిల్లిన విప్లవం జారిస్ట్ నిరంకుశ వ్యవస్థను కుదిపివేసింది. 1905 అక్టోబర్ లో అక్టోబర్ ప్రణాళికను ప్రచురించే దాకా ఉధృతంగా కొనసాగిన ఈ విప్లవం, ప్రభుత్వం ఆశించినట్లుగానే విప్లవోద్యమంలో విభేదాలు పొడచూపి చీలిక రావడంతో, విఫలమైంది. సైనిక సహాయంతో జార్ విప్లవాన్ని అణచివేశాడు.

1917లో ప్రజ్వరిల్లిన రెండు విప్లవోద్యమాలు (మార్చి, నవంబర్) రష్యన్ రాజకీయ, సామాజిక వ్యవస్థల్లో మౌలికమైన మార్పును తెచ్చాయి. ఈ విప్లవాల ఫలితంగా రాజరిక వ్యవస్థ కాలగర్భంలో కలిసిపోయింది. చర్చి వ్యవస్థ రద్దయింది. కులీన వర్గాలు తమ ప్రత్యేక హక్కులను కోల్పోయాయి. 1789లో ఫ్రెంచి విప్లవం ప్రజ్వరిల్లిన తర్వాత ఫ్రాన్స్ నూతన యుగంలో ప్రవేశించినట్లే, రష్యా కూడా 1917 విప్లవాల ఫలితంగా నూతన యుగంలోకి ప్రవేశించింది. 1917లో ప్రజ్వరిల్లిన మార్చి, నవంబర్ విప్లవాల గురించి తెలుసుకునేముందు, 1917లో విప్లవం ప్రజ్వరిల్లడానికి కారణాలను పరిశీలిద్దాం.

## 19.2 రష్యన్ విప్లవ కారణాలు

రష్యాలో విప్లవం సంభవించడానికి, పలురకాల కారణాలు దోహదమైనాయి. ఇవి ప్రధానంగా సామాజిక, ఆర్థిక, పరిపాలన, సైనిక బల, సాంకేతిక, విజ్ఞాన రంగాలకు చెందివున్నాయి. విపులంగా వీటిని ఈ క్రింది విధంగా చర్చించొచ్చు.

### 19.2.1. రష్యన్ కర్షకుని దైన్య స్థితి

19వ శతాబ్దం మధ్యకాలం వరకు రష్యా ప్రధానంగా వ్యావసాయిక దేశం. ఫ్యూడల్ దాస్య విధానం అమల్లో ఉండేది. ఆ శతాబ్దంలో రష్యన్ కర్షకుని పరిస్థితి చాలా దైన్యంగా ఉండేది. ఫ్యూడల్ దాస్య విధానం అమలు జరిగిన కాలంలో, కర్షకుల పరిస్థితి వికృష్టంగా ఉండేది. వీరిచేత ఫ్యూడల్ ప్రభువులు బలవంతంగా వెట్టిచాకిరీ చేయించుకునేవారు. వీరిపై ఎన్నో నిర్బంధాలను విధించారు. రష్యాలోని బానిసలకంటె అమెరికన్ ప్లాంటేషన్స్‌లో (Plantations) లో పనిచేసే నీగ్రోల పరిస్థితి మెరుగ్గా ఉండి, వారెక్కువ సంతోషంగా ఉండేవారు. యజమానుల ఆర్థిక పరిస్థితి క్షీణించడం వల్ల, బానిసలను సంతలో పశువులను అమ్మినట్లు విక్రయించేవారు. సెయింట్‌పీటర్స్‌బర్గ్‌లో నివసించే ప్రముఖ భూస్వాముల వద్ద ఉండే బానిసలు కూడా, చాలా కష్టాలను అనుభవించారు. రష్యాలో పరిశ్రమలను నెలకొల్పిన తర్వాత భూస్వాములు తమ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం, చాలా ఫ్యాక్టరీలను స్థాపించారు. ఈ ఫ్యాక్టరీల్లో పనిచేస్తూ , అనేక వందల మంది బానిసలు మరణించారు. ఫ్యూడల్ ప్రభువులు బానిసలను దారుణంగా శిక్షించి, కటిక కసాయిల్లా ప్రవర్తించారు.

రెండో అలెగ్జాండర్ 1861లో బానిస వ్యవస్థను రద్దు చెయ్యడంతో, కర్షకుల బంధాలు తొలగి , వారికి వ్యక్తిత్వం, గౌరవం లభించాయి. కాని, ఆర్థికంగా వారింకా అధ్వాన్న స్థితిలోనే ఉన్నారు. ఈ వ్యవస్థను రద్దు చేసేనాటికి, రష్యాలో షుమారు 49 లక్షల మంది బానిసలు ఉండేవారు.

బానిస వ్యవస్థను రద్దు చేస్తూ జార్ రెండో అలెగ్జాండర్ ప్రకటించిన నాల్గు నెలల్లోనే, రైతులు భూస్వాముల ఎస్టేట్‌లపై దాడి చేసి, దోపిడీలను చేశారు. పెంజా (Penza) రాష్ట్రంలో బెజ్‌ద్నా (Bezdna) అనే గ్రామంలో దోపిడీ సాగిస్తున్న రైతులపై సైన్యం కాల్పులు జరపగా, ఆ కాల్పుల్లో 50 మంది మరణించారు.

బానిస వ్యవస్థ రద్దైన తర్వాత రైతులు భూస్వాముల గుప్పిట నుండి బయటపడినప్పటికీ, ప్రభుత్వం ఒప్పుకోకపోతే, గ్రామ సమాజాన్ని (Village Community) వదలడానికి వీల్లేదు. గ్రామ సమాజమే రైతులు పండించాల్సిన పంటను నిర్ణయించేది. ఈ సమాజమే సభ్యుల నుండి పన్నులు వసూలు చేసే బాధ్యతను తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. గ్రామ సమాజం సాంప్రదాయక విధానాన్ని అనుసరించి, విప్లవ వ్యతిరేక శక్తిగా ఉపయోగపడుతుందని, ప్రభుత్వం నమ్మింది. వాణిజ్యం, పెట్టుబడిదారీ వ్యవస్థల సంబంధం పెరగడం వల్ల, గ్రామ సమాజ వ్యవస్థ ప్రాధాన్యతను కోల్పోయింది.

రెండో అలెగ్జాండర్ ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల రైతులకు ఎలాంటి లాభం చేకూరనందువల్ల తీవ్రంగా అసంతృప్తి చెందారు. 1905 నాటికి రష్యాలో షుమారు 30,000 మంది పెద్ద భూస్వాముల స్వాధీనంలో, 70,000,000 డెస్యాటీనా (Desyatina) ల భూమి వుండేది. (1 డెస్యాటీనా అంటే 2.7 ఎకరాలు).

10,500,000 మంది రైతుల స్వాధీనంలో ఉన్నంత భూమి, 30,000 మంది భూస్వాముల



BRAOU

స్వాధీనంలో వుంది. ఈ అసమానతను రైతులు గుర్తించారు. పట్టణాల్లో, ఫ్యాక్టరీల్లో పనిచేసే సుసంఘటితులైన కార్మికుల్లా, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి రైతులు సమ్మె చేయలేరు కనుక, ధనవంతులైన భూస్వాములపై తిరగబడి, దోపిడీలను చేశారు. 1905 నవంబర్ లో, చాలా రాష్ట్రాల్లో షుమారు 2000 ఎస్టేట్ లు దోపిడీలో, దహన కాండలో నాశనమయ్యాయి. కర్షకోద్యమం వర్గ పోరాటంగా రూపొందింది. పట్టణాల్లో కొత్త భావాలను, ఆదర్శాలను అర్థం చేసుకుని, గ్రామాలకు తిరిగి వచ్చిన సైనికులు, సోషలిస్ట్ రివల్యూషనరీ ఆదర్శాలతో సానుభూతి చూపించిన అధ్యాపకులు, గ్రామీణులను రెచ్చగొట్టి, విప్లవోద్యమం ఉధృతం కావడానికి కారకులయ్యారు. జర్మన్, ఫ్రెంచి కర్షకులతో పోల్చి చూస్తే, రష్యన్ రైతు చాలా వెనుకపడివున్నాడు . ఈ విధంగా వెనుకపడ్డం వల్ల , రష్యన్ కర్షకునిలో తీవ్రమైన అసంతృప్తి ప్రజ్వరిల్లింది. ఈ పరిణామం విప్లవానికి దారితీసింది.

19వ శతాబ్ది ప్రారంభంలో మొదటి అలెగ్జాండర్ పరిపాలనా కాలంలో, రష్యన్ సమాజంలో ఫ్యూడల్ ప్రభువులు, కర్షకులు, బానిసలు ఉండేవారు. కొద్దిమంది ప్రభుత్వ అధికారులు, వ్యాపారులు మాత్రమే నగరాల్లో నివసించేవారు.

## 19.2.2 రష్యాలో వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధి

క్రిమియా యుద్ధంలో రష్యా ఓడిపోయిన తర్వాత, సైనికావసరాలను దృష్టిలో ఉంచుకుని రష్యన్ ప్రభుత్వం పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరాన్ని గుర్తించింది. 1850 తర్వాత రష్యాలో పరిశ్రమలు, వాణిజ్యం, రైలు మార్గాలు వృద్ధి చెందడం వల్ల, రష్యన్ ఆర్థిక, సామాజిక వ్యవస్థల్లో చాలా మార్పులు వచ్చాయి. 19వ శతాబ్దం ఆఖరున, గనులు, కార్ఖానాలు, బట్టల మిల్లులు వృద్ధి చెందాయి. అనేక రైలు మార్గాల నిర్మాణం జరిగింది. బానిస వ్యవస్థ కాలగర్భంలో కలిసిపోయింది. ఈ వ్యవస్థను రద్దు చేసిన తర్వాత, ప్రభుత్వం ఆర్థిక, రాజకీయ రంగాల్లో సంస్కరణలను ప్రవేశపెట్టింది. సమర్థవంతమైన, చైతన్యవంతమైన, స్వయంసమృద్ధిని సాధించిన మధ్య తరగతి వర్గం లేకపోవడంవల్ల, సంస్కరణలు విఫలమయ్యాయి. పరిశ్రమల్లో మధ్యతరగతి వర్గం, శ్రామిక వర్గం బలపడ్డానికి తీవ్రంగా ప్రయత్నించాయి.

1854లో మొదటి నికలస్ పరిపాలనా కాలంలో, 9944 పారిశ్రామిక సంస్థలు (Industrial enterprises) ఉండేవి. ఈ పరిశ్రమల్లో 46,000 మంది కార్మికులు పని చేశారు. 160 మిలియన్ల రూబుల్స్ విలువ గల వస్తువులను ఉత్పత్తి చేశారు

1881లో రెండో అలెగ్జాండర్ పరిపాలనా కాలంలో, పారిశ్రామిక సంస్థల సంఖ్య 21,277 కు పెరిగింది. ఈ పారిశ్రామిక సంస్థల్లో 7 లక్షల 70 వేల మంది కార్మికులు (7,70,000) పనిచేశారు. వారు సాధించిన ఉత్పత్తి విలువ 998 మిలియన్ల రూబుల్స్.

1893 లో మూడో అలెగ్జాండర్ పరిపాలించే కాలంలో, పారిశ్రామిక సంస్థల సంఖ్య 32, 483 కు పెరిగింది. వాటిలో 1.4 మిలియన్ మంది కార్మికులు పనిచేశారు. 1.76 బిలియన్ రూబుల్స్ విలువగల ఉత్పత్తిని సాధించారు.

1896లో రెండో నికలస్ పరిపాలనా కాలంలో, పారిశ్రామిక సంస్థల సంఖ్య 38,401 కు పెరిగింది. లక్షల కొద్దీ కార్మికులు ఈ సంస్థల్లో పనిచేశారు. వారు సాధించిన ఉత్పత్తి విలువ 2.745బిలియన్ రూబుల్స్. ఈ విధంగా రష్యా పారిశ్రామిక రంగంలో 1854 -1896 ల మధ్య చాలా పురోభివృద్ధిని సాధించింది.

BRAOU

1861-70 ల మధ్య, నగరాల్లో జనాభా 45% పెరిగింది. మూడో అలెగ్జాండర్ పరిపాలనా కాలంలో రైలు మార్గాల నిర్మాణం త్వరితగతిని జరిగింది. రష్యాలో ముడి పదార్థాలు (Raw materials) ఎక్కువగా లభించడం వల్ల, కార్మికులకు ఇచ్చే వేతనాలు తక్కువ కావడం వల్ల, విదేశీ పెట్టుబడి కేంద్రీకృతమైంది. అందువల్ల, చాలా పరిశ్రమలు త్వరితంగా అభివృద్ధి చెందాయి. రష్యా దక్షిణ ప్రాంతాల్లో ఇనుము - ఉక్కు పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందింది. 1886-1899 సంవత్సరాల మధ్య కాలంలో, ఇనుము ఉత్పత్తి షుమారు 5 రెట్లు పెరిగింది. రైలు మార్గాల నిర్మాణ వేగంలో, రష్యా ఇతర ఐరోపా దేశాలను అధిగమించింది.

బానిస వ్యవస్థను రద్దు చేసిన తర్వాత ( 1861) ,అర్థ శతాబ్దిలో షుమారు 80,000 కిలోమీటర్ల రైలు మార్గాన్ని వేశారు. అందువల్ల, ఆహారధాన్యాలు విదేశాలకు ఎక్కువగా ఎగుమతయ్యాయి. ఇదే కాలంలో (1861-1911) ఇనుము ఉత్పత్తి (Iron output) 3 లక్షల టన్నుల నుండి, 40 లక్షల టన్నుల వరకు పెరిగింది. ఇదే నిష్పత్తిలో (Ratio)బొగ్గు (Coal), ఉక్కు, (Steel), చమురు (Oil) పరిశ్రమల్లో కూడా ఉత్పత్తి పెరిగింది.

మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు పారిశ్రామికంగా ముందుకెళ్లిన దేశాల్లో గొప్ప సాంకేతిక మార్పులు వచ్చాయి. వీటివల్ల ఉత్పత్తి విపరీతంగా పెరిగింది. పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించిన దేశాల్లో ఈ మార్పులు రావడంవల్ల, రష్యాలో కూడా వేలకొద్దీ కార్మికులు పనిచేసే భారీ పరిశ్రమలను (Heavy industries) నెలకొల్పారు. 1910 నాటికి 54% కార్మికులు పెద్ద ఫ్యాక్టరీల్లో (అంటే ఒక ఫ్యాక్టరీలో 500 కార్మికులకు మించి) పనిచేశారు. ఈ ఫ్యాక్టరీల అజమాయిషీ కేంద్రీకృతమైంది. కొన్ని ఫ్యాక్టరీలకు గుత్తాధిపత్య వ్యవస్థలు (Monopoly Organisations), ట్రస్ట్‌లు (Trusts) యాజమాన్యాన్ని వహించాయి. కొన్ని సిండికేట్లు (Syndicates) ఫ్యాక్టరీల్లో ఉత్పత్తైన సరకులను మార్కెట్ లోకి విడుదల చేసి, అమ్మాయి. ఈ గుత్తాధిపత్య వ్యవస్థలు 75% ఇనుము ఉత్పత్తిపై అజమాయిషీని సాధించాయి. అంతేకాకుండా, బొగ్గు, ముడి ఇనుము, లోహ పరిశ్రమల్లో, వ్యావసాయక పనిముట్లను తయారుచేయడంలో, చక్కెర , చమురు పరిశ్రమల్లో, గుత్తాధిపత్య వ్యవస్థలు కీలకమైన పాత్రను నిర్వహించాయి. రష్యాలో కుటీర, గ్రామీణ పరిశ్రమలను స్థాపించక ముందే, భారీ పరిశ్రమలను నెలకొల్పారు.

BRAOU

1890-1900 సంవత్సరాల మధ్య రష్యన్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందినా, రష్యన్ ఆర్థిక వ్యవస్థ చాలా వెనుకబడి ఉంది. రెండో అలెగ్జాండర్ బానిస వ్యవస్థను రద్దు చేసినా, 1861 తర్వాత కూడా భూస్వామ్య వ్యవస్థ కొనసాగింది. రష్యన్ భూస్వాములు ఆర్థిక, రాజకీయ రంగాల్లో కీలకమైన పాత్రను నిర్వహించారు. అందువల్లే, రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి కాలేదు. రష్యన్ ఆర్థిక వ్యవస్థ ఎదుగూ బొదుగూ లేకుండా పోయింది.

రష్యన్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందినా, జనాభా నిష్పత్తితో ( Ratio) పోల్చిచూస్తే, రష్యాలో బొగ్గు ఉత్పత్తి (Output) ఫ్రాన్స్‌లో ఉత్పత్తి కంటే 5 రెట్లు , జర్మనీలో ఉత్పత్తి కంటే 15 రెట్లు, అమెరికా సంయుక్తరాష్ట్రాల్లోని (U.S.A.) ఉత్పత్తి కంటే 26 రెట్లు , ఇంగ్లాండ్ లోని ఉత్పత్తి కంటే 31 రెట్లు తక్కువ. ఈ శతాబ్ది మొదటి పది సంవత్సరాల్లో కూడా, పారిశ్రామికంగా ప్రగతి సాధించిన దేశాలకు, రష్యాకు మధ్య, చాలా తేడా ఉంది.

విదేశీ పెట్టుబడి నిర్వహించిన ప్రముఖ పాత్ర వల్లే, రష్యా పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. ఈ పారిశ్రామికాభివృద్ధి వల్ల, సాంఘికంగా చాలా మార్పులు వచ్చాయి. ఈ పారిశ్రామికాభివృద్ధి రష్యాలోని మధ్యతరగతి వర్గాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేదు.

## 19.2.3 : రష్యన్ మధ్యతరగతివర్గ ఆవిర్భావం

రష్యన్ మధ్యతరగతివర్గంవారు (Russian bourgeoise) పెట్టుబడికి, సాంకేతిక నిపుణులకు, రాజకీయ భావాలకు పశ్చిమ ఐరోపా దేశాలపైనే ఆధారపడ్డారు. తమకంటే ఆర్థికంగా బలవంతులైన ప్రత్యర్థుల నుండి రక్షణకు, జారిస్ట్ ప్రభుత్వం పైనే ఆధారపడాల్సొచ్చింది. అందువల్ల , మధ్యతరగతివారు రాజరిక నియంతృత్వాన్ని ఎదిరించాలని మొదట అనుకోలేదు. కాని, 20వ శతాబ్దంలో జారిస్ట్ ప్రభుత్వం సొంతం ఓడిపోయి చేతులెత్తేసినప్పుడు, దేశంలో శాంతిభద్రతలను కూడా రక్షించలేకపోయినప్పుడు, ఆర్థిక సంక్షోభం నుండి దేశాన్ని కాపాడలేకపోయినప్పుడు, మధ్యతరగతి వారు చివరకు ఎదురు తిరిగారు.

## 19.2.4 : రష్యన్ శ్రామిక వర్గ ఆవిర్భావం

బానిస వ్యవస్థ రద్దైన తర్వాత తమకున్న కొద్దిపాటి భూమిని పోగొట్టుకున్న చాలామంది రష్యన్లు, ఫ్యాక్టరీల్లో, గనుల్లో కార్మికులుగా చేరారు. వారికి పని చాలా ఎక్కువ, వేతనాలు చాలా తక్కువ. దుర్భర పరిస్థితుల్లో మురికి బేరక్స్‌లో (Barracks) నివసించేవారు ఈవిధంగా రష్యన్ శ్రామిక వర్గం ఆవిర్భవించింది. ఆర్థిక పరిస్థితుల ప్రభావం వల్ల, వీరిలో వర్గ చైతన్యం (Class consciousness) రేకెత్తింది. విదేశీ కంపెనీలు త్వరగా లాభాలు గుంజాలనే ఉద్దేశ్యంతో, ఫ్యాక్టరీలను నిర్వహించాయి. అసమర్థులైన రష్యన్ పెట్టుబడి దారులు తమలో తాము పోటీ పడ్డారు. అందువల్ల, రష్యన్ ఫ్యాక్టరీల్లో చాల నష్టం వచ్చింది. ఈ విధంగా వర్గ పోరాటం తీవ్ర రూపాన్ని దాల్చింది.

మధ్య తరగతిలా కాకుండా, రష్యన్ శ్రామిక వర్గం పశ్చిమ ఐరోపా దేశాల నుండి కొత్త సిద్ధాంతాలను స్వీకరించింది. 1848 లో ప్రజ్వరిల్లిన విప్లవాలు, 1871 లో పారిస్ కమ్యూన్ (Paris Commune*), మార్క్స్, ఏంజెల్స్ సిద్ధాంతాలు, రెండో అంతర్జాతీయత ( Second International) లోని రాజకీయ పార్టీ అనుభవం, సామ్యవాద సిద్ధాంతాలు ప్రచారం కావడానికి, కార్మిక విప్లవం ప్రజ్వరిల్లడానికి చాలా తోడ్పడ్డాయి.

1640, 1789 బూర్జువా విప్లవాలు ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల్లో మధ్యతరగతి వర్గాలు అధికారం లోకి రాడానికి ఎలా కారణమయ్యాయో, అలాగే లెనిన్ అనుసరించిన మార్క్సిస్ట్ సిద్ధాంతం ప్రకారం, శ్రామిక వర్గ విప్లవం శ్రామిక వర్గ పరిపాలనలోసామ్యవాద వ్యవస్థను స్థాపిస్తుంది.

పారిశ్రామికంగా ముందుకెళ్లిన పశ్చిమ ఐరోపా దేశాల్లో సోషల్ డెమోక్రాటిక్ పార్టీలు పార్లమెంటరీ ప్రతిపక్షాలుగా వ్యవహరించాయి. అదే కాలంలో పారిశ్రామికంగా వెనుకబడ్డ రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థను, ఉదార (Liberal) పార్లమెంటరీ విధానాన్ని తోసిరాజని సామ్యవాద విప్లవం ఎలా నెగ్గుతుందా అనే సమస్యపై లెనిన్ చాలా తీవ్రంగా ఆలోచించాడు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీల్లో ఉదార భావాలు బాగా అభివృద్ధి చెంది, బలపడటంవల్ల, కార్మికోద్యమం పార్లమెంటరీ సంస్కరణల విధానాలను అనుసరించడంలో లీనమైంది. రష్యాలో ఉదార భావాలు (Liberal Ideas) అభివృద్ధి చెందకపోవడంవల్ల, రాజ్యాంగ పద్ధతుల ద్వారా సంస్కరణలను పొందే ఆశ లేకపోవడంవల్ల తీవ్ర భావాలు కల్గిన మేథావి వర్గంవారు, కులీనులు కూడా విప్లవకారులై, కొందరు ఉగ్రవాదులై, 1870-80 ల మధ్య, విప్లవోద్యమంలో పాల్గొన్నారు.

---

ఫ్రెంచి కార్మికులు, ఫ్రెంచి రిపబ్లికన్ ప్రభుత్వం జర్మనీతో చేసుకున్న సిగ్గుమాలిన ఒడంబడికను గుర్తించలేదు. వారు పారిస్‌ను ఆక్రమించి, పారిస్ కమ్యూన్‌ను నెలకొల్పారు. జర్మన్ల సహాయంతో ఫ్రెంచి రిపబ్లికన్ ప్రభుత్వం పారిస్‌పై దండెత్తి , గుండ్ల వర్షాన్ని కురిపించింది. ప్రభుత్వసైన్యాలు పారిస్‌లో ప్రవేశించి ,60,000 మంది కార్మికులను చంపేశారు. షుమారు లక్ష మందిని చెరసాల్లో వేశారు. ప్రవాసానికి పంపారు.



BRAOU

మొదటి నుండి రష్యాలో కార్మికోద్యమ నాయకులు విప్లవం ద్వారా జారిస్ట్ నిరంకుశ వ్యవస్థను తొలగిస్తే తప్ప, తాము కోరుకున్న సంస్కరణలను సాధించలేమని భావించారు. రష్యన్ కార్మికులకు కమ్యూనిస్ట్ ప్రణాళికలోని నినాదాలు తప్పకుండా వర్తిస్తాయి. వారు సంకెళ్ల నుండి విముక్తిని సాధించి, నూతన సమాజాన్ని నిర్మిస్తారు. ఇదే కార్మికోద్యమ నాయకుల ఆశయం.

## 19.2.5 : ప్రభుత్వ పాలనా వ్యవస్థ లోని లోపాలు

రష్యాలో ప్రభుత్వ పరిపాలన చాలా దుర్భరం. లంచగొండితనం, అన్యాయం, అక్రమం స్వైర విహారం చేసాయి. పెద్ద ఉద్యోగాలకు లంచాలు తీసుకొని, అసమర్థులను నియమించేవారు. ప్రభుత్వోద్యోగులకు చాలా తక్కువ జీతాలనిచ్చేవారు. సైనికాధికారులు, సైనిక గవర్నర్లు రాష్ట్రాల్లో ప్రజలను బాధించి, డబ్బును బాగా గుంజేవారు. చిన్న ఉద్యోగులు కూడా అలాగే చేసేవారు. రాజప్రతినిధులు మారినా, పరిస్థితుల్లో మార్పు రాక పోవడం వల్ల, ప్రజలు ఫిర్యాదు చెయ్యడం అనవసరమని భావించారు. న్యాయస్థానాల్లో లంచం ఇవ్వందే తమకు న్యాయం జరగదని ప్రజలు నమ్మారు. ప్రజాధనాన్ని అధికారులు దుర్వినియోగం చేశారు. రష్యాలో మరో విశేషం, ప్రభుత్వ పాలన చాలా గుట్టుగా సాగేది. విదేశాంగ శాఖలో ప్రతి కాగితం పైన "రహస్యం" (Confidential) అని రాసేవారు ముఖ్యమైన పత్రాలపై "మంత్రికి మాత్రమే" అని రాసేవారు. ఇన్ని లోపాలుండడంవల్ల రష్యాలో పరిపాలనా వ్యవస్థ, పనితీరుల పట్ల ప్రజలు తీవ్రంగా అసంతృప్తి చెందారు. పరిపాలనా యంత్రాంగం కూడా పరిస్థితులకు అనుగుణంగా మారలేకపోయింది, భూస్వాములు పరిపాలనా యంత్రాంగంలో కీలకమైన పదవుల్లో వుండి, తాము లేకపోతే వినాశం తప్పదని గాఢంగా నమ్మారు. కొన్ని ప్రత్యేక కారణాల వల్ల, రష్యాలో నిరంకుశ ప్రభుత్వం చాలాకాలం సాగింది. రష్యా పెద్ద దేశం కావడంవల్ల, వార్తా సదుపాయాలు, రవాణా సదుపాయాలు సరిగా లేనందువల్ల, కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టంగా పరిపాలించలేదు. ఒకే నాయకుని నాయకత్వంలో, దేశ రక్షణ దృష్ట్యాను, బలమైన కేంద్ర ప్రభుత్వ అవసరం, నిరంకుశ ప్రభుత్వ పరిపాలనలో రష్యాను ఏకం చేసింది. రష్యాలో ప్రజ్వరిల్లిన విప్లవం జార్ చక్రవర్తుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగింది. రష్యన్ పరిపాలనా వ్యవస్థలో అవినీతి, అసమర్థతలు పేరుకుపోవడం వల్ల, రష్యన్ ప్రజల ఓర్పు నశించింది. అందువల్లే విప్లవం రగుల్కొంటుందని బ్రూస్ లోఖర్ట్ అన్నాడు.

The Revolution took place " because the patience of the Russian People broke down under a system of unparalleled inefficiency and corruption "

**– Bruce Lokhart**

19 వ శతాబ్దానికి ఆవిరియంత్రం (Steam Engine), టెలిగ్రాఫ్, విరివిగా వాడకం లోకి వచ్చాయి. సాంకేతిక అభివృద్ధి 'దైవత్వాన్ని' దెబ్బతీసింది. కాని, 20వ శతాబ్దంలో కూడా, రెండో నికలస్ తాను దైవాంశ సంభూతుడనని నమ్మి, నిరంకుశత్వ సంరక్షణ తన కర్తవ్యమని గాఢంగా విశ్వసించాడు. ప్రభుత్వ వ్యవస్థను మార్చడానికి అతడు ఇష్టపడలేదు.

రష్యన్ ప్రభుత్వ వ్యవస్థ ప్రజాస్వామ్యానికే విరుద్ధం. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందందే, ప్రజాస్వామిక పద్ధతులను ప్రవేశపెట్టడం కుదరదు. దేశంలో బాధ్యతాయుత స్వయంపరిపాలనను ప్రవేశపెట్టడానికి వార్తా సదుపాయాలను, రవాణా సదుపాయాలను ఎక్కువ చెయ్యాలి. విద్యావ్యాప్తి, రాజకీయ చైతన్యం ప్రజల్లో కల్గనిదే, పల్లె, పల్లెలో విద్యా వ్యాప్తి జరగందే, రైలు మార్గాలు, టెలిఫోన్ సౌకర్యాలను ఉపయోగించందే, స్థానిక స్వపరిపాలన విజయవంతం కాదు.

## 19.2.6 : పాలనా యంత్రాంగంలో భూస్వాముల పాత్ర

పరిపాలనా యంత్రాంగంలో కీలకమైన పదవుల్లో ఉన్న భూస్వాములు కొత్త విధానాలను, సాంకేతిక విజ్ఞాన ఫలితాలను వ్యతిరేకించారు. శాస్త్రీయ సాంకేతిక విజ్ఞాన ఫలితాలను ఆర్థిక వ్యవస్థలో పొందుపర్చి, ఉత్పత్తి విధానాలను మార్చి ఉంటే, ప్రభుత్వ యంత్రాంగ స్వరూప స్వభావాలు మారి ఉండేవి. పాలకులు ఈ విధానాన్ని వ్యతిరేకించడం వల్లనే, విప్లవం అనివార్యమైంది.

## 19.2.7 సాంకేతిక పరిజ్ఞాన వ్యాప్తి

సాంకేతిక పరిజ్ఞానం రష్యాలో వ్యాపించినప్పుడే పౌరుల వ్యక్తిత్వానికి విలువ, గౌరవం పెరుగుతాయి. విద్యుదీకరణ ప్రజాస్వామ్యానికి మూలమని (" Electrification is the basis of democracy ") లెనిన్ అన్నాడు. ఆధునిక నాగరికతావసరాలకు ప్రతిబంధకంగా జారిస్ట్ రాజ్య వ్యవస్థ ఉండడంవల్ల, రష్యన్ విప్లవం అనివార్యమైంది.

రెండో అలెగ్జాండర్ 1861 లో బానిస వ్యవస్థను రద్దు చేశాకే రష్యాలో పరిశ్రమలు అభివృద్ధి చెందినా, రాజకీయ రంగంలో భూస్వాములు ప్రముఖ పాత్ర నిర్వహించడం వల్ల, పెట్టుబడిదారీ వ్యవస్థ త్వరగా అభివృద్ధి చెందలేదు. అందువల్ల, దేశంలో పారిశ్రామిక వస్తువులకు గిరాకీ (Demand) పెరగలేదు. రైలు మార్గాల నిర్మాణంలోను, సైనికావసరాలకు వాడ్డంవల్లనే, ఇనుము- ఉక్కు పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందింది. కాని, ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందలేదు. వ్యవసాయానికి అవసరమైన యంత్రసామాగ్రిని తయారు చేశారు. భారీ యంత్రాల ఉత్పత్తి జరగలేదు. మోటారు, రసాయనాలవంటి భారీ పరిశ్రమలు, పరికరాల ఉత్పత్తి చాలా తక్కువ స్థాయిలో జరిగింది.

## 19.2.8 రష్యన్ ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడుల ప్రభావం

విదేశీ పెట్టుబడులు అధికం కావడంవల్ల, 1890 తర్వాత రష్యా పారిశ్రామికంగా బాగా ముందుకు సాగింది. విదేశీ పెట్టుబడి, బొగ్గు, చమురు, ఇనుము- ఉక్కు పరిశ్రముల్లో కీలకమైన పాత్రను నిర్వహించింది. తమ దేశంలో కంటే రష్యాలో 25% నుండి 50% వరకు లాభాలు అధికంగా రావడం వల్ల, విదేశీ పెట్టుబడి (foreign capital ) రష్యాలో కేంద్రీకృతమైంది.

1896 -1900 ల మధ్య స్థాపించిన కంపెనీల్లో 25% విదేశీ కంపెనీలు. 1906 నాటికి దేశం మొత్తం మీద పెట్టుబడిలో 28% వరకు విదేశీయులదే. 1914 నాటికి ఈ నిష్పత్తి (ratio) 33%కు పెరిగింది. చమురు (Oil) ఉత్పత్తిలో 45%, ఇనుము ఉత్పత్తిలో 54%, రసాయనిక పరిశ్రముల్లో 50%, బొగ్గు ఉత్పత్తిలో 74%, విదేశీ పెట్టుబడి నియంత్రణ (control) చేసింది.

రష్యాలో కీలకమైన ఆరు బాంకుల్లోని పెట్టుబడిలో సగం కంటే ఎక్కువ విదేశీయుల గుప్పిట్లో ఉంది. ఈ బాంకులే దేశంలోని 60% పెట్టుబడిని (banking capital) తమ స్వాధీనంలో ఉంచుకున్నాయి. ఈ విధంగా రష్యా ఆర్థిక వ్యవస్థను విదేశీపెట్టుబడి తన అదుపులో ఉంచుకుంది.

1914 కు ముందు రష్యాలోని పెద్ద విద్యుత్ కేంద్రా (power stations) లన్నీ విదేశీయుల అదుపులో ఉండేవి. రష్యన్ రైలు మార్గాలను ఇంగ్లీష్, ఫ్రెంచి పెట్టుబడులతో నిర్మించారు. యుక్రేన్ లోని బొగ్గు, లోహ పరిశ్రమల అభివృద్ధికి, ఫ్రెంచి పెట్టుబడి (French capital) ప్రముఖ పాత్ర వహించింది. బ్రిటిష్ పెట్టుబడితో కాకసస్ (Caucasus) ప్రాంతంలో చమురు పరిశ్రమను స్థాపించారు. జర్మనీకి విదేశాల్లో ఎక్కువ పెట్టుబడి

పెట్టే స్థోమత లేదు. అంతేకాకుండా, రష్యా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం జర్మనీకి ఇష్టంలేదు. అందువల్ల జర్మనీ రష్యాలో పెట్టుబడి పెట్టలేదు. ఫ్రెంచి బాంకర్లు రష్యాలో ఎక్కువ పెట్టుబడి పెట్టారు. అప్పటికే ఐరోపా ఖండం రెండు సైనిక కూటాలుగా ( త్రిరాజ్య కూటమి, (Triple Alliance) (ఆస్ట్రియా + జర్మనీ + ఇటలీ), త్రిరాజ్య మైత్రి (Triple Entente) (ఇంగ్లాండ్ + ఫ్రాన్స్ + రష్యా) విభజించబడడం వల్ల, ఫ్రాన్స్ ఇచ్చిన రుణ సహాయం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

యుద్ధాలు జరగడంవల్ల సంక్షోభమేర్పడి, విప్లవోద్యమాలు తలెత్తాయి.

యుద్ధాలు ముగిసి శాంతి నెలకొన్న తర్వాత కూడా విప్లవోద్యమాలు ప్రజ్వరిల్లడానికి ఉన్న ముఖ్య కారణాలు తొలగిపోలేదు. విప్లవోద్యమం ప్రజ్వరిల్లకుండా ఆపడానికి, ప్రధాన సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి, 1904 లో రష్యా ఆంతరంగిక శాఖా మంత్రి యుద్ధాన్ని కోరుకున్నాడు. రష్యా-జపాన్ యుద్ధం ( 1904-05) లో రష్యా చిత్తుగా ఓడిపోవడంవల్ల, 1905 రష్యన్ విప్లవం అనివార్యమైంది. కాని, 1905 సంవత్సరాంతంలో మొదటి రష్యన్ విప్లవం విఫలమైన తర్వాత, 1906 లో జారిస్ట్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కాపాడుకోడానికి, ప్రతిపక్షాలను అణచడానికి, ఫ్రెంచి బాంకుల నుండి 90 మిలియన్ల పౌన్ల అప్పును తీసుకుంది. ఈ అప్పుకు బ్రిటీష్ బాంకర్ల ఆమోదం కూడా అవసరమైంది. ఫ్రెంచి పెట్టుబడిదారులు బ్రిటీష్ బాంకర్ల ఆమోదాన్ని ఒక షరతుగా విధించారు.

1905 అక్టోబర్ ప్రణాళికలో చేసిన వాగ్దానాలకు రెండో నికలస్ కట్టుబడి ఉంటే, ప్రభుత్వ ఖర్చుపై డ్యూమాకు అజమాయిషీ ఉండేది. కాని, రెండో నికలస్ చేసిన వాగ్దానాలకు కట్టుబడలేదు. 1906 ఏప్రిల్ లో ఫ్రెంచి ప్రభుత్వ అనుమతితో, చాలా ఫ్రెంచి బ్యాంకులు జారిస్ట్ ప్రభుత్వానికి 2,250 మిలియన్ ఫ్రాంకుల అప్పును మంజూరు చేసాయి. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద రుణాన్ని ఏ ప్రభుత్వం సేకరించలేదని అప్పటి ప్రధాన మంత్రి సగర్వంగా ప్రకటించాడు.

పశ్చిమ ఐరోపా దేశాలు పారిశ్రామిక రంగంలో ఉరుకులు, పరుగులు పెడుతుంటే, రష్యా, మెల్లిగా, క్రమంగా, స్వయంసమృద్ధిని సాధించి, భూస్వామ్య ఆర్థిక వ్యవస్థ నుండి వలస ఆర్థిక వ్యవస్థగా పరిణామాన్ని చెందింది. రష్యా ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయం పైనే ఆధారపడింది. సాంకేతిక పరిజ్ఞానం చాలా తక్కువ. రష్యన్ ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడి పట్టును సంపాదించింది.

1914 నాటికి రష్యా జనాభాలో పరిశ్రమల్లో పనిచేసేవారి సంఖ్య, 1860లో కంటే రెట్టింపైంది. కాని, దేశం మొత్తం జనాభాలో నూటికి ఇద్దరు కూడా కార్మికులు లేరు. ఇదే కాలంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో (U.S.A.) 11.6% ప్రజలు పరిశ్రమల్లో పనిచేసేవారు. 1820 నాటికే అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో 3.6% ప్రజలు ఫ్యాక్టరీల్లో పనిచేశారు. అంటే, 1914 నాటి రష్యా పరిస్థితి పారిశ్రామికీకరణ దృష్ట్యా పరిశీలిస్తే, 1820 నాటి (U.S.A.) పరిస్థితి కంటె తక్కువ. 1914లో రష్యన్ జాయింట్ స్టాక్ కంపెనీల మొత్తం పెట్టుబడి (investment) లో 1/3 వ వంతు విదేశీయులదే. 1905-1908 సంవత్సరాల మధ్య, రష్యాలో విదేశీ పెట్టుబడి మొత్తం 370 మిలియన్ రూబుల్స్. 1904-1913 సంవత్సరాల మధ్య 3,235, 700,000 రూబుల్స్ విలువగల బాండ్లను (bonds) రష్యా విదేశాల్లో ఉంచింది. రష్యన్ ప్రభుత్వం జారీ చేసిన రుణ పత్రాలను (bonds) ఫ్రెంచి పెట్టుబడిదారులు ఎక్కువ మొత్తాల్లో కొన్నారు.

రష్యాలో గనుల్లో, లోహ పరిశ్రమల్లో, ఫ్రెంచివారు ఎక్కువగా పెట్టుబడి పెట్టారు. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాకముందే, రష్యాలో ఉత్పత్తైయిన షుమారు 60% ముడి ఇనుమును, దుక్క ఇనుమును, 50% బొగ్గును, ఫ్రెంచి పెట్టుబడితో నిర్మించిన ఫ్యాక్టరీలే ఉత్పత్తి చేశాయి.

కాకసియన్ (Caucasian) చమురు గనుల్లో ఇంగ్లీష్ వారు పెట్టుబడి పెట్టారు. ఉత్తర రష్యాలో ఉన్న వస్త్ర పరిశ్రమలోను, సైబీరియాలోని ఉరల్స్ (Urals) లోని గనుల పరిశ్రమలోను కూడా, ఇంగ్లీష్‌వారు పెట్టుబడి పెట్టారు. బెల్జియం, జర్మనీ కూడా రష్యా పారిశ్రామికాభివృద్ధికి కొంత సహాయాన్ని చేశాయి.

రష్యాలోని విదేశీ పెట్టుబడి లో 32.6% ఫ్రెంచివారు, 22.6% ఇంగ్లీష్‌వారు, 19.7% జర్మన్లు, 14.3% బెల్జియంవారు పెట్టుబడి పెట్టారు. ఈ వివరాల వల్ల, రష్యా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి విదేశీ పెట్టుబడి ఎంత కీలకమైన పాత్ర నిర్వహించిందో తెలుస్తుంది.

పైన తెల్పిన వివరాల వల్ల, రష్యా ఆర్థిక వ్యవస్థనంతా విదేశీ ఆర్థిక, పారిశ్రామిక సంస్థలు ఎలా తమ గుప్పిట్లో పెట్టుకొన్నాయో తెలుస్తుంది. విదేశీ పెట్టుబడిదారులు రష్యాలో చిన్న చిన్న ఫ్యాక్టరీలను స్థాపించడానికి, కొత్త పరిశ్రమలను స్థాపించడానికి చాలా కంపెనీలను నెలకొల్పారు. ఎంతో ఉత్సాహంతో వారు రష్యాలో పెట్టుబడులను పెట్టారు. రష్యన్ ప్రభుత్వం కూడా విదేశీ పెట్టుబడులకు అనుకూలంగా వ్యవహరించింది. దురదృష్టవశాత్తు మొదట్లో కార్మికుల్లో ఐక్యత లేదు. అందువల్ల, అభివృద్ధి చెందిన పశ్చిమ ఐరోపా దేశాల్లో లాగే, కార్మికులు యజమానులను ఎదిరించలేదు. విదేశీ యజమానులు కార్మికులకు తక్కువ వేతనాలను యిచ్చి, తమ దేశాల్లో కల్లో కూడా ఊహించలేనంత లాభాలను రష్యాలో గుంజవచ్చని ప్రగాఢంగా విశ్వసించారు. అందువల్లే, అంతర్జాతీయ పెట్టుబడి (international capital) రష్యాలో కేంద్రీకృతమైంది. రష్యన్ కార్మికులు అంతర్జాతీయ కార్మికోద్యమంతో చేతులు కలపడానికి సిద్ధమైనారనీ, రష్యన్ శ్రామిక వర్గం పశ్చిమ యూరప్ దేశాలనుండి కొత్త సిద్ధాంతాలను స్వీకరించారని ఇదివరకే తెలుసుకున్నాం. అందువల్ల రష్యాలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానానికి, శ్రామిక వర్గానికి సంఘర్షణ తలెత్తడానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

19వ శతాబ్దం చివరి సంవత్సరాల్లో అభివృద్ధి చెందిన పెట్టుబడి దారీ విధానం, జారిస్టు నిరంకుశత్వానికి వ్యతిరేకంగా విప్లవం ప్రజ్వరిల్లడానికి అనువైన పరిస్థితులను కల్పించింది. ప్రభుత్వంలో కీలకమైన పదవులను భూస్వాములు నిర్వహించడంవల్ల రష్యన్ ప్రభుత్వం బలహీనమైంది. ప్రభుత్వం బలహీనంగా వుండడంవల్ల రష్యాలో జాతీయ పెట్టుబడిదారీ విధానం బలహీనమైంది. ఈ పరిస్థితుల్లో రష్యాలో విదేశీయులు పెట్టుబడి పెట్టి రష్యన్ ఆర్థిక వ్యవస్థపై పట్టును సంపాదించారు. విదేశీ పెట్టుబడి రష్యాలో ఎక్కువగా పెంపొందడం వల్లే, పెట్టుబడిదారీ వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందింది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడంతో, కార్మికోద్యమం (Working Class Movement) కూడా బలపడింది. పశ్చిమ ఐరోపా దేశాల్లోని కార్మికోద్యమాలతో, రష్యన్ కార్మికోద్యమం సంబంధాలను పెంచుకుంది. జారిస్ట్ రష్యాలోని ఆర్థిక పరిస్థితులే, 1917 నవంబర్ లో ప్రజ్వరిల్లిన సోషలిస్ట్ విప్లవానికి ముఖ్య కారణాలు.

విప్లవం విజయవంతమైన తర్వాత కొత్త ప్రభుత్వం జారిస్ట్ ప్రభుత్వం చేసిన అప్పులను రద్దు చేస్తుందని, 1905 చివరలోనే సెయింట్‌పీటర్స్‌బర్గ్ సోవియట్ ప్రకటించింది. 1905 రష్యన్ విప్లవం విఫలమైనప్పటికీ, రష్యాలోని కార్మికోద్యమం ప్రభావానికి భయపడి, విప్లవ పరిణామాలు తీవ్రమౌతాయని ఆందోళన చెంది, ఫ్రెంచి ప్రభుత్వం 1906లో జార్‌కు రుణ సహాయాన్ని చేసింది. ఫ్రాన్స్ రుణాన్ని మంజూరు చేసిన తర్వాతే, రెండో నికలస్ డ్యూమాను నిర్లక్ష్యంచేశాడు. రెండు నెలలు సమావేశమైన తర్వాత, జార్ డ్యూమాను రద్దు చేశాడు.

రెండో నికలస్ డ్యూమాను రద్దు చేసిన తర్వాత, డ్యూమా లోని ప్రతిపక్ష సభ్యులు ఫిన్ లాండ్‌కు వెళ్లి, అక్కడి నుండే ఒక విజ్ఞప్తిని చేశారు. ప్రభుత్వానికి పన్నులు చెల్లించవద్దని, డ్యూమా అనుమతి లేందే ప్రభుత్వం చేసిన అప్పులను గుర్తించవద్దనీ, కోరారు. కాని, ప్రజలు వీరి అభ్యర్థనలను నిర్లక్ష్యంచేశారు. 1905

BRAOU

రష్యన్ విప్లవం విఫలం కావడం వల్ల, ఫ్రెంచివారి పెట్టుబడికి ఎలాంటి ప్రమాదం రాలేదు.

### 19.2.9 రష్యన్ సామ్రాజ్యంలో విచ్ఛిన్నకర శక్తుల ప్రభావం

20 వ శతాబ్దంలో రష్యన్ సామ్రాజ్యం చాలా పెద్దది. ఐరోపాలో సగం, ఆసియాలో మూడోవంతును తన గుప్పిట్లో పెట్టుకున్న రష్యన్ సామ్రాజ్యంలో, అనేక విచ్ఛిన్నకర శక్తులు తలెత్తాయి. పీటర్ బలవంతంగా సాధించిన పాశ్చాత్య సంస్కరణలు కానీ, తన ఉదార భావాలకు అనుగుణంగా రెండో అలెగ్జాండర్ పరిపాలనా రంగంలో ప్రవేశపెట్టిన సంస్కరణలుకాని, పెట్టుబడిదారీ వ్యవస్థవల్ల ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులు కానీ, రష్యాలో ఏర్పడ్డ వైరుధ్యాలను విజయవంతంగా పరిష్కరించలేకపోయాయి. అందువల్ల, రష్యా సామ్రాజ్యం చాలా బలహీనమైంది.

రష్యన్ కర్షకుడు అసంతృప్తితో పొరుగువాడైన భూస్వామి పొలాలవంక ఈర్ష్యతో చూసేవాడు. రష్యన్ శ్రామిక వర్గం కార్మికుల దుస్థితి పట్ల తీవ్రంగా అసంతృప్తి చెందింది. పటిష్టమైన ట్రేడ్ యూనియన్ వ్యవస్థ లేకపోవడం వల్ల, పశ్చిమ ఐరోపా లోని శ్రామిక వర్గం కంటె ఉగ్రవాదులుగా తయారయ్యారు. మైనారిటీ జాతులను అణచిపెట్టడంవల్ల, వారిలో తీవ్రమైన అసంతృప్తి రగుల్కొంది. 19వ శతాబ్దంలో రష్యా టర్కీని, మధ్య ఆసియాలోని ముస్లిం రాజ్యాలను జయించి, విస్తరించింది. కాని, 20 వ శతాబ్దం మొదటి 20 సంవత్సరాల్లోనే, రష్యా అభివృద్ధి చెందిన, సమర్థవంతమైన రెండు బలమైన రాజ్యాలతో – జపాన్, జర్మనీలతో– సంఘర్షణకు తలపడింది.

జపాన్‌తో జరిగిన సంఘర్షణలో ఓడిపోవడంవల్ల, 1905 విప్లవం అనివార్యమైంది. మొదటి ప్రపంచ యుద్ధం (1914–1918) భీకరంగా సాగుతున్న కాలంలోనే, రష్యాలో 1917లో ప్రపంచ చరిత్రలో యిదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో, గొప్ప సామాజిక విప్లవోద్యమం ప్రజ్వరిల్లింది. 1917లో జరిగిన రెండు విప్లవాలు, రష్యన్ ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థల్ని పూర్తిగా మార్చివేశాయి.

1914లో జారిస్ట్ ప్రభుత్వం జర్మనీపై యుద్ధాన్ని ప్రకటించింది. పశ్చిమ ఐరోపా దేశాల్లోని పెట్టుబడిదారుల ప్రయోజనాలు, రష్యన్ పెట్టుబడిదారుల ప్రయోజనాలు ఒక్కటే. అందువల్ల, పెట్టుబడి దారీ వర్గం బూర్జువా అజమాయిషీలో ఉదార పార్లమెంటరీ వ్యవస్థను పెంపొందించాలని సంకల్పించింది. అందువల్లే, చివరకు 1917 ఫిబ్రవరి విప్లవం ప్రజ్వరిల్లిందని క్రిస్టఫర్ హిల్* (Christopher Hill) అభిప్రాయపడ్డాడు.

## 19.3 మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా ఎదుర్కొన్న సమస్యలు

మొదటి ప్రపంచ యుద్ధం మొదలైన తర్వాత, రష్యాలో పారిశ్రామిక వనరులపై ఒత్తిడి ఎక్కువైంది. 1915లో 60% రైఫిళ్ళు, చిన్న ఆయుధాలు, 70% తుపాకులు, తూటాలు, షుమారు 100% లారీలను రష్యా దిగుమతి చేసుకుంది.

మొదట ప్రపంచ యుద్ధ కాలంలో కూడా పారిశ్రామికంగా వెనుకబడ్డం వల్ల, రష్యా మిత్రదేశాలపై పూర్తిగా ఆధారపడింది.

మొదటి ప్రపంచయుద్ధం ప్రజ్వరిల్లినతర్వాత రష్యన్ పెట్టుబడిదారుల ప్రయోజనాలు, విదేశీ పెట్టుబడిదారుల ప్రయోజనాలు ఒక్కటే అయినా, అప్పటికే పరిస్థితి చెయ్యిదాటిపోయింది. 1917

*Hill Christopher : Lenin and the Russian Revolution*



BRAOU

ఫిబ్రవరి విప్లవానంతరం ఏర్పడ్డ ఉదార (Liberal) ప్రభుత్వాన్ని, కార్మికోద్యమం ఏకమై, కలిసికట్టుగా కూలదోసింది. చిట్టచివరిదశలో జారిస్ట్ ప్రభుత్వం కన్నా లిబరల్ ప్రభుత్వం కొంత మెరుగే. కాని, ఈ ప్రభుత్వానికి కూడా జనం మద్దతు పెద్దగాలేదు. 1917 నవంబర్ లో బోల్షివిక్కులు పరిపాలనను హస్తగతం చేసుకోవడంతో, రష్యన్ పెట్టుబడిదారీ విధానం, విదేశీ పెట్టుబడి (Forigen investment) అంతమయ్యాయి.

నవంబర్ విప్లవానంతరం అధికారాన్ని హస్తగతం చేసుకున్న బోల్షివిక్ ప్రభుత్వం, విదేశీ పెట్టుబడులను బలవంతంగా స్వాధీనం చేసుకుని, చెల్లించాల్సిన అప్పులను రద్దు చేసింది. అందువల్లే, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, బోల్షివిక్ ప్రభుత్వాన్ని తొలగించడానికి ప్రయత్నించాయి.

## 19.3.1 విప్లవం రగుల్కోడానికి లెనిన్ నిర్వచించిన సూత్రం

విప్లవం రగులుకోడానికి మూల సూత్రాన్ని (The Fundamental Law of Revolution) లెనిన్ తర్వాత కాలంలో ఈ విధంగా నిర్వచించాడు : "పీడిత ప్రజానీకం పాత పద్ధతులను అనుసరించి జీవించడం అసాధ్యమని గుర్తించి, మార్పులు రావాలని కోరినంత మాత్రం చేత విప్లవం రాదు. విప్లవం రావాలంటే ప్రజలు దోపిడీదారులను పాత పద్ధతుల్లో జీవించనియ్యకూడదు. విప్లవం ఆవిర్భవించాలంటే రాజకీయ చైతన్యం కల్గిన అధిక సంఖ్యాకులైన కార్మికులు విప్లవాన్ని విజయవంతం చెయ్యడానికి, తమ ప్రాణాలను సైతం ధారపొయ్యాలి. పాలక వర్గం సంక్షోభంలో పడి కొట్టుకుంటున్నప్పుడు, ఏ మాత్రం రాజకీయ చైతన్యం లేని ప్రజానీకం ముందుకు దూసుకువస్తేనే, విప్లవకారులు ప్రభుత్వాన్ని మరింత తొందరగా కూలదోయగలరు".

లెనిన్ నిర్వచించిన సిద్ధాంతం 1905, 1917ల్లో ప్రజ్వరిల్లిన విప్లవాల వల్ల రుజువైంది.

ఈ శతాబ్దం మొదటి నుండే జారిస్ట్ ప్రభుత్వం తను నమ్మిన బంటులను లోపాయకారిగా ఉద్యోగాల్లో నియమించింది. వారు సమ్మెలను, రాజకీయ హత్యలను ప్రోత్సహించి, వాటిలో పాల్గొని, తర్వాత విప్లవకారులను నిర్బంధించేవారు."బ్లాక్ హండ్రెడ్స్" (Black Hundreds) ఫాసిస్ట్ వర్గం లాంటివారు యూదులకు, (Jews) సోషలిస్ట్‌లకు వ్యతిరేకంగా, దారుణమైన రక్తపాతాలను జరిపించారు. ప్రభుత్వం పేద ప్రజలమీద యుద్ధాన్ని ప్రకటించింది. దమన నీతిని అనుసరించింది. అందువల్ల, సంపన్న వర్గాల్లోని ఉదారవాదుల అభిమానాన్ని కోల్పోయింది. స్వేచ్ఛగా భావాలను ప్రకటించడమే తిరుగుబాటంది పాలక వర్గం. 1906 డిసెంబర్‌లో మత ప్రచారకులుగా, రాజరికంపట్ల విశ్వాసం ఉన్నవారిని మాత్రమే ఎంచుకోవాల్సిందిగా, తమ అనుచరులకు చెప్పాలని, "హోలీ సినాడ్" (HOLY SYNOD) ఆదేశాలిచ్చింది. 1917 లో మత ప్రచారకుల వర్గం మాత్రమే, గ్రామీణ ప్రాంతాల్లో పతనమైన ప్రభుత్వంపట్ల సానుభూతిని చూపారు.

## 19.3.2 రష్యాలో అసమ్మతి వర్గ ఆవిర్భావం

1640 లో ఇంగ్లాండ్ లో, 1789లో ఫ్రాన్స్‌లో, రష్యాలో కూడా అసమ్మతి వర్గం (a class of dissenters) ఆవిర్భవించింది. ఈ వర్గం వారు విప్లవ భావాలు వ్యాపించడానికి దోహదం చేశారు. ఈ వర్గంలోని కొందరు పన్నులు చెల్లించడానికి, సైన్యంలోచేరడానికి, జార్ అభ్యున్నతికి ప్రార్థించడానికి నిరాకరించారు. మరి కొందరు సామాజిక సమానత్వాన్ని బోధించి, నిత్యావసర వస్తువులను సమానంగా పంచుకోవాలని ఉద్బోధించారు. విప్లవాత్మక భావాలను ప్రకటించేవారిని చర్చి చాలా క్రూరంగా శిక్షించింది. వారి పిల్లలను తల్లితండ్రుల నుండి వేరు చేసింది. కొందరిని బలవంతంగా మతం మార్పిడి చేసింది. అందువల్ల అసమ్మతివర్గంవారు మత స్వేచ్ఛ కోసం విప్లవాన్ని సమర్థించారు.

విప్లవం ప్రజ్వరిల్లడానికి ముందు రష్యన్ సమాజంలో వర్గవిభేదాలుండేవి. సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హోదా గురించి పట్టింపుల వల్ల, ఈర్ష్యాద్వేషాలు పెరిగాయి. రాజకీయ భావాల పేరిట, మతం పేరిట, ప్రజలను హింసించారు.

రష్యాలో 3 కోట్ల ముస్లింలు ఉండేవారు. మొదటిసారి వారి మతాచారాలకు, జాతీయ సాంస్కృతిక వ్యవస్థలకు, 1917 డిసెంబర్‌లో, అంటే లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాతే, హామీ లభించింది.

1914 జూలైలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమ్మె జరిగింది. ఆ సమ్మె కాలంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తీవ్రమైన సంఘర్షణ చెలరేగింది. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడంతో, జార్ పట్ల కొంతకాలం వరకు ప్రజలు విశ్వాసాన్ని ప్రకటించారు. జార్, అతని మంత్రులు, ప్రజాప్రతినిధులను వ్యతిరేకించారు. రెండో నికలస్ ఆధ్వర్యంలో రష్యన్ సైన్యాలు ఓడిపోయాయి. చావు దెబ్బ తిన్నాయి. ఆర్థిక పరిస్థితి క్రమ క్రమంగా అధ్వాన్నమై, ప్రభుత్వ స్వాధీనం నుండి తప్పిపోయింది. అందువల్ల, ప్రజల్లో ప్రభుత్వంపట్ల తీవ్రమైన వ్యతిరేకత ప్రబలింది. ఇంతవరకు రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లడానికి కారణాలను ఎన్నో దృక్కోణాల నుండి పరిశీలించాం.

### 19.3.3 రెండో నికలస్ వ్యక్తిత్వం

రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లడానికి చిట్టచివరి కారణం, రెండో నికలస్ వ్యక్తిత్వం. జార్ రెండో నికలస్ తండ్రిగా, భర్తగా ఆదర్శప్రాయుడు. అలాగే ఇంగ్లాండ్‌లో మొదటి ఛార్లెస్ (Charles 1), ఫ్రాన్స్‌లో 16వ లూయీ (Louis XVI) కూడా, వ్యక్తులుగా ఆదర్శప్రాయులు, మొదటి ఛార్లెస్ ఇంగ్లాండ్‌లో రాజరిక వ్యవస్థ రద్దుకు కారకుడయ్యాడు. 16వ లూయీ ఫ్రెంచి విప్లవం రగుల్కొని జ్వాలగా మారడానికి కారకుడయ్యాడు. రెండో నికలస్‌కు దృఢ సంకల్పం లేదు. భార్యా విధేయుడయ్యాడు. మొదటి ఛార్లెస్, 16వ లూయీ, రెండో నికలస్ లు తమ భార్యల ప్రభావానికిలోనయ్యారు. ఈ ముగ్గురు భార్యలు విదేశీయులు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యాల్లోని సామాన్య ప్రజలు ఈ ఆడవాళ్లను తీవ్రంగా ద్వేషించారు. ఈ ముగ్గురు రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం వల్లనే, వారు చివరకు మూడు రాజవంశాల పతనాలకు కారకులయ్యారు.

### 19.3.4 గ్రెగరీ రస్పుటిన్

రెండో నికలస్ భార్య జారిట్సా అలెగ్జాండ్రా (Tsaritsa Alexandra), గ్రెగరీ రస్పుటిన్ (Gregory Rasputin) అనే వ్యక్తి వల్ల ప్రభావితురాలైంది. రస్పుటిన్ దైవ స్వరూపుడని, సాటిలేని మేటి వ్యక్తి అని, ఆమె గుడ్డిగా నమ్మింది. జారిట్సాతో తనకున్న పలుకుబడితో, రస్పుటిన్ తన స్నేహితులను బిషప్పులుగాను, ఆర్చి బిషప్పులుగాను నియమింప చేశాడు. తర్వాత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వాలను ఏర్పాటు చెయ్యడంలో కీలకమైన పాత్రను నిర్వహించాడు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, యుద్ధ నిర్వహణపై అజమాయిషీని సంపాదించాడు.

జార్ రెండో నికలస్, జారిట్సా అలెగ్జాండర్ ఇద్దరూ రస్పుటిన్‌ను పూర్తిగానమ్మి, ప్రభుత్వ నిర్వహణ చేశారు. రష్యన్ రాజవంశం గుడ్డిగా నమ్మిన రస్పుటిన్ 1871లో తోబోల్స్క్ (Tobolsk) రాష్ట్రంలో (సైబీరియాలో) జన్మించాడు. తండ్రివలె ఇతడు కూడా రౌడీ రైతు. ముఠా నాయకుడు. కొంత కాలానికి దొంగగా, తాగుబోతుగా, అన్నెం పున్నెం ఎరగని ఆడపిల్లలను చెరిచే నీచుడిగా పేరు పొందాడు. అతనికి చదువు అబ్బలేదు. నిశాని అని కూడ చెప్పొచ్చు. ఇతడు చాలా బలవంతుడు. సున్నితమైన ముఖ లక్షణాలులేవు. నల్లగడ్డం, చురుకు చూపులు (Piercing eyes) కలవాడు.

తన ముప్పైయవ ఏడు రాగానే భార్యను, ముగ్గురు పిల్లల్ని వదిలేసి, తాను దేవుని దివ్య కాంతిని చూశానని ప్రకటించి, పవిత్రుడైన సాధువులా ప్రవర్తించాడు. దేవుని క్షమాభిక్ష పొందే ముందు పాపాన్ని (Sin) చెయ్యాలని బోధించాడు. తెలివి తక్కువ వాళ్లసందరిని ఇతని బోధనలు ఆకర్షించాయి. ఆకర్షణీయమైన, అందమైన స్త్రీ అయితే, తప్పకుండా పాపం చెయ్యొచ్చని చెప్పాడు. ఎలాంటి హక్కులు లేక ప్రజలను అణగద్రొక్కిన కాలంలో, ఇలాంటి భావాలు, తత్వాలు ప్రచారం కావడం సహజమే. ఐరోపా అంధ యుగం (Dark Age) లో వున్నప్పుడు ఇలాంటి శాఖలు తలెత్తాయి. 20 వ శతాబ్దారంభంలో కూడా అంధ యుగ ఛాయలు ఇంకా రష్యాలో ఉన్నాయి. రష్యాలో చొరవ, తెలివి ఉండి, చదువుకునే అవకాశాలు లేనివారు, చాలామంది పవిత్రులైన సాధువులవలె (దొంగ సన్యాసులవలె) ప్రవర్తించారు. పతనమౌతున్న సమాజ వ్యవస్థకు వీరు ప్రతీక.

## 19.3.5 పరిపాలనా వ్యవస్థపై రస్పుటిన్ ప్రభావం : రస్పుటిన్ హత్య

రస్పుటిన్ మానవ నైజాన్ని నిశితంగా పరిశీలించగల దిట్ట. ఇతడికి కనికట్టు చేతనౌను. కుట్ర చేసే స్వభావం కలవాడు. రస్పుటిన్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు వచ్చి, ఫ్యూడల్ ప్రభువుల వర్గంతో పరిచయాన్ని పెంచుకున్నాడు. రస్పుటిన్‌ను రెండో నికలస్‌కు, జారిట్సా అలెగ్జాండ్రాకు పరిచయం చేశారు. తమకు రస్పుటిన్‌తో పరిచయమైందని, అతడు "దేవుని మనిషి" (a man of God) అని, జార్ 1905 నవంబర్ లో తన డైరీలో రాసుకున్నాడు.

రస్పుటిన్ ప్రవర్తన గురించి, అక్రమ సంబంధాల గురించీ, జార్ రెండో నికలస్‌కు సమాచారాన్ని పంపించినా, జార్ ఏమీ పట్టించుకోలేదు. రస్పుటిన్ గురించి సమాచారాలేమీ ప్రకటించకూడదని ప్రభుత్వం ఆదేశించింది. జారిట్సా రస్పుటిన్‌ను దైవాంశసంభూతునిగా భావించి, గుడ్డిగా నమ్మింది.

మొదటి ప్రపంచ యుద్ధం జరిగే రోజుల్లో, రెండో నికలస్ సైన్యంతో ఉన్నప్పుడు, జారిట్సా ప్రభుత్వాధినేతగా ఉండేది. కాబినెట్ మంత్రులు, ఉన్నత సైనికాధికారులు, సర్వసైన్యాధ్యక్షుడు, వీరందరి సామర్థ్యాన్ని, మంచి చెడ్డలను, వారి పట్ల రస్పుటిన్‌కు ఉండే అభిప్రాయాన్ని బట్టి, జారిట్సా నిర్ణయిస్తూ ఉండేది. రష్యన్ సైన్యాల సర్వసైన్యాధ్యక్షుడు గ్రాండ్ డ్యూక్ నికలస్, రస్పుటిన్‌ను వ్యతిరేకించాడు. జారిట్సా సలహాపై గ్రాండ్ డ్యూక్‌ను పదవి నుండి తొలగించి, జార్ సర్వసైన్యాధ్యక్ష పదవిని స్వీకరించాడు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ, ఎనిమిది మంది మంత్రులు లిఖిత పూర్వకంగా సలహాలిచ్చినా, జార్ వారి సలహాను తిరస్కరించాడు.

1916 ఫిబ్రవరిలో రస్పుటిన్ సలహా మీద, స్టుర్‌మర్ (Sturmer) ను ప్రధాన మంత్రిగా నియమించమని జారిట్సా సిఫారస్ చేసింది. స్టుర్‌మర్ అసమర్థుడైనా, ఆమె సలహా ననుసరించి జార్ అతన్ని ప్రధాన మంత్రిగా నియమించాడు. 1916 నవంబర్‌లో రస్పుటిన్ సలహా ప్రకారం, స్టుర్‌మర్‌ను విదేశాంగ శాఖను తప్పించి, ప్రధాన మంత్రిగా కొనసాగించాడు.

రస్పుటిన్ సలహామీదే, జారిట్సా అభ్యర్థనను అనుసరించి ,1916 సెప్టెంబర్ లో ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, జర్మన్లకు అనుకూలుడైన ప్రొటోపపోవ్ ((Protopopov) ను ఆంతరంగిక శాఖా మంత్రిగా నియమించాడు . అతని ద్వారా రస్పుటిన్ స్వయంగా రష్యా అంతరంగిక విధానంపై పూర్తి అజమాయిషీని సంపాదించాడు. 1916 అక్టోబర్ నెల్లో రస్పుటిన్ సలహా మీదే, ప్రొటోపపోవ్‌ను రష్యాకు ఆహార శాఖ మంత్రిగా నియమించాడు. అతన్ని నియమించిన నాల్గు నెలల్లోనే, ఫిబ్రవరి (మార్చి) విప్లవం ప్రజ్వరిల్లింది.

కాబినెట్ మంత్రులు చాలా మంది అసమర్థులు. 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవం జరిగే రెండు

సంవత్సరాల లోపే, నల్గురు ప్రధాన మంత్రులు, ఆరుగురు ఆంతరంగిక శాఖా మంత్రులు, నల్గురు వ్యవసాయ మంత్రులు మారారు. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా తన మనుగడ కోసమే పోరాడుతోంది. ఆంతరంగిక పరిస్థితి క్లిష్టతరమైంది. అంతేకాకుండా, రస్పుటిన్ పరిపాలనలో విపరీతంగా జోక్యం చేసుకోవడం వల్ల, ప్రభుత్వ శాఖలు తమ విధులను సక్రమంగా నిర్వహించలేకపోయాయి.

రష్యన్ సమాజంలో పేరుకు పోయిన అవినీతికి (corruption), రస్పుటిన్ ప్రతీక. రస్పుటిన్ జార్ ఆస్థానానికి వచ్చిన తర్వాత, రష్యన్ సమాజంలో పతనమారంభమైందని, జార్ ప్రతిష్ఠకు కూడా కళంకం వచ్చిందని, డ్యూమా అధ్యక్షుడు రాడ్‌జియాంకో (Rodzyanko) అభిప్రాయపడ్డాడు. పరిస్థితులు పూర్తిగా దిగజారడానికి జార్ ఒక్కడే పూర్తిగా బాధ్యుడు కాడని, రాడ్‌జియాంకో అంగీకరించాడు. రష్యాకు, జార్‌కు రాబోయే ప్రమాదాన్ని స్వార్థపరులైన పాలకవర్గ సభ్యులు గుర్తించలేదని, అందువల్ల రష్యన్ సమాజంలో తలెత్తిన అవినీతికి, సమాజం పతనం కావడానికి వారే కారకులని ప్రకటించాడు. జారిస్ట్ నిరంకుశత్వాన్ని కాపాడడానికి, 1916 డిసెంబర్‌లో ఆఖరి ప్రయత్నం జరిగింది. రస్పుటిన్‌ను జార్ ఆస్థానం లోని ఉన్నతాధికారులే హత్య చేయించారు. కాని, ఈ చర్య కూడా రాజవంశాన్ని కాపాడలేకపోయింది.

## 19.3.6 మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా పాత్ర

1913-17 ల మధ్య, పరిశ్రమల్లో కార్మికుల వేతనాలు మూడు రెట్లు పెరిగాయి. కాని, ధరలు ఆకాశాన్ని అంటేలా పెరగడం వల్ల, కార్మికులకు ఎలాంటి ప్రయోజనం కల్గలేదు. వారి బ్రతుకు దుర్భరమైంది. మొదటి ప్రపంచ యుద్ధం 1914లో మొదలైనప్పుడు, రష్యన్ సామాన్య ప్రజానీకం ఆశ్చర్య చకితులైనా, ప్రభుత్వానికి పూర్తి మద్దతునిచ్చారు. జర్మనీ ఓడిపోయేవరకు సంధి చేసుకోవని జార్ ప్రకటించాడు. డ్యూమాలోని కొద్దిమంది సోషల్ డెమోక్రాటిక్ డెప్యూటీలు తప్ప, మిగిలిన సభ్యులందరూ జర్మనీతో యుద్ధాన్ని సమర్థించారు. యుద్ధంలో జర్మనీపై తేలికగా విజయాన్ని సాధించవచ్చని ప్రజలు భావించడంవల్ల, యుద్ధ వ్యతిరేక ప్రచారాన్ని ప్రజలు సమర్థించలేదు.

సైనికంగా బలహీనంగా ఉన్నప్పటికీ, యుద్ధం చెయ్యడానికి సిద్ధం కాకముందే, రష్యా మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొంది. పారిశ్రామికంగా వెనుకబడ్డంవల్ల, ఆయుధాల ఉత్పత్తి తగ్గిపోయింది. రవాణా సదుపాయాలు సరిగాలేక పోవడం వల్ల, మిత్ర రాజ్యాల నుండి సైనిక సహాయం అందలేదు. అందువల్ల, సైనిక పరిశీలకులు రష్యా ఓటమి తప్పదని, ముందునుండీ అనుకున్నారు. జర్మనీతో సంఘర్షణలో రష్యా ఓడిపోతే, తీవ్రమైన స్థాయిలో సామాజిక విప్లవం తప్పదని, అరాచకత్వం విజృంభిస్తుందని, ఆంతరంగిక పరిస్థితి క్లిష్టమౌతుందని ముందే ఊహించారు. యుద్ధ రంగంలో లక్షల కొద్దీ సైనికులు మరణించారు. చాలా మందికి యుద్ధం అసలు ఎందుకు జరుగుతుందో తెలియదు. రష్యన్ సైనికులు ధైర్యసాహసాలతో పోరాడినా, ఓటమి తప్పలేదు. అందువల్ల, వారు ఊరికే జనం ఎందుకు చావాలని ఎదురుతిరిగి అడిగారు. సైన్యాధ్యక్ష వర్గం (High command) చేతకాని తనమే ఓటమికి ముఖ్య కారణమని చాలామంది భావించారు. సైనికాధికారుల్లో కూడా ఈ భావం వ్యాపించింది. చాలామంది సైనికాధికారులు మరణించారు. గాయపడ్డారు. శత్రువు చేతుల్లో చిక్కారు. అప్పుడు మేధావులు (intellectuals) కూడా సైనికాధికారులయ్యారు. 1916 నాటికి 15 లక్షల మంది సైన్యం నుండి వదలి తిరిగి వచ్చేశారు. నానాటికి పరిస్థితి ఈ విధంగా క్షీణించడంతో, దేశంలోని ప్రముఖులు, తీవ్రంగా ఆందోళన చెందారు.

డ్యూమాలో కేడెట్ పార్టీ ప్రముఖ సభ్యుడు, ప్రొఫెసర్ మిల్యుకోవ్ (Milyukov) నానాటికి పరిస్థితి దిగజారడంపట్ల తీవ్రంగా ఆందోళన చెంది, ఆవేశంతో మంత్రులకు మతిపోయిందా? లేక , దేశ ద్రోహులయ్యారా అని ప్రశ్నించాడు. ఈ విధంగా రష్యన్ విప్లవం అనివార్యమైంది.

## 19.4 సంగ్రహంగా

19వ శతాబ్దంలో ఫ్యూడల్ దాస్య విధానం అమల్లో ఉన్నప్పుడు, కర్షకుని పరిస్థితి చాలా దైన్యంగా ఉండేది. రష్యాలో భూస్వాముల స్వాధీనంలో చాలా ఎక్కువ భూమి ఉండడం వల్ల, అసంతృప్తి చెందిన రైతులు భూస్వాములపై తిరగబడి, దోపిడిలు చేసేవారు. కర్షకోద్యమం వర్గ పోరాటంగా మారింది. ఈ పరిణామం విప్లవానికి నాంది పల్కింది.

1850 తర్వాత రష్యాలో పరిశ్రమలు, వాణిజ్యం, రైలు మార్గాలు వృద్ధి చెందడంవల్ల, రష్యన్ ఆర్థిక, సామాజిక వ్యవస్థల్లో చాలా మార్పులు వచ్చాయి.

1854-1896 సంవత్సరాల మధ్య, పారిశ్రామిక సంస్థల సంఖ్య, కార్మికుల సంఖ్య, ఉత్పత్తి గణనీయంగా పెరిగాయి. ఇనుము -ఉక్కు పరిశ్రమ, బొగ్గు, చమురు పరిశ్రమల్లో ఉత్పత్తి బాగా పెరిగింది. భారీ పరిశ్రమలను నెలకొల్పారు. గుత్తాధిపత్య వ్యవస్థలు, ట్రస్టుల యాజమాన్యంలో ఫ్యాక్టరీలను స్థాపించారు. గుత్తాధిపత్య వ్యవస్థలు, బొగ్గు, ఇనుము, చక్కెర, చమురు, లోహ పరిశ్రమల్లో కీలకమైన పాత్రను నిర్వహించాయి.

రష్యన్ భూస్వాములు ఆర్థిక, రాజకీయ రంగాల్లో కీలకమైన పాత్రను నిర్వహించడం వల్ల, రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. విదేశీ పెట్టుబడి నిర్వహించిన ప్రముఖ పాత్ర వల్లే, రష్యా పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది.

రష్యాలో మధ్యతరగతి వర్గంవారు పెట్టుబడికి, సాంకేతిక నైపుణ్యానికి, రాజకీయభావాలకు, పశ్చిమ ఐరోపా దేశాలపై ఆధారపడ్డారు.

రష్యాలో కార్మికులకు పని చాలా ఎక్కువ. వేతనాలు చాలా తక్కువ. రష్యన్ శ్రామిక వర్గంలోఆర్థిక పరిస్థితుల ప్రభావం వల్ల, వర్గ చైతన్యం పెంపొందింది. వర్గ పోరాటం తీవ్ర రూపాన్ని దాల్చింది. మధ్య తరగతిలా కాకుండా, రష్యన్ శ్రామిక వర్గం పశ్చిమ ఐరోపా దేశాల నుండి కొత్త సిద్ధాంతాలను స్వీకరించింది. మొదటి నుండీ రష్యాలో కార్మికోద్యమ నాయకులు విప్లవం ద్వారా జారిస్ట్ నిరంకుశ వ్యవస్థను తొలగిస్తే తప్ప, తాము కోరుకున్న సంస్కరణలను సాధించలేమని భావించారు.

రష్యాలో ప్రభుత్వ పరిపాలన చాలా దుర్భరంగా ఉండేది. రష్యన్ పరిపాలనా వ్యవస్థలో అవినీతి, అసమర్థతలు పేరుకుపోవడం వల్ల, రష్యన్ ప్రజల ఓర్పు నశించి, విప్లవం రగుల్కొంది.

19వ శతాబ్దాంతానికి ఆవిరి యంత్రం, టెలిగ్రాఫ్ విరివిగా వాడకంలోకి వచ్చాయి. పరిపాలనా యంత్రాంగంలో కీలకమైన పదవుల్లో వున్న భూస్వాములు, సాంకేతిక విజ్ఞాన ఫలితాలను వ్యతిరేకించారు. అందువల్ల, పెట్టుబడిదారీ వ్యవస్థ రష్యాలో త్వరగా అభివృద్ధి చెందలేదు. జారిస్ట్ రాజ్య వ్యవస్థ ఆధునిక నాకరికతకు ప్రతిబంధకంగా ఉండడంవల్ల, రష్యన్ విప్లవం అనివార్యమైంది. రష్యాలో భారీ పరిశ్రమలు త్వరితంగా అభివృద్ధి చెందాయి. కాని, ఆర్థిక వ్యవస్థ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందలేదు.

విదేశీ పెట్టుబడి రష్యా ఆర్థిక వ్యవస్థను పూర్తిగా తన గుప్పిట్లో ఉంచుకుంది. తమ దేశాల్లో కంటే రష్యాలో లాభాలు అధికంగా రావడంవల్ల, విదేశీ పెట్టుబడి రష్యాలో కేంద్రీకృతమైంది. బాంకుల్లో, రైలు మార్గాల నిర్మాణంలో, బొగ్గు, లోహ పరిశ్రమల్లో, చమురు గనుల్లో ఇంగ్లీష్, ఫ్రెంచి పెట్టుబడులు ప్రముఖ పాత్ర వహించాయి. రష్యన్ ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడి పట్టును సంపాదించింది. రష్యా పారిశ్రామికంగా

BRAOU

అభివృద్ధి చెందడానికి, విదేశీ పెట్టుబడి కీలకమైన పాత్రను నిర్వహించింది.

విదేశీ యజమానులు కార్మికులకు తక్కువ వేతనాలిచ్చి, ఎక్కువగా లాభాలను రష్యాలో గుంజవచ్చని విశ్వసించారు. అందువల్లే, అంతర్జాతీయ పెట్టుబడి (internatonal capital) రష్యాలో కేంద్రీకృతమైంది. రష్యన్ కార్మికులు అంతర్జాతీయ కార్మికోద్యమంతో చేతులు కలపడానికి సిద్ధపడ్డారు. అందువల్ల, రష్యాలో అంతర్జాతీయ పెట్టుబడిదారీ విధానానికి, శ్రామిక వర్గానికి సంఘర్షణ తలెత్తడానికి అవసరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. విప్లవం అనివార్యమైంది. జారిస్ట్ రష్యాలోని ఆర్థిక పరిస్థితులే, 1917 నవంబర్‌లో ప్రజ్వరిల్లిన సోషలిస్ట్ విప్లవానికి ముఖ్య కారణాలు.

రష్యన్ సామ్రాజ్యంలో విచ్ఛిన్నకర శక్తుల ప్రభావంవల్ల, రష్యన్ సామ్రాజ్యం చాలా బలహీనమైంది. మైనారిటీ జాతులను అణచిపెట్టడం వల్ల, వారిలో తీవ్రమైన అసంతృప్తి రగుల్కొంది. మొదటి ప్రపంచ యుద్ధం కొనసాగుతున్న కాలంలోనే, 1917లో రష్యాలో గొప్ప సామాజిక విప్లవోద్యమం ప్రజ్వరిల్లింది.

1640 లో ఇంగ్లాండ్‌లో, 1789లో ఫ్రాన్స్‌లో,రష్యాలో అసమ్మతి వర్గం (a class of dissenters) ఆవిర్భవించింది.ఈ వర్గం వారు విప్లవ భావాలు వ్యాపించడానికి కృషి చేశారు.

రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లడానికి చిట్టచివరి కారణం, రెండో నికలస్ వ్యక్తిత్వం. ఇతనికి దృఢ సంకల్పం లేదు. భార్యా విధేయుడు . అతని భార్య జారిట్సా అలెగ్జాండర్ రాజకీయాల్లో జోక్యం చేసుకుంది. ఈ పరిస్థితి రాజవంశ పతనానికి దారితీసింది.

గొడ్డు కసాయి వాడిని నమ్మినట్లు, జార్ దంపతులు గ్రెగరీ రస్పుటిన్ ను పూర్తిగా ,గుడ్డిగా నమ్మారు. అతడు తన స్నేహితులను ఉన్నత పదవుల్లో నియమించుకొని, ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, యుద్ధ నిర్వహణలో ప్రభుత్వంపై అజమాయిషీని సంపాదించాడు. రస్పుటిన్ మానవ నైజాన్ని నిశితంగా పరిశీలించగల దిట్ట. జార్ రెండో నికలస్ అతన్ని 'దేవుని మనిషి' (a man of God) గా భావించాడు.

తన ఇష్టం వచ్చినట్లు ప్రధాన మంత్రులను, కాబినెట్ మంత్రులను, సైన్యాధక్షులను రస్పుటిన్ మార్పించాడు. జారిట్సాకు అతని మాట వేద వాక్కు. రష్యన్ సమాజంలో పేరుకుపోయిన అవినీతికి, రస్పుటిన్ ప్రతీక. 1916 డిసెంబర్‌లో, జార్ ఆస్థానంలోని ఉన్నతాధికారులే, రస్పుటిన్‌ను హత్య చేయించారు.

మొదటి ప్రపంచ యుద్ధంలో రెండో నికలస్ ఆధ్వర్యంలో రష్యన్ సైన్యాలు ఓడిపోయాయి. చావు దెబ్బతిన్నాయి. లక్షల కొద్దీ సైనికులు మరణించారు. 1916 నాటికి 15 లక్షల మంది సైనికులు సైన్యం నుండి వదలి తిరిగి వచ్చేశారు. సైన్యాధ్యక్ష వర్గం చేతకాని తనమే ఓటమికి ముఖ్య కారణమని, చాలామంది భావించారు. ప్రజలు ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నానాటికి పరిస్థితి విషమించడంతో, దేశంలో ప్రముఖులు ఆందోళన చెందారు.

## 19.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. 1850 తర్వాత రష్యాలో సంభవించిన వాణిజ్య, పారిశ్రామికాభివృద్ధిని వివరించండి

2. రష్యా ఆర్థిక వ్యవస్థపై విదేశీ పెట్టుబడుల ప్రభావాన్ని పరిశీలించండి

3. రష్యన్ విప్లవం ప్రజ్వరిల్లడానికి గల కారణాలను క్లుప్తంగా పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి.

1. 19వ శతాబ్ది రష్యాలో కర్షకుల పరిస్థితిని వివరించి, అది విప్లవోద్యమం ప్రజ్వరిల్లడానికి ఎలా దోహదమైందో తెల్పండి

2. రష్యన్ కార్మిక వర్గ ఆవిర్భావాన్ని, దాని ప్రాధాన్యతను చర్చించండి.

3. ప్రభుత్వ పాలనా వ్యవస్థలోని లోపాలు, విప్లవం సంభవించడానికి ఎలా తోడ్పడ్డాయో పరిశీలించండి.

4. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా ఎదుర్కొన్న సమస్యలను చర్చించి, విప్లవం రావడానికి అవి ఎలా దోహదమైనాయో విశ్లేషించండి.

5. రష్యా పరిపాలనా వ్యవస్థపై గ్రెగరీ రస్పుటిన్ ప్రభావాన్ని తెల్పి, దాని ఫలితంగా ఏర్పడ్డ సంక్షోభాన్ని సమీక్షించండి.

## 19.6 ఉపయుక్త గ్రంథాలు


Lipson, E : **History of Europe during the 19th Century.**

Carr, E.H : **Russian Revolution, 3 Vols.**

Chamberlain : **Russian Revolution, vols. I & II.**

Ivar Spector : **An Introduction to Russian History and Culture.**

Gold Stone : **Russian Revolution.**

Andrew Pothstein : **History of Soviet Union.**

Christopher Hill : **Lenin.**

Sydney Harcave : **Russia - A Study.**

Sir. R. Bruce Loockhart : **Memoirs of a British Agent.**

Prince Youssoupoff : **Rasputin : His Malignant influence & assasination.**


BRAOU

**రచయిత : శ్రీ జె.యస్. ప్రకాశరావ్**

# భాగం –20 : 1917 విప్లవ గమనం

విషయక్రమం


20.0 లక్ష్యాలు

20.1 పరిచయం

20.2 1905–1906 డ్యూమా కార్యక్రమాలు: డ్యూమా రద్దు

20.2.1 స్టోలిపిన్ ప్రణాళిక : స్టోలిపిన్ హత్య

20.2.2 వ్లాడిమిర్ కాకోవ్ ట్సోవ్: గోరెమ్‌కిన్ రహస్య పోలీస్‌ల జులుం

20.3 1905 విప్లవం తదుపరి బోల్షివిక్‌ల, మెన్షివిక్‌ల ఘర్షణ

20.3.1 ప్రవాసంలో విప్లవకారుల కార్యక్రమాలు : గూఢచారుల విఘా

20.3.2 మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రష్యా ఎదుర్కొన్న సమస్యలు

20.3.3 మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో లెనిన్ నిర్వహించిన భూమిక (1914–17)

20.3.4 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవానికి దారితీసిన పరిస్థితులు

20.3.5 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవ గమనం

20.4 తాత్కాలిక కమిటీ స్థాపన : పెట్రోగ్రాడ్ సోవియట్ ఆవిర్భావం

20.4.1 విప్లవాన్ని అణచడానికి జార్ చేసిన ప్రయత్నాలు

20.4.2 తాత్కాలిక ప్రభుత్వ స్థాపన: జార్ రెండవ నికలస్ రాజ్య పరిత్యాగం

20.5 అక్టోబర్ విప్లవానికి దారితీసిన సంఘటనలు : బోల్షివిక్ విప్లవం

20.5.1 తాత్కాలిక ప్రభుత్వం, పెట్రోగ్రాడ్ సోవియట్‌ల విభేదాలు : ఏప్రిల్ 5 ప్రదర్శన

20.5.1.1. రాజకీయ ఖైదీల విడుదల

20.5.2 తాత్కాలిక ప్రభుత్వంపట్ల లెనిన్ దృక్పథం

20.5.2.1 రష్యాకు తిరిగి లెనిన్ రాక : స్వాగత సత్కారాలు

20.5.2.2 ఏప్రిల్ థీసెస్ (April Theses)

20.5.2.3 లెనిన్ భావాల పట్ల పార్టీ దృక్పథం : లెనిన్‌కు పార్టీ మద్దతు

20.5.3 ఏప్రిల్ దినాలు : మే సంక్షోభం : జూన్ ప్రదర్శనలు

20.5.4 జూలై సంక్షోభం

20.5.5 ప్రతీఘాత విప్లవం (Counter –Revolution)

20.5.6 కోర్నిలోవ్ తిరుగుబాటు ప్రయత్నం: తిరుగుబాటు విఫలత

20.5.7 పెట్రోగ్రాడ్ సోవియట్ ప్రెసిడియమ్‌కు ఎన్నికలు : బోల్షివిక్‌ల ఆధిక్యత

20.5.8 అధికార స్వాధీనానికి లెనిన్ వ్యూహం

20.5.8.1 పార్లమెంట్ ముందటి సమావేశం : బోల్షివిక్ పార్టీ బహిష్కారం

20.5.8.2 సైనిక విప్లవ కమిటీ స్థాపన : పొలిట్ బ్యూరో ఏర్పాటు, నిర్ణయాలు

20.5.9 బోల్షివిక్ విప్లవ గమనం : తాత్కాలిక ప్రభుత్వ పతనం

20.5.9.1 అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ సమావేశం : ప్రతినిధుల ఆనందోత్సాహాలు

20.6 లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ ప్రభుత్వ స్థాపన : మౌలిక విధానాల ప్రకటన

20.6.1 లెనిన్ మంత్రివర్గం : కేంద్ర కార్యనిర్వాహక వర్గం

20.6.2 బోల్షివిక్ పార్టీ అధికార స్వాధీనంపై వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు

20.7 సంగ్రహంగా

20.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

20.9 ఉపయుక్త గ్రంథాలు

## 20.0: లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, ఈ క్రింది విషయాల గురించి తెలుసుకోగలగాలి.

- 1917లో ప్రజ్వరిల్లిన ఫిబ్రవరి (మార్చి) విప్లవానికి దారితీసిన సంఘటనలు.
- 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవ లక్ష్యాలు.
- 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవ గమనం.
- 1917 అక్టోబర్ (నవంబర్) మహా విప్లవానికి దారితీసిన సంఘటనలు.
- 1917 అక్టోబర్ (నవంబర్) విప్లవ లక్ష్యాలు.
- 1917 అక్టోబర్ (నవంబర్) విప్లవ గమనం.

## 20.1 : పరిచయం

వెయ్యి సంవత్సరాల రష్యా చరిత్రలో, 1917 విప్లవం ఓ మహత్తర సంఘటన . ఆధునిక యుగంలో ప్రసిద్ధి చెందిన సామాజిక, రాజకీయ విప్లవంగా, రష్యన్ విప్లవాన్ని ప్రముఖ చరిత్రకారులు అభివర్ణించారు. రష్యాలో ప్రజావాహిని బలప్రయోగం ద్వారా పాత ప్రభుత్వాన్ని, సామాజిక వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించి వేసి, నూతన ప్రభుత్వాన్నీ, సమాజాన్ని విజయవంతంగా స్థాపించింది.

BRAOU

## 20.2 : 1905 –1906 డ్యూమా కార్యక్రమాలు : డ్యూమా రద్దు

1905 అక్టోబర్ ప్రణాళిక ప్రకారం జార్ రాజ్యాంగాన్ని ప్రకటించి, డ్యూమా (శాసన సభ) ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు. డ్యూమా (Duma) కు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలను, విప్లవాన్ని ప్రోత్సహించే రాజకీయ పార్టీలు (బోల్షివిక్, మెన్షివిక్, సోషలిస్ట్ రివల్యూషనరీ) బహిష్కరించాయి. డ్యూమాలో మధ్య తరగతి వర్గానికి ప్రాతినిధ్యం వహించిన కేడెట్ పార్టీకి మొదటి స్థానం లభించింది. ట్రుడోవిక్స్ పార్టీ రెండో స్థానంలో ఉంది. 1906 మే నెల్లో రాజధానిలోని టారిడ్ భవనంలో డ్యూమా సమావేశం జరిపింది. ఈ సమావేశాల్లో సభ్యులు జార్‌కు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఆ వినతి పత్రంలో, జార్‌ను భూమిని పంచాలనీ, పన్నుల భారాన్ని తగ్గించాలనీ, పోలీసుల కబంధ హస్తాలనుండి ప్రజలను కాపాడాలనీ, సభ్యులు కోరారు.

1905 విప్లవాన్ని అణచివేసిన తర్వాత, నిరంకుశత్వాన్ని త్వరగా పునరుద్ధరించాలని భావించి, జార్ రెండో నికలస్ ఇల్లిచ్ గోరెమ్‌కిన్ (Ilyich Goremkin) ను ప్రధానమంత్రిగా నియమించాడు. అతని మంత్రి వర్గం సభ్యులు జార్‌కు మాత్రమే పూర్తిగా విధేయులు. మంత్రివర్గం, డ్యూమా గురించి కాని, ప్రజాసమస్యల గురించి కాని, ఏమి పట్టించుకోలేదు. భూసంస్కరణల విషయంలో డ్యూమా కోరికను జార్ తిరస్కరించాడు 1906 జూలైలో జార్ డ్యూమాను రద్దు చేశాడు. డ్యూమాను రద్దు చేసిన తర్వాత, సభ్యులు ప్రజల మద్దతును కోరారు. కాని, వారి గోడును ఎవరూ పట్టించుకోలేదు.

### 20.2.1 స్టోలిపిన్ ప్రణాళిక : స్టోలిపిన్ హత్య

1906 లో జార్ రెండో నికలస్ అసమర్థుడైన గోరెమ్‌కిన్‌ను పదవినుండి తొలగించి, పరిపాలనా దక్షుడైన పీటర్ స్టోలిపిన్ (Peter Stolypin) ను ప్రధాన మంత్రిగా నియమించాడు. స్టోలిపిన్ జార్ ప్రయోజనాలను కాపాడ్డానికి, కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను తీసుకున్నాడు. ప్రభుత్వ భూములను కర్షకులకు తేలిగ్గా కొనుక్కునే పద్ధతిలో అమ్మే విధానాన్ని ఇతడు ప్రవేశపెట్టాడు. ఇలా అమ్మడం వల్ల, విప్లవ భావాలను వ్యతిరేకించే కర్షక వర్గం రష్యాలో పెంపొందుతుందని స్టోలిపిన్ భావించాడు. ఫ్రెంచి విప్లవం తర్వాత ఫ్రాన్స్‌లో కర్షక వర్గం విప్లవ భావాలను వ్యతిరేకించింది. అట్లాంటి వర్గమే రష్యాలో తలెత్తుతుందని, స్టోలిపిన్ నమ్మాడు. తాను ప్రవేశపెట్టిన భూసంస్కరణలు విప్లవోద్యమ ప్రభావాన్ని తగ్గిస్తాయని, జార్‌కు నచ్చ చెప్పాడు.

స్టోలిపిన్ అనుకుంది అక్షరాల నిజం. అతడు అనుకున్నట్లే, కర్షకులు ప్రవర్తించారు. స్టోలిపిన్ ప్రణాళిక చాలాకాలం కొనసాగితే తమ పార్టీ వ్యవసాయ ప్రణాళికనే వదులుకోవాల్సి వస్తుందని లెనిన్ అంగీకరించాడు.

పరిపాలనాదక్షుడైన స్టోలిపిన్‌ను జార్ నమ్మలేదు. మనస్సులో ద్వేషించాడు. జారినా అలెగ్జాండ్రా కూడా అతన్ని ద్వేషించింది. స్టోలిపిన్ డ్యూమాను హేయభావంతో చూడ్డంవల్ల, డ్యూమా సభ్యులు కూడా అతన్ని ద్వేషించారు. 1911 సెప్టెంబర్ 14న స్టోలిపిన్‌ను కీవ్ (Kiev) నగరంలో జార్‌తో ఒపేరా (Opera) చూస్తుండగా, ఇంటర్వెల్ లో (Interval) దారుణంగా హత్య చేశారు. స్టోలిపిన్ రాజకీయ రంగం నుండి నిష్క్రమించినందుకు జార్ సంతోషించినా, ఈ దారుణ హత్యపట్ల దిగ్భ్రాంతి ప్రకటించాడు.

### 20.2.2 వ్లాడిమిర్ కొకోవ్‌ట్సోవ్ : గోరెమ్‌కిన్ రహస్య పోలీస్‌ల జులుం

స్టోలిపిన్ చనిపోయిన తర్వాత, రెండో నికలస్ వ్లాడిమిర్ కొకోవ్‌ట్సోవ్‌ను ప్రధాన మంత్రిగా నియమించాడు. అతడు అసమర్థుడు. భగ్రాజు. అప్పటినుండే విప్లవ కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

1912 అక్టోబర్‌లో లీనా (Lina) బంగారు గనుల్లో సమ్మె చేసిన కార్మికులపై పోలీస్‌లు కాల్పులు జరిపారు. 'బ్లడీ సన్‌డే' (Bloody Sunday) నాటి రక్తపాతం తిరిగి జరిగింది. రాజకీయ పరిస్థితి విషమించింది. కొకోవ్‌ట్సోవ్ రస్పుటిన్‌ను ద్వేషించడంవల్ల, 1914లో పదవిని కోల్పోయాడు. 1914లో జార్ గోరెమ్‌కిన్‌ను తిరిగి ప్రధాన మంత్రిగా నియమించాడు.

జార్‌ల నిరంకుశపాలనలో రహస్య పోలీస్‌లు జులుం చెలాయించారు. వీరు విప్లవకారులపైన నిఘావేసి, రహస్య సమాచారాన్ని సేకరించారు. వీరి ప్రవర్తన ప్రజల్లో ద్వేషాగ్నిని రగుల్కొల్పింది. విప్లవం ప్రజ్వరిల్లితే ప్రజలు తమను బతకనివ్వరని వారు చాలా భయపడ్డారు. అందువల్ల, విప్లవం ప్రజ్వరిల్లకుండా చూడ్డానికి రహస్య పోలీస్ వ్యవస్థను పటిష్టం చేశారు

## 20.3 1905 విప్లవం తదుపరి బోల్షివిక్‌ల, మెన్షివిక్‌ల ఘర్షణ

1905 విప్లవం విఫలమైన తర్వాత, విప్లవకారులు -బోల్షివిక్‌లు, మెన్షివిక్‌లు - సోషల్ డెమోక్రాటిక్ పార్టీపై అజమాయిషీ విషయంలోను, మౌలిక విధానాల విషయంలోను తీవ్రంగా ఘర్షణపడ్డారు. లెనిన్, మేక్సిమ్ లిటినోవ్ (Maxim Litinov), లెవ్‌కామెనెవ్ (Lev Kamenev), గ్రెగరీ జినోవీవ్ (Gregory Zinoviev) లు ప్రముఖ బోల్షివిక్ నాయకులు. వీరు సాయుధ సంఘర్షణ జరగకుండా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోవడం అసాధ్యమని నమ్మారు. చాలామంది ప్రజలకు చదువు రాదు. కనుక సరైన వ్యవస్థ అవసరం. అట్లాంటి వ్యవస్థీకృత నియంతృత్వాధికారాలున్న రహస్య కమిటీ అవసరం. అది ప్రజలకు నాయకత్వం



BRAOU

వహించాలని వీరు భావించారు.

ప్లెఖనోవ్, జూలియస్ మార్టోవ్, ఇరాక్లి జెరెటెల్లి (Irakli Tseretelli) లు ప్రముఖ మెన్షివిక్ నాయకులు. వీరు ఉగ్రవాదాన్ని, హింసావాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మెన్షివిక్ లు కేడెట్ పార్టీ లాంటి మధ్యతరగతి వర్గాల పార్టీలతో సహకరించడానికి తయారయ్యారు. క్లిష్టమైన ప్రభుత్వ పాలనను మధ్యతరగతి వర్గం మాత్రమే నిర్వహించగలరని వీరి భావన. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందడానికి చాలా కాలం పట్టింది. అందుకనే, సోషలిస్ట్ విప్లవం కోసం ఎక్కువ కాలం వారు వేచి ఉండడానికి సిద్ధపడ్డారు.

రష్యన్ మధ్యతరగతి వర్గానికి ప్రాతినిధ్యం వహించిన పార్టీలతో ఎలాంటి సర్దుబాటు చేసుకోడాన్ని, లెనిన్ తీవ్రంగా వ్యతిరేకించాడు. రష్యన్ మధ్యతరగతి వర్గం బలహీనులు. సామాన్య ప్రజానీకమంటే భయపడతారని లెనిన్ భావించాడు. సామాన్య ప్రజలు ప్రభుత్వాధికారాన్ని నేరుగా హస్తగతం చేసుకొని, సోషలిజాన్ని ఏర్పాటు చేయగల్గే స్థితిలో ఉన్నప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థ కింద మగ్గాల్సిన అవసరమేముందని లెనిన్ ప్రశ్నించాడు.

సోషల్ డెమోక్రాట్ల వార్తాపత్రిక ప్రావ్దా (Pravda) పై అజమాయిషీ గురించి జరిగిన సంఘర్షణలో, చివరకు బోల్షివిక్ లే గెల్చారు. లెనిన్ సంపాదకత్వంలో ప్రావ్దా ప్రజల ఆదరాభిమానాలను పొందింది. లెనిన్ రచనలకు రష్యా అన్ని ప్రాంతాల్లో విస్తృత ప్రచారం లభించింది.

### 20.3.1 ప్రవాసంలో విప్లవకారుల కార్యక్రమాలు : గూఢచారుల నిఘా

విప్లవకారుల బృందాలు తమ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించుకోడానికి బ్యాంకులను, పోస్టాఫీస్‌లను ఇతర సంస్థలను దోచి, నిధులను విదేశాలకు పంపేవారు. టిఫ్లిస్ లోను 324,000 రూబుల్స్‌ను విప్లవకారులు దోచారు. ఈ దోపిడీలో జోసెఫ్ ద్జుగాష్‌విలీ (Joseph Djugashvili) అనే బోల్షివిక్ నాయకుడు ప్రముఖ పాత్ర వహించాడు. అతడే స్టాలిన్ (Stalin).

ప్రవాసంలో ఉన్న విప్లవకారులను నిర్బంధించడానికి, ప్రభుత్వం గూఢచారులను పంపింది. ఈ గూఢచారులు విప్లవకారుల బృందాల్లో కలిసిపోవడం వల్ల, వారు ఒకరినొకరు అనుమానించుకున్నారు. నిరుత్సాహం వారిని కమ్ముకుంది. చివరకు లెనిన్ కూడా విప్లవాన్ని తాను చూడలేకపోవచ్చని, తన స్నేహితులతో అన్నాడు. కాని, లెనిన్ పూర్తిగా నిరాశ చెందలేదు. చాలా గ్రంథాలు చదివాడు. రాశాడు. అతని భార్య, కృప్‌స్కాయా అతనికి పూర్తి మద్దతునిచ్చింది. లెనిన్ కూడా మార్క్స్‌లాగే తన సహచరుల గౌరవాన్ని పొందాడు. అతని రాజీపడని ధోరణి, కటువైన వాదనా పద్ధతి, చాలా మందికి నచ్చలేదు. ఎలాంటి జటిల సమస్యనైనా పరిష్కరించడానికి, తేలికైన భాషలో తెలియచేసే అతడి నేర్పు, చాలా మందిని ఆకర్షించింది. అనుమానాలతో, వ్యతిరేక భావాలతో వచ్చినవారు కూడా అతని విశిష్ట వ్యక్తిత్వానికి ఆకర్షితులై, అతని శిష్యులయ్యారు. విప్లవోద్యమంలో మెన్షివిక్ లే అధిక సంఖ్యాకులు. కాని, అల్ప సంఖ్యాకులైన లెనిన్ సహచరులే, సంఘర్షణలో తమ ప్రాణాలను సైతం ధారపొయ్యడానికి సిద్ధమయ్యారు.

### 20.3.2 మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో రష్యా ఎదుర్కొన్న సమస్యలు

మొదటి ప్రపంచ యుద్ధం 1914లో ప్రజ్వరిల్లింది. ఈ యుద్ధం ప్రజ్వరిల్లగానే సామాన్య ప్రజలు, డ్యూమాలోని అత్యధిక సంఖ్యాకులు జర్మనీతో యుద్ధాన్ని సమర్థించారు. లెనిన్, ట్రాట్స్కీ, మార్టోవ్ లు, ప్రవాసంలో ఉన్న ఇతర సోషల్ డెమోక్రాటిక్ నాయకులు, యుద్ధాన్ని నిరసించారు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలన్న లెనిన్ విధానాన్ని, బోల్షివిక్ లు ఆమోదించారు.

మొదటి ప్రపంచ యుద్ధంలో 15 లక్షల 50 వేల రష్యన్ సైనికులు పాల్గొన్నారు. 1915లో, జర్మన్ సైన్యాలు రష్యన్ సైన్యాలను ఓడించాయి. రష్యా, పోలెండ్, గెలీషియా (Galicia) ల నుండి

BRAOU

ఉపసంహరించుకుంది. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా 80 లక్షలమంది సైనికులను నష్టపోయింది. రష్యన్ సైన్యాలు ఈ యుద్ధంలో చిత్తుగా ఓడిపోయాయి. ఉన్నత వర్గాలకు చెందిన అధికారుల స్థానంలో, సామాన్య ప్రజానీకం నుండి అధికారులను నియమించడం జరిగింది. అందువల్ల ప్రభుత్వం సైనిక దళాలను నమ్మలేని పరిస్థితి ఏర్పడింది.

1915 వేసవిలో సమ్మెలు, తిండిగింజల పోరాటాలు కోస్ట్రామా, మాస్కో నగరాల్లో జరిగాయి. మాస్కో నగరంలో ఏ క్షణాన్నైనా అల్లర్లు మొదలు కావచ్చనీ, శాంతిభద్రతలను కాపాడ్డానికి సైనికదళాలు లేవని, ఆంతరంగిక శాఖ మంత్రి స్కెర్బటోవ్ (Scherbatov) ప్రకటించాడు.

1915 సెప్టెంబర్‌లో డ్యూమాలోని 2/3 వంతు సభ్యులతో ప్రోగ్రెసివ్ వర్గం ఏర్పడింది. ప్రజా విశ్వాసం పొందిన సభ్యులే మంత్రివర్గంలో ఉండాలని, కొన్ని సంస్కరణలను ప్రవేశపెట్టాలనీ, ఈ వర్గం భావించింది. ఈ విధంగా రష్యాలో రాజకీయ విమర్శ (Political criticism) మొదలైంది.

ప్రజాభిప్రాయాన్ని మన్నించనందుకు ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని గర్హించినా, విప్లవం ప్రజ్వరిల్లుతుందని భయపడి, తమ భావాలను స్వేచ్ఛగా ప్రకటించలేకపోయారు. కేడెట్ పార్టీ (Cadet Party) ప్రముఖ నాయకుడు ప్రొఫెసర్ మిల్యుకోవ్, త్వరపడి ఎలాంటి చర్య తీసుకోవద్దని తన పార్టీ సభ్యులను హెచ్చరించాడు. దూది పింజ మీద నిప్పురవ్వ పడితే అంతా ఎలా ధ్వంసమౌతుందో, అలాగే అజాగ్రత్తగా వ్యవహరిస్తే విప్లవం తప్పదని, పార్టీ సభ్యులను భయపెట్టాడు. ఈ అభిప్రాయాలతో ఉన్నతాధికారులు కూడా ఏకీభవించారు. ధరలు ఆకాశాన్నంటడంవల్ల కార్మికులు అసంతృప్తులయ్యారు. 1905 విప్లవం పతనమైన తర్వాత, కర్షకులు మొదటిసారి రాజకీయాల గురించి బహిరంగంగా మాట్లాడసాగారు. జనరల్ బ్రుస్సిలోవ్ (Brussilov) నాయకత్వంలో రష్యన్ సైన్యాలు ఆస్ట్రియన్లపై జరిపిన ముట్టడి విఫలమైంది. దేశంలో నిరాశ, నిస్పృహలు నిండిపొయ్యాయి. కార్మికులు సమ్మెలు చేశారు. పట్టణాల నుండి గ్రామాల్లోకి సరుకులు రావడంలేదని కర్షకులు అసంతృప్తి చెందారు.

జార్ రెండో నికలస్, జారిట్సా అలెగ్జాండ్రాల వ్యక్తిత్వాలు, వారు రస్పుటిన్‌ను గుడ్డిగా నమ్మడంవల్ల ఏర్పడ్డ పరిస్థితిని, విప్లవ కారణాలను పరిశీలించేటప్పుడు తెలుసుకున్నాం. జార్ ఆస్థానంలోని ఉన్నతాధికారులే, 1916 డిసెంబర్ 29న, రస్పుటిన్‌ను హత్య చేశారు. అతన్ని హత్య చేసినా, అసంతృప్తిపరులైన సైనికాధికారులు, రాజకీయవాదులు జార్‌ను తొలగించలేకపోయారు. అతని హత్య తర్వాత కూడా, సామాన్య ప్రజల దైన్య స్థితిలో ఎలాంటి మార్పులేదు. 1917 జనవరిలో యుద్ధ రంగం నుండి సెలవు పెట్టిన జనరల్ క్రైమోవ్ (Krymov) ప్రముఖ డ్యూమా సభ్యులతో మాట్లాడుతూ, సైనిక తిరుగుబాటు జరిగితే సైనిక దళాలు సంతోషిస్తాయని చెప్పాడు.

చాలామంది ప్రముఖులు తీవ్రంగా హెచ్చరించినా, రాబోయే ప్రళయాన్ని నివారించడానికి జార్ ఎలాంటి చర్య తీసుకోలేదు. 1917, జనవరి 12 న బ్రిటీష్ రాయబారి సర్ జార్జి బుచానన్ (Sir George Buchanan) దౌత్య మర్యాదలను కూడా అతిక్రమించి, సరైన నిర్ణయాలు తీసుకోకపోతే ప్రభుత్వ పతనం తప్పదని తెల్పాడు.

రష్యన్ సైనిక దళాలు ఓడిపోవడం వల్ల, సేనానుల సామర్థ్యం పై నమ్మకం పోయింది. ప్రభుత్వం పైనే నమ్మకం పోయింది. వేల కొద్దీ సైనికులు యుద్ధ రంగం నుండి పారిపోయారు. సైన్యంలో బోల్షివిక్, మెన్షివిక్, సోషలిస్ట్ రివల్యూషనరీల ప్రభావం విపరీతంగా పెరిగింది. 1917 సంవత్సర ప్రారంభంలో ధరలు ఆకాశాన్నంటడంవల్ల, కార్మికులు, కర్షకులు చాలా బాధపడ్డారు.

## 20.3.3 : మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో లెనిన్ నిర్వహించిన భూమిక (1914–17)

మొదటి ప్రపంచ యుద్ధం మొదలు కాగానే, చాలా మంది సోషలిస్ట్ నాయకులు అంతర్జాతీయ

భావాలను, శ్రామికోద్యమ లక్ష్యాలను మర్చిపోయి,అవకాశవాదులై, యుద్ధాన్ని సమర్థించారు. లెనిన్ మాత్రం పట్టుదలతో వ్యవహరించి, యుద్ధాన్ని వ్యతిరేకించిన సోషలిస్టులను తనతో కలుపుకున్నాడు. 1916లో "సామ్రాజ్యవాదం: పెట్టుబడి దారీ వ్యవస్థ అత్యున్నత దశ" (Imperialism: The Highest Stage of Capitalism) అనే చిన్న పుస్తకాన్ని ప్రచురించాడు. ఈ పుస్తకంలో మార్క్స్ సిద్ధాంతాన్ని, ఆనాటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించాడు. పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల ప్రభావితమైన ఐరోపా ఖండంలోని పరస్పర వైరుధ్యాలను అన్వయించి, ఏ పరిస్థితుల్లో ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లిందో వివరించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అనేక దేశాల్లో అంతర్యుద్ధంగా మార్చాలని సూచించాడు.

మొదటి ప్రపంచ యుద్ధాన్ని మార్క్సిస్ట్ సిద్ధాంతం ప్రకారం అన్వయించి, యుద్ధం అంతర్జాతీయ పెట్టుబడి వల్ల ఏర్పడ్డ సంఘర్షణని, కార్మికులు ఈ సంఘర్షణలో బలైపోతున్న యజ్ఞ పశువుల వంటి వారనీ, వ్యాఖ్యానించాడు. అద్వితీయ రచనా ప్రతిభవల్ల, తాను ప్రగాఢంగా నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండడంవల్ల, రష్యాలోని బోల్షివిక్ లందరికీ, సాటిలేని మేటి నాయకుడయ్యాడు. బోల్షివిక్ లపై లెనిన్ ప్రభావాన్ని గురించి, బోల్షివిక్ వ్యతిరేక చరిత్రకారుడు నికలోయ్ సుఖనోవ్ (Nikolai Sukhanov)* లెనిన్ భుజస్కంధాలపైనే బోల్షివిక్ ఉద్యమ మాధార పడిందని ప్రకటించాడు. అతని నాయకత్వం లేకపోతే, బోల్షివిక్ లు నేలమీద చేపల్లా గిలగిలా కొట్టుకొనేవారని, అతని సమక్షంలో సగర్వంగా తలెత్తుకు తిరగగలరని వివరించాడు.

1917 మొదట్లో, యుద్ధంలో రష్యా ఇంకా ఓడిపోతూనే ఉండడంవల్ల, పరిస్థితి విషమించింది. లక్షలాది సైనికులు చనిపోవడం వల్లనూ, ఖైదీలుగా పట్టుబడ్డం వల్లనూ, సైన్యం నుండి పారిపోవడం వల్లనూ,1917 సంవత్సర ప్రారంభంలో, పరిస్థితి విప్లవం ప్రజ్వరిల్లడానికి అనుకూలంగా ఉంది.

## 20.3.4 : 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవానికి దారితీసిన పరిస్థితులు

పెట్రోగ్రాడ్ లో 1917 మార్చి 8 న సమ్మెలు మొదలైనాయి. అప్పుడే ప్రారంభమైన తిండిగింజల పోరాటం తిరుగుబాటుకు దారితీస్తుందని కాని, నాల్గు రోజుల తర్వాత అసలు ప్రభుత్వమే పతనమౌతుందని కాని, విప్లవ నాయకులు సైతం అనుకోలేదు. చిలికి చిలికి గాలివాన అయినట్లు,పెట్రోగ్రాడ్ లో సమ్మెలతో ప్రారంభమైన సంఘర్షణ,విప్లవోద్యమంగా మారింది. బోల్షివిక్, మెన్షివిక్, సోషలిస్ట్ రివల్యూషనరీ నాయకులు, ఉదారవాదులు, జార్ రెండో నికలస్ కూడా, విప్లవోద్యమం హఠాత్తుగా ప్రజ్వరిల్లడంతో ఆశ్చర్య చకితులయ్యారు. మార్చి విప్లవం జరిగినప్పుడు, లెనిన్, ట్రాట్స్కీ, జినోవీవ్ లు విదేశాల్లో ఉన్నారు. స్టాలిన్, కామెనీవ్ డ్జెర్జిన్స్కీ (Dzerzinsky) లు, జైళ్లలోనో, ప్రవాసంలోనో ఉన్నారు. విప్లవాన్ని సమర్థించే ఇతర రాజకీయ పార్టీల నాయకులెవ్వరూ పెట్రోగ్రాడ్ లో లేరు. విప్లవ రాజకీయ పార్టీల్లోని సాధారణ సభ్యులు రాజకీయ సమస్యలను స్పష్టంగా అర్థం చేసుకున్నారు. పరిస్థితిని తమకు అనుకూలంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకున్నారు.

ఆహారపదార్థాల సరఫరా తగ్గిపోవడంతో, 1917 మార్చి 1 నుండి పెట్రోగ్రాడ్ లో రేషనింగ్ ను ప్రవేశపెట్టారు. కేవలం రొట్టె ముక్క కొనుక్కోడంకోసం, ఎందరో స్త్రీలు మంచు కురుస్తున్నా లెక్క చెయ్యక, రాత్రంతా క్యూలో నుంచునేవారు. పేద ప్రజలు పస్తులుంటునప్పటికీ, జార్ కు చీమైనా కుట్టినట్లు లేదు. కాని, మాస్కోలోని బ్రిటీష్, ఫ్రెంచి రాయబారులు పరిస్థితులపట్ల ఆందోళన చెంది, ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి కొన్ని చర్యలను తీసుకోవాల్సిందిగా, జార్ కు సలహా ఇచ్చారు. కాని, వారి సలహాను జార్ పెడచెవిన పెట్టాడు.

రేషనింగ్ ను ప్రవేశపెట్టిన తర్వాత, కొన్ని సమ్మెలు జరిగాయి. అంతకుమించి, ముఖ్య సంఘటనలు జరగలేదు. అందువల్ల,1917, మార్చి 8న, జార్ రాజధాని నుండి యుద్ధ రంగానికి వెళ్లాడు. ఆనాడే విప్లవం మొదలైంది.



*N.N Sukhanov : The Russian Revolution - 1917 A Personal Record.

BRAOU

## 20.3.5 : 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవ గమనం

విప్లవ జ్వాలలు ముందుగా పెట్రోగ్రాడ్ నగరంలో రగిలాయి. విప్లవాగ్నులు చెలరేగడానికి మూడు సంఘటనలు జరిగాయి. (1) అంతర్జాతీయ మహిళా ఉత్సవాలు; (2) తిండి గింజల కోసం పోరాటం; (3) లాకౌట్ (Lock-out) కు వ్యతిరేకంగా, పుటిలోవ్ ఫ్యాక్టరీ కార్మికుల ప్రతిఘటన.

మార్చి 8 న మహిళా లోకం నిరంకుశత్వం నశించాలంటూ, ఎర్ర జెండాలతో పెట్రోగ్రాడ్ నగర వీధుల్లో బ్రహ్మాండమైన ప్రదర్శనను జరిపారు. తిండిగింజల కోసం ప్రజలు పోలీస్‌లతో సంఘర్షణకు తయారయ్యారు. అదే సమయంలో, 90 వేలమంది కార్మికులు సమ్మె చేశారు. 50 మిల్లులు మూతపడ్డాయి.

మార్చి 9న కార్మిక వర్గం విజృంభించింది. మధ్యతరగతి ప్రజలు వీరికి సానుభూతిని ప్రకటించారు. ప్రజా ప్రదర్శనలను చెదరగొట్టడానికి ప్రభుత్వం కోసక్‌లను (Cossacks) పిలిపించింది. కోసక్‌లు ప్రజలపై కాల్పులు జరపబోమని హామీ ఇచ్చినట్లు, పుకార్లు వ్యాపించాయి. ప్రజలు ఆనందంతో చిందులు వేశారు. పోలీస్‌లతో తలపడ్డారు. కోసక్‌లు పోలీస్‌లకు మద్దతు ఇవ్వకపోగా, ప్రజలకే మద్దతు ఇస్తున్నట్లు కనిపించారు. కార్మిక వర్గం ఇంత చైతన్యంతో పోరాడుతున్నా, విప్లవ వెల్లువ ముంచుకు వస్తుందని అధికారులెవ్వరూ ఊహించలేదు. చివరకు బ్రిటీష్ రాయబారి కూడా, వీటిని చెదురుమదురు సంఘటనలుగానే తన నివేదిక (Report) లో పేర్కొన్నాడు.

పెట్రోగ్రాడ్ సైనిక గవర్నర్ ఖాబలోవ్, తిరుగుబాటును అణచివెయ్యడానికి మార్చి 8న పోలీస్‌లను, 9న కోసక్‌లను ఉపయోగించాడు. పరిస్థితులు మితిమీర్తే దాకా, సైన్యాన్ని వాడదల్చుకోలేదు.

మార్చి 10న పెట్రోగ్రాడ్ అన్ని ప్రాంతాల్లో సమ్మె వ్యాపించింది. 2,40,000 మంది కార్మికులు ప్రదర్శనలను జరిపారు. విద్యార్థులు, న్యాయవాదులు, చిల్లర వ్యాపారులు ,కార్మికులతో కలిశారు. బహిరంగ సమావేశాలు జరిగాయి. చాలామంది వక్తలు జనాన్ని ఉద్దేశించి మాట్లాడారు. జనాన్ని చెదరగొట్టడానికి పోలీస్‌లు కాల్పులను జరిపారు. ఆవేశంతో ముందిపడి, జనం ఎదురు కాల్పులను జరిపారు. కార్మికులు కోసక్‌ల సహాయాన్ని అర్థించారు. కోసక్‌లు ప్రజలకు మద్దతు ఇవ్వడంతో, అధికారులు తీవ్ర ఆందోళన చెందారు.

కోసక్‌లు ప్రజలకు మద్దతు ఇవ్వడంతో, పోలీస్‌లు పారిపోయి దాక్కున్నారు. ప్రజలు పోలీస్‌లపై తిరగబడ్డారు. కాని, సైనికులతో సత్సంబంధాలను పెంపొందించుకోడానికి కృషి చేశారు. కార్మికులకు ఆయుధాలను ఇచ్చేకంటే, సైనికులను తమ వైపు తిప్పుకోవడానికి పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి.

మార్చి 8,9,10, తేదీల సంఘర్షణ ఫలితంగా,డ్యూమాకు (Duma) బాధ్యత వహించే మంత్రి వర్గాన్ని ఏర్పాటు చెయ్యాలని సభ్యులు గట్టిగా హెచ్చరించారు. ఈ సభ్యుల ఉపన్యాసాలను ప్రజలు ఏమీ పట్టించుకోలేదు. మార్చి 10న సార్వత్రిక సమ్మె మొదలైంది. అందువల్ల,వార్తాపత్రికలు వెలువడలేదు.

సైనికుల మద్దతును పొందడానికి విప్లవకారులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ కృషిలో మహిళా కార్మికులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. చిట్టచివరకు వారి కృషి ఫలించింది. చైతన్యవంతులైన కార్మికులు చాలా మంది సైన్యంలో చేరారు. పెట్రోగ్రాడ్‌లో ప్రభుత్వముంచిన సైనికులు యుద్ధ రంగంలోని బీభత్సాన్ని చూచి తిరిగివచ్చారు. అందువల్ల, వారు యుద్ధ రంగానికి తిరిగి వెళ్లడానికి ఇష్టపడలేదు. విప్లవం విఫలమైతే, సైనికాధికారులకు తమను సైనిక న్యాయస్థానాల్లో విచారణ జరిపి, కాల్చేస్తారని తెలుసు. అందువల్ల, ప్రజలు తమ మద్దతును కోరినా, కొంత కాలం వరకు తటస్థంగా ఉండి, పరిస్థితిని గమనించాలని సైనికులు అనుకున్నారు. కార్మికులు పూర్తిగా విజయం సాధించాలనే దృఢ సంకల్పంతో వ్యవహరిస్తున్నారనే నమ్మకం కుదిరిన తర్వాతే, సైనికులు రంగంలోకి దిగడానికి సిద్ధపడ్డారు.

పెట్రోగ్రాడ్‌లోని ఉన్నతాధికారులు అల్లర్లను అణచడానికి అదనపు సైనిక దళాలను పంపమని జార్‌కు

BRAOU

ఓటి(గామిచ్చారు. అల్లర్లను అణచివేయాలని పెట్రోగ్రాడ సైనిక గవర్నర్ ఖబలోవ్‌ను, మార్చి 10న జార్ ఆదేశించాడు. హెచ్చరిక చేసిన తర్వాత కూడా జనం కదలకపోతే కాల్పులను జరపాల్సిందని, సైనిక గవర్నర్ ఆదేశాలను జారీ చేశాడు. సైనిక సహాయంతో విప్లవోద్యమాన్ని అణచివేయవచ్చని అధికారులనుకున్నారు. కాని, సైనికులు తిరుగుబాటు చేస్తే ఏమవుతుందో అని, ఎవరూ ఆలోచించలేదు.

ప్రజలు విప్లవోద్యమాన్ని విజయవంతం చేయడానికి సిద్ధపడ్డారని నమ్మగానే, బోల్షివిక్, మెన్షివిక్, సోషలిస్ట్, రివల్యూషనరీ పార్టీ నాయకులు, ప్రదర్శనలకు నాయకత్వం వహించడానికి ముందుకురికారు. ఈ పార్టీల నాయకులు ఒక కమిటీగా ఏర్పడి, మూడు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చారు. మార్చి 10వ తేది రాత్రే, షుమారు 100 మంది కార్మిక నాయకులను ప్రభుత్వం నిర్బంధించింది. కార్మికులు మూడు రోజుల లోపల (సార్వత్రిక సమ్మె ముగియగానే) వచ్చి ఫ్యాక్టరీల్లో పనుల్లో చేరాలని గవర్నర్ ఆదేశించాడు.

మార్చి 11 ఆదివారం నాడు, ప్రజలు పెట్రోగ్రాడ్‌లోని పోలీస్ స్టేషన్లను ధ్వంసం చేశారు. ఆయుధాలు, రివాల్వర్లు, రైఫిళ్లు, మందుగుండు సామాగ్రిని, ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. సంఘర్షణలో చనిపోకుండా మిగిలిన పోలీస్‌లు పలాయనం చిత్తగించి దాక్కున్నారు. ఆ రోజు ఆదివారం కావడంవల్ల ఫ్యాక్టరీలను మూసివేశారు. నగరంలో గుమికూడిన కార్మికులపై వోలిన్‌స్కీ పటాలం (Volinsky Regiment) లో శిక్షణ పొందుతున్న సైనికులు కాల్పులను జరిపారు. ఈ కాల్పులను కొందరు చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. అమాయకులు, నిరాయుధులైన ప్రజలపై కాల్పులు జరపవద్దని, సైనికులను ప్రజలు అర్థించారు. మార్చి 11 సాయంత్రం పావ్‌లావ్‌స్కీ (Pavlovsk) రెజిమెంట్‌లోని ఒక కంపెనీ తిరుగుబాటు చేసింది. వెంటనే ప్రభుత్వం ఇతర సైనిక దళాల సహాయంతో తిరుగుబాటును అణచివేసి, తిరుగుబాటు నాయకులను నిర్బంధించింది.

మార్చి 11 సాయంత్రం ప్రభుత్వం డ్యూమాను రద్దు చెయ్యాలని నిర్ణయించింది. డ్యూమా అధ్యక్షుడు రాడ్జియాంకో, పరిస్థితి చెయ్యిదాటిపోతోందని హెచ్చరిక చేస్తూ,జార్‌కు చాలా సందేశాలను, పంపించాడు. కాని, జార్ ఈ హెచ్చరికను కూడా పెడచెవిని పెట్టాడు.

మార్చి 11 రాత్రి పెట్రోగ్రాడ్ నగరంలో సైనికులుండే ప్రాంతాల్లో విస్తృతంగా చర్చలు జరిగాయి. సైనిక దళాలను తమ వైపుకు తిప్పుకోడానికి కార్మికులు ఎంతో కృషి చేశారు. కార్మికులు తమకు సైనిక దళాల మద్దతు లభిస్తుందని ఎంతో ధైర్యంగా ఉన్నారు.

మార్చి 12 ఉదయం వేలాది కార్మికులు మాస్కో రెజిమెంట్ బారక్స్ (Barracks) వెలుపల, సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సైనికాధికారులు మర ఫిరంగులతో కాల్పులను జరిపారు. కార్మికులు చెల్లా చెదరైపోయారు. అదే సమయంలో, వోలిన్‌స్కీ రెజిమెంట్ తిరుగుబాటు చేసింది. టిమాఫియేవ్ కిర్‌పిచ్నికోవ్ (Timafeyev Kirpchnikov) అనే సార్జెంట్, ముందు తన కంపెనీని, తర్వాత రెజిమెంట్‌నీ, విప్లవానికి మద్దతు ప్రకటించేటట్లు చేశాడు. కొందరు అధికారులను సైనికులు కాల్చి చంపారు. వోలిన్‌స్కీ రెజిమెంట్ సైనికులు వీధుల్లోకి వచ్చి, మిగిలిన రెజిమెంట్లలోని సైనికులను తమతో సహకరించమని కోరారు. విప్లవ గీతాలను పాడుకుంటూ, సైనికులు నగర వీధుల్లో ఊరేగింపును జరిపారు. ప్రయోబ్రెజెన్‌స్కీ రెజిమెంట్ (Preobrazensky Regiment), లిటావ్‌స్కీ రెజిమెంట్ (Litovski Regiment), మాస్కో రెజిమెంట్ కూడా, విప్లవంలో చేరాయి. సైనికులు జార్ అధికారులను కాల్చి చంపేశారు. అధికారులు తమ సైనిక చిహ్నాలను విసిరేసి, పారిపోయి దాక్కున్నారు.

విప్లవ నినాదాలతో సైనిక శకటాలు నగర వీధుల్లోకి దూసుకు వచ్చాయి. కార్మికులు పోలీస్‌ల వద్దనుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో, సైనిక దళాల సహాయంతో, పోలీస్ స్టేషన్లను ముట్టడించి, పీటర్ పాల్ కోట వద్దకు వెళ్లారు. సైనికాధికారులను చంపబోమని హామీయిచ్చిన తర్వాత, పీటర్ పాల్ కోట విప్లవకారులకు లొంగిపోయింది. విప్లవకారులు పెట్రోగ్రాడ్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు.

BRAOU

మార్చి 12 న తిరుగుబాటును అణచడానికి జార్ జనరల్ ఐవనోవ్‌ను యుద్ధ రంగం నుండి పంపించాడు. అప్పటికే పరిస్థితి పూర్తిగా చేయిదాటిపోయిందని, ఖాబలోవ్ తెల్పడంతో, ఐవనోవ్ పెట్రోగ్రాడ్‌కు వచ్చే ప్రయత్నాన్ని విరమించుకొని, వెనక్కి వెళ్లిపోయాడు. విప్లవం మొదలైన కొద్ది గంటల్లోనే, ఉన్నతాధికారులు సైన్యాన్ని వదిలేశారు. తనకు విధేయులుగా ఉన్న కొద్దిమంది సైనికులతో, ఖాబలోవ్ వింటర్ ప్యాలెస్‌లో దాక్కున్నాడు. రాజధానిని విప్లవకారులు స్వాధీనం చేసుకున్నారు. మూడు శతాబ్దాలు నిరంకుశంగా రష్యాను పరిపాలించిన రోమ్‌నావ్ రాజవంశాన్ని, సైనికులు, కార్మికులు కూలదోశారు. కాని, విప్లవోద్యమంలో పాల్గొన్న ప్రజలు, ఎలాంటి కొత్త పరిపాలనా వ్యవస్థను నెలకొల్పాలో, ఆలోచించ లేదు.

## 20.4 : తాత్కాలిక కమిటీ స్థాపన: పెట్రోగ్రాడ్ సోవియట్ ఆవిర్భావం

ప్రభుత్వం డ్యూమాను రద్దుచేసిన తర్వాత, సభ్యులు జార్ ఆదేశాలను ధిక్కరించి విప్లవోద్యమానికి నాయకత్వం వహించడానికి ముందుకు రాలేదు. రాజధాని విప్లవకారుల స్వాధీనమైన తర్వాత, డ్యూమా సభ్యులు టారిడ్ భవనం లో ఒక తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో తీవ్రవాద భావాలను సమర్థించే మితవాద పార్టీలకు (Rightists), బోల్షివిక్ లకు తప్ప, అన్ని యితర పార్టీలకు ప్రాతినిధ్యమిచ్చారు. పెట్రోగ్రాడ్ లో శాంతి భద్రతలను కాపాడ్డం, ఇతర ప్రజా సంస్థలతో సంబంధాలను పెంపొందించుకోడం, ఈ కమిటీ ముఖ్య కర్తవ్యం. ఈ కమిటీలో పాల్ మిల్యుకోవ్, మైఖేల్ రాడ్జియాంకో, అలెగ్జాండర్ గూచ్‌కోవ్‌లు, ముఖ్య నాయకులు.

ఆరోజునే ( మార్చి 12), టారిడ్ భవనంలోనే మరోవైపు, పెట్రోగ్రాడ్ సోవియట్ తిరిగి ఆవిర్భవించింది. ఈ సోవియట్‌లో బోల్షివిక్‌లు, మెన్షివిక్‌లు, సోషలిస్ట్ రివల్యూషనరీలు సభ్యులు. జైలునుండి విడుదలైవచ్చిన యుద్ధ పరిశ్రమల కమిటీల్లోని కార్మిక వర్గం (Labour group of the War Industries Committee); డ్యూమా లోని ప్రగతి విధానాలను అనుసరించే డెప్యూటీలు, సోవియట్ కార్మిక డెప్యూటీల తాత్కాలిక కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 250 మంది ప్రతినిధులు ఫ్యాక్టరీల నుండి, సైనిక దళాల నుండి, ఆరోజు సాయంత్రం జరిగిన సమావేశానికి హాజరయ్యారు. కార్మిక, సైనిక ప్రతినిధులతో, సమైక్య సంఘటిత వ్యవస్థను " Soviet of Workers and Soldiers Deputies " ఏర్పాటు చేశారు. కార్మికులు , సైనికులు, డ్యూమాను నమ్మలేదు. అందువల్ల, వీరు సోవియట్ ఆదేశాలను మాత్రమే అమలు జరపాలని నిర్ణయించారు. మార్చి 12 సాయంత్రానికే , ఆహార , సైనిక సమస్యలను పరిష్కరించడానికి, సోవియట్ ప్రత్యేక కార్యనిర్వాహక వర్గాలను ఏర్పాటు చేయడమైంది.

పెట్రోగ్రాడ్‌లోని విప్లవాన్ని సమర్థించే సైనిక దళాలు, విప్లవ గీతాలను పాడుకుంటూ, టారిడ్ భవనం వద్దకు వచ్చారు. ఈ భవనం విప్లవానికి కేంద్ర స్థానమైంది. డ్యూమా లోని మెజారిటీ సభ్యులు – కేడెట్ పార్టీవారు , ఉదార వాదులు –విప్లవం ప్రజ్వరిల్లగానే విపరీతంగా భయపడ్డారు. విప్లవం వల్ల అరాచకత్వం విజృంభించి, తమ పదవులు పోతాయని భయపడి, రాజ్యాంగబద్ధ రాజరిక సూత్రాన్ని (Constitutional Monarchy) కాపాడాలని భావించారు.

### 20.4.1 విప్లవాన్ని అణచడానికి జార్ చేసిన ప్రయత్నాలు

తన కుటుంబ సభ్యులను కలుసుకోవడానికి, జార్ మార్చి 13న ప్రత్యేక రైల్లో బయల్దేరాడు. కానీ, రైల్వే కార్మికులు రైలును మళ్లించి, జార్‌ను పెట్రోగ్రాడ్‌లో అడుగుపెట్టనివ్వలేదు. సాధారణ రోడ్డు " పావులతో 'విప్లవం' రాజును తోసి రాజనిందని, (With its simple rail road pawns, the Revolution had cried 'Check' to the king) ట్రాట్స్కీ అన్నాడు

1789 లో పారిస్, విప్లవానికి ప్రధాన కేంద్రమైనట్లే, 1917 లో పెట్రోగ్రాడ్ విప్లవానికి ప్రధాన కేంద్రమైంది. దేశం నలుమూలలా విప్లవోద్యమం ప్రజ్వరిల్లి, విజయవంతమైంది. విప్లవకారులు మాస్కోను మార్చి 14న ఆక్రమించుకున్నారు. చాలా నగరాల్లో విప్లవకారులు నియమించిన కమిటీలు అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాయి. ఈ కమిటీల్లో సైనికులకు ఎక్కువ స్థానాలు లభించాయి. దేశంలో ఎక్కువ హింస జరగకుండానే, విప్లవ విజయం సాధ్యమైంది.

జార్ రెండో నికలస్ మార్చి 15 వరకు పెట్రోగ్రాడ్‌ను స్వాధీనం చేసుకోడానికి కొత్త సైన్యాలను పంపించాడు. కాని, ఆ సైన్యాలు విప్లవకారులతో కలసిపోయాయి. జార్ మార్చి 15 తర్వాత కొత్త సైన్యాలను పంపలేదు.

## 20.4.2 : తాత్కాలిక ప్రభుత్వ స్థాపన : జార్ రెండో నికలస్ రాజ్య పరిత్యాగం

నగరాల్లో కేంద్ర ప్రభుత్వ అధికారం పూర్తిగా నశించింది. పెట్రోగ్రాడ్‌లో తాత్కాలిక కమిటీ కార్యనిర్వాహణ అధికారాన్ని చెలాయించింది. పెట్రోగ్రాడ్ సోవియట్‌కు సైనిక దళాల మద్దతు ఉండడం వల్ల, చాలా బలమైన వ్యవస్థగా రూపొందింది. సోవియట్ దినపత్రిక ఇజ్వెస్టియా(Izvestia) లో, ఈ విషయంపై చాలా ఆదేశాలను ప్రకటించింది. సోవియట్ కార్యనిర్వాహక వర్గంలో మెన్షివిక్‌లదే మెజారిటీ. వారు ఈ విప్లవం బూర్జువా విప్లవమని, ప్రజాస్వామిక పెట్టుబడిదారీ రిపబ్లిక్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. విప్లవ కార్యక్రమాలను అమలు జరపడాన్ని, డ్యూమాలోని సోషలిస్టేతర ఉదార పార్టీల (Non-Socialist Liberal Parties) కు వదిలివెయ్యాలని భావించారు.

సోవియట్ ప్రభుత్వంలో పాల్గొనకుండా విప్లవాన్ని కాపాడాలని, కార్యనిర్వాహక వర్గంలోని అత్యధిక సంఖ్యాకులు నమ్మారు. బోల్షివిక్‌లు, సోషలిస్టుల నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కానీ, వారికి సోవియట్ కార్యనిర్వాహక వర్గంలో ఎక్కువ పలుకుబడి లేదు.

డ్యూమా తాత్కాలిక కమిటీ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి పెట్రోగ్రాడ్ సోవియట్ మద్దతును కోరింది. మిల్యుకోవ్ తాత్కాలిక కమిటీ తరపున సంప్రదింపులు జరిపి, సోవియట్‌తో ఒప్పందానికి వచ్చాడు. ఈ ఒప్పందం ప్రకారం, డ్యూమా తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏరాటు చేస్తుంది. సోవియట్ ప్రభుత్వంలో పాల్గొనదు. ఎన్నికలు జరిగిన తర్వాత కొత్త రాజ్యాంగ పరిషత్తు ఏర్పడి, ప్రభుత్వ వ్యవస్థ స్వరూపాన్ని నిర్ణయించే వరకు, తాత్కాలిక ప్రభుత్వం పరిపాలిస్తుంది. తాత్కాలిక ప్రభుత్వం సివిల్ హక్కులను వెంటనే అమలు జరపడానికీ, స్థానిక స్వపరిపాలనకు ఎన్నికలు జరపడానికి సమ్మతించింది. జాతి, మత, వర్గ భేదాలను చట్టరీత్యా తొలగించడానికి ఒప్పుకుంది. పెట్రోగ్రాడ్‌లోని విప్లవ సైనికుల మద్దతుపై సోవియట్ బలం ఆధారపడ్డంవల్ల, వారిని పెట్రోగ్రాడ్ నగరం నుండి ఇతర ప్రాంతాలకు తరలించకుండా ఉండడానికి, మిల్యుకోవ్ ఒప్పుకున్నాడు. యుద్ధం కొనసాగింపు గురించి, వ్యవసాయ సంస్కరణల గురించి, ఏ ఒప్పందం కుదరలేదు. ఈ సమస్యలపై చర్చను వాయిదా వేశారు.

పట్టువిడువని విక్రమార్కుడిలా, జార్ రెండో నికలస్ సింహాసనాన్ని కాపాడడం కోసం, చివరి వరకు ప్రయత్నించాడు. 1917 మార్చి 15న చిట్ట చివరకు తన సోదరుడైన గ్రాండ్ డ్యూక్ మైఖేల్‌కు అనుకూలంగా, రాజ్య పరిత్యాగం చేశాడు. కాని, గ్రాండ్ డ్యూక్ మైఖేల్ రాజ్యాన్ని తిరస్కరించాడు. ఈ విధంగా రోమనావ్ రాజవంశం అధికారాన్ని కోల్పోయింది.

రాజ్య పరిత్యాగం చేసిన కొద్ది రోజుల తర్వాత, నికలస్ జారిట్సాను, ఇతర కుటుంబ సభ్యులను కలుసుకున్నాడు. మూడు రోజుల తర్వాత పెట్రోగ్రాడ్ సోవియట్ ఒత్తిడి చెయ్యడం వల్ల, తాత్కాలిక ప్రభుత్వం నికలస్‌ను, ఇతర కుటుంబ సభ్యులను గృహ నిర్బంధంలో ఉంచింది. ఇంగ్లాండ్‌లో నికలస్ కు ఆశ్రయం లభించింది. కొంత కాలం తర్వాత, నికలస్ ను ఇంగ్లాండ్‌కు పంపేయవచ్చని తాత్కాలిక



BRAOU

ప్రభుత్వం భావించింది.

1917 మార్చి 16న తాత్కాలిక ప్రభుత్వం ప్రధాన మంత్రి జార్జ్ ల్వావ్ (George Lvov)నాయకత్వంలో ఏర్పడింది. అలెగ్జాండర్ గుచ్ కోవ్ యుద్ధ మంత్రి. పాల్ మిల్యుకోవ్ విదేశాంగ మంత్రి. అలెగ్జాండర్ కెరెన్ స్కీ న్యాయ శాఖా మంత్రి.

సోవియట్ సభ్యులు కొత్త ప్రభుత్వంలో పాల్గొనకూడదని, సోవియట్ కార్య నిర్వాహక కమిటీ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని లక్ష్యపెట్టక, కెరెన్ స్కీ మంత్రివర్గంలో చేరాడు. పాత ప్రభుత్వ ప్రతినిధులకు పూర్తి స్వేచ్ఛ నివ్వకూడదని, అందువల్లే తాను మంత్రి వర్గంలో చేరానని ప్రకటించాడు. ప్రవాసంలోనున్న బోల్షివిక్ డెప్యూటీలను స్వదేశానికి రప్పిస్తానని ప్రకటించి, కెరెన్ స్కీ ప్రభుత్వంలో చేరాడు.

ఈ విధంగా మార్చి విప్లవ ఫలితంగా, జారిస్ట్ నియంతృత్వం పతనమై, డ్యూమా తాత్కాలిక కమిటీ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పర్చింది. ఈ ప్రభుత్వాన్ని పెట్రోగ్రాడ్ సోవియట్ సహించింది.

## 20.5. : అక్టోబర్ (నవంబర్) విప్లవానికి దారితీసిన సంఘటనలు : బోల్షివిక్ విప్లవం

జార్ వింటర్ ఫాలెస్ (Winter Palace) పై ఎర్ర జెండా రెపరెపలాడింది. పెట్రోగ్రాడ్ నగరంలోని ప్రశాంత వాతావరణం తీవ్రమైన తుఫాను మొదలయ్యే ముందుండే ప్రశాంతతలా ఉంది.

తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు మధ్య తరగతి ఉదారవాదానికి ప్రాతినిధ్యం వహించారు. యుద్ధాన్ని కొనసాగించాలని వారు భావించారు. సామాజిక విప్లవాన్ని వ్యతిరేకించారు. తాత్కాలిక ప్రభుత్వంలో కెరెన్ స్కీ తప్ప, తక్కిన వాళ్లంతా ఉన్నత వర్గాలకు చెందినవారు . తాత్కాలిక ప్రభుత్వం పెట్రోగ్రాడ్ సోవియట్ మద్దతు లేకపోతే కొనసాగలేదు.

మార్చి విప్లవం తర్వాత, ద్వంద్వాధికారం మొదలైంది. సైనికులు యుద్ధ రంగం నుండి వెనక్కి వచ్చేశారు. యుద్ధ రంగంలో జర్మన్లతో మైత్రి చేసుకున్నారు. ఆ సైనికుల దృష్టిలో యుద్ధం ముగిసింది. సోవియట్ లో సైనికుల ఒత్తిడివల్ల, సోవియట్ మొదటి ఆదేశాన్ని (Order No. 1) ప్రకటించింది. ఈ ఆదేశం ప్రకారం, అధికారులు సైనికుల పట్ల మర్యాదతో ప్రవర్తించాలి. సోవియట్ ఆదేశాలను అన్ని సైనిక దళాలు విధిగా అమలు జరపాలి. తాత్కాలిక ప్రభుత్వ ఉత్తర్వులు, సోవియట్ ఆదేశాలతో ఘర్షణ లేనప్పుడు మాత్రమే, అమలు జరుగుతాయి. సోవియట్ ఆదేశాన్ని తాత్కాలిక ప్రభుత్వం గత్యంతరం లేక అంగీకరించింది.

తాత్కాలిక ప్రభుత్వాన్ని బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు గుర్తించాయి. ఈ ప్రభుత్వం రాజకీయ సంస్కరణలను అమలు జరపాలని, శాంతిభద్రతలను కాపాడాలని, మిత్రరాజ్యాలతో కలిసి జర్మనీపై యుద్ధాన్ని కొనసాగించాలని అనుకుంది.

### 20.5.1.: తాత్కాలిక ప్రభుత్వం, పెట్రోగ్రాడ్ సోవియట్ల విభేదాలు: ఏప్రిల్–5 ప్రదర్శన

తాత్కాలిక ప్రభుత్వం మిత్ర రాజ్యాలతో స్నేహంగా ఉండి, జర్మనీతో యుద్ధాన్ని కొనసాగించాలని నిర్ణయించింది. జార్ ప్రభుత్వం మిత్ర రాజ్యాలతో చేసుకున్న రహస్య సంధులను అమలు జరపాలని, తాత్కాలిక ప్రభుత్వం నిశ్చయించింది. దేశంలో శాంతిని పునరుద్ధరించడానికి, విప్లవ ఆవేశాన్ని అదుపు చెయ్యడానికి కృషి చేసింది.

తాత్కాలిక ప్రభుత్వ ఆశయాలకు విరుద్ధంగా విప్లవ ఫలితాలను వెంటనే పొందాలని, సోవియట్ భావించింది. కార్మికులకు 8 గంటల పనిని అమలు పర్చాలని డిమాండ్ చేసింది. రైతులకు వెంటనే

భూమిని పంచిపెట్టాలని కోరింది. జార్ ప్రభుత్వం చేసుకున్న రహస్య సంధులను రద్దు చెయ్యాలని, శాంతిని నెలకొల్పడానికి సంప్రదింపులను జరపాలని కోరింది. సైన్యంలో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలని డిమాండ్ చేసింది.

తాత్కాలిక ప్రభుత్వం విదేశాల్లో ప్రవాసమున్న విప్లవ నాయకులను ఆహ్వానించింది. సివిల్ హక్కులను ప్రకటించింది. రాజకీయ శిక్షలను అనుభవిస్తున్న వారందరిని విడుదల చేసింది. ఫ్యాక్టరీల్లో కార్మికులు 8 గంటలు మాత్రమే పనిచేయాలనే శాసనాన్ని ఆమోదించారు. రాజకీయ రంగం నుండి ప్రగతి నిరోధక పార్టీలు అంతరించాయి. రాజ్యాంగ సభకు ఎన్నికలను జరిపిస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. దేశంలో అశాంతి కొనసాగుతూనే ఉంది.

సైనికులు, రైలు మార్గాలు, వార్తా సదుపాయాలు, సోవియట్ అధీనంలోనే ఉండడం వల్ల, తాత్కాలిక ప్రభుత్వమిచ్చిన ఆదేశాలను సోవియట్ ఆమోదిస్తే తప్ప, అమలు జరగవు. తాత్కాలిక ప్రభుత్వానికి సైనిక దళాల మద్దతు తగ్గిపోయింది. పెట్రోగ్రాడ్ లో ఉన్న 1,60,000 సైనికులు, సైనికాధికారులను ధిక్కరించారు. సైనికులపై క్రమశిక్షణా చర్యలను తీసుకుంటే, సైనిక దళాలు తిరుగుబాటు చేస్తాయని ప్రభుత్వం భయపడింది. సైనికుల కమిటీలకు జరిగిన ఎన్నికల్లో, విప్లవకారులు ఎక్కువ మంది గెలిచారు. సైనిక దళాల్లో తిరుగుబాటుతత్వం ప్రబలింది.

విప్లవోద్యమంలో ప్రాణాలను ధారవోసిన కార్మికులకు, సైనికులకు శ్రద్ధాంజలి ఘటించడానికి, ఏప్రిల్ 5న పెట్రోగ్రాడ్ లో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు -10 లక్షల మంది-బ్రహ్మాండమైన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శన రష్యా చరిత్రలో మహత్తర సంఘటన. సర్వమానవ సమానత్వానికి ఒక చిహ్నం.

### 20.5.1.1 : రాజకీయ ఖైదీల విడుదల

తాత్కాలిక ప్రభుత్వం అధికారాన్ని స్వీకరించగానే, జైళ్లలో నుండి రాజకీయ ఖైదీలను విడుదల చేసి, ప్రవాసంలో ఉన్న రాజకీయ నాయకులను తిరిగి రమ్మన్నది. మాస్కో జైలు నుండి ఫెలిక్స్ జెర్ఝిన్‌స్కీ (Felix Zherzhinsky), సైబీరియా నుండి బోల్షివిక్ లు -స్టాలిన్, లయో కామెనీవ్-విడుదలయ్యారు. పశ్చిమ ఐరోపా నుండి క్రోపోట్కిన్, ప్లెఖనోవ్, బ్రెష్ కోవ్‌స్కాయాలు - అమెరికా నుండి ట్రాట్స్కీ, నికలస్ బుఖారిన్ లు రష్యాకు తిరిగి వచ్చారు.

### 20.5.2 : తాత్కాలిక ప్రభుత్వం పట్ల లెనిన్ దృక్పథం

మార్చి విప్లవం జరిగినప్పటికి, లెనిన్ వయస్సు 47 సంవత్సరాలు. స్విట్జర్లాండ్ లోని జ్యూరిచ్ నగరంలో భార్య కృప్‌స్కాయాతో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. లైబ్రరీలో పుస్తకాలను చదవడం, ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ చాలా సేపు నడవడం, చాలా ఉత్తరాలు ,కరపత్రాలను రాయడం, ఆయన దిన చర్య. విదేశీ వార్తాపత్రికల ద్వారా, రష్యాలో జరుగుతున్న సంఘటనలను లెనిన్ అర్థం చేసుకున్నాడు. కొత్త ప్రభుత్వంలోని వైరుధ్యాలనువెంటనే గ్రహించాడు. తాత్కాలిక ప్రభుత్వం కానీ, ఆ ప్రభుత్వాన్ని సమర్థించిన సోవియట్ మద్దతుదారులు కాని, దేశానికి శాంతిని, ప్రజలకు జీవితావసరాలను సమకూర్చలేరని ప్రకటించాడు. అలా సమకూర్చడానికి ప్రయత్నిస్తే, ప్రభుత్వం లోని భాగస్వాములైన పారిశ్రామిక వేత్తలతో, భూస్వాములతో సంఘర్షణ తప్పదని, ప్రకటించాడు. రష్యన్లు పెట్రోగ్రాడ్ సోవియట్ ను పూర్తిగా సమర్థించాలని ప్రకటించాడు. పోలీస్‌ల స్థానంలో 'పీపుల్స్ మిలీషియా' (People s Militia) ను ఏర్పాటు చేయాలని సూచించాడు. మిత్ర రాజ్యాలతో జారిస్ట్ రష్యా చేసుకున్న సంధులను పెట్రోగ్రాడ్ సోవియట్ బహిరంగం చేయాలని, జర్మనీతో

BRAOU

వెంటనే శాంతిని కుదుర్చుకోవాలని ప్రకటించాడు. సకల దేశాల శ్రామికుల నుద్దేశించి, ప్రావ్దా పత్రికలో లెనిన్ ఇలా రాశాడు :" యుద్ధాన్ని అంతం చేయండి, దోపిడీ ప్రభుత్వాలను కూలదొయ్యండి". లెనిన్ రచనల ప్రభావం రష్యా ప్రజలపై ఎక్కువైంది. ఎలాగైనా రష్యా తిరిగివచ్చి విప్లవ పోరాటంలో పాల్గొనాలని, ఎంతో ఉవ్విళ్ళూరాడు లెనిన్.

## 20.5.2.1 : రష్యాకు తిరిగి లెనిన్ రాక : స్వాగత సత్కారాలు

జర్మనీ ప్రభుత్వం లెనిన్, అతని సహచరులు - భార్య కృప్‌స్కాయా, కార్ల్ రాడెక్ (Karl Radek), గ్రెగరీ జినోవీవ్ (Gregory Zinoviev) లు- జర్మనీ గుండా రష్యాకు ప్రత్యేక జర్మన్ రైల్లో వెళ్లడానికి అంగీకరించింది. ఏప్రిల్ 9న ప్రత్యేక రైలు జ్యూరిచ్‌ను వదిలింది. లెనిన్ ప్రయాణం చేస్తున్న ప్రత్యేక రైలు, ఏప్రిల్ 16 రాత్రి పెట్రోగ్రాడ్ ఫిన్‌లాండ్ స్టేషన్‌కు చేరింది. బోల్షివిక్ నాయకులు, తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులు, సోవియట్ ప్రతినిధులు లెనిన్‌కు స్వాగతమిచ్చారు.

స్వాగతోపన్యాసానికి జవాబు చెప్తూ," ప్రియమైన కామ్రేడ్స్! సైనికులారా! నావికులారా ! కార్మికులారా ! విజయాన్ని సాధించిన రష్యన్ విప్లవానికి అభివాదం చెయ్యడానికి ఎంతో సంతోషిస్తున్నా. అంతర్జాతీయ కార్మికోద్యమ సైన్యంలో మొదటి దళంగా మిమ్మల్ని అభినందిస్తున్నా. సామ్రాజ్యవాద యుద్ధంవల్ల ఐరోపాలో అంతర్యుద్ధం మొదలౌతుంది. పెట్టుబడి దారులపై ప్రజలు తిరగబడే దినం, దగ్గరలోనే ఉంది. అంతర్జాతీయ సాంఘిక విప్లవం వర్థిల్లాలి!" అని ముగించాడు. అంతర్జాతీయ సోషలిస్ట్ విప్లవం ద్వారా, యుద్ధాన్ని అంతం చెయ్యాలని లెనిన్ ఉద్బోధించాడు. బోల్షివిక్ ప్రధాన కేంద్రం నుండి లెనిన్ రెండు సార్లు మాట్లాడేవరకు, అక్కడ గుమికూడిన ఇసకవేస్తేరాలని జనం, కదల్లేదు.

Lenin's reply to the welcome address at Finland Station

"Dear Comrades, Soldiers, Sailors and Workers; Iam happy to greet in you the Victorious Russian Revolution and also to greet you as the advance guard of the International Proletarian army...... The war of imperialist brigandage is the begining of Civil War in Europe........ The Russian Revolution you have accomplished has dealt it the first blow, and has opened a new epoch..... Long live the International Social Revolution "

**– *LENIN***

BRAOU

## 20.5.2.2 : ఏప్రిల్ థీసెస్ (April Theses)

బోల్షివిక్ పార్టీ కేంద్ర కార్యాలయంలో సహచరులనుద్దేశించి మాట్లాడుతూ, లెనిన్ తాత్కాలిక ప్రభుత్వాన్ని గర్హించాడు. సంస్కరణలను సమర్థిస్తూ, సోవియట్ చేసిన ప్రతిపాదనలను తిరస్కరించాడు. సోవియట్‌ను సమర్థించిన బోల్షివిక్‌లను నిందించాడు. పార్లమెంటరీ రిపబ్లిక్ అవసరం లేదని, బూర్జువా ప్రజాస్వామ్యం అవసరంలేదని, సోవియట్ కార్మికుల, కర్షకుల, సైనికుల ప్రభుత్వం తప్ప, ఏ యితర ప్రభుత్వం అవసరం లేదని ఖచ్చితంగా చెప్పాడు. లెనిన్ రష్యాకు తిరిగి వచ్చిన తర్వాత, బోల్షివిక్‌ల దృక్పథంలో, కార్యక్రమాల్లో గణనీయమైన మార్పు వచ్చింది.

లెనిన్ '1905 విప్లవం' గుణపాఠాలు (అనుభవం) మొదటి ప్రపంచ యుద్ధం, 1917 మార్చి విప్లవం, మొదలైన సంఘటనలను మార్క్సిస్ట్ దృక్పథంతో నిశితంగా పరిశీలించాడు. పెట్టుబడిదారీ సమాజం ప్రపంచమంతటా చివరి దశకి, చేరిందని, అదే సామ్రాజ్యవాదమని (Imperialism), సామ్రాజ్యవాదం వల్లనే ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లిందని, సామ్రాజ్యవాద దేశాలు ఏర్పర్చుకున్న సైనిక కూటాల మధ్య ప్రపంచాన్ని తిరిగి పంచుకోడానికే ఈ సంఘర్షణ జరిగిందని, లెనిన్ గాఢంగా నమ్మాడు. ఈ యుద్ధం వల్ల ప్రపంచమంతా

రగుల్కొంటుందని, విప్లవానికి మార్క్సిస్ట్ సోషలిస్ట్‌లు నాయకత్వం వహిస్తారని, కార్మికులు, పేద రైతుల సహాయంతో విప్లవాన్ని నిర్వహిస్తారని అభిప్రాయపడ్డాడు. మార్చి విప్లవం, విప్లవంలో మొదటి ఘట్టమని, అదే బూర్జువా ఘట్టమని తెలిపాడు. రెండో ఘట్టంలో తాత్కాలిక ప్రభుత్వం నుండి కార్మికులకు, కర్షకులకు, సైనికులకు ప్రాతినిధ్యం వహించిన సోవియట్ లకు అధికార మార్పిడి జరుగుతుందని, సోవియట్లు సామాన్య ప్రజానీక కోర్కెలను (శాంతి, తిండి, స్వేచ్ఛలను) ప్రజలకు లభించేటట్లు ప్రయత్నిస్తాయని చెప్పాడు. విప్లవ రెండో ఘట్టంలో, సోషలిజం రాదు, కాని కొంత పురోగమనం సాధించవచ్చునన్నాడు. ఈ రెండో ఘట్టంలో భూస్వాముల ఎస్టేట్‌లను బలవంతంగా స్వాధీనం చేసుకోడం, అన్ని రకాల భూమిని జాతీయం చేసి రైతులకు పంచిపెట్టడం, బ్యాంకుల జాతీయీకరణ జరగాలని, పరిపాలనాయంత్రాంగాన్ని, పోలీస్‌లను రద్దు చేసి, ఎన్నికలద్వారా అధికారులను నియమించవచ్చని, ప్రజా సైన్యాన్ని (people's militia) ఏర్పాటు చేయవచ్చని లెనిన్ సూచించాడు. ఈ పరిశీలన రష్యన్ విప్లవ గమనాన్ని ప్రభావితం చేసింది. దీన్నే ఏప్రిల్ థీసెస్ (April Theses) అంటారు.

Brief Summary of Lenin's April Theses

Lenin's ideas which formed more precise expression in his " April Theses" which called for " No Support to the Provisional Government, explanation of the complete falseness, of all its promises, no parliamentary republic, but a republic, of Soviets, of workers 'Farm hands" and Peasants Deputies in the whole country.... confiscation of all land lord estates, nationalisation of all land with the establshment of a model farm under the control of Soviet Farmhands Deputies on every large estate..... establishment of a Single National Bank...... elimination of the army , police, Official Class...... pay to all officials not above the average earnings of a skilled worker"....

BRAOU

## 20.5.2.3 : లెనిన్ భావాల పట్ల పార్టీ దృక్పథం : లెనిన్‌కు పార్టీ మద్దతు

లెనిన్ వ్యూహ ప్రకారం, బోల్షివిక్ లు రెండో ఘట్టంలో సోవియట్లలో మెజారిటీని సాధించిన తర్వాత, తాత్కాలిక ప్రభుత్వాన్ని తొలగించాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి, మెన్షివిక్ సోషల్ డెమోక్రాట్లతో పూర్తిగా సంబంధాలను తెంచుకోవాలి. ఇలా తెంచుకోడానికే, సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ ( బోల్షివిక్) పేరును, రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీగా మార్చాలన్నాడు. ఈ పార్టీ సరైన నాయకత్వంలో మంచి ప్రచారంతో సోవియట్ల లో మెజారిటని సాధించి, పైన వివరించిన కార్యక్రమాన్ని అమలు జరపాలి. రష్యాలో విప్లవం ఉధృతం కావడంవల్ల ఇతర దేశాల్లో విప్లం రేకెత్తుందని, చిట్ట చివరకు ప్రపపంచమంతటా విప్లవం విజయాన్ని సాధిస్తుందని లెనిన్ నమ్మాడు.

మొదట్లో లెనిన్ భావాలకు పార్టీ వర్గాల్లోనే మద్దతు లభించలేదు. సామాన్య ప్రజానీకం లెనిన్ భావాల వల్ల ప్రభావితులయ్యారు. ఏప్రిల్ చివరి వారంలోనూ, మే మొదటి వారంలోనూ జరిగిన పార్టీ సమావేశాల్లో పార్టీ నాయకులు లెనిన్ కొత్త భావాలను ఆమోదించారు. అప్పుడు బోల్షివిక్ లు తాత్కాలిక ప్రభుత్వాన్ని నాశనం చెయ్యడానికి సిద్ధమయ్యారు.

ప్రజానీకం భావాలను ప్రత్యర్థుల కంటే లెనిన్ సరిగా అర్థం చేసుకున్నాడు. సామాన్య ప్రజల హృదయాల్లోని భావావేశాన్ని అర్థం చేసుకోగల మహా ప్రతిభాశాలి – లెనిన్ అందువల్లే ఎన్నో అడ్డంకులను అధిగమించి చివరకు విజయాన్ని సాధించాడు.

1917 వేసవిలో ఫ్యాక్టరీల నుండి, సైనిక దళాల నుండి, ప్రాంతీయ కాంగ్రెస్‌లకు, సోవియట్లకు జరిగిన ఎన్నికల్లో చాలామంది బోల్షివిక్ లు ఎన్నికయ్యారు.

## 20.5.3 : ఏప్రిల్ దినాలు : మే సంక్షోభం : జూన్ ప్రదర్శనలు

1917 మార్చి విప్లవం జరిగిన తర్వాత, నవంబర్ విప్లవం ప్రజ్వరిల్లే లోపల జరిగిన సంఘటనలను

ఏప్రిల్ దినాలని, మే సంక్షోభమని, జూన్ ప్రదర్శనలనీ, జూలై దినాలని , విప్లవ వ్యతిరేక ఉద్యమమని, రష్యన్ చరిత్రను విభజించొచ్చు.

ఏప్రిల్ దినాల్లో ప్రజలు తాత్కాలిక ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని సహించమని, ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ,ప్రదర్శనలు జరిపారు. జూన్ ప్రదర్శనలు సోషలిస్ట్ పార్టీల బలానికి పరీక్ష.జూలైలో సరైన వ్యూహం లేకుండా, వీధుల్లో అనేక సంఘర్షణలు జరిగాయి. ఈ సంఘర్షణల్లో బోల్షివిక్‌లు ఓడిపోయారు. జూలైలో బోల్షివిక్‌లు అధికారాన్ని స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించారు. అందువల్ల, జారిస్ట్‌లు, మధ్యతరగతి వర్గాలవారు, ప్రతీఘాతుక ఉద్యమం లేకెత్తడానికి కారకులయ్యారు.

## మే సంక్షోభం

ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు, విజయాన్ని సాధించే వరకు యుద్ధాన్ని కొనసాగించాలని, తాత్కాలిక ప్రభుత్వంపై ఒత్తిడిని తెచ్చాయి. పెట్రోగ్రాడ్ -సోవియట్ దేశంలోని సోషలిస్ట్‌లందరూ శాంతి కోసం ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించకుండా, ఏ ప్రాంతాలను ఆక్రమించకుండా సంధి సంప్రదింపులు జరపాలని ఒత్తిడి తెచ్చారు. విదేశాంగ మంత్రి మిల్యుకోవ్‌కు, సోవియట్‌కు మధ్య, రష్యా యుద్ధాన్ని కొనసాగించే విషయంలో, భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. మిల్యుకోవ్ యుద్ధాన్ని కొనసాగించాలని అభిప్రాయపడ్డాడు. ఇతడు ప్రజాభిప్రాయాన్ని సరిగా అర్థం చేసుకోలేదు. యుద్ధాన్ని త్వరలో ముగించాలనే గాయపడ్డ సైనికులు, బ్రహ్మాండమైన ప్రదర్శనలను నిర్వహించారు. కార్మికులు, కర్షకులు, "మిల్యుకోవ్ నశించాలి" అని బిగ్గరగా నినాదాలు చేస్తూ, ప్రదర్శనలు చేశారు.

మే 3న ఫిన్‌లాండ్ పటాలం 25,000 మంది కార్మికులతో కలిసి, టారిడ్ భవనం ముందు విదేశాంగ మంత్రి మిల్యుకోవ్‌ను, యుద్ధ మంత్రి గుచ్‌కోవ్‌ను తొలగించాలని ప్రదర్శనలు జరిపారు. చిట్టచివరకు తాత్కాలిక ప్రభుత్వం నుండి మిల్యుకోవ్‌ను, గుచ్‌కోవ్‌ను కొందరు ఇతర మంత్రులను తొలగించి, కొత్త తాత్కాలిక ప్రభుత్వమేర్పడింది.

ఈ ప్రభుత్వంలో 10 మంది లిబరల్ నాయకులతోపాటు, 6 గురు సోషలిస్ట్ నాయకులు కూడా చేరారు. ఈ మంత్రి వర్గంలో కూడా, ల్వొవ్ (Lvov) ప్రధాన మంత్రిగా కొనసాగాడు. కెరెన్‌స్కీ యుద్ధ శాఖకు, నౌకా శాఖకు మంత్రి అయ్యాడు. తాత్కాలిక ప్రభుత్వంలోని సోషలిస్ట్ రివల్యూషనరీ, మెన్షివిక్ సభ్యులను లెనిన్ దుయ్యబట్టాడు.

మే 17న బ్రిటీష్‌వారు విడుదల చేసిన తర్వాత, ట్రాట్స్కీ పెట్రోగ్రాడ్‌కు తిరిగి వచ్చాడు. పెట్రోగ్రాడ్‌లో లెనిన్‌తోపాటు, చాలా ముఖ్యమైన పాత్రను నిర్వహించాడు.

కొత్త ప్రభుత్వం కూడా యుద్ధం, శాంతి విషయంలో, పాత విధానాలనే అనుసరించింది. దేశంలోని సోవియట్లన్నింటికీ, పెట్రోగ్రాడ్ సోవియట్, కేంద్రస్థానమైంది. పెట్రోగ్రాడ్ సోవియట్, సరైన నాయకత్వాన్ని సమకూర్చడానికి, ఆదేశాలను జారీ చెయ్యడానికి, ఏప్రిల్ నెల్లో 24 గురు సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పర్చింది.

రష్యాలో ఏ పార్టీ కూడా అధికారాన్ని స్వీకరించే స్థితిలో లేదని, చాలా మంది రష్యన్ నాయకులు అనుకున్నారు. కాని, లెనిన్ ప్రభుత్వాధికారాన్ని స్వీకరించడానికి ఏ క్షణాన్నైనా సిద్ధమే అని ప్రకటించాడు. ఈ ప్రకటన లెనిన్ ఆత్మస్థైర్యానికి ఉదాహరణ. కార్మికుల, సైనికుల మద్దతు బోల్షివిక్‌లకు ఉండడంవల్ల, లెనిన్ ఈ ప్రకటన చేశాడు.

జూన్ ప్రదర్శనల్లో బోల్షివిక్ పార్టీ బలపడింది. పెట్రోగ్రాడ్ నగరంపై బోల్షివిక్‌లు అజమాయిషీని సాధించారు.

B R A O U

సంకీర్ణ ప్రభుత్వం ప్రారంభించిన కొత్త ముట్టడి, 15 రోజుల్లోనే పూర్తిగా విఫలమైంది. జర్మన్ సైన్యాలు పురోగమించాయి. పెట్రోగ్రాడ్‌లో కొత్త తిరుగుబాట్లు మొదలయ్యాయి. యుద్ధ రంగంలోని ఓటమికి సోషలిస్ట్ మంత్రులే బాధ్యతను తీసుకోవాలని, మంత్రి వర్గంలోని కేడెట్ పార్టీ మంత్రులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మంత్రుల రాజీనామాను నిరసిస్తూ, ప్రజా ప్రదర్శనలు జరిగాయి. ఈ సంఘటనలనే, జూలై దినాలు లేక జూలై సంక్షోభ (July days or July crisis) మంటారు.

## 20.5.4 జూలై సంక్షోభం

తాత్కాలిక ప్రభుత్వాన్ని తొలగించి, సోవియట్ ప్రత్యక్షంగా పరిపాలనాధికారాలను స్వీకరించాలని కోరుతూ, జూలై 16న వేలాది ప్రజలు ప్రదర్శనలను నిర్వహించారు. ఈ ప్రదర్శన వల్ల ప్రజల కోపోద్రేకాలు, ఆవేశాలు బయటపడ్డాయి. అధికారులకు, కార్మికులకు మధ్య సంఘర్షణలు జరిగాయి. అరాచకత్వం ప్రబలింది. పరిస్థితి చాలా ఉద్రిక్తంగా ఉంది.

జూలై 17న క్రాన్‌స్టాడ్ (Kronstadt) నౌకా స్థావరం వద్దనున్న 6,000 నావికులు, విప్లవోద్యమానికి మద్దతు నివ్వడానికి, నౌకల్లో పెట్రోగ్రాడ్‌కు వచ్చారు. సామాన్య ప్రజలు, సైనిక పటాలాలు టారిడ్ భవనం వైపు పురోగమించాయి. బోల్షివిక్ పార్టీ కార్యాలయం ముందు ఆగిన ప్రజల నుద్దేశించి లెనిన్ మాట్లాడాడు. తొందరపడి ఎలాంటి చర్య తీసుకోవద్దని సలహా యిచ్చాడు. ప్రదర్శకులకూ, తాత్కాలిక ప్రభుత్వాన్ని సమర్థిస్తున్న కోసక్‌లకూ, మధ్య సంఘర్షణ జరిగింది. ఈ సంఘర్షణలో చాలా మంది మరణించారు. ప్రజలు కూడా తీవ్రంగా కాల్పులు జరపగానే, కోసక్‌లు పారిపోయారు.

ఈ సంఘర్షణ తర్వాత, ప్రజలు ఆవేశంతో రెచ్చిపోయారు. పెట్రోగ్రాడ్ నగర వీధుల్లో నెత్తురుటేర్లు ప్రవహించాయి. అమాయకులైన సామాన్య ప్రజలు చాలా మంది మరణించారు.

బోల్షివిక్‌ల ప్రభావం రోజురోజుకు పెరగడంవల్ల, సోవియట్ నాయకత్వం భయపడింది. మధ్యతరగతి ప్రజలు కూడా చాలా ఆందోళన చెందారు. దేశంలో అంతర్యుద్ధం చెలరేగే ప్రమాద మేర్పడింది. యుద్ధ రంగంలో రష్యన్ సైన్యాలు ఓడిపోతూనే ఉన్నాయి. బోల్షివిక్‌లపైన తీవ్రమైన చర్య తీసుకోడానికి, తాత్కాలిక ప్రభుత్వం, సోవియట్ సిద్ధమయ్యాయి.

జూలై 17న ప్రభుత్వం, లెనిన్, ట్రాట్స్కీ, యితర బోల్షివిక్ నాయకులు జర్మన్ ఏజెంట్లని రుజువు చెయ్యడానికి ఆధారాలున్నాయని, పత్రికల్లో కొన్ని పత్రాలను (documents) ప్రచురించింది. ఈ ప్రకటనలను చదివి, మధ్యతరగతివారు, కార్మికులు, సైనికులు కూడా నిర్ఘాంతపోయారు. జర్మనీ యుద్ధ తంత్రంలో బోల్షివిక్‌లు తమను పావులుగా (Pawns) వాడుకున్నారని, ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. బోల్షివిక్ వార్తాపత్రిక "ప్రావ్దా"ను ధ్వంసం చెయ్యడానికి, ప్రభుత్వం అధికారులను పంపింది. కొందరు అధికారులు బోల్షివిక్ పార్టీ కేంద్రకార్యాలయానికి నాయకులను నిర్బంధించడానికి వెళ్లారు. అప్పటికే లెనిన్, జినోవీవ్‌తో కలిసి తప్పించుకొని, ఫిన్‌లాండ్‌లో తలదాచుకున్నాడు.

ట్రాట్స్కీని, ఇతర పార్టీ నాయకులను ప్రభుత్వం నిర్బంధించి, విచారించింది. బోల్షివిక్ పార్టీ వ్యవస్థ ధ్వంసమైంది. బోల్షివిక్ ఆందోళనకారులు తలదాచుకోవాల్సొచ్చింది.

నాల్గు నెల్ల విప్లవం తర్వాత కూడా, కార్మికుల, సైనికుల పరిస్థితిలో మార్పేమీ లేకపోవడంతో, వారు చాలా నిరుత్సాహం చెందారు. ప్రభుత్వంపై తమ కోపాన్ని ప్రదర్శించారు. దీనికంతకూ బోల్షివిక్‌లనుసరించిన జర్మన్ అనుకూల విధానమే, కారణమని ప్రభుత్వం ప్రకటించింది. వారి దేశ ద్రోహ చర్యలే, ప్రజల కష్టాలకు కారణమని చూపించింది. బోల్షివిక్‌లు జర్మన్ ఏజెంట్లని ప్రకటించగానే, సామాన్య ప్రజలు వారిని తీవ్రంగా ద్వేషించారు. తాత్కాలిక ప్రభుత్వం విడుదల చేసిన పత్రాల్లో పూర్తి నిజం లేదని తర్వాత వెల్లడైంది. బోల్షివిక్‌లకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చినవారిలో, చాలా మంది జారిస్ట్ పోలీస్ ఏజెంట్లు. 1917 ఆగస్టులో కెరెన్‌స్కీ ప్రధాన మంత్రి అయ్యాడు. సర్వాధికారాలను చేతిలో పెట్టుకున్నాడు.



BRAOU

## 20.5.5 ప్రతీఘాత విప్లవం (Counter - Revolution)

జార్ అధికారంలో వున్నప్పుడు పనిచేసిన వేలాది ప్రభుత్వాధికారులూ, భూస్వాములూ, పారిశ్రామికవేత్తలూ, ఇతర ప్రగతినిరోధక శక్తులూ, అధికారాన్ని స్వాధీనం చేసుకునే అవకాశం దొరికిందని సంతోషించాయి. కెరెన్‌స్కీ ప్రభుత్వం బోల్షివిక్‌లను అణచివేసే విధానాన్ని అనుసరించింది. సైనిక కమిటీలను రద్దు చేసింది. సైన్యంలో ఉరి శిక్షలను తిరిగి ప్రవేశపెట్టింది. కార్మికులు తమ ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించింది. రైలు మార్గాలను, తదితర రవాణాలను గట్టిగా అదుపు చేస్తానని, కెరెన్‌స్కీ హామీనిచ్చాడు. కోర్నిలోవ్ (Kornilov) ను సర్వసైన్యాధ్యక్షునిగా నియమించాడు. కోర్నిలోవ్ ధైర్యశాలి, సమర్థుడు. కోర్నిలోవ్ ఒక్కడే తమను కాపాడగలడని రష్యన్ ఉదారవాదులు, సాంప్రదాయక వర్గాలు ఆశించాయి.

కెరెన్‌స్కీ పెట్రోగ్రాడ్‌లోని సైనిక దళాలను కావాలని బలహీనపర్చాడు. విప్లవకారుల ఉత్సాహాన్ని తగ్గించవచ్చని భావించి, ఏదో ఒక నెపం మీద వేలాది సైనికులను యుద్ధ రంగానికి బదిలీ చేశాడు. కాని, కెరెన్‌స్కీ అనుసరించిన పద్ధతి వల్ల, యుద్ధ రంగంలో కూడా విప్లవ భావాలు త్వరగా వ్యాపించాయి. కెరెన్‌స్కీ ఆశించింది ఒకటైతే, ఫలితం వేరైయింది.

కెరెన్‌స్కీ ప్రభుత్వం ఉదారవాద సాంప్రదాయక శక్తులకు, సోవియట్‌కు మధ్య, రాజీగా మాత్రమే కొనసాగుతోంది. కెరెన్‌స్కీ తన స్థానాన్ని కాపాడుకోవడానికి, కోర్నిలోవ్ వల్ల ప్రమాదం వుందని సోవియట్‌ను, సామాన్య ప్రజానీకం వల్ల ప్రమాదం ఉందని కోర్నిలోవ్‌ను, బెదిరించాడు. కోర్నిలోవ్‌పై అధికారం కెరెన్‌స్కీకి లేదని, సోవియట్‌కు తెలుసు. కెరెన్‌స్కీకి సామాన్య ప్రజానీకంలో పలుకుబడిలేదని, కోర్నిలోవ్‌కు తెలుసు.

మార్చి విప్లవం తర్వాత సామాజిక సమస్యలకు పరిష్కారం లభించనందువల్ల, ధనిక వర్గాలకూ, సామాన్య ప్రజలకూ మధ్య, అంతర్యుద్ధం రగుల్కొనే ప్రమాద మేర్పడింది. కెరెన్‌స్కీ నిందా ప్రచారం వల్ల సామాన్య ప్రజలు జూలై నెల్లో బోల్షివిక్‌లను తీవ్రంగా ద్వేషించారు. కాని, నెల తిరక్కుండానే వారు నిజాన్ని తెలుసుకున్నారు. బోల్షివిక్ పార్టీని ప్రజలు అభిమానించారు. ఆగస్ట్ రెండో వారంలో బోల్షివిక్ పార్టీని ప్రభుత్వం నిషేధించింది. కెరెన్‌స్కీ తన ప్రభుత్వానికి మద్దతును పొందడానికి, బోల్షివిక్‌లు తప్ప, అన్ని వర్గాల సమావేశాన్ని మాస్కోలో, ఏర్పాటు చేశాడు. ఈ సమావేశం ఆగస్ట్ 25 నుండి 28వరకు జరిగింది.

ఈ సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరగబడితే, నిర్దాక్షిణ్యంగా అణచివేస్తామని ప్రకటించాడు. దేశమంతా సమైక్యం కావాలని కెరెన్‌స్కీ ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలను చేశాడు. కాని, ఈ సమావేశం సమైక్యతను సాధించలేదు. కోర్నిలోవ్ వేదిక మీదికి వచ్చి, కెరెన్‌స్కీని అప్రతిష్ఠపాలు చెయ్యడానికి ప్రయత్నించాడు. ఈ సమావేశం ముగిసిన తర్వాత, కెరెన్‌స్కీ, కోర్నిలోవ్‌లు బద్ధ శత్రువులయ్యారు.

## 20.5.6 : కోర్నిలోవ్ తిరుగుబాటు ప్రయత్నం : తిరుగుబాటు విఫలత

మాస్కో స్టేట్ సమావేశానంతరం, జనరల్ కోర్నిలోవ్ మితవాద పక్షాలకు నాయకుడయ్యాడు. 1917 సెప్టెంబర్ 9న కెరెన్‌స్కీ, కోర్నిలోవ్‌ల మధ్య సంఘర్షణ తీవ్రమైంది. కెరెన్‌స్కీ, కోర్నిలోవ్‌ను పదవి నుండి తొలగించి, అధికారాలను జనరల్ లుకోమ్‌స్కీ (Lukomsky) కి అప్పగించి వెంటనే పెట్రోగ్రాడ్‌కు వచ్చి తనను కలుసుకోవాలని ఆదేశించాడు. కెరెన్‌స్కీ ఆదేశాలను ధిక్కరించి కోర్నిలోవ్ సైన్యాన్ని పెట్రోగ్రాడ్‌వైపు తరలించాడు. ఈ ఇద్దరి మధ్య సంఘర్షణలో, పెట్రోగ్రాడ్ సోవియట్ జోక్యం చేసుకుంది.

పెట్రోగ్రాడ్ సోవియట్‌లోని కొందరు సోషలిస్ట్ సభ్యులు, పెట్రోగ్రాడ్ రక్షణ కోసం రహస్యంగా, ఒక

సైనిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో బోల్షివిక్‌లకు ఎక్కువ స్థానాలు లభించాయి. ప్రభుత్వ ఆయుధ ఫ్యాక్టరీల నుండి ఆయుధాలను సైనికులకు ఇప్పించారు.

పెట్రోగ్రాడ్‌లోని కార్మికుల్లో, సైనికుల్లో విప్లవోత్సాహం పెల్లుబికింది. 40 వేలమంది రెడ్‌గార్డ్‌లు (Red guards) సంఘర్షణకు సిద్ధమయ్యారు. పెట్రోగ్రాడ్‌లోని సైనిక పటాలాలు, ప్రమాదాన్ని ఎదుర్కోడానికి సిద్ధపడ్డాయి. ఆయుధాలను సరఫరా చెయ్యడానికి ఫ్యాక్టరీలు రాత్రింబవళ్లు పని చేశాయి. వేలాది స్త్రీలు, పురుషులు, పిల్లలు నగర రక్షణకు గోతులు (Trenches) తవ్వడానికి, అడ్డుగోడలను (Barricades) కట్టడానికి వచ్చారు.

కాని, చివరకు సంఘర్షణ జరగలేదు. కోర్నిలోవ్ సైన్యాలు పెట్రోగ్రాడ్‌లో అడుగుపెట్టక ముందే, విప్లవ శక్తులు అతడ్ని ఓడించాయి. రైలు మార్గాలపై పనిచేసే కార్మికులు పట్టాలను తీసివేసి, ఒక చోటికి వెళ్లాల్సిన రైళ్లను, ఇంకొక చోటుకు మార్చివేసి, కోర్నిలోవ్ సైనిక దళాలను వేరు చేశారు. సందేశాలను (Messages), టెలిగ్రామ్‌లను, టెలిగ్రాఫ్ ఆఫీసుల్లోనే ఆపివేసి, సోవియట్ ప్రతినిధులకు అందచేశారు. విప్లవ వ్యతిరేక ఉద్యమానికి సామాన్య ప్రజల్లో మద్దతు లేదు. 'విప్లవం' లేని చోటంటూ లేదు.

పెట్రోగ్రాడ్‌లోని కోర్నిలోవ్ అనుకూల వర్గం సుమారు రెండు వేల మంది అదృశ్యులయ్యారు. కొందరు తప్పతాగారు. కోర్నిలోవ్ ఇచ్చిన డబ్బుతో కొందరు పారిపోయారు. మిగిలినవారు భయపడి, ఇళ్ల నుండే వెలుపలకు రాలేదు.

రష్యాలోని అన్ని ప్రాంతాల్లోను, కోర్నిలోవ్ వ్యతిరేక ప్రదర్శనలు బ్రహ్మాండంగా జరిగాయి. యుద్ధ రంగంలోని సైనిక దళాలు, పెట్రోగ్రాడ్ సైనికులకు మద్దతును ప్రకటించి, సైనికాధికారులను నిర్బంధించారు. 1917 సెప్టెంబర్ 13న కోర్నిలోవ్‌ను నిర్బంధించి, బైఖోవ్ (Bikhov) వద్ద ఒక మఠంలో బందీగా చేశారు. సోవియట్ సైనిక కూటమి నాయకత్వంలో, పెట్రోగ్రాడ్ కార్మికులు, సైనికుల కృషి వల్ల, ప్రతీఘాతుక ఉద్యమం విఫలమైంది.

కోర్నిలోవ్ పూర్తిగా ఏకాకి అయ్యాడు. అతని ఆశలన్నీ అడియాశలయ్యాయి. కోర్నిలోవ్ పతనం కెరెన్‌స్కీ విజయం కాదు. కెరెన్‌స్కీ కూడా అసమర్థుడు, ఏకాకి అయ్యాడు. తాత్కాలిక ప్రభుత్వ పతనం తప్పనిసరైంది. కోర్నిలోవ్ పతనానంతరం, కెరెన్‌స్కీ ప్రధాన మంత్రే కాకుండా, సర్వసైన్యాధ్యక్ష పదవిని కూడా చేపట్టాడు. కోర్నిలోవ్ తిరుగుబాటు విఫలమైన తర్వాత, మితవాద పక్షాల బలం క్షీణించింది. కెరెన్‌స్కీ వామ పక్షాల మీద పూర్తిగా ఆధారపడాల్సొచ్చింది.

కోర్నిలోవ్ తిరుగుబాటు తర్వాత, బోల్షివిజమ్ రష్యా అంతటా త్వరితంగా వ్యాపించింది. దేశంలో చాలా కమిటీలకు, సోవియట్లకు చాలా మంది బోల్షివిక్ సభ్యులు ఎన్నికయ్యారు. యుద్ధ సమస్య విషయంలో మెన్షివిక్‌ల్లో విభేదాలు వచ్చాయి. మెన్షివిక్ పార్టీలో ఒక వర్గం, – మెన్షివిక్ అంతర్జాతీయ వాదులు (Menshevik internationalists)- లెనిన్ భావాలను సమర్థించారు. సోషలిస్ట్ రివల్యూషనరీ పార్టీలోని చీలిక వర్గం కూడా, ముఖ్య సమస్యల విషయంలో, బోల్షివిక్‌లను సమర్థించింది. కోర్నిలోవ్ తిరుగుబాటును భగ్నం చేసిన తర్వాత, కార్మికులు, రెడ్‌గార్డ్‌లు, (Red guards) సైనిక దళాల్లో ఆత్మవిశ్వాసం, స్థైర్యం కన్పించాయి. బోల్షివిక్‌ల ప్రతిష్ట పెరిగింది.

## 20.5.7 : పెట్రోగ్రాడ్ సోవియట్ ప్రెసీడియమ్‌కు ఎన్నికలు ః బోల్షివిక్‌ల ఆధిక్యత

జూలై సంక్షోభం తర్వాత, పెట్రోగ్రాడ్ నగరంలోని కార్మికుల ప్రాంతంలో (Workers' District), స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్ (Smolny institute) కు, పెట్రోగ్రాడ్ సోవియట్ తన కార్యాలయాన్ని మార్చుకుంది. సెప్టెంబర్ మాసంలో బోల్షివిక్‌లు బాగా బలపడ్డ తర్వాత, పెట్రోగ్రాడ్ సోవియట్ ప్రెసీడియమ్‌కు

ఎన్నికలను జరిపించాలని కోరారు.

ట్రాట్స్కీని, ఇతర బోల్షివిక్ నాయకులను కొద్ది రోజుల ముందే, జైళ్ల నుండి విడుదల చేశారు. ఎన్నికల గురించి జరిగిన సమావేశం, చాలా ఉద్రిక్త వాతావరణంలో జరిగింది. పాత ప్రెసిడియమ్‌ను తొలగించి, కొత్త ప్రెసిడియమ్‌ను ఏర్పాటు చెయ్యాలనే, బోల్షివిక్‌ల ప్రతిపాదనకు 519 ఓట్లు, పాత ప్రెసిడియమే కొనసాగాలని 414 ఓట్లు తటస్థంగా 67 ఓట్లు పడ్డాయి. విప్లవాన్ని నిర్వహించే కేంద్ర సమితిపై బోల్షివిక్‌లు అజమాయిషీని సాధించారు. సోవియట్ ప్రెసిడియమ్‌కు ట్రాట్స్కీ వెంటనే అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు. కొత్త ప్రెసిడియమ్ లో పదముగ్గురు (13) బోల్షివిక్‌లు, ఆర్గురు (6) సోషలిస్ట్ రివల్యూషనరీలు, ముగ్గురు (3) మెన్షివిక్‌లు, ట్రాట్స్కీతో సహా ఎన్నికయ్యారు.

రష్యా అన్ని ప్రాంతాల్లోను, ప్రాంతీయ సోవియట్లలో కూడా, బోల్షివిక్‌లకే మెజారిటీ లభించింది. సెప్టెంబర్ 23 న మాస్కో సోవియట్, బోల్షివిక్ పార్టీ సభ్యుని అధ్యక్షునిగా ఎన్నుకుంది. చాలా రాష్ట్రాల్లో, నగరాల్లో బోల్షివిక్‌ల ప్రభావం బాగా పెరిగింది. కొత్త నాయకత్వం కెరెన్‌స్కీ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించాలని, భూమిని పంచిపెట్టాలని, యుద్ధాన్ని త్వరలో అంతం చేయాలని తీర్మానించింది.

లెనిన్ ఏప్రిల్ లో ఫిన్‌లాండ్ స్టేషన్ వద్ద ప్రసంగిస్తూ, తమ విధానాలు సరైనవనీ, పీడిత ప్రజలందరూ తమ వైపే మొగ్గు చూపుతారనీ, వారికి వేరే గత్యంతరం లేదనీ, ప్రకటించాడు. విప్లవ వ్యతిరేక శక్తులు విప్లవాన్ని ధ్వంసం చెయ్యడానికి ప్రయత్నించి, విఫలమైన తర్వాత, లెనిన్ జోస్యం నిజమైంది. అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి సరైన సమయమాసన్నమైందని లెనిన్ గ్రహించాడు.

## 20.5.8 అధికార స్వాధీనానికి లెనిన్ వ్యూహం

1917, సెప్టెంబర్ 25న లెనిన్ బోల్షివిక్ కేంద్ర కమిటీకి రాసిన ఉత్తరంలో, అధికారాన్ని స్వాధీనం చేసుకోడానికి, సాయుధ సంఘర్షణ జరపడానికి, ఇదే సమయమని ప్రకటించాడు. సైన్యాధ్యక్ష వర్గాన్ని, కెరెన్‌స్కీ ప్రభుత్వాన్ని నిర్బంధించాలన్నాడు. టెలిఫోన్, టెలిగ్రాఫ్, బాంకింగ్ వ్యవస్థలను, రైల్వే స్టేషన్‌లను స్వాధీనం చేసుకోవడానికి, సాయుధ బృందాలు తయారుకావాలన్నాడు. సైనిక దళాలకు నాయకత్వం వహించడానికి కమీషనర్లను నియమించాలన్నాడు. పెట్రోగ్రాడ్, మాస్కో ల్లోనూ, బాల్టిక్ నౌకాదళం ఓడల్లోను, అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలని సూచించాడు.

కేంద్ర కమిటీ లెనిన్ ప్రతిపాదనలకు అభ్యంతరం చెప్పింది. తన భావాలను పార్టీ కార్యకర్తలకు స్వేచ్ఛగా వివరించడానికి, లెనిన్ కేంద్ర కమిటీ నుండి రాజీనామా చేశాడు. కాని, కేంద్ర కమిటీ లెనిన్ రాజీనామాను అంగీకరించలేదు. ఆనాటి రాజకీయ పరిస్థితిని, సామాన్య ప్రజానీక భావాలను తేలికగా అర్థం చేసుకున్నాడు, ప్రతిభాశాలి లెనిన్.

వెంటనే భూమిని రైతుకు ఇవ్వాలని, అలా జరక్కపోతే, భూస్వాముల, పెట్టుబడి దారుల ప్రవర్తన వల్ల, అంతులేని భయంకరమైన రైతాంగ పోరాటం ప్రజ్వరిల్లుతుందని లెనిన్ హెచ్చరించాడు. ఈ హెచ్చరిక అక్షరాలా నిజమైంది. రైతాంగ సంఘర్షణ ఉధృతమౌతున్న సమయంలోనే, వెంటనే బోల్షివిక్‌లు ఈ అవకాశాన్ని వదులుకోకుండా, అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్నాడు. కర్షకులకు భూమి పంపకం జరిగేవరకు నిరీక్షిస్తే, భూమి వారికి చెందిన తర్వాత తృప్తి పడతారని, విప్లవ వ్యతిరేకులు కూడా కావచ్చని లెనిన్ గ్రహించాడు. అందువల్లే, సరైన నిర్ణయాలను తీసుకొమ్మని బోల్షివిక్ కేంద్ర కమిటీని హెచ్చరించాడు.

### 20.5.8.1 పార్లమెంట్ ముందటి సమావేశం : బోల్షివిక్ పార్టీ బహిష్కరణ

ఇదే సమయంలో కెరెన్‌స్కీ 'ఆల్ రష్యన్ సోవియట్ కమిటీస్' (All Russian Soviet Committes)లో, బోల్షివిక్ వ్యతిరేక సోషలిస్ట్ శక్తుల సమావేశాన్ని, పెట్రోగ్రాడ్‌లో ఏర్పాటు చెయ్యాలని

సంకల్పించాడు. ఈ పార్లమెంట్ ముందటి సమావేశం (Pre-Parliament) కు ప్రతినిధులను ఎన్నుకుంది. ప్రీ-పార్లమెంట్‌ను నిర్లక్ష్యం చెయ్యమని, లెనిన్ బోల్షివిక్ కేంద్ర కమిటీకి సలహా నిచ్చాడు. లెనిన్ అభ్యంతరాన్ని పెట్టినా, ట్రాట్స్కీ నాయకత్వంలో 60 మంది సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కెరెన్‌స్కీ ప్రారంభోపన్యాసం తర్వాత, ట్రాట్స్కీ ఒక ప్రకటన చేశాడు. ఈ ప్రకటనలో ప్రజలకు, పెట్రోగ్రాడ్‌కు, విప్లవానికి, ప్రమాదమేర్పడిందని, అధికారాలన్నీ సోవియట్‌కే చెందాలని తెలిపి, ప్రీ-పార్లమెంట్‌ను బహిష్కరించారు. "సాయుధ విప్లవం వర్ధిల్లాలి" అని ట్రాట్కీ పిలుపునిచ్చాడు.

## 20.5.8.2 : సైనిక విప్లవ కమిటీ స్థాపన : పొలిట్‌బ్యూరో ఏర్పాటు, నిర్ణయాలు

బోల్షివిక్‌లు పెట్రోగ్రాడ్ సోవియట్ ద్వారా సైనిక విప్లవ కమిటి (Military Revolutionary Committee) ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడు ట్రాట్స్కీ. ఈ కమిటీ ఆధ్వర్యంలో సాయుధ సంఘర్షణ జరగడానికి ఏర్పాట్లు జరిగాయి.

1917 అక్టోబర్‌లో జర్మన్ సైన్యాలు పురోగమించడంతో, పెట్రోగ్రాడ్‌ను కాపాడాలనే మిషతో, కెరెన్‌స్కీ సైనికులను యుద్ధ రంగానికి బదలాయించాడు. బోల్షివిక్‌లు ఈ చర్యను గర్హించారు.

అక్టోబర్ 23 వ తేదీ రాత్రి జరిగిన రహస్య సమావేశంలో, 10 గంటల చర్చ తర్వాత, సాయుధ సంఘర్షణ అనివార్యమని, ఒక తీర్మానాన్ని బోల్షివిక్ కేంద్ర కమిటీ ఆమోదించింది. ఈ రహస్య సమావేశానికి లెనిన్ మారువేషంలో, ఫిన్‌లాండ్ నుండి వచ్చాడు. సమావేశం తర్వాత ఫిన్‌లాండ్‌కు వెళ్లిపోయాడు.

అత్యవసర నిర్ణయాలను తీసుకోడానికి ఒక పొలిట్ బ్యూరో (Polit Bureau)ను ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చెయ్యడానికి, బోల్షివిక్ కేంద్ర కమిటీ ఆమోదించింది. ఈ పొలిట్ బ్యూరోలో ,లెనిన్, ట్రాట్స్కీ, స్టాలిన్, లియో కామ్‌నీవ్, గ్రెగరీ జినోవీవ్, గ్రెగరీ సొకాల్‌నికోవ్, ఎం.డి. బుబ్‌నోవ్‌లు సభ్యులు.

కార్మికులకు అవసరమైన ఆయుధాలు, ట్రాట్స్కీ జోక్యంవల్ల ,ఆయుధ ఫ్యాక్టరీల నుండి సరఫరా అయ్యాయి. ఆయుధాలను తయారుచేసే ఫ్యాక్టరీలు, రెజిమెంట్లు, సోవియట్ ఆదేశాలను ఆమోదించి, కెరెన్‌స్కీని నిర్లక్ష్యం చేశాయి.

నవంబర్ 7 వ తేదీన రెండో అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ (Second All-Russian Congress of Soviets) సమావేశం జరిపే రోజున, బోల్షివిక్ తిరుగుబాటును జరపడానికి, బోల్షివిక్ నాయకులు నిశ్చయించారు. నవంబర్ 3 న జరిగిన పార్టీ రహస్య సమావేశంలో లెనిన్ మాట్లాడాడు. నవంబర్ 6న సాయుధ సంఘర్షణను ప్రారంభించడం తొందరపాటు చర్యన్నాడు. తిరుగుబాటుకు రష్యాలోని అన్ని ప్రాంతాలు మద్దతును ప్రకటించినట్లుండాలి. నవంబర్ 6వ తేదీకి కాంగ్రెస్ ప్రతినిధులు అందరూ పూర్తిగా రారు. నవంబర్8 న ప్రారంభిస్తే ఫలితం దక్కదు. అప్పటికే కాంగ్రెస్ సమావేశం జరుగుతుంది. అంత పెద్ద సమావేశంలో త్వరగా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోలేరు. అందువల్ల, నవంబర్ 7న, కాంగ్రెస్ సమావేశం అయ్యే రోజు, సాయుధ సంఘర్షణను నిర్వహించాలని లెనిన్ చెప్పాడు.

నవంబర్ 7 న ,అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ (All-Russian Congress of Soviets) సమావేశాన్ని జరిపే నాటికి ,తాత్కాలిక ప్రభుత్వం పతనమౌతుందని, బోల్షివిక్ నాయకులు నమ్మారు. సైనిక విప్లవ కమిటీ ఆదేశాలను అనుసరించి, ఆయుధాలను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీల్లో, కార్మికులకు ఆయుధాలను సరఫరా చేశారు.

## 20.5.9 బోల్షివిక్ విప్లవ గమనం : తాత్కాలిక ప్రభుత్వ పతనం

నవంబర్ 4, ఆదివారం నాడు, పెట్రోగ్రాడ్ సోవియట్ నగరమంతా, బ్రహ్మాండమైన బహిరంగ

BRAOU

సభలకు పిలుపునిచ్చింది. ఈ సమావేశాలు ఫ్యాక్టరీల్లోను, బేరక్స్ (Barracks) లోను జరిగాయి. లక్షలాది సామాన్య ప్రజలు బోల్షివిక్ నాయకుల సందేశం వినడానికి, సోవియట్ల పట్ల పూర్తి విధేయతను ప్రకటించడానికి, వచ్చారు. బూజుపట్టిన పాత మార్గాన్ని విస్మరించి, భవిష్యత్తులోకి కొత్త బాటను వేసుకోవాలన్న దృఢ సంకల్పం, పేదరికంతో బాధపడుతున్న స్త్రీ పురుషుల్లో కన్పించింది. నవంబర్ 4 న, సైనిక విప్లవ కమిటీ కమిసార్ల ఆదేశాలను మాత్రమే అమలు జరపాలని, సైన్యాన్ని ఆదేశించింది.

కెరెన్‌స్కీ పరిస్థితి విషమించడంపట్ల ఆందోళన చెంది, నవంబర్ 5 సాయంత్రం ప్రత్యేక మంత్రివర్గ సమావేశాన్ని జరిపి, అత్యవసర పరిస్థితి (Emergency) ని ప్రకటించాడు. పెట్రోగ్రాడ్ నగరంలోని సైనికుల పై సర్వాధికారిగా, సైనిక కల్నల్ పాల్కోవ్‌నికోవ్ (Palkovnikov) ను ప్రభుత్వం నియమించింది. సైనిక విప్లవ కమిటీని చట్ట విరుద్ధమైన సంస్థగా ప్రకటించి, ట్రాట్స్కీని, ఇతర బోల్షివిక్ నాయకులను నిర్బంధించాలని, ప్రభుత్వం ఆదేశించింది. తాత్కాలిక ప్రభుత్వం సమావేశాలు జరుపుతుండే వింటర్ పాలెస్ ముందు, అదనపు సైనిక దళాలను నియమించారు. నగర వీధుల్లోకి కోసక్‌ల పటాలాలను వెళ్లాల్సిందని, ప్రభుత్వమాదేశించింది. పరిస్థితులు మారినంత వేగంగా, కెరెన్‌స్కీ చర్యలను తీసుకోలేకపోయాడు.

బోల్షివిక్ విప్లవం మొదలు కాకముందు, రెండు పెట్రోగ్రాడ్‌లు ఉండేవి. పాత పెట్రోగ్రాడ్‌లో మార్చి విప్లవం తర్వాత కూడా, ఎలాంటి మార్పు లేదు. జార్ చక్రవర్తుల కాలంలో లాగే పరిస్థితి ఉండేది. సైన్యాధ్యక్ష వర్గంలో (Army High Command) ఇంకా జార్ కాలంలోని ఉన్నతాధికారులే ఉన్నారు. స్కూళ్లలో విద్యార్థులు ఇంకా పాత పుస్తకాలను చదివారు. హోటళ్లలో, క్లబ్బుల్లో విందులూ, పార్టీలు, డాన్స్‌లు, (dances) వినోదాలు సాగుతూనే వచ్చాయి. మాజీ జార్, అతని కుటుంబాన్ని, జార్‌స్కోసెలో (Tsarskoeselo) నుండి, సైబీరియన్ రాష్ట్రమైన తోబోల్స్క్ (Tobolsk) కు మార్చారు.

పెట్రోగ్రాడ్ సోవియట్ ప్రధాన కేంద్రమైన స్మోల్నీ ఇనిస్టిట్యూట్ వద్దనున్న విప్లవ వాతావరణాన్ని, ప్రఖ్యాత అమెరికన్ రచయిత, విలేఖరి, జాన్ రీడ్, (John Reed), 'టెన్ డేస్ దట్ షుక్ దివర్ల్డ్' (Ten Days That Shook The World) రచనలో వర్ణించాడు. పెట్రోగ్రాడ్ సోవియట్ కేంద్ర కమిటి (Central Committee of Petrograd Soviet) ఆదేశాల ననుసరించి, స్మోల్నీ ఇనిస్టిట్యూట్‌ను కాపాడుకోడం కోసం, రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసి, శతఘ్నులను అవసరమైన చోట్ల వుంచారు. అనేక మంది కార్మికులు, సైనికులు గుమికూడారు. వర్షం కురుస్తున్నా, లెక్క చెయ్యకుండా, వందలాది కార్మికులు, సైనికులు అనేక పనులు చేస్తూ వుండడాన్ని, జాన్ రీడ్ చూశాడు.

'అరోరా' (Aurora) అనే నౌక, బోల్షివిక్ నావికులతో, నీవా (Neva) వద్ద లంగర్ వేసుకుంది. కెరెన్‌స్కీ ప్రభుత్వం, ఈ నౌకను, నీవా (Neva) ను వదిలి, సముద్రం మధ్యకు వెళ్లిపోవాల్సిందిగా ఆదేశించింది. కాని, ట్రాట్స్కీ ఆ నౌకను అక్కడే ఉండమని ఆదేశించాడు. సైనిక చర్యకు సిద్ధం కావాల్సిందని నావికులను ఆదేశించాడు. 'అరోరా' లోని నావికులు ట్రాట్స్కీ ఆదేశాలను, వెంటనే అమలు జరిపారు. పీటర్‌పాల్ కోట నుండి ట్రాట్స్కీ ఆదేశాల ననుసరించి, వేగన్లలో, ట్రక్కుల్లో, రెడ్ గార్డ్‌లకు ఆయుధాలు సరఫరా అయ్యాయి. పీటర్‌పాల్ కోటలోని సైనికులు మరఫిరంగులను సిద్ధం చేసుకున్నారు.

ఈ లోపల కెరెన్‌స్కీ మారిన్‌స్కీ (Marinsky) భవనంలో, ప్రీ-పార్లమెంట్‌ను, తన పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని ప్రకటించమని కోరాడు. బోల్షివిక్‌లను అణచివేస్తానని చెప్పాడు. కాని, ప్రీ-పార్లమెంట్, అతని పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రకటించ లేదు.

అదే సమయంలో బోల్షివిక్ నాయకులు స్మోల్నీ ఇనిస్టిట్యూట్ వద్ద సమావేశమై, వారి పథకానికి తుది మెరుగు దిద్దారు. క్రాన్‌స్టాడ్ నావికులు, రెడ్‌గార్డులు కలిసి, కెరెన్‌స్కీ కార్యాలయమైన 'వింటర్ పాలెస్' ను ముట్టడించి స్వాధీనం చేసుకోవాలని, ఇతర సైన్యాలు పోస్ట్, టెలిగ్రాఫ్, రైల్వే మొదలైన కీలక కేంద్రాలను స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. పెట్రోగ్రాడ్‌లో సంఘర్షణ జరిగినప్పుడే, మాస్కోలో కూడా



BRAOU

జరగాలని నిర్ణయించారు.

నవంబర్ 6, రాత్రి, బోల్షివిక్‌లు సాయుధ సంఘర్షణను ప్రారంభించారు. రైల్వే స్టేషన్‌లను, టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లను (Telephone Exchanges), టెలిగ్రాఫ్ భవనాలను, స్టేట్ బాంక్‌లను, ముద్రణాలయాలను, సైనిక స్థావరాలను ఆక్రమించుకున్నారు. చాలా ప్రదేశాల్లో బోల్షివిక్‌లు భవనాలను ఆక్రమించుకోగానే, కార్మికులు సంతోషంతో హర్షధ్వానాలను చేశారు.

నవంబర్ 7, ఉదయం 10 గంటలకు తాత్కాలిక ప్రభుత్వం పతనమైందని, అధికారాన్ని సైనిక విప్లవ కమిటీ, సోవియట్లు హస్తగతం చేసుకున్నాయని, ట్రాట్స్కీ ప్రకటించాడు.

నవంబర్ 7 మధ్యాహ్నానికి, 'వింటర్ పాలెస్' తప్ప, మిగతా నగరమంతా శాంతియుతంగా స్వాధీనమైంది. విప్లవకారులు 'వింటర్ పాలెస్'పై దాడి చేశారు. ఆ భవనంలోనే ఉన్న మంత్రివర్గ సభ్యులు ఏం చెయ్యగలం? ఏం చెయ్యాలి? అని చర్చించుకున్నారు. అప్పటికే పరిస్థితి చెయ్యిజారి పోయింది. అదే రోజున కెరెన్‌స్కీ అమెరికా రాయబారి కార్యాలయాన్నుండి ఒక కారును తీసుకొని, అమెరికా జెండాను కారు ముందుకు తగిలించుకొని, పెట్రోగ్రాడ్ నుండి బయటపడ్డాడు.

నవంబర్ 7 వ తేదీ సాయంత్రం 6 గంటలకు, బోల్షివిక్ సైన్యాలు 'వింటర్ పాలెస్' ను చుట్టుముట్టాయి. బాల్టిక్ నౌకా దళానికి చెందిన ఏడు నౌకలు, విప్లవాన్ని సమర్థించే సైనికులతో క్రిక్కిరిసి వచ్చాయి. 'వింటర్ పాలెస్' లో ఉండే మంత్రులను లొంగిపొమ్మని బోల్షివిక్‌లు తుది హెచ్చరిక చేశారు. కాని, వారు లొంగిపోడానికి నిరాకరించారు. మంత్రులను ఎవ్వరూ పట్టించుకోలేదు. వారి ముఖాలు కళావిహీనమయ్యాయి.

నవంబర్ 8, 1-00 A.M కు 'వింటర్ పాలెస్' లో ప్రతిఘటన తగ్గిపోయింది. చాలా మంది రెడ్ గార్డ్స్ "వింటర్ పాలెస్' లోకి చొచ్చుకుని వెళ్లారు. కార్మికులు ప్రభుత్వాధికారులను నిరాయుధులుగా చేశారు. నవంబర్ 8, తెల్లవారగట్ల 2-10 A.M.కు, తాత్కాలిక ప్రభుత్వాధినేతలను నిర్బంధించారు. మంత్రులను నిర్బంధించడంతో, మార్చి విప్లవం తర్వాత రష్యాను పాలించిన తాత్కాలిక ప్రభుత్వం అంతమైంది.

### 20.5.9.1 అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ సమావేశం : ప్రతినిధుల ఆనందోత్సాహాలు

స్మోల్నీ ఇనిస్టిట్యూట్‌లో, సోవియట్ కాంగ్రెస్ సమావేశం చాలా ఉద్రిక్త వాతావరణంలో జరిగింది. 'వింటర్ పాలెస్' లొంగిపోయింది. కెరెన్‌స్కీ యుద్ధ రంగం నుండి పంపిన సైన్యాలు, అతని ఆదేశాలను తిరస్కరించాయి. ఉత్తర రంగం సేనాని కాంగ్రెస్‌కు విధేయతను ప్రకటించాడు. ఇలాగే, విజయ వార్తలు అందుతూంటే, సమావేశంలో పాల్గొన్నవారి ఆనందానికి అవధులు లేవు. ఆనంద బాష్పాలు రాలాయి. సంతోషంతో సభ్యులు ఒకరినొకరు కౌగలించుకున్నారు. ఈ ఆనందోత్సాహాలతో వెల్లివిరిసిన సంతోష వాతావరణాన్ని, జాన్ రీడ్ (John Reed) 'టెన్ డేస్ దట్ షుక్ ది వరల్డ్' (Ten Days That Shook The World) రచనలో ఎంతో ఆనందంతో మనోహరంగా వర్ణించాడు.

## 20.6 : లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ ప్రభుత్వ స్థాపన : మౌలిక విధానాల ప్రకటన

నవంబర్ 8న, బోల్షివిక్‌లు కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చెయ్యడానికి నిశ్చయించారు. ఈ మంత్రివర్గాన్ని 'సోవియట్ ఆఫ్ పీపుల్స్ కమీసార్స్' "Soviet of People's Commissars" అంటారు. లెనిన్ నవంబర్ 7నే, స్మోల్నీ ఇన్‌స్టిట్యూట్‌కు తిరిగి వచ్చాడు. నవంబర్ 8 రాత్రి 9-30 గంటలకు, రెండో అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ (Second All - Russian Congress of Soviets) స్మోల్నీ ఇనిస్టిట్యూట్ లోనే సమావేశమైంది. ఈ కాంగ్రెస్ కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటుచెయ్యడమే కాకుండా, భూసమస్యను గురించి రెండు శాసనాలను జారీ చేసింది.

సోవియట్ కాంగ్రెస్‌లో మాట్లాడ్డానికి లెనిన్ లేవగానే, ప్రతినిధులు బ్రహ్మాండమైన స్వాగతమిచ్చి, సుదీర్ఘ హర్షధ్వానాలను చేశారు. "The Workers and Peasants Revolution ,the necessity of which has always been urged by the Bolsheviks, has taken place. This Third Revolution must ,in its final outcome, lead to the victory of Socialism" అని, లెనిన్ యుద్ధాన్ని కొనసాగిస్తున్న ప్రభుత్వాలను, ప్రజలనుద్దేశించి, ఒక ప్రకటనను చదివాడు. ఏ ప్రాంతాలను కలుపుకోకుండా, ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించకుండా, వెంటనే శాంతిని నెలకొల్పాలని లెనిన్ ప్రకటించాడు. రహస్య దౌత్య పద్ధతులను (Secret Diplomacy) అంతం చెయ్యాలని, రహస్య సంధులన్నిటినీ కొత్త ప్రభుత్వంవెల్లడి చేస్తుందని ప్రకటించాడు. రష్యన్ పెట్టుబడి దారులకు లాభాలు, ప్రత్యేక హక్కులను కల్పించే సంధులను, కొత్త ప్రభుత్వం రద్దు చేస్తుందని చెప్పాడు. ఈ ప్రకటనలో మూడు నెలల కాలంలో యుద్ధ విరమణ జరగాలని ప్రతిపాదించి, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీల్లోని కార్మికులు శాంతిని సాధించడానికి ,రష్యన్ కార్మికులకు సహాయం చేస్తారని ఆశించాడు. సోవియట్ ఈ ప్రతిపాదనలను, ఆయా ప్రభుత్వాలకు, ప్రజలకు కూడా సమర్పించాలని లెనిన్ చేసిన ప్రతిపాదనను, సోవియట్ కాంగ్రెస్ ఆమోదించి, శాంతి విజ్ఞప్తిని చేసింది

భూమి సమస్య గురించి లెనిన్ రెండో శాసనాన్ని చేశాడు. భూస్వామ్య వ్యవస్థను రద్దు చేసి, భూస్వాములకు ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించకుండా, వెంటనే భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునే శాసనాన్ని ప్రకటించాడు. భూస్వాముల, చర్చీల, మఠాల భూమిని రైతులకు పంచడానికి, సోవియట్ కర్షక డెప్యూటీల భూమి కమిటీలకు (Land Committees of Peasant Social Deputies) అప్పగించాలని శాసనాన్ని చేశాడు.

## 20.6.1. : లెనిన్ మంత్రివర్గం : కేంద్ర కార్యనిర్వాహక వర్గం

లెనిన్ చేసిన రెండు ప్రతిపాదనలను, కాంగ్రెస్ ఆమోదించింది. కొత్త మంత్రి వర్గ సభ్యుల జాబితాను కాంగ్రెస్ ఆమోదించి, సమావేశం వాయిదా పడింది. ఈ మంత్రి వర్గంలో సభ్యులందరూ, బోల్షివిక్ పార్టీకి చెందినవారే.

బోల్షివిక్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వంలో, కౌన్సిల్ ప్రెసిడెంట్ బాధ్యతను వ్లాదిమీర్ ఉలియనోవ్ (లెనిన్), విదేశాంగ శాఖను యల్.డి. బ్రాన్‌స్టీన్ (ట్రాట్స్కీ) నిర్వహించారు. ఎ.వి. లునా ఛార్‌స్కీ (A.V. Lunacharsky) విద్యా శాఖను నిర్వహించాడు. జాతీయ వ్యవహారాల అధ్యక్షుడిగా (President for Nationality Affairs) ఐ.వి. డ్జుగాష్‌విల్లి (I.V. Djugashvilli) –స్టాలిన్– నియమితుడయ్యాడు. లెనిన్ ఇంకా ఇతర మంత్రులను కూడా నియమించాడు. లెనిన్, ట్రాట్స్కీ, లునా ఛార్ స్కీల పేర్లను ప్రకటించగానే, కాంగ్రెస్‌లో సభ్యులు ప్రత్యేకంగా హర్షధ్వానాలను చేశారు.

రెండో సోవియట్ కాంగ్రెస్, కేంద్ర కార్యనిర్వాహక వర్గాన్ని (Central Executive Committee) ఎన్నుకుంది. ఈ కమిటీ లో 101 సభ్యులుండేవారు. సోవియట్ కాంగ్రెస్ సమావేశంలో లేనప్పుడు, కాంగ్రెస్ తరపున కార్యవర్గం వ్యవహరిస్తుంది. సోవియట్ కాంగ్రెస్, శాసనాధికారాలను కేంద్ర కార్యనిర్వాహక వర్గానికి, కార్యనిర్వాహకాధికారాలను మంత్రి వర్గానికి, బదలాయించింది.

## 20.6.2. : బోల్షివిక్ పార్టీ అధికార స్వాధీనంపై వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు

పెట్రోగ్రాడ్ లో బోల్షివిక్‌లు అధికారాన్ని కైవశం చేసుకోడం పైన ,భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. విప్లవాన్ని సాహస చర్యగా కొందరు చరిత్రకారులు వర్ణిస్తే, తక్కువ రక్తపాతంతో ప్రభుత్వ యంత్రాంగాన్ని వశపర్చుకోగల బోల్షివిక్‌లను, కొందరు కొనియాడారు. లెనిన్ వ్యూహానిర్మాణ దక్షతను అందరూ మెచ్చుకున్నారు.

విప్లవం చాలా నెలలనుండి కొనసాగింది. బోల్షివిక్‌లు అధికారాన్ని హస్తగతం చేసుకోడమన్నది, విప్లవంలో చివరి ఘట్టం. విప్లవ రథ సారథి లెనిన్ సమర్థవంతమైన నాయకత్వంలో, వారి వ్యూహం, వ్యవస్థ

సమర్థవంతంగా వ్యవహరించడంవల్ల, తాత్కాలిక ప్రభుత్వం పేకమేడలా కూలిపోయింది. 1917 నవంబర్ 7న, బోల్షివిక్ విప్లవం విజయవంతమైంది.

## 20.7 : సంగ్రహంగా

1905 అక్టోబర్ ప్రణాళిక ప్రకారం డ్యూమాకు జరిగిన ఎన్నికల్లో ,మధ్యతరగతి వర్గానికి ప్రాతినిధ్యం వహించిన కేడెట్ పార్టీకి, చాల ఎక్కువ స్థానాలు లభించాయి. సంస్కరణలను ప్రవేశపెట్టాలని డ్యూమా సభ్యులు సమర్పించిన వినతి పత్రాన్ని జార్ తిరస్కరించి, డ్యూమాను రద్దు చేశాడు.

పీటర్ స్టోలిపిన్‌ను జార్ ప్రధాన మంత్రిగా నియమించాడు . అతడు పరిపాలనాదక్షుడు. విప్లవోద్యమ ప్రభావాన్ని తగ్గించడానికి, ప్రభుత్వ భూములను కర్షకులకు, తేలిగ్గా కొనుక్కునే పద్ధతిలో అమ్మే విధానాన్ని ప్రవేశపెట్టాడు. స్టోలిపిన్‌ను 1911 లో దారుణంగా హత్యచేసిన తర్వాత నియమించబడిన ప్రధాన మంత్రులు అసమర్థులు కావడం వల్ల, వారి హయాంలో విప్లవ కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

1905 విప్లవం తర్వాత, బోల్షివిక్ – మెన్షివిక్ వర్గాల మధ్య, భేదాభిప్రాయాలు తీవ్రమయ్యాయి. బోల్షివిక్‌లు సాయుధ సంఘర్షణ జరగకుండా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోడం అసాధ్యమని నమ్మారు. మెన్షివిక్ నాయకులు, మధ్యతరగతి వర్గాల పార్టీలతో, సహకరించడానికి తయారయ్యారు. బోల్షివిక్ మహానాయకుడు లెనిన్ విశిష్ట వ్యక్తిత్వం వల్ల ఆకర్షితులై , చాలా మంది అతని సహచరులయ్యారు. వీరు విప్లవోద్యమంలో తమ ప్రాణాలను సైతం ధారపోయడానికి సిద్ధపడ్డారు.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లగానే, చాలా మంది సామాన్య ప్రజలు, డెప్యూటీలు జర్మనీతో యుద్ధాన్ని సమర్థించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా విపరీతంగా నష్టపోయింది. ధరలు ఆకాశాన్నంటడంవల్ల, కార్మికులు అసంతృప్తులయ్యారు.

లెనిన్ యుద్ధాన్ని వ్యతిరేకించిన సోషలిస్ట్‌లను తనతో కలుపుకున్నాడు. 1916 లో " సామ్రాజ్య వాదం: పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత దశ" అనే పుస్తకంలో మార్క్స్ సిద్ధాంతాన్ని, ఆనాటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అన్వయించాడు. లెనిన్ సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని పిలుపునిచ్చాడు. 1917 సంవత్సర ప్రారంభంలో రష్యాలో పరిస్థితి విప్లవం ప్రజ్వరిల్లడానికి అనుకూలంగా ఉంది.

1917 మార్చి 8న పెట్రోగ్రాడ్ లో మొదలైన సమ్మెలు, తిండిగింజల పోరాటం ,తిరుగుబాటుకు దారి తీశాయి. హఠాత్తుగా ప్రజ్వరిల్లిన సంఘర్షణ, విప్లవోద్యమంగా మారింది. విప్లవాగ్నులు చెలరేగడానికి జరిగిన మూడు సంఘటనలు – (1) అంతర్జాతీయ మహిళా ఉత్సవాలు; (2) తిండిగింజలకోసం పోరాటం ;(3) లాకౌట్‌కు వ్యతిరేకంగా పుట్టిలోవ్ ఫ్యాక్టరీ కార్మికుల ప్రతిఘటన.

కార్మిక వర్గానికి మధ్యతరగతి ప్రజలు సానుభూతిని ప్రకటించారు. విప్లవకారుల కృషి ఫలితంగా, ప్రదర్శనలను చెదరగొట్టడానికి ప్రభుత్వం పిలిపించిన కోసక్‌లు విప్లవోద్యమానికి మద్దతునిచ్చారు. విప్లవకారుల కృషి ఫలితంగానే,చివరకు, సైనికుల మద్దతు కూడా విప్లవోద్యమానికి లభించింది. ప్రజలు విప్లవోద్యమాన్ని విజయవంతం చేయడానికి సిద్ధపడ్డారని నమ్మగానే, సైనికులు రంగంలోకి దిగడానికి సిద్ధపడ్డారు. బోల్షివిక్, మెన్షివిక్, సోషలిస్ట్ రివల్యూషనరీ పార్టీల నాయకులు, ప్రదర్శనలకు నాయకత్వం వహించడానికి తయారయ్యారు.

మార్చి 11 ఆదివారం నాడు ప్రజలకు, పోలీస్‌లకు మధ్య, తీవ్రమైన సాయుధ సంఘర్షణలు జరిగాయి. పోలీస్‌లు పారిపోయి దాక్కున్నారు. నగరంలో గుమికూడిన కార్మికులపై సైనికులు కాల్పులు జరిపారు. సైనికులను తమ వైపుకు తిప్పుకోడానికి, కార్మికులు చాలా కృషి చేశారు.

మార్చి 12 నాడు సైనిక దళాలు విప్లవానికి మద్దతును ప్రకటించాయి. సైనికులు, జార్ అధికారులను

BRAOU

కాల్చిచంపారు. విప్లవకారులు పెట్రోగ్రాడ్‌ను ఆక్రమించుకున్నారు. ఈ విధంగా సైనికులు, కార్మికులు, జారిస్ట్ నిరంకుశ నియంత్రృత్వాన్ని తొలగించారు.

మార్చి 12 న డ్యూమా సభ్యులు ఒక తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. అదేరోజు, పెట్రోగ్రాడ్ సోవియట్ తిరిగి ఆవిర్భవించింది. కార్మిక, సైనిక, ప్రతినిధులతో సమైక్య, సంఘటిత వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మార్చి 13 న తన కుటుంబ సభ్యులను కలుసుకోడానికి బయలుదేరిన జార్‌ను,విప్లవకారులు పెట్రోగ్రాడ్‌లో అడుగుపెట్టనివ్వలేదు.

పెట్రోగ్రాడ్ సోవియట్ తో జరిగిన ఒప్పందం ప్రకారం, పెట్రోగ్రాడ్‌లో డ్యూమా తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. సోవియట్ ప్రభుత్వంలో పాల్గోదు. తాత్కాలిక ప్రభుత్వం కొన్ని సంస్కరణలను, ప్రవేశపెట్టింది. కానీ, యుద్ధం కొనసాగింపు గురించి, వ్యవసాయ సంస్కరణల గురించి, సోవియట్‌తో ఎలాంటి ఒప్పదం కుదరలేదు.

1917 మార్చి 15న ,జార్ తన సోదరుడు గ్రాండ్ డ్యూక్ మైఖేల్‌కు అనుకూలంగా రాజ్య పరిత్యాగం చేశాడు.

మార్చి విప్లవ ఫలితంగా జారిస్ట్ నియంతృత్వం పతనమై, డ్యూమా తాత్కాలిక కమిటీ ,జార్జ్ ల్వావ్ నాయకత్వంలో,తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పర్చింది. ఈ ప్రభుత్వాన్ని పెట్రోగ్రాడ్ సోవియట్ సహించింది. తాత్కాలిక ప్రభుత్వంలోని మంత్రులు, మధ్యతరగతి ఉదారవాదానికి ప్రాతినిధ్యం వహించారు. సామాజిక విప్లవాన్ని వ్యతిరేకించారు. యుద్ధాన్ని కొనసాగించాలనుకున్నారు. ఈ విధానాన్ని సోవియట్ వ్యతిరేకించింది. జార్ ప్రభుత్వం చేసుకున్న రహస్య సంధులను రద్దు చెయ్యాలని, శాంతిని నెలకొల్పడానికి సంప్రదింపులను జరపాలని కోరింది. మార్చి విప్లవం తర్వాత ద్వంద్వాధికారం మొదలైంది. సైనికులు, రైలు మార్గాలు, వార్తా సదుపాయాలు, సోవియట్ అధీనంలోనే ఉండడంవల్ల, సోవియట్ ఆమోదిస్తే తప్ప, తాత్కాలిక ప్రభుత్వ మిచ్చిన ఆదేశాలు అమలు జరగవు. సైనిక దళాల్లో తిరుగుబాటుతత్వం ప్రబలింది. తాత్కాలిక ప్రభుత్వం రాజకీయ శిక్షలు అనుభవించిన వారి నందరినీ విడుదల చేసింది. సివిల్ హక్కులను ప్రకటించింది.

మార్చి విప్లవానంతరం ఏర్పడ్డ కొత్త ప్రభుత్వంలోని వైరుధ్యాలను, లెనిన్ వెంటనే గ్రహించాడు. పెట్రోగ్రాడ్ సోవియట్‌ను పూర్తిగా సమర్థించాలని ప్రకటించాడు. యుద్ధాన్ని అంతం చెయ్యండి, దోపిడీ ప్రభుత్వాలను కూలదొయ్యండని, ప్రావ్దా పత్రికలో రాశాడు.

లెనిన్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 16న పెట్రోగ్రాడ్-ఫిన్‌లాండ్ స్టేషన్‌కు చేరింది. అతనికి అఖండ స్వాగతం లభించింది. అంతర్జాతీయ సాంఘిక విప్లవం వర్థిల్లాలని, సామ్రాజ్యవాద యుద్ధంవల్ల,అంతర్యుద్ధం మొదలౌతుందని చెప్పాడు.

లెనిన్ రష్యాకు తిరిగి వచ్చిన తర్వాత, మార్క్సిస్ట్ దృక్పథంతో, ఆనాటి రాజకీయ పరిస్థితిని నిశితంగా పరిశీలించి, తన అభిప్రాయలను ప్రకటించాడు. ఆనాటి రష్యా స్థితిగతుల గురించి, లెనిన్ తన అభిప్రాయాలను 'ఏప్రిల్ థీసెస్'లో వివరించాడు. ఈ పరిశీలన రష్యన్ విప్లవ గమనాన్ని ప్రభావితం చేసింది. సోషలిస్ట్ విప్లవం ద్వారా విప్లవ ప్రభుత్వాన్ని స్థాపించడమే, ప్రజల సమస్యలకు పరిష్కారమార్గమని, లెనిన్ అభిప్రాయపడ్డాడు. మొదట్లో లెనిన్ భావాలకు పార్టీలో మద్దతు లభించకపోయినా, సామాన్య ప్రజానీకం లెనిన్ భావాల వల్ల ప్రభావితులయ్యారు. ఏప్రిల్ -మే నెలల్లో జరిగిన పార్టీ సమావేశాల్లో ,పార్టీ నాయకులు లెనిన్ కొత్త భావాలను ఆమోదించారు.

1917 మార్చి విప్లవం జరిగిన తర్వాత ,నవంబర్ విప్లవం ప్రజ్వరిల్లే లోపల జరిగిన సంఘటనలను ఏప్రిల్ దినాలని, మే సంక్షోభమని, జూన్ ప్రదర్శనలని, జూలై దినాలని, విప్లవ వ్యతిరేక ఉద్యమమని ,రష్యన్ చరిత్రను విభజించొచ్చు.



BRAOU

ఏప్రిల్ దినాల్లో ప్రజలు తాత్కాలిక ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని వ్యతిరేకించారు. యుద్ధాన్ని త్వరలో ముగించాలని, బ్రహ్మాండమైన ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనల ఫలితంగా, మే నెల్లో విదేశాంగ మంత్రిని , యుద్ధ మంత్రిని, కొందరు ఇతర మంత్రులను తొలగించారు. ఇదే 'మే' సంక్షోభం. పెట్రోగ్రాడ్ సోవియట్, సరైన నాయకత్వాన్ని సమకూర్చడానికి ,ఏప్రిల్ నెల్లో 24గురు సభ్యులతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పర్చింది.

కార్మికులు, సైనికుల మద్దతు బోల్షివిక్ లకు లభించింది. జూన్ ప్రదర్శనల్లో బోల్షివిక్ పార్టీ బలపడింది. పెట్రోగ్రాడ్ నగరంపై బోల్షివిక్ లు అజమాయిషీని సాధించారు.

తాత్కాలిక ప్రభుత్వాన్ని తొలగించి ,సోవియట్ పరిపాలనా బాధ్యతలను స్వీకరించాలని, జూలై 16న వేలాది ప్రజలు ప్రదర్శనలను జరిపారు. పరిస్థితి చాలా ఉద్రిక్తంగా తయారైంది.

జూలై 17న క్రాన్ స్టాడ్ స్థావరం వద్ద, సుమారు 6000 మంది నావికులు విప్లవోద్యమానికి మద్దతు నిచ్చారు. లెనిన్ నిగ్రహం చూపించమని సలహా ఇచ్చినా లక్ష్యపెట్టక, ప్రదర్శకులు ప్రభుత్వానికి మద్దతునిస్తున్న కోసక్ లతో తలపడ్డారు. జరిగిన భయంకరమైన సంఘర్షణలో పెట్రోగ్రాడ్ నగర వీధుల్లో రక్తపుటేరులు ప్రవహించాయి. కోసక్ లు పారిపోయారు. దేశంలో అంతర్యుద్ధం ప్రజ్వరిల్లే ప్రమాదమేర్పడింది. బోల్షివిక్ ల ప్రభావం నానాటికీ పెరగడం వల్ల, తాత్కాలిక ప్రభుత్వంతోపాటు, సోవియట్ నాయకత్వం కూడా భయపడింది.

జూలై 17న ప్రభుత్వం లెనిన్, ట్రాట్స్కీ, ఇతర బోల్షివిక్ నాయకులు జర్మనీ ఏజెంట్లని ప్రకటించి, ఆధారంగా కొన్ని పత్రాలను (documents) ప్రచురించింది. సామాన్య ప్రజలు, మధ్యతరగతి వారు, కార్మికులు, సైనికులు, ఈ పత్రాలను చదివి నిర్ఘాంతపోయారు. ప్రజల్లో బోల్షివిక్ వ్యతిరేక భావం పెల్లుబికింది. ప్రభుత్వం చాలామంది బోల్షివిక్ పార్టీ నాయకులను నిర్బంధించింది. లెనిన్ తప్పించుకున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన పత్రాల్లో పూర్తి నిజం లేదని, తర్వాత తెలిసింది.

దేశంలో ఇలా అస్తవ్యస్త పరిస్థితి కొనసాగుతుండగా, ప్రగతినిరోధక శక్తులు అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి ప్రయత్నించాయి. రష్యా సైన్యాల సర్వసైన్యాధ్యక్షుడు కొర్నిలోవ్ (Kornilov) తమను కాపాడగలడని రష్యన్ ఉదారవాదులు, సాంప్రదాయిక వర్గాలవారు ఆశించారు. కెరెన్ స్కీ, కోర్నిలోవ్ ను సర్వసైన్యాధ్యక్షుడిగా నియమించాడు. కెరెన్ స్కీ తన స్థానాన్ని కాపాడుకోడానికి, కోర్నిలోవ్ వల్ల ప్రమాదముందని సోవియట్ ను, సామాన్య ప్రజానీకంవల్ల ప్రమాదముందని, కోర్నిలోవ్ ను బెదిరించాడు. కోర్నిలోవ్ ను కెరెన్ స్కీయే నియమించినా, వారిద్దరూ బద్ధ శత్రువులయ్యారు. కోర్నిలోవ్ తిరుగుబాటు చేశాడు. కెరెన్ స్కీ ఆదేశాలను ధిక్కరించి, పెట్రోగ్రాడ్ వైపు సైన్యాన్ని తరలించాడు. పెట్రోగ్రాడ్ సోవియట్ నగర రక్షణకు సకల చర్యలను తీసుకుంది. రష్యాలో మళ్లీ బోల్షివిక్ ల ప్రభావం పెరిగింది. నిజం తెలుసుకున్న ప్రజలు బోల్షివిక్ పార్టీని అభిమానించారు. పెట్రోగ్రాడ్ రక్షణ కోసం ఏర్పడ్డ కమిటీలో, బోల్షివిక్ లదే మెజారిటీ. కోర్నిలోవ్ సైన్యాలు పెట్రోగ్రాడ్ లో అడుగుపెట్టలేదు. విప్లవ వ్యతిరేక ఉద్యమానికి ప్రజల మద్దతు లేదు. రష్యాలోని అన్ని ప్రాంతాల్లోను, కోర్నిలోవ్ వ్యతిరేక ప్రదర్శనలు బ్రహ్మాండంగా జరిగాయి. కోర్నిలోవ్ ను బందీగా చేశారు. ఈ విధంగా ప్రతిఘాతక ఉద్యమం విఫలమైంది. కోర్నిలోవ్ పతనానంతరం, కెరెన్ స్కీ ప్రధాన మంత్రే కాకుండా, సర్వసైన్యాధ్యక్షుడు కూడా అయ్యాడు.

కోర్నిలోవ్ తిరుగుబాటు తర్వాత, రష్యా అంతటా బోల్షివిక్ ల ప్రతిష్ఠ పెరిగింది. పెట్రోగ్రాడ్ సోవియట్ ప్రెసిడియమ్ కు జరిగిన ఎన్నికల్లో, బోల్షివిక్ లకు మెజారిటీ లభించింది. పెట్రోగ్రాడ్ సోవియట్ ప్రెసిడియమ్ కు ట్రాట్స్కీ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. రష్యా అన్ని ప్రాంతాల్లో బోల్షివిక్ లకు మెజారిటీ లభించింది. అధికారాన్ని స్వాధీనం చేసుకోడానికి సాయుధ సంఘర్షణను జరపాలని, కెరెన్ స్కీ ప్రభుత్వాన్ని, సైన్యాధ్యక్ష వర్గాన్ని నిర్బంధించాలని లెనిన్ ప్రతిపాదిస్తూ , వ్యూహాన్ని రూపొందించి, బోల్షివిక్ కేంద్ర



BRAOU

కమిటీకి ఉత్తరం రాశాడు.

బోల్షివిక్ వ్యతిరేక సోషలిస్ట్‌ల సమావేశాన్ని కెరెన్‌స్కీ ఏర్పాటు చేశాడు. ఈ సమావేశం 'ప్రీ-పార్లమెంట్'కు ప్రతినిధులను ఎన్నుకుంది. 'ప్రీ-పార్లమెంట్' సమావేశానికి ట్రాట్స్కీ నాయకత్వంలో 60 మంది బోల్షివిక్ సభ్యులు హాజరయ్యారు. ట్రాట్స్కీ అధికారాలన్నీ సోవియట్‌కే చెందాలని చెప్పి, సాయుధ విప్లవం వర్థిల్లాలని ప్రకటించి, సహచరులతో సహా, ప్రీ-పార్లమెంట్‌ను బహిష్కరించాడు.

ట్రాట్స్కీ అధ్యక్షతన బోల్షివిక్‌లు పెట్రోగ్రాడ్ సోవియట్ ద్వారా సైనిక విప్లవ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో సాయుధ సంఘర్షణ జరగడానికి ఏర్పాట్లు జరిగాయి. అత్యవసర నిర్ణయాలను తీసుకోడానికి, 7గురు సభ్యులతో, పొలిట్ బ్యూరోను ఏర్పాటు చేశారు.

నవంబర్ 7వ తేదీన, రెండో అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ (Second All-Russian Congress of Soviets) సమావేశాన్ని జరిపే రోజున,సాయుధ సంఘర్షణ జరపడానికి, బోల్షివిక్ నాయకులు నిశ్చయించారు.

కెరెన్‌స్కీ నవంబర్ 5 సాయంత్రం ప్రత్యేక మంత్రివర్గ సమావేశాన్ని జరిపి, అత్యవసర పరిస్థితిని ప్రకటించాడు. ట్రాట్స్కీని, ఇతర బోల్షివిక్ నాయకులను నిర్బంధించాలని ప్రభుత్వం ఆదేశించింది.

పెట్రోగ్రాడ్‌లో సంఘర్షణ జరిగేటప్పుడు, మాస్కోలో కూడా జరగాలని నిర్ణయించారు. నవంబర్ 6 రాత్రి, బోల్షివిక్‌లు సాయుధ సంఘర్షణను ప్రారంభించారు. నవంబర్ 7 ఉదయం 10 గంటలకు, తాత్కాలిక ప్రభుత్వం పతనమైందని, ట్రాట్స్కీ ప్రకటించాడు.

నవంబర్ 7 మధ్యాహ్నానికి,'వింటర్ పాలెస్' తప్ప, నగరమంతా స్వాధీనమైంది. ఆరోజే సాయంత్రం 6 గంటలకు బోల్షివిక్ సైన్యాలు "వింటర్ ప్యాలస్"ను చుట్టుముట్టాయి.నవంబర్ 8 తెల్లవారగట్ల వింటర్ పాలెస్ పతనం కావడంతో, తాత్కాలిక ప్రభుత్వం అంతమైంది. నవంబర్ 8 న లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ కొత్త మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా, రెండో అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ భూ సమస్యను గురించి రెండు శాసనాలను జారీ చేసింది.

కాంగ్రెస్‌లో లెనిన్ శాంతి విజ్ఞప్తిని చేశాడు. ఏ ప్రాంతాలను కలుపుకోకుండా,ఎలాంటి నష్ట పరిహారాన్ని చెల్లించకుండా, వెంటనే శాంతిని నెలకొల్పాలని, లెనిన్ ప్రకటించాడు. భూస్వామ్య వ్యవస్థను రద్దుచేసి, భూస్వాములకు ఎలాంటి నష్టపరిహారాన్ని చెల్లించకుండా, వెంటనే ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకునే శాసనాన్ని, ప్రకటించాడు. లెనిన్ మంత్రివర్గంలో ట్రాట్స్కీ, లునా ఛార్‌స్కీ, స్టాలిన్‌లు, ముఖ్య సభ్యులు. విప్లవ రథ సారథి లెనిన్ వ్యూహనిర్మాణ దక్షత వల్ల, 1917 నవంబర్ 7న, బోల్షివిక్ విప్లవం విజయవంతమైంది. తాత్కాలిక ప్రభుత్వం పేకమేడలా కూలిపోయింది.

BRAOU

## 20.8 : పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. 1917 ఫిబ్రవరి (మార్చి) విప్లవ గమనాన్ని సమీక్షించండి.
2. అక్టోబర్ విప్లవానికి దారితీసిన సంఘటనలను విశ్లేషించండి.
3. బోల్షివిక్ విప్లవ గమనాన్ని తెల్పండి.
4. అక్టోబర్ విప్లవానంతర రాజకీయ పరిస్థితిని సమీక్షించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో రష్యా ఎదుర్కొన్న సమస్యలేవి ?

2. తాత్కాలిక ప్రభుత్వ స్థాపన, జార్ రెండో నికలస్ రాజ్య పరిత్యాగ పరిణామాలను వివరించండి
3. 1917 ఏప్రిల్ దినాలు, మే సంక్షోభం, జూన్ ప్రదర్శనల సంఘటనలను విశ్లేషించండి.
4. జూలై సంక్షోభాన్ని వివరించండి.
5. ప్రతీఘాతక విప్లవాన్ని వర్ణించండి.
6. కోర్నిలోవ్ తిరుగుబాటు ప్రయత్నం, దాని పర్యవసానాన్ని చర్చించండి.

## 20.9 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| E. Lipson | **Europe in the 19th & 20th Centuries** |
| Carr E.H. | **Russian Revolution ( 3 vols)** |
| Chamberlain | **Russian Revolution ( 2 Vos)** |
| Wilson Edmund | **To the Finland Station** |
| Ivar Spector | **An Introduction into Russian History and Culture** |
| Gold Stone | **Russian Revolution** |
| Andrew Rothstein | **History of Soviet Union** |
| Christopher Hill | **Lenin & The Russian Revolution** |
| Sydney Harcave | **Russia - A Study** |
| N.N. Sukhanov | **The Russian Revolution - 1917<br>A Personal Record** |
| John Reed | **Ten Days That Shook The World** |


BRAOU

రచయిత : శ్రీ జె.యస్. ప్రకాశరావ్.

# భాగం–21 : రష్యన్ విప్లవ ప్రాధాన్యత


21.0 లక్ష్యాలు
21.1 పరిచయం
21.2 బోల్షివిక్ ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యలు
21.2.1 పెట్రోగ్రాడ్, మాస్కోల్లో జరిగిన బోల్షివిక్ వ్యతిరేక తిరుగుబాట్లు
21.2.2 బోల్షివిక్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు
21.2.3 ప్రభుత్వ పెట్టుబడిదారీ దశ
21.2.4 రాజ్యాంగ పరిషత్తు సమావేశం; రద్దు: పరిణామాలు
21.2.5 జర్మనీతో రష్యా చేసుకున్న బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధి
21.2.6 అంతర్యుద్ధం; విదేశీ జోక్యం
21.2.7 సార్వత్రిక జాతీయీకరణ శాసనం : యుద్ధ కమ్యూనిజం
21.2.8 చెకోస్లోవేకియా సైనిక దళాల సాహస యాత్ర మాజీ జార్ కుటుంబ సామూహిక హత్య
21.2.9 మాజీ జార్ హత్యానంతర పరిణామాలు: అంతర్యుద్ధ తీవ్రత
21.3 సోవియట్ రాజ్యాంగం
21.3.1 నూతన ఆర్థిక విధానం
21.3.2 ట్రాట్స్కీ, స్టాలిన్‌ల మధ్య అధికారం కోసం సాగిన సంఘర్షణ
21.3.3 స్టాలిన్ సంస్కరణలు : సమిష్టి విధానం, పంచవర్ష ప్రణాళికలు
21.3.4 రష్యన్ విప్లవ ప్రాధాన్యత
21.3.5 చైనా, భారతదేశం, స్పెయిన్‌లపై రష్యన్ విప్లవ ప్రభావం
21.3.6 రెండో ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ రాజకీయాల్లో సోవియట్ యూనియన్ పాత్ర: సైనిక కూటాల ఆవిర్భావం
21.3.7 ప్రచ్ఛన్న యుద్ధం : ఆయుధాల పోటీ
21.3.8 సామరస్య శకం
21.3.9 రెండో ప్రచ్ఛన్న యుద్ధం
21.4 గోర్బచేవ్ అనుసరించిన పెరెస్ట్రోయికా, గ్లాస్‌నోస్త్‌ల ప్రభావం
21.5 సంగ్రహంగా
21.6 పరీక్ష నమూనా ప్రశ్నలు
21.7 ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 21.0 లక్ష్యాలు

ఈ భాగాధ్యయనం ద్వారా, ఈ క్రింది విషయాల గురించి తెలుసుకోగలగాలి.

★ లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యలు, ప్రవేశపెట్టిన సంస్కరణలు

- ప్రభుత్వ పెట్టుబడిదారీ దశ ప్రాధాన్యత
- జర్మనీతో యుద్ధాన్ని అంతం చెయ్యడానికి రష్యా చేసుకున్న బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధి
- అంతర్యుద్ధం; విదేశీ జోక్యం
- సోవియట్ రాజ్యాంగం, నూతన ఆర్థిక విధానం
- స్టాలిన్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, ఫలితాలు
- రష్యన్ విప్లవ ప్రాధాన్యత, అంతేకాకుండా, రెండో ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ యూనియన్ అగ్రరాజ్యంగా అవతరణ, సైనిక కూటాల ఆవిర్భావం, ఇతర పరిణామాలు

## 21.1: పరిచయం

ఈ భాగంలో, బోల్షివిక్ విప్లవం విజయవంతమైన తర్వాత, లెనిన్ నాయకత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వం, భూమి, శాంతి మొదలైన సమస్యలను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలను సమీక్షించాలి. అంతేకాకుండా, భీకరంగా కొనసాగిన అంతర్యుద్ధంలో విజయాన్ని సాధించిన తీరును గమనించాలి. రష్యన్ విప్లవ ప్రాధాన్యతను గురించి తెలుసుకోవాలి.

## 21.2: బోల్షివిక్ ప్రభుత్వం ఎదుర్కొన్న సమస్యలు

కెరెన్‌స్కీ నాయకత్వం లోని తాత్కాలిక ప్రభుత్వాన్ని సాయుధ సంఘర్షణ ద్వారా తొలగించి, నవంబర్ 8వ తేదీన బోల్షివిక్‌లు లెనిన్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇల్లు అలకగానే పండుగ కాలేదన్నట్లు, రాజధానిలో అధికారాన్ని స్వాధీనం చేసుకోగానే బోల్షివిక్‌ల సమస్యలు పరిష్కారం కాలేదు. బోల్షివిక్ వ్యతిరేక శక్తులు లెనిన్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోసి, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాయి.

వ్యాపారులు, స్పెక్యులేటర్లు, పెట్టుబడిదారులు, భూస్వాములు, సైనికాధికారులు, రాజకీయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు, దుకాణాల యజమానులు, గుమాస్తాలు, ఏజెంట్లు, బోల్షివిక్‌లను ద్వేషించారు. వ్యతిరేకించారు. ఇతర సోషలిస్ట్ పార్టీలు కూడా, బోల్షివిక్‌లను తీవ్రంగా ద్వేషించాయి. చాలా మంది కార్మికులు, నావికులు, భూమిలేని నిరుపేద రైతాంగం, కొద్దిమంది విజ్ఞానులు మాత్రమే సోవియట్‌ను బలపర్చారు. బోల్షివిక్‌లు అధికారానికి రాగానే, అంతర్యుద్ధ వాతావరణం పెంపొందింది.

అంతేకాకుండా, ప్రభుత్వ గుమాస్తాలు, టెలిఫోన్, టెలిగ్రాఫ్ సాంకేతిక నిపుణులు, పోస్టాఫీసుల్లో పనిచేసే కార్మికులు, బ్యాంకుల్లో పనిచేసే అధికారులు, గుమాస్తాలు కూడా పాత అధికారుల్లాగే వ్యవహరించారు. బోల్షివిక్ వ్యతిరేక విధానాన్ని అనుసరించారు. చివరకు, వార్తలు చేరవేయడానికన్నా ప్రభుత్వానికి మనుషులు కరువయ్యారు. ప్రభుత్వ వ్యవహారాలు, ద్రవ్యం, చలామణి, ద్రవ్య సంబంధమైన వ్యవహారాలు స్తంభించి పోయాయి. రైల్వే కార్మికుల యూనియన్ కూడా, బోల్షివిక్‌లు అధికారాన్ని స్వాధీనం చేసుకోడాన్ని వ్యతిరేకించింది.

### 21.2.1 : పెట్రోగ్రాడ్, మాస్కోల్లో జరిగిన బోల్షివిక్ వ్యతిరేక తిరుగుబాట్లు

కెరెన్‌స్కీకి మద్దతునిచ్చిన కోసక్‌ల పటాలం, జనరల్ పీటర్ క్రాస్నోవ్ నాయకత్వంలో నవంబర్ 10వ తేదీన, జార్ స్కోయీ సోలో (Tsarskoye - Solo) ను ఆక్రమించుకుని, పెట్రోగ్రాడ్‌లో ప్రవేశించడానికి ప్రయత్నించింది. మర్నాడు కొందరు అధికారులు పెట్రోగ్రాడ్ టెలిఫోన్ ఎక్స్ఛేంజి



BRAOU

(Telephone Exchange)ని ఆక్రమించుకోడానికి ప్రయత్నించారు. వారు ఎక్స్ఛేంజి భవనంలోకి చొచ్చుకువచ్చి, స్మోల్నీతో ఉండే వార్తా సంబంధాలను తెంచివేశారు.

రెడ్‌గార్డ్స్ పటాలాలు ఆ రోజంతా భీకరమైన పోరాటాన్ని కొనసాగించి, జనరల్ క్రాస్నోవ్ పటాలాన్ని తరిమివేశాయి. నవంబర్ 15న జనరల్ క్రాస్నోవ్ సైన్యాలు ఓడిపోయిన తర్వాత, యుద్ధాన్ని విరమించాయి. ప్రభుత్వ సైనికులు జనరల్ క్రాస్నోవ్‌ను నిర్బంధించారు.

మాస్కోలో తాత్కాలిక ప్రభుత్వ సైన్యాలు, నవంబర్ 7న క్రెమ్లిన్ (Kremlin) భవనం లోపల అడ్డంకులను (Barricades) నిర్మించుకొని, సంఘర్షణకు తలపడ్డారు. బోల్షివిక్ వ్యతిరేక వర్గాలు తీవ్రంగా ప్రతిఘటించి, చివరకు నవంబర్ 16న లొంగిపోయాయి. పెట్రోగ్రాడ్‌లో తాత్కాలిక ప్రభుత్వం పతనమైందని, సోవియట్లు అధికారాన్ని స్వీకరించాయని, దేశంలోని నగరాలకు, గ్రామాలకు టెలిగ్రామ్‌లిచ్చారు. ఈ టెలిగ్రామ్‌లు అందిన తర్వాత, కొన్ని ప్రాంతాల్లో స్థానిక తిరుగుబాట్లు జరిగాయి.

యూక్రేన్ రాజధాని కీవ్ (Kiev) లోని ప్రజలు, యూక్రేనియన్ రిపబ్లిక్‌ను స్థాపించడానికి ప్రయత్నించారు. టిఫ్లిస్‌లో జార్జియన్ మెన్షివిక్‌లు అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రష్యాలో చాలా ప్రాంతాల్లో నామమాత్ర సంఘర్షణ జరిగిన తర్వాత, బోల్షివిక్‌లు అధికారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

సైన్యం ఎటు మొగ్గుతుందో అప్పటికింకా స్పష్టం కాలేదు. ట్రాట్స్కీ సైనిక దళాల దృక్పథాన్ని తెలుసుకోవడానికి, స్వయంగా యుద్ధ రంగానికి వెళ్లాడు. అక్కడి పరిస్థితిని పరిశీలించి, ఇలా వివరించాడు: "నవంబర్ 12/13 తేదీ చారిత్రక దినం, కెరెన్‌స్కీ తిరోగమిస్తున్నాడు. మన సైన్యాలు పురోగమిస్తున్నాయి. భూములు లేని పేద రైతాంగం, విప్లవ భావాలను జీర్ణించుకున్న నగరాల్లోని అసంఖ్యాక కార్మికులు, బోల్షివిక్‌లకు మద్దతు నిచ్చారు".

బోల్షివిక్‌లకు సైనిక దళాల మద్దతు లభించిన తర్వాత, కెరెన్‌స్కీని నిర్బంధించమని బోల్షివిక్ ప్రభుత్వం ఆదేశించింది. కెరెన్‌స్కీ నావికుని వేషంలో బోల్షివిక్‌ల వలయం నుండి తప్పించుకున్నాడు. బ్రిటీష్ రహస్య ఏజెంట్ సహాయంతో కెరెన్‌స్కీ లండన్‌కు వెళ్లి, అక్కడి నుండి అమెరికా (U.S.A) కు వెళ్లి పోయాడు. బోల్షివిక్‌లు సైన్యాధ్యక్షవర్గాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించి, క్రైలెంకోను సర్వసైన్యాధ్యక్షునిగా నియమించారు.

## 21.2.2 బోల్షివిక్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలు

ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉండి, బోల్షివిక్‌లు ఏకాకిగా ఉన్నప్పుడు, లెనిన్ అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించి, చాలా శాసనాలను ప్రకటించాడు. అక్టోబర్ (నవంబర్) మహా విప్లవం ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి వెంటనే పూనుకుంది. మొదటగా ప్రపంచ శాంతి, భూమి సమస్యల గురించి రెండు డిక్రీలను అమలు చేసింది. తర్వాత కొద్ది నెలల్లో ఉత్పత్తిని నిర్ణయించే విషయంలోనూ, పర్యవేక్షణలోనూ, ఫ్యాక్టరీల్లోని కార్మికుల కౌన్సిళ్లకు అధికారమిస్తూ ప్రభుత్వం డిక్రీని జారీ చేసింది.

బోల్షివిక్ ప్రభుత్వం వ్యక్తులకు భూమిపై కల యాజమాన్య హక్కును రద్దు చేసింది. బ్యాంకులను, పారిశ్రామిక వ్యవస్థలను, వాణిజ్య నౌకాదళాన్ని జాతీయం చేసింది. స్టాక్‌మార్కెట్‌ను రద్దు చేసింది. బంగారాన్ని పూర్తిగా ప్రభుత్వాధిపత్యం కిందికి తెచ్చింది. చక్కెర, నూనె, అగ్గిపెట్టెలు, కాఫీ మొదలైన పరిశ్రమల నన్నిటినీ ప్రభుత్వం జాతీయం చేసింది. పాత క్రిమినల్ న్యాయస్థానాలకు బదులు విప్లవ న్యాయస్థానాలను (Revolutionary tribunals) ఏర్పాటు చేసింది. విప్లవ న్యాయస్థానాల్లో ప్రతి పౌరుడు న్యాయవాదిగానో, న్యాయాధిపతిగానో వ్యవహరించొచ్చు. ప్రభుత్వం పాత వివాహ చట్టాలను తొలగించి,



BRAOU

తేల్చికైన సివిల్ కోడ్‌ను ఏర్పాటు చేసింది. చర్చి వ్యవస్థను రద్దు చెయ్యలేదు. కాని, ప్రభుత్వం చర్చి భూములను స్వాధీనం చేసుకుంది. స్కూళ్లలో మత బోధనను నిషేధించింది. పాత జూలియన్ (Julian) కేలండర్ స్థానే, గ్రిగేరియన్ (Gregarian) కేలండర్‌ను ప్రవేశపెట్టింది. రష్యన్ లిపిని ఆధునీకరించింది. కులీన వర్గాలకు చెందిన బిరుదులను, హోదాలను తొలగించి, ప్రతి వ్యక్తిని పౌరుడు (citizen) అని కాని, కామ్రేడ్ అని కాని, వ్యవహరించాలని నిర్ణయించింది. సాంప్రదాయక విధానాలను అనుసరించే వార్తాపత్రికలను, ప్రభుత్వం తాత్కాలికంగా అణచివేసింది. ఈ విధంగా లెనిన్ నాయకత్వం లోని బోల్షివిక్ ప్రభుత్వం, చాలా శాసనాలను చేసింది.

## 21.2.3 ప్రభుత్వ పెట్టుబడిదారీ దశ

అక్టోబర్ 1917 నుండి 1918 మధ్యవరకు కల దశను, సంధి దశగా పేర్కోవచ్చు. ఈ సంధి దశలో, ప్రభుత్వం కొన్ని పరిశ్రమలను జాతీయం చేసింది. మిగిలిన పరిశ్రమలపై ప్రభుత్వం అజమాయిషీ చేసింది. ఈ సంధి దశను ప్రభుత్వ పెట్టుబడిదారీ (State capitalism) దశగా వ్యవహరించారు. ప్రభుత్వం చాలా రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించింది. కాని, ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణ ఉండేది.

కార్మికుల నియంత్రణ డిక్రీని వ్యాఖ్యానించుకొని అన్వయించుకోడంలో, కొన్ని సందర్భాల్లో సమస్యలు తలెత్తాయి. చాలా సందర్భాల్లో కార్మికుల కౌన్సిళ్లు మొత్తం ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలకు విరుద్ధంగాను, తమ ప్రయోజనాలకు అనుకూలంగాను, కర్మాగారాలను నిర్వహించాయి.

చాలా పరిశ్రమల్లో అర్హులైన సిబ్బంది (Qualified personnel) పనిచేయ నిరాకరించారు. ఈ సంఘటనల్ని లెనిన్ ఖండించాడు. ఈ లోపాలను తొలగించడానికి, లెనిన్ ప్రభుత్వ పెట్టుబడిదారీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానంలో, పెట్టుబడి దారీ విధానం, సామ్యవాదం రెండూ కలిసి ఉన్నాయి. కర్మాగారాలలో పనిచేస్తున్న కార్మికులందరికీ, పరిశ్రమల యాజమాన్య నిర్వహణలో శిక్షణ లేనంత కాలం, సామ్యవాదేతర నిపుణుల సాంకేతిక ప్రావీణ్యాన్ని, వినియోగించుకోవాల్సుంటుందని, లెనిన్ ప్రబోధించాడు. కార్మికులు కర్మాగారాలను నిర్వహించగల నైపుణ్యాన్ని సంపాదించేవరకు, సామ్యవాదులు కాని వారి సాంకేతిక నైపుణ్యంతో, పరిశ్రమలను నిర్వహించాలని సూచించాడు. పెట్టుబడిదారీ విధానాన్నుండి సామ్యవాదానికి పరివర్తన చెందే దశలో, ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానాన్ని మహత్తరమైన ముందడుగుగా, లెనిన్ వర్ణించాడు. "State capitalism" Lenin argued," was a gigantic step forward in the period of transition from capitalism to socalism in which there was a mixture of both".

## 21.2.4 రాజ్యాంగ పరిషత్తు సమావేశం : రద్దు : పరిణామాలు

కెరెన్‌స్కీ ప్రభుత్వం నవంబర్ 25న రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలను నిర్వహించాలని ముందే నిర్ణయించింది. అధికారంలోకి రాకముందు బోల్షివిక్‌లు కూడా ఎన్నికలను జరిపించాలని కోరారు. బోల్షివిక్‌లు ఈ ఎన్నికలను నిర్వహించారు. 42 మిలియన్ల రష్యన్లు ఎన్నికల్లో పాల్గొన్నారు. బోల్షివిక్‌లకు 30% ప్రజలు, కర్షకులకు ప్రాతినిధ్యం వహించిన సోషలిస్ట్ రివల్యూషనరీలకు 58% ప్రజలు మద్దతు నిచ్చారు. సాంప్రదాయక వర్గానికి , మధ్యతరగతి వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన పార్టీలకు 12% ప్రజలు మద్దతు నిచ్చారు. ఈ పార్టీలకు 2 మిలియన్ల ఓట్లు మాత్రమే వచ్చాయి.



BRAOU

సోవియట్ రెండో కాంగ్రెస్ నిజమైన ప్రజాభిప్రాయాన్ని తెలియచేసిందని, రాజ్యాంగ పరిషత్తు కాంగ్రెస్ అధికారాన్ని గుర్తించి, ఎలాంటి అలజడి చేయకుండా రద్దు కావాలని, ఎన్నికలు జరిగే ముందే లెనిన్ చెప్పాడు.రాజ్యాంగ పరిషత్తులోని చాలా మంది ప్రతినిధులు సోవియట్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడంతో, ఈ సమావేశం వ్యర్థమైంది.

ట్రాట్స్కీ, ఇతర బోల్షివిక్ నాయకులు ,రాజ్యాంగ పరిషత్తు విప్లవ వ్యతిరేక సంస్థని ప్రకటించారు. సోషలిస్ట్ రివల్యూషనరీలు రాజ్యాంగ పరిషత్తులో మెజారిటీ సంపాదించినా, కర్షకుల ప్రయోజనాలకు వారు ప్రాతినిధ్యం వహించరని, తామే కర్షకులకు నిజమైన ప్రతినిధులమని బోల్షివిక్ లు చెప్పుకున్నారు.

బోల్షివిక్ విప్లవాన్ని వ్యతిరేకించి, పదవులను కోల్పోయిన రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు రాజ్యాంగ పరిషత్తును సమర్థించారు. నవంబర్ విప్లవం తర్వాత ప్రభుత్వం ఆమోదించిన ముఖ్య శాసనాలను, రాజ్యాంగ పరిషత్తు చేత శాంతియుతంగా ఆమోదింప చేయాలని బోల్షివిక్ లనుకున్నారు. వీరి అభిప్రాయాలతో వాము పక్ష సోషలిస్ట్ రివల్యూషనరీలు కూడా అంగీకరించారు.

ఈ ఉద్దేశంతోనే, జనవరి 16న కేంద్ర కార్యనిర్వాహక వర్గం (Central Executive Committe) శ్రామిక వర్గాల ప్రజల హక్కుల గురించి చేసిన శాసనాలను అన్నిటినీ కలిపి, ఒక ప్రకటన చేసింది.

రాజ్యాంగ పరిషత్తు పెట్రోగ్రాడ్ లో 1918, జనవరి 18న సమావేశమైంది. రాజ్యాంగ పరిషత్తు బోల్షివిక్ లు ప్రవేశపెట్టిన హక్కుల ప్రకటనను చర్చించడానికి కూడా నిరాకరించింది. జనవరి 19 వ తేదీ రాత్రి బోల్షివిక్ లు, వామపక్ష సోషలిస్ట్ రివల్యూషనరీలు, రాజ్యాంగ పరిషత్తును బహిష్కరించారు. రాజ్యాంగ పరిషత్తు తన చర్యల ద్వారా విప్లవ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రోత్సహిస్తోందని,రెండు పార్టీలు బహిష్కరించాయి. మర్నాడే కేంద్ర కార్యనిర్వాహక సమితి (Central Executive Commitee) రాజ్యాంగ పరిషత్తును రద్దు చేసింది. ప్రజాస్వామిక భావాలు ఈ విధంగా రష్యాలో అంతమయ్యాయి.

చాలా మంది రాజ్యాంగ పరిషత్తు ప్రతినిధులు విదేశాలకు పారిపోయారు. మిగిలిన వారు బోల్షివిక్ లతో సాయుధ సంఘర్షణకు సన్నద్ధమౌతున్న బోల్షివిక్ వ్యతిరేక శక్తులతో కలిశారు.

అంతర్యుద్ధం రగుల్కొన్న రోజుల్లో చర్చలు జరపడం సాధ్యం కాదని, రాజ్యాంగ పరిషత్తు సమావేశాన్ని జరపకముందే దాని ప్రాధాన్యత పోయిందని, విప్లవ వ్యతిరేక కుట్రకు ఈ సభను వాడుకునే అవకాశం ఉందని, బోల్షివిక్ లు వాదించారు.

రాజ్యాంగ పరిషత్తును రద్దు చేసినా, సామాన్య ప్రజానీకం ఈ చర్యను గర్హిస్తూ ఎలాంటి ప్రదర్శనలను జరపలేదు. బోల్షివిక్ లు అధికారాన్ని స్వాధీనం చేసుకోగానే, శాంతి సమస్య, భూమి సమస్యల గురించి అత్యధిక సంఖ్యాకులైన ప్రజల అభిప్రాయం ప్రకారం నిర్ణయించడం వల్ల, రాజ్యాంగ పరిషత్తులో చర్చలపట్ల సామాన్య ప్రజలు ఏమీ అభిలాషను చూపించలేదు. రాజ్యాంగ పరిషత్తును రద్దు చేసిన తర్వాత, రష్యాలో ఒకే పార్టీ పరిపాలన మొదలైంది. పార్లమెంటరీ ప్రజాస్వామిక వ్యవస్థ విజయవంతంగా పనిచెయ్యడానికి అవసరమైన లక్షణాలు-పయోజనవిద్య, వ్యవస్థీకృతమైన మధ్యతరగతి వర్గం, శాంతియుత మార్గాల ద్వారా భేదాభిప్రాయాలను సర్దుబాటు చేసుకునే పద్ధతి, వ్యక్తుల ఆస్తి హక్కు,ఇతరుల హక్కుల గుర్తింపు, రష్యాలో లేవు.

అందువల్ల, జారిస్ట్ వ్యవస్థ పతనమైన తర్వాత, అంతర్యుద్ధంలో చివరకు బోల్షివిజమ్ విజయాన్ని సాధించింది. అలా కాకుండా అంతర్యుద్ధంలో బోల్షివిక్ లే ఓడిపోయుంటే ,రష్యాలో సైనిక నియంతృత్వమో, రాచరిక నియంతృత్వ పునరుద్ధరణో, జరిగి ఉండేది. అంతేకాని, రాజ్యాంగ పరిషత్తులోని ఉదారవాద, మితవాద రాజకీయ పార్టీలు రష్యాను పరిపాలించి ఉండేవి కాదు.

## 21.2.5 జర్మనీతో రష్యా చేసుకున్న బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధి

రష్యాలో బోల్షివిక్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా యుద్ధాన్ని అంతమొందించి, శాంతి స్థాపనకు చర్యలు తీసుకుంది. జర్మనీతో సంప్రదింపులు జరపడానికి ట్రాట్స్కీ నాయకత్వంలో, రష్యన్ ప్రతినిధి వర్గం బ్రెస్ట్‌లిటోవిస్క్ (Brestlitovisk) నగరానికి చేరింది . ప్రాథమిక చర్చలు జరిగిన తర్వాత, రెండు వారాలు యుద్ధాన్ని ఆపడానికి రెండు దేశాలు అంగీకరించాయి. కాని, రష్యన్లు సంప్రదింపుల్లో కాలయాపనా విధానాన్ని అనుసరించడంతో, జర్మన్ సైన్యాలు తిరిగి సైనిక చర్యలు జరిపి, పెట్రోగ్రాడ్ వరకు పురోగమించాయి. సోవియట్ ప్రభుత్వ మనుగడకే తీవ్రమైన ప్రమాదమేర్పడింది.

ఈ పరిస్థితుల్లో జర్మన్లు విధించిన అవమానకరమైన షరతులను ఆమోదించి, సంధి చేసుకోక తప్పదని, లెనిన్ ప్రకటించాడు. లెనిన్ ప్రతిపాదనకు బోల్షివిక్ కేంద్ర కమిటీలోను, సోవియట్ కాంగ్రెస్ కేంద్ర కార్యనిర్వాహక కమిటీలోను, తీవ్రమైన ప్రతిఘటన ఎదురైంది. స్వల్ప మెజారిటీతో లెనిన్ ప్రతిపాదనలు ఆమోదాన్ని పొందాయి. బోల్షివిక్ కేంద్ర కమిటీలో లెనిన్ ప్రతిపాదనకు అనుకూలంగా 7, ప్రతికూలంగా 4, తటస్థంగా 4 వోట్లు లభించాయి. సోవియట్ కాంగ్రెస్ కార్యనిర్వాహక కమిటీలో, లెనిన్ ప్రతిపాదనకు అనుకూలంగా 126, వ్యతిరేకంగా 85, తటస్థంగా 28 ఓట్లు వచ్చాయి.

రష్యా జర్మనీతో 1918 మార్చి 3వ తేదీన బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధిని, చేసుకుంది. ఈ సంధివల్ల, రష్యా 56 మిలియన్ల ప్రజలు నివసించే 4,84,000 చదరపు కిలోమీటర్ల సారవంతమైన ప్రదేశాన్ని కోల్పోయింది. ఈ అవమానకరమైన సంధి వల్ల, రష్యా 1/3 వంతు జనాభా, 1/4 వంతు భూభాగం, 1/2 వంతు పరిశ్రమలు, చాలా జాతీయ ఆదాయాన్ని కోల్పోయింది. అంతే కాకుండా, జార్జియా, యూక్రేన్‌ల స్వాతంత్ర్యాన్ని గుర్తించడానికి, ఫిన్‌లాండ్ స్వాతంత్ర్యాన్ని మన్నించడానికి, సోవియట్ ప్రభుత్వమంగీకరించింది.

ఈ సంధిపై సంతకం చేసిన తర్వాత, రష్యా యుద్ధం నుండి విరమించుకుంది. నాల్గవ అఖిల రష్యన్ కాంగ్రెస్ సోవియట్ (Fourth All- Russian Congress of Soviets) మార్చి 16న బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధిని ధృవపర్చింది. ఈ సంధి జర్గ్గానే, రష్యా రాజధానిని పెట్రోగ్రాడ్ నుండి మాస్కోకు మార్చారు.

మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా విపరీతంగా నష్టపోయింది. ఇరవై లక్షల మంది సైనికులు మరణించారు. నలభై లక్షల మంది సైనికులు గాయపడ్డారు. ఇరవై అయిదు లక్షల మంది సైనికులు ఖైదీలుగా పట్టుబడ్డారు.

## 21.2.6 అంతర్యుద్ధం : విదేశీ జోక్యం

ఈ అంతర్యుద్ధం 1918 వేసవి నుండి 1919 వేసవి వరకు జరిగింది. కర్షకుల్లో ప్రబలిన తీవ్రమైన అసంతృప్తి, బోల్షివిక్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చాలా వర్గాల్లో పెరిగిన అసంతృప్తి, మాజీ సైనికాధికారుల దోపిడీ విధానాలు, అంతర్యుద్ధానికి ముఖ్య కారణాలు. లెనిన్ నాయకత్వంలో ఏర్పడిన బోల్షివిక్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి, ఇంగ్లీష్, ఫ్రెంచి ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నించాయి. ఈ రెండు దేశాల్లోని అధికార వర్గాలు ఆయుధాలను సరఫరా చేసి, సైనికులను పంపించి, అవసరమైనంత ధన సహాయాన్ని చేసి, బోల్షివిక్‌లతో పోరాడేవారిని ప్రోత్సహించాయి. ఇతర ఐరోపీయ రాజ్యాల మద్దతుతో, విప్లవ వ్యతిరేక శక్తులు సోవియట్ ప్రభుత్వాన్ని కూలదోసే ఉద్దేశంతో, అంతర్యుద్ధాన్ని ప్రారంభించడంతో, 1918 వేసవిలో,ఆర్థిక రంగంలో అన్ని రకాలైన ప్రయోగాత్మక ప్రయత్నాలను, ప్రభుత్వం నిలిపివేసింది. ఆగ్నేయాసియాలో రష్యన్ ప్రాంతాలను ఆక్రమించుకోవాలని,తద్వారా తన ప్రభావాన్ని పెంపొందించుకోవాలని

జపాన్ అనుకుంది. అమెరికన్లు మాత్రం రష్యా ఆంతరంగిక విధానాల్లో జోక్యం చేసుకోదల్చుకోలేదు. బోల్షివిక్‌లపై యుద్ధాన్ని ప్రకటించాలని బ్రిటన్, ఫ్రాన్స్‌లు చేసిన ప్రయత్నాలను, అమెరికా అధ్యక్షుడు (U.S.A. President) ఉడ్రో విల్సన్ ప్రోత్సహించ లేదు.

మిత్ర రాజ్యాల ఉన్నత యుద్ధ సమితి (Supreme War Council of the Allies)1918 జూలైలో, రష్యాలో సైనిక జోక్యం చేసుకోడానికి నిశ్చయించింది. 15,000 అదనపు మిత్ర రాజ్యాల సైన్యాలు ఆగస్టులో ఆర్కేంజల్‌ను ఆక్రమించుకున్నాయి. బ్రిటీష్ సైన్యాలు కాకసస్‌లోని చమురు గనులను, బాకూ (Baku) ను ఆక్రమించుకున్నాయి. ఆర్కేంజల్‌కు పంపిన సైనిక దళాల్లోని అమెరికన్ సైనికులు, ఆయుధ సరఫరా కేంద్రాలను కాపాడుకోవడం కోసం మాత్రమే, సంఘర్షణలో పాల్గొన్నారు. జపాన్ సైనిక దళాలు రష్యన్ భూభాగాలను ఆక్రమించుకోకుండా నిరోధించడానికూడా, అమెరికన్ సైన్యాలు వెళ్లినట్లు అమెరికన్ చరిత్రకారులు రాశారు. లెనిన్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కూలదోయడానికి, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు ప్రయత్నించాయని, బోల్షివిక్‌లు ఆరోపించారు. ఈ ఆరోపణలు నిజమేనని చాలా మంది చరిత్రకారులు అంగీకరించారు. అమెరికా (U.S.A) కూడా బోల్షివిక్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నించిందని రష్యన్లు చేసిన ఆరోపణ, పూర్తిగా నిరాధారమైందని అమెరికన్ చరిత్రకారుల అభిప్రాయం.

సోవియట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన రష్యన్లు తెల్ల సైన్యాలను (White Army) ఏర్పాటు చేసుకున్నారు. దక్షిణ రష్యా, బాల్టిక్ ప్రాంతాలు, ఉత్తర రష్యాలు, తెల్ల సైన్యాలకు ప్రధాన కేంద్రాలు. ఈ సైన్యాలకు బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా, జపాన్‌లు ఆయుధాలను సరఫరా చేశాయి. విప్లవ వ్యతిరేక శక్తులు తెల్ల సైన్యాన్ని పూర్తిగా సమర్థించాయి.

తెల్ల సైన్యానికి (White Amy) దీటుగా, బోల్షివిక్ ప్రభుత్వం ఎర్ర సైన్యాన్ని (Red Army) ఏర్పాటు చేసింది (23.2.1918). ఆ సైన్యానికి సరైన దుస్తులు, తిండి, ఆయుధాలు లేవు. క్రమశిక్షణ తక్కువ. సైనికాధికారులు జార్ సైన్యంలో వారే కావడంవల్ల, సోవియట్ ప్రభుత్వం వారిని నమ్మలేదు.

దేశంలో అంతర్యుద్ధం ప్రజ్వరిల్లిన కాలంలో, ట్రాట్స్కీ అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు. అంతర్యుద్ధం ప్రజ్వరిల్లిన అన్ని ముఖ్య ప్రాంతాలకు ప్రత్యేక రైలులో వెళ్లి, ప్రభుత్వ సైనిక దళాలకు ఉత్సాహాన్ని, ధైర్యస్థైర్యాలను కల్పించి, వారిని కర్తవ్యోన్ముఖులుగా చేశాడు. కొద్ది కాలం లోనే, సైనిక వ్యూహ రచనలో అసాధారణ ప్రతిభాశాలి అయ్యాడు.

ఎర్ర సైన్యంలో, సెమ్యాన్ బుడేని(Semyon Budeny), క్లైమెంటీవారోషిలోవ్(Clementi Voroshiliov), జోసెఫ్ స్టాలిన్ (Joseph Stalin) లు ముఖ్యాధికారులు.

1918 లో ట్సారిట్సిన్ (Tsaritsyn) నగరాన్ని కాపాడ్డంలో, వారోషిలోవ్, స్టాలిన్‌లు ప్రముఖ పాత్ర నిర్వహించారు. ట్సారిట్సిన్ నగరమే తర్వాత స్టాలిన్‌గ్రాడ్ అయింది. ప్రస్తుతం, ఈ నగరం పేరు, వోల్గాగ్రాడ్ (Volgagrad). నిర్బంధ సైనిక విధానాన్ని ప్రవేశపెట్టిన అప్పట్లో, ఎర్ర సైన్యం సంఖ్య ఆరు లక్షలకు మించ లేదు. ఎర్ర సైన్యాన్ని తెల్ల సైన్యం హఠాత్తుగా ఎదుర్కొని, పూర్తిగా ధ్వంసం చేస్తుందని, రష్యాలో మిత్ర రాజ్యాలకు అనుకూలంగా ఉండే ప్రభుత్వ మేర్పడుతుందని, అప్పుడు జర్మనీకి వ్యతిరేకంగా తిరిగి తూర్పున యుద్ధాన్ని ప్రారంభించవచ్చని, మిత్ర రాజ్యాలు భావించాయి. ఐరోపీయ రాజ్యాల సైన్యాన్ని, తెల్ల సైన్యాన్ని, సోవియట్ ప్రభుత్వ ఎర్ర సైన్యం ఎదుర్కొని, భీకర పోరాటాన్ని కొనసాగించింది. ఈ క్లిష్ట సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు విద్రోహాన్ని కల్పించే ప్రయత్నాలు జరిగాయి. సోవియట్ ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఉత్పత్తి రంగాన్ని విచ్ఛిన్నం చేయసాగాయి. సోవియట్ ప్రభుత్వం నిపుణులకూ, చిన్న వ్యాపారులకు ఇచ్చిన స్వేచ్ఛను వారు దుర్వినియోగం చేయసాగారు. మిత్ర రాజ్యాలు భావించినట్లుగానే, 'తెల్ల సైన్యం' అన్ని యుద్ధ రంగాల్లో, మొదట్లో కొన్ని విజయాలను సాధించింది. కాని, చివరకు ఈ భీకర పోరాటంలో ఎర్ర సైన్యాలు విజయాన్ని సాధించడానికి, పరిశ్రమలను, వ్యవసాయాన్ని

పెంపొందించి, ప్రభుత్వం ప్రజలను సిద్ధం చేసింది.

## 21.2.7 సార్వత్రిక జాతీయీకరణ శాసనం : యుద్ధ కమ్యూనిజమ్

ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే ప్రయత్నాలను అణచివేయడానికి, ఉత్పత్తిని అధికం చెయ్యడానికి, అంతర్యుద్ధాన్ని అణచివేయడానికీ, సోవియట్లు 1918 జూన్ 28వ తేదీన సార్వత్రిక జాతీయీకరణ శాసనాన్ని (Decree of General Nationalisation) అమలు చేశారు. ప్రైవేట్ పెట్టుబడిదారులు విప్లవానికి విద్రోహం తలపెట్టకుండా వుండే నిమిత్తం, సోవియట్ ప్రభుత్వం జాతీయీకరణాన్ని బాగా ప్రోత్సహించింది. 1918 జూలై నెల్లో, ఇనుము, ఉక్కు, రసాయనిక, వస్త్ర, చమురు పరిశ్రమలను, వాటి యజమానులకు నష్ట పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ పరిశ్రమలన్నిటినీ "ఆర్థిక వ్యవస్థ ఉన్నత సంఘం" (Supreme Council of the National Economy) అజమాయిషీలో ఉంచింది. 10 మంది కార్మికులు పనిచేసే సంస్థలను, 5 గురు కార్మికులు యంత్రాల సహాయంతో పని చేసే సంస్థలను కూడా ప్రభుత్వం జాతీయం చేసింది. అందువల్ల, ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెంది, స్వయంసమృద్ధికి దారితీసింది. ఈ దశను "యుద్ధ కాల కమ్యూనిజమ్ దశ" (War Communism) గా వర్ణించారు. యుద్ధ కాల కమ్యూనిజమ్ దశలో, మార్కెట్ల ప్రసక్తి లేకుండా ప్రభుత్వమే అధికారాన్ని కేంద్రీకరించుకుంది. సోవియట్ ప్రభుత్వం ప్రైవేట్ పెట్టుబడులకూ, వ్యాపారానికి స్థానం కల్పించకుండా, కేంద్రీకృతమైన ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ (Centralised Planned Economy) ను ఏర్పర్చాలని నిశ్చయించింది.

నిర్బంధంగా వ్యవసాయ వస్తువుల సేకరణ, ప్రైవేట్ వ్యాపారంపై నిషేధం, పరిశ్రమల జాతీయీకరణ (The compulsory Procurement of agricultural produce, the nationalisation of all industry and the ban on all trade), యుద్ధ కాలపు కమ్యూనిజమ్ లక్షణాలు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను తన గుప్పిట్లో ఉంచుకుంది. రేషనింగ్ పద్ధతిని ప్రవేశపెట్టి, సైనికులకు, కార్మికులకు రేషన్ ఇచ్చేవారు. ఈ విధంగా సోవియట్ ప్రభుత్వం చాలా ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ప్రభుత్వానికి ఆర్థిక వ్యవస్థను నిర్వహించడానికి అవసరమైన అనుభవం లేకముందే, ఆర్థిక వ్యవస్థను కేంద్రీకృతం చేసింది. ఈ చర్యల ఫలితంగా ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. అందువల్ల రైతులు, వ్యాపారులు, చిన్న వ్యాపారస్తులు అసంతృప్తులయ్యారు. ఈ పరిస్థితిని జార్ చక్రవర్తి అనుకూల వర్గం వారు, తమకు అనుకూలంగా ఉపయోగించసాగారు.

## 21.2.8 చెకోస్లోవేకియా సైనిక దళాల సాహస యాత్ర : మాజీ జార్ కుటుంబ సామూహిక హత్య

1918 వేసవి నుండి 1919 వేసవి వరకు కొనసాగిన అంతర్యుద్ధంలో విదేశీ జోక్యం పూర్తిగా విఫలమయ్యే లోపల, సైనిక చరిత్రలోనే జరిగిన ముఖ్య ఘట్టం, చెకోస్లోవేకియా సైనిక దళాల సాహస యాత్ర- జెక్ లీజియన్ (CZECH LEGION) గురించి పరిశీలిద్దాం. జెక్ లీజియన్ లోని సభ్యులు జర్మన్లకు, ఆస్ట్రియన్లకు వ్యతిరేకంగా, స్వతంత్ర జెకోస్లోవేకియాను స్థాపించడానికి పోరాడారు. బ్రెస్ట్‌లిటోవిస్క్ సంధి తర్వాత, రష్యా యుద్ధం నుండి వైదొలగింది. అందువల్ల, ఈ దళాన్ని రష్యా నుండి ఖాళీ చేయించాలని మిత్ర రాజ్యాలు భావించాయి. ఈ సైన్యం రష్యా నుండి బయటపడాలంటే, రష్యన్ భూభాగంలో సుమారు 4800 కిలోమీటర్లు ప్రయాణం చెయ్యాలి. జెక్ దళం విప్లవ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతోందని, ప్రాంతీయ సోవియట్లు అనుమానించాయి. అందువల్ల, జెక్ దళానికి, ప్రాంతీయ సోవియట్లకు మధ్య, సంఘర్షణ జరిగింది. జెక్ దళం వెంటనే ట్రాన్స్ సైబీరియన్ రైల్వే ను ఆక్రమించుకొని, బోల్షివిక్ వ్యతిరేక



BRAOU

దళాలతో చేతులు కలిపింది.

జెక్ దళం సాహస యాత్ర, మాజీ జార్ రెండో నికలస్, అతని కుటుంబ సభ్యుల సామూహిక హత్యకు దారితీసింది.

1918 ఏప్రిల్‌లో మాజీ జార్ రెండో నికలస్‌ను కుటుంబ సహితంగా ఉరల్స్ పర్వతాల్లోని ఇకాటెరిన్ బర్గ్ (Ekaterinburg) లో, ఒక వ్యాపారి ఇంట్లో ప్రాంతీయ సోవియట్ అధికారులు నిర్బంధించారు. 1918 జూలై నెల్లో జార్‌కు అనుకూలమైన విప్లవ వ్యతిరేక సైన్యాలతో జెక్ దళం వస్తోందని పుకార్లు వ్యాపించాయి. ప్రతీఘాతుక శక్తులు (Counter - Revolutionary Forces) మాజీ జార్ కుటుంబాన్ని కాపాడి, తిరిగి నికలస్‌ను సింహాసనపై కూర్చోపెట్టడానికి ప్రయత్నిస్తాయని, సోవియట్ అధికారులు తీవ్రంగా అనుమానించారు. పదవీ భ్రష్టుడైన రాజు విప్లవానికి ప్రమాదం కావచ్చని అనుమానించి, 1918, జూలై 16న (16.7.1918), మాజీ జార్ నికలస్‌ను, అతని కుటుంబ సభ్యులను అందర్నీ సైనికులు చంపేశారు. ఈ దారుణ హత్యలు జరిగాక, రష్యా అంతటా అంతర్యుద్ధం భీకరంగా కొనసాగింది. బోల్షివిక్ నాయకత్వం ఈ హత్యలను పురికొల్పలేదు.

## 21.2.9 మాజీ జార్ హత్యానంతర పరిణామాలు : అంతర్యుద్ధ తీవ్రత

ప్రజాస్వామ్య రక్షణకు నడుంకట్టి పోరాడుతున్నాయనే ఉద్దేశ్యంతో, తెల్ల సైన్యాలకు పశ్చిమ దేశాలు మద్దతునిచ్చాయి. అంతర్యుద్ధంలో తెల్లసైన్యాలు సాగించిన దురంతాల గురించి, పశ్చిమ దేశాల్లోని ప్రజలకు తెలియగానే, వారు తమ ప్రభుత్వాల వైఖరిని గర్హించారు. సైనికాధికారులు తెల్ల సైన్యాలను, దోపిడీలను ఆపాల్సిందని ఆదేశించారు. అప్పటినుండే, తెల్ల సైన్యాల తిరోగమనం మొదలైంది. దోపిడీల పైనే తెల్ల సైన్యాల పురోగమనం ఆధారపడింది.

యూక్రేన్, క్రిమియా, రష్యన్ పోలెండ్, ఫిన్‌లాండ్‌ల్లో, బోల్షివిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సైనిక ప్రతిఘటన జరిగింది. పోలెండ్, ఫిన్‌లాండ్ దేశాలు స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాయి. బోల్షివిక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు పూర్తిగా విఫలమైంది. తిరుగుబాటు నాయకుల ఆశలు పేకమేడల్లా కూలిపోయాయి. విదేశీ జోక్యం సోవియట్ ప్రభుత్వ పతనాన్ని సాధించలేకపోయింది.

రష్యాలో విదేశీయుల పట్ల వ్యతిరేక భావం పెరిగింది. ఈ విధంగా, లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ ప్రభుత్వం రష్యాలో బలపడ్డానికి, విదేశీ జోక్యం కొంతవరకు కారణం.

బోల్షివిక్‌లు అధికారాన్ని హస్తగతం చేసుకున్న తొలి రోజుల్లో తలెత్తిన సమ్మెలను ,సైనిక విద్రోహ చర్యలను, నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. బోల్షివిక్‌లు ఛెకా (Cheka) అనే కొత్త రహస్య పోలీస్ వ్యవస్థను (Secret police organisation) ఏర్పాటు చేశారు. ఫ్రెంచి విప్లవం ఉధృతంగా కొనసాగిన రోజుల్లో భీభత్స పరిపాలన (Reign of Terror) కొనసాగినట్లే, బోల్షివిక్‌లు కూడా భీభత్స విధానాలను అనుసరించారు. బోల్షివిక్‌లు వేలకొద్దీ శత్రువులను నిర్బంధించి, ఉరి తీశారు. 1920 నాటికి, రష్యాలో శాంతి నెలకొంది. మిత్ర రాజ్యాలు తమ సైన్యాలను ఉపసంహరించుకున్నాయి. బోల్షివిక్‌ల అధికారానికి ఇక దేశంలో తిరుగులేదు.

## 21.3 సోవియట్ రాజ్యాంగం

లెనిన్ నాయకత్వంలోని సోవియట్ ప్రభుత్వం 1918 ఏప్రిల్ వరకు, ఒక రాజ్యాంగం లేకుండా వ్యవహరించింది. విప్లవం విజయవంతమైన ఆరు నెలల్లోనే, 1918 ఏప్రిల్ లో కేంద్ర కార్యనిర్వాహక సమితి

రాజ్యాంగాన్ని తయారు చెయ్యడానికి ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ సభ్యులు రాజ్యాంగాన్ని-ప్రాథమిక సూత్రాల ముసాయిదా (Draft of the Fundamental Laws or Constitution)- తయారు చేశారు. రాజ్యాంగాన్ని 5వ సోవియట్ కాంగ్రెస్‌కు సమర్పించారు. అయిదో సోవియట్ కాంగ్రెస్ ఈ రాజ్యాంగాన్ని ఆమోదించింది (10-7-1918). ఈ రాజ్యాంగం ప్రకారమే, 1936 వరకు సోవియట్ ప్రభుత్వం వ్యవహరించింది. రష్యాను "కార్మికుల, కర్షకుల, సైనికుల, డెప్యూటీల రిపబ్లిక్" (a Republic of Workers, Soldiers and Peasants Deputies) గా ప్రకటించింది. అప్పటినుండి రష్యాను "రష్యన్ సోషలిస్ట్ ఫెడరేటెడ్ సోవియట్ రిపబ్లిక్స్" (RUSSIAN SOCIALIST FEDERATED SOVIET REPUBLICS (R.S. F.S.R) గా వ్యవహరించారు.

రష్యాలో సామ్యవాద వ్యవస్థను స్థాపించడమే కాకుండా, అన్ని దేశాల్లో సామ్యవాద వ్యవస్థను స్థాపించడమే దాని ఆశయమని, సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా, రష్యా సంధి యుగంలో ఉందని, అందువల్ల శ్రామిక వర్గ నియంతృత్వం పరిపాలిస్తుందని, బూర్జువా వ్యవస్థను పూర్తిగా అణచివేసి, పీడిత ప్రజానీకాన్ని అణచివేసే శక్తులను అణగదొక్కడమే తన ఆశయమని ప్రకటించంది. ప్రతి వ్యక్తి నిర్బంధంగా పనిచెయ్యాలనే సూత్రాన్ని ప్రకటించారు. ప్రభుత్వం గతంలో అనేక వ్యవస్థలను జాతీయం చేస్తూ ఆమోదించిన శాసనాలను, కొత్త రాజ్యాంగంలో ధృవపర్చారు. కొన్ని పరిధులకు లోబడి, రాజ్యాంగం సివిల్ హక్కులను ఆమోదించింది. మత స్వేచ్ఛ, మతాన్ని వ్యతిరేకించే వారికి స్వేచ్ఛ, కార్మికులకు, నిరుపేద కర్షకులకు ఉచిత విద్యను పొందే హక్కు లభించాయి.

నగర, గ్రామీణ సోవియట్ల నుండి అధికారం మొదలౌతుంది. 18 సంవత్సరాలు దాటిన స్త్రీ పురుషులు సోవియట్లకు ప్రతినిధులను బహిరంగ ఓటింగ్ పద్ధతి ద్వారా ఎన్నుకోవాలి. మతాధికారులు, రోమ్‌నావ్ రాజవంశ సభ్యులు, పోలీస్ ఏజెంట్లు, వ్యాపారులు, వ్యాపార వర్గాల వారి ప్రతినిధులు, పిచ్చివారు, నేరస్థులు మాత్రం ఓటు వెయ్యడానికి వీల్లేదు.

25,000 నగరవాసులు ఒక ప్రతినిధిని ఎన్నుకుంటారు. 1,2,5000 గ్రామీణ పౌరులు ఒక ప్రతినిధిని ఎన్నుకుంటారు. నగరాల పౌరుల విధేయతపై సోవియట్ ప్రభుత్వం ఎక్కువగా ఆధారపడింది. ప్రాంతీయ సోవియట్లపైన కేంటన్‌కు, జిల్లాలకు, రాష్ట్రాలకు, సోవియట్ కాంగ్రెస్‌లను ఏర్పాటు చేశారు.

ఈ సోవియట్లకు ప్రతినిధులను పరోక్ష ఎన్నికల (indirect elections) ద్వారా ఎన్నుకుంటారు. కాంటన్ సోవియట్ నుండి జిల్లా సోవియట్ కాంగ్రెస్ కు పరోక్షంగా ప్రతినిధులను ఎన్నుకునేవారు. అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ (All Russian Congress of Soviets) అత్యున్నత శాసన సభ. ఈ కాంగ్రెస్‌కు కూడా ప్రతినిధులను పరోక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే వారు. అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ కేంద్ర కార్యనిర్వాహక కమిటీకి (Central Executive Commitee) శాసన సభ నుండి ప్రతినిధులను ఎన్నుకుంది. శాసన సభ సమావేశంలో లేనప్పుడు, కేంద్ర కార్యనిర్వాహక కమిటీ శాసన సభ నిర్వహించే కార్యక్రమాలను అమలు జరుపుతుంది. పరిపాలనా నిర్వహణకు కేంద్ర కార్యనిర్వాహక కమిటీ 18 మంది కమిసార్లను (Commissars) ఎన్నుకుంది. ఈ కమిసార్లే (Commissars) సోవియట్ రష్యా మంత్రి మండలి.

1918 మార్చిలో రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ లేబర్ పార్టీ (బోల్షివిక్) (Russian Social Democratic Labour Party (R.S.D.L.P (B)) ని రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీగా మార్చారు. పార్టీ పేరే మారింది కాని, ఆశయాల్లో, సిద్ధాంతాల్లో మార్పు లేదు.

## 21.3.1 నూతన ఆర్థిక విధానం

1921 నాటికి సోవియట్ ప్రభుత్వం దేశంలో పూర్తిగా అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అయినా, సోవియట్ ప్రభుత్వం చాలా సమస్యలను ఎదుర్కోవాల్సొచ్చింది. ఓల్గా (Volga) ప్రాంతంలో కరువు

వచ్చింది. ప్రభుత్వం ఆహార పదార్థాలను నిర్బంధంగా సేకరించడంవల్ల, రైతులు తమకు అవసరమైన దానికంటే ఎక్కువ పండించ లేదు. కరువు వల్ల లక్షలాది ప్రజలు మరణించారు. పారిశ్రామిక ఉత్పత్తి 15% పడిపోయింది.

బోల్షివిక్ విప్లవ విజయానికి తోడ్పడ్డ క్రాన్‌స్టాడ్ నావికులే పత్రికా స్వాతంత్ర్యాన్ని, రహస్య ఓటింగ్ పద్ధతిని, రాజ్యాంగ సభను కావాలని కోరుతూ, తిరుగుబాటు చేశారు.

ఈ తిరుగుబాటు జరుగుతూ ఉండగా, పదో కమ్యూనిస్ట్ కాంగ్రెస్ సమావేశాన్ని జరిపింది. ఉత్పత్తిని పెంచే సమస్యను గురించే ఈ కాంగ్రెస్ చర్చించింది. ఈ సమావేశంలో లెనిన్ ప్రసంగిస్తూ, కార్మికుల, కర్షకుల పరిస్థితి దిగజారడంవల్ల, ఉత్పత్తిని పెంచడానికి వచ్చే అడ్డంకులను తొలగించాలన్నాడు. వెనుకబడ్డ వ్యవసాయక రష్యాను పారిశ్రామిక దేశంగా మార్చాలని, లెనిన్ సంకల్పించాడు. 1920లో "ప్లానింగ్ కమిషన్" ను 10 సంవత్సరాల ఆర్థిక ప్రణాళికను తయారు చెయ్యమని ఆదేశించాడు. రష్యాలోఅన్ని ప్రాంతాల్లో విద్యుద్దీకరణ (Electrification) జరగాలని కోరాడు. సోషలిజంలో ప్రణాళికల అవసరాన్ని లెనిన్ ఎల్లప్పుడూ గుర్తించాడు. పది సంవత్సరాల ప్రణాళికను రూపొందించినా, తాత్కాలికంగా రష్యన్ ప్రజలు ఎదుర్కొన్న సమస్యలకు పరిష్కారం లభించ లేదు. యుద్ధ కాల కమ్యూనిజాన్ని లెనిన్ నిలుపుదల చేయించాడు. యుద్ధ కాల కమ్యూనిజాన్ని (War Communism) నిలిపివేశాక, 1921 మార్చి నెల్లో లెనిన్ కమ్యూనిస్ట్ సిద్ధాంతాలతో సమన్వయపర్చి, కొత్త ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టాడు. యుద్ధానంతరం రష్యాలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, వ్యవస్థల యదార్థతల ప్రాతిపదికగా, నూతన ఆర్థిక విధాన రూపకల్పన జరిగింది. ఈ విధానం ప్రకారం కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు వ్యతిరేకమైన వ్యక్తిగత వ్యాపారాన్ని, పాక్షికంగా ప్రైవేట్ రంగంలో పరిశ్రమల స్థాపనకు అనుమతించాడు. కర్షకులు తాము ఉత్పత్తి చేసుకున్న సరకులను మార్కెట్ లో అమ్ముకోడానికి అనుమతినిచ్చాడు. వ్యాపారస్తులకు చిల్లర వర్తకం చేసుకోడానికి అనుమతి లభించింది.

రష్యా లో ప్రైవేట్ ఆస్తి ఇంకా కొనసాగింది. చిన్న వ్యాపారస్తులు కూడా ఉండేవారు. వీటన్నిటినీ రద్దు పర్చనంతవరకు మధ్యేమార్గమనుసరించడం మంచిదని లెనిన్ భావించాడు. ఈ మధ్యే మార్గాన్ని సోషలిజం, పెట్టుబడిదారీ విధానాల సహజీవనంగా వర్ణించడం జరగింది. సోషలిస్ట్ సమాజ స్థాపనలో నూతన ఆర్థిక విధానం తిరోగమనమైనప్పటికీ, అవసరమైందని లెనిన్ భావించాడు. సోషలిస్ట్ సమాజాన్ని గట్టి పునాదులపై నిర్మించడానికి, రైతులతోనూ, పెట్టుబడిదారీ వర్గంలోని ఒక వర్గం వారితోనూ, రాజీ పడ్డం అవసరమని సోవియట్ ప్రభుత్వం భావించింది. నూతన ఆర్థిక విధానం సంధి దశకు చెందింది. పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిస్ట్ వ్యవస్థకు మార్పు జరుగుతున్న సంధి దశలో, కార్మికుల,కర్షకుల మధ్య సమైక్యతా సాధనకే నూతన ఆర్థిక విధానాన్ని లెనిన్ ప్రభుత్వం అనుసరించింది.

సోషలిస్ట్ ఉత్పత్తి విధానం బదులు స్టేట్ కేపిటలిజమ్ (State capitalism) అమల్లోకి వచ్చింది. పరిశ్రమలపై అజమాయిషీ చెయ్యడానికి, జర్మన్, అమెరికన్, పద్ధతుల్లో ట్రస్ట్‌లను (Trusts) ఏర్పాటు చేశారు. రష్యన్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడానికి విదేశీ పెట్టుబడిని స్వీకరించడానిక్కూడా, లెనిన్ సంసిద్ధుడయ్యాడు. బ్రిటీష్, అమెరికన్, జపాన్ కంపెనీలకు సోవియట్ ప్రభుత్వం రాయితీల (Concessions) నిచ్చింది. విదేశీ పెట్టుబడులవల్ల రష్యా లాభం పొందుతుందని లెనిన్ తన సహచరులను ఎంతో కష్టంమీద ఒప్పించాడు. కమ్యూనిస్ట్ సిద్ధాంతానికి ఈ విధానం వ్యతిరేకమే అయినా, గడ్డు పరిస్థితులనుండి బయటపడ్డానికి, విప్లవాన్ని ఆర్థిక ఇబ్బందుల నుండి కాపాడుకోడానికి ఈ చర్య చాలా అవసరమని లెనిన్ స్పష్టీకరించాడు. ఈ చర్య తాత్కాలిక చర్యని లెనిన్ సమర్థించాడు. లెనిన్ ఆదర్శప్రియుడైనా, అనుభవాత్మకంగా రెండు అడుగులు ముందుకు వేసి ఒక అడుగు వెనుకకు వేసేవాడని చాలామంది భావించారు. 1921 మార్చి నుండి 1926-27 ల్లో మొదటి పంచవర్ష ప్రణాళిక రూపం

దాల్చేవరకు, సోవియట్ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాన్ని అనుసరించింది. 1922 నాటికే నూతన ఆర్థిక విధానాన్ని కొందరు కమ్యూనిస్ట్‌లు ఆమోదించలేదు. ఈ విధానం విప్లవానికి వెన్నుపోటని వీరు భావించారు. 1922 లో జరిగిన 11వ కమ్యూనిస్ట్ పార్టీ సమావేశంలో కొందరు సభ్యులు "ఆర్థిక రంగంలో వెనుకంజను నిరోధించాలని" కోరారు.

10వ కాంగ్రెస్ జరిగిన కొద్ది కాలానికే, లెనిన్ ఆరోగ్యం క్షీణించింది. 1922, మే 22న లెనిన్‌కు పక్షవాతం వచ్చింది. దురదృష్టవశాత్తు పక్షవాతం నుండి కోల్కోలేదు. 1924, జనవరి 21న రెండో సారి పక్షవాతం రావడంతో, లెనిన్ మరణించాడు. లెనిన్ శ్రామిక వర్గ విమోచకుడుగా, ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులను పొందాడు. కోట్లాది సామాన్య ప్రజలకు ఆదర్శవ్యక్తి అయ్యాడు. రచయితగా, పరిపాలనాదక్షునిగా, తత్వవేత్తగా, విప్లవ రథ సారథిగా లెనిన్ పేరు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తుంది. లెనిన్ మరణానంతరం పెట్రోగ్రాడ్‌ను లెనిన్‌గ్రాడ్‌గా మార్చారు.

### 21.3.2 ట్రాట్స్కీ, స్టాలిన్‌ల మధ్య అధికారం కోసం జరిగిన సంఘర్షణ

లెనిన్ మరణించిన తర్వాత, అతని ముఖ్య సహచరులైన ట్రాట్స్కీ, స్టాలిన్‌ల మధ్య అధికారం కోసం దాదాపు వారసత్వ యుద్ధం ప్రారంభమైంది. ప్రపంచ విప్లవం (World Revolution) అనే లక్ష్యంలో కమ్యూనిస్ట్‌లందరికీ నమ్మకమున్నప్పటికీ, లక్ష్యసాధన అనుసరించాల్సిన మార్గం విషయంలో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ప్రచారం, విద్రోహం, తిరుగుబాటును రెచ్చగొట్టడం, మొదలైన పద్ధతుల ద్వారా ప్రపంచ దేశాలన్నిటిలో వెంటనే కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను వ్యాప్తి చేయాలని ట్రాట్స్కీ వాదించాడు. వాస్తవిక వాదైన స్టాలిన్, రష్యాలో కమ్యూనిజమ్ విజయవంతమైనట్లైతే, ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్ట్ సిద్ధాంతాల వ్యాప్తికి ప్రచార స్థానంగా ఉపయోగపడుతుందని వాదించాడు. ట్రాట్స్కీ, స్టాలిన్‌ల మధ్య సంఘర్షణ 1927 వరకూ కొనసాగింది. ఈ సంఘర్షణలో చివరకు స్టాలిన్ విజయాన్ని సాధించాడు. కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర కమిటీకి కార్యదర్శి (Secretary) గా ఎన్నికైనాడు. ట్రాట్స్కీని, అతని సహచరులను, కమ్యూనిస్ట్ పార్టీ నుండి బహిష్కరించాడు. పార్టీలో పలుకుబడిని సంపాదించి, రష్యాకు నియంత అయ్యాడు. తన మీద కుట్ర పన్ని పార్టీ అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి ప్రయత్నించిన ప్రత్యర్థుల నెందరినో రక్తపూరిత క్షాళన విధానాన్ని (Bloody purges) అనుసరించి, పార్టీ నుండి తొలగించాడు.

### 21.3.3 స్టాలిన్ సంస్కరణలు : సమిష్టి విధానం, పంచ వర్ష ప్రణాళికలు

స్టాలిన్ నాయకత్వంలో కమ్యూనిస్ట్ పార్టీ రష్యాలో సమ సమాజ స్థాపనకు కృషి చేసింది. ట్రాట్స్కీ 1927లో పార్టీ నుండి బహిష్కృతుడై, 1929లో దేశంనుండి బహిష్కృతుడైనాడు. ట్రాట్స్కీని మెక్సికోలో, 1941లో స్టాలిన్ ఏజెంట్లు హత్య చేశారు. వ్యవసాయ రంగంలో సమిష్టి విధానాన్ని (Collectivisation) ప్రవేశపెట్టడమే సోషలిస్ట్ సమాజ స్థాపనకు ఉత్తమ మార్గమని స్టాలిన్ భావించాడు. భూమి ప్రజలందరి సొత్తుగా భావించి, ప్రైవేట్ వ్యక్తులకు భూ యాజమాన్యం లేకుండా చేయటం జరిగింది. కర్షకులందరి సమిష్టి యాజమాన్య నిర్వహణలో ఉండే సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను (Collective farms) సోవియట్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతేకాకుండా, ప్రభుత్వ యాజమాన్యంలో కూడా వ్యవసాయ క్షేత్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాల విధానాన్ని చాలామంది భూస్వాములు (Kulaks) తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వ్యతిరేకతవల్ల గ్రామీణ ప్రాంతాల్లో సోవియట్ ప్రభుత్వం భూస్వాములతో తీవ్రమైన పోరాటాన్ని కొనసాగించింది. స్టాలిన్ కాలంలో సమిష్టి వ్యవసాయ క్షేత్రాల

విధానాన్ని అమలుపర్చడంవల్లనే రష్యా ప్రణాళికాబద్ధమైన పారిశ్రామిక రంగాన్ని సాధించగల్గింది.

1927 నుండి సోవియట్ రష్యా పంచవర్ష ప్రణాళికలను అమలు పర్చింది. పంచవర్ష ప్రణాళికలకు శాసనబద్ధమైన అధికారం లభించింది. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో (1928-33), భారీ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యత నివ్వడం జరిగింది. ఈ పంచవర్ష ప్రణాళికవల్ల బొగ్గు, ఇనుము, ఉక్కు ఫ్యాక్టరీలు, ట్రాక్టర్లు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో ఆహారోత్పత్తి పెరిగింది. దేశీయమైన, పరిమితమైన వనరులను ఉపయోగించి, పొదుపు చేసి ప్రజల అవసరాలను కొంతవరకు త్యాగం చేసి, స్టాలిన్ ప్రభుత్వం భారీ పరిశ్రమలను స్థాపించింది.

రెండో పంచ వర్ష ప్రణాళిక (1933-38) ప్రధాన లక్ష్యం, నిత్య జీవితావసర వస్తువుల పెంపు. ఈ ప్రణాళికా కాలంలో సంతృప్తికరమైన అభివృద్ధి జరిగింది. ప్రజల జీవన ప్రమాణం పెరిగింది. పారిశ్రామికాభివృద్ధి నిరాటంకంగా వేగంగా జరిగింది.

మూడో పంచ వర్ష ప్రణాళిక (1938-43) 1938 జనవరిలో మొదలైంది. కాని, రెండో ప్రపంచ యుద్ధం మొదలైనందువల్ల, సోవియట్ ప్రభుత్వం శాంతి కాల ప్రణాళికను, యుద్ధ కాల ప్రణాళికగా మార్చాల్సొచ్చింది.

రెండో ప్రపంచ యుద్ధం మొదలయ్యేనాటికి, పట్టుదలతో కూడిన ప్రణాళికా విధానాల ద్వారానే, సోవియట్ రష్యా ప్రపంచంలో ప్రధానమైన పారిశ్రామిక దేశంగా ఆవిర్భవించింది.

వెనకబడ్డ దేశంగా ఉన్న రష్యా, వంద సంవత్సరాల కాలంలో వ్యావసాయిక వ్యవస్థ నుండి ఆధునిక పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థగా రూపొందింది. రష్యన్లు సాధించిన అక్టోబర్ (నవంబర్) మహా విప్లవం మానవ చరిత్రలో ఒక ప్రముఖ సంఘటన. ప్రణాళికబద్ధమైన ప్రగతిని సాధించడంలో, సోషలిస్ట్ విధానాలు ఎలా తోడ్పడతాయో రష్యన్ సమాజం మొదటిసారిగా నిరూపించింది.

## 21.3.4 రష్యన్ విప్లవ ప్రాధాన్యత

1917 రష్యన్ విప్లవం మార్క్సిస్ట్ సిద్ధాంతాల్ని ఆర్థిక విధాన పరిధి నుండి ఆచరణీయ వేదాంతానికి మార్చింది. ఆర్థిక రంగంలో మొదటిసారిగా ప్రణాళికను ప్రవేశపెట్టిన ఘనత రష్యాదే. రష్యన్ విప్లవం "ఏదో ఒక జాతికి, దేశానికి పరిమితమైనదని కాదు; దాని సందేశం, ప్రభావం కూడా సామాజికమైనవి. ఈ విప్లవం మొత్తం మానవ జాతికే ఊపిరి పోసింది. నవ సమాజ నిర్మాణం కోసం పోరాడే వారందరికీ, రష్యా విప్లవం ఒక ఉత్తేజం"

రష్యన్ విప్లవం జాతీయ విముక్తి ఉద్యమాలకు గొప్ప ఉత్తేజాన్ని కల్గించింది. చైనా పైన, ఇతర ఆసియా దేశాల పైన అనాదిగా ఉన్న తన సామ్రాజ్యవాద హక్కుల్ని ఏక పక్షంగా వదులుకోవడం ద్వారా, ఆసియాలోని జారిస్ట్ వలస దేశాలకు స్వయంనిర్ణయాధికారాన్ని ప్రకటించడం ద్వారా, సోవియట్ ప్రభుత్వం వలస ప్రపంచాన్ని గాఢంగా ప్రభావితం చేసింది. రష్యన్ విప్లవం వలస ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. విప్లవోద్యమాలు విజయాన్ని సాధించాలంటే, సామాన్య ప్రజల బలం మీద ఆధారపడాలని, స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న వివిధ దేశాల జాతీయోద్యమ నాయకులు గ్రహించారు.

## 21.3.5 చైనా, భారత దేశం, స్పెయిన్‌లపై రష్యన్ విప్లవ ప్రభావం

రష్యా విప్లవం చైనాలో మేధావులను ప్రభావితం చేసింది. 1921లో మార్క్సిస్ట్ సిద్ధాంతాలు ప్రాతిపదికగా, లీతావోచావో (Li-Tav-Chao), చెన్ -తు-స్యు (Chen-Tu-shui), మావోసేటుంగ్ (Mao Tse Tung) లు కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించారు. చైనా విద్యావేత్తలు ఈ విప్లవాన్ని స్వేచ్ఛోదయం (dawn

of freedom) గా, మానవతావాద విజయం (Victory for Humanitarianism) గా వర్ణించారు.

1949లో చిట్టచివరకు కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చింది.

## 21.3.5.1 భారతదేశంపై రష్యన్ విప్లవ ప్రభావం

రాజకీయ, న్యాయ, రంగాల్లో భారతదేశాన్ని ప్రగాఢంగా ప్రభావితం చేసిన ఏకైక సంఘటన, రష్యన్ విప్లవ మంటే, అదెంత మాత్రం అతిశయోక్తి కాదు. ఈ మహత్తర విప్లవం సామాన్య ప్రజానీకంలోని నిద్రాణ శక్తిని తెల్పింది. 1917 రష్యన్ విప్లవం విజయవంతమైన తర్వాత స్థాపితమైన మొదటి సామ్యవాద రాజ్యం, భారతీయ యువతను తీవ్రంగా ఆకర్షించి, ప్రభావితం చేసింది. భూములు లేని వారికి భూములు పంచి పెట్టిన లెనిన్ శాసనాలు, మేధావి వర్గాన్ని ప్రేరేపించాయి. అణగారిన జాతుల తరఫున రష్యా చేసిన విజ్ఞప్తికి అనుకూలంగా, యువత స్పందించారు.

రష్యన్ విప్లవం విజయవంతమైన తర్వాత, భారతదేశంలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన జరిగింది. జాతీయోద్యమంలో ఒక భాగం గానే, భారతీయ కమ్యూనిస్ట్ ఉద్యమం అవతరించింది. కాంగ్రెస్ విధానాలతో అసంతృప్తి చెందిన విప్లవవాదులు, కార్మిక, కర్షక నాయకులు, రాజకీయ స్వేచ్ఛకై నూతన మార్గాలను అన్వేషించారు. 1919లో మానవేంద్రనాథ్ రాయ్ (M.N Roy), మెక్సికోలో ప్రముఖ బోల్షివిక్ నాయకుడు బోరోడిన్‌ను కలిశాడు. మెక్సికోలో కమ్యూనిస్ట్ పార్టీని స్థాపించాడు. 1920లో యమ్.యన్.రాయ్ (M.N. Roy) రెండో కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్‌లో పాల్గొనడానికి రష్యా వెళ్లాడు. బ్రిటీష్ వలసల్లోని కమ్యూనిస్ట్‌లు అక్కడ మధ్యతరగతి ప్రజలు నిర్వహిస్తున్న స్వాతంత్రోద్యమాల్లో పాల్గొనడం సముచితమని లెనిన్ సలహా ఇచ్చాడు. కాని, ఈ సలహా రాయ్‌కి నచ్చలేదు. 1922లో డాంగే 'సోషలిస్ట్' అనే మొట్టమొదటి భారత కమ్యూనిస్ట్ పత్రికను ప్రారంభించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాను స్థాపించాలని డాంగే మొదటి నుండి ప్రచారం చేశాడు. 1928 వరకు కమ్యూనిస్ట్ వర్గాలు కాంగ్రెస్‌తో కలిసి పనిచేశాయి. 1928 నుండి కమ్యూనిస్ట్‌లు తీవ్రవాద వామపక్షంగా మారారు.

కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ, విప్లవ జాతీయ తత్వం, మార్క్స్ శాస్త్రీయ సామ్యవాదాల కలయిక ప్రాతిపదికగా, 1933లో ఆచార్య నరేంద్ర దేవ్ అధ్యక్షతన, పాట్నా సమావేశంలో ఏర్పడింది. జయప్రకాష్ నారాయణ్, అచ్యుత్ పట్వర్థన్, అశోక్ మెహతా, మీనూ మసానీలు, ఈ పార్టీలోని ఇతర ప్రముఖులు. రష్యన్ విప్లవం వల్ల ప్రభావితుడైన జవహర్‌లాల్ నెహ్రూ ఈ పార్టీ పట్ల సానుభూతిని ప్రకటించినా, ఈ పార్టీలో చేరలేదు.

రష్యన్ విప్లవ ప్రభావం వల్ల కార్మికోద్యమం, కర్షకుల ఆందోళన వృద్ధి చెందాయి. లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్ ప్రభుత్వం ఇరుగుపొరుగు దేశాలతో గతంలో చేసుకున్న అసమాన సంధులను ఏక పక్షంగా రద్దు చేసుకోవడం, భారతీయులను గాఢంగా ప్రభావితం చేసింది.

రెండో ప్రపంచ యుద్ధానంతరం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ఆఫ్రో - ఆసియాలోని అనేక వర్ధమాన దేశాలకు, పంచ వర్ష ప్రణాళికల ద్వారా అభివృద్ధి సాధించిన రష్యా, మార్గదర్శకమైంది.

## 21.3.5.2 స్పెయిన్‌పై రష్యన్ విప్లవ ప్రభావం

1936 ఫిబ్రవరి నెల్లో జరిగిన ఎన్నికల్లో, కమ్యూనిస్ట్‌లు, సోషలిస్ట్‌లు అత్యధిక మెజారిటీని సాధించారు. స్పెయిన్‌లోని ఫాసిస్ట్‌లు ఈ ప్రభుత్వాన్ని కూలదోయడానికి సైనికాధికారుల మద్దతుతో

BRAOU

తిరుగుబాటు చేశారు. ఇంగ్లాండ్, అమెరికా, ఫ్రాన్స్, రష్యాల నుండి పెద్ద సంఖ్యలో వాలంటీర్లు వచ్చి, స్పెయిన్ రిపబ్లికన్ ప్రభుత్వానికి మద్దతు నిచ్చారు. అమెరికా (U.S.A.) నుండి అబ్రహాం లింకన్ బ్రిగేడ్, అంతర్జాతీయ బ్రిగేడ్, రంగం మీదకు వచ్చాయి. ఆర్థిక మాంద్యం వల్ల పెట్టుబడిదారీ విధానం అప్రతిష్ట పాలైంది. సోషలిస్ట్ ఆర్థిక వ్యవస్థకు ప్రపంచ అభిప్రాయం మొగ్గింది. ఐరోపా దేశాల్లో కమ్యూనిస్ట్ పార్టీలు బలపడ్డాయి.

స్పెయిన్ అంతర్యుద్ధంరెండో ప్రపంచ యుద్ధానికి నాంది. పార్లమెంటరీ పద్ధతుల ద్వారా అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వంపై, సైనిక నియంత ఫ్రాంకో (Franco) నాయకత్వంలో తిరుగుబాటు తలెత్తింది. జర్మనీ, ఇటలీల నియంతలు, హిట్లర్, ముసోలినీలు, ఫ్రాంకోకు మద్దతు నిచ్చారు. రష్యా ప్రభుత్వం వామపక్ష ప్రభుత్వానికి నైతిక సహాయం చేసింది. చాలా దేశాల నుండి ప్రజాతంత్రవాదులు, రచయితలు, కళాకారులు, మేధావులు, స్పానిష్ అంతర్యుద్ధంలో ప్రభుత్వానికి అనుకూలంగా పాల్గొని, ప్రాణాల నర్పించారు. అమెరికా (U.S.A.), ఇంగ్లాండ్, ఫ్రెంచి ప్రభుత్వాలు ఈ యుద్ధంలో తటస్థ వైఖరిని అవలంబించి, తద్వారా ఫ్రాంకోను సమర్థించాయి.

సైనిక నియంత ఫ్రాంకోకు మద్దతుగా ఇటలీ, జర్మనీ సైన్యాలు స్పెయిన్ భూభాగం లోకి వచ్చాయి. ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లు పరోక్షంగా ఫ్రాంకోకు తోడ్పడ్డాయి.

ఈ సంఘర్షణలో చివరకు విజయం ఫ్రాంకోను వరించింది. స్పెయిన్‌లో జరిగిన అంతర్యుద్ధం, పేద, ధనిక వర్గాల మధ్య జరిగిన సంఘర్షణ, ప్రజాస్వామ్యానికి, ఫాసిజానికి మధ్య జరిగిన సంఘర్షణ. అంతర్జాతీయ బలాబలాలకు, స్పెయిన్ అంతర్యుద్ధం పరీక్షా కేంద్రమైంది. ఫ్రాంకో విజయం పట్ల హిట్లర్, ముసోలినీలు ఆనందపడ్డారు, ప్రపంచ వ్యాప్తంగా ప్రజాతంత్రవాదులు బలిదానం చేశారు. రెండో ప్రపంచ యుద్ధానికి స్పెయిన్ అంతర్యుద్ధం, ద్వారాలను తెరిచింది.

స్పానిష్ అంతర్యుద్ధం భీకరంగా కొనసాగుతున్నకాలంలో, 1938 వేసవిలో, రిపబ్లికన్ ప్రభుత్వ ఆహ్వానంపై, జవహర్‌లాల్ నెహ్రూ బార్సిలోనా (Barcelona)కు వెళ్లాడు. ఫాసిజంకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి వీరోచిత పోరాటాన్ని కొనసాగిస్తున్న స్పానిష్ రిపబ్లికన్ ప్రభుత్వానికి, ప్రజలకు, నెహ్రూ మద్దతును ప్రకటించాడు. అంతేకాకుండా, భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, స్పెయిన్‌లో జరుగుతున్న అంతర్యుద్ధం గురించి నెహ్రూ గాంధీజీకి రాశాడు. జవహర్‌లాల్ నెహ్రూ కోరిన మీదట, మహాత్మాగాంధీ స్పానిష్ రిపబ్లిక్ ప్రధాన మంత్రి జువాన్ నెగ్రిన్ లోపెజ్ (Juan Negrin Lopez) కు, స్పానిష్ రిపబ్లికన్ ప్రభుత్వానికి, ప్రజలకు, మద్దతును తెల్పుతూ రాశాడు. ఈ విధంగా గాంధీజీ, నెహ్రూజీ, స్పానిష్ అంతర్యుద్ధం ఫలితంగా, అంతర్జాతీయ రాజకీయ రంగ పరిస్థితిని గమనించారు. ఈ అంతర్యుద్ధంలో బ్రిటిష్ వైఖరిని నెహ్రూ తీవ్రంగా విమర్శించాడు.

రష్యన్ విప్లవం విజయవంతమైన తర్వాత, అంతర్జాతీయ రాజకీయాల రూపు రేఖలే మారిపోయాయి. పెట్టుబడిదారీ ప్రపంచానికి పెద్ద గండి పడింది. నవ సమాజ నిర్మాణం కోసం పోరాడే వారందర్నీ, రష్యన్ విప్లవం ఎంతో ఉత్తేజపర్చింది. అందుకనే, రష్యన్ విప్లవం "మానవ నాగరికత" అంటూ నివాళి పట్టి, వేనోళ్ళ కొనియాడారు వెబ్స్ దంపతులు (Sydney and Beatrice Webbs : Soviet Communsim: a New Civilisation).

## 21.3.6 రెండో ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచ రాజకీయాల్లో సోవియట్ యూనియన్ పాత్ర : సైనిక కూటాల ఆవిర్భావం

రెండో ప్రపంచ యుద్ధం హిట్లర్ పోలెండ్‌పై దండెత్తడంతో ప్రారంభమైంది (1-9-1939). ఈ యుద్ధం ప్రజ్వరిల్లడానికి ముందు, ప్రపంచంలో ఏడు అగ్రరాజ్యాలు-అమెరికా (U.S.A.) బ్రిటన్, ఫ్రాన్స్,



BRAOU

ఇటలీ, జర్మనీ, జపాన్, సోవియట్ యూనియన్ (U.S.S.R.) ఉండేవి. ఈ యుద్ధంలో ఏడు రాజ్యాలు పాల్గొన్నాయి.

పోలెండ్‌పై దండెత్తే ముందు హిట్లర్ రష్యాతో ఒక ఒప్పందానికి వచ్చాడు. రష్యాతో ఒప్పందం చేసుకోవడం ద్వారా యుద్ధాన్ని స్థానికమైందిగా చేయవచ్చని జర్మనీ భావించింది. కాని, అలా కాలేదు. రెండో ప్రపంచ యుద్ధం సుమారు ఆరు సంవత్సరాలు భీకరంగా కొనసాగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత రెండే అగ్రరాజ్యాలు – అమెరికా, సోవియట్ యూనియన్‌లు (Super powers)- మిగిలాయి.

ఈ రెండు అగ్రరాజ్యాలు, అమెరికా (U.S.A), సోవియట్ యూనియన్ (U.S.S.R)లు, ప్రత్యర్థి సైనిక కూటాలకు (Rival power blocks) నాయకత్వం వహించాయి. అమెరికా పాశ్చాత్య రాజ్యాల ప్రజాస్వామిక కూటమికి నాయకత్వం వహించగా, సోవియట్ యూనియన్ సోషలిస్ట్ రాజ్యాల కూటమికి నాయకత్వం వహించింది. ఈ సైనిక కూటాల మధ్య ఏర్పడ్డ పోటీవల్ల, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రపంచ రాజకీయాలు ప్రభావితమయ్యాయి. ఈ రెండు అగ్రరాజ్యాలు తమ తమ కూటాల సభ్య రాజ్యాలకు ఆర్థిక, సైనిక సహాయాన్ని అందించాయి. రెండు సైనిక కూటాల్లోను మిత్ర రాజ్యాలు ఆర్థిక వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాయి.

## 21.3.7 ప్రచ్ఛన్న యుద్ధం : ఆయుధాల పోటీ

రెండో ప్రపంచ యుద్ధం ముగిసి ఇంకా రెండు సంవత్సరాలు పూర్తికాకముందే, 1947లో పశ్చిమ రాజ్యాలకు, సోవియట్ యూనియన్‌కు మధ్య సంబంధాలు బెడిసిపోవడంతో, ప్రచ్ఛన్న యుద్ధం (Cold war) మొదలైంది. ఈ ప్రచ్ఛన్న యుద్ధం దౌత్య, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో కొనసాగింది. పరస్పరం బలహీనపర్చడానికి ప్రయత్నించే రెండు రాజ్యాల మధ్య కల ఉద్రిక్తతే, ప్రచ్ఛన్న యుద్ధం. ప్రచ్ఛన్న యుద్ధ కారణాలను పరిశీలిద్దాం.

రెండో ప్రపంచ యుద్ధం ఇంకా జరుగుతూ ఉండగానే, అమెరికాకు ఆటం బాంబు (Atom bomb) ఉండడంవల్ల, ఆయుధ రంగంలో సోవియట్ యూనియన్‌పై ఆధిక్యత లభించింది. సోవియట్ యూనియన్ ప్రభావాన్ని తగ్గించడానికి అమెరికా అమలు పర్చిన ట్రూమన్ ప్రణాళిక, పశ్చిమ ఐరోపాలో రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆర్థిక పునర్నిర్మాణానికి అమలుపర్చిన మార్షల్ ప్రణాళిక (Marshall Plan), సోవియట్ యూనియన్‌కు చాలా కోపాన్ని, మనస్తాపాన్ని కలిగించాయి. 1949లో రష్యా అనుసరించిన బెర్లిన్ దిగ్బంధం (Berlin Blockade) అనంతరం, అమెరికా (U.S.A.) నాయకత్వంలో నాటో (NATO) కూటమి ఏర్పడింది. దానికి దీటుగా సోవియట్ యూనియన్ నాయకత్వంలో వార్సా (WARSAW) కూటమి ఏర్పడింది. ఈ విధంగా పశ్చిమ రాజ్యాల కూటమి, కమ్యూనిస్ట్ రాజ్యాల కూటమనే రెండు వర్గాలుగా, ప్రపంచం విభజించబడింది. 1950–1960 మధ్య ప్రచ్ఛన్న యుద్ధం రెండు అగ్రరాజ్యాల మధ్య అగాధాన్ని ఇంకా ఎక్కువ చేసింది. నాటో, వార్సా ఒప్పందం, సీటో (SEATO), సెంటో (CENTO), ఒప్పందాల వల్ల, రెండు అగ్ర రాజ్యాలు తమ సైనిక శక్తిని విపరీతంగా పెంచుకున్నాయి. 1950 దశకంలో అమెరికా శక్తివంతమైన హైడ్రోజన్ బాంబును పరీక్ష చేసింది. సోవియట్ యూనియన్ కూడా ఆటం బాంబులను, హైడ్రోజన్ బాంబును కనుక్కొంది.

అణ్వస్త్రాల సముపార్జనలో అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య పోటీ తీవ్రంగా కొనసాగింది. నాటి అమెరికా విదేశాంగ మంత్రి (Secretary of State) జాన్‌ఫాస్టర్ డల్లెస్ (John Foster Dulles)

---

| | | |
|---|---|---|
| NATO | - | North Atlantic Treaty Organisation |
| WARSAW | - | Capital of Poland |
| SEATO | - | South East Asian Treaty Organisation |
| CENTO | - | Central Treaty organisation. |

BRAOU

కమ్యూనిస్ట్ వ్యతిరేక విధానానికి రూపకల్పన చేశాడు.

పశ్చిమ ఆసియాలో (West Asia) 1948 లో తీవ్రమైన సంఘర్షణ మొదలైంది. 1948 లో ఇజ్రాయిల్ (Israel) స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. యూదుల సమస్య (Jewish Problem) కు పరిష్కారం లభించకపోవడం మాత్రమే కాకుండా, ఉద్రిక్తతలు ఎక్కువైనాయి. ఇజ్రాయిల్, అరబ్బు రాజ్యాల మధ్య, 1948, 1956, 1967ల్లో, భీకర పోరాటాలు కొనసాగాయి. పాలస్తీనా సమస్య (Palestine problem)ను పరిష్కరించకపోవడంవల్ల, 1960 దశకం లో సోవియట్ యూనియన్ పశ్చిమ ఆసియా రాజకీయాల్లో జోక్యం చేసుకోవడంవల్ల, ఉద్రిక్త వాతావరణం ఇంకా పెంపొందింది. పాలస్తీనా ప్రజలకు స్వస్థానం లేకుండా చేసి, ఇజ్రాయల్ అనుసరించిన దురాక్రమణ విధానానికి అమెరికా మద్దతునివ్వడంవల్ల, పశ్చిమాసియా లో పరిస్థితి బాగా విషమించింది.

## 21.3.8 సామనస్య శకం

'సామనస్య' అంటే, ఉద్రిక్తతల సడలింపని అర్థం. 1962లో క్యూబా క్షిపణుల సంక్షోభం (Cuban Missiles Crisis) పరిష్కారమైన తర్వాత, 1963లో అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లు, వాతావరణంలో అణ్వస్త్ర పరీక్షల నిషేధ ఒప్పందం (Nuclear Test ban treaty) పై సంతకాలు చేశాయి. చాలా దేశాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 1968 లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (Nuclear Non-proliferation treaty) జరిగింది. మాస్కో, వాషింగ్‌టన్ నగరాల మధ్య , మాస్కో, లండన్‌నగరాల మధ్య, హాట్‌లైన్ (HOT LINE) ఏర్పడింది. యాదృచ్ఛిక సంఘటనల ద్వారా యుద్ధం జరగకుండా నివారించడానికి, ఈ హాట్‌లైన్‌ను అగ్రరాజ్యాలు ఏర్పర్చుకున్నాయి.

ఉద్రిక్తతల సడలింపు శకంలో, వియత్నాంలో కొనసాగిన భయంకర యుద్ధం అంతమైంది (1975). కమ్యూనిస్ట్ చైనా ఐక్య రాజ్య సమితిలో స్థానాన్ని స్వీకరించింది. అప్పటి వరకు చాంగ్-కై-షేక్ నాయకత్వంలోని నేషనలిస్ట్ చైనాను సమర్థించిన అమెరికా, తన విధానాన్ని మార్చుకుంది. అమెరికా, సోవియట్ యూనియన్‌లు కీలక అణ్వస్త్రాల ఒప్పందంపై (SALT) సంతకాలు చేశాయి. ఉద్రిక్తతల సడలింపు శకంలో ఇదొక ప్రముఖ సంఘటన. రెండో కీలక అణ్వస్త్రాల పరిమితి ఒప్పందంపై (SALT II) కూడా, అమెరికా, సోవియట్ యూనియన్‌లు సంతకాలు చేయాల్సుండింది.

## 21.3.9 రెండవ ప్రచ్ఛన్న యుద్ధం

ప్రచ్ఛన్న యుద్ధం తిరిగి మొదలు కావడంతో, ఈ చర్చలు ముందుకు సాగలేదు. 1978 లో ఇరాన్‌లో షా ప్రభుత్వం పతనం కావడంతో అమెరికా, ఇరాన్‌ల మధ్య, సంబంధాలు క్షీణించాయి. తీవ్రమైన ఉద్రిక్త వాతావరణం నెలకొనింది. సోవియట్ యూనియన్ ఆఫ్ఘనిస్తాన్‌లో సైనిక జోక్యం చేసుకోవడంతో, అగ్ర రాజ్యాల మధ్య రెండోసారి ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమైంది. 1978 తర్వాత అమెరికా, సోవియట్ సంబంధాల్లో, తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

# 21.4 గోర్బచేవ్ అనుసరించిన పెరిస్త్రోయికా, గ్లాస్‌నాస్త్‌ల ప్రభావం

1985 మార్చిలో మైఖేల్ గోర్బచేవ్ రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీ (ప్రధాన కార్యదర్శి) అయిన తర్వాత, అతడనుసరించిన, పెరిస్త్రోయికా (Perestroika) గ్లాస్‌నాస్త్ (Glasnast) విధానాల వల్ల, 1సోవియట్ యూనియన్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి. అమెరికా అధ్యక్షులతో జరిపిన వివిధ శిఖరాగ్ర సమావేశాలు ఆయుధ పోటీని తగ్గించడానికి, ఉద్రిక్తతల సడలింపుకు దారితీశాయి. ఈ చర్చలు ప్రపంచ

BRAOU

శాంతిని కాపాడ్డానికి, ప్రచ్ఛన్న యుద్ధం అంతం కాడానికి, ఎంతగానో దోహదం చేశాయి. తూర్పు ఐరోపా దేశాల్లో పోలెండ్, హంగేరీ, జెకోస్లోవేకియా, రుమేనియా, బల్గేరియాల్లోని కమ్యూనిస్ట్ ప్రభుత్వాలు పేకమేడల్లా కూలిపోయాయి. తూర్పు ఐరోపా దేశాల్లోని ప్రజలు బహుళ పార్టీ విధానాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, మార్కెట్ ఆర్థిక వ్యవస్థను కోరారు. ఈ దేశాల్లో తలెత్తిన ఉద్యమాలను అణచడానికి, సోవియట్ యూనియన్ గతంలో లాగే, సైనిక జోక్యం చేసుకోలేదు. తూర్పు జర్మనీలో కమ్యూనిస్ట్ ప్రభుత్వ పతనానంతరం, 1990 అక్టోబర్ 3వ తేదీన సమైక్య జర్మనీ (United Germany) ఆవిర్భవించింది. జర్మనీ సమైక్యతతో, రెండో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసింది. తూర్పు ఐరోపా దేశాలు వార్సా (WARSAW) ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాయి. అంతేకాకుండా, ఈ దేశాల్లోని ప్రభుత్వాలు సోవియట్ సైన్యాలను తమ దేశాల నుండి ఉపసంహరించుకోవాలని, సోవియట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

తూర్పు ఐరోపా పరిణామాల వల్ల, సోవియట్ యూనియన్ అంతర్జాతీయంగా ప్రతిష్టను కోల్పోవడంతోపాటు, ఆంతరంగికంగా కూడా ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని ఎదుర్కొంది. సోవియట్ యూనియన్‌లోని వివిధ రిపబ్లిక్‌లు స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో రష్యా ఆక్రమించుకున్న లట్వియా, ఎస్తోనియా, లిథూనియాల సోవియట్‌లో విలీనీకరణను, U.S.A, U.K. ఇతర, పశ్చిమ దేశాలు గుర్తించలేదు. స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి.

సోవియట్ యూనియన్‌లో రష్యనేతర జాతులు (Non- Russian races) స్లావ్ జాతుల పెత్తనాన్ని నిరసించడంతో, ఈ ప్రాంతాల్లో తీవ్రమైన అసంతృప్తి, ఈర్ష్యాద్వేషాలు ప్రబలాయి.

గోర్బచేవ్ అనుసరించిన ఆర్థిక విధానాలు ఆశించిన సత్ఫలితాలను ఇవ్వకపోగా, గోర్బచేవ్ ఆశించినట్లుగా అంతర్జాతీయ సంస్థలు సోవియట్ యూనియన్ ఆర్థిక సంక్షోభం నుండి బయటపడ్డానికి తగిన ఆర్థిక సహాయం చేయలేదు. అందువల్ల, ప్రజల్లో అప్పటికే మొదలైన అసంతృప్తి తీవ్రంగా ప్రజ్వరిల్లింది.

రష్యన్ ఫెడరేషన్‌కు ప్రత్యక్ష ఎన్నికలు జరిగిన తర్వాత అధ్యక్షుడుగా ఎన్నికైన యల్ట్సిన్ (Yeltsin)కు ప్రజల్లో ఆదరణ, పలుకుబడి పెరిగింది. ఇదే సమయంలో గోర్బచేవ్ పలుకుబడి, ప్రతిష్ఠ తగ్గాయి.

1991 ఆగస్ట్‌లో గోర్బచేవ్‌కు వ్యతిరేకంగా జరిగిన సైనిక కుట్రను విఫలం చెయ్యడంలో, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టుకోడంలో యల్ట్సిన్ అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించాడు. సైనిక నాయకుల కుట్రను విఫలం చెయ్యడంలో యల్ట్సిన్ పాత్ర గణనీయమైంది.

గోర్బచేవ్ తిరిగి అధికారంలోకి వచ్చినా, అతని అధికారం కూడా ఎక్కువ కాలం కొనసాగలేదు.

పై నేపథ్యంలో సోవియట్ యూనియన్ లో వివిధ రిపబ్లిక్‌లు స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలని ఆశించాయి. ఈ పరిణామాలు "స్వతంత్ర్య రాజ్యాల కామన్‌వెల్త్" (Commonwealth of Independent States) ఆవిర్భావానికి అంకురార్పణ జరిగిన తర్వాత, 1991 డిసెంబర్ 31తో, సోవియట్ యూనియన్ ప్రపంచ రాజకీయ రంగం నుండి అస్తమించింది. ఆ శిథిలాలపై స్వతంత్ర రాజ్యాల కామన్‌వెల్త్ ఆవిర్భవించింది.

సోవియట్ యూనియన్ పతనం ఈ శతాబ్దంలో జరిగిన ప్రధాన చారిత్రక సంఘటన. దీంతో, రెండు ధృవాల ప్రపంచం (Bi- Polar World) అంతరించింది. ఈ పరిణామం ప్రపంచ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో, ఇప్పుడే ఇదమిద్ధంగా చెప్పలేం. కాని, ఒకటి మాత్రం వాస్తవం.

సోవియట్ యూనియన్ పతనం చరిత్రకు చరమగీతం పాడిందనీ, కమ్యూనిజం ఒక రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక భావజాలంగా సమసిపోయిందని కొందరు చరిత్రకారులు భావిస్తున్నారు. కానీ, ఈ అభిప్రాయం సరైందికాదని, అనేక మంది ఇతర చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

సోవియట్ యూనియన్ పతనానికి కారణం కమ్యూనిస్ట్ సిద్ధాంతాల్లో సహజ సిద్ధంగా ఉన్న బలహీనతలు కావని, ఈ సిద్ధాంతం విశ్వజనీనమైందే కాక, సామాజిక శ్రేయస్సుకు, న్యాయానికీ తోడ్పడగలదని గట్టిగా విశ్వసిస్తున్నారు. ఈ దృష్టితో చూసినప్పుడు, కమ్యూనిస్ట్ సిద్ధాంతాన్ని అమలుపర్చడంలో, సమ సమాజాన్ని నిర్మించడంలో చేసిన పొరపాట్లు, లోపాలు, దీనికి కారణంగా భావించొచ్చు.

రెండో ప్రపంచ యుద్ధానంతరం సుమారు 45 సంవత్సరాలు ప్రధాన అగ్ర రాజ్యంగా, బలీయమైన శక్తిగా, సోవియట్ యూనియన్ 1990 తర్వాత ప్రధాన స్థానాన్ని కోల్పోయింది. సోవియట్ యూనియన్ అస్తమయానికి ముఖ్య కారణాలను పరిశీలిద్దాం! ఆర్థిక పరిస్థితి విషమించడం , వ్యవసాయ రంగంలో ఉత్పత్తి క్షీణించడం, అమెరికాతో తీవ్రమైన ఆయుధాల పోటీలో, అంతరిక్ష పోటీలో (Space Race) పాల్గొని, తనకున్న వనరులను, అపారమైన సైనిక శక్తిని పెంపొందించడానికి తరలించడం వల్ల ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం, ముఖ్య కారణాలు.

## 21.5 : సంగ్రహంగా

లెనిన్ నాయకత్వంలో ఏర్పడ్డ బోల్షివిక్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి, బోల్షివిక్ వ్యతిరేక శక్తులు తీవ్రంగా ప్రయత్నించాయి. బోల్షివిక్ ప్రభుత్వానికి కార్మికులు, నావికులు, విజ్ఞానులు, భూమిలేని రైతులు మాత్రమే మద్దతు నిచ్చారు. సమాజంలోని ఇతర వర్గాలన్నీ ఈ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి.

కెరెన్స్కీ అనుకూల వర్గంవారు పెట్రోగ్రాడ్‌ను ఆక్రమించుకోడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. మాస్కోలో కూడా బోల్షివిక్ వ్యతిరేక వర్గంవారు లొంగిపోయారు. బోల్షివిక్‌లకు సైనిక దళాల మద్దతు లభించింది. కెరెన్స్కీ తప్పించుకుని అమెరికాకు వెళ్లిపోయాడు.

బోల్షివిక్ ప్రభుత్వం ప్రపంచ శాంతి, భూమి సమస్యల గురించి, రెండు డిక్రీల నామోదించింది. ఆర్థిక పునర్నిర్మాణానికి ప్రభుత్వం బ్యాంకులు, పారిశ్రామిక వ్యవస్థలు, వాణిజ్య నౌకా దళాన్ని జాతీయం చేసింది.

స్టేట్ కేపిటలిజమ్ దశను సంధి దశ అంటారు. స్టేట్ కేపిటలిజమ్ లో పెట్టుబడిదారీ విధానం, సోషలిజం, రెండూ కలిసి ఉన్నాయి. ప్రైవేట్ పెట్టుబడులపై ప్రభుత్వ పర్యవేక్షణ, నియంత్రణ ఉండేది.

బోల్షివిక్ ప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలను నిర్వహించింది. రాజ్యాంగ పరిషత్తులో సోషలిస్ట్ రివల్యూషనరీలకు మెజారిటీ లభించింది. రాజ్యాంగ పరిషత్తు లోని చాలా మంది ప్రతినిధులు సోవియట్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడంతో, ప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తును విప్లవ వ్యతిరేక సంస్థని ప్రకటించి, రద్దు చేసింది. రాజ్యాంగ పరిషత్తును రద్దు చేసిన తర్వాత, రష్యాలో ఒకే పార్టీ పరిపాలన మొదలైంది.

జర్మనీతో యుద్ధాన్ని అంతమొందించడానికి బోల్షివిక్ ప్రభుత్వం సంప్రదింపులు జరిపి, ఇక వేరే గత్యంతరం లేక, అవమానకరమైన బ్రెస్ట్ లిటోవిస్క్ సంధిని చేసుకుంది. ఈ సంధి వల్ల రష్యా 1/3 వంతు జనాభా, 1/4 వంతు భూభాగం, 1/2 వంతు పరిశ్రమలు, చాలా జాతీయ ఆదాయాన్ని కోల్పోయింది. మొదటి ప్రపంచ యుద్ధంలో రష్యా విపరీతంగా నష్టపోయింది.

రష్యాలో అంతర్యుద్ధం 1918 వేసవి నుండి 1919 వేసవి వరకు జరిగింది. కర్షకుల్లోను, చాలా వర్గాల ప్రజల్లో పెరిగిన అసంతృప్తి, ఈ అంతర్యుద్ధానికి కారణాలు. ఇంగ్లీష్, ఫ్రెంచి ప్రభుత్వాలు బోల్షివిక్ వ్యతిరేక వర్గాలను ప్రోత్సహించాయి. మిత్ర రాజ్యాల ఉన్నత యుద్ధ సమితి 1918 జూలైలో రష్యాలో సైనిక జోక్యం చేసుకోడానికి నిశ్చయించింది.

BRAOU

సోవియట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన రష్యన్లు, తెల్ల సైన్యాలను (White Army) ఏర్పాటు చేసుకున్నారు. తెల్ల సైన్యానికి దీటుగా బోల్షివిక్ ప్రభుత్వం ఎర్ర సైన్యాన్ని (Red Army) ఏర్పాటు చేసింది. ట్రాట్స్కీ ఎర్ర సైన్యాన్ని ఉత్తేజపర్చాడు. మిత్ర రాజ్యాల సైన్యాలు బావించినట్లుగా తెల్ల సైన్యం మొదట్లో విజయాలను సాధించినా, చివరకు ఎర్ర సైన్యాలు గెల్చాయి.

అంతర్యుద్ధం భీకరంగా కొనసాగిన కాలంలో, ఈ యుద్ధాన్ని అంతమొందించడానికి సోవియట్ ప్రభుత్వం సార్వత్రిక జాతీయీకరణ శాసనాన్ని ఆమోదించింది ( 28-6-1918). ఈ దశను యుద్ధ కాల కమ్యూనిజమ్ దశంటారు. ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం పూర్తిగా తన గుప్పిట్లో ఉంచుకుంది.

జెక్ లీజియన్ రష్యానుండి బయటపడ్డానికి 4800 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తున్నప్పుడు, ట్రాన్స్ సైబీరియన్ రైల్వేని ఆక్రమించుకొని, బోల్షివిక్ వ్యతిరేక దళాలతో చేతులు కలిపింది. జెక్ దళం (Czech Legion) జార్‌ను విడిపిస్తుందనే భయంతో, కుటుంబసహితంగా ఉరల్స్ పర్వతాల్లోని ఇకాటెరిన్ బర్గ్ లో బందీగా ఉంచిన మాజీ జార్ రెండో నికలస్, అతని కుటుంబ సభ్యులను సైనికులు హత్య చేశారు. తెల్ల సైన్యం తిరుగుబాటు పూర్తిగా విఫలమై, లెనిన్ నాయకత్వం లోని బోల్షివిక్ ప్రభుత్వం బలపడింది. 1920 తర్వాత బోల్షివిక్ ల అధికారానికి దేశంలో తిరుగులేదు.

1918 జూలై లో సోవియట్ కాంగ్రెస్ కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించింది. రష్యాను "రష్యన్ సోషలిస్ట్ ఫెడరేటెడ్ సోవియట్ రిపబ్లిక్" (Russian Socialist Federated Soviet Republic) గా వ్యవహరించారు. రాజ్యాంగం సివిల్ హక్కులను ఆమోదించింది. అధికారం నగర, గ్రామీణ సోవియట్ల నుండి మొదలౌతుంది. ప్రాంతీయ సోవియట్ల పైన కేంటన్ కు , జిల్లాలకు , రాష్ట్రాలకు సోవియట్ కాంగ్రెస్‌లను ఏర్పాటు చేశారు. ఈ సోవియట్ ల కు ప్రతినిధులను పరోక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. అఖిల రష్యన్ సోవియట్ కాంగ్రెస్ అత్యున్నత శాసన సభ. ఈ కాంగ్రెస్, కార్య నిర్వాహక కమిటీకి శాసనసభ నుండి ప్రతినిధులను ఎన్నుకుంటుంది. పరిపాలనకు 18 మంది కమీసార్లను కేంద్ర కార్యనిర్వాహక కమిటీ ఎన్నుకుంటుంది. వారే సోవియట్ రష్యా మంత్రి మండలి.

లెనిన్ యుద్ధ కాల కమ్యూనిజాన్ని నిలుపుదల చేయించాడు. 1921 మార్చిలో లెనిన్ కమ్యూనిస్ట్ సిద్ధాంతాలతో సమన్వయపడి, కొత్త ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విధానం ప్రకారం, కమ్యూనిస్ట్ సిద్ధాంతాలకు వ్యతిరేకమైన వ్యక్తిగత వ్యాపారాన్ని, పాక్షికంగా ప్రైవేట్ రంగంలో పరిశ్రమల స్థాపనకు అనుమతించాడు. రష్యన్ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడానికి విదేశీ పెట్టుబడులను స్వీకరించడానికి కూడా లెనిన్ సంసిద్ధుడయ్యాడు. 1924 జనవరి 21న పక్షవాతం రావడంతో, లెనిన్ మరణించాడు. అతడు కోట్లాది సామాన్య ప్రజలకు ఆదర్శవ్యక్తి, ఆశారేఖ.

అధికారం గురించి ట్రాట్స్కీ, స్టాలిన్ ల మధ్య సంఘర్షణ 1927 వరకూ కొనసాగింది. ఈ సంఘర్షణలో స్టాలిన్‌ను విజయం వరించింది.

స్టాలిన్ నాయకత్వంలో కమ్యూనిస్ట్ పార్టీ సమ సమాజ స్థాపనకు కృషి చేసింది. వ్యవసాయ రంగం లో స్టాలిన్ సమిష్టి విధానాన్ని ప్రవేశపెట్టాడు. 1927 నుండి సోవియట్ రష్యా, పంచవర్ష ప్రణాళికలను అమలుపర్చింది. మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో (1928-33) భారీ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి; సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లో ఆహారోత్పత్తి పెరిగింది. రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో (1933-38) నిత్యజీవితావసర వస్తువుల ఉత్పత్తి పెరిగి, ప్రజల జీవన ప్రమాణం పెరిగింది.

మూడో పంచవర్ష ప్రణాళికా (1938-1943) కాలంలోనే, రెండో ప్రపంచ యుద్ధం మొదలు కావడంతో, శాంతి కాల ప్రణాళిక, యుద్ధ కాల ప్రణాళికగా మారింది. ప్రణాళికాబద్ధమైన ప్రగతిని సాధించడంలో సామ్యవాద విధానాలు ఎలా తోడ్పడతాయో, రష్యన్ సమాజం మొదటిసారిగా నిరూపించింది.

BRAOU

1917 విప్లవం మార్క్సిస్ట్ సిద్ధాంతాల్ని ఆర్థిక విధాన పరిధి నుండి ఆచరణీయ వేదాంతానికి మార్చింది. రష్యన్ విప్లవం జాతీయ విముక్తి ఉద్యమాలకు గొప్ప ఉత్తేజాన్ని కల్గించింది. రష్యన్ విప్లవం చైనా, ఇండియా, స్పెయిన్ మొదలైన దేశాల్లోని మేధావులను ప్రభావితం చేసింది. చైనాలో కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన జరిగింది. 1949 లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ మావో నాయకత్వంలో అధికారానికి వచ్చింది.

భారతదేశంలో కార్మిక, కర్షకోద్యమాలు బలపడ్డాయి. ఈ విప్లవం పట్ల మేధావులు ఆకర్షితులయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో కూడా సోషలిస్ట్ గ్రూప్ బలపడి, కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ స్థాపితమైంది.

స్పెయిన్‌లో అధికారానికి వచ్చిన సోషలిస్ట్ రిపబ్లికన్ ప్రభుత్వంపై తిరుగుబాటును జరిపిన జనరల్ ఫ్రాంకోకు, హిట్లర్, ముసోలినీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌ల్లోని అధికార వర్గాలు మద్దతివ్వగా, చాలా దేశాల్లోని సామాన్య ప్రజానీకం, మేధావులు, రచయితలు, రిపబ్లికన్ ప్రభుత్వానికి మద్దతునిచ్చారు. ఈ సంఘర్షణలో ఫ్రాంకో విజయానికి హిట్లర్, ముసోలినీలు ఆనందించారు. కాని, వివిధ దేశాల్లోని సామాన్య ప్రజానీకం చాలా చింతించారు. స్పానిష్ అంతర్యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధానికి దారితీసింది.

రెండో ప్రపంచ యుద్ధానంతరం ప్రధాన అగ్రరాజ్యాలైన సోవియట్ యూనియన్, అమెరికాలు, ప్రత్యర్థి సైనిక కూటాలకు నాయకత్వం వహించి, ఆయుధాలను విపరీతంగా పెంపొందించుకుని, 1963 వరకు ప్రచ్ఛన్న యుద్ధంలో పాల్గొన్నాయి.

1963 నుండి 1978 వరకు ఉద్రిక్తతల సడలింపు శకంలో ప్రపంచ శాంతిని కాపాడ్డానికి, అమెరికా, సోవియట్ యూనియన్ కొన్ని చర్యలను తీసుకున్నాయి. 1978 తర్వాత రెండో ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభమైంది. 1985 మార్చిలో గోర్బచేవ్ రష్యన్ కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత, అతడనుసరించిన విధానాలవల్ల ఉద్రిక్తతలు తగ్గాయి. కాని, సోవియట్ యూనియన్ 1990 లో ప్రధాన స్థానాన్ని కోల్పోయింది. 1991 లో సోవియట్ యూనియన్ అస్తమించింది.

## 21.6 పరీక్ష నమూనా ప్రశ్నలు

### I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. అధికార బాధ్యతలను స్వీకరించగానే బోల్షివిక్ ప్రభుత్వం ఎదుర్కొన్న ముఖ్య సమస్యలను వివరించండి.
2. బోల్షివిక్ ప్రభుత్వం రాజ్యాంగ పరిషత్తును రద్దు చేయడానికి కారణాలను తెల్పి, దాని పరిణామాలను విశదీకరించండి.
3. అంతర్యుద్ధం ప్రజ్వరిల్లడానికి కారణాలను తెల్పి, విదేశీ జోక్యానికి దారితీసిన పరిణామాలను పరిశీలించండి.
4. రష్యన్ విప్లవ ప్రాధాన్యతను తెల్పి, వివిధ దేశాలపై దాని ప్రభావాన్ని విశ్లేషించండి.
5. గోర్బచేవ్ అనుసరించిన పెరెస్ట్రాయికా, గ్లాస్‌నాస్త్‌ల ప్రభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

### II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి

1. ప్రభుత్వ పెట్టుబడిదారీ దశ అంటే ఏమిటి?
2. సోవియట్ రాజ్యాంగ ముఖ్య లక్షణాలెవ్వి ?
3. నూతన ఆర్థిక విధాన ముఖ్యాంశాలెవ్వి?
4. స్టాలిన్ ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించండి?
5. సామనస్య శకాన్ని గూర్చి నీకు తెలిసిందేమిటి?

B R A O U

## 21.7 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| E. Lipson | : | **Europe in the 19th & 20th Centuries** |
| Carr E.H. | : | **Russian Revolution ( 3 Vols)** |
| Chamberlain | : | **Russian Revolution ( 2 Vols)** |
| John Reed | : | **Ten Days that Shook the World** |
| Gold Spre | : | **Russian Revolution** |
| Andrew Rothstein | : | **History of Soviet Union** |
| Christopher Hill | : | **Lenin and the Russian Revolution** |
| Sydney Harcave | : | **Russia – A Study** |
| Commission of the Central Council of C.P.S.U.B. (Ed) | : | **History of C.P.S.U. (Bolshevik)** |
| Dhar S.N. | : | **International Relations Since 1919** |



రచయిత : శ్రీ జె.యస్. ప్రకాశరావ్



BRAOU

# ఖండం –VI : చైనా విప్లవం

ఈ ఖండంలో 22,23,24 భాగాలున్నాయి. 22వ భాగంలో, ఆధునిక చైనా పూర్వ వ్యవస్థలను, చైనాపై ఐరోపీయుల దురాక్రమణకు వ్యతిరేకంగా జరిగిన దేశీయ విప్లవాలను, ప్రజల్లో కలిగిన జాతీయ విప్లవ చైతన్యాన్ని గురించి వివరించడమైంది. 23వ భాగంలో, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ పార్టీల పుట్టుక, సిద్ధాంతాలను , చైనాలో విప్లవ వ్యాప్తికై కమ్యూనిస్టులు జరిపిన ఐతిహాసిక దీర్ఘ యాత్ర, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్టుల మధ్య విభేదాలు ఏవిధంగా అంతర్యుద్ధానికి దారితీశాయో చర్చించడమైంది. 24 వ భాగంలో, అంతర్యుద్ధంలో మావో నాయకత్వంలో కమ్యూనిస్టులు ఏవిధంగా విజయాన్ని సాధించి, ప్రజా ప్రభుత్వాన్ని ఎలా స్థాపించుకున్నారో వివరించడమైంది. ప్రపంచ విప్లవ చరిత్రలోనే వినూత్న పద్ధతిలో, సామ్రాజ్యవాదం, వలసవాదం , భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా దీర్ఘకాల పోరాటం జరిగి, ప్రపంచ వలస సమాజ ప్రజల్లో నూతన చైతన్యాన్ని ఏర్పర్చిన చైనా విప్లవాన్ని పై మూడు భాగాల్లో విశ్లేషించడమైంది.

BRAOU

# భాగం 22. చైనా అంతర్యుద్ధ కాలం నాటి పరిస్థితులు

విషయక్రమం


22.0 లక్ష్యాలు

22.1 పరిచయం

22.2 ఆధునిక చైనా పూర్వకాలం నాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక మత మేథోపరమైన పరిస్థితులు

22.3 చైనాలో ఐరోపీయుల దోపిడీ; జాతీయ భావనల పెరుగుదల, విప్లవాలు

22.3.1 నల్లమందు యుద్ధాలు, అసమాన సంధులు, ప్రభావం

22.3.2 తైపింగ్ విప్లవం ప్రభావం, ఫలితాలు

22.3.3 నియన్ ముస్లిం తిరుగుబాట్లు

22.3.4 చైనా జపాన్ యుద్ధ ప్రభావం

22.3.5 చైనాలో ఐరోపాదేశాల ప్రభావ మండలాల ఏర్పాటు, ప్రభావం.

22.3.6 బాక్సర్ విప్లవం, ఫలితాలు, ప్రభావం

22.4 మంచూ సంస్కరణలు, రాజ్యాంగ ఉద్యమం

22.4.1 వందరోజుల సంస్కరణలు

22.4.2 మంచూ సంస్కరణల పునరుద్ధరణ

22.4.3 రాజ్యాంగ ఉద్యమం

22.5 మంచూల పతనం ; రిపబ్లిక్ స్థాపన

22.5.1 1911 విప్లవం, కారణాలు, గమనం, స్వభావం

22.5.2 డా॥ సన్ –యట్–సేన్ పాత్ర

22.5.3 చైనా రిపబ్లిక్ తొలి సమస్యలు,

22.6 సిద్ధాంతపర చైతన్యం ; జాతీయ పోరాటాలు

22.6.1 నూతన సాంస్కృతిక ఉద్యమం

22.6.2 మే 4 ఉద్యమం

22.7 సంగ్రహంగా

22.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

22.9 ఉపయుక్త గ్రంథాలు


## 22.0 లక్ష్యాలు

ఈ పాఠం చదవడం వల్ల మీరు,

- ఆధునిక చైనా పూర్వ చరిత్రను, ప్రజామనుగడను, చైనీయుల రాజకీయ,ఆర్థిక, సాంఘిక పరిస్థితులను వివరించగలగాలి
- చైనాలో ఐరోపీయుల దురాక్రమణను, తత్ఫలితంగా జరిగిన దేశీయ పోరాటాలను విశ్లేషించగలగాలి.
- చైనాలో మంచూ పాలకులు ప్రవేశపెట్టిన సంస్కరణలను, రాజ్యాంగ ఉద్యమాన్ని కూలంకషంగా వివరించగలగాలి.
- 1911 విప్లవ కారణాల స్వభావాన్ని, రిపబ్లిక్ స్థాపనలో డా॥ సన్-యట్-సేన్ పాత్రను విశ్లేషించ గలగాలి.
- చైనాలో రిపబ్లిక్ కాలంలో రాజకీయ సంక్షోభాన్ని కల్గించిన యుద్ధ ప్రభువుల పాలనను వర్ణించగలగాలి.
- చైనాలో సైద్ధాంతిక చైతన్యాన్ని, సాంస్కృతిక, మే 4 ఉద్యమాన్ని విశ్లేషించగలగాలి.

BRAOU

## 22.1 పరిచయం

ప్రపంచంలో చైనా నాగరికత చాలా పురాతనమైంది. దాదాపు నాలుగువేల సంవత్సరాల నాటిది. ఆధునికతకు చైనా చేరేంతవరకు, దాని అభివృద్ధి, కేవలం పరిమితమైంది. ఎందుకంటే, ఇతర గొప్ప నాగరికతల నుండి చైనా వేర్పాటుగా వుంటూ, చైనా ప్రజల స్వాతంత్ర్య పిపాసను వెల్లడించింది. అయినప్పటికీ, అన్వేషణ యుగంలో దాని పరిస్థితిలో మార్పు వచ్చింది. పోర్చుగీస్, స్పానిష్ అన్వేషకులు, వారి వారి రాయబారులు, క్రీ.శ. 16వ శతాబ్దంలో కొత్త సముద్ర మార్గాల ద్వారా దక్షిణ చైనాకు రావటంతో విదేశీ వ్యాపారులు, మిషనరీలు జాగృతమయ్యారు. 17వ శతాబ్దంలో రష్యన్లు సైబీరియాను దాటి, మంచూరియా సరిహద్దులకు చేరుకున్నారు. ఈ సంఘటన వల్ల, చైనావారు యుగాలనాటి వేర్పాటును అధిగమించి, తూర్పు, పడమరల సంబంధాలను ప్రారంభించినట్లైంది. పరిస్థితులు ముందు అనుకూలంగా లేనప్పటికీ, 19వ శతాబ్దం నాటికల్లా అంచెలంచెలుగా వృద్ధిచెంది, పాశ్చాత్య ఘటనలచే బలపడ్డాయి. అయితే, చైనా దేశ అభివృద్ధి సందర్భాన్ని పరిశీలించినట్లైతే, ఐరోపీయుల రాక ప్రాముఖ్యతను మరింతగా సంతరించుకున్నట్లైంది. ఈ కాలంలోనే మంచూ రాజవంశావిర్భావం, చియాంగ్ వంశ స్థాపన జరిగాయి. అభివృద్ధి పథంలో ఆధునిక చైనా ఏర్పాటుకు దారితీశాయి. ఏది ఏమైనప్పటికీ, చైనా చరిత్ర 16వ శతాబ్దం నుండి కలగలుపైంది. అయితే, దాని ప్రభావం 19వశతాబ్దం మధ్య కాలంవరకూ అంతగా లేదు. ఎప్పుడైతే పాశ్చాత్యులు చైనాలో మౌలిక మార్పులకోసం వారి కార్యకలాపాలను విస్తృత పర్చారో అప్పటినుండి మాత్రమే అభివృద్ధి జరిగింది. అనేక విజ్ఞానవేత్తలు, పండితులు ఆధునిక చైనా 16వ శతాబ్దం నుండి, లేదా 19వ శతాబ్దం నుండి ప్రారంభమైనట్లుగా అభిప్రాయ పడుతున్నారు. పాశ్చాత్య చరిత్రకారులు, రాజకీయ విజ్ఞానవేత్తలు, మార్క్సిస్ట్ పండితులు, పాశ్చాత్య దేశాల్లో శిక్షణ పొందిన ఇతర పండితులు, క్రీ.శ. 1839 నుండి 1842 వరకు జరిగిన నల్లమందు యుద్ధ కాలాన్ని, ఆధునిక యుగపు ప్రారంభ కాలంగా పరిగణిస్తూ వచ్చారు. ఈ సిద్ధాంతాన్ని చైనా చరిత్రకారులు గర్హిస్తూ, విదేశాల సామ్రాజ్యవాదం వారి దేశంలోనే ప్రారంభమైందని భావించారు. పాశ్చాత్య చరిత్రకారులు, ఈ యుద్ధంవల్ల విదేశీయుల కార్యక్రమాలు త్వరితమైనవనీ, చైనాలో విప్లవానికి అద్దం పట్టడమైందని పేర్కొన్నారు. మార్క్సిస్ట్ చరిత్రకారులు పెట్టుబడిదారీవాదానికీ, సామ్రాజ్యవాదానికీ ఈ యుద్ధం కారణభూతమైందని, చైనాలో పాక్షిక భూస్వామ్య వ్యవస్థకూ, పాక్షిక వలస రాజ్యతత్వానికీ, నాంది పలికిందనీ అభిప్రాయపడ్డారు.

ఏ చరిత్ర కాలాన్నైనా అర్థం చేసుకోవాలంటే, దాని భారీ మార్పులకు రూపకల్పన చేసిన శాస్త్రీయ అన్వేషణ గురించి తెలుసుకోవాలి. ఆధునిక చైనాలో ప్రభుత్వ విధానం, వ్యవస్థలు కలసి దేశ భవిష్యత్తును నిర్ధారించడం, చింగ్ కాలంలో దాని నిర్వహణ, వంశపారంపర్య పరిశీలనను అతిక్రమించిన, చైనీయుల సుహృద్భావం, దాని అంగీకారాన్ని, సాంప్రదాయ క్రమంగా గుర్తించడం జరిగింది. మింగ్ ప్రభుత్వం పూర్వ సామాజిక వ్యవస్థలను పక్కకునెట్టి, నియో కన్ఫ్యూషియస్ వాదాన్ని ఆపాదించుకొంది, దీంతోపాటు, మంచూల రాజవంశ పారంపర్యాన్ని కొనసాగించింది. మంచూల గుర్తింపును పరిరక్షిస్తూ సామ్రాజ్యవర్గ న్యాయస్థాపన చేసి, దాని ద్వారా మంచూ ప్రభువుల పుట్టుక, విద్య, వివాహ విషయాలు, మంచూ చైనీయుల అంతర్ వివాహాల నిషేధాన్ని, మంచూరియాలో చైనావారి వలసను నిషేధించడం జరిగింది. కొత్త ప్రభుత్వ కార్యాలయాలను నెలకొల్పారు. లీఫాన్ యువాన్ (Lifan - Yuan) 1638 లో స్థాపితమైంది. టిబెట్, మంగోలియా పశ్చిమ ప్రాంత (Sinkiang) వ్యవహారాలను నిర్వహించడానికి, దీని స్థాపన జరిగింది. 1729 లో "గ్రాండ్ కౌన్సిల్" ( Grand Council), 1861లో "ట్సుంగ్లీ యమెన్" (Tsungly Yamen) ను ప్రత్యక్ష విదేశీ సంబంధాల కోసం పాశ్చాత్య దేశాలు ఏర్పాటు చేసుకున్నాయి. మిలటరీ దాడులు సామ్రాజ్యపు ప్రతి మూలలకు వ్యాపించాయి. సరిహద్దుల్లో విప్లవాలు విస్తృతమై, చైనా చరిత్రలో పెద్దదైన రెండో రాజవంశ



BRAOU

స్థాపన జరిగింది. 19వ శతాబ్దం మధ్యకాలం తర్వాత, ప్రభుత్వ శాఖల్లో విదేశీయులు నియమితులైనందువల్ల, ఈ మంచూ, చైనీయుల ద్వంద్వ పాలన విస్తృతమై, పాశ్చాత్య పాలనకు దారితీసింది. మంచూ రాజవంశం పతనమైన తర్వాత, రిపబ్లికన్ ప్రభుత్వ మౌలిక లక్షణాలు దేశాన్ని అంతర్గతంగా ఏకీకరణ చేయటం, అసమతౌల్య సంధులను రద్దుపర్చటం మొదలైంది. 1949 లో కమ్యూనిస్ట్ కాలం నాటికి, సామ్యవాద అంతఃకరణ విస్తృతమైన వేగాన్ని పుంజుకొని, వేగవంతమైన పారిశ్రామికీకరణతో, చైనా అగ్రరాజ్య హోదా వైపు పయనించింది. ఇలాంటి ప్రభుత్వ విధానాలు దేశ ప్రజల భవితవ్యానికి ప్రధాన పాత్ర వహించడంలో, మార్గదర్శకత్వం నెరపడంలో పాలుపంచుకొన్నాయి.

చింగ్ పరాయి రాజవంశానికి చెందటం వల్ల, చైనీయుల్లో నిరసన కొనసాగటంతో, రహస్య సంఘాల కార్యకలాపాలు, జాతీయ వివక్ష పోరాటాలు, విప్లవాలు కొనసాగాయి. కాని, చింగ్ వ్యతిరేకత, మింగ్ పునరుద్ధరణ (Fan-Ching, Fu Ming) భావాలు మార్పుకు గురైనాయి. వీటిని రహస్య సంఘాలు పోషించాయి. 'హెవెన్ అండ్ ఎర్త్ సొసైటీ' (Tien-ti- hui), 'వైట్ లోటస్ తెగ' (Pailien Chiao) మొదలైన సంఘాలు, విస్ఫోటనావకాశాల కోసం నిరీక్షించాయి. వైట్ లోటస్ విప్లవం 1796 లో ప్రారంభమై, 1804 వరకు కొనసాగింది. ఈ సంఘాలను కొంతకాలం తర్వాత, తైపింగ్‌ల ద్వారా 1850 నుండి 1864 వరకు పునరుద్ధరించడం జరిగింది. తైపింగ్‌లు చింగ్ వ్యతిరేకతను నినాదాల వరకే పరిమితం చేసి, మింగ్ పునరుద్ధరణ భావన వదిలేశారు. ఎందుకంటే, వారి సొంత సామ్రాజ్యాన్ని సృష్టించాలనే వాంఛ, వారికి ఉండేది. 1864 లో తైపింగ్‌ల ఓటమి తర్వాత, జాతీయపర జాతి వివక్ష విప్లవం అణగారిన తర్వాత, అది రహస్య సంఘాల కార్యకలాపాలకు దారితీస్తూ, తదనంతర విప్లవాలకు స్ఫూర్తినిచ్చింది. ఇందులో చెప్పుకోదగ్గవి డా. సన్-యట్-సేన్ విప్లవకార చర్యలు. 1912 లో మంచూ రాజవంశ పతనంతో ప్రారంభమైన చింగ్ వ్యతిరేకతాభావం, విదేశీ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జాతీయతా విప్లవానికి దారితీసింది. ఐరోపీయ వలస రాజ్యాలకు వ్యతిరేకత 1910, 1920లలో, ప్రధాన లక్ష్యమైంది. 1930-1940 దశాబ్ది ప్రథమ భాగంలో జపాన్, 1950 ప్రారంభం నుండి ఆఖరు వరకూ రష్యా, చైనా జాతీయవాదులు, కమ్యూనిస్ట్‌లు, దాదాపు ఒకే లక్ష్యంతో పనిచేశారు.

ఈ మూడు వందల సంవత్సరాల్లో అనేక విపరీత పరిణామాలు జరిగాయి. ఆధునిక చైనా ఈ గడ్డు పరిస్థితులను దాటి, జాతీయ, జాతి వివక్ష నిరసన చైనాలో ఉన్న విదేశీ శక్తులకు వ్యతిరేకంగా మారి, చరిత్రలో చైనా జీవన సరళి ఒక విశిష్టమైన సిద్ధాంతంగా రూపుదిద్దుకొంది. ఒకప్పుడు బాహాటంగానూ, మరొకప్పుడు రహస్య కార్యకలాపాల వల్లనూ ఇది సంభవించింది. చరిత్రకారులు పేర్కొన్నట్లుగా, ఆధునిక చరిత్ర విప్లవ చరిత్రగా రూపుదిద్దుకుంది. ఈ భాగంలో ఆధునిక చైనా పూర్వ వ్యవస్థలను, చైనాపై విదేశీ దురాక్రమణను, దీనికి వ్యతిరేకంగా జరిగిన దేశీయ విప్లవాలు, ప్రజల్లో కలిగిన విప్లవ చైతన్యాన్ని గురించి తెలుసుకుందాం.

## 22.2 ఆధునిక చైనా పూర్వకాలం నాటి రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత, మేధోపరమైన పరిస్థితులు

ప్రాచీన చైనా రాజ్యం ఒక కుటుంబం లాగా ఉండేది. రాజ్యాన్ని చైనా భాషలో 'కువోషియా' (Kuochia) అంటారు. 'కువోషియా' అంటే రాజ్య కుటుంబమని అర్థం. రాజ్యం 'దైవలోక సామ్రాజ్య' (Celestial Empire) మనీ, చక్రవర్తి 'దైవ లోక చక్రవర్తి' (Celestial Emperor or Tien Tzv) అనీ, అతనికి ప్రజలను శాసించే హక్కు దైవలోకం నుండి లభించింది (Mandale of Heavens) అని, చైనీయులు భావించేవారు. చింగ్ రాజకీయ నిర్మాణం, కన్ఫ్యూషియస్ క్రమంలో జరిగింది. సామ్రాజ్యంలో అధికార కేంద్రీకరణవల్ల, ఇతర ఏ వ్యక్తికీ లేని అధికారాలు చక్రవర్తికి లభించాయి. చక్రవర్తి ప్రముఖ రాజ్య విధానాలను నిర్ణయించడమే కాక, శాసనాల అమలు, మతపరమైన విషయాల్లో నిర్ణయాలను చేసేవాడు. పరిపాలనలో

చక్రవర్తికి సహాయంగా, రెండు సంస్థలు ఉన్నత సచివాలయం, ఉన్నత సమితి ఉండేవి. ఉన్నత సమితి ముఖ్య సలహా సంఘంగా ఉండేది. దీనిలో ఆరు పాలనా సంస్థలుండేవి అవి: (1) పౌర ఉద్యోగుల నియామకం (Li pu) (2) ఆదాయం (Hu pu) (3)కర్మలు (Lu pu) (4) యుద్ధం (Ping pu) (5)శిక్షలు (Hsing pu) (6) ప్రజాసౌకర్య పనులు (Kung pu) మొదలైనవి. ప్రజాసమస్యలను చూడ్డం కోసం 'ట్సుంగ్లీ ఏమెన్' (Tsungli Yemen) అనే ఏడో బోర్డు ఏర్పాటైంది. ప్రభుత్వంలో అతిశక్తివంతమైన గూఢాచారి వ్యవస్థ ఉండేది. ప్రాచీన చైనా సామ్రాజ్యం, రాష్ట్రాలు, ఫిఫెక్చర్లు (Fui), జిల్లాలు, గ్రామాలుగా విభజితమైంది . పరిపాలనలో అధికార వికేంద్రీకరణ ఉండేది. ఉద్యోగులకు జీతాలతో బాటు, కొంత భత్యమివ్వబడేది. దేశ శాంతిభద్రతల పరిరక్షణకై పెద్ద సైన్యముండేది.

చైనా ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం పునాది వంటిది. దాదాపు 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి ఉండేవారు. వ్యవసాయోత్పత్తి ప్రధానంగా గల చైనాలో భూమిలో సగభాగం సాగులోకి తేవడం జరిగింది. ఉత్తర చైనా, మంచూరియాలో గోధుమ, దక్షిణాన వరి, మధ్య చైనాలో పత్తి, తేయాకు, దుంపలు, పొగాకు, చెరకు ముఖ్య పంటలు. ప్రభుత్వ రాబడి పెద్ద మొత్తంలో భూమి శిస్తు ద్వారా, పోల్ పన్ను (Ti-tung) ద్వారా వచ్చేది. గ్రామీణ జీవనానికి దేవాలయం కేంద్రంగా ఉండేది. వ్యవసాయదారుల వర్గం తర్వాత ముఖ్య వర్గం చేతివృత్తి పనులవారు. వీరిలో అనేక వర్తక శ్రేణులుండేవి. శ్రేణి ధరలనదుపుచేసి, వస్తువుల నాణ్యతను కార్మిక వేతనాలను నిర్ణయించేది. శ్రేణి సమావేశాలకు దేశంలో ప్రతి చోటా సభామందిరాలు (Halls) ఉండేవి. ఈ విధంగా దేశ ఆర్థిక జీవనం ఎక్కువ శాతం, సొంత ఆజమాయిషీకింద ఉండేది. పల్లెల్లో రైతులు, కూలీలు, వర్తకులు, వ్యాపారులు పలు కార్యక్రమాలను నిర్వహించేవారు. శ్రేణులు వృత్తుల ననుసరించి, నేతపనివారల శ్రేణి, బ్యాంకర్ల శ్రేణి, నిత్యావసర వస్తువుల శ్రేణి, స్వర్ణకారుల శ్రేణి మొదలైనవిగా విభజించడమైంది.

ఆధునిక యుగానికి ముందు చైనాలో రవాణా సౌకర్యం తక్కువగా ఉన్నా, దేశంలో వర్తకవాణిజ్యాలు అభివృద్ధి చెందాయి. దూరప్రాంతాల నుండి సరుకులు సముద్ర మార్గం ద్వారా, దేశంలోని సరకులు నదీ మార్గాలు, కాలువల ద్వారాను రవాణా చేయబడేవి. తక్కువ దూరాలకు గాడిద బండ్లను, మనుష్యులను రవాణా సాధనాలుగా ఉపయోగించేవారు.

చైనా సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రబలంగా ఉండేది. కుటుంబానికున్న ప్రాధాన్యత, వ్యక్తికి లేదు. చిన్నవయస్సులోనే వివాహం చేసేవారు. కుటుంబం పేరు నిల్పడానికి కొడుకులను కనడం వ్యక్తి ముఖ్య విధుల్లో ఒకటి. ఆడపిల్లల కంటే, మగపిల్లల పుట్టుకకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారు. స్త్రీలకు ఆర్థికపరమైన స్వాతంత్ర్యం ఉండేది కాదు. భార్య తన భర్తకు విధేయురాలు. విడాకులివ్వడం అరుదుగా జరిగేది. వితంతు పునర్వివాహం అంతగా ప్రాచుర్యంలో లేదు.

సంఘంలో రెండు వర్గాలుండేవి, అవి : (1) ప్రత్యేక హక్కులు, సదుపాయాలు ఉన్న కులీనులు (Gentry) (2) వ్యవసాయదారులు. మొత్తం జనాభాలో 80 శాతం ప్రజలు వ్యవసాయదారులుగాను, మిగతా 20 శాతం జనాభాలో కులీనులైన పండితులు, గౌరవ వంశస్థులు, సజ్జనులు, అధికారులు, పరోక్ష భూస్వాములు, చేతిపని వృత్తులవారు, వ్యాపారులు, మిలటరీ అధికారులుండేవారు. సమసమాజమై ఉండటం వల్ల, చైనాలో కులవ్యవస్థకు తావేలేదు. కులీనులు సమాజంలో ప్రధాన పాత్రను వహిస్తూ, కొన్ని విశేష హక్కులనను భవించేవారు. ఎన్నో విశేష హక్కులున్నప్పటికీ, జెంట్రీలు పాలక ఉద్యోగస్వామ్యంలో పాలు పంచుకునేవారు కాదు. వీరు ప్రజల, స్థానిక మేజిస్ట్రేట్ల మధ్య పౌరవివాదాలను పరిష్కరించడంలో ఏజెంట్లుగా మాత్రమే వ్యవహరించేవారు. కులీనులకన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్న వర్గం, వ్యవసాయదారులది. వారు భూమిని స్వయంగా దున్నేవారు, కౌలుదార్లు వ్యవసాయ కూలీలుగా విభజితమైనారు. కర్షకుల తర్వాత, చేతిపని వృత్తులవారు, వ్యాపారస్థులు, సేవకులు, కర్మాగార కూలీలు మొదలైన వారుండేవారు. వ్యాపారులు

సమాజంలో అట్టడుగు శ్రేణిలో ఉండేవారు.

చైనాలో మత, మేధోపరమైన విషయాలను పరిశీలిస్తే, ప్రాచీన చైనా సమాజంలో మత ప్రమేయం, ప్రభావం తక్కువే అని చెప్పొచ్చు. పెద్దలను గౌరవించి, పూజించటం కుటుంబ వ్యవస్థకే పరిమితం కావడం వల్ల, చైనాలో దేశవ్యాప్తమైన మతంకాని, పూజా విధానం కానీ ఏర్పడలేదు. చైనీయులు ప్రకృతి అంశాలైన పర్వతాలను, నదులను పవిత్రమైనవిగా భావించి ఆరాధించేవారు. చైనీయుల్లో మత అసహనం, మత మౌఢ్యం కన్పించవు.

ప్రాచీన చైనా చరిత్రను దార్శనికుల యుగం (Age of Philosophers) అని కూడా అంటారు. చైనా సాంస్కృతిక వికాసంలో ఇది ప్రత్యేకంగా పేర్కొదగ్గ ఈ వికాసం, చౌ (Chou) యుగంలో క్రీ.పూ. 1027 లో కన్ఫూషియన్ లావోత్సే దార్శనికులచే జరిగింది. కన్ఫూషియస్ సిద్ధాంతం ప్రకారం జ్ఞాన సముపార్జన, సత్ప్రవర్తనకు ఆలంబనం కావాలి. నైతిక సత్ప్రవర్తన సాధించడానికి జ్ఞానాన్ని సంపాదించాలి. సత్ప్రవర్తకులైన ప్రజాపాలకులు సత్ప్రభుత్వానికి ప్రాతిపదిక అని కన్ఫూషియస్ బోధించాడు. ప్రతి వ్యక్తి తన వైయక్తిక, విద్యుక్త ధర్మాలను నెరవేరిస్తే, రాజ్య వ్యవస్థ దానంతటదే బాగుపడుతుందని కన్ఫూషియస్ ప్రచారం చేశాడు. కన్ఫూషియన్ నాలుగు గ్రంథాలు, ఐదు మహాకావ్యాలను రాసాడు. అవి 'ద రికార్డ్ ఆఫ్ రైట్స్' (The Record of Rights) 'ద బుక్ ఆఫ్ చేంజెస్' (Book of changes) 'ద బుక్ ఆఫ్ హిస్టరి' (The Book of History) 'ద బుక్ ఆఫ్ పోయిట్రీ' (The Book of Poetry) 'స్ప్రింగ్ అండ్ ఆటమ్' (Spring and Autumn)'ద బుక్ ఆఫ్ మెన్షియస్ మిడిల్ పాత్' (The Book of Mencious middle path) . ఇవి ఆనాటి రాజకీయ సాంఘిక సమస్యలను ప్రతిబింబించే ప్రామాణిక గ్రంథాలు. కొన్ని శతాబ్దాల వరకు, సాంస్కృతికంగా చైనీయులను ఏక జాతీయులుగా చేయటానికి, చైనా సమైక్య పురోభివృద్ధికి కన్ఫూషియస్ సిద్ధాంతాలు తోడ్పడ్డాయి.

చైనా ప్రజలను ప్రభావితం చేసిన మరో మతం, టావో మతం. టావో మత నిర్మాత లావోట్జు. ఇతడు రాసిన గ్రంథం "టావోటెకింగ్" (Tao-Teking ie–The way of Life), టావో మతానికి బైబిల్ లాంటిది. లావోట్జు సహజ-జ్ఞాన విధానానికి ప్రాముఖ్యత నిచ్చి, కర్మలను, చట్టాలను తిరస్కరించాడు. చైనా కళలను, సాహిత్యాన్ని, సాంఘిక అలవాట్లను మానవత్వ విలువలను టావో మతం ఎక్కువగా ప్రభావితం చేసింది. కన్ఫూషియస్ మరణానంతరం, 'టా' రాష్ట్రంలో, మావోత్సే అనే తత్వవేత్త విశ్వజనీన ప్రేమను, యుద్ధ వ్యతిరేకతను బోధించాడు.

కన్ఫూషియన్ తర్వాత ఒక శతాబ్దానికి క్రీ.పూ. 375–28ల మధ్య కాలంలో, మెన్షియస్ అనే తత్వవేత్త నియో కన్ఫూషియస్ మతాన్ని సిద్ధాంతీకరించాడు. ఇతడు విప్లవవాది. తీవ్ర నైతిక , రాజకీయ విధానాలను అనుసరించాడు. పేదరికం, నిరక్షరాస్యత, అజ్ఞానం, సాంఘిక దురాచారలకు వ్యతిరేకంగా, రాజు యుద్ధం చేయాలి. అలాచేయని పక్షంలో, దుష్ట ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయవచ్చన్నాడు. ప్రజల శత్రువైన రాజును తొలగించే అధికారం, ప్రజలకుందని పేర్కొన్నాడు. చైనా చరిత్రలో రాజరికాన్ని తొలగించడానికి ప్రయత్నించిన ఎన్నో విప్లవాలు చెలరేగడానికి, మెన్షియస్ విప్లవాత్మక సిద్ధాంతాల ప్రభావమే ప్రధాన కారణం.

చైనాలో ప్రజలను బౌద్ధ మతం కూడా ప్రభావితం చేసింది. బౌద్ధమతం భారతదేశంనుండి చైనాలో ప్రవేశించడంవల్ల భారతదేశాన్ని చైనీయులు 'పశ్చిమ పవిత్ర భూమి' (Pure land of West) అని భావించారు. బౌద్ధ మతం చైనా కళలను చాలా ప్రభావితం చేసింది. యన్‌కుంగ్, టుంగ్‌మేన్‌ల లోని గుహాలయాల్లో గాంధార శిల్ప ప్రభావం కన్పిస్తుంది. బౌద్ధ మతం ఫలితంగా, ఇతర దేశాల నుండి బౌద్ధ మతస్తులు ప్రవేశించే భూ మార్గాలను చైనా తెరిచింది. ఇది వారి ఆలోచనా దృక్పథాన్ని విశాలం చేసింది. ఈ విధంగా చైనా ప్రజల

మతంలో, భాషలో,ఆహార సాంప్రదాయాల్లో భిన్నత్వం ఉన్నా, చైనాలో జాతీయ సమైక్యత ఉండేది.

## 23.3 : చైనాలో ఐరోపీయుల దోపిడి, జాతీయ భావనల పెరుగుదల, విప్లవాలు :

పాశ్చాత్య వ్యాపార కేంద్రాల స్థాపన, చైనా దేశ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. క్రీ.పూ. 6-7 శతాబ్దాల్లో చైనా ఐరోపాల మధ్య ప్రత్యక్ష పరిచయం ఉండొచ్చని పాల్, హెచ్ క్లైడ్ అభిప్రాయ పడ్డాడు. పవిత్ర సామ్రాజ్యంగా పిలువబడే చైనా నావికా దిక్సూచి, గంధకపు పొడి, పింగాణీ, మట్టి, కాగిత తయారీలో శతాబ్దాల చరిత్ర ఉన్నందువల్ల, ఐరోపా అన్వేషకులు చైనాలోకి రావడం జరిగింది. క్రీ.శ. 635 లో, క్రైస్తవ మత ప్రచారకులు చైనాలో అడుగు పెట్టారు. మొదట చైనీయులు, క్రైస్తవ ప్రచారకులను సహన భావంతో చూశారు. క్రీ.శ 960 నుండి క్రీ.శ. 1279 వరకు పరిపాలించిన సుంగ్ చక్రవర్తులు పాశ్చాత్య వ్యాపారుల ద్వారా, చెప్పుకోదగ్గ ఆదాయాన్ని సంపాదించారు. క్రీ.శ. 13-14 శతాబ్దాల్లో, మంగోల్ పాలనా కాలంలో ఐరోపీయుల మత, వ్యాపార సంబంధాలు కొనసాగాయి. క్రీ.శ 15వ శతాబ్ది చివరి దశకంలో, నూతన సముద్ర మార్గాల ఆవిష్కరణ ఫలితంగా, మొదటిసారిగా పోర్చుగీస్ వారు క్రీ.శ. 16వశతాబ్దంలో దక్షిణ చైనాలోని మెకావోలో వర్తక స్థావరం స్థాపించడంతో విదేశీ వ్యాపారం, మిషనరీలు మొదలైనాయి. 17వ శతాబ్దంలో సైబీరియాను దాటి, మంచూరియా సరిహద్దులకు చేరుకున్నారు. తదనంతర కాలంలో 1604లో డచ్చివారు, 1637 లో ఫ్యార్మోజా ద్వీపకల్పంలో బ్రిటీష్‌వారు, 1784 కాంటన్ రేవుపట్టణంలో అమెరికన్లు, చైనాలో వర్తక స్థావరాలేర్పర్చుకున్నారు. 1685 లో చైనా చక్రవర్తి అన్ని రేవులను విదేశీ వ్యాపార నిమిత్తమై తెరవాలని శాసించాడు. తీర ప్రాంతాలకు, సరిహద్దు ప్రాంతాలకు, విదేశీయుల మూలంగా భద్రత లోపించినందువల్ల విదేశీ వ్యాపారాన్ని కాంటన్ నగరానికి మాత్రమే పరిమితం చేశామని, 1757లో రాజాజ్ఞ జారీ చేయడం జరిగింది. విదేశీయులు నగరం వెలుపల వర్తక స్థావరాలేర్పర్చుకోవాలని, వారు తమ ఫ్యాక్టరీ ఆవరణలో మాత్రమే తిరగాలని షరతును పెట్టారు. తర్వాత, 1842 లో కోహాంగ్ అనే వర్తక శ్రేణి ఏర్పాటై, విదేశీ వ్యాపారస్తులకు చైనీయ అధికార వర్గానికి మధ్యవర్తిగా వ్యవహరించింది. ఇది, విదేశీ ఎగుమతి, దిగుమతులను అజమాయిషీ చేసి, విదేశీ వర్తకులపై అనేక షరతులు విధించింది.

19వ శతాబ్దపు చివరి భాగంలో ఐరోపా రాజ్యాల వ్యాపార ధోరణికి, సామ్రాజ్య కాంక్ష తోడైంది. చైనాలో వాణిజ్య లాభంతో బాటు, రాజకీయ దురాక్రమణ చర్యలను వారు చేబట్టారు. చైనా విదేశీయులను ఎన్నడూ ఆహ్వానించలేదు. వీరిని " ఆహ్వానించని చొరబాటుదారులుగా, అగౌరవనీయులుగాను " పరిగణించింది. ఉన్నత నాగరికత, సమృద్ధిగా సహజసంపదలుండి 'పవిత్ర సామ్రాజ్యంగా' పేరుపొందిన చైనా పురాతన సంస్కృతివల్ల, వారికి తామే అధికులమన్న భావన ఉండేది. " ఇతర దేశాలనుండి వచ్చిన ఆటవికుల ( ఐరోపాదేశస్తుల) నుండి నేర్చుకునేది ఏమీ లేదని" వారు భావించారు. ఈ భావంతోనే వారు విదేశీ వర్తకులపై అధిక పన్నులను, ఎన్నో నిర్బంధాలను విధించారు. 18వ శతాబ్దంలో కాంటన్‌లో వ్యాపారం చైనీయుల కనుకూలంగా ఉంది. విదేశీ వ్యాపారులు తేయాకు, సిల్క్, రుబార్బ్, ఇతర వస్తువులను కొనుగోలు చేసి, వీటికి బదులుగా బంగారం , వెండిని చెల్లించేవారు. 1781- 1790 సంవత్సరాల మధ్యకాలంలో, 16:4 మిలియన్ టేల్స్ బరువుగల వెండి చైనాకు చేరింది. 1800 నుండి 1810 వరకు 26 మిలియన్ల వెండి చేరింది.ఈ ఆర్థిక సమతౌల్యం 1820 వరకు చైనా కనుకూలంగా కొనసాగింది. ఐరోపా వారు చైనాలో, స్థావరాలు పూర్తిగా ఏర్పర్చిన తర్వాత, 1820 నుండి ఈ సమతౌల్యం ఐరోపాదేశం వైపు ఒరిగింది. 1831-1833 వ సంవత్సరాల మధ్య కాలంలో దాదాపు పది మిలియన్ల టేల్సుగల వెండి చైనానుండి బయటకు వెళ్లింది. ఇది క్రమక్రమంగా మరింత వేగవంతమైంది. వ్యాపార తూకంలో ఈ విలోమానుపాతం జరిగి, చైనా ఆర్థిక దోపిడీకి దారితీయడానికి కారణాలనేకం ఉన్నాయి. వీటిలో ప్రధాన కారణం నల్లమందు. పాశ్చాత్య



BRAOU

నాగరికత చైనాలో నిర్మాణాత్మకంగా కంటే, ఆర్థిక దోపిడీ, రాజకీయ దురాక్రమణకు దారి తీయడంతో, జాతీయ భావనలు జాగృతమై, విదేశీయులకు వ్యతిరేకంగా అనేక దేశీయ విప్లవాలు జరిగాయి.

## 22.3.1. నల్లమందు యుద్ధాలు – అసమాన సందులు, ప్రభావం

నల్లమందు విత్తనాలను మొట్టమొదట 7,8వ శతాబ్ది మధ్యకాలంలో అరబ్బులు, టర్కులు చైనాలో ప్రవేశపెట్టారు. మొదట చైనీయులు దీన్ని ప్రధానంగా బాధానివారణి ఔషధంగా ఉపయోగించేవారు. కాని, క్రమక్రమంగా, వీరు దీన్ని మత్తుమందుగా సేవించి, ఈ నల్లమందుకు బానిసలయ్యారు. అమెరికా, భారతదేశాల్నుండి దిగుమతయ్యే నల్లమందు విలువ, చైనాలోని అన్ని ఎగుమతుల విలువలను మించిపోవడంతో, చైనా ఖజానాకు భారీగా గండిపడింది. అయితే,చక్రవర్తి యంగ్-చంగ్(1723-38) ఆర్థిక, నైతిక పతనాలకు నల్లమందు దారి తీస్తుందని గ్రహించి, 1729 లో దీన్ని నిషేధించాడు. ఆ తర్వాత చక్రవర్తి చియా-చింగ్ (1796-1820) కాలంలో కూడా, ఈ బహిష్కరణ కొనసాగింది. కానీ, నల్లమందుపై నిషేధమున్నప్పటికీ, విదేశీయులు తమ స్వప్రయోజనాల కొరకు ఈ వ్యాపారాన్ని కొనసాగించారు. నల్లమందును పూర్తిగా నిషేధించడంలో ప్రభుత్వ అశక్తత వల్ల, విదేశీయుల జోక్యం ప్రబలి, నల్లమందు యుద్ధాలకు దారి తీసింది. అయితే, బ్రిటీష్, చైనీయుల మధ్య జరిగిన యుద్ధాలకు, నల్లమందే కాక, ఈ రెండు దేశాలమధ్య కాంటన్ లో ఉన్న వ్యాపార పరిస్థితులు కూడా దోహదం చేశాయి.

1757 వ సంవత్సరంలో, మంచూ పాలకులు విదేశీ వ్యాపారాన్ని కాంటన్ రేవు పట్టణానికి పరిమితం చేశారు. విదేశీయుల నివాసం మకావోలో ఉండాలని కొన్ని ఆంక్షలను విధించారు. తర్వాత, 1802 లో కోహాంగ్ అనే మరో వర్తక శ్రేణిని ఏర్పాటు చేశారు. విదేశీయులు వస్తువుల క్రయ విక్రయాలను ఈ శ్రేణి ద్వారానే చేయాలని షరతు విధించడమైంది. విదేశీయులు ఈ షరతులు నిరసించినా, వ్యాపారం కోసం వీటిని అంగీకరించారు.

చైనాతో బ్రిటీష్‌వారి వ్యాపారం బాగా అభివృద్ధి చెందటంతో, తమ దేశానికి ప్రత్యేక గుర్తింపు కోరడానికి బ్రిటన్ ముగ్గురు రాయబారులను పంపింది. 1772 లో లార్డ్ మెకార్ట్నీ (Lord Mac Carteny), 1816లో లార్డ్ ఆమేహర్స్ట్ (Lord Amherest), 1834 లో లార్డ్ నేపియర్ (Lord Napier) రాయబారులు గా చైనాకు వచ్చినా, అప్పుడు జరిగిన కొన్ని సంఘటనలవల్ల వారి దౌత్య ప్రయత్నాలు ఫలించ లేదు. క్రీ.శ. 1784 లో ఆంగ్లేయుల "లేడీహ్యూస్" అనే ఓడకు చెందిన గన్నర్ యాదృచ్ఛికంగా చైనీయునొకడిని చంపాడు. చైనీయుల ఒత్తిడిపై ఆ బ్రిటీష్ నావికుడిని చైనాకు అప్పగించారు. చైనీయులు అతన్ని చంపేశారు. చైనీయుల, , ఆంగ్లేయుల మధ్య ఉద్రిక్తత పెంచిన ఈ సంఘటన వల్ల, మెక్‌కార్ట్నీ రాయబారం విఫలమైంది.

చైనా ఆంగ్లేయ సంబంధాల్లో ఉద్రిక్తత మరింత సంక్లిష్టం చేసిన ఉదంతం, టెర్రనోవా వ్యవహారం. టెర్రనోవా ఒక అమెరికన్ ఓడలో ఉద్యోగి. 1821 లో టెర్రనోవాను, ఒక చైనీయ స్త్రీని చంపిన నేరం కింద, చిత్రహింసకు గురిచేసి చంపడం జరిగింది. ఈవిధంగా చంపడం అమానుషమని పాశ్చాత్యులు భావించగా, విదేశీయులు తప్పు చేస్తే క్షమించనవసరం లేదని, చైనీయులు వాదించారు.

1834 వ సంవత్సరంలో చైనాతో బ్రిటీష్ వ్యాపార సంబంధాల్ని మెరుగుపర్చేందుకు, నేపియర్ తొలి సూపరింటెండెంట్‌గా నియమితుడైనాడు. అయితే, ఇతడు చైనీయుల పద్ధతుల్ని ఉల్లంఘించాడన్న నేరంపై ఆంగ్ల ప్రతినిధిని మకావోకు పంపాలని చైనా ఆజ్ఞాపించింది. నేపియర్ ఆకస్మిక మరణంతో యుద్ధ ప్రమాదం తప్పింది. కాని 1838 లో చైనా కమీషనర్ లిన్-త్సె-షు (Lin- Tse- Hsu) ఆంగ్లేయులనుండి నల్లమందును సముద్రంలో పడ వేయించగా, ఈ రెండు దేశాల మధ్య విభేదాలు తిరిగి తలెత్తాయి. ఈవిధంగా, క్రీ.శ.1839-42 ల మధ్య నల్లమందు నిషేధ వివాదం వల్ల, మరి కొన్ని ఇతర కారణాలవల్ల, చైనా బ్రిటీష్

వారి మధ్య శ్రతుత్వం ప్రబలి యుద్ధానికి దారితీశాయి. "ఈ యుద్ధాన్ని మొదటి ఆంగ్లో చైనా యుద్ధం, లేక నల్లమందు యుద్ధం అనే పిలవాలా! అన్న సందేహానికి ఖచ్చితమైన సమాధానం చెప్పటం కష్టం" అని క్లైడ్ బీర్స్ అనే చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

1839 జూలై 7న మొదటి నల్లమందు యుద్ధం ఆరంభమైంది. క్రీ.శ. 1840 జూన్‌లో కమీషనర్ ఇలియట్ సారథ్యంలో, బ్రిటిష్ సేనలు చైనాపై దాడిచేశాయి. లిషాన్ నాయకత్వంలో చైనా సేనలు పోరాడినా ఫలితం లేకపోయింది. తర్వాత బ్రిటీష్ సైన్యం పాటింజర్ సారథ్యంలో, చైనా ఉత్తర ప్రాంతాలను ఆక్రమించుకొంది. చివరకు, చైనా లొంగిపోయి బ్రిటీష్ వారితో 1842 ఆగస్ట్ 29 న నాన్‌కింగ్ సంధిని కుదుర్చుకొంది. నాన్‌కింగ్ సంధి ప్రకారం, చైనా భారీ యుద్ధ నష్టపరిహారాన్ని బ్రిటన్ కు చెల్లించడమేకాక, బ్రిటీష్‌వారు చైనాలో అనేక పట్టణాల్లో ఫ్యాక్టరీల నిర్మాణానికి స్వేచ్ఛా వ్యాపారం చేయడానికి అనుమతినిచ్చింది. 1842 లో ఇంగ్లాండ్‌తో కుదుర్చుకున్న భోగ్ ఒప్పందం ద్వారా, ఇంగ్లాండు కు ప్రాదేశీయ హక్కులతోబాటు అత్యంత గౌరవప్రదమైన ఆదరణీయమైన దేశీయ (Most Favoured Nation) హోదానిచ్చింది. 1842 అక్టోబర్ లో ఫ్రాన్స్, నార్వే, స్వీడన్ దేశాలు కూడా చైనాలో సంధి ఒప్పందాలు చేసుకొని, అనేక రాయితీలను పొందాయి.

విదేశీ రాజ్యాలు నాన్‌కింగ్ సంధి అంశాలతో తృప్తిపడకపోవడంతో, రెండో నల్లమందు యుద్ధం ఆరంభమైంది. ఈ యుద్ధం జరగడానికి రెండు సంఘటనలు ప్రధాన కారణాలైనాయి. ఒకటి, 1856 లో జరిగిన "లోర్చో ఆరో" (Lorbo Arrow) సంఘటన. లోర్చో ఆరో అనే చైనా వ్యాపారి ఓడలో ప్రయాణించే బ్రిటీష్ సిబ్బంది నిర్బంధ విషయంలో, చైనా బ్రిటీష్ దేశాల మధ్య వివాదం చెలరేగింది. రెండో సంఘటన, ఆగస్టిన్ చాప్‌డలేన్ హత్య. 1856 ఫిబ్రవరిలో ఆగస్టీన్ చాప్‌డలేన్ అనే ఫ్రెంచ్ మత ప్రచారకుడిని చైనా న్యాయస్థానం నేర విచారణ జరిపి ఉరితీయగా, ఫ్రాన్స్ ఈ చర్యను తీవ్రంగా ఖండించింది. ఇంగ్లాండ్‌తో చేతులు కలిపి 1857 డిసెంబర్‌లో కాంటన్ పై దాడి చేసింది. చైనా ప్రభుత్వం ఓటమి సంగీకరించి, 1858 జూన్ 26 న టియన్‌సేన్ సంధిపై సంతకం చేసింది. టియన్‌సేన్ సంధి ప్రకారం, విదేశీ రాజ్యాలు ప్రాదేశిక హక్కులు, యుద్ధ నష్ట పరిహారంతో పాటు, యాంగ్‌ట్జె నదీ ప్రాంతాల్లో స్వేచ్ఛా వ్యాపార హక్కులను పొందాయి. చైనాలో అనేక రేవు పట్టణాలు విదేశీ వ్యాపారానికై తెరవబడ్డాయి. వాటితోపాటు, పెకింగ్‌లో బ్రిటీష్ ఫ్రెంచ్ మంత్రుల నివాసానికి చైనా అంగీకరించింది. క్రైస్తవ మత వ్యాప్తికి స్వేచ్ఛ నివ్వడం జరిగింది.

చైనాకు , బ్రిటీష్, ఫ్రెంచ్ వారికి మధ్య టియన్‌సేన్ ఒప్పందాల అమల్లో వచ్చిన విభేదాలు మరో యుద్ధానికి దారితీశాయి. 1860 లో జరిగిన పెకింగ్ ఒప్పందంతో రెండో నల్లమందు యుద్ధం ముగిసింది. ఈ ఒప్పందం ప్రకారం, టియన్‌సేన్ సంధులకు చైనా ఆమోదించటమేకాక, అదనపు నష్ట పరిహారంగా కాంటన్‌ను బ్రిటీష్ వారికప్పగించింది. ఫ్రెంచ్ ప్రభుత్వానికి జప్తు చేసిన రోమన్ కాథలిక్ ఆస్తులను తిరిగి ఇవ్వడం జరిగింది.

ఈ రెండు నల్లమందు యుద్ధాలు చైనాలో నెలకొనివున్న అరాచకత్వానికీ, విదేశీ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనీయుల తిరుగుబాటుకు నాంది పలికాయి. ఈ యుద్ధాల ఫలితంగా కుదుర్చుకున్న అవమానకరమైన సంధి అంశాలు చైనీయుల్లో విదేశీయులపై ఉన్న ద్వేష భావాన్ని ఎక్కువ చేశాయి. అప్పటివరకు చైనీయులు విదేశీయులను 'ఆటవికులుగా' మాత్రమే పరిగణించేవారు. కానీ, నల్లమందు యుద్ధం తర్వాత వీరిని 'దురాక్రమణదారులుగా' గుర్తించి, అసహ్యించుకోడం మొదలుపెట్టారు. విదేశీయులపై ద్వేష భావం, చైనీయుల్లో జాతీయతాభావాన్ని ప్రస్ఫుటం చేసింది. ఈ సంధి ఒప్పందాల ఫలితంగా, చైనాలోని అనేక రేవు పట్టణాలు ఐరోపీయుల పరమైనాయి. యుద్ధంలో చైనా చెల్లించిన భారీ నష్టపరిహారం వల్ల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. ఈ సంధులవల్ల, ఐరోపా దేశాలనుండి వచ్చిన మత ప్రచారకులు చైనాలో



BRAOU

తమ ప్రచారాన్ని విస్తృతపరచడాన్ని ప్రజలు గర్హించారు. కోపోద్రిక్తులైన ప్రజలు ఒక ఆంగ్ల అన్వేషకుని చంపడంతో, బ్రిటన్‌తో 1876 లో చేసుకొన్న ఒడంబడిక ప్రకారం, అదనపు నష్టపరిహారాన్ని చైనా చెల్లించింది. ఈ సంధులవల్ల విదేశీ వ్యతిరేకత ప్రబలటమేగాక, మంచూ వ్యతిరేక భావం చైనీయుల్లో ఏర్పడింది. ఈ రెండు నల్లమందు యుద్ధాల్లో చైనా ఓటమి మంచూ పాలకుల అసమర్థతకు అద్దం పట్టింది. ఈ ఓటమితో మంచూలు "స్వర్గ ఆదేశాలను' (Mandate of Heavens) కోల్పోయారని, అందువల్ల వారిని కూలదోయాలని వారు భావించారు. ఈ అభిప్రాయ ఫలితంగా తైపింగ్ తిరుగుబాటు జరిగింది.

## 22.3.2 : తైపింగ్ విప్లవం ( 1850–64) ప్రభావం, ఫలితాలు

చైనా ప్రజల్లో ప్రబలిన అసంతృప్తి, మంచూ వంశంపై తైపింగ్ తిరుగుబాటుకు దారి తీసింది. ఇది చైనాలోని 16 రాష్ట్రాల్లో వ్యాప్తి చెంది, 6000 పట్టణాల్లో జనజీవనాన్ని ప్రభావితం చేసింది. ఇది మంచూ వంశాన్ని కూలదోయడానికి మొట్టమొదటిసారిగా జరిపిన సామాజిక, రాజకీయ తిరుగుబాటు. ఈ తిరుగుబాటు చైనాలో భవిష్యత్ సంఘటనలకు దారిచూపి, క్రీ.శ. 1911 క్రీ.శ 1949 మధ్య సంభవించిన గొప్ప విప్లవాలకు స్ఫూర్తినిచ్చింది. మంచూ పాలన విషయాలపై ప్రజల్లో ఏర్పడ్డ అసంతృప్తి, నల్లమందు యుద్ధాల ఫలితంగా కుదుర్చుకున్న సంధులవల్ల కలిగిన న్యూనతాభావం, ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణాలు. దేశంలో పెరుగుతున్న జనాభాకు తగిన సాగు భూమి లేకపోవడంతో, ప్రజల కుటుంబ పోషణ కష్టమైంది. నల్లమందు యుద్ధం తర్వాత చైనా చెల్లించిన భారీ నష్ట పరిహారాన్ని పూడ్చేందుకు, ప్రభుత్వం విధించిన అధిక పన్నుల భారంతో పాటు, పెరిగిన ధరలు రైతుల, సామాన్యుల జీవితాన్ని దుర్భరం చేసింది.

హంగ్-షు- చువాన్ తైపింగ్ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు ,హంగ్ మంచూలను విదేశీయులుగా భావించి, వారిపై తిరుగుబాటు లేవదీయడంవల్ల , తైపింగ్ తిరుగుబాటు జాతీయ విప్లవంగా పరిగణింపబడింది. హంగ్ స్నేహితుడు, విద్యావేత్త అయిన ఫెంగ్-యన్-షాన్, హంగ్ భావనలకు ప్రోద్బలమిచ్చి, ఇతనికి అనుకూల వాతావరణాన్ని సృష్టించాడు. ఇతని అనుచరులు దైవ సమాజాన్ని రూపొందించి, దేవుడొక్కడే పూజనీయుడు, చక్రవర్తి కాదని చాటారు. హంగ్, ఫెంగ్, ఇతర నాయకులైన యంగ్‌షు-చియాంగ్, షియపో-చౌకుయి , షీ-హ-కైలతో కలిసి ఈ కొత్త ఉద్యమానికి నాయకులయ్యారు. హంగ్ అతని అనుచరులు చైనాలో 1849–50 మధ్య ప్రబలిన కరువు కాలంలో, ధనవంతులను దోచి పేదలకు ధనాన్ని పంచారు.1850 నవంబర్ లో ఈ సంఘానికి సంబంధించిన కార్మికులపై అధిక పన్నులను విధించడంతో, 1851 జనవరి 11న వారి తిరుగుబాటును ప్రకటించారు. తైపింగ్ రహస్య సంఘాలు 19వ శతాబ్దంలో నిరంతరంగా శ్రమిస్తూ ,1912 వరకు మంచూలను కూలదోసేంతవరకు పనిచేశాయి. చైనా జాతీయవాద పిత అయిన డా॥ సన్-యట్-సెన్ కూడా ఒకప్పుడు ఈ సమాజ సభ్యుడే.

1851-56 మధ్య కాలంలో, తైపింగ్‌ల జాతీయతా భావం, మతావేశంతో పోరాటాన్ని సాగించాయి. మంచూల పాలనలోని సుశిక్షితులైన సైన్యాన్ని కూడా ఎదుర్కొని అద్భుతంగా విజయాలు సాధించినందువల్ల, ఈ చర్య సామ్రాజ్యవాద శక్తుల అధోపతనానికి సూచనైంది. వారు చంటియన్ మొదలుకొని యంగ్ ఆన్ వరకూ, చాంగ్-షా- చూయిూన్,హంగ్‌కీ, నాన్‌కింగ్ పట్టణాలను గెల్చుకొన్నారు. హంగ్,నాన్‌కింగ్ పట్టణం వద్ద నూతన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. హంగ్ తన నూతన సామ్రాజ్యంలో ఎన్నో సంస్కరణలను ప్రవేశపెట్టాడు. మార్క్స్ సిద్ధాంతపరంగా ఫయనిస్తూ, హంగ్ చైనా విప్లవ పోరాటంలో మావో-సే-టుంగ్‌కు పూర్వగామి అయ్యాడు. తైపింగ్ పాలనలో రైతులకు పౌర అధికారాలు, సైనిక విధులివ్వబడ్డాయి. మొత్తం సమాజంలో, 25 కుటుంబాల వారిని సామ్యవాద సహసభ్యులుగా విభజించారు. తైపింగ్‌లు సివిల్ సర్వీస్ పరీక్షలను నిర్వహించేవారు. ఈ పరీక్షలు కన్ఫ్యూషియన్ సిద్ధాంతాలపై గాక, బైబిల్ మత గ్రంథ

విషయాల్లో పరీక్షించేవారు. మహిళలకు కూడా ఈ పరీక్షలో ప్రవేశం లభించింది. తైపింగ్‌లు వారి సొంత కాలెండర్‌ను రూపొందించుకున్నారు. సమాజంలో మొట్టమొదటిసారిగా, స్త్రీలకు పురుషునితో సమాన హక్కులతో పాటు, సమాన హోదా లభించాయి. స్త్రీలు కూడా పౌర, సైనిక పాలనలో, పాలు పంచుకునేవారు. వివాహితులకు, అవివాహితులకు, వితంతువులకు, నివాసవసతి కల్పించబడింది. బాలికల పాదాలను పెరగ కుండా కట్టివేసే (Foot Binding) దురాచారాన్ని నిషేధించారు. వ్యభిచారం, ఉంపుడుగత్తె విధానాన్ని రద్దుచేశారు. భూమి పంపిణీ విషయాల్లో కూడా, స్త్రీలకు సమాన వాటా కల్పించారు. హంగ్ ఈ విధంగా, సంక్షేమ సమాజాన్ని నిర్మించడానికి ఉద్దేశించినందువల్ల, అనాథలు, వికలాంగులు, నిరుద్యోగులు సామ్యవాద సమాజ పరిరక్షణలోకి తేబడ్డారు.

తైపింగ్‌లు ఎన్నో సంస్కరణలు చేసినప్పటికీ, కొన్ని లోపాలవల్ల, ఇది అణిచివేయడం జరిగింది. కన్ఫ్యూషియన్‌వాదాన్ని ఎదుర్కోవడం, బౌద్ధ ఆలయాలను, టావో ఆలయాలను విధ్వంసం చేయడంవల్ల తైపింగ్‌లు జనబాహుళ్యంలో సానుభూతిని కోల్పోయారు. షాంఘై లో విదేశీయులు తమ వర్తక వాణిజ్యాలను రక్షించుకోడానికి, తైపింగ్‌లకు వ్యతిరేకంగా పోరాడారు. హువాన్, హూయి రాష్ట్రాల ప్రభుత్వ సైన్యాలు, తైపింగ్‌లను అణచివేశాయి. హంగ్ మరణానంతరం, తైపింగుల్లో ఏర్పడ్డ చీలికలు, అవినీతి కూడా, వారి వైఫల్యానికి కారణమైనాయి. తైపింగ్ తిరుగుబాటు కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడం, తిరుగుబాటు వైఫల్యానికి మరో ముఖ్య కారణం. 1862 నాటికి, తైపింగ్ తిరుగుబాటు పూర్తిగా అణచివేయడం జరిగింది.

తైపింగ్ ఉద్యమం విఫలమైనా, దాని ఫలితాలు చైనాలో చాలా సంవత్సరాల వరకు నిల్చిపోయాయి. ఈ ఉద్యమ అణచివేత తర్వాత చాలా సంవత్సరాల వరకూ, ఆదాయ వసూళ్లు స్తంభించి పోయాయి. ఈ ఉద్యమం, దేశ ఆర్థిక వ్యవస్థను బాగా దెబ్బతీసింది. దేశంలో శాంతిభద్రతలను కాపాడలేని కేంద్ర ప్రభుత్వ అసమర్థతను, ఈ తిరుగుబాటు బట్టబయలు చేసింది. దొంగతనాలు, బందిపోట్లు సర్వ సామాన్యమై, దేశ సమైక్యతకు తీవ్ర ప్రమాదం వాటిల్లింది. తైపింగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలు, చైనా ప్రజల ఆలోచనలపై మంచి ప్రభావాన్ని చూపాయి. వాటిలో చాలా నాటిని మంచూలు అమలుపర్చారు. కాని, మంచూలు ప్రవేశపెట్టిన వికేంద్రీకృత సైనిక వ్యవస్థల వల్ల, రాష్ట్రాల్లో సైనికాధికారుల ప్రాబల్యం ఎక్కువై, మంచూల పతనానికి దారితీసింది. "తైపింగ్ తిరుగుబాటు కేంద్ర పరిపాలన యంత్రాంగ అవినీతికి, మంచూలకు వ్యతిరేకంగా జరిగిన ఒక గ్రామీణ తిరుగుబాటు" అని ఉత్తర దేశ చరిత్రకారులు వర్ణించగా, "తైపింగ్ విప్లవ స్వభావం, విజయాలు ఒక ప్రజాస్వామ్య ఉద్యమ ప్రాధాన్యతను చక్కగా చూపిస్తున్నవని " యం.ఎన్. రాయ్ అన్నాడు. తైపింగ్ అణచివేతలో విదేశీ జోక్యం అవసరమవడంతో చైనా భవితవ్యం విదేశీ సహకారంపై ఆధారపడిందని రుజువైంది. పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా, చైనాలో రానున్న శతాబ్దాలలో జరిగిన మౌలిక మైన మార్పులకు కూడా, తైపింగ్ తిరుగుబాటు నాంది పలికిందని చెప్పొచ్చు. తైపింగ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలను తర్వాతి కాలంలో, కమ్యూనిస్టుల ప్రచారాలతో పోల్చవచ్చు. ఈ ఉద్యమం జాతీయతా భావాన్ని మేల్కొల్పి, తర్వాత కాలంలో కొమింటాంగ్ స్థాపనకు దారి తీసింది. ఈ విధంగా, చైనా రాజకీయ, ఆర్థిక, సాంఘిక జీవనంలో ఉద్యమ ఫలితాలు సుదీర్ఘంగా నిలచిపోయాయి.

### 22.3.3 నియన్, ముస్లిం తిరుగుబాట్లు

తైపింగ్ తిరుగుబాటు దక్షిణ చైనాలో రగులుతున్న కాలంలోనే అక్కడ తాత్కాలికంగా రెండు ప్రాంతీయ తిరుగుబాట్లు కూడా సంభవించాయి. అయితే అవి చింగ్ వంశ అస్థిరత్వానికి పెద్ద దెబ్బతీయనప్పటికీ, తైపింగ్‌లవలె పోరాడనప్పటికీ, చింగ్ వంశంలో ఎంతో కలవరాన్ని సృష్టించాయి.

1853-68 మధ్య కాలంలో నియన్ తిరుగుబాటు జరిగింది. ప్రారంభంలో షాంటుంగ్ కూపెన్, హూనన్, కియాంగ్‌షులకు మాత్రమే పరిమితమైంది. 'నియన్' అంటే, దళం అని అర్థం. నియన్ దళాలు 1853 లో మంచూ వంశానికి వ్యతిరేకంగా విప్లవం లేవదీసి, తైపింగ్‌లకు దగ్గరైనారు. నియన్‌ల నాయకుడు చాంగ్-లో-షింగ్. ఇతనికి తైపింగ్‌ల సహాయం ఇరువర్గాల సహకారం లభించింది. తైపింగ్‌ల ననుసరించడానికి నియన్లు ప్రయత్నించారు. నియన్లు సామ్రాజ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాలు చేయడంలో ప్రతిభావంతులు. వారి విజయానికి కారణం, వారు నిర్వహించిన ఆశ్వికదళ సామర్థ్యమే. 1864 లో తైపింగ్ తిరుగుబాటు రూపుమాసిపోయినప్పుడు, నియన్ తిరుగుబాటు ఉధృతమైంది. ఎందుకంటే, తైపింగ్ బలాల అవశేష శక్తితో ఈ తిరుగుబాటు ధృఢపడింది. మంచూ ప్రభుత్వం ఫ్రాన్స్‌లోని మొదటి హూనాన్ సైన్యాధికారైన జెంగ్ -కూవో-ఫాన్ ను నియన్ తిరుగుబాటుదార్లను నిర్బంధించడానికి నియమించింది. కాని, అతడు విఫలుడైనందువల్ల, ఆ బాధ్యతను హుయి సైన్యాధిపతైన లీకి అప్పగించబడింది. టో-టుంగ్, టాంగ్ ల సహాయంతో, లీ 1868 లో నియన్ విప్లవాన్ని చివరకు అణచివేశాడు.

ముస్లిం తిరుగుబాటు, ప్రధానంగా యునాన్ రాష్ట్రానికి పరిమితమైంది. ఇక్కడ ముస్లింలు మొత్తం జనాభాలో 20 నుండి 30 శాతం వరకు ఉన్నారు. ఈ తిరుగుబాటుకు టు-వెన్-షీ నాయకత్వం వహించి, తనకు తానే సుల్తాన్ సులేమాన్ అనే బిరుదుతో, నూతన ముస్లిం సామ్రాజ్యసైన్యానికి యునాన్ నాయకత్వం వహించాడు. ముస్లిం తిరుగుబాటు 1855 నుండి 1873 వరకు కొనసాగింది. ఈ ముస్లింలు 14వ శతాబ్దంలో సికియాంగ్ నుండి వలస వచ్చినవారు. వారు సమాజంలో కలసిపోకుండా ప్రత్యేకంగా ఉండిపోయారు. ముస్లింలు అల్పసంఖ్యాకవర్గంగా ఉండడం చేత చైనా పాలకుల వివక్షతకు గురైనారు. 1855 లో విస్ఫోటనం చెందిన ఈ తిరుగుబాటుకు ముఖ్య కారణం, గని తవ్వకాల హక్కుల గురించి వచ్చిన తగాదా. ముస్లింల హక్కులను ఉద్ఘాటిస్తూ టు-వెన్-షీ ముస్లిం సామ్రాజ్య వ్యవస్థాపన ప్రకటన చేసినందువల్ల అతని ఆధిపత్యం ఆ ప్రాంతాల్లో ఉంది. 1872 వ సంవత్సరం ప్రారంభంలో సామ్రాజ్యబలాల్ని పారద్రోలడంలో సఫలీకృతులైనప్పటికీ, 1872 లో తిరుగుబాటుదార్లు పరాజయం పాలయ్యారు. టువెన్-షీ టర్కీ నుండి, ఇతరులనుండి సహాయం అర్థించినా, వారినుండి ఎటువంటి స్పందన రానందువల్ల, ఆత్మహత్య చేసుకున్నాడు. మరో ముస్లిం తిరుగుబాటు ఉత్తర ప్రాంతాలైన షెన్షీ, సికియాంగ్ లో తిరుగుబాటు ప్రారంభమై 1864 వరకు కొనసాగింది. కానీ, 1873 లో సామ్రాజ్యబలాలు వీటిని అణచివేయటం జరిగింది. ఈ తిరుగుబాట్లను మంచూలు అణచివేసి, పతనావస్థలో ఉన్న మంచూ పాలనకు నాలుగు దశాబ్దాల వరకు కొత్త జీవితాన్ని ప్రసాదించినా, ప్రజల అసంతృప్తిని ప్రస్ఫుటం చేశాయి.

## 22.3.4 చైనా జపాన్ యుద్ధ ప్రభావం

విదేశీ వ్యాపారానికి చైనా ఆవిష్కరణ చేసిన తర్వాత, ఆర్థిక దోపిడీకి, రాజకీయ దురాక్రమణకు గురైంది. యూరోపియన్ దేశాలతోపాటు జపాన్ కూడా ఈ దురాక్రమణలో చేరిపోవడంవల్ల, రెండు దేశాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. చైనా, జపాన్ మధ్య మొదటి పోరాటం 1874లో టూషూ దీవుల ఆక్రమణ మూలంగా ప్రారంభమైంది. కొరియాపై జపాన్ ఆక్రమణ, చైనా జపాన్ దేశాలమధ్య పోరాటానికి మరో ముఖ్య కారణమైంది. కొరియాపై చైనా నామమాత్ర అజమాయిషిని అవకాశంగా తీసుకొని, 1876 లో జపాన్ కొరియాతో 'క్వింగా' సంధి చేసుకొని, కొరియాపై ప్రాదేశిక హక్కులను పొందింది. ఆ తర్వాత, కొరియా వ్యవహారాలపై జపాన్ జోక్యం చైనా, జపాన్ యుద్ధానికి దారితీసింది. ఆ తర్వాత, కొరియాలో తలెత్తిన 'తోంఘక్' అనే తిరుగుబాటు విషయంలో, చైనా జపాన్ ప్రత్యక్ష యుద్ధానికి దిగాయి. జులై 1894 లో జపాన్ సైన్యం సియోల్‌ను ముట్టడించి ఆక్రమించింది. యాంగ్‌ట్జే నదీ ప్రాంతంలో, విదేశీ రాజ్యాలు



BRAOU

జోక్యం చేసుకోకపోవడంవల్ల, మంచూ ప్రభుత్వం జపాన్‌తో 1895 ఏప్రిల్ లో షిమెనోస్కి సంధిని కుదుర్చుకొంది. ఈ సంధి ప్రకారం జపాన్‌పై కొరియాకు పూర్తి స్వాతంత్ర్యాన్ని చైనా గుర్తించటమే కాక, జపాన్‌కు అధిప్రాదేశికహక్కులతోబాటు, అత్యంత ఆదరాభిమానం గల దేశం (Most favoured Naiton) గా చైనా గుర్తించింది. చైనా జపాన్‌కు యుద్ధ నష్టపరిహారంతోపాటు, దక్షిణ మంచూరియాలోని ద్వీపకల్పాలను అప్పగించింది. చైనా అనేక కొత్త రేవులను జపాన్ వర్తక వాణిజ్యాలకై తెరిచింది. చైనాలో ఉత్పత్తైన జపాన్ వస్తువులపై పన్నులను విరమించడం జరిగింది.

చైనా జపాన్ యుద్ధం, చైనా బలహీనతను బయటపెట్టింది. చైనా సమగ్రతను విచ్ఛిన్నం చేసి, మంచూ వంశ పునాదులనే కదలించి వేసింది. కొరియా, పెస్కడోర్స్‌ను పోగొట్టుకోవడంతో, దైవరాజ్య అంచులు ఇంకా కుదింపబడ్డాయి. జపాన్‌కు చైనా చెల్లించిన భారీ యుద్ధ నష్టపరిహారం, చైనా ఆర్థిక సంక్షోభాన్ని శీఘ్రతరం చేసింది, దీని అవసరాలకై విదేశీయులను యాచించే స్థితికి చైనా దిగజారింది. యుద్ధం తర్వాత, తూర్పు ఆసియా పొరుగు రాజ్యంలో కూడా, చైనా సంబంధాలు పాశ్చాత్య సంధి సూత్రాలమీద, అంతర్జాతీయ న్యాయసూత్రాల ప్రకారం నిర్దేశించటం జరిగింది. ఈ విధంగా, ప్రపంచంలోకెల్లా పెద్దదీ, ప్రాచీనమైందీ, అధిక జనభా కలదైన చైనా దేశం, తనకన్నా చిన్నదేశమైన జపాన్ చేతిలో పరాజయంపొంది అప్రతిష్ట పాలైంది. అయితే, ఈ పరిణామాల వల్ల సార్వభౌమ రాజ్యపు స్వాతంత్ర్యతను నిలుపుకోడానికి, దేశాన్ని బలపర్చడానికి పాశ్చాత్య పద్ధతులు, అధునాతన ఆయుధాలను ప్రవేశపెట్టాలని చైనీయులు సంకల్పించారు. ఈ యుద్ధం తర్వాత, ఐరోపా వారికి మధ్యచైనాను విభజించుకోడానికి అవకాశమేర్పడింది.

## 22.3.5 చైనాలో ఐరోపా దేశాల ప్రభావ మండలాల ఏర్పాటు, ప్రభావం

మూడు పాశ్చాత్య రాజ్యాలైన రష్యా, జర్మనీ, ఫ్రాన్స్ జోక్యంతో చైనా చరిత్రలో ఒక నూతన శకమారంభమైంది. చైనా, జపాన్‌తో షిమెనోస్కి సంధి ఒప్పందాలు దూర ప్రాచ్యంలో రష్యన్ల అభీష్టానికి ఆటంకమైనాయి. రష్యన్లు మంచూరియా, కొరియాలపై నియంత్రణ, ఆర్థర్ ఓడరేవు ఆక్రమణతో వీలౌతుందని ఆశించి, దానికి షిమెనోస్కి సంధిని రద్దు చేయపూనుకొంది. ఇది ఫ్రాన్స్ వారి మద్దతు పొందింది. ఏకీకరణ పూర్తైన తర్వాత, జర్మనీ నూతన పాలకుడైన కైజర్ విలియం, ప్రపంచ రాజకీయాల్లో ప్రధాన పాత్ర వహించాడు. దీని ఫలితంగా, మూడు మిత్ర రాజ్యాల జోక్యం వల్ల, జపాన్ పోర్ట్ ఆర్థర్ ఓడరేవును, లియవోటేంగ్ ద్వీపాన్ని, చైనాకు ఇచ్చివేసింది. జపాన్‌కు నష్టపరిహారం చెల్లించడానికి రష్యా, ఫ్రాన్స్, చైనాకు అప్పు ఇచ్చి, బదులుగా చైనాలో రైల్వే నిర్మాణం, మైనింగ్ హక్కులు, మంచూరియా ఉత్తర భాగంలో, యూనాన్, కాంగ్‌టుంగ్ దక్షిణ ప్రాంతాల్లో విలువైన రాయితీలను పొందారు. జర్మనీకూడా కియూవోచా జిల్లా ఓడరేవులో తొమ్మిది సంవత్సరాల వరకు కౌలు హక్కును, షాంటుంగ్‌లో రెండు రైల్వేల రాయితీలను పొందింది. ఫ్రాన్స్ కాంగ్‌చువాంగ్ కౌలును లూన్‌కింగ్, యునాన్‌లో రైల్వే నిర్మాణ హక్కులను పొందింది. రష్యా, ఆతర్వాత పెలియన్ వాన్ నౌకాశ్రయాన్ని 25 సంవత్సరాల వరకు కౌలును పొందింది. మంచూరియా నుండి వ్లాడివోస్టర్ వరకు గల ట్రాన్స్ సైబీరియన్ రైల్వే హక్కును కూడా పొందింది. గ్రేట్ బ్రిటన్ కూడా వీహైవీ కౌలును సముపార్జించింది. యాంగ్‌స్టే లోయపై ప్రధాన హక్కులను పొందింది. ఈ విధంగా, చైనా సరిహద్దు భూభాగాల్ని, విదేశీ రాజ్యాలు నియంత్రించి, ప్రభావ మండలాల్ని ఏర్పరచుకొన్నాయి. ఈ ప్రభావ పరిధి విధానం, చైనా సామ్రాజ్యాన్ని విభజించేందుకు చేసిన సూక్ష్మ ప్రయత్నం. దీనికి వ్యతిరేకంగా, చైనా నుండి ఇతర రాజ్యాలనుండి నిరసనలొచ్చాయి. అమెరికా ఈ సదుపాయాల పోరాటంలో భాగం పంచుకోలేదు, చైనాలో ప్రభావమండలాలకై రాయితీల పెనుగులాటలో కలవలేదు. కానీ, వర్తక వాణిజ్యంలో చైనాకు, సహకార కార్యక్రమాలు చేపట్టింది. అమెరికా చైనాలో

BRAOU

ఐరోపియన్ల ప్రభావ మండలాలకు వ్యతిరేకంగా, తమ నిరసన తెలిపింది. ఈ అసమతౌల్యాన్ని ఎదుర్కొనే ఉద్దేశంతో, సంయుక్త రాష్ట్రాల సెక్రటరీ జాన్ హే 1899 సెప్టెంబర్‌లో ఓపెన్ డోర్ పాలసీని ప్రతిపాదించాడు ఈ విధానంవల్ల చైనాలోని ప్రభావమండలాల్లోని రాజ్యాలు స్వేచ్ఛా విఫణిని నిర్వహించాలని, చైనీయుల ఓడరేవులు కూడా ఏ విదేశానికి ప్రత్యేకించినటువంటి ఆస్తికాదని భావించడం జరిగింది. అమెరికా, రష్యా, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు పత్రాలను పంపుతూ అమెరికా ప్రధానోద్దేశం చైనాలో శాశ్వతమైన శాంతిస్థాపన, చైనీయుల ప్రాదేశిక పరిపాలన పరిరక్షణ అని తెల్పింది. మిత్రరాజ్యాలు, చైనా సామ్రాజ్యంలో అనేకచోట్ల సమాన, పక్షపాతరహిత వర్తకాన్ని కొనసాగించాలనే తాపత్రాయం ప్రపంచానికి వెల్లడైంది. ఈ విధంగా, ఓపెన్ డోర్ పాలసీ వల్ల చైనాకు ఎటువంటి ప్రయోజనం కలుగలేదు. చైనా దేశాన్ని ఆర్థికంగా బలహీనపర్చి, ఆర్థిక దోపిడీకి గురి చేయడానికి ఐరోపా రాజ్యాలు కలిసికట్టుగా చేసిన దోపిడీ విధానమని చైనీయుల అసంతృప్తికీ, తీవ్ర నిరసనకు గురైంది. విదేశీ వ్యతిరేకత ఇది మరింత ప్రబలడానికి మూలకారణమైంది.

## 23.3.6. : బాక్సర్ విప్లవం, ఫలితాలు, ప్రభావం

చైనా దేశసమగ్రతను కాపాడటానికీ, చైనా నుండి విదేశీయులను తరిమి వేయడానికి చైనీయులు లేవదీసిన ఉద్యమమే, బాక్సర్ ఉద్యమం. చైనాలో విదేశీయుల వలస విధానాన్ని, బ్యాంకులు, క్రైస్తవ చర్చీలు, రైలు మార్గాల విస్తరణను చైనీయులు వ్యతిరేకించారు. క్రైస్తవ మత ప్రచారకులు అవలంబిస్తున్న మత మార్పిడి విధానం, విదేశీయులపై ద్వేషాన్ని రగిల్చి, అందుకు వ్యతిరేకంగా ఈ తిరుగుబాటు జరిగింది. దీనికి తోడు, అధిక పన్నుల భారం, కరువుకాటకాలు, వరదలు మొదలైన ప్రకృతి వైపరీత్యాలు, దేశంలో ఆర్థిక స్థితిని దిగజార్చి, ప్రజల అసంతృప్తికి దారి తీశాయి. బాక్సర్ ఉద్యమానికి పూర్వం, పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా, 'యైత్ డైయాగ్రామ్ సొసైటీ' (Eight Diagram Society) 'ఐ హెచ్ ఒ చువాన్' (IHO chuan) 'ఫిస్ట్స్ ఆఫ్ రైటియస్ హార్మని' ( Fists of Righteous Harmony) అనే రహస్య సంఘాలు పోరాడాయి. ఈ సంఘాల వారు పోరాటానికి, పిడికిల్లు మూసుండేవారు, కాబట్టి ఆ సంఘ సభ్యులను బాక్సర్లు లేదా ముష్టి యుద్ధం చేసేవారని పిలిచేవారు. బాక్సర్లు పూర్తి దేశభక్తి, ధైర్య సాహసాలు కలవారు. పోరాటంలో మరణించడానికి వారు సిద్ధపడేవారు. మొదట్లో మంచూ వ్యతిరేకంగా ఉద్యమించిన బాక్సర్లు తర్వాత తమ విధానాల్ని మార్చుకొని వారి కార్యక్రమాలను విదేశీయుల వ్యతిరేకత వరకే పరిమితం చేసుకున్నారు. త్జుసీరాణి దేశసమగ్రతను కాపాడటానికి సింహాసనం పట్ల ప్రజల్లో పెరిగిపోతున్న అసంతృప్తిని, విదేశీయులకు వ్యతిరేకంగా మార్చడానికి, ఈ ఉద్యమానికి మద్దతునిచ్చింది. బాక్సర్ ఉద్యమం షాంటుంగ్‌లో ప్రారంభమై, 1818 నాటికి చిహ్లీ ఐ హో చువాన్, షెన్సీ, మంచూరియా, అంతర్ మంగోలియాలకు వ్యాపించింది. బాక్సర్లు చైనా క్రైస్తవులను విదేశీ ఏజెంట్లుగా భావించి, వారిపై దాడిచేసి చర్చిలను, విదేశీ పాఠశాలలను ధ్వంసం చేశారు. జూన్ 1400-1900 నుండి బాక్సర్లు సామ్రాజ్య బలాల సహాయంతో, విదేశీ కార్యాలయ భవనాలపై బాంబులు వేసి, విధ్వంసం చేశారు. మిత్ర రాజ్యాలు 1900, ఆగస్ట్ 14న చైనాలో ప్రవేశించి, బాక్సర్ల అణచివేతలో సహకరించారు. దక్షిణ ప్రాంతంలోని బాక్సర్ల ఉద్యమాలను, ప్రాంతీయ గవర్నర్లు అణగదొక్కారు. ఈ విధంగా విదేశీ సహాయంతో, బాక్సర్ల ఉద్యమం అణిచివేయడం, దక్షిణ ప్రాంతాల్లో ఎలాంటి ప్రభావమూ చూపెట్టలేదు. త్జుసీ రాణి 1901, సెప్టెంబర్ 7 న పదకొండు దేశాలతో బాక్సర్ ప్రోటోకాల్ అని పిలువబడే ఒడంబడిక చేసుకుంది. దీని ప్రకారం, అనేక అవమానకర షరతులను చైనా ఒప్పుకోవాల్సి వచ్చింది. ప్రోటోకాల్ ఫలితంగా చైనా, విదేశీ రాజ్యాలకు క్షమాపణ చెప్పి, వారికి తమ దేశంలో పూర్తి వాణిజ్యపు హక్కు నిచ్చి, యుద్ధ సామాగ్రి నిషేధానికి గురవడమేకాక, మొత్తం పరిపాలనా యంత్రాంగాన్ని విదేశాల చేతిలో పెట్టింది. ఈ ఉద్యమం, ప్రభుత్వ గౌరవాన్ని పూర్తిగా తగ్గించింది. దేశాన్ని, బయటి కలహాలనుండి అంతరంగిక

అల్లర్లనుండి ప్రభుత్వం కాపాడలేదని ప్రజలు తెలుసుకున్నారు. కాని, అన్ని బలహీనతలతోపాటు ఒక నిర్మాణాత్మక కార్యక్రమం లేకపోవడం, గుడ్డి, మూఢావేశం, నాయకత్వలోపమున్నప్పటికీ, బాక్సర్ ఉద్యమం, చైనాలో పెరుగుతున్న అశాంతికి, విదేశీ దురాక్రమణలపట్ల వారి నిరసనకు, వీటినెదిరించడానికై చైనీయుల దృఢ నిశ్చయానికి ఒక స్పష్టమైన సంకేతమని చెప్పొచ్చు. బాక్సర్ ప్రోటోకాల్ రాజవంశాన్ని క్షీణింపచేసి, 1911 లో విప్లవ విజయానికీ, తద్వారా రిపబ్లిక్ స్థాపనకు దారితీసింది.

## 22.4 మంచూ సంస్కరణలు, రాజ్యాంగ ఉద్యమం

జపాన్ ఓటమి, షిమెనోస్కీ సంధి షరతులవల్ల చైనా న్యూనత, విదేశీ రాజ్యాలచే చైనా విభజన లాంటి దుష్పరిణామాల వల్ల, చైనా అధునీకరణ సాధించకపోతే, భవిష్యత్తేలేదని కొందరు చైనీయులు భావించారు. ఈ కొత్తమార్గానికి కన్ఫ్యూషియస్-పండితుడైన కాంగ్ యువీ నాయకత్వం వహించాడు. కాంగ్ చైనాను వెనుకబడ్డ సమాజంగా భావించి, ఆధునీకరణ అత్యవసరమని భావించాడు. దీనికై కాంగ్ రెండు సూచనలు చేశాడు. అవి, (1) అన్ని శాసనాల్ని, వ్యవస్థల్ని సంస్కరించటం (2) ప్రభుత్వంతో ప్రజల విలీనం. కాంగ్, లియాంగ్ అనే సంస్కర్తలు వారి భావనలను ప్రజాబాహుళ్యం చేసే కృషిలో, ఆ సంస్కరణలను అధ్యయన సంఘాల ద్వారా, వార్తా పత్రికల ద్వారా, ప్రచారం చేశారు. దీంతో పాటు, 1890 సెప్టెంబర్ లో సమాజాన్ని, జాతిని, బలోపేతం చేయడానికి అధ్యయన కేంద్రాన్ని స్థాపించారు. కాంగ్ భావనలను తియాతి రిచర్డ్ వంటి మిషనరీ పత్రికలు విస్తృత ప్రచారం చేశాయి. కాంగ్- లియాంగ్ ల కార్యకలాపాలకు షాంఘై మరో కేంద్రమైంది. 1896 ఆగస్ట్ లో లియాంగ్ 'కరెంట్ అఫైర్స్' ( Current Affairs) అనే కొత్త పత్రిక టియన్ సేన్ లో, 1897 లో 'నేషనల్ రివ్యూ' (National Review) అనే పత్రిక స్థాపితమైనాయి. ఈ ప్రాంతీయ వార్తాపత్రికలు, సంస్కరణలను ప్రచారం చేశాయి. లియాంగ్, కాంగ్ లు తమ పర్యటనలో ఉపన్యాసాలిస్తూ, ప్రధాన పట్టణాలను సందర్శించారు. 1892 నాటికి, కాంగ్ సంస్కరణోద్యమం మరింత బలపడింది.

### 22.4.1 వందరోజుల సంస్కరణలు

1898 జూన్ లో చక్రవర్తి ప్రకటించిన సంస్కరణలకు, ఒక దశాబ్దానికి ముందే, కాంగ్ భావనలు పరిణతి చెందాయి. ఈ విధంగా, 19వ శతాబ్దంలో చైనాలో రాజకీయ , సాంఘిక, ఆర్థిక వ్యవస్థల్లో పునర్నిర్మాణం జరిగింది. అవి విదేశీ సంబంధాల్లో చైనా పారిశ్రామికరంగాల్లో సంస్కరణలను ప్రతిపాదించగా, ప్రభుత్వం కూడా వీటినామోదించింది. 1889లో వితంతు రాణి త్సుసి నుండి ప్రభుత్వాధికారాన్ని కాంగ్ - చక్రవర్తి పొందాడు. విదేశీ రాజ్యాల చేతిలో చైనా అవమానాన్ని తొలగించేందుకు, కాంగ్ షీ సంస్కరణల పట్ల ఆశక్తిని కనబర్చాడు. 1893 లో కాంగ్ రచనలతో ప్రభావితుడై, అతనిని ,అతని అనుచరులను సామ్రాజ్యాధికారులుగా నియమించాడు. వారు 1890 జూన్ 11 నుండి సెప్టెంబర్ 10 వరకు వందరోజుల్లో ఈ సంస్కరణలను రూపొందించడంవల్ల, ఈ సంస్కరణలకు " వందరోజుల సంస్కరణ" అని పేరు వచ్చింది. పరిపాలనలో కీలక స్థానాల్లో ఉన్న కొందరు సాంప్రదాయవాదులైన అధికారులు, ఈ సంస్కరణలను వ్యతిరేకించారు. త్సుసి రాణి ఉన్నతాధికారైన జంగ్-లు సంస్కరణలకు వ్యతిరేకతను ప్రోత్సహించాడు. చక్రవర్తి , కాంగ్ ఆధునీకరణకు ముందుచర్యలుగా అనుకూలురైన అధికారుల సహాయంతో, విప్లవ వేదికను తయారుచేశారు. దీనికోసం వారు జంగ్ సహాయకులైన యువాన్ - షీ-కై సహాయాన్నర్థించారు. కియాన్ లో ఏడువేల జాతీయ సైనికుల్ని శిక్షితులను చేయడంలో నిమగ్నమై ఉన్న యువాన్ - షీ-కై విప్లవ

రహస్యాలను త్సుసీ రాణికి వెల్లడించాడు. త్సుసీ రాణి వందరోజుల సంస్కరణలను ప్రకటించిన తేదీన అంటే, సెప్టెంబర్ 1898 నాడు చక్రవర్తిని నిర్బంధించి, వందరోజుల సంస్కరణలకు స్వస్తి చెప్పింది. అయితే, బాక్సర్ తిరుగుబాటు అణచివేత తర్వాత, మంచూ ప్రభుత్వం ఈ సంస్కరణలను పునరుద్ధరించింది.

## 22.4.2 మంచూ సంస్కరణల పునరుద్ధరణ

విదేశీయులు విధించిన షరతులను, చైనా ప్రభుత్వం ఎలాంటి మార్పులేకుండా అంగీకరించడంతో జాతీయ న్యూనతా భావనకు గురైంది. ఇటువంటి పరిస్థితుల్లో, కఠిన సాంప్రదాయవాదులు కూడా, మంచూ సమాజాన్ని సంస్కరించి, పునర్వ్యవస్థీకరించడానికి పూనుకొన్నారు. వందరోజుల సంస్కరణలను ప్రతిఘటించిన త్సుసీ రాణియే స్వయంగా సంస్కరణలను ప్రతిపాదించక తప్పలేదు. సంస్కరణల విషయంలో, రెండు వర్గాలేర్పడ్డాయి. డా॥ సన్-యట్-సేన్ నాయకత్వంలో అతివాదులు, విప్లవ పద్ధతిలో సంస్కరణలను ప్రవేశపెట్టాలనీ, రాజరిక రద్దు తర్వాతనే ఇది వీలౌతుందని వాదించారు. కాంగ్ నాయకత్వంలో రెండో వర్గ మితవాదులు నిరంకుశ రాజరికానికి బదులు రాజ్యాంగబద్ధ రాజరిక సంస్కరణలు సహాయపడగలవని అభిప్రాయపడ్డారు.

ఈ ఉద్యమం 1901 నుండి ఐదేళ్లపాటు కొనసాగిన తర్వాత, కొన్ని సంస్కరణలను మాత్రమే, ప్రవేశపెట్టడం జరిగింది. ఏప్రిల్ 1901 లో పరిపాలన విషయాలను సమీక్షించేందుకు తూ-పాన్, చెంగ్-వుచూ అనే రాష్ట్రసేవిక కార్యాలయాన్ని ప్రారంభించారు. గవర్నర్ల పదవులు రద్దైనాయి. ఉద్యోగాల అమ్మకాన్ని నిషేధించారు. విద్యా శాఖ , సైనిక శిక్షణ శాఖ, పోలీస్ శాఖ కొత్తగా ఏర్పడ్డాయి. సైనిక విభాగ ఖర్చులో కోత ఏర్పడింది. ప్రత్యేక మిలటరీ అకాడమీలు స్థాపితమయ్యాయి. మిలటరీ శిక్షణ శాఖకు టి-లి-యాంగ్, యువాన్-షీ-కైలు శిక్షణాధికారులుగా నియమితులైనారు. 1902 సంవత్సరంలో వెలువడ్డ శాసనంలో మహిళల పాదాలను కట్టివేసే దురాచారాన్ని వదులుకోవాలని ప్రజలకు ఉత్తర్వులను జారీ చేసింది. 1902 లో మంచూల, చైనీయుల మధ్య వివాహాలు జరుపుకోడానికి అనుమతి లభించింది. 1906 లో నల్లమందు నిషేధించబడింది. విద్యారంగంలో ముఖ్యమైన సంస్కరణలను ప్రవేశపెట్టడం జరిగింది. ప్రభుత్వమే విద్యావిధానాలను పరిశీలించడానికి, కొంత మంది అధికారులను విదేశాలకు పంపడం జరిగింది. 1903 లో విద్యా శాఖ ఏర్పాటై, ప్రత్యేకంగా పాఠశాలల్లో ఐచ్ఛిక విషయాలను పాశ్చాత్య పద్ధతుల్లో బోధించే అవకాశాలను కల్పించడం జరిగింది. 1907 లో బాలికల ప్రత్యేక పాఠశాలలు ఆరంభమైనాయి. ప్రాంతీయ అకాడమీల స్థాపనతో, విద్యాభివృద్ధికి నూతన పథకాలను తయారు చేయడమైంది. రాజధానిలోని అకాడమీలను ఒకే విశ్వవిద్యాలయంగా మార్చడం జరిగింది. సాంకేతిక విద్య మొదలైన ప్రత్యేక విషయాల్లో ఉన్నత శిక్షణకోసం, కొంతమంది విద్యార్థులను విదేశాలకు పంపడం జరిగింది. ఈ విదేశాల్లో చదువుకొన్న విద్యార్థులు, ఆయా దేశాల్లో పరిశీలించిన రాజకీయ విధానాలను చైనాలో ప్రచారం చేసి, రాజ్యాంగ సంస్కరణలను కోరారు. విప్లవం ద్వారా ఈ మార్పులను సాధించాలని వీరు నిశ్చయించారు.

ఇతర సంస్కరణల్లో భాగంగా 1901 లో రైల్వే నిర్మాణాలు, 1903 డిసెంబర్ లో పొగాకు, సారాయిలపై రాష్ట్రీయ పన్నుల విధింపు, 1904 డిసెంబర్‌లో వాణిజ్య, న్యాయశాస్త్ర ముసాయిదా రచన, 1905 జూన్‌లో నిరుద్యోగులకు పునరావాస శిబిరాల ఏర్పాటు మొదలైనవి ముఖ్యమైనవి.

## 22.4.3 రాజ్యాంగ ఉద్యమం

1905 వ సంవత్సరంలో జపాన్‌చే రష్యా ఓడిన తర్వాత, మంచూ సంస్కరణల చరిత్రలో నాటకీయమైన మార్పుజరిగింది. పెద్దదేశమైన రష్యా, అతిచిన్న ప్రాచ్య రాజ్యం చే ఓడిపోడానికి ప్రధాన



BRAOU

కారణం, జపాన్ రాజ్యాంగ ప్రభావమేనని చైనీయులు భావించారు. ఈ విధంగా రాజ్యాంగ బద్ధతాభావం అతిత్వరలోనే చైనా మేధావుల్లో, సంఘసేవకుల్లో, అభ్యుదయ భావాలుగల అధికారుల్లో వ్యాప్తి చెందింది. సంస్కర్త లియాంగ్-చియావో ప్రేరణాత్మక ప్రకటనలు, రాజ్యాంగబద్ధ నినాదాలకు ఎంతో దోహదం చేశాయి. లియాంగ్ ఒక రాజకీయ సమాచార సంఘాన్ని (Political Information Club) స్థాపించి, దీనిద్వారా విద్యార్థులకు, రాజకీయ శిక్షణను ప్రారంభించాడు.

రాజ్యాంగ సవరణల విషయంలో త్సుసి రాణికి ఇష్టంలేకపోయినా, ప్రజల పట్టుదలమేరకు సంస్కరణలను అంగీకరించక తప్పలేదు. సముచిత రాజ్యాంగ విధాన నిర్ణయాలకోసం, వివిధ దేశాల రాజ్యాంగ రీతులను పరిశీలించడానికి, కొన్ని రాయబారాలను పంపడం జరిగింది. అన్ని దేశాల రాజ్యాంగ విధానాలను పరిశీలించిన తర్వాత, జపాన్ దేశపద్ధతిలో, రాజ్యాంగం ఏర్పాటుకై తీర్మానం జరిగింది. రాజ్యాంగంతోపాటు పరిపాలన విధానాల్లో మార్పులను కూడా ప్రభుత్వం ప్రకటించింది., 1908 లో నూతన రాజ్యాంగం ప్రతిపాదించబడింది. ఈ రాజ్యాంగ సూత్రాల ప్రకారం, మంచూరియా వంశ అధికారం, హోదా పరిరక్షితమైంది. దేశంలో సంస్కరణలన్నీ మంచూ చక్రవర్తి ఆమోదం పొందాలని తీర్మానించడమైంది. దేశానికంతటికీ సార్వత్రిక శాసనసభ (Parliament) ను సమావేశపర్చడానికీ, రద్దు చేయడానికి చక్రవర్తికి హక్కు వుంటుంది. అత్యవసర పరిస్థితుల్లో చక్రవర్తి అసాధారణ చట్టాలను ప్రకటించడానికీ, దేశ అవసరాల దృష్ట్యా చట్టాలు రచించడానికి అధికారం లభించింది. బడ్జెట్, జాతీయ సంపద ఆదాయలెక్కల తనిఖీ, శాస్త్రీయ పద్ధతిలో జనాభా పరిగణన, పోలీస్ శాఖ పునర్వ్యవస్థీకరణ , విస్తృత విద్యావకాశాలు, ప్రజలకు వాక్ స్వాతంత్ర్య, సమావేశ హక్కులు మొదలైనవి రాజ్యాంగంలో చేర్చాలని నిర్ణయించడమైంది.

ఈ రాజ్యాంగ సంస్కరణలవల్ల, ప్రజలకెటువంటి ప్రయోజనాలు చేకూరకపోవడంతో, 1911 లో విప్లవాన్ని లేవదీశారు. ఈ విధంగా, రాజ్యాంగ సంస్కరణలు ప్రజలను చైతన్యవంతులను చేసింది. రాజ్యాంగ సవరణలు చైనీయుల రాజకీయ పరిజ్ఞానానికి తార్కాణంగా నిలిచాయి. దేశాభ్యుదయానికి సంస్కరణ ఆవశ్యకతను బోధపర్చడం జరిగింది. విదేశీ విజృంభణ, దేశంలో తిరుగుబాట్లు, సంస్కరణ ఉద్యమాలు కలిసి, మంచూ క్షీణతకు సహాయపడి, విప్లవోద్యమాలకు నాంది పలికాయి.

## 22.5 మంచూల పతనం : రిపబ్లిక్ స్థాపన

19వ శతాబ్దం మధ్యకాలంనుండి చైనా చరిత్రలో, మూడు ప్రధాన రాజకీయ పరిణామాలు జరిగాయి. వాటిలో ఒకటి, 1898లో కాంగ్ - యువీ నాయకత్వంలో జరిగిన సంస్కరణోద్యమం. రెండోది, 1900 లో నిర్వహించబడిన రాజ్యాంగ ఉద్యమం. మూడోది, డా॥ సన్-యట్-సేన్ నాయకత్వంలో నడిపిన విప్లవోద్యమం. చక్రవర్తి చింగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలవల్ల ప్రజలకెటువంటి ప్రయోజనాలు కలగకపోవడంతో వారిలో అసంతృప్తి ప్రబలింది. దీనికి తోడు, విప్లవవాదులు రహస్య సంఘాలు ఉద్యమాలను లేవదీశారు. ఈ ఉద్యమం క్రమక్రమంగా అభివృద్ధిచెంది, రాజరిక వ్యవస్థ అస్థిత్వం పూర్తిగా తుడుచుకుపోయేటట్లు చేసింది. రాజరిక వ్యవస్థ స్థానంలో, రిపబ్లిక్ ఏర్పాటుకు కృషి చేసింది. ఈ విధంగా ,ఈ ఉద్యమం చైనా విప్లవ చరిత్రలో, ఒక మహత్తరమైన మార్పుకు దారితీసింది.

### 22.5.1 1911 విప్లవం, కారణాలు, గమనం, స్వభావం

చైనా దేశ చరిత్రలో 1911 విప్లవం ఒక మరపురాని ఘట్టం. ఇది మంచూ వ్యతిరేకత, విదేశీ వ్యతిరేకత, సాంప్రదాయ వ్యతిరేకత అనే మూడు సూత్రాలపై ఆధారపడి విజయం సాధించింది. ఈ విప్లవం ఆసియా

చరిత్రలోనే రాజరికాన్ని తొలగించి ప్రజాసత్తాక ప్రభుత్వాన్నేర్పర్చిన ప్రప్రథమ ప్రజా ఉద్యమం.

1911 విప్లవానికి మూలకారణం, చైనాకు సరైన నాయకత్వం ఇవ్వడంలో మంచూరాజవంశ వైఫల్యం, త్సుసి రాణి మరణం తర్వాత, అసమర్థ వారసత్వం, విప్లవగతిని త్వరితం చేసింది. విప్లవానికి మరో కారణం, చైనాలోగల అధిక జనాభా సమస్య. ఈ సమస్యతోబాటు సహజ విపత్తులైన వరద, క్షామం, ఆహార కొరత ప్రజాజీవనాన్ని దుర్భరం చేశాయి. అసంతృప్తికి లోనైన అనేకమంది ప్రజలు, పెద్దసంఖ్యలో విదేశాలకు వలసవెళ్లారు. పాశ్చాత్య భావనల ప్రభావానికి లోనైన ప్రవాస చైనీయులు, చైనాకు తిరిగి వచ్చి నూతన భావాలను వ్యాప్తి చేశారు. దీనికితోడు మెరుగైన రవాణా, వార్తా సౌకర్యాలు, రైల్వేల నిర్మాణం, విప్లవభావాలు చైనా సామ్రాజ్యమంతటా త్వరితగతిన వ్యాపించడానికి దోహదం చేశాయి. చైనా-జపాన్ యుద్ధం తర్వాత దేశంలో పెరిగిన పన్నుల భారం, విప్లవానికి మరో కారణమైంది. విప్లవ సంఘాల కార్యక్రమాల కృషి ఫలితంగా, ప్రజల్లో దాగిన అసంతృప్తి ప్రస్ఫుటమై, అనేక రాజకీయ పార్టీలు ఆవిర్భవించి, సాయుధ తిరుగుబాటుకు దారితీసింది. డా॥ సన్-యట్-సేన్ స్థాపించిన 'టుంగ్ మెంగ్-హూయి' (Tung -Min-Hui )అనే విప్లవ సంస్థ, చైనీయుల అసంతృప్తిని విప్లవం వైపు మళ్లించటంలో కృతకృత్యురాలైంది. విప్లవానికి ప్రభుత్వ సైన్యం మద్దతునివ్వటంతో, ఈ ఉద్యమం మరింత బలపడింది. సైన్యం ఫిరాయింపుల వల్ల, మంచూ ప్రభుత్వానికి పెద్ద దెబ్బ తగిలింది.

1905 నుండి చైనా లో విదేశీ పెట్టుబడిదార్లు, రైల్వేల నిర్మాణం చేశారు. 1911 ప్రారంభంలో మంచూ వంశం రైల్వేలను విదేశీయులకు తాకట్టు పెట్టే ఉద్దేశంతో, కేంద్ర దక్షిణ నైరుతి ప్రైవేట్ రైల్వేలను జాతీయాకరణ చేసింది. విప్లవవాదులు మంచూల పన్నాగాల్ని గ్రహించి, సామ్రాజ్యంతో పోరాడటానికి పూనుకున్నారు. రైల్వే జాతీయాకరణ నిరసన తెలిపిన ప్రజలపై, సైన్యం కాల్పులు జరిపింది. ఈ విధంగా 1911, అక్టోబర్ 9న విప్లవవాదుల చర్యలు రష్యా వాణిజ్యదూత గృహంలో బాంబు ప్రేలుడుతో ప్రారంభమైంది. ఈ విప్లవం కార్చిచ్చులా వ్యాపించి, రాష్ట్రాల్లో ఆక్రమించినందువల్ల, పెకింగ్ అధికారాన్ని నెల లోపలనే ఒక్క ఊపు ఊపింది. ఉత్తర చైనాలో విశ్వాసబద్ధమైన పౌరులు, సైన్యం ఉన్నందువల్ల మంచూ ఆజ్ఞలను కొనసాగించడంలో సఫలురైనారు. విప్లవం ప్రారంభంలో సాధ్యమైనంతవరకు, విదేశీ పద్ధతును తీసుకురాకూడదని విప్లవకారులు ప్రయత్నించారు. విదేశాల్లో ఉన్న చైనీయుల ద్వారా సాధ్యమైనన్ని నిధుల్ని నాయకులు సేకరించారు. ఈ నిధులు సైనికుల జీతభత్యాలకు, ఆహారానికై సేకరించడం జరిగింది. ఈలోగా, రాజ్యాధికారులు, విప్లవవాదులను అణగద్రొక్కి రాజ్యావంశాన్ని రక్షించడానికి రాజ్యాంగ సూత్రాలను ప్రవేశపెట్టారు.

యూవాన్ సాయుధ దళాల కమాండర్ అయ్యాడు. లీ-యువాన్-హంగ్ విప్లవసైన్యాలకు నాయకుడై, 1912 జనవరి 11న నాన్‌కింగ్‌ను ముట్టడించాడు. నూతన చైనా రిపబ్లిక్ ఏర్పర్చి, నాన్‌కింగ్‌ను రాజధానిగా ప్రకటించాడు. విప్లవవాదులు డా॥ సన్-యట్-సేన్ ను నూతన రిపబ్లిక్ తాత్కాలిక అధ్యక్షునిగా చేసుకున్నారు. సన్ మంచూలతో శాంతి సంప్రదింపులను నిర్వహించాడు. యూవాన్-షి-కై కూడా శాంతి సంప్రదింపులకు ఉత్సాహాన్ని కనబర్చాడు. విప్లవవాదులు, రాచరికాన్ని రద్దుపర్చాలని కోరారు. సన్-యట్-సేన్, చక్రవర్తి పదవి త్యాగం చేసినట్లైతే యునాన్‌కు అధ్యక్షపదవి చెందుతుందని పేర్కొన్నాడు. 1912 ఫిబ్రవరి 12 న, రాజరిక శాసనంతో చక్రవర్తి పదవీత్యాగం ప్రకటించడంతో, మంచూ రాజరికం రద్దైంది. డా॥ సన్-యట్-సేన్ సలహా మేరకు యూనాన్-షి-కైను పునరైక్య చైనా రిపబ్లిక్‌కు అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.

1911 నాటి చైనా విప్లవాన్ని దాదాపు చైనా బూర్జువాలే నడిపించారు. చైనాలోని అన్ని విప్లవ సంఘాలు సంఘటితమై, విప్లవ భావాలను వ్యాప్తి చేయడంతో, ఈ విప్లవం ఐక్య విప్లవంగా పేర్కొనబడింది. ఇది ప్రధానంగా, మంచూలకు, విదేశీయులకు, చైనాలోని సనాతన సాంప్రదాయాలకు వ్యతిరేకంగా నడిచింది.



BRAOU

దక్షిణచైనా ఎప్పుడూ మంచూలకు వ్యతిరేకంగా ఉన్నందువల్ల, విప్లవం మంచూ విరుద్ధత్వపై నడిచింది. ఈ 1ఉద్యమం చైనా దోపిడీకి గురిచేసిన విదేశీయుల నెదిరించడంవల్ల, ప్రధానంగా జాతీయ ప్రవృత్తి గలదని కూడా చెప్పొచ్చు. విప్లవవాదులు చైనా సనాతన పద్ధతుల నవలంబించడమే వారి వెనుకబడ్డతనానికి కారణమైందని భావించి, దానికి ప్రత్యామ్నాయంగా అధునాతన పద్ధతులను ప్రవేశపెట్టారు. ఈ విధంగా, చైనా రెండు వేల సంవత్సరాల కన్ఫూషియన్ రాచరిక వ్యవస్థను వదలి ,ఆధునిక పద్ధతుల ననుసరించి, విప్లవ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టమైంది. ఈ విప్లవ ఫలితంగా, 1912 కాంటన్ లో డా॥ సన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ ఏర్పడింది.

## 22.5.2 డా॥ సన్–యట్–సేన్ పాత్ర

చైనా విప్లవ చరిత్రలో, మావో–సే–టుంగ్ పూర్వపు నాయకుల్లో, డా॥ సన్-యట్-సేన్ ముఖ్యుడు. ఇతడు గొప్ప జాతీయవాది. 1911 విప్లవానికి నాయకుడుగా, తర్వాతి కాలంలో కొమింగ్ టాంగ్ పార్టీ నాయకుడుగా అతను విశిష్ట సేవలనందించాడు. సన్-యట్-సేన్, కాంటన్ వద్ద షియాంగ్-షన్ లో 1860 నవంబర్ 12న ఒక పేద రైతు కుటుంబంలో జన్మించాడు. చైనాలో మంచూ పాలనను సాయుధ విప్లవం ద్వారా తొలగించాలని, చైనాను సంస్కరణలద్వారా మెరుగుపర్చాలనే ఆశయంతో, చైనీయుల్లో గాఢమైన దేశభక్తిని, జాతీయతా భావాన్ని రగుల్కొల్పాడు. తన లక్ష్య సాధనకు 1894 నవంబర్ 24న హనలూలో, చైనా పునరుద్ధరణ సంఘాన్ని, 1885లో హాంగ్ కాంగ్ లో మరో సంఘాన్ని స్థాపించాడు. తర్వాత, 1899 లో హాంగ్ కాంగ్ లో 'చుంగ్-జీ-పో' అనే దిన పత్రికలో విప్లవ లక్ష్యాలను ప్రచారం చేశాడు. 1905 ఆగస్ట్‌లో, 'తుంగ్- మెంగ్- హ్యూను' (Tung Ming Tue) (League of common allience) రూపొందించాడు. ఇది విప్లవవాదుల ధోరణి మార్చి, విప్లవ కార్యక్రమాన్ని, అన్ని వర్గాలకు, రాష్ట్రాలకు విస్తరింపచేసింది. సన్-యట్-సేన్ 1905లో ప్రతిపాదించిన త్రివిధ సూత్రాలైన జాతీయత (Min-tyo) ప్రజాధికారం (Min-cuon) ప్రజాజీవన విధానం (Ming sung ming) విప్లవ కార్యక్రమాల్లో అతి శక్తివంతమైన ప్రచార సాధనాలుగా డా॥ సన్ కు ఉపయోగపడ్డాయి.

1845–1911 మధ్యకాలంలో, డా॥ సన్ అనుయాయులు 10 తిరుగుబాట్లను జరిపారు. కాని, అవి విఫలమయ్యాయి. 1911 జూన్ 1 తేదీన విప్లవ సంఘాలు సంయుక్తంగా చేసిన తిరుగుబాటు, 1911 సెప్టెంబర్ లో సెజువాన్ లో తీవ్ర తిరుగుబాటు, 1911 అక్టోబర్ వూచాంగ్ లో సైన్యం తిరుగుబాట్లలో విజయం సాధించాడు. సన్-యట్-సేన్ 1911డిసెంబర్ 25 లో, రిపబ్లిక్ తాత్కాలిక అధ్యక్షుడై, జాతీయ సమైక్యత కోసం యువాన్‌ను రిపబ్లిక్ అధ్యక్షునిగా చేశాడు. తర్వాతికాలంలో జాతీయ పార్టీకి గొప్ప నాయకత్వం అందించి, 1925 మార్చి లో మరణించాడు. అతని విప్లవ సిద్ధాంతాలు చైనాకు నిరంతర స్ఫూర్తి నిచ్చాయి. అందువల్ల, డా॥ సన్ నాయకత్వం కంటే, అతని తత్వం ఆధికారికంగా ప్రాణాధార శక్తిగా నిల్చిపోయింది. చైనా ఎలాంటి మార్గాన్ని తన భవిష్యత్తులో ఎన్నుకొన్నప్పటికీ, వాస్తవానికి, అది సన్-యట్-సేన్ సిద్ధంతాలపై వర్తించి, అతనిని చైనా రిపబ్లిక్ జాతిపితగా కొనియాడ్డం జరిగింది.

## 22.5.3 చైనా రిపబ్లిక్ తొలి సమస్యలు

1911 విప్లవ ఫలితంగా, మింగ్ పాలన అంతమై, చైనా రిపబ్లిక్ ఏర్పడి, చైనాలో ఒక నూతన శకం ఆరంభమైంది. నూతన ప్రభుత్వ ప్రణాళిక, నాన్ కింగ్ తాత్కాలిక రాజ్యాంగంలో పొందుపర్చబడింది.

విప్లవాత్మక పార్టీలు రూపకల్పన చేయడంతో, నాన్‌కింగ్ కౌన్సిల్ 1912లో ప్రతిపాదించబడింది. మొదటి తాత్కాలిక రాజ్యాంగం స్పష్టంగా రూపొందించబడింది. దీనిలో అధ్యక్షులపై పార్లమెంటరీ అజమాయిషీ ఉండేది.కౌన్సిల్‌కు సరైన అనుభవం లేనందువల్ల, రిపబ్లిక్ అసమర్థతకు దారితీసింది.

యూవాన్-షి-కై అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో ఎన్నికలను జరిపాడు. విదేశీ రుణ సహాయాన్నర్థించాడు. విప్లవకారులపై బలప్రయోగం చేసి వారి అభిశంసలకు గురైనాడు. గవర్నర్లను తొలగించి, నమ్మకస్తులైన యుద్ధ ప్రభువులను రాష్ట్ర గవర్నర్లుగా నియమించాడు. 1913లో యూవాన్‌ను రెండో అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. యూవాన్ 1914 నాటికి రాజ్యాంగాన్ని రద్దుచేసి, నియంతలా ప్రవర్తించాడు. 1915 నాటికి నూతన రాజ్యాంగం రూపొందించి, రాజరిక పునరుద్ధరణ ప్రచారంచేసి, మంచూ వారసునిగా తానే పట్టాభిషిక్తుడు కావాలని ఉవ్విళ్లూరాడు. కాని, యూవాన్ దేశ విద్రోహ చర్యలకు వ్యతిరేకంగా దేశంలో అనేక పోరాటాలు ప్రబలాయి. అనేక రాష్ట్రాలు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. విప్లవవాదులు యువాన్‌ను అధ్యక్షునిగా గుర్తించడానికి నిరాకరించారు. ఇట్టి పరిస్థితుల్లో, 1916 యూవాన్ మరణంతో చైనా రాజరిక పునఃస్థాపిత ప్రయత్నం అంతరించింది. కాని, యూవాన్ అవినీతి పాలనవల్ల, తదనంతర సంక్షోభం వల్ల, రిపబ్లిక్ అంతరించింది.

యూవాన్-షి-కై మరణించిన తర్వాత, చైనా రాజకీయ సంక్షోభానికి లోనైంది. ఈ రాజకీయ సంక్షోభానికి అనేక కారణాలున్నాయి. వాటిలో మొదటి కారణం సన్-యట్-సేన్‌కు అతని అనుయాయులకు మధ్య ఐక్యత లోపించటం. ఈ సంక్షోభానికి మరో కారణం, విప్లవవాదులు రిపబ్లిక్ భావాలకు అనుగుణంగా ప్రజలను, చైతన్యవంతులుగా మార్చకపోవటం. రిపబ్లిక్ వ్యవస్థంటే ఏమిటో తెలియని పరిస్థితుల్లో ప్రజలుండగా, దేశంలో శాంతిభద్రతలు లోపించి, ప్రజలకు, పరిపాలనా బాధ్యతలకు దూరంగా పాలకులుండిపోయారు. దానితో, ఉద్యోగులపై అదుపుకు సైనిక శక్తిపై అధ్యక్షుడు ఆధారపడ్డంవల్ల, సైనిక గవర్నర్లైన యుద్ధప్రభువుల హోదా పెరిగింది. వీరు ప్రాంతీయ ప్రభుత్వాలపై అదుపును సంపాదించారు. యుద్ధప్రభువులు స్వతంత్ర్యంగా వ్యవహరిస్తూ , అధికారంకై ఒకరిపై ఒకరు ఘర్షణపడ్డారు. ఈ మిలటరీ అధికారులు రాజకీయ అధికారాన్ని కూడా సముపార్జించుకున్నారు. అయినప్పటికీ, యుద్ధోన్మాద యుద్ధప్రభువులు, సాధారణ గ్రామీణ ఆర్థిక జీవనంలో అంతగా జోక్యం చేసుకోలేదు. దక్షిణ ప్రాంతంలో కొమింగ్‌టాంగ్ అనుకూలురు డా॥ సన్‌కు 1917 ఆగస్ట్ లో రిపబ్లిక్ ప్రభుత్వ ఏర్పాటులో సహాయం చేశారు. డా॥ సన్ జనరల్ లిస్సిమో బిరుదు గ్రహీతై, తన ప్రభుత్వం న్యాయ సమ్మతమని ప్రకటించాడు. కానీ, కాంగ్-సీ నాయకుడు డా॥సన్‌ను వ్యతిరేకించి, సైనిక బిరుదును తిరిగి తీసుకొని, అతన్ని సప్తపాలకుల సంఘ సభ్యునిగా చేశాడు. ఉత్తర ప్రాంతంలో పెకింగ్ లో 1912లో లీవాంగ్‌హన్ ఉపాధ్యక్షునిగా, వాన్ ఆశ్రితుడు, మిలటరీ కమాండరైన టూవాన్-చీ-జూయి ప్రధాన మంత్రిగా నియమితుడయ్యాడు.

ఈ విధంగా రిపబ్లిక్ కాలంలో రాజకీయ సంక్షోభానికి, ప్రధాన కారకుడు చిత్తశుద్ధి, జాతీయ భావాలు లేని యూవాన్-షి-కై అనే చెప్పొచ్చు. అతని మరణాంతరం విచ్ఛిన్నకర శక్తులు తలెత్తి, చైనా లో అలజడిని అనిశ్చిత వాతావరణాన్ని ఏర్పర్చాయి. స్వార్థపరులైన యుద్ధప్రభువులు తమలో తాము పోట్లాడుకొని చైనా రిపబ్లిక్ చరిత్రలో, ఈ కాలాన్ని చీకటి కాలంగా చేశారు.

## 22.6 సిద్ధాంతపర చైతన్యం, జాతీయ పోరాటాలు

రిపబ్లిక్ స్థాపనవల్ల శాంతి సమైక్యత ఏర్పడకపోగా, రిపబ్లిక్ ప్రారంభ సంవత్సరాలు నీతి బాహ్యతకు, రాచరిక ఉద్యమాలకు, యుద్ధప్రభువుల ఆరాచకత్వానికి, విదేశీ సామ్రాజ్య వ్యాప్తికి నిదర్శనంగా నిలిచాయి.

రిపబ్లిక్ కాలంలో ఉత్పత్తులు చాలినంతగా లేవు. దేశాన్ని, దేశ ప్రజలను జాగృత పరచడానికి, చైనా మేధావులు పూనుకున్నారు. పాశ్చాత్య విద్యచే ప్రభావితులైన వీరు, తాత్విక పునాదులను వేసి, జాతీయ జీవనంలో మౌలిక మార్పులను తేవాలని వాదించారు. వారు చైనా సాంస్కృతిక వారసత్వాన్ని, నూతన పాశ్చాత్య స్థాయిలో పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. ఇదే కాలంలో, నూతన సాహిత్యాన్ని ప్రాచీన శైలిలో కాకుండా, ప్రజలు మాట్లాడే వ్యవహారిక శైలిలో రచించాలని ఉద్యమించారు. ఈ మేధోపరమైన విస్ఫోటనం, కన్ఫ్యూషియన్ తత్వాన్ని దెబ్బతీసింది. ఇదేకాకుండా, సాంప్రదాయ నీతి శాస్త్రానికి, ఆచారాలకు, మానవసంబంధాలకు, సామాజిక ఒడంబడికలకు కూడా గొడ్డలిపెట్టుగా నూతన ప్రవృత్తిని చైనాలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ మేధోపరమైన విప్లవం 1917, 1923 మధ్యకాలంలో ప్రారంభమై, నూతన సాంస్కృతిక ఉద్యమంగా పొగడబడింది. కొన్ని సందర్భాల్లో, అది చైనీయుల పునరుజ్జీవనంగా కీర్తించబడింది. 1919 మేలో పెద్దఎత్తున జరిగిన విద్యార్థుల ప్రదర్శన, దేశవ్యాప్తమైన స్పందనకు గురై, మే 4 ఉద్యమంగా ప్రఖ్యాతి గాంచింది. చైనా వెలుపలకూడా జాతీయవాద భావనలు, ప్రజాస్వామ్య ధోరణులు మొదటి ప్రపంచయుద్ధ కాలంలోనే బలపడ్డాయి. జాతీయ స్వయంపాలన రహస్య సంఘాల రద్దు, చైనా మేధావులను ప్రభావం మొదలైన వాటికి ఉడ్రోవిల్సన్ భావాలే కారణం. పైగా, ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలైన రష్యాలో బోల్షివిక్ విప్లవం, ఫిన్‌లాండ్, జర్మనీ, ఆస్ట్రియా, హంగేరీల్లో సోషలిస్ట్ విప్లవాలచే చైనా ప్రభావితమైంది. చైనా మేధావులు దేశంలో యుద్ధ ప్రభువుల కాలం నాటి సంక్షోభం నుండి చైనాలో అంతర్యుద్ధాన్ని నివారించే ప్రయత్నానికి పూనుకున్నారు.

చైనీయుల దేశభక్తిని, జాతీయ భావనను 1908 లో జపాన్ చేసిన 21 డిమాండ్లు మరింత న్యూనత పర్చాయి. ఈ డిమాండ్లు 5 వర్గాలుగా విభజితమైనాయి. జపాన్ దేశీయుల నియంత్రణ కింద మంచూరియా, మంగోలియా అంతర్భాగం, ఆగ్నేయతీర చైనా , యాంగ్‌ట్జె నదీలోయ జపాన్ నియంత్రణలో ఉండాలని మొదటి నాలుగు వర్గాల డిమాండు. ఐదవ డిమాండ్ ప్రకారం, చైనా రాజకీయ, ఆర్థిక, మిలటరీ పోలీస్ పాలనలో జపాన్ సలహాదార్ల నియామకమేకాక, చైనా యుద్ధసామాగ్రిలో 50 శాతం జపాన్ నుండి కొనుగోలు చేయాలి. ఈ డిమాండ్లు చైనా ప్రజలలో జాతీయతా భావాన్ని రగుల్కొల్పాయి. జపనీయుల ఒత్తిడితో మొదటి నాలుగు డిమాండ్లు 1915 మే లో యూవాన్ అంగీకరించాడు. శాసన సమ్మతి లేకుండానే మే 25న జపాన్‌తో సంధిని కుదుర్చుకున్నాడు. దీనికి నిరసనగా, జపాన్ లో ఉన్న చైనా విద్యార్థి బృందాలు స్వదేశానికి వచ్చి ఉద్యమాన్ని లేవదీశాయి. విదేశీ వస్తువుల బహిష్కరణ కార్యక్రమాలను చేపట్టాయి. 21 డిమాండ్ల పర్యవసానంగా బహిష్కరణ జరిగి, జాతీయ విప్లవానికి పర్యవసానమైంది. ఈ జాతీయ విప్లవానికి సహాయంగా, రాజకీయ చైతన్యం గల వ్యాపారులు, కార్మిక బలాలు, మధ్యతరగతి ప్రజలు ఉద్యమించారు. మొదటి ప్రపంచ యుద్ధ ప్రవేశంతో, చైనాలో సామ్రాజ్యవాదం నశించిపోయింది. ఈ యుద్ధం, చైనాలో, విదేశీవ్యాపారానికి అంతరాయం కల్గించి, స్వదేశ వ్యాపారాభివృద్ధికి దోహదం చేసింది. కొత్త పరిశ్రమలు, సంస్థలు, కొత్త వ్యాపారాల, కొత్త కార్మిక వర్గాల ఏర్పాటుకు దారితీసి, దేశప్రయోజనాలను కాపాడేలా చేసింది. పెకింగ్, షాంఘై, వునాన్, నాన్‌కింగ్, టియన్‌సెన్, కాంటన్ వంటి పెద్ద నగరాలేర్పడి, నూతన మేధావులను పోషించాయి. 1902 నుండి 1917 వరకు దాదాపు పది మిలియన్ల సభ్యులు, తీవ్ర జాతీయ భావంతో సామ్రాజ్యవాదులనుండి, సంక్షోభంనుండి దేశాన్ని రక్షించాలనే భావనతో ఉద్యమించారు. విదేశ విద్యనభ్యసించిన చైనా విద్యార్థులు కూడా, సంస్కరణల పట్ల అత్యంత ఆసక్తిని ప్రదర్శించారు. వీరిలో ప్రముఖులు, చెన్–టు–షీ (Chen-Tu-hsiu) ట్సాయి – యువాన్–పెయి (Tsai-yuan-pei) కువో–మోజొ (Kuo-mojo)లు–సున్ (Lu-hsun) హ్సుషీ (Hu shlih) చియాంగ్–మొలిన్ (Chiang-Monlil) చెన్–ట్సాయి–హు (Chen-Tsai-Hu) లు, చైనా మేధో విప్లవానికి మార్గదర్శకులైనారు. వీరందరూ చైనా ప్రామాణిక గ్రంథాలనధ్యయనం చేసి, పాశ్చాత్య నాగరికతతో పరిచయం ఉన్నవారే. ఉదారవాదం,



BRAOU

సామ్యవాదం, వ్యవహారవాదం, విజ్ఞానశాస్త్రాలు, ప్రజాస్వామ్య భావనలు వీరిపై చెరగని ముద్రవేశాయి.

వీరి ఉత్తేజకరమైన పిలుపు, సాంప్రదాయవాదాన్నంతం చేసి నూతన సాంస్కృతిక ఉద్యమానికి ఊపిరిపోసింది.

## 22.6.1 నూతన సాంస్కృతిక ఉద్యమం

చెన్-టు-షీ 1915లో జపాన్ ఆక్రమిత ప్రాంతమైన షాంఘై లో యువజన మాస పత్రిక (Chin-nian tsa-chih) ను స్థాపించాడు. ఇది తర్వాత న్యూయూత్ (Hshing Ching Hien) అనే కొత్త పేరుతో వ్యవహరించబడింది. ఇది దేశంలోని యువతను మేల్కొల్పి, సనాతన సాంప్రదాయాలకు వ్యతిరేకంగా, నూతన భావాల వ్యాప్తికి అంకితమైంది. ఈ యువత ప్రపంచంలోని నాగరికతలనుండి ప్రముఖ విషయాలను ఎంపిక చేసుకొని, దాని ద్వారా చైనాలో నూతన సంస్కృతిని సృష్టించాలని భావించారు. ఈ విశాల అభ్యాసంలో చెన్ వీరికి మార్గదర్శకంగా ఆరు సూత్రాలను సూచించాడు. అవి,

1. స్వతంత్రంగా ఉండాలి కాని, బానిసగా కాదు.
2. ప్రగతి పథంలో ఉండాలి కాని, సాంప్రదాయంగా కాదు
3. ప్రగతిశీలంగా ఉండాలి కాని, తిరోగమనంగా కాదు
4. విశ్వ వ్యాప్తంగా ఉండాలి కాని, ఏకాకిగా ఉండరాదు
5. ఉపయోగతావాదిగా ఉండాలి కాని, స్వార్థపరంగా కాదు
6. శాస్త్రీయంగా ఉండాలి కాని , కాల్పనికంగా ఉండరాదు.

చెన్ సనాతన సాంప్రదాయాల పై దాడి చేశాడు. ప్రత్యేకంగా అతని రాతల్లో , కన్ఫూషియస్‌వాదాన్ని దుయ్యబట్టాడు. ఈ విధంగా చెన్ సాంప్రదాయతత్వం బాహాటంగా జరిపిన దాడి, బూజుపట్టిన ప్రపంచంనుండి నూతన మార్గాన్ని తెరిచింది. ఈ వాదనలు విద్యార్థుల్లో, యువతలో బాగా బలపడ్డాయి.

ట్సాయి-యువాన్-పెయి పెకింగ్ లోని జాతీయ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ పదవిని చేపట్టడంతో, నూతన సాంప్రదాయిక ఉద్యమం ప్రేరణపొందింది. ట్సాయి మూడు సూత్రాలను ప్రతిపాదించాడు. అవి,

1. విశ్వవిద్యాలయం పరిశోధన వ్యవస్థగా ఉండాలి, విద్యా విషయాల్లో కేవలం పాశ్చాత్య నాగరికత ప్రవేశపెట్టడమే కాక, నూతన చైనా సంస్కృతిని సృష్టించడంలో అంకితమై ఉండి, శాస్త్రీయ పద్ధతుల్లో పునర్వికాసం జరగాలి.
2. విశ్వవిద్యాలయ విద్య పాత సివిల్ సర్వీస్ పరీక్షకు ప్రత్యామ్నాయం కారాదు.
3. సంపూర్ణ విద్యావిషయక స్వేచ్ఛను అనుమతించాలి.

టు-షీ మార్గదర్శకత్వంలో పైటా (Pieta) విశ్వవిద్యాలయం ఒక ఉత్తేజకరమైన విద్యాసంస్థగా తయారైంది, అందులో ఉన్నత విద్య అధ్యయనానికి, వివిధ రాజకీయ ప్రోద్బలాలున్న ఆచార్యులను నియమించి, వారిచే బోధించడం గొప్ప విశేషం. ఉదారవాదులు, మౌలికవాదులు, సామ్యవాదులు, సంప్రదాయవాదులు, విప్లవవాదులు, విద్యావిషయక విషయాలను కూర్పు చేసి బోధించేవారు.

హు-షీ శాస్త్రీయ ఆలోచనకు, వ్యవహారవాదానికి రచనల్లో దేశీయ శైలికి బలవత్తరమైన ప్రతిపాదనలను చేశాడు. హు-షీ ప్రోత్సాహానికి ప్రధానమైన ఆధారాలు హక్స్లీ, డివే (Huaxley and Deway) ప్రభావ ముద్రలే. అజ్ఞేయతావాదం, వ్యవహారవాదం అతని ప్రధాన దృక్పథాలై, సాంప్రదాయ నైతికతకు, భావాలకు మూల్యాకనం చేశాయి. హు-షీ కన్ఫూషియస్‌వాదానికి వ్యతిరేకుడు. ఉదారవాదానికి, వైయక్తిక విధానానికి



BRAOU

విజ్ఞాన శాస్త్రానికి అనుకూలుడు. వ్యవహారవాదం నుండి అతను క్రమక్రమంగా అంచెలంచెలుగా సమాజాన్ని మేల్కొల్పుతూ, దాని సమస్యల్ని అధ్యయనం చేసుకుంటూ, వాటిపై ప్రయోగాలను చేస్తూ, పరిష్కారాలను కనుగొన్నాడు. అతని కాలంలో మిస్టర్ సైన్స్ (Mr. Science) మిస్టర్ డెమోక్రసి (Mr Democracy) ఊతపదాలైనాయి. ఈ రెండు పాశ్చాత్యదేశాల్లో ప్రారంభమైనాయి కాబట్టి, సంపూర్ణ పాశ్చాత్యీకరణ అవశ్యకమని హూ-షి వాదించాడు. పశ్చిమానికి వెళ్లు (Go west) అనేది ఇతని సందేశం. హూ-షి రచనలో ప్రవేశపెట్టిన సరళమైన భాష (Pai-hua-hu) అత్యంత ప్రధానమైనది.

1918లో పైటా (Pieta) లోని విద్యార్థులు సంఘటితంగా 'న్యూటైడ్' (New tide) పత్రికను నడిపారు. అది, మూడు ప్రమాణాలతో నడపబడింది. అవి 1. విమర్శనాత్మక స్ఫూర్తి, 2. విజ్ఞానశాస్త్ర ఆలోచన, 3. సంస్కరించిన వాక్పటిమ. న్యూయూత్, న్యూటైమ్, వీక్లీ క్రిటిక్ సోదరపత్రికలు కూడా, సాంప్రదాయతత్వం ప్రాచీన సాహిత్యం, పురాతన నీతిశాస్త్రం, పురామానవసంబంధాలు, కన్ఫ్యూషియన్ తత్వం అనే విషయాలపై పూర్తి దాడి చేశాయి. ఈ వార్తా పత్రికలు మేధోపరమైన పిడుగుపాటు లాంటివి. మొదటగా, చైనాలో ప్రధానమైన జాతీయ, సామాజిక సమస్యలను బహిరంగంగా చర్చించి వాదించేవారు, ఈ ప్రవృత్తికి సామాజిక, మేధోపరమైన ఆందోళనలు తోడై, జాతీయ విస్ఫోటనం జరిగింది.

## 22.6.2 మే 4 ఉద్యమం

1919 మే 4, న దాదాపు 5000 మంది విద్యార్థులు పెకింగ్ లో షాంటుంగ్ శాంతి సమావేశంలో తీర్పుకు వ్యతిరేకంగా, భారీఎత్తున జరిపిన ప్రదర్శన, చైనా జాతీయభావాన్ని ప్రపంచానికి తెలియచేసింది. ప్రజలు కోపాగ్నితో చేసిన విస్ఫోటనం విదేశీయులకు, దేశద్రోహులకు వ్యతిరేకంగా కొనసాగింది. ఈ సంఘటనలవల్ల తక్షణ జాతీయ స్పందన కల్గి, జాతీయతావాదం-ప్రజాభిప్రాయాలు సామూహికంగా కలిసి, చైనా రాజకీయాల్లో ఒక కొత్త బలాన్ని పుంజుకోవడానికి దోహదం చేశాయి. చరిత్రకారులు మే4 సంఘటనలను ప్రశంసిస్తూ, అది "ఆధునిక చైనా చరిత్రలో జరిగిన మొట్టమొదటి యదార్థ సామూహిక ఉద్యమమని" పేర్కొన్నారు.

చైనా 1898లో జర్మనీకి లీజు యిచ్చిన షాంటుంగ్ రాష్ట్రాన్ని, చైనా మొదటి ప్రపంచయుద్ధ కాలంలో తిరిగి రాబట్టుకున్నది. దీని స్వాధీనం కోసం జపాన్ తన 21 డిమాండ్లలో షాంటుంగ్ లో దాని హోదాకై గుర్తింపు పొందింది. అంతేకాక అగ్రరాజ్యాలతో వరుస వారీగా సంధులు చేసుకోవడానికి మద్దతు నిచ్చింది. నవంబర్‌లో, లాన్‌షింగ్ ఇషీ ఒప్పందం ముగిసినందువల్ల, అమెరికా జపాన్‌కు చైనాలో ప్రత్యేక హోదా ఉందని ప్రకటించింది. చైనా యుద్ధ ప్రభువుల ప్రభుత్వం 20 మిలియన్ల యెన్‌లను ఖర్చు చేసినందువల్ల జపాన్ షాంటుంగ్‌లో రెండు రైల్వేలను నిర్మించడానికి హక్కులను పొందింది. చైనాలోని కీలకమైన స్థానాల్లో జపాన్ తమ సైన్యాలను నిలిపింది. పెకింగ్ సూచనలనుసరించి టోకియో మంత్రి, చాంగ్-టుంగ్- సియాంగ్ ఈ షరతులను సంతోషంగా అంగీకరించాడు. ఈ రహస్య సంఘాలవల్ల, జపాన్ దేశస్థులు వర్సైల్స్‌కు వచ్చి, షాంటుంగ్‌పై గెలుస్తామన్న నమ్మకాన్నేర్పర్చుకొన్నారు.

చైనా ప్రతినిధి వర్గం, న్యాయపరంగా ట్రిబ్యునల్ సహాయం చేస్తుందనే నమ్మకంతో, ప్రజాస్వామ్యాన్ని బలహీనుల రక్షణ కనుగుణంగా నిర్ణయాలు చేస్తుందని భావించారు. చైనా ప్రతినిధి వర్గం, షాంటుంగ్ ను చైనా పరం చేయడానికి ప్రతిజ్ఞ బూని, వర్సైల్స్‌కు చెరుకున్నారు. సమతౌల్యం కాని సంధులను పూర్తిగా రద్దు చేయాలని వారు కోరారు. కాని, వారి ఆశలేవీ ఫలించలేదు. శాంతి సమావేశం, యుద్ధపూర్వపు అంతర్జాతీయ సమస్యలను పరిచేయడానికి పిలువలేదని, యుద్ధానంతరం తలెత్తిన సమస్యల పరిష్కారం ముఖ్యోద్దేశమని పేర్కొన్నారు. దీని పర్యవసానంగా, ఆ సమావేశంలో షాంటుంగ్ చర్చకురాగా, చైనా ప్రతినిధివర్గం,

షాంటుంగ్–కన్ఫ్యూషియస్, మెన్షియస్–జన్మస్థానమని, చైనాలో పవిత్ర భాగమని తెల్పింది. 21 డిమాండ్లను చైనా ఎన్నడూ అనుమోదించనందువల్ల, మొదటి ప్రపంచయుద్ధానికి ముందు కుదుర్చుకున్న ఒప్పందాలు ఇకపై చెల్లనేరవని వాదించింది. కాని, జపాన్ దీనిని ఖండిస్తూ, 1918 లో ఒక రహస్య ఒప్పందాన్ని పెకింగ్‌లో ప్రకటిస్తూ డిమాండ్లు మొదటి ప్రపంచ యుద్ధం మొదలైన తర్వాతనే చైనా అంగీకారపూర్వకంతో జరిగిందని తెల్పింది. మిత్ర రాజ్యాలు, జపాన్ వాదాన్ని బలపర్చాయి. జపాన్ దాని అభ్యర్థనలను పాటించకపోతే, సమావేశం నుండి విరమించుకుంటామని బెదిరించింది. చైనా సమస్యకు ఉడ్రోవిల్సన్ ఏకైక నిర్దేశకుడుగా వ్యవహరించాడు. విల్సన్ ప్రతినిధులతో చర్చించి నానాజాతిసమితి ఏర్పాటుకు జపాన్ సహకారం అతి ప్రధానమని భావించాడు. ఆ తర్వాతనే చైనాకు న్యాయం చేయొచ్చని తెల్పాడు.1919, ఏప్రిల్ 28 శాంతి సమావేశం షాంటుంగ్ సమస్యను జపాన్‌కనుకూలంగా నిర్ణయించింది. దీంతో విల్సన్ సిద్ధాంతాలపై చైనా నమ్మకం చెరిగింది. పాశ్చాత్యదేశాల నమ్మకద్రోహం చవిచూసిన తర్వాత కోపోద్రిక్తులైన విద్యార్థులు షాంటుంగ్‌ను రక్తపాతంతోనైనా సాధించాలని ప్రకటించారు.

1919, మే 4న విద్యార్థులు కొన్ని వందల సంఖ్యలో సమావేశమై, జాతీయ సంక్షోభానికి దారితీసిన ఈ అవమాన పరిస్థితుల్లో, భవిష్యత్ కార్యక్రమాలగురించి చర్చలను జరిపారు. వర్సైల్స్ తీర్పు అన్యాయమని నిరసిస్తూ, వర్సైల్స్‌లో తమ ప్రతినిధులకు టెలిగ్రాంలను పంపాలని నిశ్చయించారు. ఈ టెలిగ్రాంలలో చైనా ప్రతినిధి వర్గాన్ని, షాంటుంగ్ షరతులననుసరించకపోతే, సంధిని నిరాకరించాలని వారు కోరారు. సామూహిక ప్రదర్శనలు, విదేశీ కార్యాలయాలకు అర్జీల సమర్పణలతోపాటు, పారిస్‌కు కూడా సందేశాలు పంపాలని నిర్ణయించారు.

పెకింగ్‌లో 13 విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుండి అనేక విద్యార్థి బృందాలు కలిసి, దాదాపు 5 వేల మంది ప్రదర్శనలను జరిపారు. కొన్ని చోట్ల "దేశద్రోహి ట్సావో (యుద్ధ ప్రభువు)ను దండించాలి," 'కియావోచాన్ లను చంపాలి" అనే బానర్లు, అంతటా ప్రదర్శితమైనాయి. కొన్ని చోట్ల సహనం కోల్పోయిన విద్యార్థులు, ట్సావో జులుంగ్ నివాసాన్ని ధ్వంసంచేసి పారిపోగా, పోలీసులు కొద్దిమందిని అరెస్టు చేశారు. ఈ అరెస్టులకు నిరసనగా, పెకింగ్‌లో సాధారణ సమ్మెకు విద్యార్థులు పిలుపునిచ్చారు. వీరు పైటా ఛాన్స్‌లర్ ట్సావో రాజీనామాను కోరారు. ఇతర పెద్ద పట్టణాల్లో కూడా ఈ సమ్మె వ్యాపించింది. వీరితోపాటు, వర్తకులు, పారిశ్రామిక కార్మికులు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, దేశం నలుమూలలనుండి ఈ సమ్మెల్లో పాల్గొన్నారు. జపనీయుల వస్తువులు బహిష్కరించడం, జపాన్ ఉత్పత్తుల కొనుగోలు నిలుపుదల చేయడం, జపనీయుల స్టీమర్స్‌లో దిగుమతైన సామాగ్రిని దింపటానికి నిరాకరించారు. ప్రజా ఒత్తిడి పెరుగుతున్నందున, పెకింగ్ ప్రభుత్వం మే 7న విద్యార్థులను వదిలి పెట్టింది. పారిస్‌లో ఉన్న చైనా ప్రతినిధులకు కొన్ని వేల సంఖ్యలో టెలిగ్రాంలు పంపడమైంది. దీనితో సంధిని నిరాకరించాలని, లేని పక్షంలో వారికి శిక్ష తప్పదని భయపెట్టారు. 1995, జూన్ 28 జరిగిన సంతకాల సేకరణలో చైనా ప్రతినిధివర్గం హాజరు కాలేదు. దీనిపై ఉడ్రో విల్సన్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ, ఇది చాలా దురదృష్టకరమైన విషయమనీ, తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందనీ వ్యాఖ్యానించాడు. చైనా రాడికల్స్ ఈ ఉద్యమాన్ని ప్రశంసించారు. లీ–టా –చావో ఈ ఉద్యమాన్ని దేశభక్తి ఉద్యమంగా మాత్రమేకాక 'మానవ విముక్తి' పోరాటమని పొగిడాడు. మావో ఈ ఉద్యమాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేకంగాను, భూస్వామ్య వ్యతిరేకంగాను, చైనా ప్రజాస్వామిక విప్లవం గానూ పేర్కొన్నాడు. ఈ ఐక్య సంఘటన ఉద్యమంలో, కార్మికులు, విద్యార్థులు, జాతీయ బూర్జువాలు మేధావి వర్గ నాయకత్వంలో ఒకే తాటిపై విదేశీయుల కెదురుగా ఉద్యమించాయి.

ఈ విధంగా చైనాలో జరిగిన మేధోపరమైన విప్లవం, చైనా విప్లవ చరిత్రకాలం ముందు జరిగిన దశల్లో

మూడో దశగా వ్యవహరించింది. మొదటి దశ 1861 నుండి 1895 వరకు జరిగింది. ఈ దశలో, దౌత్యపర ప్రయత్నాలు, మిలటరీ ఆధునికీరణ ప్రయత్నాలు జరిగాయి. రెండోదశ, 1898 నుండి 1912 వరకు జరిగిన సంస్కరణ దశ. 1911 లో మంచూలకు వ్యతిరేకంగా జరిగిన విప్లవం. ఆ తర్వాత రిపబ్లిక్ పాశ్చాత్యాధికారాన్ని కూలదోయడానికి, చైనాలో అభివృద్ధి సాధించడానికి పాశ్చాత్యీకరణ పద్ధతులను చైనా అవలంబించింది. మూడోదశ లో 1917 నుండి 1923 వరకు మేధోపరమైన జాగృతిని కలిగించి, చైనా సాంప్రదాయిక విధానాల్లో మార్పు తెచ్చి, సంపూర్ణ పాశ్చాత్యీకరణకు, భావ విప్లవానికి నాంది పలికింది. ఈ దశలో సంభవించిన సిద్ధాంతపర చైతన్య పోరాటంలో, మొదటగా సాహిత్యపరమైన విప్లవం, 1920 లో సరళభాషా శైలిని, రచనల్లో చొప్పించడంతో జరిగింది. ఆ తర్వాత దేశీయ శైలిలో నూతన సాహిత్యం ఉత్పన్నమైంది. ఇది మానవతావాదం, కాల్పనికవాదం, వాస్తవికవాదం, జాతీయతావాదాల ఆధారంగా ఏర్పడి, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకురావడానికి బాధ్యత వహించింది. ఇది సారస్వత విప్లవం నుండి సాహిత్య ఉద్యమంగా మారింది. రెండోది, విదేశీయ భావనల ప్రవేశం వల్ల, సామాజిక పునర్నిర్మాణం జాతీయ పునరుద్ధరణ అనే రెండు విభిన్న దృక్పథాలుద్భవించాయి. వ్యవహార జ్ఞానం, పరిణామశీల పద్ధతులను హు-షీ ప్రతిపాదించాడు. దీని తర్వాత కాలంలో జాతీయ కొమింగ్‌టాంగ్ పార్టీ పాక్షికంగా అంగీకరించింది. మార్క్సిస్ట్ విప్లవ దృక్పథాన్ని చైనా, కమ్యూనిస్ట్ పార్టీని అంగీరించింది. మూడోదైన తీవ్ర జాతీయవాద పోరాటం, యువ చైనాను పురికొల్పింది. దీని ఫలితంగా, విదేశీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా హింసాత్మక చర్యలు, అసహన సంధుల ముగింపుకు తీవ్రతరమైన చర్యలను తీసుకోడం జరిగింది. దీనిలో పేర్కోదగ్గవి. 1919, మే 4న జరిగిన ఉద్యమం, 1925 లో షాంఘై మిల్లుల్లో జపాన్ దేశీయులకు వ్యతిరేకంగా జరిగిన సమ్మెలు, కాంటన్ లో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా విద్యార్థులు జరిపిన ప్రదర్శనలు. ఈ ఉద్యమాల్లో విద్యార్థులు ప్రధాన పాత్రను వహించారు. మే 4 ఉద్యమంవల్ల తర్వాత కాలంలో, శ్రామిక వర్గం చైతన్యవంతమైన స్వతంత్ర రాజకీయ శక్తి దిశగా కమ్యూనిజం మారింది. సిద్ధాంతపర సాధనంగా మారి, సామూహిక ఆర్థిక, రాజకీయ విప్లవానికి త్వరితగతిన దోహదం చేసింది. ఈ చైతన్యంవల్ల చైనా విదేశ భావనలననుసరించింది. పరిణామాత్మక మార్గంలో నైతేనేమి, విప్లవమార్గంలో నైతేనేమి, పోరాటం చేసి, అంతిమ లక్ష్యమైన సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవాన్ని కొనసాగించింది. ఈ ఉద్యమం 1926 -27 లో పునరుద్భవించిన కమ్యూనిస్ట్ కొమింగ్‌టాంగ్ సాహచర్యంలో విజృంభించడం జరిగింది.

## 22.7 సంగ్రహంగా

దాదాపు నాలుగు వేల ప్రాచీన చరిత్ర గల చైనాలో, క్రీ.శ 1644 నుండి, మంచూల పాలనతో ఆధునిక యుగం మొదలైనట్లుగా భావింపవచ్చు. ప్రజాస్వామ్యంపై నిర్మితమైన నిరంకుశత్వంగా వర్ణించ బడిన మంచూ రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వం,కన్ఫ్యూషియస్ సిద్ధాంతాల ఆధారంగా నడిచింది. పవిత్ర దైవలోక సామ్రాజ్యంగా చైనీయులు భావించే చైనా, 19వ శతాబ్ద తొలిభాగం వరకూ, కాంటన్, మెకావోలో తప్ప, అన్నిప్రాంతాలను విదేశీయులకై మూసి ఉంచింది. క్రైస్తవ మతవ్యాప్తి, వ్యాపారం ద్వారా, చైనాలో ఆర్థిక లాభాలు పొందడానికి చైనా వచ్చిన ఐరోపా దేశాలు, క్రమక్రమంగా చైనాలో ప్రభావ మండలాల్నేపర్పర్చుకొని, చైనా దోపిడికీ గురిచేసాయి. ఈ ఐరోపాదేశాల వలసవాద, సామ్రాజ్యవాద చర్యలకు వ్యతిరేకంగా చైనాలో, జాతీయతాభావం ప్రబలి, అనేక విప్లవాలు జరిగాయి. వీటిలో 1840, 1856 లో చైనా బ్రిటిష్ వారి మధ్యల జరిగిన నల్లమందు యుద్ధాలు, 1851 నుండి 1864 వరకు జరిగిన యుద్ధాలు, 1895 లో జరిగిన చైనా జపాన్ యుద్ధం, 1900 లో జరిగిన బాక్సర్ ఉద్యమం ముఖ్యమైనవి. ప్రజల్లో రగుల్కొన్న జాతీయతావాదాన్ని గుర్తించి, మంచూ ప్రభుత్వం కొన్ని సంస్కరణలు చేపట్టినా, అవి ప్రజలకు ఎక్కువ ప్రయోజనకారి



BRAOU

కానందువల్ల, మంచూ పాలనలోని అసమర్థత, లంచగొండితనానికి వ్యతిరేకంగా డా॥సన్-యట్-సేన్ నాయకత్వంలో జరిగిన 1911 విప్లవంవల్ల మంచూ వంశం పతనమై, చైనా రిపబ్లిక్ ఏర్పాటైంది. రిపబ్లిక్ కాలంలో, యుద్ధ ప్రభువుల అరాచకత్వంవల్ల దేశంలో సంక్షోభం ఏర్పడి ప్రజల అసంతృప్తికి దారి తీసింది. పాశ్చాత్యీకరణ చెందిన చైనాలో 1911 నుండి 1923 వరకు మేధోపరమైన జాగృతి కలిగి, నూతన సాంస్కృతిక ఉద్యమం, మే4 ఉద్యమం ప్రభావంతో విప్లవానికి నాంది పలికింది.

## 22.8 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి

1. ఆధునిక యుగానికి పూర్వం చైనాలోని రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మత మేధోపరమైన పరిస్థితులను వివరించండి.
2. నల్లమందు యుద్ధాల కారణాలను, ఫలితాలను గురించి చర్చించండి
3. బాక్సర్ ఉద్యమ కారణాలు,ఫలితాలను గురించి విమర్శనాత్మకంగా చర్చించండి
4. 1911 విప్లవ కారణాలు, స్వభావం, ప్రభావాలను విశ్లేషించండి
5. చైనాలో రాజ్యాంగ ఉద్యమ ప్రభావాన్ని విశ్లేషించండి.

II. క్రింది వానికి లఘు వ్యాఖ్యలు రాయండి

1. టియన్‌సెన్, పెకింగ్ సంధుల ప్రాధాన్యతను చర్చించండి
2. చైనా, జపాన్ యుద్ధక్రమాన్ని షిమెనోస్కి సంధి అంశాలను తెలపండి
3. తైపింగ్ తిరుగుబాటు ప్రభావం, వైఫల్యాన్ని గురించి రాయండి.
4. వందరోజుల సంస్కరణల ప్రాముఖ్యతను గురించి రాయండి.
5. చైనా రాజకీయ సంక్షోభంలో యుద్ధ ప్రభువుల పాత్ర వివరించండి.
6. డా॥ సన్-యట్-సేన్ త్రివిధ సూత్రాలను వివరించండి.
7. మే 4 ఉద్యమ ప్రభావాన్ని చర్చించండి.

BRAOU

## 22.8 ఉపయుక్త గ్రంథాలు


| | |
|---|---|
| Ahmad A.L | **A Comprehensive History of the Far East** |
| Claude & Buss | **The Far East** |
| David M.D | **Rise and Growth of Modern China** |
| Edward Scheper H | **Ancient China (Life Time Books)** |
| Edwin E Moise | **The Present and Past Modern China** |
| Gray Jack | **Rebellions and Revolutions** |
| Gupte R.S | **History of Modern China** |
| Goodrich L.C | **A short History of the People** |
| Harrison, John | **Chinese Past and Present** |

| | |
|---|---|
| Immanual Hsu | **The Rise of Modern China** |
| Laurette k.S | **The Chinese their History and Culture** |
| Li-chien Nag | **The Political History of the Chinese People 1840 –1918** |
| Mac leavy Heavy | **The Modern History of China** |
| Panikkar k.M | **Asia and Western Dominance** |
| Paul Clyde Burton F. Bears | **The Far East** |
| Shiv Kumar & Saroj Jain | **History of Modern China** |
| Vinacke H.M | **A History of Far East in Modern China** |
| తెలుగు అకాడమీ | చైనా జపాన్ చరిత్ర |

రచయిత్రి ఇ. సుధారాణి

BRAOU

# భాగం – 23 ః కొమింగ్‌టాంగ్ – కమ్యూనిస్ట్‌ల ఘర్షణ

విషయక్రమం


23.0 ః లక్ష్యాలు

23.1 ః పరిచయం

23.2 ః కొమింగ్‌టాంగ్ పుట్టుక, డా॥ సన్-యట్ -సేన్ పాత్ర

23.3 ః కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన, లక్ష్యాలు

23.4 ః కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల మధ్య సయోధ్య

23.5 ః కొమింగ్‌టాంగ్ పునర్వ్యవస్థీకరణ

23.5.1ః రష్యా సహకారం

23.5.2ః కొమింగ్‌టాంగ్ నూతన సిద్ధాంతాలు

23.6 ః కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల మధ్య ఘర్షణ, కారణాలు

23.7 ః ఉత్తర దండయాత్ర ః చాంగ్-కై-షేక్ పాత్ర

23.8 ః కమ్యూనిస్ట్‌ల దీర్ఘ యాత్ర

23.8.1ః కారణాలు

23.8.2ః గమనం

23.8.3ః ఫలితాలు

23.9 ః చైనా జపాన్ యుద్ధం; కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల తాత్కాలిక సఖ్యత

23.10 ః కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్ యునైటెడ్ ఫ్రంట్‌లో చీలిక, సంధి ప్రయత్నాలు

23.10.1ః హర్లీ రాయబారం

23.10.2ః మార్షల్ రాయబారం

23.11 ః సంగ్రహంగా

23.12 ః పరీక్ష నమూనా ప్రశ్నలు

23.14ః ఉపయుక్త గ్రంథాలు


BRAOU

## 23.0 : లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడంవల్ల మీరు,

- చైనాలో కొమింగ్‌టాంగ్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల ఆవిర్భావాన్ని, సిద్ధాంతాలను వివరించగలగాలి.
- కొమింగ్‌టాంగ్ పార్టీ పునర్వ్యవస్థీకరణను, డా॥ సన్-యట్-సేన్ పాత్రను అంచనా వేయగలగాలి.
- కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ పార్టీ మధ్య సంబంధాలను, విభేదాలను విశ్లేషించగలగాలి.
- కమ్యూనిస్ట్‌ల దీర్ఘ యాత్ర కారణాలను, గమనగతిని, ఫలితాలను వివరించగలగాలి.
- కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటును, చీలికను, రాజీ ప్రయత్నాలను, వైఫల్యాన్ని విశదీకరించగలగాలి.

## 23.1 పరిచయం

1920-1938 మధ్య కాలం చైనా విప్లవ చరిత్రలో కీలకమైంది. 1920 కు ముందు జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక, మంచూ వ్యతిరేక తిరుగుబాట్లు, మే 4 ఉద్యమ ఫలితంగా జరిగిన సమ్మెలు, రిపబ్లిక్ వైఫల్యం, స్వార్థపరులైన యుద్ధ ప్రభువుల విద్రోహం చైనాలో సంక్షోభానికి దారితీశాయి. వీటికారణంగా దేశ సమైక్యతను దృష్టిలోపెట్టుకొని, కొమింగ్‌టాంగ్ పార్టీని డా॥ సన్ రష్యా కమ్యూనిస్ట్ పార్టీ పద్ధతిలో పునర్‌వ్యవస్థీకరించాడు. బోల్షివిక్ విజయ ప్రభావంతో చైనాలో కమ్యూనిస్ట్ పార్టీ స్పష్టమైన రూపుదిద్దుకొని, సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా ఉద్యమాలను చేపట్టింది. 1920 నుండి చైనా ఒక కొత్త విప్లవ మార్గాన కొమింగ్‌టాంగ్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల సారథ్యంలో నడిచింది. 1920 నుండి, 1927 వరకు, సైద్ధాంతిక పరమైన విభేదాలున్నప్పటికీ, కొమింగ్‌టాంగ్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల మధ్య సహకార, సద్భావనలుండేవి. డా॥ సన్ రష్యా సహాయంతో చైనాను పునర్నిర్మించి, ఆర్థిక, రాజకీయ, స్వాతంత్ర్యం వాంఛించి, కమ్యూనిస్ట్‌లతో సయోధ్యను కోరాడు. కమ్యూనిస్ట్‌లు కొమింగ్‌టాంగ్‌తో కలిసి దేశ సమైక్యత కావించి, సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవాన్ని సాగించాలనుకొన్నారు. అయితే, 1927 నాటికి, రెండు పార్టీల మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రమై విడిపోయాయి. ఆ తర్వాత, 1931 లో చైనా జపాన్ యుద్ధ కాలంలో తాత్కాలికంగా సఖ్యత కుదిరినా, అది ఎంతో కాలం నిలవలేదు. తర్వాత కాలంలో కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల అణచివేత ప్రధాన ధ్యేయంగా పెట్టుకోడంతో, రెండింటి మధ్య ఘర్షణలు తీవ్రమై, అంతర్యుద్ధం తప్పనిసరైంది. ఈ భాగంలో చైనాలో కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ పార్టీల ఆవిర్భావం, వాటి లక్ష్యాలు , కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్ పార్టీల మధ్య సంబంధాలు, విభేదాలు, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల అణచివేత చర్యలు, కొమింగ్‌టాంగ్, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా కమ్యూనిస్ట్‌లు జరిపిన ప్రతిఘటనలు వివరించబడింది.

## 23.2 కొమింగ్‌టాంగ్ పుట్టుక, డా॥ సన్-యట్- సేన్ కృషి

కొమింగ్‌టాంగ్ పార్టీ స్థాపకుడు డాక్టర్ సన్-యట్- సేన్. ఇతడు 1866 నవంబరు 12వ తేదీన కాంటన్ దగ్గరున్న షియంగ్‌షన్‌లోని ఒక పేద రైతు కుటుంబంలో జన్మించాడు. విద్యాభ్యాసం కోసం, 1879లో హవాయిలోని హొనులులుకు వెళ్ళాడు. హొనులులు కళాశాలనుండి డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణుడై, 1885లో స్వగ్రామానికి వచ్చాడు. మంచూ పరిపాలన ఫలితంగా, పతనావస్థలో ఉన్న చైనాను చూసి మిక్కిలి బాధపడి, మంచూలనుండి చైనాను విముక్తి చేయాలనే లక్ష్యానికి వచ్చాడు. ఆ తర్వాత మొదట 'పోచీ' వైద్య కళాశాలలో విద్యార్థిగా చేరాడు. విద్యార్థిగా ఉన్నప్పుడు సన్-యట్-సేన్‌కు మంచూ వ్యతిరేక రహస్య



BRAOU

సంఘాలతో కల్గిన పరిచయంవల్ల, అతనిలో విప్లవ భావాలు గాఢంగా నాటుకొన్నాయి. ఆ తర్వాత, 1887 లో హాంకాంగ్‌లోని వైద్యకళాశాలకు 1892 మార్చిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై, మాకోవోలో వైద్య వృత్తి నారంభించాడు. ఆ తర్వాత, 1893లో కాంటన్‌లో బీదలకు ఉచిత వైద్యం చేస్తూనే, వివిధ రహస్య సంఘాలతో సంబంధం పెట్టుకొని, విప్లవ భావాలను వ్యాప్తి చేశాడు. ఆ తర్వాత, 1899లో హాంగ్‌కాంగ్‌లో విప్లవ కార్యకలాపాల వ్యాప్తికై 'చుంగ్ జీపో' అనే దినపత్రికను ప్రారంభించాడు. క్రీ.శ 1900 నుండి 1905 వరకు షాంగై, మలయా, హవాయి, జపాన్, అమెరికాల్లో నిరంతరం పర్యటించి, తన విప్లవాశయాలను ప్రచారం చేసి, విప్లవ స్థాపనకు పూనుకున్నాడు. 1905 ఆగస్ట్ 20వ టోక్యోలో 'టుంగ్‌మెంగ్ హుయి' (League of common alliance) ను రూపొందించాడు. ఈ టుంగ్ మెంగ్ హుయి పార్టీనే కొమింగ్‌టాంగ్ పార్టీగా పునర్వ్యవస్థీకరించాడు.

చైనా భాషలో 'కొ' అంటే దేశమనీ, 'మిన్' అంటే ప్రజలనీ, 'టాంగ్' అంటే పార్టీ అనీ అర్థం. కొమింగ్‌టాంగ్ అంటే, జాతీయపార్టీ అని అర్థం. మంచూల పాలన నంతమొందించడం లక్ష్యంగా పెట్టుకొని, దాన్ని సాధించడంలోనూ, 1912లో చైనా రిపబ్లిక్‌ను స్థాపించడంలోనూ కొమింగ్‌టాంగ్ కృషి చేసి, అఖండ విజయం సాధించింది. ఆ తర్వాత పార్టీలోని తన అనుచరుల క్రమశిక్షణా రాహిత్యం, సంకల్ప బలరాహిత్య లోపాలవల్ల డా॥ సన్ తీవ్రంగా నిరుత్సాహపడ్డాడు. రిపబ్లిక్ నాటినుండి, సన్ అనుచరులు అతనికి పూర్తి సహాయాన్నందజేయక పోవడమే కాక, అవిధేయతతో మెలగుతూ, పార్టీ కార్యక్రమాలకు ఆటంకం కలిగించారు. ఆ తర్వాత 1917లో రష్యాలో బోల్షివిక్ విప్లవ విజయంతో ప్రభావితుడైన డా॥ సన్, కొమింగ్‌టాంగ్‌ను పునర్వ్యవస్థీకరించాలని ప్రణాళికలు చేసి, 1919లో టుంగ్ మింగ్ హుయిని జాతీయ పార్టీగా మార్చాడు. కానీ, 1923 వరకూ కొమింగ్‌టాంగ్‌ను వృద్ధిపర్చాలని డా॥ సన్ చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. దీనికి తోడు,తన అనుయాయుల్లోని అనైక్యత, అవిధేయత, చైనాను అభివృద్ధి చేసే ప్రణాళికల పట్ల పశ్చిమ దేశాల అయిష్టత, డా॥ సన్ ఉత్సాహాన్ని నీరు కార్చింది. ఈ విధంగా, సన్-యట్-సేన్ రిపబ్లిక్ కాలంలో విదేశీ సామ్రాజ్యవాదం, పార్టీ అనైక్యత, అంతఃకలహాలు అనే మూడు సమస్యల నెదుర్కోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో, సోవియట్ రష్యాలోని బోల్షివిక్ విప్లవం పట్ల ఆకర్షితుడైన సన్ రష్యా స్నేహ ప్రతిపాదన నంగీకరించి, రష్యా కమ్యూనిస్ట్ పార్టీ మార్గంలో, కొమింగ్‌టాంగ్‌ను పునర్వ్యవస్థీకరించడానికి పూనుకున్నాడు.

1919 మే 4 ఉద్యమంలో పాల్గొన్న చైనా యువతలో ఉరకలు వేస్తున్న జాతీయత, ధైర్యసాహసాలు, చైనా కమ్యూనిస్ట్ పార్టీకి శ్రామిక, కర్షకులతో ఉన్న సంబంధాలు, కొమింగ్‌టాంగ్‌లోకి యువతను ఆహ్వానించాలని డా॥ సన్‌ను ప్రభావితం చేశాయి. తత్ఫలితంగా, క్రీ.శ. 1920 నుండి, చైనాను ఒక కొత్త విప్లవాత్మక మార్గాన జాతీయ పార్టీ (కొమింగ్‌టాంగ్), కమ్యూనిస్ట్ పార్టీ (కుంగ్‌స్టుంగ్) లు నడిపించాయి.

## 23.3 కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన, లక్ష్యాలు

1905 లో చైనాలో 'మిన్‌పావో' అనే వార్తాపత్రికలో ప్రచురితమైన మార్క్స్ జీవిత చరిత్ర ద్వారా, మొదటిసారిగా చైనీయులకు మార్క్సిజం పై అవగాహన కలిగింది. 1908లో 'తెయిన్‌పావ్' అనే మరో పత్రిక ఫ్రెడరిక్ ఎంజిల్స్ రాసిన కమ్యూనిస్ట్ మానిఫెస్టో" లోని మొదటి అధ్యాయమైన "ఇంట్రడక్షన్ టు "ది కమ్యూనిస్ట్ మానిఫెస్టో" (Introduction to the Communist Manifesto) "ద ఆరిజన్ ఆఫ్ ఫామిలీ" (The Origin of Family) నుండి కొన్ని భాగాలు ప్రచురించింది. సామ్యవాద స్థాపకులు, మార్క్స్, ఎంజెల్స్ అని చైనీయులకు తెలిసినప్పటికీ, మే 4 ఉద్యమ కాలం వరకూ వారిపై మార్క్సిజం ప్రభావం అంతగా లేదు. ఈకాలంలోనే, బోల్షివిక్ విప్లవ విజయం కూడా వారిని ప్రభావితం చేసింది. వర్సైల్స్ సంధి తర్వాత పశ్చిమ దేశాలపై నమ్మకం తొలగిపోవడంతో, చైనా మేధావులు, తమదేశంలో పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని



BRAOU

ఎదిరించడానికి, సోషలిజం ఒక ఆచరణయోగ్యమైన తత్వంగా భావించారు. 1918, 1919 సంవత్సరాల్లో రష్యా చైనాపై తన జారిస్ట్ హక్కులను రద్దుచేసి స్నేహభావాన్ని చూపెట్టడంతో, చైనీయులకు సోషలిజంపై నమ్మకం పెరిగింది. లెనిన్ సామ్రాజ్యవాద వ్యతిరేక భావనలు కూడా, చైనీయులను ఆకర్షించాయి. ఈ విధంగా మార్క్సిజం, లెనినిజం సైద్ధాంతిక ప్రభావం, రష్యా స్వచ్ఛంద స్నేహ ప్రతిపాదనలు, బోల్షివిక్ విప్లవ విజయం అన్నీ కలిసి చైనాపై ఒక గొప్ప ప్రభావాన్ని కలుగజేశాయి. దీని ఫలితంగా, చైనాలో పలుచోట్ల మార్క్సిస్ట్, లెనినిస్ట్, అధ్యయన బృందాలు నెలకొన్నాయి. ఈ విప్లవ వాదానికి పెకింగ్ జాతీయ విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రమైంది.

పెకింగ్ (Beijing) జాతీయ విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా ఉన్న లీ-టా-చావ్ మార్క్సిజం పట్ల ఆకర్షితుడై, 1918లో 'న్యూ టైడ్ సొసైటీ' ని "మార్క్సిస్ట్ రిసెర్చ్ సొసైటీ" ని స్థాపించాడు. అంతేకాక, తాను ప్రారంభించిన "న్యూ యూత్" పత్రిక మొత్తాన్ని మార్క్సిజానికి కేటాయించాడు. అతని గ్రంథాలయం 'ఎఱ్ఱ కేంద్రం'(Red Centre)గా పేరు పొందింది. అతని విద్యార్థులైన చూ-చీ-టాయ్, చాంగ్ - క్యూటావ్, లైబ్రరీ అసిస్టెంట్ మావో -సే-టుంగ్ అతని అనుచరులైనారు. మే 4 ఉద్యమం ద్వారా ప్రభావితుడైన చెన్ - న్యూసెన్ అనే విప్లవకారుడు షాంఘై పట్టణం లో మార్క్సిజం వ్యాప్తికి కృషి చేశాడు. 1920 మే లో "మార్క్సిస్ట్ రిసెర్చ్‌సొసైటీ", ఆగస్ట్‌లో "సోషలిస్ట్ యూత్ కార్ప్స్"ను స్థాపించాడు. 1920 నాటికి మార్క్సిస్ట్ బృందాలన్నీ ఏకమై, మార్క్స్ సిద్ధాంతాల అధ్యయనానికై 'యునైటెడ్ పార్టీ ఆఫ్‌పెకింగ్ సొసైటీ' ఏర్పడింది.

1921 జూలై లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపనకై ఒక సమావేశం షాంఘై లో ఉన్న షోవెన్ బాలికల పాఠశాలలో జరిగింది. రష్యా కమ్యూనిస్ట్ పార్టీ విధానం ప్రకారం, కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణం జరిగింది. చెన్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. ప్రారంభంలో, కమ్యూనిస్ట్ పార్టీ ప్రధానంగా విద్యార్థులు, కార్మికులపై తన కార్యకలాపాలు కేంద్రీకరించి పనిచేసింది. పటిష్టమైన ట్రేడ్ యూనియన్ ఉద్యమం కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కర్తవ్యమైంది. 1922 లో చెన్-టు-షీ ట్రేడ్ యూనియన్లను వృద్ధి పర్చాలని పార్టీ కార్యకర్తల్ని కోరాడు. ఫలితంగా, అనేక ట్రేడ్ యూనియన్లేర్పడ్డాయి. కానీ, ఈ కార్మికులు కమ్యూనిస్ట్ సభ్యులు కానందువల్ల, కమ్యూనిస్ట్ పార్టీలో ప్రత్యేక అనుబంధం లేనందువల్ల, వీరు కమ్యూనిస్ట్ పార్టీలో చివరి వరకూ పనిచేయలేకపోయారు. 1920లో మాస్కోలో జరిగిన నాల్గో కొమింగ్‌టార్న్ పార్టీ, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన విధులను సూచించింది. అవి 1. చైనా కమ్యూనిస్ట్ పార్టీ కార్మికులను సంఘటితం చేయాలి. 2.విప్లవ శక్తులైన బూర్జువాలతో సయోధ్య కుదుర్చుకొని, ఐరోపీయుల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఆ తర్వాత, 1923లో కాంటన్ సమావేశం కూడా, కొమింగ్‌టాంగ్ పార్టీతో చైనా కమ్యూనిస్ట్ పార్టీ ఒక ఐక్య సంఘటనకై కృషిచేయాలని నిర్ణయించింది. 1924 లో జరిగిన కొమింగ్‌టాంగ్ జాతీయ సభకు మావో కమ్యూనిస్ట్ ప్రతినిధిగా హాజరయ్యాడు. 1920లో వాంపోవా మిలటరీ స్కూల్ లో అనేకమంది కమ్యూనిస్ట్‌లు సైనిక శిక్షణలో తర్ఫీదు పొందారు. మావో నాయకత్వంలో కమ్యూనిస్ట్‌లు ఒకవైపు కొమింగ్‌టాంగ్ పార్టీ తో ఐక్య సంఘటనలు జరుపుతూనే, మరో వైపు పట్టణాల్లో కార్మిక సంఘాలను, పల్లెల్లో రైతు సంఘాలను విప్లవ పోరాటం వైపు సంఘటితం చేయటం మొదలుపెట్టారు.

## 23.4 కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల మధ్య సయోధ్య

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో, చైనా జపాన్‌కు షాటుంగ్‌ను కోల్పోవడంతో, చైనా అంతటా పశ్చిమ రాజ్యాలపై వ్యతిరేక భావాలు ప్రజ్వరిల్లాయి. ఇదే సమయంలో,1919 జూలై 25 న రష్యాలో వెలువరించిన ఒక ప్రకటనలో, చైనాలో జార్ చక్రవర్తులు అనుభవిస్తున్న అధికారాలు, హక్కులను రష్యా రద్దు చేసింది. ఈ ప్రకటన చైనీయులను రష్యాకు చేరువ చేసింది. ఈ సమయంలోనే, విదేశీ వ్యవహారాల



BRAOU

'పీపుల్స్ కమిసారెట్' అయిన లియో, ఎమ్. కరాఖాన్ పెకింగ్‌కు ఒక లేఖ రాశాడు. ఆ లేఖ ప్రకారం, రష్యా ప్రభుత్వం అడాల్ఫ్ జాఫ్ అనే దూతను పెకింగ్‌తో ఒక ఒప్పందాన్ని చేసుకోటానికి, డా|| సన్-యట్-సేన్‌ను సంప్రదించమని కోరింది.

చైనా కమ్యూనిస్ట్ పార్టీ మొదటి సమావేశం 1921లో జరిగింది. ఈ సమావేశం జాతీయ బూర్జువాలతో సంబంధం ఏర్పర్చుకోవాలని ప్రతిపాదించింది. ఈ సమావేశానికి ఇద్దరు కొమింగ్‌టాంగ్ నాయకులు హాజరయ్యారు. కమ్యూనిస్ట్ కాంగ్రెస్ కొమింగ్‌టాంగ్‌కు తమ నెలసరి నివేదికల్ని కూడా సమర్పించాలని నిర్ణయించింది. కాని మావో, చైనా కమ్యూనిస్ట్ పార్టీ అప్పుడే ప్రజాప్రభుత్వం గురించి ఆలోచించరాదని, మేధావి వర్గాలను, కమ్యూనిస్టేతరులను కలుపుకొని జాతీయ విప్లవం కోసం శ్రమించాలని భావించాడు.

క్రీ.శ 1922 జనవరి లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ రెండు సమావేశాలను జరిపింది. రెండో సమావేశంలో, డచ్ కొమింటార్న్ ప్రతినిధి హెచ్ మారింగ్, కొమింగ్‌టాంగ్‌లో చేరమని కమ్యూనిస్ట్‌లను కోరాడు. కొమింగ్‌టాంగ్ నాయకుడైన డా|| సన్-యట్-సేన్ రష్యన్ సలహాదార్ల సహాయంతో చైనా పునర్నిర్మాణం చేయాలని, రష్యా సహాయంతో నిజమైన అర్థిక, రాజకీయ సంపూర్ణ స్వాతంత్ర్యపూర్తికై పోరాటం చేయాలన్న సంకల్పంతో, కమ్యూనిస్ట్‌లను విప్లవ కొమింటాంగ్‌లో చేరమని ఆహ్వానించాడు. అయితే, కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడైన చెన్-టు-షీ, లీ-టా-చావో, తాహో-పెన్‌లు ఈ ఐక్యసంఘటన ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ, రష్యా కొమింటార్న్ సలహా మేరకు, చైనా కమ్యూనిస్ట్ పార్టీ కొమింగ్‌టాంగ్‌తో కలిసి పనిచేయడానికి ఒప్పుకుంది. తన కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం కోల్పోకుండా ఉన్నట్లైతే, కొమింగ్‌టాంగ్‌లో చేరతామని లీ-టా-చావో షరతు విధించాడు. ఆ షరతు డా|| సన్ అంగీకరించగా, కొమింగ్‌టాంగ్‌లో చేరిన మొట్టమొదటి కమ్యూనిస్ట్ లీ-టా-చావో.

రష్యా ప్రతినిధి అడాల్ఫ్ జాఫ్ 1922 ఆగస్ట్‌లో చైనాకు వచ్చాడు. పెకింగ్‌కు రాగానే, దౌత్యవేత్తల నుండి నిరసన నెదుర్కోవాల్సి వచ్చింది. కానీ, చైనాలోని మేధావులు, రాజకీయవాదులు జాఫ్‌కు హార్దిక స్వాగతం పలికారు. డా|| సన్-యట్-సేన్, జాఫ్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు, విస్తృత చర్చలు జరిగాయి. వీటి ఫలితంగా, 1923 జనవరి 28 న సన్-జాఫ్ ప్రకటన వెలువడింది. దీనిలో, డా|| సన్ చైనాలో తన త్రివిధ సూత్రాలకు ప్రత్యామ్నాయంగా, కమ్యూనిస్ట్ వ్యవస్థను గాని, సోవియట్ వ్యవస్థనుగాని అంగీకరించనని స్పష్టం చేసాడు. కమ్యూనిస్ట్‌లను కొమింగ్‌టాంగ్‌లో వ్యక్తిగత సభ్యులుగా మాత్రమే చేర్చుకొంటామని, అధికారం కొమింగ్‌టాంగ్ చేతిలోనే ఉంటుందని ప్రకటించాడు. 1924లో కొమింగ్‌టాంగ్ జాతీయ కాంగ్రెస్‌కు కమ్యూనిస్ట్‌లు హాజరయ్యారు. కమ్యూనిస్ట్‌లు వాంపోవా మిలటరీ స్కూల్ లో శిక్షణావకాశం పొందారు. ఈ విధంగా, 1922 నుండి 27 వరకు కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల సమైక్య సంఘటన నిల్చింది.

## 23.5 : కొమింగ్‌టాంగ్ పునర్వ్యవస్థీకరణ

డా|| సన్-యట్-సేన్ కొమింగ్‌టాంగ్ ఒక పటిష్టమైన శక్తిగా రూపొందించేందుకు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించి, 1914 జూలై 8న 'చైనీస్ రెవల్యూషనరీ పార్టీ' అనే పేరుతో పార్టీని పటిష్టం చేసే చర్యల్ని ప్రారంభించాడు. పార్టీ పైన అదుపు సాధించాడు. తర్వాత, 1917 బోల్షివిక్ విజయంతో ప్రభావితుడైన సన్,1919 మే 4 ఉద్యమం వల్ల ఛిన్నాభిన్నమైన కొమింగ్‌టాంగ్ పునర్వ్యవస్థీకరణకు ప్రణాళికలను తయారుచేశాడు.

### 23.5.1 రష్యా సహకారం

1923 లో కొమింగ్‌టాంగ్ పార్టీని పునర్‌వ్యవస్థీకరించడానికి సోవియట్ యూనియన్ ప్రభుత్వ 

సహకారాన్ని సన్-యట్-సేన్ కోరాడు. చైనాను పాశ్చాత్య దేశాల ప్రభావం , జపాన్ అధికృత నుండి దూరంగా ఉంచాలనుకున్న సోవియట్ రష్యా ప్రతిపాదనను చైనా వెంటనే అంగీకరించింది. కొమింగ్‌టాంగ్ పునర్వ్యవస్థీకరణకు మైఖేల్ మార్క్‌విచ్ బోరోడిన్ (Mikhail Marcvich Borodin) అనే దౌత్యవేత్తను పంపింది. అతడు1923 అక్టోబర్ 6 న కాంటన్ నగరానికి చేరుకున్నాడు. అతనితో పాటు, సన్‌కు సైన్య శిక్షణలో సహాయపడ్డానికి జనరల్ గాలేన్‌ను కూడా రష్యా పంపింది. వారితో పాటు, 40 మంది సోవియట్ సలహాదార్లను కూడా చైనాకు పంపారు. చైనాకు చేరిన వెంటనే, బోరోడిన్ కొమింగ్‌టాంగ్ పార్టీకి సలహాదారుడుగా నియమితుడైనాడు. రష్యా కమ్యూనిస్ట్ పార్టీ పద్ధతిలో, బోరోడిన్ కొమింగ్‌టాంగ్‌లో క్రమశిక్షణ, ఐక్యతను సాధించాడు. పార్టీ పునాది స్థాయిలో పార్టీ సభ్యులతో కూడిన ఒక స్థానిక సంస్థను స్థాపించాడు. ఈ సంస్థకు ఒక ఎగ్జిక్యూటివ్ కమిటిని అనుబంధం చేశాడు. ఈ కమిటి, పార్టీ క్రమశిక్షణ, ప్రచారం, పన్నుల నిర్వహణలను చూసేది. ఈ స్థానిక సంస్థపై సబ్ డిస్ట్రిక్ట్, జిల్లా, రాష్ట్రీయ, కేంద్ర భాగాలనేర్పర్చి, బోరోడిన్ కొమింగ్‌టాంగ్‌ను పటిష్టం చేశాడు. అన్ని విభాగాలపైన వార్షిక జాతీయ కాంగ్రెస్, కేంద్రీయ నిర్వహణా కమిటీ సలహా సంఘాలనేర్పర్చాడు. బోరాడిన్ స్వయంగా కొమింగ్‌టాంగ్ పార్టీ రాజ్యాంగాన్ని ఆంగ్ల భాషలో రాశాడు. సన్ దాన్ని కూలంకషంగా చదివిన తర్వాత, చైనా భాషలోకి తర్జుమా చేశాడు. రాజ్యాంగం లోని 21వ నిబంధననుసరించి, సన్ కొమింగ్‌టాంగ్ పార్టీకి జీవితకాల అధ్యక్షుడుగా నియమితుడైనాడు. రాజ్యాంగం ప్రకారం, అధ్యక్షునిగా సన్ విశేషాధికారాలను పొందాడు. ఈ రాజ్యాంగం ప్రకారం :

1. పార్టీ సభ్యులందరూ అధ్యక్షుని ఆజ్ఞ పాటించాలి.

2. పార్టీ సమావేశం చేసిన తీర్మానాలను త్రోసిపుచ్చే అధికారం, పార్టీ విధానాలను నిర్ణయించడంలో అధ్యక్షునికి పూర్తి అధికారం ఉంటుంది.

3. కేంద్ర నిర్వహణ కమిటీలో తీసుకునే నిర్ణయాలపై తుది తీర్పు చెప్పే అధికారం అధ్యక్షునికే ఉంటుంది. ఈ విధంగా, కొమింగ్‌టాంగ్ పార్టీ పూర్తిగా రష్యా కమ్యూనిస్ట్ పార్టీవలెనే పటిష్టంగా నిర్మించి, అధ్యక్షునిగా డా॥ సన్‌కు అపరిమితాధికారాల్నివ్వడం జరిగింది. ఈ సమయంలోనే, కొమింగ్‌టాంగ్ ఆదేశాలననుసరించి కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులు కొమింగ్‌టాంగ్‌లో చేరడం జరిగింది. 1924 జనవరి 28 న పార్టీ కేంద్ర కార్య నిర్వాహక కమిటీకి ఎన్నికలు జరిగాయి. ఈ సంఘ సభ్యుల సంఖ్య 24. వారిలో ముగ్గురు కమ్యూనిస్ట్‌లనుండి ఎన్నుకోబడ్డారు. ఈ సమయంలోనే, 1924లో సన్, చాంగ్-కై-షేక్ అనే యువ అధికారికి సైనిక శిక్షణనిచ్చి, రష్యా రాజకీయ సిద్ధాంతాన్ని రెడ్ ఆర్మీ క్రమశిక్షణను, బోల్షివిక్ పార్టీని గురించి అధ్యయనం చేయడానికి రష్యాకు పంపించాడు. మూడు నెలల అధ్యయనం తర్వాత, చాంగ్ చైనాకు తిరిగి వచ్చాడు. ఈ సమయంలో, సన్ వాంపోవా మిలటరి అకాడమిని కాంటన్ బయట ఏర్పాటు చేశాడు. దీనికి చాంగ్-కై-షేక్‌ను ప్రథమ కమాండెంట్‌గా నియమించాడు. పార్టీ రాజకీయ విభాగానికి కమ్యూనిస్ట్ సభ్యుడైన చౌ-ఎన్-లై *(Chou-en-lai)* అధిపతిగా నియమితుడైనాడు. 1924లోనే సన్ కొమింగ్‌టాంగ్ నూతన సిద్ధాంతాలను ప్రకటించాడు.

## 22.6 కొమింగ్‌టాంగ్ నూతన సిద్ధాంతాలు

1924 జనవరి లో పునర్‌వ్యవస్థీకరించిన కొమింగ్‌టాంగ్ పార్టీ ప్రథమ సమావేశం, కాంటన్‌లో జరిగింది. మావో హునాన్ ప్రతినిధిగా ఈ సమావేశానికి హాజరయ్యాడు. ఈ సమావేశంలో, డాక్టర్ సన్-యట్-సేన్ కొమింగ్‌టాంగ్ పార్టీ సిద్ధాంతాలను ప్రకటించాడు. కొమింగ్‌టాంగ్ సిద్ధాంతాలు, లేక జాతీయ విప్లవతత్వాన్ని తెలుసుకోడానికి ఈ కింది సూత్రాలనుపయోగించాడు.

1. 1924 కాంగ్రెస్‌లో అమలుపర్చిన పార్టీ ప్రకటన.

2. సన్ మూడు సూత్రాలు, లేక పార్టీ ప్రకటన పత్రం.

3. 1924 ఏప్రిల్ 12 న చేసిన జాతి పునర్నిర్మాణానికి ప్రాథమిక సూత్రాలు.

4. డా॥ సన్ మరణానికి ముందు తయారు చేసిన వీలునామా.

డా॥ సన్-యట్ - సేన్ చైనా ప్రజల కొరకు మూడు సూత్రాలను సిద్ధాంతపరంగా వివరించాడు. అవి, 1. జాతీయతావాదం 2 ప్రజాస్వామ్యం 3. ప్రజాజీవనోపాధి. వీటినే, సన్ -మెన్-చు, అనీ వ్యవహరిస్తారు, ఈ మూడు సిద్ధాంతాల్లో ,సన్ జాతీయతావాదానికి ప్రముఖ స్థానమిచ్చాడు. ఆకాలంలో, చైనాలో జాతీయతాభావం అంతగా ప్రబలలేదు. ప్రజల ఆలోచనలు గ్రామం, జిల్లా, రాష్ట్రాలవరకే పరిమితమై ఉన్నాయి. ఈ పరిస్థితిని గమనించిన సన్, మంచూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నిర్వహించాడు. ఈ ఉద్యమ ప్రభావ ఫలితాలు ప్రజల్లో జాతీయతాభావాన్ని వెలికితీశాయి. చైనీయులంతా సమైక్యతతో, ఒక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పర్చుకోవాలని డా॥ సన్ వాంఛించాడు. చైనాలో నిజమైన జాతీయతావాదం అభివృద్ధి చెందటానికి కొమింగ్‌టాంగ్ పార్టీ దోహదకారి కాగలదని అతడు నమ్మాడు.

జాతి పునర్నిర్మాణానికి డా॥ సన్ చెప్పిన రెండో సిద్ధాంతం, ప్రజాస్వామ్యం. ప్రభుత్వమనేది ప్రజల సార్వభౌమాధికారంపై ఆధారపడి ఉండాలని సన్ చెప్పాడు. ప్రభుత్వం శక్తివంతంగా ప్రజల అభిప్రాయానికనుగుణంగా పనిచేయడానికి ప్రజల చేతిలో ఈ నాలుగు అధికారాలుండాలని, సన్ సూచించాడు. అవి :

1. ఎన్నికలు (Elections) 2. ఉపసంహరణ (Recall) 3. ప్రేరణ (Initiative) 4. ప్రజాభిప్రాయ సేకరణ (Referrendum) ప్రజలకు ఈ నాలుగు అధికారాలున్నప్పుడు ప్రజాస్వామ్యం పరిపూర్ణమౌతుందని డాక్టర్ ॥ సన్ చెప్పాడు. చైనా ప్రజలకు మంచి ప్రభుత్వాన్ని ఏర్పర్చుకునేందుకు, శిక్షణలో భాగంగా ప్రజాస్వామ్యాభివృద్ధికై మూడు దశల పరిణామ క్రమాన్ని సన్ పేర్కొన్నాడు. మొదటి దశ సైనిక పాలన, రెండో దశ రాజకీయ సంరక్షణ. ఈ రెండు దశల్లో విజయవంతమైన తర్వాత మూడో దశ రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం. ఈ విధంగా, ప్రజాస్వామ్యాన్ని దశల వారీగా, నెమ్మదిగా, పరిణామ క్రమంలో ఏర్పాటు చేయాలని సన్ ప్రతిపాదించాడు.

BRAOU

డా॥ సన్ ప్రతిపాదించిన మూడో సిద్ధాంతం ప్రజా జీవనోపాధి. చైనా వ్యవసాయప్రధాన దేశం కావడంతో, రైతుల జీవనోపాధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సన్ బోధించాడు. అతని అభిప్రాయంలో జీవనోపాధి సిద్ధాంతమే. సోషలిజం, కమ్యూనిజమే ఆదర్శం. ఈ భావనలో జీవనోపాధి సిద్ధాంతమనేది ఆచరణాత్మకమైన కమ్యూనిజం. "చైనాలో మూలధనాన్ని నియంత్రించాలని, విదేశీయుల ఆర్థిక దోపిడీనంతంచేసి, ఆర్థికాభివృద్ధిని సాధించాలని సన్ వాంఛించాడు.

డా॥ సన్ ప్రతిపాదించిన ఈ మూడు సిద్ధాంతాలు కొమింగ్‌టాంగ్ సిద్ధాంతాలై, చైనీయులను బాగా ఆకర్షించాయి. ఈ సిద్ధాంతాలే, చైనా దేశ ఉనికికి ఆధారమై, సమైక్య కొమింగ్‌టాంగ్ చైనాకు ప్రధాన లక్ష్యమైంది.

## 23.6 చైనా కమ్యూనిస్టుల మధ్య విభేదాలకు దారితీసిన పరిస్థితులు

కొమింగ్‌టాంగ్‌లో వ్యవస్థాపరంగా ఐక్యత సాధించిన తర్వాత డా॥ సన్ యుద్ధ ప్రభువుల ( War Lords )అధికారాల్ని తొలగించడానికి, సామ్రాజ్యవాదుల అనుయాయులను అణచి వేయడానికి, ఉత్తర దండయాత్ర చేయాలని, ప్రణాళిక సిద్ధంచేశాడు. ఉత్తర చైనాను ఆక్రమించుకోకపోతే, 'చైనా ఏకీకరణ' అనే లక్ష్యం నెరవేరదని అతడు భావించాడు. సన్ ఈ యుద్ధాన్ని నడిపే కాలంలో, అతని మిత్రుడైన ఫెంగ్-

యు- సియాగ్, పెకింగ్‌లో జాతీయ ఏకీకరణ సమావేశానికి రావాల్సిందిగా అతడు సన్-యట్-సేన్‌ను ఆహ్వానించగా, అతడు పెకింగ్‌కు వెళ్లాడు. ఈ సమావేశ కాలంలోనే డా॥సన్ తీవ్ర అస్వస్థకు లోనై, మార్చి 1925 మార్చి 2 వ తేదీ న మరణించాడు. డా॥సన్ పార్టీ సభ్యులనుద్దేశించి ప్రతిపాదించిన త్రివిధ సూత్రాలను ప్రజలు 'జాతీయ బైబిల్'గా పరిగణించారు. సన్ తన మరణానికి ముందు," పోరాటం పూర్తి కాలేదు. పోరాటం సాగించండి. కామ్రేడ్స్" అనే తన చివరి సందేశాన్ని చైనా దేశ ప్రజలకిచ్చాడు. తన జీవిత కాలం చైనా దేశ శ్రేయస్సు కోసం సమైక్యత కోసం, అంకితం చేసిన డా॥ సన్ మరణం, చైనాను తీవ్ర దిగ్ర్భాంతికి లోనుచేసింది. చైనా ప్రజల దృష్టిలో అతడు ఒక ప్రసిద్ధ జాతీయ నాయకుడిగానూ, నూతన చైనా కన్ఫూషియన్‌గాను ప్రసిద్ధికెక్కాడు.

డా॥ సన్ మరణానంతరం, 1925 జులై 1 న కాన్‌కన్‌లో వాంగ్-చింగ్-వి అధ్యక్షతన జాతీయ ప్రభుత్వం ఏర్పాటైంది. 1926 జనవరిలో చాంగ్-కై-షేక్‌ను జాతీయ ప్రభుత్వం, సైన్యాధిపతిగాను, స్థాయీ సంఘానికి అధ్యక్షునిగాను నియమించింది. కానీ, మొత్తంమీద జాతీయ ప్రభుత్వంలో లెఫ్ట్ వింగ్ ఆధిక్యాన్ని పొందింది.

డా॥ సన్-యట్-సేన్ మరణం తర్వాత, కొమింగ్‌టాంగ్‌లో కమ్యూనిస్ట్ వ్యతిరేకత కూడా అధికమైంది.1925 జులై లో తామె-చి-తావో అనే కొమింగ్‌టాంగ్ టీచర్ డా॥ సన్ త్రివిధ సిద్ధాంతాలను బహిరంగంగా అంగీకరించకపోతే, కొమింగ్‌టాంగ్ నుండి వెళ్లిపోవాల్సిందిగా కమ్యూనిస్ట్‌లకు సూచించాడు. చైనా వ్యవహారాల్లో రష్యా ఆధిపత్యం ఎక్కువైంది. చాంగ్-కై-షేక్ పార్టీలో రష్యా ఆధిపత్యాన్ని సహించలేకపోయాడు. కానీ, కమ్యూనిస్ట్‌లతో విభేదించడానికి అవకాశం కోసం చూడసాగాడు. ఈ సమయంలో, బోరోడిన్ షెంగ్-యూ-సియాంగ్‌తో సంప్రదింపులకు కాంటన్ విడిచి వెళ్లాడు. 1926 మార్చి 18 న కాంటన్ దగ్గర ఉన్న నదిలో లంగరువేసి వున్న కొమింగ్‌టాంగ్ యుద్ధ నౌకకు చుంగ్-ఫాన్ కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడైనఇన్ చార్జ్ఆఫీసరు, తను పొందిన ఆదేశం ప్రకారం, యుద్ధ నౌకతో వాంపోవా అకాడమీ చేరుకున్నాడు. కానీ, అక్కడ యుద్ధ నౌక అవసరం లేక పోవడంతో, కాంటన్‌కు తిరిగి వెళ్లాడు. చాంగ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఆదేశాల ప్రకారం, ఆ నౌకాధికారి వాంపోవాలోనే ఉండాలనీ, ఆ ఆదేశాలనుల్లంఘించాడనే నేరం కింద, అతనిని అరెస్ట్ చేసి చంపించాడు. అంతేకాక, ఆ యుద్ధ నౌకలో పనిచేస్తున్న కమ్యూనిస్ట్‌లందరినీ అరెస్ట్ చేశాడు. కొమింగ్‌టాంగ్ లో ముఖ్య స్థానాల్లో ఉన్న కమ్యూనిస్ట్‌లనందరినీ తొలగించాడు. కాంటన్‌లోని రష్యా మిలటరీ శిక్షకులందరి వద్ద నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాడు. తన సొంత సైనిక దళాలను పంపి అన్ని కార్మిక సంఘాల కార్యాలయాలను, రైల్వేస్టేషన్లను, బ్యాంకులను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. చాంగ్-కై-షేక్ మెరుపుదాడి కమ్యూనిస్ట్‌లను తీవ్ర దిగ్ర్భాంతికి గురిచేసింది. 1926 ఏప్రిల్ 29 న కాంటన్‌కు తిరిగొచ్చిన బోరోడిన్ పరిస్థితులను గమనించి, చాంగ్ చర్యను అసహ్యించుకున్నా, ఒక కమ్యూనిస్ట్‌గా చాంగ్‌తో ఉన్న రాజకీయ అవసరాన్ని గుర్తించాడు. కాంటన్‌లో ఉన్న రష్యా కొమింగ్‌టాంగ్ సలహాదారులు, కొమింగ్‌టాంగ్‌తో సయోధ్య కొనసాగించడానికే నిర్ణయించారు. ఈ సమయంలో, స్టాలిన్ ఒక ప్రకటనలో "కొమింగ్‌టాంగ్ పార్టీలో ఉండడానికి, కొమింగ్‌టాంగ్ నుండి మితవాదులను వెళ్లగొట్టటానికి, కమ్యూనిస్ట్‌లు కృషి చేయాలి" అని ఉద్ఘాటించాడు. మొదట, షాంఘై లోని కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ 1927 మార్చిలో కమ్యూనిస్ట్‌లపై జరిగిన చర్యలపై తీవ్రంగా ప్రతిస్పందించి, కొమింగ్‌టాంగ్‌నుండి తప్పుకోవాలని ప్రకటించింది. కాని, రష్యా అధికార వార్తా సంస్థ ప్రావ్దా, చిన్ సమర్థనను తీవ్రంగా ఖండించింది. రష్యా కొమింగ్‌టాంగ్ నుండి వచ్చిన ఆదేశాలను చిన్ పాటించాల్సివచ్చింది.

కొమింగ్‌టాంగ్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకున్న తర్వాత చాంగ్-కై-షేక్ రష్యాతో, చైనా కమ్యూనిస్ట్‌లతోను శాంతి కోసం చర్యలను చేపట్టాడు. యుద్ధ నౌక వ్యవహారం, చైనా కమ్యూనిస్ట్ పార్టీ

BRAOU

నేరాలోచన కాదని, అది ఒక ఒక్క అధికారిదేనని ప్రకటించాడు. కొమింగ్‌టాంగ్‌కు చైనా ఏకీకరణకు రష్యా సలహాదారుల సహాయ సహకారాలు అవసరమని భావించి, వారితో చర్చలు జరిపాడు. ఉత్తర దండయాత్రకు రష్యా ఆర్థిక, ఆయుధ అవసరం ఉంటుందని గ్రహించి, సహాయాన్ని కోరాడు. ఎటువంటి షరతులు లేకుండా, కమ్యూనిస్టుల సహాయం రావడంతో చాంగ్ సంతోషించాడు. కొమింగ్‌టాంగ్‌లో కమ్యూనిస్టులను వ్యతిరేకించే రైట్ వింగ్ సభ్యులను పార్టీనుండి బహిష్కరించాడు. వారితో షాంఘైలో వేరొక పార్టీని ఏర్పాటు చేసుకున్న తర్వాత రష్యా, చైనా కమ్యూనిస్ట్ పార్టీ, చాంగ్-కై-షేక్ ఉత్తర దండయాత్రకు పూర్తి మద్దతు ప్రకటించాయి.

## 23.7 ఉత్తర దండయాత్ర – చాంగ్-కై-షేక్ పాత్ర

1926 జనవరి లో సైనిక దళాల ప్రధానాధికారిగా నియమితుడైన చాంగ్-కై-షేక్ 1928 ఏప్రిల్ లో ఉత్తర దండయాత్రను ప్రారంభించాడు. 1926 జులై లో కొమింగ్‌టాంగ్ కేంద్ర కార్యనిర్వాహక కమిటీకి చైర్మన్‌గా, చాంగ్-కై-షేక్ నియమితుడైనాడు. పార్టీ రాజకీయ, సైనిక విభాగాలపై చాంగ్‌కు పూర్తి ఆధిపత్యం లభించింది. 1926, జులై చివరి నాటికి, చాంగ్ అధ్వర్యంలో గల లక్షమంది సైన్యం తయారైంది. దండయాత్ర వ్యూహాన్ని రష్యా సలహాదార్ల అధిపతైన జనరల్ బ్లూచర్ రూపొందించాడు. సైన్యం రెండు భాగాలుగా చీలి ఒక మార్గం హునాన్ నుండి, మరో మార్గం కీయాంగ్సీ నుండి దాడికి సిద్ధమైంది. చాంగ్ కీయాంగ్సీ నుండి వెళ్ళే విభాగాన్ని పర్యవేక్షించాడు. చాంగ్-కై-షేక్ సొవియట్ వస్తు సామాగి సహాయంతో, కమ్యూనిస్ట్ పార్టీ సహకారంతో, 1927 మార్చి నాటికి, దక్షిణ చైనాను ఆక్రమించాడు. మరో జాతీయ సైన్య విభాగం, మూడు ముఖ్యమైన యాంగ్‌ట్జె నగరాలైన హాంకా-వుచాంగ్, హన్ యంగ్‌లను 1926 అక్టోబర్ లో ఆక్రమించుకుంది. కొద్దికాలంలోనే, కొమింగ్‌టాంగ్ కేంద్ర కార్యాలయం కాంటన్‌నుండి హాంకాకు మార్చడం జరిగింది. 1928 జూన్ నాటికి, మంచూరియా తప్ప చైనాలోని చాలా భాగం చాంగ్-కై-షేక్ ఆధీనంలోకి వచ్చింది. చాంగ్ 1928 నుండి 1931 వరకు, అన్ని భాగాల నాక్రమించి సమైక్య జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాడు.

ఉత్తర దండయాత్ర జరుగుతున్న కాలంలో చాంగ్-కై-షేక్‌కు కమ్యూనిస్టుల మధ్య మరల విభేదాలు తలెత్తాయి. కమ్యూనిస్టులు పార్టీలోని రైట్ వింగ్ వారిని తీసివేయసాగారు. చాంగ్ సైన్యం లో కమ్యూనిస్టులను ఏరివేయడం ప్రారంభించాడు. ఈ విధంగా, ఇరు వర్గాలు పైకి స్నేహం నటిస్తూనే, లోలోపల ఒకరినొకరు అనుమానించకోసాగారు. హాంకాలో కమ్యూనిస్టుల ఆధిపత్యంలో ఉన్న కొమింగ్‌టాంగ్ ప్రభుత్వం, ప్రభుత్వనేతగా వాంగ్-చింగ్-వీని ఆహ్వానించింది. నాన్‌కింగ్ లో చాంగ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. 1927 మార్చి 21న షాంఘైలో కార్మికుల జనరల్ సమ్మెకు కమ్యూనిస్ట్ పార్టీ పిలుపునిచ్చింది. చాంగ్ తన జాతీయ దళాలను షాంఘైకి పంపాడు. 1927 ఏప్రిల్ 12న జాతీయ దళాలు హఠాత్తుగా కార్మికులపై, కార్మిక సంఘాలపై, ఇతర వామపక్ష దళాలపై దాడి చేశాయి. షాంఘై, నాన్‌కింగ్‌లో ఉన్న అన్ని వామ పక్ష సంస్థలనూ ఆక్రమించుకున్నాయి.

ఈ కాలంలోనే, కమ్యూనిస్ట్ పార్టీ ప్రజా ఉద్యమాలు, ముఖ్యంగా, రైతు ఉద్యమాలు, అతివేగంగా వ్యాప్తి చెందాయి. భూమి పంపకంకోసం జరిపిన రైతాంగ ఉద్యమం, చైనా విప్లవ పోరాట చరిత్రలో కేంద్ర స్థానమాక్రమించింది. వ్యవసాయ విప్లవోద్యమ పెరుగుదల చూసి భయపడి, కొమింగ్‌టాంగ్ లెఫ్ట్ ఫ్రంట్ వ్యవసాయ విప్లవానికి వ్యతిరేకంగా, చాంగ్‌తో చేతులు కలిపింది. చాంగ్-కై-షేక్ ప్రభుత్వంతో కలిసి కమ్యూనిస్టులపై యుద్ధం ప్రకటించి, చైనా కమ్యూనిస్టుల్ని ఆదుపులోకి తీసుకోడం ప్రారంభించాడు. దానినుండి తప్పించుకొని, నగరం నుండి పోవడానికి కూడా, కమ్యూనిస్టులకు సమయం లేకపోయింది. 1928 నాటికి, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ పార్టీ మధ్య ఐక్యత పూర్తిగా చీలిపోయి, అంతర్యుద్ధం ప్రారంభమైంది. చైనా ఉత్తర దండయాత్రలో కమ్యూనిస్టుల ఓటమి వల్ల, చాంగ్ బాగా లాభం పొందాడు. హాంకాలోని

కొమింగ్‌టాంగ్ లెఫ్ట్ వింగ్ చాంగ్, ప్రభుత్వంతో కలిసి పోవడంతో, 1931 నాటికి చాంగ్, చైనా ఏకీకరణను సాధించాడు.

## 23.8. కమ్యూనిస్ట్‌ల దీర్ఘ యాత్ర

నాన్‌కింగ్‌లో చాంగ్-కై-షేక్ నాయకత్వంలో ఏర్పాటైన జాతీయ కొమింగ్‌టాంగ్‌ల ప్రభుత్వం, అంతర్గతంగా సాగిస్తున్న పోట్లాటలు, అసంతృప్తులైన రాజకీయ నాయకులను, తిరుగుబాట్లు చేసే యుద్ధ ప్రభువులను, ఆగ్నేయ చైనాలో మావో నాయకత్వంలో విజృంభిస్తున్న కమ్యూనిస్ట్ పార్టీ ప్రతిఘటనలను ఎదుర్కోవల్సి వచ్చింది. షాంఘై ఉత్తర చైనా మంచూరియాల్లో, జపాన్ దాడులను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ముఖ్యంగా, చాంగ్‌చాలా శక్తిని, సమయాన్ని, కమ్యూనిస్ట్‌ల ఉద్యమ అణచివేతకు ఉపయోగించి విఫలుడైనాడు. 1927 లో కొమింగ్‌టాంగ్‌తో చీలిపోయిన తర్వాత, కమ్యూనిస్ట్ పార్టీ క్రమంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. క్రీ.శ. 1934 లో జాతీయ పార్టీ దాడులనుండి కమ్యూనిస్ట్ పార్టీని రక్షించడానికి, సామ్రాజ్య వ్యతిరేక విప్లవ వ్యాప్తికై, మావో ఈ దీర్ఘ యాత్రను ఆరంభించాడు. ఈ దీర్ఘ యాత్ర ఆధునిక చైనా చరిత్రలో ఒక గొప్ప ఐతిహాసిక ఘట్టం. ఇంతకుముందు చరిత్రలో ప్రజలెవరూ చేయనటువంటి ప్రమాదభరితమైన, సాహసోపేత దీర్ఘ యాత్రను మావో నడిపించాడు. ఈ దీర్ఘ యాత్రకు దారితీసిన పరిస్థితులనేకం ఉన్నాయి.

### 23.8.1 కారణాలు

కొమింగ్‌టాంగ్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీల విప్లవ పంథాను, ఎల్లప్పుడు తీవ్రంగా ప్రతిఘటిస్తూ వచ్చింది. 1926, 27 లలో చాంగ్-కై-షేక్ ఇతర మితవాద కొమింగ్‌టాంగ్ సభ్యులు కమ్యూనిస్ట్ పార్టీని కొమింగ్‌టాంగ్ నుండి వెళ్లగొట్టడానికి ప్రయత్నించారు. ఈ విధంగా, రెండు పార్టీల మధ్య చీలిక ఏర్పడి అంతర్యుద్ధానికి దారితీసింది. చైనా కమ్యూనిస్ట్ పార్టీ పట్టణాల్లో కార్మిక సంఘాలను, పల్లెల్లో రైతు సంఘాలను, సమీకరించి, నిర్వహించడానికి తీవ్రంగా కృషి చేసింది. 1927 మార్చి 21 తేదీన షాంఘైలో కార్మికుల సాధారణ సమ్మెకు పిలుపునిచ్చింది. కాని, చాంగ్-కై-షేక్ భూస్వాముల ప్రోద్బలంతో, కార్మిక వర్గాలపైన, కమ్యూనిస్ట్‌లపైన సాయుధ దాడి జరిపాడు. ఒక్క షాంఘై పట్టణంలోనే 5 వేలమంది కమ్యూనిస్ట్‌లను కాల్చివేయడం జరిగింది.ఈ దశలో, కమ్యూనిస్ట్ పార్టీ అతివాద కొమింగ్‌టాంగ్ పార్టీతో, ఐక్యసంఘటన ఎత్తుగడల కార్యక్రమాలు చేపట్టింది. కానీ, ఇది ఎక్కువ కాలం నిలవలేదు. 1926 నుండి మావో వ్యవసాయ విప్లవం కీలకంగా ఉండాలని భావించి, రైతు ఉద్యమాన్ని నడిపాడు. 1929-30 మధ్య కాలం నాటికి, దక్షిణ చైనాలో సోవియట్‌ల ప్రాబల్యం పెరిగిందని. రైతాంగానికి భూములను పంచారు. కానీ, అధిక భాగం కొమింగ్‌టాంగ్ ఆధీనంలోనే ఉంది. ఈ పరిస్థితుల్లో, కమ్యూనిస్ట్ పార్టీ విప్లవ సాధనకై అవలంబించాల్సిన ఎత్తుగడలను వివరిస్తూ, మావో "చైనా ఎదుర్కొంటున్న పరిస్థితులను బట్టి, చైనా విప్లవం దీర్ఘకాల పోరాటం ద్వారానే సాధించగలదు"అని అన్నాడు. "మొదట గ్రామీణ ప్రాంతాల్లో విప్లవ కేంద్రాలను ఏర్పర్చుకొని, తర్వాత క్రమక్రమంగా పట్టణాల నాక్రమించుకొని, అంతిమ విజయం సాధించడం దీని ప్రధాన ఎత్తుగడగా ఉండాలనీ, ఇది చైనా విప్లవానికి సరికొత్త విప్లవ పోరాట ఎత్తుగడగా ఉండాలనీ" మావో నిర్వచించాడు.

కొమింగ్‌టాంగ్ ప్రభుత్వాన్ని ధిక్కరించి, కమ్యూనిస్ట్‌లు సోవియట్ల ఏర్పాటును, భూసంస్కరణల అమలు జరపడాన్ని నిరసిస్తూ, వ్యవసాయ విప్లవం దేశవ్యాప్తమౌతుందనీ భయపడి, కొమింగ్‌టాంగ్ సైన్యాలు 1930నుండి 34 వరకు సోవియట్లపై 5సార్లు దాడిచేశాయి. దీర్ఘ యాత్ర ద్వారా దేశంలోని విప్లవ శక్తుల్ని సమీకరించి, సోవియట్లపై కొమింగ్‌టాంగ్ సైన్యాల దాడుల్ని ప్రతిఘటించాలనీ, మావో నిర్ణయించుకున్నాడు.

1931 లో జపాన్ మంచూరియాపై యుద్ధం ప్రకటించినప్పుడు, కొమింగ్‌టాంగ్ ప్రభుత్వం

కమ్యూనిస్ట్‌ల అణచివేత కార్యక్రమంలో నిమగ్నమై, చైనాపై జపాన్ సైన్యం ఆక్రమణను, పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో జపాన్‌ను ప్రతిఘటించడానికి ఐక్యసంఘటనకై కమ్యూనిస్ట్‌లు యిచ్చిన పిలుపుకు చాంగ్-కై-షేక్ స్పందించలేదు. అందువల్ల, ఎర్ర సైన్యం దక్షిణ ప్రాంతం నుండి ఉత్తర ప్రాంతానికి వెళ్లి, జపాన్ సామ్రాజ్యవాదుల దురాక్రమణను నేరుగా ప్రతిఘటించాలని నిర్ణయించింది. ఒకవైపు ప్రతిఘటన కొనసాగిస్తూ, మరో వైపు జపాన్ వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటనకు ప్రజలను సమీకరించాలని కమ్యూనిస్ట్ పార్టీ నిర్ణయించింది.

దక్షిణ చైనాలో, ఎర్రసైన్యం కంటే ఆయుధాలలో, సంఖ్యలో అనేక రెట్లు బలంగల కొమింగ్‌టాంగ్ దిగ్బంధన ఎత్తుగడలవల్ల, ఎర్రసైన్యానికి సంభవించింది. అందువల్ల ఎర్రసైన్యం దక్షిణ ప్రాంతాన్ని వదలి, ఉత్తర చైనాకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ విధంగా, 1934, అక్టోబర్ 16 న చైనా ఎర్రసైన్యం ఉత్తరానికి, చారిత్రాత్మక దీర్ఘ యాత్రను (Long March) ప్రారంభించింది.

## 23.8.2 గమనం

కమ్యూనిస్ట్ దీర్ఘ యాత్రలో మొత్తం మీద, చైనా ఎర్రసైన్యం దక్షిణ ప్రాంతం నుండి ఉత్తర ప్రాంతం చేరడానికి దాదాపు 6000 మైళ్లు నడిచింది. క్యాంటుంగ్, హునాన్, క్యాంగ్సీ, క్వీచ్, యునాన్, సింకాడ్, షెచువాన్, కాన్సు, షెన్సీ మొదలైన ఎనిమిది రాష్ట్రాలగుండా అనేక నదులు, గుట్టలు, కొండలు దాటి, దీర్ఘ యాత్రను కొనసాగించింది. 1934 అక్టోబర్ 16న కియంగ్సీ నుండి 135 మంది స్త్రీలతో కూడిన ఒక లక్షమంది ఎర్రసైన్యం బయలుదేరి, 1935, అక్టోబర్ 20 న షెన్సీ రాష్ట్రానికి చేరుకుంది. ఈ సైన్యాన్ని రెండు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగం, మావో, జనరల్ చూటే నాయకత్వంలో బయలుదేరింది. ఈ క్రమంలో, వీరు 18 పర్వత శ్రేణులను, 24 నదులను, ఎన్నో ఎడారులను, భయంకరమైన ఊబి ప్రాంతాలను ఆటవిక జాతుల ప్రాంతాలనధిగమించారు. వీటన్నింటినీ మించి, నిరంతరం భూమి నుండి ఆకాశంనుండి కొమింగ్‌టాంగ్‌లు జరిపే దాడుల నెదుర్కోవాల్సి వచ్చింది. రాష్ట్రాలకు చెందిన స్థానిక ప్రభువుల దాడులను కూడా, ఎర్రసైన్యం ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ సుదీర్ఘ యాత్రలో, ఎర్రసైన్యం 200 పైనే యుద్ధాలను చేసింది. 22 కోట్ల ప్రజానీకం నివసించే రాష్ట్రాలను దాటింది. 60కి పైగా నగరాలు, 100 కిపైగా పట్టణాలను స్వాధీనం చేసుకున్నది. వేలాది ఎర్రసైనికులు యుద్ధంలో మరణించారు. చాలా మంది నదీ ప్రవాహంలో కొట్టుకొనిపోగా, మరికొంతమంది అంటువ్యాధుల వల్లనూ, చలిగాలుల వాతపడి మరణించారు. చివరికి, షెన్సీకి 20 వేల మంది మాత్రమే ప్రాణాలతో చేరుకున్నారు. ఈ సాహస యాత్ర మానవుని ఓర్పు, సహనానికి ప్రతీక. ఎర్రసైన్యం కొమింగ్‌టాంగ్‌తోనూ, యుద్ధ ప్రభువులతోనూ, భూస్వాములతోనూ పోరాడుతూండగా, కమ్యూనిస్ట్ మేధావులు సోషలిస్ట్ విద్యా విధానం, విప్లవ ప్రచారాన్ని కొనసాగించారు.

దీర్ఘ యాత్ర ప్రారంభంలో, ఎటువంటి ప్రణాళిక లేకుండా, కొమింగ్‌టాంగ్ కబంధహస్తాల నుండి తప్పించుకోడం కోసం, ఉత్తరాన 100 మైళ్లదూరంలో ఉన్న షెన్సీకి ఎర్రసైన్యం ప్రయాణం ప్రారంభించింది. అందువల్ల, ప్రారంభంలో ఎర్రసైన్యంపై చాంగ్-కై-షేక్ గట్టిదెబ్బతీసి, వారికి భారీ నష్టం కలుగ చేశాడు. దాంతో ఎర్రసైన్యం ఎంతో జాగ్రత్తగా, శత్రువుల కన్ను గప్పుతూ ప్రయాణం సాగించింది. కీయాంగ్సీ నుండి హునాన్‌లో ప్రవేశించేటప్పుడు, సియాంగ్‌నది ఒడ్డున భారీ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఎర్రసైన్యం గెలిచింది. కానీ, 25 వేల మంది సైనికులను పోగొట్టుకుంది. 1934 డిసెంబర్ లో, ఎర్రసైన్యం లిపింగ్ నగరాన్ని వశపర్చుకుంది. ఈ నగరం వీచావో రాష్ట్రంలోనిది. వీచావో లో ఎర్రసైన్యం కొంతకాలం విశ్రాంతి తీసుకున్నది. వీచావోలో ఎర్రసైన్యం చాలా కాలం తీసుకున్న విశ్రాంతిని చాంగ్‌బాగా ఉపయోగించుకొని, ఎర్రసైన్యం యాత్రా మార్గాలనన్నింటిని మూసివేశాడు. కానీ, టిబెట్ పీఠభూమిలోకి వెళ్లే ఎడారి మార్గాన్ని

వదిలేశాడు. ఆ మార్గంలో, యాంగ్‌ట్జే నదిపైనున్న బ్రిడ్జిని కూల్చివేసి, ఎటువంటి నౌకలు వారికి అందుబాటులో లేకుండా చేసి, వారు ఆ మార్గాన్ని దాటడం అసాధ్యం అనుకున్నాడు. అయితే, మావో అవలంబించిన గెరిల్లా ఎత్తగడలు కొమింగ్‌టాంగ్‌లను మోసపుచ్చాయి. యాంగ్‌ట్జే వెదురుకర్రల వంతెనన్ను కట్టడానికి మావో ఒక పెద్ద దళాన్ని పంపాడు. కొమింగ్‌టాంగ్ తన దృష్టినంతటినీ దానిపైనే కేంద్రీకరించింది. ఆ సమయంలో, కొద్దిమంది ఎర్రసైన్యం కొమింటాంగ్ దుస్తులను ధరించి, స్థానిక భూస్వాముల నుండి చిన్న పడవలను సంపాదించి, వాటి సహాయంతో, చాంపింగ్ అనే ప్రాంతంలో ఎర్రసైన్యం యాంగ్‌ట్జే నదిని దాటింది. ఎర్రసైన్యం నదిని దాటి, టిబెట్ పీఠభూముల్లోకి ప్రవేశిస్తున్నప్పటికి గానీ, భూస్వాములకు జరిగిన పొరపాటు అర్థంకాలేదు.

తమ గమనంలో ఎర్రసైనికులు టోటో తెగకు చెందిన ఆటవికులతో స్నేహం చేశారు. టాటు నదిని దాటడానికి టోటోలు సహాయం చేశారు. ఈ నది మహావేగంతో ప్రవహిస్తుండటంవల్ల, పడవలపై దాటటం కూడా అసాధ్యమైంది. టాటు నదిపై 1701 లో కాంగ్సీ చక్రవర్తి, ఇనుప తీగెలతో 300 అడుగుల ఎత్తున్న ఒక బ్రిడ్జిని నిర్మించాడు. తీగెల మధ్య చెక్కపలకలు పరిపించాడు. కొమింగ్‌టాంగ్ సైన్యం దీనిపై నున్న చెక్కలను తొలగించివేసి, చిన్న సైనిక దళాన్ని బ్రిడ్జికి కాపలాగా ఉంచింది. కొన్ని వందల మంది ఎర్రసైనికులు బ్రిడ్జిని దాట నిశ్చయించారు. వారు చేతుల ఆధారంతోనే, బ్రిడ్జ్‌పై ముందుకు సాగారు. శత్రువుల కాల్పులు, ఉధృతమైన గాలి పరిస్థితిని క్లిష్టం చేసింది. కొంతమంది చేతులు పట్టుజారి నదిలో పడిపోయారు. కొందరు శత్రువుల తూటాలకు బలైనారు. గట్టుకు చేరుకున్న అతి కొద్ది మంది తమ వద్ద నున్న గ్రేనేడ సుపయోగించి, బ్రిడ్జి రక్షణ దళాన్ని నాశనం చేశారు. ఆ తర్వాత, వారు బ్రిడ్జిపై చెక్క పలకలు పర్చగా, సైన్యమంతా 1935 మే 30 న టాటూ నదిని దాటింది.

ఎర్రసైన్యం, జ్సెచువాన్ పశ్చిమ ప్రాంత అడవులను దాటి, మా-లిన్-షన్‌ను అధిగమించింది. మార్గంలో, 16,300 అడుగుల ఎత్తున్న మంచు పర్వతాలను దాటాల్సి వచ్చింది. కానీ, అంత ఎత్తున్న పర్వతాన్నధిరోహించడానికి ఎర్రసైన్యం శారీరకంగా గాని, మానసికంగా గానీ సిద్ధంగా లేదు. అయినా ముందుకు సాగారు. చాలా మంది మంచుకు గడ్డకట్టుకు పోయారు, మరి కొంత మంది గుండెజబ్బులతో చనిపోయారు. లిన్-పియా-వో జబ్బునపడ్డాడు. వేల సంఖ్యలో జంతువులు మంచులో గడ్డకట్టుకుపోయాయి. అయినా, అన్ని కష్టనష్టాలనధిగమించి, ఎర్రసైన్యం1935 జులై లో జ్సెచువాన్ కు చేరుకుంది. అక్కడ వారు 4000 సైనికులతో గల త్సు-త్సి-యాంగ్ చియాన్ నాల్గోరెడ్ ఆర్మీతో కలిశారు. ఒకనెల విశ్రాంతి తీసుకున్న ఎర్రసైన్యం మళ్లీ రెండు విభాగాలుగా చీలి, ఒకటి మావో నాయకత్వంలో, మరొకటి చాంగ్-కు-హవో నాయకత్వంలో బయలుదేరింది.

మావో నాయకత్వంలోని 20 వేల మంది గల సైన్యంలో చేసిన ఈ ప్రయాణంలో, ఎర్రసైన్యం మొత్తం దీర్ఘయాత్రలో కెల్లా భయంకరమైన విపత్తుల నెదుర్కోవాల్సి వచ్చింది. దారిలో, ఎర్రసైన్యం 'మంట్సు' అనే ఆటవిక జాతి వారి దాడిని, ఎడతెరిపిలేని వర్షాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. మంట్సు ఆటవిక జాతివారు టొటో జాతి ప్రజల్లాగా, స్నేహపూరిత వ్యక్తులు కాదు. వీరికితోడు, వర్షం, పొగమంచు, భయంకరమైన ఊబి ప్రాంతాలు, ఈ యాత్రను భయానకంగా మార్చివేశాయి. ప్రతిచోటా, విపరీతంగా ఉన్న విషకారక దోమల బారిన ఎర్రసైన్యం పడింది. వీటికి తోడు, కొమింగ్‌టాంగ్ దళాలు వీరికి విశ్రాంతి నివ్వకుండా దాడులు కొనసాగించాయి. జనావాసంలేని ఈ ప్రాంతాల్లో, ఎర్రసైన్యం తినడానికి తిండిలేక, పుట్టగొడుగులు, పచ్చికూరలు, గడ్డివేళ్లు, దుంపలు తినేవారు. చివరకు, ఆకలి చల్లార్చుకోడానికి తోలు ముక్కలను నమలాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో, మంట్సు ఆటవికులు జరిపిన దాడుల్లో, ఎర్రసైన్యం భారీగా నష్టపోయింది. ఈ యాత్రలో, ఎంతోమంది ప్రజలతోబాటు జంతువులకూడా నశించిపోయాయి.

 ఎన్నో భయంకర అనుభవాల తర్వాత, షెన్సీ రాష్ట్రానికి పొరుగున వున్న కాన్సు ప్రావిన్స్‌కు ఎర్రసైన్యం

BRAOU




చేరుకుంది. ఇక్కడ కొమింగ్‌టాంగ్‌లతో మూడు పెద్ద యుద్ధాలు, అనేక చిన్నచిన్న దొమ్మీలలో పోరాడి, విజయం సాధించిన ఎర్రసైన్యం, చైనా మహాకుడ్యం (Great Wall of China) దగ్గరున్న తమ లక్ష్యమైన ఉత్తర షెన్సీకి 29 అక్టోబర్ 1935 న చేరుకుంది. మొత్తం దీర్ఘ యాత్రలో, ఎర్రసైన్యం 6000 సైనికులను కోల్పోయింది. యుద్ధం వల్ల, ఆర్థిక దిగ్బంధం వల్ల, కరువుకాటకాల వల్ల, దాదాపు 10 లక్షలమంది ప్రజలు ఈ కాలంలో హతులైనారు. చివరకు మిగిలిన సైన్యాలు ప్రజలతో కలిపి, 20 వేలు మాత్రమే. కమ్యూనిస్ట్ నాయకులు షెన్సీకి క్షేమంగా చేరుకున్నారు. మావో తన యాత్రలో చాలావరకు, కాలినడకనే నడిచాడు. అతని భార్య ఈ యాత్రలో ఎన్నో గాయాలకు గురై, ఒక బిడ్డను ప్రసవించే సమయంలో గడ్డుపరిస్థితులనెదుర్కొంది. చౌ-ఎన్-లై, చూ-టే అతని భార్య కాంగ్-కై-చీన్, లిన్-పి-యావో మొదలైన నాయకులందరూ షెన్సీకి చేరుకున్నారు. ఒక సంవత్సరం తర్వాత, 1936 లో చూ-టే, త్సు-షియంగ్-చియాన్ దళాలు షెన్సీకి చేరుకున్నాయి.

ఈవిధంగా ఎర్రసైన్యం తమ దీర్ఘ యాత్రలో చాంగ్-కై-షేక్ దాడుల నెదుర్కొంటూ, తమనుతాము రక్షించుకుంటూ, ఎంతోమంది సైనిక వీరులు మరణించినా లెక్కచేయక, భవిష్యత్తుపై అత్యంత విశ్వాసంతో ముందుకుసాగి, తమ లక్ష్యాన్ని చేరుకోగల్గింది. ఈ దీర్ఘ యాత్ర విజయానికి రెండు ముఖ్య కారణాలను వివరిస్తూ, మావో "ఎర్రసైన్యం దీర్ఘ యాత్ర జయప్రదంగా ముగించుకొని, తన బలాలను సుసంఘటితంగా ఉంచుకొని, కాన్స్, షెన్సీ రాష్ట్రాలు చేరడానికి మొదటి కారణం, కమ్యూనిస్ట్ పార్టీ యిచ్చిన సరైన నాయకత్వం, రెండోది, ఎర్రసైన్యం ప్రదర్శించిన ధైర్యం, నిశ్చలత, అంతులేని త్యాగం" అని పేర్కొన్నాడు.

BRAOU

### 23.8.3 ఫలితాలు

ప్రపంచ చరిత్రలోనే ఒక నూతన ఒరవడి కలిగించిన ఈ దీర్ఘ యాత్ర ఎంతో మంది నూతన కమ్యూనిస్ట్ నాయకులను చైనా కందించింది. మావోను 20వ శతాబ్ద ప్రజానాయకుల్లో, అతి ప్రసిద్ధునిగా చేసింది. ఎర్రసైన్యం, తమ యాత్రలో వీలుదొరికినపుడు, బహిరంగ సభల ద్వారా , నాటకాల ద్వారా, ప్రజల్లో రాజకీయ ప్రచారం చేసింది. తాము ప్రయాణం చేసిన ప్రాంతాలంతటా, రైతుల సహకారంతో, భూస్వాముల భూములను సామాన్య ప్రజలకు పంచుతూ, భూమిమీద పన్నులను రద్దుచేశారు. బానిసలను విముక్తి చేసినందువల్ల, రైతులు ఎర్రసైన్యాన్ని విమోచన సేనగా కొనియాడారు. లక్షలాది ప్రజలకు తమ హక్కుల్ని సాధించుకోడానికి, వ్యవసాయ విప్లవాన్ని చేయమని ఉద్బోధించి, వారికి ఆయుధాల నందచేశారు. ఈ ప్రాంతాల్లో, గెరిల్లా దళాల నిర్వహణకు అవసరమైన కార్యకర్తలను నియమించారు. ఈవిధంగా, ఎర్రసైన్యం కొమింగ్‌టాంగ్ యుద్ధ ప్రభువులు, భూస్వాములతో పోరాటం చేస్తుండగా, శిక్షితులైన కమ్యూనిస్ట్ మేధావులు, విప్లవ ప్రచారాన్ని కొనసాగించారు. సోషలిస్ట్ విధానాన్ని ప్రజల్లో వ్యాప్తిచేసి, చైనాను విప్లవ మార్గంవైపు మళ్లించారు. ఈ విధంగా, దీర్ఘ యాత్ర సామ్రాజ్యం వ్యతిరేక పోరాటానికి ప్రతీకగా నిల్చి, చైనా విప్లవానికి దారిచూపింది.

సుదీర్ఘ యాత్ర గమనంలోను, తర్వాత 1938 జనవరి లో త్సున్–ఇ – సమావేశంలోను, మావోకు సంపూర్ణాధికారం ఏర్పడింది. దీర్ఘ యాత్ర ప్రాధాన్యతను మావో వివరిస్తూ "లాంగ్‌మార్చ్ చరిత్రలో నమోదైన మొదటి యాత్రగా పరిగణించవచ్చు. అది ఒక వాగ్దాన పత్రమై (Manifesto) ఆందోళన దళాలుగా మొలకెత్తే, యంత్రాంగ విత్తనంగా భావించవచ్చు"అన్నాడు.

పన్నెండు నెలలవరకూ, ఎర్రసైన్యం రోజువారీ సైనిక పర్యవేక్షణ, కొమింగ్‌టాంగ్ దళాల ఆకాశ మార్గం నుండి బాంబుల వర్షాన్ని ఎదుర్కొంది. చెప్పశక్యంకాని కష్టాలనెన్నింటినో అతి ప్రయాసతో ఎదుర్కొని యాత్రను కొనసాగించిందని వివరించాడు. ఈ దీర్ఘ యాత్రను ఒక వాగ్దాన పత్రం గా ప్రపంచానికి ప్రకటిస్తూ మావో, "సామ్రాజ్యవాదుల నాయకుడైన చాంగ్–కై–షేక్, అతని అనుచరులు ఎర్రసైన్యం వీరులను చుట్టుముట్టి, వెంటాడి, అడ్డగించే ప్రయత్నంలో విఫలమైనారని స్పష్టమైంది. సుదీర్ఘ యాత్రలో ఎర్రసైన్యం, ఆందోళన దళాల ప్రాంతాలు, 200 మిలియన్ ప్రజల విముక్తి కోసం పోరాడించి. ఈ యాత్ర ప్రారంభ బీజ యంత్రాంగం, రాష్ట్రాల్లో కన్నా ఎక్కువగా గ్రామ ప్రాంతాల్లో మొలకెత్తి, శాఖోపశాఖలై పుష్పించి, ఫలాలను పండించి, భవిష్యత్తులో ఫలసాయానికి వచ్చింది"అని మావో వాఖ్యానించాడు.

## 23.9 చైనా జపాన్ యుద్ధం : కమ్యూనిస్ట్ – కొమింగ్‌టాంగ్‌ల తాత్కాలిక సఖ్యత

1931 లో జపాన్ మంచూరియాను ఆక్రమించుకొని, 1932 లో తన చెప్పుచేతుల్లో ఉండే మంచుకో ప్రభుత్వాన్ని స్థాపించింది. ఈ విషయంలో, నానాజాతి సమితి చైనా రక్షణకు రాలేకపోయింది. మంచూరియాపై జపాన్ దాడివల్ల, ప్రజల్లో జపాన్ వ్యతిరేకత ప్రబలింది. చారిత్రాత్మక దీర్ఘ యాత్ర తర్వాత, చైనా స్థితినర్థం చేసుకొన్న మావో, తమ నూతన స్థావరమైన షెన్సీ నుండి "జపాన్‌కు వ్యతిరేకంగా చైనీయుల ఐక్యత" అనే పిలుపునిచ్చాడు. 1935 జులై-ఆగస్టుల మధ్య, మాస్కోలో జరిగిన ఏడో కొమింటార్న్ కాంగ్రెస్ సమావేశం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ ఐక్యతకు పిలుపునిచ్చింది. దీనికి స్పందనగా, మావో నాయకత్వంలో ప్రజాసంస్థలైన జాతి విమోచన జపాన్ వ్యతిరేక సంఘం, జపాన్ వ్యతిరేక ప్రజా సమితి, జాతీయ విమోచన సమాజం మొదలైనవి ప్రారంభమై, ప్రజల్లో ముఖ్యంగా, యువతలో దేశభక్తిని ప్రేరేపించాయి. జపాన్ వ్యతిరేక ఆందోళనలు ప్రదర్శనలు, సమ్మెలు అధికమైనాయి. చాంగ్ పోలీసులతోబాటు, నీలిచొక్కాల దళాలను కూడా, ఈ ప్రదర్శనలను, సమ్మెలను అణచివేయడానికి ఉపయోగించుకున్నాడు.



BRAOU

కమ్యూనిస్ట్‌లు జపాన్‌కు వ్యతిరేకంగానే, దీర్ఘ యాత్ర సాగిందని ప్రకటించుకున్నారు. ఎర్రసైన్యం చైనా ప్రజల "జపాన్ వ్యతిరేక అగ్రశేణి ఎర్రసైన్యంగా" ప్రఖ్యాతి చెందింది. మావో చాంగ్ వ్యతిరేక వైఖరి కమ్యూనిస్ట్ ప్రయోజనాలు సాధించదని, పార్టీ సంఘటితం చేసుకోడానికై అంతర్యుద్ధం ఆపుచేయాలని, నిశ్చయించుకున్నాడు. "ఒక ఇంటిలో సోదరులు కలహపడితే, బయటివారు లాభపడతారు. కావున అంతర్యుద్ధాన్ని ఆపాలి. ఇది జాతికే కాక, దేశానికి కూడా ప్రస్తుతం ఎంతో అవసరమని" మావో ఉద్ఘాటించాడు. ఈ పిలుపు అతి త్వరలోనే దేశవ్యాప్తంగా ప్రబలి, విద్యార్థుల మీద, ఉపాధ్యాయుల మీద, మంచూరియా సైన్యం పైన, ఎంతో ప్రభావాన్ని చూపింది. మంచూరియా సైన్యం, దేశ సమైక్యత ముఖ్యమని భావించి, దేశం క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు, మరో చైనీయునితో పోరాడడానికి అయిష్టతను వ్యక్తం చేసింది. కాని, చాంగ్ ఆధునిక సైనిక బలం గల జపాన్‌తో పోరాడ్డానికి, చైనా సంసిద్ధంగా లేదని ప్రకటించాడు. చైనా డెమోక్రటిక్ ప్రభుత్వం ఏర్పడితే, దేశ ప్రయోజనం కోసం తాము కొమింగ్‌టాంగ్‌తో విలీనం కాగలనున్న కమ్యూనిస్ట్ ప్రతిపాదనలను చాంగ్ త్రోసిపుచ్చాడు. చాంగ్-త్సు-లిన్ ఆధ్వర్యంలోని సైనిక తిరుగుబాటును పరిశీలించడానికి సియాన్ వచ్చిన చాంగ్-కై-షేక్‌ను, లియాంగ్ సైనిక దళాలు బంధించాయి. అంతర్యుద్ధాన్ని ఆపివేసి,జపాన్‌కువ్యతిరేకంగా పోరాటం సాగించేటట్లైతే, చాంగ్‌ను వదిలి పెడతామని లియాంగ్ స్పష్టం చేశాడు. లియాంగ్ సైన్యాలు చాంగ్‌కు మరణశిక్షను విధించాలని ప్రయత్నించాయి. మార్షల్ కమ్యూనిస్ట్ చాంగ్‌కు మధ్య చర్చలను ఆహ్వానించాడు. మావో ఈ పరిస్థితుల్లో, చాంగ్-కై-షేక్ అసమాన నేతృత్వం చైనా పరిరక్షణకు, కొమింగ్‌టాంగ్ సమైక్యతకు అవసరమని భావించి, చాంగ్‌ను విడిపించడానికి, చౌ-ఎన్-లై ను సియాంగ్‌కు పంపాడు. చౌ-ఎన్-లై కృషి ఫలితంగా, చాంగ్‌ను విడుదల చేశారు. చాంగ్-కై-షేక్ నాయకత్వాన జపాన్ దురాక్రమణ ప్రతిఘటనోద్యమంలో పాల్గొనటానికి చౌ- కమ్యూనిస్ట్ పార్టీ సంసిద్ధతను తెలియపర్చాడు. చాంగ్ కమ్యూనిస్ట్‌లవ్యతిరేకతే కాక, దేశం మొత్తంలో అంతర్యుద్ధానికి వ్యతిరేకత ఎంత విస్తృతంగా ఉందో గ్రహించాడు. జపాన్ దురాక్రమణను ప్రతిఘటించాలనే ప్రజల పట్టుదలను కూడా, గమనించాడు. ఈ పరిస్థితుల ప్రభావం వల్ల, చాంగ్, అంతర్యుద్ధాన్ని అంతంచేసే, జపాన్ వ్యతిరేక ఐక్యసంఘటన నిర్మాణానికి అంగీకరించాడు. 1936 డిసెంబర్ 25న ఐక్యసంఘటన నిర్మాణానికై ఒక ఒడంబడిక కుదిరింది.

చౌ-ఎన్-లై,చాంగ్ ప్రభుత్వం మధ్య 1937 ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జరిపిన సంప్రదింపుల ఫలితంగా, కొమింగ్‌టాంగ్, 1937 జూన్ లో కమ్యూనిస్ట్‌ల యునైటెడ్ ఫ్రంట్ ఏర్పడింది. దీంతో, చైనా విప్లవ పోరాటంలో మరో ముఖ్యమైన దశ – జపాన్ వ్యతిరేక పోరాట దశ ప్రారంభమైంది. 1937 సెప్టెంబర్ 22,న మావో, చైనా విప్లవ సాధనకై, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల యునైటెడ్ ఫ్రంట్ అత్యావశ్యక విధులను గూర్చి ఒక ప్రకటన చేస్తూ, "ఈ రెండు పార్టీల కలయిక చైనాలో ఒక నూతన శకాన్ని సృష్టిస్తుందని, ఇది దేశవ్యాప్తంగా యుద్ధ ప్రతిఘటనలకై సమీకరించిన, ఒక నిజమైన జాతీయ సంఘటిత సమాఖ్య" అని, పేర్కొన్నాడు.

కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల యునైటెడ్ ఫ్రంట్ వల్ల, సోవియట్ ప్రాంతంపై విధించిన ఆర్థిక దిగ్బంధనం తొలగిపోయింది. కొమింగ్‌టాంగ్ ప్రాంతాల్లో కమ్యూనిస్ట్ వ్యాపార సంబంధాలను పునరుద్ధరించబడ్డాయి. అన్ని వర్గాల ప్రజలందరికీ, ఓటింగ్ హక్కు-ఇవ్వబడింది. ఈ యునైటెడ్ ఫ్రంట్ వల్ల, కమ్యూనిస్ట్‌లు తమ స్థానాన్ని సుస్థిర పర్చుకున్నారు. సోవియట్ ప్రాంతాల పరిధి ఒక లక్ష చదరపు మైళ్లకు పైగా విస్తరించింది.1937 సెప్టెంబర్ నాటికి, ఎర్రసైన్యం జాతీయ సైన్యానికి అనుబంధమైంది. ఎర్రసైన్యం, ఎనిమిదో రూట్ ఆర్మీగా మార్పుచెందింది. చూ-తే కమాండర్‌గా , తెన్-హుయి వైస్ కమాండర్‌గా నియమితులైనారు. సంయుక్త దళ యుద్ధ కమాండర్‌గా, జనరల్ వీ-లీ -హ్యాంగ్ డిప్యూటీ కమాండర్‌గా చూ-టేలు నియమితులైనారు. ఈ విధంగా, కమ్యూనిస్ట్ ఆర్మీ షాన్సీచాహర్,హపై, మొదలైన



B R A O U

సరిహద్దు ప్రాంతాల్లో అధిపత్యాన్ని పొందింది.

1937 జులై 7న చైనా జపాన్ యుద్ధం ఆరంభమైంది. జపాన్ దళాలు చైనాలోకి ప్రవాహంలా వచ్చిపడ్డాయి. పెకింగ్ వద్ద కొమింగ్‌టాంగ్ జపాన్ ప్రవేశానికి అనుమతించకపోవడంతో, జపాన్ కాల్పులు జరపగా, చైనా సైన్యాలు తిరిగి కాల్పులను జరిపారు. ఈ సంఘటన "కొమింగ్‌టాంగ్ ఉదంతమని మార్కోపోలో బ్రిడ్జ్ ఉదంతమని" పేరు పొందింది. చైనా ప్రభుత్వం, చైనీయులంతా ఏకమై, జపాన్‌తో పోరాడాలని పిలుపునిచ్చింది. జపాన్ సైన్యాలు పెకింగ్, టియాన్ సెన్ లను ఆక్రమించుకున్నాయి. జపాన్ పచ్చనది (Yellow River ) వరకూ ఉన్న భూభాగాన్నీ కబళించాలనే ఉద్దేశంతో దాడి జరిపింది.

1937 ఆగస్ట్‌లో జపాన్ షాంఘైను ఆక్రమించింది. ఆ తర్వాత, తమ ఆక్రమణను నిలిపివేసింది. చైనా, జపాన్ సైన్యాలతో పోటీ పడలేకపోయింది. యుద్ధంలో ఎనిమిది లక్షల చైనీయులు మరణించగా, 50 వేల జపానీయులు మాత్రమే హతులైనారు. జపాన్ లక్షాయాభైవేల చదరపు కిలోమీటర్ల చైనా భూభాగాన్ని ఆక్రమించుకుంది. కమ్యూనిస్ట్‌లు భారీ యుద్ధాల్లో పాల్గొనలేదు. యుద్ధ వ్యవహారాల్లో సుశిక్షుతులు, అధునాతన ఆయుధాలున్న జపానీయులతో పోరాటం, ఆత్మహత్యతో సమానమని మావో భావించాడు. కమ్యూనిస్ట్‌ల ఈ చర్య, కొమింగ్‌టాంగ్ విమర్శకు గురైంది.

## 23.10 కొమింగ్‌టాంగ్– కమ్యూనిస్ట్ యునైటెడ్ ఫ్రంట్ చీలిక : సంధి ప్రయత్నాలు

1937 లో జపాన్‌కు వ్యతిరేకంగా పోరాటానికి ఏర్పాటైన యునైటెడ్ ఫ్రంట్, ఎక్కువ కాలం నిలవలేదు. కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్ పార్టీ భాగస్వాముల పరస్పర అవమానాలు, అపనమ్మకాల కారణంగా, యునైటెడ్ ఫ్రంట్ విడిపోయింది. మొదటి నుండి, చాంగ్ యునైటెడ్ ఫ్రంట్ పట్ల, సంతృప్తిగా లేడు. దీర్ఘ యాత్రలో, ఎర్రసైన్యంపై చాంగ్ జరిపిన దాడుల వల్ల, చాంగ్ కమ్యూనిస్ట్‌ల బద్ధశత్రువుగా పరిగణింపబడ్డాడు. కొమింగ్‌టాంగ్ చేతిలో చాలాసార్లు మోసపోయినా, కమ్యూనిస్ట్ పార్టీ, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా, దేశ సమైక్యత దృష్ట్యా, అప్పుడప్పుడూ రాజీ ప్రయత్నాలు కుదుర్చుకుంది. కానీ, చాంగ్‌ను పూర్తిగా నమ్మలేదు, ఈ పరిస్థితుల్లో, 1937 లో చాంగ్–కొ–తౌ అనే కమ్యూనిస్ట్ జనరల్ ,కొమింగ్‌టాంగ్ పార్టీలో చేరాడు. అతడు కమ్యూనిస్ట్ పార్టీ ప్రాబల్యాన్ని వ్యాప్తిచేయడమే, వారి ప్రధాన లక్ష్యమని, జపాన్ వ్యతిరేకంగా పోరాడ్డమనేది నామమాత్రమని మావో ప్రకటించాడని వెల్లడించాడు. ఈ ప్రకటన కొమింగ్‌టాంగ్ పార్టీలో అనుమానాలను రేకెత్తించింది. 1940 కల్లా, కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం 3 లక్షలకు పెరిగింది. ఎర్రసైన్యం సంఖ్య 5 లక్షలకు పెరిగింది. సోవియట్ ప్రాంతాల, గెరిల్లా ప్రాంతాల జనాభా 19కోట్లకు పెరిగింది. ఉత్తర ప్రాంతంలో హోపేయి నుండి దక్షిణంలో హూనాన్ వరకు, కమ్యూనిస్ట్ ప్రాబల్యంలో పెరిగింది. ఫ్రంట్ ఏర్పడ్డ ప్రారంభ కాలంలో, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల విస్తరణకు అడ్డుపడలేదు. పైగా, సోవియట్ రాష్ట్రాలైన షెన్సీ, చహార్ హోపేయి లో జాతీయ ప్రభుత్వ ఏర్పాటుకు ఆమోదించింది. కానీ, 1939 నాటికి రెండు పార్టీల మధ్య విభేదాలు తలెత్తడంతో, కొమింగ్‌టాంగ్ జపాన్‌తో పోరాటం కన్నా, కమ్యూనిస్ట్ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రాధాన్యత నిచ్చింది. 1937–40 మధ్య కమ్యూనిస్ట్‌లు జపాన్‌తో నిరంతర పోరాటం చేస్తూ, గ్రామీణ గెరిల్లా యూనిట్లు జపాన్ ఆక్రమిత భూభాగాల్లో, ఏర్పర్చి, వాటిని విముక్తులను చేయడం, జపాన్ కమ్యూనిస్టులే తమ ముఖ్య శత్రువులని భావించారు. 1914 లో కోమింగ్‌టాంగ్ బలాలు, కమ్యూనిస్ట్‌లపై దక్షిణ అన్వేలో ఆకస్మిక దాడులను జరిపాయి. ఈ దాడిలో, ఆరు వేల కమ్యూనిస్ట్‌లు మరణించారు. ఈ సంఘటన చాంగ్ ,జపాన్ వారితో కలసి, కమ్యూనిస్ట్‌లను నాశనం చేయడానికి చేసిన పన్నాగంలో ఒకటని మావో విమర్శించాడు. కమ్యూనిస్ట్ పార్టీ ఒకవైపు జపాన్ నుండి, మరొకవైపు కొమింగ్‌టాంగ్ దాడులనుండి తప్పించుకుంటూ, విముక్త ప్రాంతాల్లో పోరాటాలు కొనసాగించింద.

సైద్ధాంతికపరంగా కూడా, కమ్యూనిస్ట్, కొమింగ్‌టాంగ్ ల మధ్య విభేదాలు స్పష్టమయ్యాయి. 1940

లో మావో ప్రచురించిన "ది న్యూ డెమోక్రసి" (The new Democracy) అనే పుస్తకంలో, చైనాలో ఒక నూతన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడాలని సూచించాడు. ఆ ప్రభుత్వం, కార్మిక వర్గం నాయకత్వం కింద మెజారిటీ ప్రజలను ఐక్యపరచగల్గిన ప్రజాస్వామిక శక్తుల ఐక్యసంఘటనా ప్రభుత్వంగా ఉంది. ఈ నూతన ప్రభుత్వం, కేంద్రీకృత ప్రజాస్వామిక సూత్రంపై ఆధారపడాలని, ఆ తర్వాత దశలో సోషలిజం పాటించాలని మావో పేర్కొన్నాడు. అయితే, 1943 మర్చిలో చాంగ్-కై-షేక్ తన "చైనీస్ డెస్టినీ అండ్ చైనీస్ ఎకనమిక్ ఐడియాలజీ" (The Chinese Destiny and Chinese Ideology) అనే పుస్తకంలో, మార్క్సిజం, వర్గపోరాటం, చైనా సమాజానికి సరిపోవని, కమ్యూనిస్ట్‌ల బోధనలు తరతరాలుగా వస్తున్న చైనా సహకార సాంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేసి, వారిలో వైషమ్యాలను కలుగుజేస్తాయని రాశాడు. 1943 సంవత్సరంలోనే, చాంగ్ కమ్యూనిస్ట్ సమస్య రాజకీయమైందని, దాని పరిష్కారం రాజకీయ మార్గాల ద్వారానే వీలౌతుందని ప్రకటించాడు. కానీ, ఆ తర్వాత రాజకీయ పరిష్కారానికై ఎలాంటి ప్రయత్నం చేయకపోగా, దానికి భిన్నంగా 1944 ఫిబ్రవరిలో 5 లక్షల మందితో ఉన్న జాతీయ సైనిక విభాగాలను, పశ్చిమోత్తర చైనాలో కమ్యూనిస్ట్‌లకు వ్యతిరేకంగా పంపాడు . ఈ విధంగా, చాంగ్ కమ్యూనిస్ట్ వ్యతిరేక పోరాటం కొనసాగింది.

ఈ పరిస్థితుల్లోనే, రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికన్లు జపాన్‌కు వ్యతిరేకంగా, యుద్ధం చేస్తున్నారు. స్టిల్‌వెల్ అనే అమెరికా సైన్యాధిపతి, అమెరికా అధ్యక్షునికి, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్టుల అంతర్యుద్ధం, జపాన్ వ్యతిరేక యుద్ధాన్ని ఆటంకపరుస్తుందని ఫిర్యాదు చేశాడు. కమ్యూనిస్ట్‌లకు వ్యతిరేకంగా, ఆయుధాలను వాడొద్దని, అమెరికా చాంగ్‌ను ఆదేశించింది. 1944 లో, జపాన్ ఓటమి దగ్గరపడుతున్న కొద్దీ, చైనాలో అమెరికా జోక్యం ఎక్కువ కాసాగింది. అమెరికా అధ్యక్షుడైన రూజ్‌వెల్ట్, చైనాలో అంతర్యుద్ధాన్ని నిలిపివేయడానికి, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల మధ్య సఖ్యతకై సంధి ప్రయత్నాలను ఆరంభించాడు. 1944, జూలైలో రూజ్‌వెల్ట్, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల మధ్య రాజీ కొరకై అమెరికా ఉపాధ్యక్షుడు వాలిమన్‌స్‌ను, చైనా రాజధాని చుంగ్ కింగ్‌కు పంపాడు. చాంగ్ తో సంప్రదింపుల తర్వాత, కమ్యూనిస్ట్ సమస్యను పరిష్కరించే విషయంలో, అమెరికా యత్నాన్ని తాను సంతోషంగా ఆమోదిస్తానని ప్రకటించాడు. చాంగ్ అభ్యర్థనను పరిష్కరించుకొని, ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్, మేజర్ జనరల్ జే. హార్లీని తన సొంత ప్రతినిధిగా నియమించుకున్నాడు.

### 23.10.1 హార్లీ రాయబారం

జపాన్ వ్యతిరేక సైన్యబలాలను సమీకరించి, జపాన్‌ను ఓడించటమే కాక, స్వతంత్ర్య సంఘటిత ప్రజాస్వామ్యానేర్పర్చుకోవడంలో, చైనా వారికి సాయపడాలనే స్పష్టమైన ఆజ్ఞలతో, హార్లీని చైనాకు పంపారు. హార్లీ యునాన్‌లో 1944 నవంబర్ 7న మావోతోనూ, ఇతర నాయకులతో సంప్రదించాడు. దానికి యువాన్-షీ-కై వెళ్లాడు. కమ్యూనిస్ట్‌లు అన్ని పార్టీలతో జాతీయ ప్రభుత్వం ఏర్పడ్డ పక్షంలో, వీలీనం కావడానికి తాము సంసిద్ధంగా ఉన్నామని తెల్పారు. ఈ సంప్రదింపులతో, చైనాలోని జాతీయ ప్రభుత్వం, కమ్యూనిస్ట్‌ల మధ్య ఒప్పందంపై మావో, హార్లీ సంతకాలు చేశారు. చాంగ్ ఆమోదాన్ని పొందగలమని హార్లీ వాగ్దానం చేశాడు. కానీ, రాజ్యసంరక్షణ యుగాన్నంతంచేసి. రాజ్యాంగ సమ్మత ప్రభుత్వ ఏర్పాటుకై సమ్మతించక, ఆ ఒప్పంద ముసా యిదాను తిరస్కరించాడు. దీంతో, చాంగ్‌తో ఈ ప్రతిపాదనలు అంగీకరింపచేసే విషయంలో, హార్లీ ప్రయత్నాలు విఫలమైనాయి.

జాతీయ ప్రభుత్వం 1945 అక్టోబర్ 10న ఒక కొత్త ప్రతిపాదన చేసింది. మావో దీనికంగీరించ లేదు. ఈ సమయంలోనే జరిగిన యాల్టా సమావేశ ఫలితంగా, 1945 ఆగస్ట్ 9న స్టాలిన్ జపాన్ వ్యతిరేక యుద్ధంలో పాల్గొనడానికి అంగీకరించాడు. మావో రష్యా ప్రవేశాన్ని ఆహ్వానిస్తూ, తన సైన్యాలు విమోచనా ప్రాంతాల విస్తరణకై పాటుపడాలని, ఉద్బోధించాడు. విమోచన ప్రాంతాల హక్కుల విషయమై

కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ మధ్య విభేదాలు తిరిగి తలెత్తాయి. రష్యా జాతీయ ప్రభుత్వానికి సహకరిస్తుందని, హార్లీ నమ్మాడు. కాని, దీనికి విరుద్ధంగా రష్యా తన విధానాన్ని మార్చుకొని, చైనాలోని కమ్యూనిస్ట్‌లకు సహాయం చేసింది. ఫలితంగా అమెరికా కూడా తమ విధానాన్ని మార్చుకొని, చాంగ్-కై-షేక్ అమెరికా సలహాను నిర్లక్ష్యం చేసినట్లైతే, అతనికి సహాయం చెయ్యరాదని నిశ్చయించింది. ఈ నియమబద్ధ విధానాన్ని హార్లీ అంగీకరించక, తన పదవికి 1945 నవంబర్ 27 న రాజీనామా చేశాడు. ఈ విధంగా, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్ మధ్య హార్లీ చేసిన రాజీ ప్రయత్నం విఫలమైంది.

## 23.10.2 మార్షల్ రాయబారం

1945, నవంబర్‌లో అమెరికా ప్రెసిడెంట్ ట్రూమన్ చైనాలో అంతర్యుద్ధాన్ని ఆపుచేయాలని, రెండు పార్టీల మధ్య సయోధ్యను కుదుర్చాలని, రాయబారిగా జనరల్ జార్జి మార్షల్‌ను చైనాకు పంపిచాడు. చైనాలో జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు మాత్రమే సహాయపడాలని, సైనిక పరంగా అమెరికా జోక్యం ఉండరాదని మార్షల్‌కు ఆదేశాలివ్వడం జరిగింది. జాతీయ సమైక్య పునరుద్ధరణ మార్షల్ రాయబారం ముఖ్యోద్దేశమని స్పష్టం చేయడం జరిగింది. 1945 డిసెంబర్‌లో మార్షల్ చైనా చేరి, ఇరుపక్షాల మధ్య సంధి ప్రయత్నాలకు ఆహ్వానించాడు. కమ్యూనిస్టులకు చౌ-ఎన్-లై ప్రతినిధిగా వచ్చాడు. చౌ-ఎన్-లై, చాంగ్-కై-షేక్ మధ్య ఒక ఒప్పందం 1945 జనవరి 10 న కుదిరింది. అన్ని పార్టీల సలహా సంఘ సభ మూడు వారాలు జరిగింది. ఈ సభ జాతీయ అసెంబ్లీ 1946 మే లో సమావేశమై, రాజ్యాంగాన్ని తయారు చేయాలని, 50% శాతం జాతీయ పార్టీ సభ్యులు గల స్టేట్ కౌన్సిల్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మార్షల్ రాయబారాన్ని రెండు పక్షాల వారు ఆమోదించారు. తక్షణ చర్యలుగా మార్షల్ ఈ కింది వాటిని సూచించాడు.

1. చైనాలో అంతఃకలహాన్ని ఆపివేయడం.
2. సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయడం.
3. కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్ సైన్యాల ఏకీకరణ ద్వారా, జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేయడం.

ఈ కార్యక్రమాల నిర్వహణకై, మార్షల్ ఒక కార్యనిర్వాహక వర్గాన్నేర్పాటు చేశాడు. ఇందులో, ఒక జాతీయవాది, ఒక కమ్యూనిస్ట్, ఒక అమెరికా సభ్యులుంటారు. దీని ఫలితంగా, అంతర్యుద్ధాన్ని నిలిపేశారు. 1946 ఫిబ్రవరి 25న రెండు పార్టీల సైన్య సమీకరణతో, జాతీయ సైన్యం ఏర్పాటుకు ఒక ఒడంబడిక జరిగింది. ఈ విజయంతో, మార్షల్ చైనాకు అప్పు సంపాదించడానికి మార్చిలో చైనా విడిచి వెళ్లాడు. మార్షల్ నిష్క్రమణతో, రెండు పక్షాలూ తాము చేసుకొన్న ఒప్పందాన్ని నిర్లక్ష్యం చేసి, అధికారం కోసం తిరిగి పోరాట పంథా నవలంబించాయి.

ఈ విధంగా, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌లు ఎదుటి పక్షం వారి చర్యలను, ఇవతలి వారు ఎప్పుడూ విమర్శిస్తూనే గడిపారు. ఒకరి సహాయం వేరొకరికి అవసరమైనప్పటికీ, ఒకరినొకరు నమ్మలేదు. జాతీయ విప్లవ సాధనకు పార్టీని శక్తివంతం చేయడానికీ, సుశిక్షితులైన సేనను తయారు చేయడానికీ, కొమింగ్‌టాంగ్ రష్యా సహాయాన్ని పొందింది. కమ్యూనిస్ట్‌లకు శ్రామిక, రైతు, జనసామాన్యంతో ఉన్న సంబంధాలను, కొమింగ్‌టాంగ్ తమ ప్రయోజనాల కొరకు వాడుకోవాలనుకొని, కమ్యూనిస్ట్ అణచివేత కార్యక్రమాలు చేపట్టింది. అదే విధంగా, క్రమక్రమంగా ప్రజలతో పట్టుసాధించి ఆధిపత్యం పొంది, కొమింగ్‌టాంగ్ ప్రభుత్వాన్ని కూలదోయాలని కమ్యూనిస్ట్‌లు భావించారు. అయితే, ఇరువురి ప్రయోజనాల కనుగుణంగా

ఉన్నప్పుడే, వారి మధ్య సయోధ్య నడిచింది. అది కుదరనప్పుడు, సహజంగానే, వారి మధ్య విభేదాలేర్పడ్డాయి. ఈ ఘర్షణలు, 1946 నాటికి తీవ్ర రూపం దాల్చి, రెండు పార్టీల మధ్య అంతర్యుద్ధానికి దారితీశాయి. ఈ అంతర్యుద్ధం మూడు దశలుగా సాగింది. మొదటి దశ, 1945 ఆగస్ట్ వరకు కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల శాంతియుత సంప్రదింపులు, చిన్న చిన్న పోరాటాలు, అమెరికా దౌత్య ప్రయత్నాలతో సాగింది. రెండో దశ, 1947 లో ప్రారంభమై, 1948 మధ్య భాగం వరకు జరిగింది. ఈ దశలో, మొదట్లో కొమింగ్‌టాంగ్ విజయాన్ని సాధించినా, వ్యూహాపరమైన సమతుల్యం కమ్యూనిస్ట్‌ల వైపు ఉంది. జనవరి 1947 లో లిన్‌పోల్ చిన్నచిన్న దాడులను సాగించి, తర్వాత వేసవి మధ్యకాలం నాటికి, యాంగ్‌ట్జే ప్రాంతంలో చొచ్చుకొని వచ్చి, చిన్‌చోగ్, చాంగ్ చుయ్, ముక్డెన్ ప్రాంతాలనాక్రమించి, జాతీయవాదుల రవాణా, వార్తా సౌకర్యాలను భగ్నం చేశాడు. ఈ విధంగా, ఈ దశలో కమ్యూనిస్ట్‌లు, ఉత్తర చైనాలో తమ స్థానాన్ని సుస్థిరపర్చుకున్నారు. మావో 1947 నవంబర్‌లో షి-చి-యాచుంగ్ లో కమ్యూనిస్ట్‌ల రాజధాన్నేర్పాటు చేశాడు. కమ్యూనిస్ట్ కొమింగ్‌టాంగ్ ల ఘర్షణలు, 1948 చివరి భాగంలో మొదలైన, అంతర్యుద్ధ గమనం కీలకమైన మూడో దశతో అంతమై, కమ్యూనిస్ట్‌లు విజయం సాధించారు.

## 23.11 సంగ్రహంగా

చైనాలో కొమింగ్‌టాంగ్ పార్టీ 1905లో డా॥ సన్-యట్-సేన్ చే, టుంగ్-మింగ్- హుయి నుండి ఆవిర్భవించింది. సన్ ప్రతిపాదించిన కొమింగ్‌టాంగ్ ముఖ్య సిద్ధాంతాలు జాతీయత, ప్రజాస్వామ్యం, ప్రజా జీవనోపాధి, 1917లో రష్యాలో జరిగిన బోల్షివిక్ విప్లవ విజయం ప్రభావంతో, చైనాలో కొమింగ్‌టాంగ్ పునర్వ్యవస్థీకరణ, చైనా కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన జరిగాయి. కార్మిక కర్షకులను సంఘటితపర్చి సామ్రాజ్యవాద, వలసవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం జరపాలనే లక్ష్యంతో, చైనా కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడింది. 1920 నుండి చైనా, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్ పార్టీల సారథ్యంలో ఒక కొత్త విప్లవ పంథాలో నడిచింది. 1920 నుండి 1927 వరకూ, వీరికి సైద్ధాంతిక విభేదాలున్నప్పటికీ, చైనా కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల మధ్య సయోధ్య సహకారాలుండేవి. 1927 నాటికి రెండు పార్టీల మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రమై, ఘర్షణకు దారితీసింది. అక్టోబరు 16, 1934 లో ఆరంభమై,1935 అక్టోబర్ 20 న ముగిసిన కమ్యూనిస్ట్‌ల చారిత్రాత్మక దీర్ఘ యాత్రను మావో నడిపించాడు. కొమింగ్‌టాంగ్ పార్టీ దాడుల నుండి కమ్యూనిస్ట్ పార్టీని రక్షించడానికి, సామ్రాజ్య వ్యతిరేక విప్లవ వ్యాప్తికై మావో దీర్ఘ యాత్రను నడిపాడు. 1931 లో చైనా జపాన్ యుద్ధ కాలంలో, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల మధ్య కుదిరిన తాత్కాలిక సఖ్యత ఎక్కువ కాలం నిలవలేదు. కమ్యూనిస్ట్ పార్టీపై కొమింగ్‌టాంగ్ అణచివేత చర్యల ఫలితంగా, రెండు పార్టీల మధ్య ఘర్షణలు తీవ్ర రూపం దాల్చి, అంతర్యుద్ధానికి దారితీశాయి. 1947 లో ప్రారంభమైన అంతర్యుద్ధం, 1949 లో, కమ్యూనిస్ట్‌ల విజయంతో ముగిసింది.

## 23.12 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. కొమింగ్‌టాంగ్ ఆవిర్భావాన్ని వివరించి, దాని పునర్వ్యవస్థీకరణలో డా॥ సన్-యట్-సేన్ పాత్రను విశ్లేషించండి.

2. కమ్యూనిస్ట్ పార్టీ స్థాపన, లక్ష్యాలను వివరించండి.

3. చైనా ఉత్తర దండయాత్రలో చాంగ్-కై-షేక్ పాత్రను విశ్లేషించండి.

4. కమ్యూనిస్ట్‌ల దీర్ఘ యాత్ర కారణాలు, గమనాన్నీ, ఫలితాలను పరిశీలించండి.

II. కింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలు రాయండి.

1. కొమింగ్‌టాంగ్ పునర్వ్యవస్థీకరణలో మైఖేల్ బోరోడిన్ పాత్రను విశ్లేషించండి.

2. కొమింగ్‌టాంగ్ సిద్ధాంతాలను తెల్పండి.

3. చైనా జపాన్ యుద్ధం, కొమింగ్‌టాంగ్, కమ్యూనిస్ట్‌ల మధ్య సఖ్యతను గురించి క్లుప్తంగా వివరించండి.

4. హార్లీ రాయబారం గురించి రాయండి.

5. మార్షల్ రాయబారం విఫలమవడానికి కారణాలు తెల్పండి.

## 23.13 ఉపయుక్త గ్రంథాలు


| | | | |
|---|---|---|---|
| 1. | Ahmad Ali | : | **A Comprehensive History of the Far East** |
| 2. | Arun Bhattacharjee | : | **World Revolutions** |
| 3. | Claude & Buss | : | **The Far East** |
| 4. | David M.D. | : | **Rise and Growth of Modern China** |
| 5. | Edgar Snow | : | **Red China Today** |
| 6. | Edwin E. Moise | : | **The Present and Past Modern China& History** |
| 7. | Fitzerald L.P | : | **The Birth of Communist China** |
| 8. | Gray Jack | : | **Rebellions and Revolutions** |
| 9. | Gadrich L.C | : | **A Short History of Chinese People** |
| 10. | Immanual Hsu | : | **The Rise of Modern China** |
| 11 | Macleavy Henry | : | **The Modern History of China** |
| 12. | Mao- Tse- Tung & Payne R | : | **Portrait of a Revolution.** |
| 13. | Mao- Tse- Tung | : | **Mao- Tse- Tung Hsuan-chi (selected works of Mao -Tse- Tung vol 3.4** |
| 14 | Paul H. Clyde Burton Beers | : | **The Far East** |
| 15. | Shiv Kumar & Saroj Jain | : | **History of Modern China** |
| 16. | Vinacke H.M | : | **A History of Far East in Modern Times** |
| 17. | Waller D.S | : | **The Government and Politics of Communist China.** |
| 18. | తెలుగు అకాడమీ | : | చైనా జపాన్ చరిత్ర |


రచయిత్రి : ఇ. సుధారాణి

BRAOU

# భాగం –24 : కమ్యూనిస్టుల విజయం – కారణాలు, ఫలితాలు, ప్రాముఖ్యత

విషయక్రమం


24.0 : లక్ష్యాలు

24.1 : పరిచయం

24.2 : అంతర్యుద్ధ చివరి దశ

24.3 : కమ్యూనిస్టుల విజయానికి కారణాలు

24.4 : ఫలితాలు

24.5 : చైనా విప్లవ ప్రాధాన్యత – ప్రభావం

24.6 : చైనా పీపుల్స్ రిపబ్లిక్ లక్ష్యాలు, విధులు

24.7 : రాజకీయ వ్యవస్థ నిర్మాణం

24.8 : రాజ్యాంగ నిర్మాణం, విధులు

24.9 : ఆర్థికాభివృద్ధి, పరిశ్రమల వ్యాప్తి

24.10: భూ సంస్కరణలు, వ్యవసాయక సమూహీకీకరణ

24.11: సాంఘిక సంస్కరణలు

24.12: ప్రజోపయోగ సంస్కరణలు

24.13: మావో–సే–టుంగ్ జీవిత రేఖలు

24.14: సంగ్రహంగా

24.15: పరీక్ష నమూనా ప్రశ్నలు

24.16: ఉపయుక్త గ్రంథాలు


## 24.0 లక్ష్యాలు

ఈ భాగాన్ని చదవడంవల్ల మీరు,

- చైనాలో అంతర్యుద్ధ చివరి దశను వివరించగలగాలి.
- కమ్యూనిస్టుల విజయానికి తోడ్పడ్డ కారణాలను విశ్లేషించగలగాలి.
- చైనా పీపుల్స్ రిపబ్లిక్ లక్ష్యాలను, విధులను వివరించగలగాలి.
- చైనా పీపుల్స్ రిపబ్లిక్ మొదటి దశాబ్ద కాలంలో రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవస్థల నిర్మాణాన్ని, సంస్కరణలను విశ్లేషించగలగాలి.
- మావో–సే–టుంగ్ జీవిత చరిత్రను , కమ్యూనిస్టుల విజయంలో అతని పాత్రను అంచనా వేయగలగాలి.

B R A O U

## 24.1 పరిచయం

1949 వ సంవత్సరం చైనా చరిత్రలో అపూర్వమైంది. 1945 నుండి 1949 వరకు మూడు సంవత్సరాలపాటు జరిగిన అంతర్యుద్ధం ముగిసి, సామ్రాజ్యవాదం, వలసవాదం, ఫ్యూడలిజంలకు వ్యతిరేకంగా 1949 లో ఒక ప్రజా విప్లవం జరిగింది. కమ్యూనిస్ట్‌లు, దీర్ఘయాత్ర కాలం నుండి గొప్ప విప్లవానుకూల సంఘటనలను పునరావృతం చేసి, కొమింగ్‌టాంగ్ సభ్యులను తరిమేశారు. కమ్యూనిస్ట్‌ల విజయం, చైనా చరిత్రలో, రాజవంశాల వలయ సిద్ధాంతం (Cyclic theory) క్షీణించి, అంతమైందని స్పష్టం చేసింది. కమ్యూనిస్ట్‌లు చైనా సాంప్రదాయాలకు విరుద్ధంగా పోరాడి, ఆధునిక భావనలతో నూతన క్రమాన్నేర్పర్చుకొని, పాశ్చాత్య విలువల్ని తమ సాంప్రదాయాలకు అన్వయించుకున్నారు. ఈ విప్లవానికి ఇదే ప్రాతిపదిక. విప్లవ భావాలు తీవ్ర రూపాన్ని దాల్చి, ప్రముఖ విమోచనోద్యమంగా మారి, 1949 లో కమ్యూనిస్ట్‌లు అధికారంలోకి రావడానికి దోహదమైంది. రష్యావల్ల ప్రభావితమైన కమ్యూనిస్ట్‌ల విప్లవ సంస్కృతి, వారి సిద్ధాంతపరమైన బోధనల వాధారంగా చైనాలో నూతన ప్రభుత్వాన్నేర్పర్చుకోడానికి అవకాశమేర్పడింది. ఈ భాగంలో కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల మధ్య జరిగిన అంతర్యుద్ధం ఎలా ముగిసిందీ, చివరకు కమ్యూనిస్ట్‌ల విజయానికి దారితీసిన పరిస్థితులను గురించీ తెలుసుకొంటాం. మావో-సే-టుంగ్ జీవితం, చైనా విప్లవంలో అతని పాత్రను, చైనా పీపుల్స్ రిపబ్లిక్ లక్ష్యాలు, విధులను, విప్లవానంతరపు ప్రథమ దశాబ్దంలో ఏర్పడ్డ రాజకీయ, ఆర్థిక , సాంఘిక రంగాల్లో జరిగిన పునర్నిర్మాణం , సంస్కరణలను ఈ భాగంలో చర్చించడం జరిగింది.

## 24.2. అంతర్యుద్ధం చివరి దశ

అంతర్యుద్ధ గమనంలో 1948-49 మధ్యకాలం అతి కీలకమైంది. ఎందుకంటే, ఈ కాలంలోనే అంతర్యుద్ధ గమనంలో మూడో దశ ప్రారంభమైంది.

1948 మధ్య భాగంలో, మంచూరియాలో కొమింగ్‌టాంగ్ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. మంచూరియా ద్వీపకల్పం నుండి కమ్యూనిస్ట్‌లను కొమింగ్‌టాంగ్ దళాలు పారద్రోలగా, కమ్యూనిస్ట్‌లు దక్షిణ దిశగా వెళ్ళడానికి నిశ్చయించుకొన్నారు. అయితే, కొమింగ్‌టాంగ్ దళాలు యాంగ్‌ట్జె నదీలోయలో సగానికి గల కమ్యూనిస్ట్ ఆక్రమిత ప్రాంతాలకు చేరుకున్నాయి. మావో అధ్వర్యంలో అతని అనుచరులు కొమింగ్‌టాంగ్ సైనిక శిబిరాలనన్నింటిని ఒకదాంతో ఇంకోదాన్ని వేర్పర్చి, ఆకస్మిక మెరుపు దాడులను జరిపి, సైనిక శిబిరాలను ధ్వంసం చేశాయి. కొమింగ్‌టాంగ్ సైన్యాలకు తగినంత సిబ్బంది, యుద్ధ సామాగ్రి ఉన్నా, కమ్యూనిస్ట్ గెరిల్లా దళాల మెరుపు దాడుల ముందు నిలువలేకపోయాయి. త్వరలోనే, కొమింగ్‌టాంగ్ దళాలు మొదట మంచూరియాలో, తర్వాత ఉత్తర చైనాలో తమ అస్తిత్వాన్ని కోల్పోయాయి.

1948 నవంబర్ నాటికి కొమింగ్‌టాంగ్ దళాల పతనం, కమ్యూనిస్ట్‌ల విజయం తథ్యమైనాయి. అక్టోబర్ నెలలో కమ్యూనిస్ట్ జనరల్ లిన్‌పియావో, జాతీయ కొమింగ్‌టాంగ్ దళాలను ధ్వంసం చేశాడు. కొమింగ్‌టాంగ్ సైన్యంలో అనేకమంది కమ్యూనిస్ట్‌లతో చేరిపోయారు. చాంగ్ 4 లక్షల సైన్యాన్ని కోల్పోయింది. అయితే, తర్వాత కాలంలో 1948 నవంబర్ 7 నుండి 1949 జనవరి 12 వరకు జరిగిన వై-హై-చీన్ యై (Hwai-Hai-Chenyi) యుద్ధం అంతర్యుద్ధ చరిత్రలో అత్యంత ప్రధానమైంది. ప్రజావిమోచన సైన్యం, 65 రోజులు కొమింగ్‌టాంగ్ దళాలతో యుద్ధం చేసి, ఓడించాయి. చాంగ్-కై-షేక్ అతిపెద్ద ఓటమిని ఈ యుద్ధం ద్వారా చవిచూశాడు. వై-హై యుద్ధంలో 5 లక్షల 50 వేల మంది సైనికులను కోల్పోయాడు. అంతర్యుద్ధ కాలంలో ధరలు పెరిగి, ప్రజల ఆర్థిక పరిస్థితి దుర్భరమైంది.

BRAOU

చాంగ్ తన ఓటమి తథ్యమని గ్రహించి, 1949, నూతన సంవత్సర ప్రకటనలో కమ్యూనిస్ట్‌లతో శాంతి ఒప్పందానికై పిలుపునిచ్చాడు. అది ఫలించకపోవడంతో, అమెరికా , బ్రిటన్, రష్యాల సహకారాన్ని అర్థించాడు. కాని, ఆ దేశాలు చైనా ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోడానికి నిరాకరించాయి. దాంతో, చాంగ్ 1949 జనవరిలో చైనా రిపబ్లిక్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. తన తర్వాత జనరల్ లీ-త్సుంగ్-జెన్ (Li-tsung-jen) ను చైనా అధ్యక్షునిగా ప్రకటించాడు. తర్వాత కమ్యూనిస్ట్ సైన్యాలు ఉత్తర చైనాను ఆక్రమించుకొని, 1949 ఏప్రిల్‌లో నాన్‌కింగ్, హాంకౌ, షాంఘైను లోబర్చుకున్నాయి. సెప్టెంబర్ 19 న షెన్సీ సైన్యాలు లొంగిపోయాయి. సెప్టెంబర్ 29 కల్లా, సికియాంగ్ కమ్యూనిస్ట్‌లకు లొంగిపోయింది. ఈ విధంగా, 1949 అక్టోబర్ 1 వ తేదీ నాటికి చైనాలో అత్యధిక భూభాగం, ప్రజా విమోచన సైన్యం ఆధీనంలోకి వచ్చింది. దీంతో, కొమింగ్‌టాంగ్ కమ్యూనిస్ట్‌ల మధ్య జరిగిన అంతర్యుద్ధంలో కమ్యూనిస్ట్‌లు గెలిచారు. 1949 అక్టోబర్‌లో పురాతన రాజవంశం రాజధాని బీజింగ్‌లో, మావో చైనా పీపుల్స్ రిపబ్లిక్ స్థాపనను ప్రకటించాడు.

## 24.3 కమ్యూనిస్ట్‌ల విజయానికి కారణాలు

కొమింగ్‌టాంగ్‌లు వారి సైన్యంలో, కమ్యూనిస్ట్‌ల కంటే ఉత్తమ యుద్ధసామాగ్రి, సుశిక్షితులైన సైన్యం కల్గివున్నా, కమ్యూనిస్ట్‌ల ఎదురు దాడులకు నిలదొక్కుకోలేకపోయారు. కమ్యూనిస్ట్‌ల విజయానికి ముఖ్య కారణం – కొమింగ్‌టాంగ్ సాయుధ దళాలు బలహీనమవడం. జపాన్ వారి దురాక్రమణ ఫలితంగా జరిగిన యుద్ధంలో, దీర్ఘకాలంగా కొనసాగిన ప్రతిఘటనవల్ల, చైనా సైనిక శక్తి క్షీణించింది. ఈ సమయంలో వారు సుశిక్షితులు, కర్తవ్య దీక్షగల కమ్యూనిస్ట్ పార్టీ దళాలతో పోరాడాల్సి వచ్చింది. ఈ యుద్ధంలో, చాంగ్ అమలుపర్చిన పద్ధతులు, కమ్యూనిస్ట్‌ల గెరిల్లా వ్యూహ పద్ధతులు కూడా, కమ్యూనిస్ట్‌ల విజయానికి తోడ్పడ్డాయి.

కమ్యూనిస్ట్‌ల విజయానికి మరో ముఖ్య కారణం, చపలచిత్తుడు, అధికార దాహంతో అవినీతిపరుడైన చాంగ్ -కై-షేక్ అసమర్థ పాలన. ఇతడు 1920 నుండి 1949 వరకు పాలించాడు. జాతీయ పునర్నిర్మాణ ప్రతినిధిగా పనిచేసిన కొమింగ్‌టాంగ్‌కు అవినీతిపరులు, అసమర్థులైన ఉద్యోగబృందంవల్ల అగౌరవం ఏర్పడింది. అధికారులు ప్రభుత్వ నిధులు, సరఫరాల్లో పెద్దమొత్తాలు దుర్వినియోగం చేసి, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. నాయకుల, ఉద్యోగుల అవినీతి, అసమర్థతను ప్రజలు అసహ్యించుకోసాగారు.

మూడో కారణం, కొమింగ్‌టాంగ్‌లకు సామాన్య ప్రజలపై నమ్మకం లేకపోవడం. వీరు ప్రధానంగా సంపన్న వర్గాలపై ఆధారపడ్డారు. భూస్వాములకు మద్దతుగా నిల్చారు. దీని ఫలితంగా, సామాన్య ప్రజలతో సంబంధాలు దెబ్బతిన్నాయి. కమ్యూనిస్ట్‌లపై యుద్ధంలో గెలుపొందడానికి కీలకమైన సామాన్య ప్రజల మద్ధతును కోల్పోయారు. కమ్యూనిస్ట్‌ల ధ్యేయం, కార్మిక, కర్షక విమోచన. వీరు దేశంలోని మారుమూల ప్రాంతాల్లో తమ దళాలు ఏర్పాటుచేసి, సామాన్య ప్రజలను విప్లవం వైపు మళ్లించారు. కమ్యూనిస్ట్‌ల సాధారణ జీవనంతో సామాన్య ప్రజల నమ్మకాన్ని చూరగొని, తమ స్థానాన్ని పటిష్టం చేసుకున్నారు. కమ్యూనిస్ట్‌లు ఏ ప్రాంతంలో అధికారంలోకి వచ్చినా, అక్కడ, తమ బాధ్యతలను చక్కగా నిర్వహించారు. రైతుల స్థితిగతులను మెరుగుపర్చారు. అయితే, వారు తమ సొంత ప్రయోజనాల కోసం ఏ పనీ చేయలేదు. వారి ఎర్రసైన్యం క్రమశిక్షణకు, క్రమబద్ధ జీవనానికి ప్రతీక. అంతేకాక, వీరు ప్రజల ఆస్తులను దోచుకోడం, లేదా మహిళల్ని అగౌరవపర్చే చర్యల్లో పాల్గొనక, ప్రజల అభిమానానికి పాత్రులైనారు. ఇవన్నీ కూడా, కమ్యూనిస్ట్‌ల్ని ఉన్నత ఆదర్శవంతులుగా భావించడానికి, వారి ప్రాథమిక ఆలోచన కేవలం ప్రజా సంక్షేమం

అని నమ్మడానికి దోహదం చేశాయి. ప్రజల ఆశలు, ఆశయాలకు అణుగుణమైన సాంఘిక, రాజకీయ సంస్కరణలను అమలుపర్చకపోవడంవల్ల కొమింగ్‌టాంగ్ వైఫల్యం చెందింది. ఇందుకు భిన్నంగా, సాంఘిక న్యాయం, ఆర్థిక సమానత్వాలతో జాతీయ పునర్నిర్మాణానికి మార్క్సిజం ఒక్కటే మార్గమని, కమ్యూనిస్ట్‌లు చూపగలగటం గొప్ప విశేషం. వాస్తవానికి మావో అత్యున్నత నాయకత్వం, అతని న్యాయ సమర్థత, కమ్యూనిస్ట్‌ల విజయానికి కారణమైనాయని చెప్పొచ్చు.

## 24.4 ఫలితాలు

చైనా ప్రజల ప్రజా విప్లవం పరిపూర్తై, కమ్యూనిస్ట్ నాయకత్వాన నూతన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడటంతో, ప్రపంచ చరిత్రలోనే ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. సామ్రాజ్యవాదులకు, సోషలిస్ట్ ప్రజాస్వామిక శక్తులకు మధ్య జరిగిన పోరాటంలో, సోషలిస్ట్ విజయానికి చైనా విప్లవం నిర్ణయాత్మకమైన పాత్రను నిర్వహించింది. చైనా విప్లవ ఫలితంగా, రైతాంగం ఒక గొప్ప విప్లవశక్తిగా రూపొందింది. కమ్యూనిస్ట్‌లు తమ ప్రజా విప్లవ పోరాట వ్యూహాలతో, సరళీకృత సిద్ధాంత ఆచరణతో రైతులను, శ్రామికులను సమైక్యపర్చటంవల్ల, ఇది సాధ్యమైంది. కమ్యూనిస్ట్‌లు యుద్ధంలో అనుసరించిన గెరిల్లా పోరాట పద్ధతి, సంచార యుద్ధ వృత్తి మొదలైన లక్షణాలుండి, ప్రజలతో సన్నిహిత సంబంధాలకు దారితీయడం వల్ల, ఇది అత్యంత జనాదరణ పొందిన మహత్తర వ్యూహంగా నిరూపితమైంది. ఈ పోరాటంలో మావో అనుసరించిన దీర్ఘకాల ఎత్తుగడలు కూడా, ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. వెనుకబడ్డ దేశాల ప్రజలు, వలస ప్రాంతాల్లోని ప్రజలు, తమ విముక్తి పోరాటాన్ని సాయుధ పోరాట రూపంలో సాగించారు. ఇది దీర్ఘకాల పోరాటం. ఈ నూతన అనుభవాన్ని చైనా కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిజానికి చూపింది. పైగా, ఈ దేశాలలో సోషలిజం ఎలా నిర్మించాలో, మార్క్సిస్ట్ సిద్ధాంతాలనెలా ఆచరణయోగ్యంగా మలచుకోవాలో అనే అనుభవాన్ని చైనా మార్క్సిజానికి అందించింది. చైనా కమ్యూనిస్ట్‌ల విజయం, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలనంతటా విప్లవోద్యమాలు జరగడానికి స్ఫూర్తి నిచ్చింది. ఇది సామ్రాజ్యవాద పునాదులను మరింత బలహీనపర్చింది.

## 24.5 చైనా విప్లవ ప్రాధాన్యత – ప్రభావం

ఫ్రెంచ్, రష్యా విప్లవాల్లాగే చైనా విప్లవానికి కూడా, చరిత్రలో గణనీయమైన ప్రాధాన్యత ఉంది. చైనా విప్లవం చైనాలో, ఇతర దేశాల్లో కూడా, తన ప్రభావాన్ని చూపింది. దీని మూలంగా రైతాంగం ఒక గొప్ప విప్లవ శక్తిగా రూపొందింది. చైనా ఆర్థికాభివృద్ధిని సాధించింది. విప్లవం వల్ల చైనా ప్రజల ఆలోచనలు కొత్త రూపాన్ని దాల్చాయి. చైనా రాజకీయ, సాంఘిక రంగాల్లో కొత్త మార్పులను ప్రవేశపెట్టడమేకాక, ప్రగతిని సాధించింది. చైనా గుర్తింపు, ప్రతిష్ఠ పెరిగాయి. చైనా మార్క్సిస్ట్ లెనినిస్ట్‌లపై నాయకత్వ లక్షణాలను సంతరించుకోడంతో, యావత్ ప్రపంచం మీద చైనా ప్రభావం ప్రసరించింది. చైనా విప్లవం ప్రపంచ శక్తిపరంగా సమతుల్యపర్చింది. కమ్యూనిస్ట్ పార్టీ విజయం, వలస సమాజ ప్రజల్లో నూతన చైతన్యాన్నేర్పర్చింది. ప్రాచ్య ప్రపంచంలో సంభవించిన ఈ విప్లవం వల్ల, పూర్వ వలస సమాజాలు, ప్రపంచంలో బలవత్తరమైన నూతన శక్తిగా ఆవిర్భవించాయి. చైనాలో జరిగిన సాయుధ విప్లవ విజయం, ప్రాచ్య రాజ్యాల్లోనే కాక, ఆఫ్రికాలోని అనేక ప్రాంతాల్లోను, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల్లో విప్లవోద్యమాలు విజృంభించడానికి దోహదం చేశాయి. బ్రూస్ డి లార్కిన్ (Bruce D'Lorkin) మాటల్లో చెప్పాలంటే, "1917 బోల్షివిక్ విప్లవానంతరం, విప్లవవాదులు ఆ విప్లవం నుండి ఏవిధంగా గుణపాఠాలు నేర్చుకున్నారో,అదేవిధంగా చాలామందిని చైనా

విప్లవం వైపు మరల్చగల్గిందనడం అతిశయోక్తేమీ కాదు.

## 24.6 చైనా పీపుల్స్ రిపబ్లిక్ లక్ష్యాలు; విధులు

చైనాలో మంచూల అసమర్థ పాలన, సామ్రాజ్యవాదుల దోపిడీ, యుద్ధం మూలంగా ఏర్పడ్డ అరాచకత్వం, చాలా కాలంగా కొనసాగుతున్న అంతర్యుద్ధం ఫలితంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. అరాచకత్వంలో కూరుకుపోయిన చైనాను, మావో -సే-టుంగ్ చైనా కమ్యూనిస్ట్ పార్టీ వారసత్వంగా పొందాడు. చైనా పీపుల్స్ రిపబ్లిక్ పాలన ప్రారంభించేనాటికి, పరిశ్రమలు క్షీణ దశలో ఉన్నాయి. వ్యవసాయోత్పత్తులు తగ్గిపోయాయి. రవాణా వ్యవస్థ అధ్వాన్న స్థితిలో ఉంది. ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. ఈ దారుణమైన పరిస్థితులకు తోడు, రద్దైన సైన్య సమస్య, శరణార్థుల పునరావాస చర్యలు, రాజకీయ ఐకమత్య సాధన సమస్యలు, మావో అధికారం చేపట్టగానే ఎదుర్కోవాల్సి వచ్చింది. జాతీయ ఆర్థిక పునర్నిర్మాణానికి పారిశ్రామిక, వ్యవసాయోత్పత్తుల పెరుగుదలకు, మావో ప్రథమ స్థానమిచ్చి కృషి చేశాడు. మావో, చైనా నూతన ప్రభుత్వాన్ని, నూతన ప్రజాస్వామ్యంగా విశదీకరించాడు. దాన్ని, "పీపుల్స్ డెమోక్రటిక్ డిక్టేటర్ షిప్" గా పేర్కొడం జరిగింది. పీపుల్స్ డెమోక్రటిక్ డిక్టేటర్ షిప్‌ను వివరిస్తూ, మావో " ఈ రెండూ, ప్రజాస్వామ్యం ప్రగతి నిరోధకులకు నియంతృత్వమని, "ఈ రెండు కలిస్తేనే ప్రజాస్వామిక నియంతృత్వం సంఘటితమౌతుందని" పేర్కొన్నాడు.

మావో ఉద్దేశంలో, నూతన ప్రజాస్వామ్యం అంటే ప్రజా ప్రభుత్వ యంత్రాంగం. దీన్ని వివరిస్తూ మావో ప్రజా సైన్యం, ప్రజా పోలీస్, ప్రజా న్యాయస్థానాల ఏర్పాటువల్ల, ప్రధానంగా జాతీయ భద్రత పరిరక్షితమౌతుంది. ప్రజా శక్తులకు రక్షణ కల్గుతుంది. ఈ పరిస్థితి ఏర్పడాలంటే, చైనాలో శ్రామిక వర్గం, కమ్యూనిస్ట్ పార్టీ నాయకత్వాన్ని వహించాల్సి ఉంటుంది. దీని మూలంగా, "క్రమక్రమంగా దేశం వ్యవసాయ విధానం నుండి పారిశ్రామిక విధానంగాను, నూతన ప్రజాస్వామ్యం నుండి సామ్యవాదంగాను , మారగల్గుతుంది. దీని పర్యవసానంగా, కమ్యూనిస్ట్ సమాజంలో వర్గ నిర్మూలన జరిగి, సార్వత్రిక సామరస్యం ఏర్పడుతుందని, మావో పేర్కొన్నాడు.

మావో తన " నూతన ప్రజాస్వామ్యం" *(New Democracy)* అనే గ్రంథంలో నూతన ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని, దాని ఆచరణను, విపులంగా వ్యక్తపర్చాడు. దాని సంస్కరణ, లేదా అంతర్గత పార్టీ పోరాటం *(Cheng Feng)* యునాన్‌లో రూపుదిద్దుకున్నాయి. 1940లో ప్రజాస్వామ్యమనేది అతి పెద్ద సిద్ధాంతపరమైన కృషి. అయితే, మార్క్సిజం, లెనినిజంల సృజనాత్మక అనుచరణ చైనీయుల పరిస్థితులకు అనుకూలంగా ఉండటంతో, చైనా దీన్ని అవలంబించింది. అది చైనాలో పాక్షిక వలస విధానం వరకూ, పాక్షిక విధానం నుండి సామ్యవాదపు కీలక పరిణామానికి దారితీసింది. అందులో, ఆర్థిక పునర్నిర్మాణం లక్ష్యంగా మూడు విధానాలేర్పడ్డాయి. వాటిలో ఒకటి రాజ్య ఆర్థిక వ్యవస్థ. దీనిమూలంగా, ప్రభుత్వం భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు, ప్రజోపయోగ సంస్థలను కూడా అదుపు చేస్తుంది. రెండోది వ్యవసాయక వ్యవస్థ. ఇందులో, వ్యక్తిగత వ్యవసాయ క్షేత్రాలను, సామూహిక క్షేత్రాలుగా అభివృద్ధి పర్చడంలో, నియంత్రణ జరుగుతుంది. మూడోది ప్రైవేట్ ఆర్థిక వ్యవస్థ. ఇందులో, మధ్యతరహా, చిన్నతరహా పెట్టుబడిదార్ల నిర్వహణకు అనుమతిని పొందుతారు. ఈ మూడింటికి, రాజ్యవ్యవస్థ పాలనారంగం నాయకత్వాన్ని వహిస్తుంది. ప్రైవేట్ రంగంకంటే అధిక ఉత్పత్తిని పెంపొందించడానికి పాటుపడుతుంది. అంతేకాకుండా, సామ్యవాద దిశగా ఇతర రంగాలకు మార్గదర్శకత్వం వహించడంలో బాధ్యత తీసుకుంటుంది. రాజకీయ వ్యవస్థా నిర్మాణంలో, ప్రజాస్వామ్య కేంద్రీకృత పాలన *(Democratic Centralism)* అనే సూత్రాన్ని



BRAOU

అమలుపర్చి, నాల్గు వర్గాల మనుగడకు, పార్టీ శ్రామికవర్గం నాయకత్వం వహిస్తుంది. అది కమ్యూనిస్ట్ పార్టీ నియంత్రణలో ఉంటుంది. సాంస్కృతికంగా, మావో "శాస్త్రీయ భూస్వామ్య వ్యతిరేక జనబాహుళ్య సంస్కృతిని" పెంపొందించడానికి ఆశించాడు. చైనా కనుకూలంగా ఉన్న విదేశీ సంస్కృతులను కూడా తీసుకోవాలని అపేక్షించాడు. అయితే, నూతన ప్రజాస్వామ్యం సామ్రాజ్యవాద విరుద్ధతపై ఆధారపడిఉంది. అందుకే, కమ్యూనిస్ట్ చైనా జాతీయ నూతన ప్రజాస్వామ్య సంస్కృతిని అవలబించింది. దీనివల్ల, చైనా ప్రతిష్ట పెరుగుతుందని మావో వివరిస్తూ, " అది మన దేశానిదే, మన జాతి విలక్షణతను చాటుతుందని" పేర్కొన్నాడు.

చైనా రిపబ్లిక్ ప్రారంభ దశలో సామ్యవాదానికి గట్టి పునాదులు ఏర్పడ్డాయి. కమ్యూనిస్ట్ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం రాష్ట్రాలనన్నింటినీ విలీన పర్చుకోడం. కమ్యూనిస్ట్ పార్టీ విజయానంతరం, చైనా దేశాన్నంతటినీ తన ఆధీనంలోకి తెచ్చుకొని వ్యవస్థీకృతం చేసింది.

కమ్యూనిస్ట్ పాలనలో పరిపాలనను బలపరుస్తూ, యుద్ధోన్మాదాన్ని ఆటంకపరుస్తూ, చైనాలోని ప్రతి విప్లవవాదుల కార్యకలాపాలను నియంత్రించడం రెండో ప్రధాన కర్తవ్యం. 1949-53 మధ్య కాలంలో ఈ అణచివేత విధానాలు లక్ష్యసాధనలో ప్రధానమైనవిగా పరిగణింపబడ్డాయి. చైనాలో కమ్యూనిస్ట్‌లకు ముందు రాజకీయ, ఆర్థిక హక్కులనుభవించిన కొన్ని వర్గాలవారు వాటిని వదులుకోడానికి ఒప్పుకోలేదు. అయితే, కమ్యూనిస్ట్ పార్టీ ప్రభుత్వ ధ్యేయం వర్గ నిర్మూలన అవడంవల్ల, వర్గరహిత సమాజ ఏర్పాటుకు ఈ పార్టీ పూనుకొంది.

మూడో కర్తవ్యం, నూతన ప్రభుత్వం నగర పాలనను క్రమబద్ధీకరించి, దాన్ని సంపూర్ణంగా అదుపులోకి తేవడం. కమ్యూనిస్ట్ పార్టీ అంతర్యుద్ధకాలంలోనే గ్రామీణ ప్రాంతాలను నియంత్రించి, వ్యవస్థీకృతమైంది. కాని, నగరాలపై స్వల్పమైన అధికారంవల్ల, అంతర్యుద్ధ కాలంలో, ఎన్నోకష్టాలనెదుర్కొంది. కాని, ఆ తర్వాత కొమింగ్‌టాంగ్ ప్రభుత్వం పట్ల నగర ప్రజలు విసుగుచెంది, కమ్యూనిస్ట్‌లను ఆహ్వానించడంలో తమ సంసిద్ధతను తెలియజేశారు. నగర శ్రామిక వర్గం కూడా, మౌలిక నిర్మాణంలో మార్పులేమి లేకుండా కమ్యూనిస్ట్ పాలనను అంగీకరించింది. కానీ, వారి సొంత వ్యక్తులను కీలక స్థానాల్లో నియమించే హక్కును కోరారు.

కమ్యూనిస్ట్ ప్రభుత్వం, విదేశీయులపై దాడిని ముమ్మరం చేసింది. ముఖ్యంగా, నగర కేంద్రాల్లో నివసించే విదేశీయులపై దాడి నధికం చేసింది. అంతేకాకుండా, వీరు చైనా విడిచి పారిపోయేట్లు చేసింది. 1950 కువిదేశీ వాణిజ్య పారిశ్రామిక సంస్థలన్నీ నష్టపరిహారం లేకుండానే జాతీయమయ్యాయి. అంతేగాక వారి ఆస్తులను జప్తు చేయడం కూడా జరిగింది. చైనా ప్రజల్లో జాతీయ భావాలు ముందే ముమ్మరంగా ఉండడంవల్ల, విదేశీయుల బహిష్కరణ విషయంలో, వారెంతో సంతృప్తి చెందారు.

## 24.7 రాజకీయ వ్యవస్థ నిర్మాణం

1949 లో చైనా పీపుల్స్ రిపబ్లిక్ సృష్టీకరించిన సామాజిక న్యాయం, **సోవియట్** రష్యా శ్రామిక నియంతృత్వానికి సంబంధించింది కాదు. కాని, ప్రజాస్వామిక నియంతృత్వపు నాల్గు **వర్గ** కూటముల ద్వారా, చైనా కమ్యూనిస్ట్ పార్టీని ఏర్పర్చింది. ఈ నాలుగు వర్గాల ప్రజాస్వామిక సహజీవన లక్షణంతో, ప్రభుత్వాన్ని రూపొందించడం జరిగింది. నూతన ప్రభుత్వం,"ప్రజాస్వామిక కేంద్రీకృతపాలన"ననుసరించింది. అందువల్ల ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో, ప్రజలకు అనుకూలమైన పద్ధతులనేర్పాటు చేయటం జరిగింది. ఈ ఏర్పాటు ప్రక్రియ ప్రజాస్వామ్యమైంది. 1953 వరకూ ఈ నూతన ప్రజాస్వామ్యం యథాతథంగా మనుగడ



BRAOU

సాగించింది. 1956లో నూతన సామ్యవాద నిర్మాణం జరిగేంత వరకూ, ఈ విధానం కొనసాగింది. ఇది మూడు దశలుగా విభజితమై , చైనా కమ్యూనిస్ట్ పాలనకు ఎంతో తోడ్పడింది. రాజ్యంలో అత్యున్నత అంగం కేంద్ర ప్రజాపరిపాలన విభాగం. ఇది కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణవర్గం, న్యాయవ్యవస్థవర్గ అధికారాలను నిర్వహిస్తుంది. కేంద్ర ప్రజాపరిపాలన విభాగం, నెలలో రెండు సార్లు రాజ్య ఉన్నత విధానాలను చర్చిస్తుంది. ఈ విభాగ సభ్యుల్లో చైర్మన్ , ఆరుగురు వైస్‌చర్మన్లు ఉంటారు. మరో విభాగమైన ప్రజా రాజకీయ సలహా మండలి 56 సభ్యులతో ఉంది. ఈ సభ్యులు సమావేశంలో లేనప్పుడు, దీని అధికారాలు రాష్ట్ర పరిపాలక సమితికి దత్తత చేయబడుతుంది. 20 మంది సభ్యులతో కూడిఉన్న ఈ సమితి మంత్రివర్గ బాధ్యతలను నిర్వహిస్తుంది. మూడో విభాగం రాష్ట్ర పరిపాలక సమితి. దీనికి అధిపతిగా ప్రధాని వ్యవహరిస్తాడు. ఇతర ఉప ప్రధానుల కింద నాలుగు సంఘాలుంటాయి. అవి, రాజకీయ న్యాయవ్యవహారాలు, ఆర్థిక, సాంస్కృతిక, విద్యా సంబంధమైనవి. వీటి పర్యవేక్షణ మంత్రిత్వ శాఖలు కమీషన్లు, బోర్డుల ద్వారా జరుగుతుంది. రాష్ట్ర పరిపాలన సమితి ప్రజా న్యాయస్థానంగా, వ్యవహర్తృత్వ నాయకుని (Procurator General) కార్యాలయంగా కూడా వ్యవహరిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ ప్రాంతీయ పరిపాలనకు మధ్య ఆరు గొప్ప పరిపాలనా క్షేత్రాలున్నాయి. ప్రతి ఒక్కటీ అనేక ప్రాంతాలపై తన అధికారాన్ని నిర్వహిస్తుంది. ఈ వ్యవస్థలన్నీ, కేంద్ర ప్రభుత్వ పటిష్టతకు దోహదం చెయ్యడానికి ఏర్పడ్డాయి. కాని, ఈ కేంద్రీకృత ధోరణలుత్పన్నం కావడంతో, కేంద్ర అధికార వ్యయంలో మార్పు వచ్చింది. 1953 లో ఈ క్షేత్రాలు, దేశ రాజకీయ పునర్నిర్మాణంతో రద్దైనాయి. దేశంలో రాజకీయ నిర్మాణం జాతీయ, ప్రాంతీయ, జిల్లాల స్థాయిలో జరిగింది. 1953 లో జనాభా లెక్కలను తయారు చేశారు. ఎన్నికల శాసనం ప్రకటించడమైంది. 18 సంవత్సరాలపై బడ్డ పౌరులకు ఓటు హక్కు లభించింది. ఈ ఎన్నికల్లో భూస్వాములను విప్లవ వ్యతిరేకులను, ఎన్నికలనుండి బహిష్కరించడం జరిగింది. 1954 ప్రారంభంలో ఎన్నికలు జరిగాయి. ఇందులో, గ్రామీణ, పట్టణ ప్రాంత సమావేశ సంఘాల్లో, జిల్లా సంఘాల్లో, తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. తర్వాత, ప్రాంతీయ సమావేశాల్లో ఎన్నికలే కాక, జాతీయ ప్రజా కాంగ్రెస్ ప్రతినిధుల ఎన్నికలు కూడా జరిగాయి.

## 24.8 రాజ్యాంగ నిర్మాణం, విధులు

జాతీయ ప్రజా కాంగ్రెస్ (National Peoples Congress) 1953 సెప్టెంబర్ 15-22 మధ్య కాలంలో సమావేశమైంది. అది నూతన రాజ్యాంగాన్ని ఆమోదించింది. ఈ రాజ్యాంగ ముసాయిదా కమిటీని, మావో అధ్యక్షతన కాంగ్రెస్ అంగీకరించింది. ఈ రాజ్యాంగం, పాశ్చాత్య ప్రజాస్వామిక దేశాల రాజ్యాంగ నమూనాలో రూపొందించబడింది. దీనిలో నాలుగు అధ్యాయాలను ప్రస్తావించడమైంది. చైనా రాజ్యాంగ ప్రస్తావనలో "శాంతియుత మార్గంలో దారిద్ర్యం నిర్మూలితమౌతుందనీ, సౌభాగ్యవంతమైన, సంతోషదాయక సామ్యవాద సమాజ నిర్మాణంలో, చైనా పూచీ వహిస్తుంది." అని ప్రకటించింది. అంతేకాక, అది రాజ్యాంగాన్ని ఉద్ఘాటిస్తూ, "పీపుల్స్ రిపబ్లిక్, చైనా రిపబ్లిక్ స్థాపన నుండి సామ్యవాద సమాజ లక్ష్య సిద్ధిని సాధించడం, అధికార మార్పిడి కాలంలో జరుగుతుందని ప్రస్తావించింది. ఈ అధికార మార్పిడిలో రాష్ట్ర ప్రాథమిక కర్తవ్యం ఏమంటే, అంచెలంచెలుగా వ్యవసాయ, చేతి వృత్తుల, హస్తకళల పెట్టుబడీదారీ పారిశ్రామిక రంగం, వ్యాపార రంగాల్లో సామ్యవాద విలీనం ఏర్పడుతుందని" పేర్కొంది. నూతన రాజ్యాంగంలో నాలుగు అధ్యాయాలు, 106 పరిచ్ఛేదాలున్నాయి. అధ్యాయం ఒకటిలో, ప్రజాస్వామిక కేంద్రీకృత పాలన (Democratic Centralism) సూత్రాన్ని పునరుద్ఘాటించారు. దీనిలో, 20 పరిచ్ఛేదాలున్నాయి. ఇది చైనా పీపుల్స్ రిపబ్లిక్ పనితీరుపై



BRAOU

ఆధారపడిన విషయాలను విశదపరుస్తుంది. అధ్యాయం రెండు అన్నింటికన్నా పెద్దది. ఇందులో, 84 పరిచ్ఛేదాలు 6 విభాగాలుగా విభజితమైనాయి. ఇందులో మొదటి విభాగం, జాతీయ ప్రజా కాంగ్రెస్ గురించి తెలియజేస్తుంది. ఇది చైనా పీపుల్స్ రిపబ్లిక్ ఉన్నత అధికార వర్గంగా ఉంటుంది. ఇది దేశంలో శాసన నిర్మాణ అధికార వర్గం అయినందువల్ల, ప్రాంతాలనుండి ఎన్నికైనవారు దీనిలో డిప్యూటీలుగా నియుక్తులౌతారు. వీరితో బాటు, స్వయంప్రతిపత్తిగల ప్రాంతాలు, పురపాలక సంఘాలు, కేంద్ర అధికారం అజమాయిషీ కింద ప్రత్యక్షంగా ఉంటాయి. విదేశాల్లో ఉన్న సాయుధ దళాల చైనీయులు కూడా దీని పరిధిలోకి తేబడ్డారు. నాలుగు సంవత్సరాల కాలపరిమితిగల ఈ కాంగ్రెస్ సంవత్సరానికోసారి సమావేశమౌతుంది.

రాజ్యాంగంలోని మూడో అధ్యాయంలో, పౌరుల ప్రాథమిక హక్కులు, విధులు చేర్చటం జరిగింది. ఈ హక్కుల్లో, వయోజన ఓటింగ్, పౌరుల్లో శాసనపర సమధర్మం, వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం, సమావేశ స్వాతంత్ర్యం, ప్రదర్శనా స్వాతంత్ర్యం, సంఘ నిర్మాణ స్వాతంత్ర్యం, మత విశ్వాస స్వాతంత్ర్యాలుంటాయి. మహిళలకు పురుషులతోబాటు, అన్ని రంగాల్లో సమాన హక్కులివ్వటం జరిగింది. చైనా ప్రజలకు పని హక్కు, విరామ హక్కులు, విద్యార్జన హక్కులు, వృద్ధాప్యంలో పునరావాస హక్కులను ఇవ్వటం జరిగింది. ఈ హక్కులతోపాటు, పౌర విధులను కూడా పేర్కొంది. అవి ప్రభుత్వ ఆస్తిపాస్తుల పరిరక్షణ, దేశీయ భూభాగాల రక్షణ, శాసనపరంగా పన్నులు చెల్లించడం మొదలైనవి.

నాల్గో అధ్యాయంలో, మూడు పరిచ్ఛేదాలు మాత్రమే ఉన్నాయి. అవి జాతీయ పతాకం, జాతీయ చిహ్నం, రాజధాని గూర్చిన వివరణ .

రాజ్యాంగంలో అత్యున్నత అంగం, జాతీయ ప్రజా కాంగ్రెస్ (National People Congress), ఇది ప్రతి సంవత్సరం సమావేశమై, కింది విధులను నెరవేరుస్తుంది .

1. రాజ్యాంగ సవరణ
2. చట్టనిర్మాణం
3. రాజ్యాంగ నిబంధనల అమలు
4. పీపుల్స్ రిపబ్లిక్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక
5. చైర్మన్ సిఫార్సుతో ప్రధాని అభీష్టం మేరకు, స్టేట్ కౌన్సిల్ ఎంపిక
6. చైర్మన్ అభీష్టం మేరకు వైస్ చైర్మన్, జాతీయ రక్షణ మండలి సభ్యుల ఎంపిక
7. సర్వోన్నత ప్రజా కోర్టు అధ్యక్షుల ఎన్నిక
8. సర్వోన్నత ప్రజా ప్రొక్యూరేట్ ముఖ్య ప్రొక్యురేటర్ ఎన్నిక
9. జాతీయ, ఆర్థిక ప్రణాళికల నిర్ణయం
10. విత్తీయ నివేదికను, రాజ్య బడ్జెట్‌ను పరీక్షించి ఆమోదించటం
11. రాష్ట్రాల సరిహద్దులను, హోదాను, ప్రాంతాల స్వయంప్రతిపత్తిని , పురపాలక సంఘ స్వయంప్రతిపత్తిని, కేంద్ర అధికార వర్గనియంత్రణ కింద ఆమోదించటం
12. సాధారణ క్షమాభిక్ష నిర్ణయించడం
13. యుద్ధం, శాంతి విషయాలు నిర్ణయించడం
14. అవసరమైనప్పుడు ఇతర విధులను, అధికారాలను అమలుపర్చడం

చైనా రిపబ్లిక్‌లో, చైర్మన్ హోదా పూర్వం కంటే, శక్తిమంతంగా రూపొందింది. ఆరుగురు వైస్ చైర్మన్‌ల హోదా ఒక్కరికే పరిమితం చేయడం జరిగింది. చైర్మన్ స్టేట్ కౌన్సిల్, ప్రధాన మంత్రి విధులను పర్యవేక్షిస్తాడు. అతడు సర్వోన్నత రాజ్య సమావేశాన్ని పిలుస్తాడు. అందులో, అన్ని ప్రభుత్వ శాఖాధిపతులు

BRAOU

ఉంటారు. చైర్మన్ అధికారాలను జాతీయ ప్రజా కాంగ్రెస్ మాత్రమే నియంత్రిస్తుంది. ఇతర పెద్దదైన కేంద్ర కార్యాలయాలతోబాటు, స్టేట్ కౌన్సిల్, నేషనల్ డిఫెన్స్ కౌన్సిల్, పీపుల్స్ సుప్రీం కోర్ట్, సుప్రీం ప్రాసిక్యూటర్ లుంటాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ప్రాంతీయ కమిటీ, లేదా జిల్లా పరిపాలన వ్యవస్థలుంటాయి.

చైనా కమ్యూనిస్ట్ పార్టీ చైనాలోని అన్ని రాజకీయ పార్టీల కంటే అగ్రగామిగా ఉంది. 1949లో 4.5 మిలియన్లు గల పార్టీ సభ్యత్వం, 1961 నాటికి 17 మిలియన్ల వరకూ పెరిగింది. ఈ పార్టీ, ప్రాతినిధ్య, కార్యనిర్వాహణ, పరిపాలన, నియంత్రణ అనే నాలుగు మార్గాల్లో వ్యవస్థీకృతమైంది. 1956 నాటికి పార్టీ ప్రాతినిధ్య రంగంలో ఉన్నత రంగమైన జాతీయ ప్రజా కాంగ్రెస్, సంవత్సరానికొకసారి సమావేశమౌతుంది. అందులో సభ్యుల్ని, ఐదు సంవత్సరాలకోసారి ఎన్నుకుంటారు. కార్యనిర్వాహక రంగంలో శక్తిమంతమైన కేంద్ర సంఘముంటుంది. ఈ సంఘం రెండు సంవత్సరాలకొకసారి ఎన్నికౌతుంది. ఈ సంఘ సభ్యుల కాలపరిమితి కూడా 5 సంవత్సరాలే. వీరిలో ఒక అధ్యక్షుడు, ఐదుగురు ఉపాధ్యక్షులుంటారు. ఈ సంఘం ఏకారణం చేతనైనా సమావేశం కానపుడు, పార్టీ పొలిట్‌బ్యూరోకు దాని అధికారాలను దత్తం చేస్తారు. అందువల్ల, చైనా స్థాయీసంఘాన్ని 7గురు ప్రతిభావంతులైన వ్యక్తులు నిర్వహిస్తారు. 1966 లో జరిగిన సాంస్కృతిక విప్లవ కాలం నాటికి, ఈ సభ్యత్వం 5 గురికి కుదించడం జరిగింది. మావో అధ్యక్షతన ఉన్న కేంద్ర సంఘంలో, ఐదుగురు ఉపాధ్యక్షులున్నారు. వారు లియో చిసావో, చౌ-ఎన్-లై, చూ-టే, హ్స్-చియాంగ్, లిన్-పి-యావో. కేంద్ర సంఘం ఆరు ప్రాంతీయ బ్యూరోలను ప్రాంతీయ శిక్షణ, ప్రచారం, సాంఘిక కార్యకలాపాలు వంటి విభాగాలను నిర్వహిస్తుంది. 1949 లో మావో అధ్యక్షతన పార్టీ పొలిట్‌బ్యూరో పీపుల్స్ రిపబ్లిక్‌లను, మిలటరీ కౌన్సిల్, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ నిర్వహించడం జరిగింది. 1956 తర్వాత, పార్టీ వ్యవస్థ కేంద్ర సచివాలయ పదవిని మావో పరిత్యజించాడు. 1959 లో స్టేట్ చైర్మన్ పదవికి పీపుల్స్ రిపబ్లిక్‌ల అధ్యక్ష పదవిని కమ్యూనిస్ట్ పార్టీ ఉపాధ్యక్షుడైన లీ-సా-హొచీ కనుకూలంగా రాజీనామా చేశాడు. లీ-సా-హొచీ 1966 వరకు అధ్యక్ష పదవి నిర్వహించాడు. 1966 తర్వాత, రాజ్యఅధ్యక్ష పదవి భర్తీ చేయకపోవడంతో, చివరకు 1975 వ సంవత్సరంలో అవి పూర్తిగా రద్దైనాయి.

కమ్యూనిస్టుల పీపుల్స్ డెమోక్రటిక్ డిక్టేటర్‌షిప్ శ్రామిక వర్గ నియంతృత్వంగా పిలువబడ్డా, ఇది అనేక కమ్యూనిస్టేతర పార్టీల అస్థిత్వాన్ని అనుమతించింది. వీటిలో ప్రధానమైంది కొమింగ్‌టాంగ్ విప్లవ పార్టీ. దీనిలో కొమింగ్‌టాంగ్ సభ్యులు వామపక్ష వర్గానికి చెందినవారు. వీరికి చైనా ప్రధాన భూభాగంలో ఆధిపత్యముండేది.

రెండోది, డెమోక్రాటిక్ పార్టీ, ఇది ఎల్లపుడు చైనా కమ్యూనిస్ట్ పార్టీకే అనుకూలంగా ఉంటూ వచ్చింది. మూడో పార్టీ కొమింగ్‌టాంగ్ చైనా కమ్యూనిస్ట్ పార్టీల మధ్య రాజీ ప్రయత్నం చేసింది. కానీ, విజయవంతం కాలేదు. నాల్గోది, షీ-కుంగ్-టాంగ్. ఈ పార్టీని విదేశాల్లో నున్న చైనీయులు ఏర్పాటు చేశారు. ఇది పూర్వ కాలంనాటి హంగ్-మెన్ రహస్య సంఘంనుండి ఆవిర్భవించింది. ఐదోది, ప్రజాస్వామిక పునర్నిర్మాణ పార్టీ. ఆరోది, ప్రజా విమోచన పార్టీ. ఈ పార్టీ జపాన్‌కు వ్యతిరేకంగా, 1930 వ సంవత్సరంలో ఏర్పాటైంది.

కమ్యూనిస్ట్ పార్టీ ప్రజాస్వామిక నియంతృత్వ విధానం ప్రతిపక్ష పార్టీల పట్ల పాశ్చాత్య దేశాలకంటే భిన్నంగా ఉంది. అది విశ్వాస ప్రతిపక్ష సూత్రాన్ని పాశ్చాత్యులు అర్థం చేసుకున్నట్లుగా, రాజకీయ పక్షాల స్వేచ్ఛా సంఘాల పాత్రను గుర్తించలేదు. ఈ కమ్యూనిస్టేతర పార్టీలు, ప్రభుత్వ విధానాన్ని ఎక్కువగా ప్రతిఘటించక, కమ్యూనిస్ట్ ప్రభుత్వానికి తమ సహకారాన్ని, అంగీకారాన్ని నిర్ద్వంద్వంగా ఒప్పుకున్నాయి.

BRAOU

## 24.9 ఆర్థికాభివృద్ధి – పరిశ్రమల వ్యాప్తి

1949 లో కమ్యూనిస్ట్ ప్రభుత్వం అస్తవ్యస్థమైన ఆర్థిక వ్యవస్థతోపాటు, లోపభూయిష్టమైన ద్రవ్యోల్బణాన్ని వారసత్వంగా పొందింది. దీనికితోడు, అనేక సేద్య యోగ్యమైన భూములను, 30 శాతం నుండి 40 శాతం వరకూ వరదలు నష్టపరిచాయి. పారిశ్రామిక, ఆహారోత్పత్తులు 1956 లో 71 శాతం నుండి 75 శాతం వరకూ పడిపోయాయి. అయితే, చైనా పీపుల్స్ రిపబ్లిక్, జాతీయ ఆర్థిక పునర్నిర్మాణానికి పారిశ్రామిక, వ్యవసాయోత్పత్తుల పెరుగుదలకు ప్రధాన స్థానమిచ్చింది. ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పీపుల్స్ కరెన్సీని (Tau-min-piao) 1949 లో విడుదల చేసింది. విదేశీ కరెన్సీల చెలామణిని నిషేధించింది. ఈ చర్యల అనంతరం ధరల స్థిరీకరణకు కృషి జరిగింది. కాగిత కరెన్సీని తగ్గించడానికి తీవ్ర చర్యలను చేపట్టింది. వేతనా పద్ధతిని ప్రవేశపెట్టి, కార్మికులకు, కర్షకులకు జీతాలను నిర్ణయించింది. అత్యవసర వస్తువులైన బియ్యం, నూనె, బొగ్గు, పిండిపదార్థాలు, నూలు బట్టల ధరలను కూడా నిర్ణయించింది. పొదుపును, బ్యాంక్ డిపాజిట్లను పెంచేందుకు, మార్గాలను అన్వేషించడం జరిగింది. వస్తుమార్పిడి సులభంగా జరిగేందుకు వీలుగా, ప్రజావిమోచన సైన్యం రవాణా మార్గాలను మెరుగు పర్చింది. వ్యవసాయిక, పారిశ్రామిక, వాణిజ్య, అమ్మకం, ఆదాయ పన్నులను ప్రవేశపెట్టారు. ఈ చర్యల ద్వారా, 1950 లో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసి ప్రభుత్వ బడ్జెట్ సంతులనం చేయడం జరిగింది.

తీవ్రమైన అడ్డంకులనధిగమించి, ఆధునిక పారిశ్రామిక సమాజాన్ని రూపొందించడంలో, చైనా కమ్యూనిస్ట్ పార్టీ చాలా కృషి చేసింది. పరిశ్రమల ప్రాముఖ్యాన్ని , పారిశ్రామిక విస్తారాన్ని లెనిన్ ఉద్ఘాటిస్తూ, " సోషలిస్ట్ సమాజానికి యదార్థమైన పునాది ఒక్కటే. అది భారీ పరిశ్రమ మాత్రమే" అన్నాడు. పారిశ్రామికీకరణ కీలక పాత్రను గుర్తించడంతోనే, అది సామ్యవాద దేశంగా నిర్మితమౌతుందని చైనా కమ్యూనిస్ట్ పార్టీ గుర్తించి, ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించింది. 1952 నాటి యుద్ధానికి పూర్వం, పారిశ్రామిక వ్యవసాయిక రంగాలు శిఖరాగ్రాలను అధిరోహించడమేకాక, ఈ రంగాల్లో 1959 నాటికే 77.5 శాతం అభివృద్ధిని సాధించింది. పారిశ్రామిక ఉత్పత్తులను పెంచడం కోసం, 1951లో మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించడం జరిగింది. 1952లో ప్రణాళికా సంఘం ఏర్పాటైంది. ఈ ప్రణాళికకు ఈశాన్య ప్రాంత అధ్యక్షుడైన కావోకాంగ్ మార్గదర్శకత్వం వహించాడు. ఈ ప్రణాళిక 1953 నుండి ప్రారంభం కావలసి ఉండగా, గణాంక విజ్ఞాన లోపం వల్ల, ప్రణాళికా రచనలో మెలకువ, అనుభవం లేకపోవ వల్లనూ, ప్రణాళిక ఆచరణలో తీవ్ర జాప్యం జరిగింది. చివరకు, అది అధికారికంగా 1954 నుండి ఆచరణలోకి వచ్చింది. ఈ ప్రణాళిక వల్ల 694 పారిశ్రామిక ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. వీటిలో, 156 యంత్రాంగాలు సోవియట్ సహాయంతో నిర్మితమైనాయి. ప్రణాళిక కాలాంతంలో పారిశ్రామిక ఉత్పత్తి రెండింతలుకావాలని ప్రభుత్వం ఆశించింది. సహకార క్షేత్రాల ప్రవేశం, ఉత్పత్తులను మరింత ప్రభావితం చేసింది. ప్రైవేట్ పరిశ్రమ వాణిజ్య రాజ్య వ్యవస్థలో ఒకటి రూపొందింది. మూలధనంలో 58.2 శాతం పారిశ్రామిక నిర్మాణానికి కేటాయించడం జరిగింది. 19.2 శాతం రవాణా, తపాలా ; 7.6 శాతం వ్యవసాయం, అటవీ విధానం, నీటి సంరక్షణకు ; 7.2 శాతం సాంస్కృతిక విషయాలకు, విద్య, ప్రజారోగ్యానికి కేటాయించడం జరిగింది.

1956 లో పారిశ్రామికోత్పత్తిలో "గొప్ప ముందడుగు" *(Great leap)* జరిగి, ఉత్పత్తులు పూర్వం కంటే, 25 శాతం పెరిగాయి. అంటే, మూలధనం పెట్టుబడికి 60 శాతం పెరిగింది. మొదటి పంచవర్ష ప్రణాళిక ఇంకా సంపూర్ణం కావాల్సి వుండగానే మౌలిక లక్ష్యాలను సాధించింది. ఉక్కు ఉత్పత్తి 5.3 మిలియన్ టన్నులు, ఇనుము 5.8 మిలియన్ టన్నులు, విద్యుచ్ఛక్తి 19030 మిలియన్ల కిలోవాట్లకు చేరింది. ప్రతిఒక్కటి 25 శాతం చొప్పున పెరిగి, మౌలికమైన కోటాను మించింది. బొగ్గు ఉత్పత్తి 122 మిలియన్

టన్నులు పెరిగి, 80 శాతం అధికోత్పత్తిని సాధించింది. 11.6 కోటా పైబడి లాభాలు వచ్చాయి.

మొదటి పంచవర్ష ప్రణాళిక విజయవంతమైనందువల్ల, 1958-62 రెండో పంచవర్ష ప్రణాళికను, అధికోత్సాహంతో ప్రకటించడం జరిగింది. పారిశ్రామిక వ్యవసాయ ఉత్పత్తులు 1962 నాటికి 75 శాతం వరకు పెరిగాయి. దానివల్ల, జాతీయాదాయం 50 శాతం వరకు పెరిగింది. ఈ ప్రణాళికల వల్ల, ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను చేరుకోవడంతో, ప్రణాళికా రచయితల విశ్వాసం పెరిగింది. బొగ్గు 190 నుండి 210 మిలియన్ టన్నులు, ఉక్కు 10.5 నుండి 12 మిలియన్ టన్నులు, విద్యుచ్ఛక్తి 43 వేల మిలియన్ కిలోవాట్లు, ముడినూనె 5-6 మిలియన్ టన్నులు, ధాన్యం 275 మిలియన్ టన్నులు, నూలు 2.4 మిలియన్ టన్నులకు పెరిగాయి.

## 24.10 భూ సంస్కరణలు– వ్యవసాయక సామూహీకరణ

ఆర్థిక స్థిరత్వం కోసం ప్రభుత్వం వ్యవసాయిక విప్లవాన్ని ప్రారంభించింది. ప్రధాన సమస్య అయిన భూస్వామ్య వ్యవస్థని సంస్కరించడానికి ప్రయత్నించింది. 1950 లో వ్యవసాయిక సంస్కరణ చట్టాన్ని ప్రకటించింది. అది, "భూస్వామ్య దోపిడీనుండి భూస్వామ్యత్వం" అనే పేరుమీద రద్దైంది. భూస్వాముల కమతాలను, క్షేత్ర పనిముట్లనూ జప్తు చేసుకొని, వాటిని భూమిలేని రైతాంగానికి పంచింది. ఈ భూమి పంపిణీ గూర్చి తెలుసుకొనే ముందు చైనాలో వ్యవసాయిక జనాభా వర్గీకరణ గురించి పరిశీలించటం అవసరం. వీటిని 5 వర్గాలుగా విభజించారు. ఒక వర్గం భూస్వాములు. వీరి ఆధీనంలో విస్తృతమైన భూమి, ఆస్తులున్నాయి. వీరు తాము శ్రమపడకుండా, ఇతరుల శ్రమ దోపిడిపై జీవించేవారు. రెండో వర్గం, ధనిక రైతాంగం. వీరు భూమిని స్వాధీనం చేసుకొని, తమంతతాము పనిచేస్తూ, ఇతర వ్యవసాయ కూలీలకు రుణాలివ్వడం, పేదరైతులకు భూ భాగాలను కౌలుకివ్వడం చేసేవారు. ధనిక రైతాంగం, మూడో శ్రేణికి చెందినవారు. మధ్యతరగతి రైతాంగమైన వీరు స్వంత భూమి ఉండి, ఇతరులను దోపిడీకి గురిచేయక, తమంత తాము పనిచేసేవారు. నాల్గోవర్గం బీద రైతాంగం. వీరు స్వల్ప భూమిపై యజమాన్యం కల్గి ఉండి, వారి భూముల్ని అవసరాల నిమిత్తం ఉంచుకొని, మిగతా భాగాలను విక్రయించేవారు. వీరు ఇతరులనుండి భూమిని కౌలుకు కూడా తీసుకునేవారు. వ్యవసాయ కూలీలు, ఈ వర్గ విభజనలో అథమ స్థాయిలో ఉన్నారు. వారికి ఏమాత్రం భూమి లేక, శ్రమ జీవనం గడుపుతూ, అప్పులతో బాధపడుతూండేవారు.

సిద్ధాంతపరంగా, ప్రభుత్వం భూమి పంపిణీ చేసే భూస్వాముల భూముల్ని, ఈ జప్తు నుండి మినహాయించింది. తామే సేద్యం చేసుకునే ధనిక రైతాంగాన్ని కూడా మినహాయించింది. అయితే, భూస్వాములు చేసిన ఎన్నో దౌర్జన్య చర్యలు, అన్యాయాలపై ధనిక రైతాంగంపై ఆరోపణ సమావేశాలు, స్థానికంగా కమ్యూనిస్ట్ పార్టీ వర్కర్ల మార్గదర్శకత్వంలో నడిచాయి. ఈ పార్టీ వర్కర్లకు తోడుగా, రైతాంగం కూడా ఆరోపణ కార్యక్రమాల్లో పాలుపంచుకొంది. తక్కువ వ్యవధిలోనే ఈ ప్రజావిచారణలు జరిగి, దోషులుగా నిర్ధారితమైన వారు తీవ్రంగా శిక్షించబడ్డారు. పూర్వం జెంట్రీలుగా వ్యవహరించబడ్డ, సాంప్రదాయ సమాజానికి వెన్నెముక వంటి వారైన వీరు, కొద్దికాలంలోనే పూర్తిగా నాశనమయ్యారు.

1952 డిసెంబర్ కల్లా, వ్యవసాయక విప్లవం పూర్తైంది. దీని ఫలితంగా, 700 మిలియన్ల మౌల ($1^{1/2}$ ఎకరాల ) భూమి, 300 మిలియన్ల రైతాంగానికి పంపిణీ అయింది. జనాభా సాంద్రత అధికంగ

గల తూర్పు, దక్షిణ చైనాలో కుటుంబ పెద్దలకు ఒక మౌ ఉత్తర చైనాలో మూడు మౌలు మంచూరియాలో 7 మౌలు పంపిణీ అయ్యాయి. మొత్తం మీద, ఈ భూమి విప్లవం, భూమి లేని పేద రైతాంగానికి, వ్యవసాయ కూలీల మద్దతు, సానుకూలతతో విజయవంతమైంది. భూస్వాముల దోపిడీ వ్యవస్థ రద్దైంది.

1952 డిసెంబర్‌లో భూమి విప్లవం పూర్తైన వెంటనే, ప్రభుత్వం రెండో దశలో భూసంస్కరణలను చేపట్టింది. ఇదే సామూహీకరణ ఉద్యమం. ఈ ఉద్యమం చేపట్టినందువల్ల, ఉత్పత్తులు పెంచొచ్చని ప్రభుత్వం ఆశించింది. దీంతో, ధనిక వర్గం మరల తలెత్తకుండా నిరాదరణకు గురైంది. ఈ సామూహీకరణ వల్ల చైనా భారీ వ్యవసాయ ప్రత్యేకీకరణ సాధించింది. సామ్యవాద లక్ష్య దిశగా, శరవేగ పురోగతికి దోహదం చేసింది. ఈ సామూహీకరణలో అనేక దశలున్నాయి. ఫిబ్రవరి 15, 1953లో, వ్యవసాయ ఉత్పత్తుల నిర్ణయాల్లో, పరస్పర సహాయ సహకార కార్యక్రమాన్ని కమ్యూనిస్ట్ పార్టీ చేపట్టింది. ఇది పరస్పర సహాయ బృందాల స్థాపనకు పిలుపునిచ్చింది. ఈ బృందాల్లో రైతాంగం ఏకమై ఉమ్మడిగా పనిముట్లను అప్పుగా తీసుకొని, గొప్ప కృషి చేశారు. ఈ సామూహీకరణ ముఖ్యంగా, చెట్లు నాటే వసంత ఋతువులో, పంటల కోతలు జరిగే ఆకురాలు కాలంలో జరిగాయి. రెండో దశైన కింది స్థాయి వ్యవసాయ సహకారాల కాలంలో, పాక్షిక సామ్యవాద వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులు, వారి పనిముట్లను, శ్రమను సమీకృతం చేయడమే కాకుండా, భూమిని కూడా సమీకరించారు. అయినప్పటికీ, సిద్ధాంతపరంగా, వైయక్తిక యాజమాన్యాన్ని నిల్పుకున్నారు. మూడో దశలో సంపూర్ణ సామూహీకరణ జరిగి, సహకార సంఘాలేర్పడ్డాయి, అవి సోవియట్ సమూహ క్షేత్రాల్లాంటివి. వీటిలో అందరూ సభ్యులే. భూమిపై సమిష్టి సభ్యత్వం ఉంటుంది.

ఈ విధంగా, ఉత్పత్తులను పెంచడానికి, రైతుల వ్యక్తిగత ఆదాయం పెంపొందించడానికి, సామూహీకరణ అత్యంత ఆవశ్యకరమని చైనా ప్రణాళికా సంఘం భావించి, 1957 నాటికి, 1/3 వంతు రైతులను ఈ సహకార సంఘాల సభ్యులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాని, దీనికి భిన్నంగా 1955 సంవత్సరం నాటికి 14 శాతం మంది రైతులు మాత్రమే, ప్రాథమిక ఉత్పత్తిదారుల సంఘాల్లో చేరారు. మొదటి ప్రణాళిక కాలాంతంలో చైనా దేశం తీవ్రమైన ఆహార కొరత సమస్య ఎదుర్కొన్నప్పుడు, మావో మంద్ర స్థాయి సామూహీకరణే దీనికి కారణమని భావించాడు. ఈ కాలంలో పెరుగుతున్న జనాభాను అరికట్టడానికి, జనాభా నియంత్రణ చర్యలను చేపట్టడం జరిగింది. దేశంలో నిరుద్యోగ సమస్య, ఇతర సమస్యలు తీర్చడానికి, అధిక వ్యవసాయోత్పత్తులు అత్యంత అవసరమని భావించి, జూలై 1955 లో మావో వ్యవసాయ సామూహీకరణలో, రైతాంగం మద్దతుకై పిలుపునిచ్చాడు. దీనికి కొంత వ్యతిరేకత ఎదురైనా, మావో పిలుపుకు ప్రజలనుండి మంచి స్పందన లభించింది. అనేక వేల సంఖ్యలో రైతులు సామూహీకరణకు సంఘటితమైనారు. వీరిలో, 88 శాతం పూర్తి స్థాయి సహకార సంఘంలో చేరారు. జూన్ 1950 కల్లా 108 మిలియన్ల 90.4 శాతం రైతు కుటుంబాలను స్వచ్ఛందంగా సమూహీకరించడం జరిగింది. పోలీసు, స్వచ్ఛంద రక్షక దళాలు, పోలీసులు ఈ సామూహీకరణకు తోడ్పడ్డారు. 1957 నాటికి సామూహీకరణ సంపూర్ణమై, 120 మిలియన్ల రైతు కుటుంబాలు, 7,20,000 యూనిట్లుగా వ్యవస్థీకరించడం జరిగింది. ఈ సామూహీకరణవల్ల, వ్యవసాయ ఉత్పత్తులు, గత సంవత్సరాలకంటే కొద్దిగా పెరిగాయి. వ్యవసాయోత్పత్తులు 1.3 శాతం పెరగగా, జనాభా 2.3 శాతం వరకూ పెరిగింది. దీంతో, సామూహీకరణ వల్ల ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. పైగా, ఈ పద్ధతి కమ్యూనిస్ట్ పార్టీ ప్రమాణం చేసిన భూమిపై, వ్యక్తిగత అధికారానికి భిన్నంగా ఉంది. అయితే, 1958 లో ప్రవేశపెట్టిన "పీపుల్స్ కమ్యూన్" (peoples Commune) ద్వారా, సామ్యవాద నిర్మాణానికి కృషి జరిగి, అభివృద్ధి పథం వైపు చైనా పయనించింది.

## 24.11 సాంఘిక సంస్కరణలు

కమ్యూనిస్ట్ పాలన ప్రాథమిక సామాజిక మార్పిడికి దిశగా నడిచింది. దీనితో, కుటుంబ వ్యవస్థలో అత్యంత ప్రాముఖ్యమైన పరిణామాలు సంభవించాయి. స్త్రీ విమోచన కోసం వారు అథమ స్థాయిలో, సనాతన సమాజాల్లో ఉన్న అసమానతల్ని తొలగించారు. నూతన శాసనాలు జారిచేయబడి ఆస్తి, యజమాన్యంలో స్త్రీలకు సమాన హక్కులివ్వడం జరిగింది. 1950 నాటి వివాహ శాసనంలో, బాల్య వివాహాలు, ఉంపుడుగత్తె విధానం చట్టవిరుద్ధమయ్యాయి. యువతులకు, వారి జీవిత భాగస్వామిని ఎన్నుకునే హక్కు ఇవ్వడమైంది. విడాకులు కూడా, చట్టబద్ధమైనాయి. మహిళలకు పురుషులతో సమానంగా, రాజకీయ హక్కులివ్వడమైంది. లక్షల కొలది మహిళల్ని ప్రభుత్వ కార్మిక దళాల్లో చేర్చడమైంది. ఈ కుటుంబ వ్యవస్థలో విప్లవాత్మక చర్యలను అనుసరించడంలో కమ్యూనిస్ట్‌లు ఆశించేదేమిటంటే, కన్ఫూషియన్ సిద్ధాంత ప్రకారం ఉండిన కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత స్థానంలో, దేశ విధేయతను పెంపొందించడం. మరో ఉద్దేశం, మహిళల్ని సమీకృతపర్చి, దేశాభివృద్ధి కార్యక్రమాల్లో వారు పాలుపంచుకునేలా చేయడం. కమ్యూనిస్ట్ పాలన మూఢాచారాల్ని తుడిచివేసి, మత సంస్థలకు విరుద్ధంగా ఉద్యమం జరిపించడం ద్వారా చైనా రాజకీయ సంఖ్యా భావ ప్రభావాన్ని నిర్ధారించేలా చేసింది. విదేశీయుల అనుబంధం లేకుండా ఉన్న టావోయిజం వంటి మత వ్యవస్థల పట్ల, కమ్యూనిస్ట్‌లు కఠినంగా వ్యవహరించారు. కాని, కమ్యూనిస్ట్ ఆసక్తి ఉన్న సౌత్ యీస్ట్ ఆసియాల్లో, యితర ప్రాంతాలలోగల బౌద్ధమతం, ఇస్లాంమతం పట్ల బహిరంగంగా గౌరవ భావాన్ని చూపెట్టారు.

సాంప్రదాయక రాజకీయ భావన, సాంస్కృతిక సమైక్యత కొన్ని సాంప్రదాయక మర్యాదలు, ఆచారాల పట్ల సహనభావం, ప్రోత్సాహం చూపెట్టడం జరిగింది. ఫలితంగా సాంప్రదాయక కళలు, సాహిత్యాలకు కూడా ప్రోద్బలం లభించింది.

వాస్తవానికి, చైనా సమాజ పూర్వ స్వరూపం మార్చడంలో, కమ్యూనిస్ట్‌ల ప్రయత్నం విశిష్టమైంది. భూస్వాముల బహిష్కరణ చర్యలను రైతాంగం ఉత్సాహవంతంగా ఆహ్వానించినప్పటికీ, తదనంతరం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సహకార సంఘాలు, సామూహిక క్షేత్రాల భారీ పన్నుల పట్ల వీరు అసంతృప్తులైయ్యారు. అయితే, పారిశ్రామిక కార్మికులు, కమ్యూనిస్ట్ పాలనలో వారి పరిస్థితి కొంత మెరుగైందని భావించారు.

## 24.12 ప్రజోపయోగ సంస్కరణలు

1949 వ సంవత్సరంలో కమ్యూనిస్ట్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత, సనాతన విశ్వాసాలను నిర్మూలించారు. విస్తృతమైన బోధనా పద్ధతిని ప్రోత్సహించారు. కమ్యూనిస్ట్ పార్టీ మొదటి 5 సంవత్సరాల కాలంలో, తమ లక్ష్యసాధనలో కొన్ని తీవ్రమైన చర్యలనవలంబించక తప్పలేదు. కమ్యూనిస్ట్ సిద్ధాంతం ప్రకారం, విప్లవ శక్తుల గుర్తింపును కమ్యూనిస్ట్‌లే నిశ్చయించారు. కమ్యూనిస్ట్ పాలనకు పూర్వ ప్రభుత్వం, వీరికి పౌరహక్కుల్ని లేకుండా చేసింది. వారిని కఠినంగా చూసింది. ఈ అసమానతను నిర్మూలించడానికి, కమ్యూనిస్ట్ పాలన 1951-53లో హేతుబద్ధీకరణకు మద్దతు పలికింది. మావో భూస్వామ్యత్వాన్ని రద్దుపర్చి, వీరి భూములను రైతులకు పంచిచ్చాడు. ఈ చర్యలు స్థానిక నాయకత్వాన్ని, సాంప్రదాయవాదాన్ని కూలదోసింది, చైనా సనాతన సాంప్రదాయాల క్రమ అనుబంధాల్ని, నూతన శక మార్గంలోకి చొప్పించింది. మావో ఆర్థిక సమానత్వానికి విస్తృత ప్రచారం చేశాడు. చైనాలో,కమ్యూనిస్ట్ నాయకత్వంపైగల విశ్వాసం, కన్ఫూషియన్ సాంప్రదాయ పద్ధతిని నియంత్రించడానికి దోహదం చేసింది.

సనాతన చైనాలో విద్య కూడా, ఒక శక్తివంతమైన సాధనం గా ఉండేది. సనాతన సాంప్రదాయ విద్యల స్థానంలో, కమ్యూనిస్ట్‌ల జనబాహుళ్యానికి ఉపయోగపడే విద్యలను ప్రోత్సహించారు. ఈ విద్యా లక్ష్యాల్లో



BRAOU

ఒకటి, నిరక్షరాస్యులైన ప్రజలకు విస్తృత ప్రయోజనాలున్న సాంకేతిక నైపుణ్యాల్లో శిక్షణ నివ్వడం. ఈ రకమైన విద్య, ఆధునిక సమాజ నిర్మాణానికి కూడా దోహదం చేస్తుంది. రెండోది, పెకింగ్ విప్లవ కార్యక్రమాలను, విద్య ద్వారా జన బాహుళ్యంలో వ్యాప్తి చేయడం.

అయితే, ఈ సాంప్రదాయాలు ఉన్నత స్థాయిలో, రాజకీయ సిద్ధాంతాలను ఏర్పర్చాయి. దీనిలో అధిక భాగంలో, నిర్మాణాత్మకమైన పాఠ్యక్రమం ఉంది. ఈ పాఠ్యక్రమం, శారీరక శ్రమకు వ్యతిరేకంగా ఉన్న సాంప్రదాయ విద్యకు ప్రతి చర్యగా రూపొందించడం జరిగింది. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విద్యలను, ఈ పాఠ్యక్రమంలో పొందుపర్చడం జరిగింది. 1959 వ సంవత్సరం నాటికి, 86 మిలియన్ల బాలబాలికలు ప్రాథమిక పాఠశాలల్లో, 12 మిలియన్ల విద్యార్థులు మాధ్యమిక పాఠశాలల్లో, 6 లక్షల విద్యార్థులు కళాశాలల్లో విద్యనభ్యసించారు. దీనికి తోడు, ఉన్నత విద్యలో మౌలిక మార్పులు చేయడం, అధిక సంఖ్యలో సాంకేతిక, సార్వత్రిక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయటం జరిగింది. దీనివల్ల స్వల్ప కాలంలో ప్రత్యేక విజ్ఞానం పొందడంతో, సాధారణ విద్యకు సముచిత స్థానం లభించింది. 1963 వ సంవత్సరం నాటికి, 1944వ సంవత్సరం సంఖ్య కంటే, 5 రెట్లు ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు కళాశాలలో చేరారు. ప్రముఖ అమెరికన్ విజ్ఞానవేత్తల విజ్ఞానాన్ని, చైనాలో అధ్యయనం చేయటం జరిగింది. దీనిమూలంగా, చైనాలో విజ్ఞానవేత్తల, ఇంజనీర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. 1949-60 వ సంవత్సరాల మధ్య కాలంలో, కమ్యూనిస్ట్ ప్రభుత్వం అమెరికాలాగే 75 శాతం ఇంజనీర్లను పట్టభద్రులను చేసింది. ఈ విధమైన పరిణామాత్మక గణాంకాల్ని పరిశీలించినట్లైతే, ఇవి కమ్యూనిస్ట్ శకంలో అత్యంత ప్రభావవంతమైన అంకెలు. అయితే, చాలావరకు చైనాలో విద్య, పాఠ్యాంశాలపై రాజకీయ ప్రభావం ఉండటంతో, వాటి గుణాత్మకత అంతగా పెరగలేదు.

కమ్యూనిస్టుల నిరంతర ప్రచారం వల్ల, పాఠశాలల బోధనా విషయాలకన్నా, చైనీయుల ఆలోచనా సరళిలో మార్పులు సంభవించాయి. సాహిత్యం, వార్తాపత్రికలు, నాటకాలు, సినిమాలు, రేడియోలు నవ చైనా బోధనకు ఉపకరించాయి. ప్రజలను సుశిక్షితులైన పార్టీ వర్కర్లు (Kug-Pu) చైతన్యపర్చారు. అవి,12 మందితో కూడిన బృందాలతో ఏర్పడ్డాయి. పార్టీ ఆదేశాల మేరకు కీలకమైన చర్చలను జరిపి, వాటిని అర్థం చేసుకోవడం వారి కర్తవ్యంగా భావించడం జరిగింది. 1951 సంవత్సరంలో ఒక చట్టం ద్వారా, కొమింగ్‌టాంగ్ పార్టీ రద్దైంది. ఆ పార్టీ అనుయాయులు శిక్షకు గురైయ్యారు. 1951-52 సంవత్సరాల మధ్యకాలంలో, మావో ఎనిమిది "వ్యతిరేకోద్యమాలను" (Anti Movements) చేపట్టాడు. అవి, ఉద్యోగస్వామ్య వ్యతిరేకత (Anti Buerocracy) అవినీతి వ్యతిరేకత (Anti Corruption) వ్యర్థ వ్యతిరేకత (Anti Waste)రాష్ట్ర రహస్యాల వెల్లడి వ్యతిరేకత (Anti Leakage of State Secrets), లంచాల వ్యతిరేకత (Anti Bribary), పన్నుల ఎగవేత వ్యతిరేకత (Anti Tax Evation) మొదలైనవి. ఈ వ్యతిరేకోద్యమాలకు, ప్రజల మద్దతు లభించింది. ప్రభుత్వ వ్యతిరేకులు కార్యకలాపాల నుండి బహిష్కృతమైనారు. భూస్వామ్యవాదం, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి వ్యవస్థలు అంతమైనాయి. అంతేకాక, ఆధునిక శిక్షణ పొందిన విద్యావేత్తల సహకారం వల్ల, కమ్యూనిస్ట్ ప్రభుత్వ పాలన విషయాల్లో మార్పు వచ్చింది. అయితే, మేధోవర్గాల నుండి ప్రభుత్వ విధానాలు 1957 నాటి నూరుపూల (Hundred Flowers) కాలం సమయంలో, కొంత విమర్శకు గురైనాయి. కాని తర్వాత, 1962 సంవత్సరంలో జరిగిన సాంస్కృతిక విప్లవం (Cultural Revolution) ప్రతిఘటనోద్యమంగా పనిచేసింది. మావో ఈ విప్లవం ద్వారా, సిద్ధాంతపర లోపాలను సరిచేయొచ్చని భావించాడు. ఆ తర్వాత కాలంలో, మావో విద్యార్థులు, మిగతా ప్రజల మద్దతు కోసం, లిన్ పియావో ఆధ్వర్యంలో, గొప్ప కార్మిక వర్గ, సాంస్కృతిక విప్లవాన్ని కూడా ప్రారంభించి, పార్టీ ప్రతిష్టను నిలుపుకున్నాడు.

BRAOU

## 24.13 మావో–సే–టుంగ్ జీవిత రేఖలు

చైనా విప్లవ అగ్రనాయకుడుగా, విప్లవానంతర ప్రభుత్వ సిద్ధాంత కర్తగా కీర్తించబడ్డ మావో–సే–టుంగ్ 20వ శతాబ్ద ప్రజానాయకుల్లో అగ్రగణ్యుడని నిస్సందేహంగా చెప్పొచ్చు. మావో అధ్యాపకునిగా ,రాజనీతి వేత్తగా యుద్ధ వ్యూహకారునిగా, తత్వవేత్తగా, రచయితగా, జాతీయ నాయకునిగా, ప్రజా విమోచనకారునిగా, వివిధ రంగాల్లో బహుముఖ ప్రజ్ఞను చూపి చరిత్రలో విశిష్ట స్థానాన్నాక్రమించుకున్నాడు. చైనీయుల విస్తృతాభిమానం పొందిన మావో, 1893 డిసెంబర్ 26 న, హూనాన్ రాష్ట్రంలో తోషాన్ గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించాడు. మావో తండ్రి జెన్-హంగ్ సామాన్య కర్షకుడే కాక, సైనికుడు కూడా. మావో తల్లి బౌద్ధమతాభిమాని. ఆమె నిరక్షరాస్యురాలైనప్పటికీ, మావోకు మతపరమైన విద్యను బోధించింది. మావో తన 8వ ఏట షావోషాన్ లోని పాఠశాలలో, ప్రాథమిక విద్యనభ్యసించాడు. నిన్నప్పటి నుండి అతనికి విద్య పట్ల, పుస్తక పఠనం పట్ల, అత్యంత అభిరుచి ఉండేది. విద్యార్థిగా ఉన్నప్పుడే మావోను, చెంగ్-కుయన్-ఇంగ్ రచించిన "వర్డ్స్ ఆఫ్ వార్నింగ్ టు యాన్ ఎఫ్లుయెంట్ ఏజ్" (Words of Warning to an Affluent Age) అన్న గ్రంథం చాలా ప్రభావితం చేసింది. ఉన్నత చదువులకై తన తండ్రి వ్యతిరేకించగా, తన 15వ యేట ఇల్లు విడిచి, ప్రాంతీయ రాజధాని సియన్ చియాంగ్ లోని తుంగ్ షాన్ కు పారిపోయాడు. అక్కడ ప్రాథమిక పాఠశాలలో చదువు ప్రారంభించాడు. అక్కడే, "గ్రేట్ హీరోస్ ఆఫ్ ద వరల్డ్" (Great Hero's of the World), అనే గ్రంథంలోని జార్జి వాషింగ్టన్ జీవిత చరిత్ర మావోను మిక్కిలి ఆకర్షించింది. సియాన్ చియాంగ్ లోనే, మావో మేధో జీవితానికి, రాజకీయ శిక్షణకు నాంది పలికింది. ఈ సమయంలోనే, అతనికి భూస్వాముల పట్ల అయిష్టత ఏర్పడింది. తర్వాత చాంగ్-షా లోని మాధ్యమిక పాఠశాలలో చదివే సమయంలో, మొదటిసారి సన్-యాట్-సేన్ నడిపిన తుంగ్-మెంగ్-హుయ్ అభిమానిగా మారాడు. సన్ జాతీయ ఉదార భావాలు మావోను అమితంగా ఆకట్టుకున్నాయి. 1911వ సంవత్సరం విప్లవ పోరాటంలో పాల్గొని, తన మొదటి రాజకీయ శిక్షణను పొందాడు. మావోకు సనాతన సాంప్రదాయాలు, భూస్వామ్య అధికారంపై గల వ్యతిరేకతకు, రాజకీయ అనుభవం తోడై, అతనిలో సోషలిస్ట్ భావాలు రగుల్కొన్నాయి. మావో రాజకీయ అధికారం తుపాకీ గొట్టం ద్వారానే వస్తుందని ప్రగాఢంగా విశ్వసించాడు. మావో 1920 లో హునాన్ లోని నార్మల్ అధ్యయన కేంద్రం నుండి పట్టభద్రుడైనాడు. అక్కడే మావో అధ్యాపకులైన యువాన్, యంగ్-చాంగ్-చీలచే ప్రభావితుడై, నూతన భావాలు, పద్ధతులవైపు మళ్లాడు. 1919 నాటి మేధో విప్లవం కూడా, మావోను ప్రభావితం చేసింది. అనేక విద్యార్థి సంఘాలతో సంబంధం కుదుర్చుకొని, విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. పెకింగ్ విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్ గా ఉన్నప్పుడు, కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన లీ–తా–చావో తో సన్నిహిత సంబంధాలేర్పర్చుకొన్నాడు. 1919 మే 4 ఉద్యమ కాలంలో, విద్యార్థుల యూనియన్ ఏర్పర్చి సమ్మెలను జరిపాడు. ఈ కాలంలోనే, చంగ్-పోయ్‌లో "సియాంగ్ చియాంగ్ రివ్యూ" "న్యూహ్యూమన్" అనే పత్రికలను ప్రారంభించాడు. కాని, ప్రభుత్వ వ్యతిరేక ధోరణిలో నడిచిన ఈ పత్రికలను, ప్రభుత్వం కొద్ది కాలంలోనే నిషేధించడం జరిగింది.

తర్వాత కాలంలో, మావోకు పాశ్చాత్య ఉదార భావం పట్ల నమ్మకం సడలి, మార్క్సిజం వైపు మళ్లాడు. 1921 చైనాలో కమ్యూనిస్ట్ పార్టీ ప్రారంభంకాగా మావో ఆ పార్టీలో చేరి, ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైనాడు. మావో కమ్యూనిస్ట్ పార్టీలో తన హోదాను, ప్రతిష్ఠను అంచెలంచెలుగా పెంచుకున్నాడు.1921లో హూనాన్ పార్టీ కార్యదర్శియై, సెల్ఫ్ స్టడీ యూనివర్సిటీని ప్రారంభించాడు. ప్రారంభంలో మావో కార్మికోద్యమం పై దృష్టి కేంద్రీకరించి, 1922లో కార్మిక సంఘాలకు నాయకుడయ్యాడు. ఆ తర్వాత,1923 జూన్ లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ కేంద్ర సంఘానికి ఎంపికైనాడు. ఈ సంవత్సరంలోనే, "ది మోడర్న్ ఏజ్" అనే మాసపత్రిక స్థాపించాడు. ఆ తర్వాత కాలంలో , విప్లవ పోరాటంలో రైతులను సంఘటిత పర్చేందుకు కృషి చేశాడు. 1925వ సంవత్సరం నాటికి, రైతు ఉద్యమాన్ని బలమైన శక్తిగా రూపొందించాడు.

BRAOU

## 24.16 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Ahmed A.L. | : | **A Comprehensive History of the Far East** |
| Arun Bhattacharjee | : | **World Revolutions** |
| Claude & Buss | : | **The Far East** |
| David M.D | : | **Rise and Growth of Modern China** |
| Edgar Snow | : | **Red China Today** |
| Edwin E. Moise | : | **Present and Past Modern China & History** |
| Fitzerald C.P | : | **The Birth of Communist China** |
| Gray Jack | : | **Rebellions and Revolutions** |
| Gupte. R.S. | : | **History of Modern China** |
| Immanual Hsu | : | **The Rise of Modern China** |
| Mao-Tse-Tung, R. Payne | : | **Portrait of a Revolution.** |
| Mao-Tse-Tung | : | **Mao-Tse-Tung-Havanchi(Selected works of MaoTseTungvol 3,4** |
| Paul H. Clyde and Burton Beers | : | **The Far East** |
| Shiv Kumar and S Jain | : | **History of Modern China** |
| Vinacke H.M | : | **A History of Far East In Modern Times.** |
| Wallar D.J | : | **The Government and Politics of Communist China** |
| తెలుగు అకాడమీ | : | చైనా జపాన్ దేశాల చరిత్ర |


రచయిత్రి : ఇ. సుధారాణి

BRAOU

# ఖండం – VII : వియత్నాం విప్లవం

ఈ ఖండంలో, 25, 26, భాగాలున్నాయి. 25వ భాగంలో, 1946–54 మధ్య, వియత్నాంలో ఫ్రెంచ్ సామ్రాజ్యవాద పాలన నుండి విముక్తికై సాగిన పోరాటం, దాని ఫలితాలు, ప్రాముఖ్యతలను చర్చించడం జరిగింది.

26వ భాగంలో, 1961-75 మధ్య కాలంలో, వియత్నాం ఐక్యతకై సాగిన పోరాటం, దీనికి దారితీసిన పరిస్థితులు, ఇది నడచిన తీరు, దీనిలోని భిన్న దశలు, యుద్ధంలో అమెరికా వైఫల్యతకు కారణాలను వివరించడం జరిగింది. చివరగా, ఈ పోరాట ఫలితాలు, ప్రాధాన్యతలను గూడా చర్చించడం జరిగింది.

ఆధునిక ప్రపంచ చరిత్రలో సంభవించిన గొప్ప విప్లవాల్లో ఒకటిగా పేరొందిన వియత్నాం విప్లవ విశేషాలను, ఈ రెండు భాగాల్లో సమీక్షించడం జరిగింది. చరిత్ర కాలమానంలో, ఇది అత్యంతాధునిక ప్రజా విప్లవంగా నిల్చుంది.

BRAOU

# భాగం – 25 : వియత్నాం : ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విముక్తి పోరాటం (1946–54)

విషయ క్రమం


25.0 లక్ష్యాలు

25.1 పరిచయం

25.2 ఇండోచైనా : ఫ్రెంచ్ వలసాధిపత్యం

25.3 వియత్నాం జాతీయోద్యమాభివృద్ధి : హోచిమిన్

25.3.1 ద్వితీయ ప్రపంచ యుద్ధ పరిణామాలు : ప్రభావం

25.3.2 ద్వితీయ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితి : పరిణామాలు

25.3.3 ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విమోచన యుద్ధం, 1946–1954

25.3.3.1 జెనీవా ఒప్పందం : జూలై, 1954

25.3.3.2 ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విమోచన యుద్ధ ఫలితాలు

25.3.3.3 ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విమోచనా యుద్ధ ప్రాముఖ్యత

25.4 సంగ్రహంగా

25.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

25.6 ఉపయుక్త గ్రంధాలు


## 25.0 లక్ష్యాలు

ఈ పాఠ్యభాగాధ్యయనం ద్వారా, వియత్నాం భౌగోళిక స్థితి, ఈ ప్రాంతం ఫ్రెంచ్ వలస రాజ్యాధికారం కిందకు వచ్చిన తీరు, విదేశీ అధికారాన్నుండి విముక్తికై వియత్నాం ప్రజలు సాగించిన జాతీయ పోరాటం, దాని ఫలితాల గురించి తెలుసుకోగల్గాలి. ఇట్టి విమోచనోద్యమానికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించి, పొరుగు కమ్యూనిస్ట్ దేశాలైన చైనా, రష్యాల నుండి సహాయ సానుభూతులను పొంది, పాశ్చాత్య సామ్రాజ్యవాద రాజ్యాలైన ఫ్రాన్స్, అమెరికాలనెదిరించడమనేది, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లిన ప్రచ్ఛన్న యుద్ధం (Cold War) లో భాగమనే విషయాన్ని, క్షుణ్ణంగా గ్రహించగల్గాలి.

## 25.1 పరిచయం

ఆగ్నేయాసియాలో, తూర్పు, దక్షిణ సరిహద్దులుగా, దక్షిణ చైనా సముద్రం ఉన్న భూభాగమే, వియత్నాం (పటాన్ని చూడండి). ఇట్టి పొడవైన, విశాలమైన సముద్ర సరిహద్దు, విదేశీయులు సులభంగా, ఓడల సహాయం తేందే ప్రవేశించ వీల్లేకుండా, ఈ ప్రాంతానికి భౌగోళిక రక్షణ, రాజకీయ, సాంస్కృతిక ఐక్యతలను ప్రసాదించేందుకు దోహదపడింది.

వియత్నాం, దీనికి వాయవ్య దిశగా ఉన్న లావోస్, నైరుతి దిశగా ఉన్న కంబోడియా కలిసి, 'ఫ్రెంచ్ ఇండోచైనా' గా, 19వ శతాబ్ది చివరి దశాంకం నుండి ప్రసిద్ధిగాంచాయి. గమనించాల్సిన మరో చారిత్రకాంశమేమంటే, 1944–45లో కమ్యూనిస్టుల సారథ్యంలో విమోచనా పోరాటం మొదలయ్యేంతవరకూ కూడా, హనాయ్ రాజధానిగా గల ఉత్తర వియత్నాం ప్రాంతం 'టాన్‌కిన్' (Tonkin) గాను, సైగాన్ రాజధానిగా గల




వియత్నాం పోరాటం

B R A O U

దక్షిణ వియత్నాం ప్రాంతం 'ఆనామ్' (Annam), కొచ్చిన్-చైనా (Cochin-China) లు గా వ్యవహరించడం జరిగింది.

వియత్నాం దేశం వెయ్యి సంవత్సరాలు పైబడ్డ చరిత్ర గలది. దీని సుదీర్ఘ చరిత్రలో పదేపదే విదేశీయుల దాడులకు ఈ దేశం గురైంది. ఈ ప్రక్రియలో భాగంగా, ఇది శతాబ్దాల తరబడి, చైనా ప్రాబల్యం క్రింద మెలగింది. చివరగా 19వ శతాబ్దిలో, ఇది ఫ్రెంచ్ పాలన క్రిందకు రావడం జరిగింది.

## 25.2 ఇండో-చైనా : ఫ్రెంచ్ వలసాధిపత్యం

18వ శతాబ్ది ద్వితీయార్థంలో, ఇంగ్లాండ్ లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం, 19వ శతాబ్దిలో ఇతర ఐరోపా దేశాలు, అమెరికా, జపాన్ లకు వేగంగా వ్యాపించడంతో, ఈ దేశాలు ఆఫ్రికా, ఆసియా, అమెరికా ఖండాల్లో, పసిఫిక్ సముద్ర ప్రాంతంలో, వలసల స్థాపనకై తీవ్రంగా పోటీపడ్డాయి. పరిశ్రమల ముడిసరుకులు, తయారైన వస్తువుల అమ్మకానికి మార్కెట్లను ఈ వలస రాజ్యాలందివ్వడంతో బాటు, విజేత రాజ్యాల గౌరవప్రతిష్ఠలకు సంకేతాలుగా, నాటి సంస్కృతీ వ్యాప్తికి సాధనాలుగా భావించడం జరిగింది. వలసల్లో ఆధిపత్య రాజ్యాల ఆర్థిక దోపిడీ, సంస్కృతీ ప్రచారంతోబాటు, రాజకీయాధికారం, సైనిక పెత్తనం కూడా కొనసాగాయి. ఇట్టి పరంపరలో ఏర్పడిందే, ఇండోచైనాలో ఫ్రాన్స్ సామ్రాజ్యవాద అధికారం.

మూడో నెపోలియన్ పాలనా కాలం (1852-1870) లో, ఆగ్నేయ ఆసియాపై ఫ్రెంచ్ అధికార స్థాపనకు ప్రయత్నాలు జరిగాయి. ఇండోచైనా లోని క్రైస్తవులకు హింసనుండి రక్షణ కల్పించాలనే సాకుతో, ఫ్రెంచ్ సైన్యాలు వియత్నాంలో దిగి, 1860లో సైగాన్ ను ఆక్రమించాయి. 1862లో వియత్నాం చక్రవర్తి ఫ్రెంచ్ వారితో సంధి చేసుకున్నాడు. దీని ప్రకారం, వియత్నాం దక్షిణ భాగంపై ఫ్రాన్స్ అధికార మేర్పడింది.

దీని తర్వాత, నెమ్మదిగా ఇండోచైనా మిగిలిన భాగంపై, ఫ్రెంచ్ అధికారం నెలకొన్నది. హనాయ్ నగరాన్ని స్వాధీనం చేసుకోవడంతో, 1885 నాటికి వియత్నాం మొత్తం వీరి వశమైంది. కొద్ది వ్యవధిలో, కంబోడియా, లావోస్‌లను కూడా, ఫ్రెంచ్ వలస సామ్రాజ్యంలో కలపడం జరిగింది. నాటినుండి, వియత్నాం, కంబోడియా, లావోస్‌లు సంయుక్తంగా, 'ఫ్రెంచ్ ఇండోచైనా' గా వ్యవహారంలో ఉన్నాయి.

## 25.3 వియత్నాం జాతీయోద్యమాభివృద్ధి : హోచిమిన్

ప్రస్తుత శతాబ్ది ద్వితీయ పాదం నుండి, వియత్నాంలో జాతీయతా భావాలు బలపడసాగాయి. ఈ విషయంలో, చైనా, రష్యాల్లో సంభవించిన పరిణామాల ప్రభావం లేకపోలేదు. ఈ విప్లవోద్యమానికి సారథ్యం వహించిన హోచిమిన్ (Ho -Chi - Minh) గొప్ప జాతీయవాది. మార్క్స్ తత్వాన్ని పారిస్, మాస్కోల్లో అధ్యయనం చేసి, ఫ్రెంచ్ వలసాధిపత్యంపై చెలరేగుతున్న ప్రజల అసంతృప్తిని అవకాశంగా తీసుకొని, రైతులు, కార్మికులను సంఘటితపర్చేందుకై, 1925లోనే ఈయన 'వియత్నాం విప్లవ యువత సంఘాన్ని' (Revolutionary League of the Youth of Vietnam) ఏర్పర్చాడు. ఫ్రెంచ్ వలస ప్రభుత్వం మాత్రం, జాతీయతా శక్తులను అణచే ఉద్దేశంతో, కేవలం చైనీయ, ఫ్రెంచ్ వ్యాపారుల కార్యకలాపాలకే, తన మద్దతునందించింది.

1927 లో 'వియత్నాం జాతీయ పార్టీ' (The Vietnamese National Party) అనే ఒక స్వేచ్ఛాయుత, జాతీయవాద పార్టీ ఏర్పడింది. అయితే, ఇది కొద్దిమంది మేధావుల మద్దతును మాత్రమే పొందగల్గింది. చట్ట రీత్యా, ఫ్రెంచ్ ప్రభుత్వ గుర్తింపును పొందలేక, భావనాపరంగా రైతులను గాని, కార్మికులను గాని ఆకర్షించలేక, ఇది 1930 లో హోచిమిన్ నాయకత్వంలో ఏర్పాటైన 'వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ' తో, చేయి కలపసాగింది.

వియత్నాం కమ్యూనిస్ట్ పార్టీ కార్యకలాపాలు కూడా, ప్రారంభంలో తీవ్ర అణచివేతకు, అపజయానికి గురైనాయి. 1930, 1931 లో వీరు చేపట్టిన అనామ్ (Annam) విప్లవాన్ని ఫ్రెంచ్ వలస ప్రభుత్వం అణచివేయడం జరిగింది. హోచిమిన్ మాస్కోకు పారిపోయాడు. అక్కడ 1941 వరకూ అక్కడా ఉన్నాడు. అయితే, 1933, 1939ల మధ్య, ఇండోచైనా కమ్యూనిస్ట్‌లకు చట్టపరంగా ఉనికిని అనుమతించినా, వీరిలో 'ట్రాట్‌స్కీయులు' (Trotskyites), 'స్టాలినిస్ట్‌లు' (Stalinists,) హోచిమిన్ అనుయాయులనే మూడు వర్గాలేర్పడ్డం, గట్టి ఫ్రెంచ్ పర్యవేక్షణ తో కలిసి, ఫ్రెంచి పాలనకు తీవ్ర సవాలును లేకుండా చేసింది.

కమ్యూనిస్ట్‌లు 1939లో మరలా రహస్యంగా గడపాల్సొచ్చింది. స్టాలిన్-హిట్లర్ ఒప్పందంపై సంతకాలైన తదుపరి, ఫ్రాన్స్‌లో కమ్యూనిస్ట్ పార్టీ చట్ట విరుద్ధ సంస్థగా ప్రకటితమైంది. అయితే, చైనాలో లాగే, వియత్నాం స్వాతంత్ర్య పోరాటంపై, ద్వితీయ ప్రపంచ యుద్ధ ప్రారంభం విశేషమైన ప్రభావాన్ని వేసింది. ఫ్రెంచ్ పాలనను అంతం చేసేందుకై, జాతీయవాద కమ్యూనిస్ట్ ప్రయత్నం విఫలమైన తదుపరి, కమ్యూనిస్ట్‌లు, జాతీయ పార్టీ మద్దతుదార్లు, జపాన్ దాడి నెదిరించేందుకై 'వియత్నాం విమోచన దాడి సంఘం', లేక 'వియత్ మిన్' (Vietminh), అనే ఐక్య సంస్థగా ఏర్పడ్డారు.

### 25.3.1 ద్వితీయ ప్రపంచ యుద్ధ పరిణామాలు : ప్రభావం

ద్వితీయ ప్రపంచ యుద్ధ పరిణామాల్లో భాగంగా, సోవియట్ యూనియన్‌పై హిట్లర్ దాడి, పెరల్ హార్బర్ పై జపాన్ దాడి సంభవించడంతో, ఫాసిస్ట్ శక్తులను వ్యతిరేకించే సంస్థగా, వియత్ మిన్ నూతన పాత్రను ధరించింది. 1941లో జపాన్ తన ఆసియా విస్తరణ పథకంలో భాగంగా, ఆగ్నేయాసియాలో స్వైర విహారం చేస్తూ, ఫ్రెంచ్ ఇండోచైనా ప్రాంతాన్ని తన పాదాక్రాంతం చేసుకుంది. తన ఆధిపత్యాన్ని,

ఫ్రాన్స్‌పై జర్మనీ విజయాన్ని అంగీకరించిన ఫ్రెంచ్ తొత్తు ప్రభుత్వం (Puppet government), లేక విచీ ప్రభుత్వం (Vichy Government), ఇండోచైనాలో పాలనను నడిపేందుకు అనుమతించబడింది. హోచిమిన్ నేతృత్వంలోని వియత్‌మిన్ మాత్రం, అటు జపాన్‌వారు, ఇటు ఫ్రెంచ్‌వారు, ఇద్దరి అధికారాన్ని నిర్మూలించి, వియత్నాం సంపూర్ణ స్వాతంత్ర్య సాధనను కాంక్షించింది. 1942 తదుపరి ఇట్టి కార్యసాధనలో మద్దతు నిచ్చేందుకు, చైనా కొమింగ్‌టాంగ్ పార్టీ నాయకుడు, రిపబ్లిక్ అధ్యక్షుడైన చాంగ్‌కైషేక్ ముందుకు వచ్చాడు.

అయితే, హోచిమిన్, వియత్‌మిన్‌లు మాత్రం, జపాన్ దేశీయులతో, శక్తియుక్తులా తలపడేందుకు, పూనుకోలేదు. దీనిక్కారణం, జపాన్ సైనిక ధాటిని తట్టుకొని నిలబడే ధైర్యం, నమ్మకం, వీరిలో కొరవడ్డాయి. ఫలితంగా, వీరు ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో జపాన్ ఓటమికై వేచివుండి, అది జరిగిన వెంటనే, అధికారాన్ని తమ వశం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారు. వీరి ఆశలు, వ్యూహాలు ఫలించాయి. మొదటగా, జర్మన్‌ల నెదిరించి, తిప్పికొట్టిన ఛార్లెస్ డిగాల్ నాయకత్వంలోని ఫ్రెంచ్ ప్రభుత్వం, ఇండోచైనాకు పంపించిన సైనికులను నిర్బంధించి, వారి ఆయుధాలను జపాన్ సైన్యాలు స్వాధీనం చేసుకున్నాయి. రెండోదిగా, ఆగస్ట్ 15, 1945 నాడు జపాన్ తన ఓటమి నంగీకరించి, లొంగిపోవడంతో, వియత్‌మిన్ దళాలు తమ ఆక్రమణలను యధేచ్ఛగా చేపట్టాయి. ఆగస్ట్ 1945 నాటికి, హోచిమిన్ సైన్యాలు రెండు ముఖ్య రాజధానీ కేంద్రాలైన 'హనాయ్', సైగాన్‌ల నాక్రమించి, కొచ్చిన్-చైనా లోనికి చొచ్చుకొని పోయాయి. టాన్‌కిన్, ఆనామ్, కొచ్చిన్-చైనా ప్రాంతాలను కలిపి, వియత్నాం రిపబ్లిక్‌గా హోచిమిన్ ప్రకటించాడు. ఫ్రెంచ్ పాలనలో ఆనాం మాజీ చక్రవర్తైన బోదై (Bao Dai), ఈ ఏర్పాటు నంగీకరిస్తూ, ఈ నూతన రిపబ్లిక్ సర్వోన్నత కౌన్సిలర్ (Supreme Councillor) పదవిని చేపట్టడం, వియత్‌మిన్ ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చింది.

## 25.3.2 ద్వితీయ ప్రపంచ యుద్ధానంతర పరిస్థితి : పరిణామాలు

పశ్చిమ మిత్రరాజ్యాలు హోచిమిన్‌ను శంకించాయి. వీరు, 16వ సమాంతర రేఖ (Sixteenth Parallel line) కు ఉత్తరంగా ఉన్న ప్రాంత పరిపాలనను చైనా జాతీయవాదులకు, ఈ రేఖకు దక్షిణంగా ఉన్న ప్రాంత పరిపాలనను బ్రిటిష్‌వారికి కట్టబెట్టారు. బ్రిటిష్‌వారు వెంటనే కారాగారాల్లో ఉన్న ఫ్రెంచ్ సైనికులు, పరిపాలకులను విడుదలచేసి, వారు సైగాన్, లేక దక్షిణ ప్రాంతంపై, తమ అధికారాన్ని తిరిగి స్థాపించుకునేందుకు తోడ్పడ్డారు. ఇహపోతే, చాంగ్‌కైషేక్ నుండి ప్రమాదాన్ని శంకించిన వియత్‌మిన్, ఫ్రెంచ్ ప్రభుత్వంతో గట్టి సంబంధాన్ని కాంక్షించింది. ఫలితంగా మార్చి, 1946లో, వామపక్ష ప్రాబల్యంతో కూడిన ఫ్రెంచ్ ప్రభుత్వం, హోచిమిన్ తో ఒక ఒప్పందానికి వచ్చింది. దీని ప్రకారం, ఇండోచైనాలోని ఫ్రెంచ్ ఫెడరల్ వ్యవస్థలో హోచిమిన్ ప్రభుత్వాన్ని, ఒక స్వేచ్ఛాయుత రాజ్యంగా గుర్తించడమైంది.

కాని, సైగాన్‌లో నెలకొన్న ఫ్రెంచ్ పరిపాలకులు, సైన్యం, దక్షిణ ప్రాంతంలో కొచ్చిన్-చైనా స్వేచ్ఛాయుత రాజ్యాన్నేర్పాటు చేయడం ద్వారా, హోచిమిన్ - ఫ్రెంచ్ ప్రభుత్వం ఒప్పందానికి గండి కొట్టడమైంది. దీనికి జవాబుగా, ఉత్తర ప్రాంతంలో వియత్‌మిన్ నిరంకుశాధికారాన్ని స్థాపించింది. ఫలితంగా, ఇరువురి మధ్య, డిసెంబర్, 1946లో యుద్ధం మొదలైంది.

## 25.3.3 ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విమోచన యుద్ధం, 1946–1954

నవంబర్, 1946లో, హనాయ్‌ను వదలిపెట్టి వెళ్లాల్సిందిగా, వియత్‌మిన్ సేనలను ఫ్రెంచ్‌వారు

వియత్నాం ఏకీకరణకై, 1956 నుండి రెండు దశాబాల పాటు, అమెరికన్ సామ్రాజ్యవాదులతో వీరోచితంగా పోరాడేందుకు, సంసిద్ధులుగా చేసింది.

ఈ విమోచనా పోరాటాన్ని కమ్యూనిస్ట్‌లు నడపడం, కమ్యూనిస్ట్ చైనా నుండి సైనిక సరఫరా, శిక్షణను పొంది, ప్రత్యక్షంగా ఫ్రెంచి సామ్రాజ్యవాదులను, పరోక్షంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల నెదిరించి నిలువటం, దీని ప్రాముఖ్యతా చరిత్రలో మరో కలికితురాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం, కమ్యూనిజం వ్యాప్తిని అరికట్టేందుకు, అమెరికా, పశ్చిమ ఐరోపా రాజ్యాలు చేసిన ప్రయత్నాల చరిత్రలో ఇదొక ముఖ్యాంశం. ఉత్తర వియత్నాం కమ్యూనిస్ట్ రాజ్యంగా ఆవిర్భవించి, ఆసియాలోని కమ్యూనిస్ట్ రాజ్యాల బలాన్నీ, సంఖ్యను పెంచేందుకు దోహదపడింది.

వియత్నాం జాతీయోద్యమ చరిత్రలో, హోచిమిన్ నిర్వహించిన పాత్ర ఎంతో విలువైంది, విశిష్టమైందీను. చైనా జాతీయోద్యమ చరిత్రలో మావోసెటుంగ్‌కు, రష్యా దేశ ప్రజోద్యమ చరిత్రలో లెనిన్‌కు, భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో గాంధీకి, ఎటువంటి సాటిలేని, ఉన్నత, చిరస్మరణీయ స్థానాలివ్వడం, జరిగిందో, అదే మాదిరి స్థానం వియత్నాం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో హోచిమిన్‌కు దక్కింది. 1925 నుండి కూడా, ఈయన తిరుగులేని ప్రజోద్యమ నాయకుడిగా ప్రసిద్ధిగాంచాడు. సైన్యం, ఆయుధాలు, శిక్షణ, యుద్ధ తంత్రం, ఆదిగా గల వనరులు ఒక ఎత్తు; సమయస్ఫూర్తి, తెలివితేటలు, దృఢ చిత్తం, ధైర్యసాహసాలతో కూడిన ఈయన నేతృత్వం, మరో ఎత్తు. ప్రస్తుత శతాబ్ది వియత్నాం చరిత్రలో, మకుటం లేని మహారాజుగా వెలుగొందాడు.

## 25.4 సంగ్రహంగా

1. శతాబ్దాల తరబడి విదేశీయుల దాడులు, ప్రాబల్యానికి గురౌతూ వచ్చిన వియత్నాం, 19వ శతాబ్ది ద్వితీయార్ధంలో ఫ్రెంచ్ వలస పాలన క్రిందకు వచ్చింది.

2. ద్వితీయ ప్రపంచ యుద్ధ ప్రభావ ఫలితంగా, ఫ్రెంచ్, జపాన్ దేశస్థుల సామ్రాజ్యాధికారాన్ని అంతం చేసి, వియత్నాం స్వాతంత్ర్యాన్ని సాధించేందుకై, హోచిమిన్ అనే కమ్యూనిస్ట్ నాయకుని నేతృత్వంలో, 'వియత్‌మిన్' అనే ఐక్య విమోచన సంస్థ ఏర్పాటైంది.

3. వియత్‌మిన్ దళాలు ఎంతో సమయస్ఫూర్తితో, రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓటమి వరకు వేచివుండి, తదుపరి విజృంభించి, ఆగస్ట్, 1945 అంతానికి వియత్నాం భూభాగమంతటినీ, తమ వశం చేసుకున్నాయి.

4. కోల్పోయిన వియత్నాం ప్రాంతాన్ని, వియత్‌మిన్ సేనల నుండి తన వశం చేసుకునేందుకై, ఫ్రెంచ్ ప్రభుత్వం డిసెంబర్, 1946 నుండి దాదాపు ఎనిమిది సంవత్సరాలు పోరాడి, ఘోర పరాజయాన్ని చవిచూచింది.

5. యుద్ధాన్ని పరిసమాప్తి చేసిన జెనీవా తాత్కాలిక శాంతి ఒప్పందం ప్రకారం, ఫ్రెంచ్ వలస పాలన అంతమై, 17వ సమాంతర రేఖ సరిహద్దుగా, వియత్నాం రెండు భాగాలుగా విభజితమై, ఉత్తర వియత్నాం హోచిమిన్ కమ్యూనిస్ట్ పాలన క్రిందికి, దక్షిణ, వియత్నాం గొ దిన్ దియం నాయకత్వంలోని అమెరికన్ సామ్రాజ్యవాద తొత్తు ప్రభుత్వ పాలన కిందకి, జూలై, 1954లో

## 25.5 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. వియత్నాం జాతీయోద్యమాభివృద్ధిని, దానిలో హొచిమిన్ పాత్రను సమీక్షించండి.
2. ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విమోచన యుద్ధ కారణాలు, నడచిన తీరు, ఫలితాలను పరిశీలించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి.

1. ఇండోచైనాపై ఫ్రెంచ్ పాలనాధిపత్య స్థాపన
2. జెనీవా ఒప్పంద షరతులు
3. ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విమోచనా పోరాట ప్రాముఖ్యత

## 25.6 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| Sardesai | : | **Vietnam: Trials and Tribulations of a Nation** |
| J. Robert Wegs | : | **Europe Since 1945, A Concise History** |
| Allan O. Kownslar& Terry L. Smart | : | **People and Our World, A Study of World History** |
| P.J. Larkin | : | **The Far East and India** |
| Tony Howarth | : | **Twentieth Century History, the World Since 1900** |
| John and Gwenneth Stokes | : | **Europe and the Modern World, 1870-1983** |
| B.J. Eliott and Colin Holmes | : | **World Society in the Twentieth Century** |
| Norman Lowe | : | **Mastering Modern World History** |


BRAOU

రచయిత : ఆచార్య వి. రామకృష్ణా రెడ్డి

# భాగం– 26 : ఐక్య వియత్నాంకై పోరాటం : క్రమం, ఫలితాలు, ప్రాముఖ్యత ( 1961–75)

26.0 లక్ష్యాలు

26.1 పరిచయం

26.2 ఏకీకరణ పోరాటానికై దారితీసిన పరిస్థితులు

26.2.1 ఎన్నికల నిర్వహణకై దక్షిణ వియత్నాం ప్రభుత్వ నిరాకరణ

26.2.2 దియం ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేకపోవటం

26.2.3 తీవ్ర ప్రజా అసంతృప్తి : దియం అధికారం , ప్రాణాలను కోల్పోవడం

26.2.4 అమెరికా జోక్యం : ప్రత్యక్ష సైనిక రంగ ప్రవేశం

26.2.5 ఉత్తర వియత్నాం పాత్ర అమెరికాను ఉసిగొల్పటం

26.3 ఏకీకరణ యుద్ధ క్రమం : భిన్న దశలు

26.3.1 జాన్ కెనెడీ అధ్యక్ష కాల ( 1961-3) దశ

26.3.2 లిండన్ జాన్సన్ అధ్యక్ష కాల ( 1963-9) దశ

26.3.3 రిఛర్డ్ నిక్సన్ అధ్యక్ష కాల ( 1969-74) దశ

26.4 యుద్ధ విరమణ ఒప్పందం, ఫిబ్రవరి, 1973

26.5 ఒప్పంద ఉల్లంఘన : యుద్ధ కొనసాగింపు; వియత్నాం ఐక్యత

26.6 అమెరికా ఎందుకు విఫలమైంది ?

26.7 యుద్ధ ఫలితాలు

26.8 పోరాట ప్రాముఖ్యత

26.9 సంగ్రహంగా

26.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

26.11 ఉపయుక్త గ్రంధాలు

## 26.0 లక్ష్యాలు

ఈ పాఠ్య భాగాధ్యయనం ద్వారా, ఫ్రెంచ్ సామ్రాజ్యవాద కబంధ హస్తాల నుండి 1954 లో వియత్నాం విముక్తి చెందిన తదుపరి, ఐక్య వియత్నాం ఆవిర్భావానికై పోరాటం ప్రారంభం కావడానికి దారితీసిన పరిస్థితులు, పోరాటం నడచిన తీరు, దాని ఫలితాలు, ప్రాముఖ్యతను గురించి,స్పష్టమైన అవగాహనను ఏర్పర్చుకోగల్గాలి. ఉత్తర, దక్షిణ వియత్నాంల ఏకీకరణ, కమ్యూనిజం విస్తరణకు దోహదం చేస్తుందనే గట్టి అభిప్రాయమేర్పడి, దీని నరికట్టేందుకై అగ్రరాజ్యమైన అమెరికా సంయుక్త రాష్ట్రాలు , 1961 నుండి దశాబ్దికి పైబడి సామ్రాజ్యవాద ధోరణిలో, తన సైనికులు , ఆయుధాలు, ధనాన్ని పణంగా పెట్టి, వియత్‌కాంగ్ *(Viet Cong)*ఉత్తర వియత్నాం దళాలతో పోరు సల్పిందనే విషయాన్ని కూడా, స్పష్టంగా గ్రహించగల్గాలి. దూర ప్రాచ్యదేశమైన కొరియా విషయంలో, 1951–53 ల మధ్య, ఇదే మోస్తరు సమస్యలో అమెరికా తలదూర్చి విజయాన్ని సాధించడం, రెండు సందర్భాల్లోగూడా, కమ్యూనిస్ట్ పక్షాలైన ఉత్తర



B R A O U

కొరియా, ఉత్తర వియత్నాం, వియత్ కాంగ్ లకు సమీప, బలమైన కమ్యూనిస్ట్ రాజ్యాలైన రష్యా, చైనాలు, తమ అండదండల నందించడంలో గల ప్రచ్ఛన్న యుద్ధ ప్రాధాన్యతను గూడా తెలుసుకోగల్గాలి.

## 26.1 పరిచయం

శతాబ్దాల తరబడి ఒకటిగా ఉన్న వియత్నాం ప్రాంతాన్ని, ప్రజలను, 1954 లో జెనీవా ఒప్పందం ద్వారా, ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించడమనేది, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు, కమ్యూనిస్ట్ దేశాల విస్తరణను నిరోధించి, తమ ఆధిక్యతను కొనసాగించేందుకై గావించిన, కృత్రిమ, స్వార్థపూరిత ,జాతీయ వ్యతిరేక ఏర్పాటని, ఫ్రెంచ్ సామ్రాజ్యవాద పాలన నుండి విమోచనకై వియత్ మిన్ జరిపిన సుదీర్ఘ పోరాట సందర్భంలోగూడా, 1950-54 మధ్య ఫ్రాన్స్ కు ఆయుధాలు, ధన సహాయాన్ని పెద్ద మొత్తంలో అమెరికా ప్రభుత్వం అందించినట్లుగా, లోగడ మనం గ్రహించాం. ధన సహాయం 1950 లో $ 150 మిలియన్ల నుండి, 1953 నాటికి $ 1.3 బిలియన్ల మేరకు పెరడగం గమనార్హం. ఫ్రాన్స్ 1956 లో వియత్నాం నుండి పూర్తిగా వైదొలగడంతో, ఆగ్నేయ ఆసియా లో కమ్యూనిస్ట్ ప్రవాహాన్ని అడ్డుకునేందుకు ఒకే ఒక వారధిలా, అమెరికా అగ్రరాజ్యానికి కన్పించింది, దక్షిణ వియత్నాం. ఇది కూడా కమ్యూనిస్ట్ ఉత్తర వియత్నాంతో విలీనమైతే,ఇక లావోస్, కంబోడియా, మలయా, ఇండోనేషియా లాంటి చుట్టు ప్రక్క దేశాల గతేమౌతుందనే బెంగ, భయం, ప్రశ్నార్థకం, ఐసెన్ హోవర్( 1953-61) మొదలుకొని రిచర్డ్ నిక్సన్ ( 1969-74) వరకు గల అమెరికా అధ్యక్షులందరి మనస్సుల్లో గాఢంగా చోటు చేసుకున్నాయి.

వియత్నాం ప్రజల అభిప్రాయం, ఇట్టి సామ్రాజ్యవాద ధోరణికి పూర్తిగా భిన్నంగా ఉంది. జెనీవా ఒప్పందం ప్రకారం, రెండు సంవత్సరాల లోపల ఎన్నికలు జరిగినట్లైతే, వీటిలో 80 శాతం వియత్నాం ప్రజలు హోచిమిన్ నాయకత్వంలో ఏర్పడ్డ ఏకీకరణ పక్షానికి ఓటు చేయగలరనే అభిప్రాయాన్ని, అమెరికన్ అధ్యక్షుడు ఐసెన్ హోవర్ వ్యక్తం చేయడం, అత్యంత ప్రాధాన్యకరమైన విషయం. ఏకీకరణకు ప్రజల మద్దతు, ఉత్తర , దక్షిణ భాగాల్లో, కమ్యూనిస్ట్లల్లో, కమ్యూనిస్టేతరుల్లో, కూడా లభించింది. దశాబ్దికి పైబడి అగ్రరాజ్యమైన అమెరికా సైనిక దాడులు, బాంబు దాడులను ఎంతో ధైర్యంగా, పట్టుదల, ఓపికతో ఎదుర్కొని, నిల్వగల్గడం, వియత్నాం ప్రజల ఐక్యతా, జాతీయతా భావాలకు అద్దం పడుతుంది.

## 26.2 ఏకీకరణ పోరాటానికి దారితీసిన పరిస్థితులు

వియత్నాం ఐక్యతకై, 1961 నుండి 1975 వరకు, యుద్ధం కొనసాగుతూ వచ్చింది. ఇది, ప్రారంభంలో దక్షిణ వియత్నాం ప్రభుత్వం, ఏకీకరణ పోరాట దళం ( వియత్ కాంగ్) మధ్య, అంతర్యుద్ధం *(Civil War)* గా మొదలై, తదుపరి ఉత్తర వియత్నాం, అమెరికాల మధ్య భీకర సంగ్రామంగా మారి, చివరలో 1973, జనవరి అనంతరం, ఉత్తర, దక్షిణ వియత్నాంల మధ్య సంఘర్షణగా పరిసమాప్తమైంది. ఈ పోరాటానికి దారితీసిన పరిస్థితులను క్రింది విధంగా పేర్కొనొచ్చు.

### 26.2.1 ఎన్నికల నిర్వహణకై దక్షిణ వియత్నాం ప్రభుత్వ నిరాకరణ

జెనీవా ఒప్పందం ప్రకారం, 1956 లో, వియత్నాం అంతటా ఎన్నికలను నిర్వహించి, బహుళ సంఖ్యాక ప్రజల మద్దతును సంపాదించిన వ్యక్తి, వియత్నాం అంతటికీఅధ్యక్షుడుకావాల్సిఉంది. ఇట్టి ఎన్నికలు నిర్వహించబడతాయనే ఆశతోనే, ఉత్తర వియత్నాం అధ్యక్షుడైన హోచిమిన్ 1954 జూలైలో, వియత్నాం తాత్కాలిక విభజనకు అంగీకరించాడు. దీనిక్కారణం, ఇట్టి ఎన్నికల్లో తనకు ప్రజల అధిక సంఖ్యాక మద్దతు లభించగలదనే గట్టి విశ్వాసం ఈయనలో ఉండటమే. అయితే, గొ దిన్ దియం *(Ngo Dinh Diem)*

అధ్యక్షత క్రింద 1955 లో ఏర్పడ్డ దక్షిణ వియత్నాం ప్రభుత్వం, ఇట్టి ఎన్నికల నిర్వాహణకై ఏర్పాట్లు చేసేందుకు నిరాకరించింది. ప్రజల బహుళ సంఖ్యాక విశ్వాసాన్ని చూరగొనగలననే నమ్మకం, ఈ ప్రభుత్వానికి ఏ కోశానా లేదు. దీనికి తోడు, ఈ ప్రభుత్వానికి అన్నిరకాల మద్దతునిస్తున్న అమెరికా కూడా, ఈ విషయంలో బలవంతపెట్టలేదు. కారణం, ఎన్నికల్లో కమ్యూనిస్ట్‌లు విజయాన్ని సాధిస్తారనే భయం, దీనికుండటమే.

ఎన్నికల నిర్వహణ ఆశ అడియాస కావటంతో, హోచిమిన్ నాయకత్వంలోని ఐక్యతావాదులకు, తమ లక్ష్య సాధనకై, పోరాట మార్గాన్ని ఎంచుకోవాల్సిన అగత్యమేర్పడింది.

## 26.2.2 దియం ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని చూరగొనలేకపోవటం

దియం తన ప్రభుత్వాన్ని శక్తివంతంగా ప్రారంభించినప్పటికీ, త్వరలోనే అది ప్రజాభిమానాన్ని కోల్పోయింది., ఈయన ఒక ధనవంతమైన రోమన్ కాథలిక్ కుటుంబం నుండి రాగా, ప్రజల్లో వాళ్లింట మూడొంతుల మంది బౌద్ధ మతానికి చెందిన కర్షకులుగా ఉన్నారు. వీరు తమ పట్ల వ్యత్యాసం చూపిస్తున్నారనే భావనకు లోనయ్యారు. వీరు చైనా, ఉత్తర వియత్నాంల్లో తీసుకొచ్చినటువంటి భూ సంస్కరణలను కోరగా, దియం ప్రభుత్వమేమీ చేపట్టలేదు. కొంతమంది బౌద్ధ సన్యాసులు ప్రభుత్వ చర్యలకు నిరసనగా, బహిరంగంగా అగ్నికి ఆహుతై మరణించినప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం.ఇంకా, దియం ప్రభుత్వ అవినీతికి ఆలవాలమైనట్లుగా పేరుగాంచింది. ఈయన అమెరికా ప్రభుత్వ ప్రాబల్యప్రభావాలకు తీవ్రంగా లోనుగావడం చేత, జాతీయవాదుల అభిమానాన్ని కోల్పోయాడు.

## 26.2.3 తీవ్ర ప్రజా అసంతృప్తి : దియం అధికారం, ప్రాణాలను కోల్పోవడం

దక్షిణ వియత్నాంలో, 1960లో, వివిధ వ్యతిరేక వర్గాలవారు, 'జాతీయ విమోచన కూటమి' *(National Liberation Front)* గా ఏర్పడ్డం, ఎంతో ప్రాముఖ్యకరమైన పరిణామం. వీరిలో, వియత్ మిన్‌కు చెందిన కమ్యూనిస్ట్ సభ్యులు కూడా చాలా మంది ఉన్నారు. సంస్కరణలను ప్రవేశపెట్టి, ఐక్య వియత్నాంకై శాంతియుతంగా సంప్రదింపులను జరిపే ప్రజాస్వామ్య, జాతీయ, మిశ్రమ ప్రభుత్వాన్ని వీరు కోరారు. ఇట్టి వాతావరణంలో, దియం ప్రభుత్వం,కమ్యూనిస్ట్‌లుగా భావించేవారిపైన, ఫ్రెంచ్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన వారిపైన,బౌద్ధులుగా ఉన్న వియత్నాం ప్రజలపైన, దాడులను చేయ నారంభించింది. కమ్యూనిస్ట్‌లు ఉత్తర వియత్నాం సహాయంతో, ఈ దాడులను తిప్పికొట్టనారంభించారు. 'వియత్ కాంగ్' *(Viet-Cong)*పేరుతో, వీరి సాయుధ గెరిల్లా దళం ఈ అంతర్యుద్ధ, సైనిక చర్యలను చేపట్టింది.

ఈ వియత్ కాంగ్ గెరిల్లా దళాలు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడిచేసి, స్థానిక అధికారులను, పోలీస్ వారిని, గ్రామ పెద్దలను హత్యకు గురిచేసి, గ్రామస్థులనుండి నయానా లేక భయానా, తమకు కావాల్సిన ఆహారం, ఆశ్రయాన్ని పొందేవారు. బౌద్ధులు తమదైన ప్రత్యేక తరహాలో, బహిరంగంగా అగ్నికి ఆహుతై, తమ నిరసనను ప్రకటించేవారు. అమెరికా సహాయంతో ప్రభుత్వం, తిరుగుబాటుదార్ల అణచివేతకు పూనుకొని, అనుమానిత వియత్ కాంగ్‌లను నిర్బంధించసాగింది. అయినప్పటికీ, దియమ్ ప్రభుత్వానికి వ్యతిరేకత పెరగసాగింది. 1959-61 మధ్య, దక్షిణ వియత్నాంలో చురుగ్గా పనిచేస్తున్న వియత్ కాంగ్‌ల సంఖ్య, 3,000ల నుండి 15,000ల వరకు పెరిగినట్లుగా అంచనా వేయడం జరిగింది.

నానాటికీ, దియం ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోసాగింది. జాతీయ విమోచన కూటమిలో కమ్యూనిస్ట్‌లతో బాటు, పలు ఇతర వర్గాలవారుండగా, విమర్శలు, వ్యతిరేకతనంతా కూడా, కమ్యూనిస్ట్‌లు సృష్టిస్తున్నారనే దియం అభిప్రాయం, సరైంది, సమగ్రమైందిగా భావించబడలేదు. పైదు మిక్కిలి, అతి కఠినమైన భద్రతా చర్యలను, ఈయన ప్రవేశపెట్టాడు. చివరకు, ప్రజా అసంతృప్తి పరాకాష్ఠ దశకు చేరుకొని,

నవంబర్ 1, 1963 నాడు సంభవించిన సైనిక తిరుగుబాటులో, దియం, ఆయన సోదరుడు గో దిన్ నూ (*Ngo Dinh Nhu*) పదవీచ్యుతులై, హత్యకు గురైనారు. తదుపరి, దక్షిణ వియత్నాంలో త్వరత్వరగా, సైనిక ప్రభుత్వాలు ఏర్పడుతూ, మారుతూ వచ్చాయి. అయితే, వీటిలో అధ్యక్షుడు గుయెన్ వాన్ థ్యూ (*Nguyen Van Thieu*) ప్రభుత్వం మాత్రం (1867-75), ఎక్కువ కాలం కొనసాగింది. అయితే, దియంను తొలగించినా, ప్రధాన పరిస్థితి మాత్రం మారలేదు. గెరిల్లా యుద్ధం కొనసాగింది.

### 26.2.4 అమెరికా జోక్యం : ప్రత్యక్ష సైనిక రంగ ప్రవేశం

దక్షిణ వియత్నాం లోని అంతర్యుద్ధ, కల్లోల పరిస్థితిని, దియం ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కోలేకపోవడంతో, అమెరికా సంయుక్త రాష్ట్రాలు సైనికంగా, ఆర్థికంగా, జోక్యం చేసుకొని, అటువంటి లోటును భర్తీ చేయ నిశ్చయించుకుంది. ఐసెన్ హోవర్ అధ్యక్షతా కాలంలో, 1954 నుండి కూడా, దియం ప్రభుత్వానికి ఆర్థిక సహాయం, సైనిక సలహాదార్ల నందించడం జరిగింది. అప్పటి దక్షిణ వియత్నాం సమస్యలన్నింటి వెనకాల కమ్యూనిస్టుల హస్తముందనే దియం వాదనను, అమెరికా అంగీకరించడం గమనార్హం. తర్వాత అధ్యక్షులైన కెనెడీ, జాన్సన్‌లు, దక్షిణ వియత్నాంను మరో కొరియాగా భావించి, గట్టి చర్యలను తీసుకున్నట్లైతే, కమ్యూనిజం నుండి వియత్నాంను కాపాడవచ్చనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. చివరగా, నిక్సన్ అధ్యక్ష పదవీ కాలంలో, 'వియత్నమీకరణ' (*Vietnamisation*) ద్వారా, దక్షిణ వియత్నాం ప్రజలకు అమెరికా సైనిక శిక్షణ, ఆయుధాల నిచ్చి, వారి రక్షణను వారే చేసుకొనే పద్ధతిని అంగీకరించడం జరిగింది. పద్ధతి పేరు ఏదైనా, అమెరికా జోక్యం ప్రత్యక్షం గానో, పరోక్షంగానో, 1950 నుండి కూడా, నిరంతరాయంగా 1973 జనవరి వరకూ, కొనసాగుతూ వచ్చింది. ఇది ఆగిపోయిన రెండు సంవత్సరాల మూడు మాసాలకే (ఏప్రియల్, 1975), వియత్నాం ఏకీకరణ సాధ్యమనటం విశేషంగా గమనించదగ్గ విషయం.

### 26.2.5 ఉత్తర వియత్నాం పాత్ర అమెరికాను ఉసిగొల్పటం

దక్షిణ వియత్నాం లోని వియత్ కాంగ్ గెరిల్లా దళాలకు, కమ్యూనిస్ట్ ఉత్తర వియత్నాం, సైనికులను, ఆయుధాలను, ఇతర అవసర సరఫరాలను అందించడం, దక్షిణ వియత్నాం ప్రభుత్వం తరఫున సైనిక, ఆర్థికపరమైన జోక్యానికి, అమెరికాను బాగా ప్రేరేపించింది. అధ్యక్షుడు హోచిమిన్ తన చర్యను సమర్థించుకున్నాడు. ఎలాగంటే, జాతీయ ఎన్నికల నిర్వహణకు దక్షిణ వియత్నాం నిరాకరించిందిగాన, బలప్రయోగం మాత్రమే వియత్నాం రెండు భాగాలను ఒకటిగా చేయగలదని గట్టిగా విశ్వసించడం జరిగింది. ఉత్తర వియత్నాం కమ్యూనిస్టేతర దేశమైనట్లైతే, బహుశా అమెరికా జోక్యం, యుద్ధ ప్రవేశం ఉండేవి కావేమోననిపిస్తుంది.

## 26.3 ఏకీకరణ యుద్ధ క్రమం: భిన్న దశలు

వియత్నాం ఐక్యతా యుద్ధ క్రమంలోని భిన్న దశలు, యుద్ధ కాలం ( 1961-75) లోని ఆయా అమెరికన్ అధ్యక్షుల పదవీ కాలాలను బట్టి, ఏర్పడుతూ వచ్చాయి. కారణం, ప్రతి అధ్యక్షుని అధికార కాలంలో, వియత్నాం పట్ల అనుసరించిన విధానంలో , నూతన మార్పులు రాసాగాయి.

### 26.3.1 జాన్ కెనెడీ అధ్యక్ష కాల ( 1961–3) దశ

వియత్ కాంగ్ గెరిల్లా దాడులను అరికట్టే లక్ష్యంతో, ఈయన కాలంలో ఏకీకరణ యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవడం జరిగింది. ఈయన మొట్టమొదటిసారిగా, "సైనిక సలహాదార్లు" (Military

## 26.10 పరీక్ష నమూనా ప్రశ్నలు

I. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలను రాయండి.

1. వియత్నాం ఏకీకరణ పోరాటానికి దారితీసిన పరిస్థితులను పేర్కొనండి.
2. వియత్నాం ఏకీకరణ యుద్ధ క్రమం, దాని భిన్న దశలను విశ్లేషించండి.

II. క్రింది ప్రశ్నలకు సంక్షిప్త వ్యాఖ్యలను రాయండి.

1. యుద్ధ విరమణ ఒప్పంద ఉల్లంఘన, వియత్నాం ఐక్యతకు ఎలా దారితీసింది?
2. అమెరికా ఎందుకు విఫలమైంది?
3. వియత్నాం ఏకీకరణ పోరాట ఫలితాలు, ప్రాముఖ్యతను సమీక్షించండి.

## 26.11 ఉపయుక్త గ్రంథాలు


| | | |
|---|---|---|
| N. Lowe | : | **Mastering Modern World History** |
| Tony Howarth | : | **Twentieth Century History : The World Since 1900** |
| John and Gwennth Stokes | : | **Europe and the Modern World, 1870-1983** |
| Terry L. Smart | : | **People and our World : A Study of World History** |
| P. J. Larkin | : | **Far East and India** |
| B.J. Elliott & Colin Holmes | : | **World Society in the Twentieth Century** |
| Sardesai | : | **Vietnam : Trials and Tribulations of a Nation** |


రచయిత : ఆచార్య వి. రామకృష్ణా రెడ్డి

B R A O U

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ అధ్యయన కార్యక్రమం

మొదటి సంవత్సరం

# కోర్స్ –3 : ఆధునిక విప్లవాలు

## ఖండం–1 : తొలి స్టూవర్ట్‌లు, ప్యూరిటన్ విప్లవం, తదనంతర పరిణామాలు (1603–1688)

భాగం–1 స్టూవర్ట్‌లు : ఒకటో జేమ్స్, పార్లమెంట్‌తో ఆయన సంబంధాలు

భాగం–2 ఒకటో ఛార్లెస్ : దీర్ఘకాలిక పార్లమెంట్

భాగం–3 అంతర్యుద్ధం : కామన్‌వెల్త్ సంరక్షక రాజ్యం

భాగం–4 రెండో ఛార్లెస్, పార్లమెంట్ సంబంధాలు

## ఖండం–2 మహోజ్జ్వల విప్లవం (1688)

భాగం–5 రెండో జేమ్స్ పాలనా విధానాలు

భాగం–6 పార్లమెంట్ పాత్ర : విలియం, మేరీల పాలన (1688–1702)

భాగం–7 హక్కుల చట్టం : మహోజ్జ్వల విప్లవ ఫలితాలు

## ఖండం–3 అమెరికా స్వాతంత్ర్య సమరం (1776–1783)

భాగం–8 వలసలు

భాగం–9 అమెరికా స్వాతంత్ర్య సంగ్రామ కారణాలు

భాగం–10 అమెరికా స్వాతంత్ర్య ప్రకటన : ఫలితాలు

భాగం–11 రాజ్యాంగ నిర్మాణం

## ఖండం–4 ఫ్రెంచ్ విప్లవం (1789–1799)

భాగం–12 ఫ్రాన్స్‌లో విప్లవ పూర్వ రంగం

భాగం–13 ఫ్రెంచ్ విప్లవ కారణాలు

భాగం–14 జాతీయ సభ : కార్యకలాపాలు

భాగం–15 జాతీయ కన్వెన్షన్

భాగం 16 నెపోలియన్ బోనాపార్ట్ : విజృంభణ, పతనం.

భాగం 17 ఫ్రెంచ్ విప్లవ ఫలితాలు

BRAOU

## ఖండం-5 రష్యన్ విప్లవం (1917)

భాగం-18 జార్ చక్రవర్తుల పరిపాలనలో రష్యా

భాగం-19 రష్యన్ విప్లవ కారణాలు

భాగం-20 1917 విప్లవ గమనం

భాగం-21 రష్యన్ విప్లవ ప్రాధాన్యత

## ఖండం-6 చైనా విప్లవం (1911-1949)

భాగం-22 అంతర్యుద్ధ కాలం నాటి చైనా పరిస్థితులు

భాగం-23 కొమింగ్‌టాంగ్ - కమ్యూనిస్ట్ ఘర్షణ

భాగం-24 కమ్యూనిస్ట్ విజయం : కారణాలు, ఫలితాలు, ప్రాముఖ్యత

## ఖండం-7 వియత్నాం విప్లవం ( 1946- 1975)

భాగం-25 వియత్నాం : ఫ్రెంచ్ సామ్రాజ్యవాద విముక్తి పోరాటం (1946-1954)

భాగం-26 ఐక్య వియత్నాంకై పోరాటం : క్రమం, ఫలితాలు, ప్రాముఖ్యత (1961-1975)

BRAOU

డా.బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కార్యక్రమం

మాదిరి పరీక్షా పత్రం

# కోర్స్ –3 : ఆధునిక విప్లవాలు

సమయం: 3 గంటలు | మార్కులు : 100

భాగం–A

1. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

1. ఫ్రాన్స్‌లో విప్లవ పూర్వ సాంఘిక వ్యవస్థను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

లేదా

జాతీయ సభ ప్రవేశపెట్టిన సంస్కరణలను విశ్లేషించండి

2. రష్యాలో 1905 విప్లవం ప్రజ్వరిల్లడానికి దోహదమైన కారణాలెవ్వి?

లేదా

1917 రష్యన్ విప్లవ ప్రాధాన్యతను, ఇతర దేశాలపై దాని ప్రభావాన్ని పరిగణించండి.

3. అంతర్యుద్ధ కాలంనాటి చైనా దేశ పరిస్థితులను సంక్షిప్తంగా వర్ణించండి

లేదా

కొమింగ్‌టాంగ్–కమ్యూనిస్ట్ ఘర్షణ ఎందుకేర్పడింది? తదనంతర పరిణామాలెవ్వి ?

4. వియత్నాం జాతీయోద్యమాభివృద్ధిని, దానిలో హోచిమిన్ పాత్రను సమీక్షించండి.

లేదా

వియత్నాం ఏకీకరణ యుద్ధ క్రమం, దాని భిన్నదశలను విశ్లేషించండి.

భాగం –B

2. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

5. ఫ్రెంచ్ విప్లవం రావడానికి తత్వజ్ఞులు ఎలా తోడ్పడ్డారు?

లేదా

భీతావహ పాలనను విమర్శనాత్మకంగా పరిశీలించండి.

6. నెపోలియన్ పతనానికి భూఖండ విధానం ఎలా కారణమైంది?

లేదా

ఫ్రెంచ్ విప్లవ స్వభావాన్ని విశ్లేషించండి.

7. కారల్ మార్క్స్ భావాలు ప్రచారం కాకముందు, రష్యాలో విప్లవోద్యమ కార్యక్రమాలను నిర్వహించిన ప్రముఖుల కృషిని వివరించండి.

లేదా

రష్యన్ శ్రామిక వర్గ ఆవిర్భావాన్ని చర్చించండి.

8. కొమింగ్‌టాంగ్ పార్టీ ఆవిర్భావం, దాని ప్రధాన సూత్రాలను తెల్పండి.

లేదా

కమ్యూనిస్ట్‌ల విజయంలో మావోసేటుంగ్ నిర్వహించిన పాత్ర ఎట్టిది?

9. ఫ్రెంచి సామ్రాజ్యవాద విమోచన యుద్ధ ఫలితాలు, ప్రాముఖ్యతను సమీక్షించండి.

లేదా

వియత్నాం ఏకీకరణ పోరాటాన్ని అడ్డుకొనుటలో అమెరికా ఎందుకు విఫలమైంది?

BRAOU

# డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

## సామాజిక శాస్త్రాల విభాగం

## చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

## కోర్స్ –3 : ఆధునిక విప్లవాలు

### అభ్యాసం–1

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతరవకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదేని పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తి చేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

భాగం–A

1. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.

   1. తొలి స్టువర్ట్‌లు, వారి పార్లమెంట్‌ల మధ్య ఘర్షణకు దారితీసిన పరిణామాలను సమీక్షించండి.
   2. అమెరికా స్వాతంత్ర్య సంగ్రామానికి దారితీసిన కారణాలెవ్వి?

భాగం–B

2. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.

   1. మహోజ్వల విప్లవ ఫలితాలు, ప్రాముఖ్యతను విశ్లేషించండి.
   2. అమెరికన్ రాజ్యాంగ స్వభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించండి.

BRAOU

డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

సామాజిక శాస్త్రాల విభాగం

చరిత్రలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం

# కోర్స్–3 : ఆధునిక విప్లవాలు

## అభ్యాసం–3

గమనికలు :

- పుస్తకాలను చూచి జవాబులను రాయకూడదు.
- సాధ్యమైనంతవరకు జవాబులను మీ స్వంత పదాలలో రాయాలి.
- జవాబులకు సంబంధించిన సమాచారాన్ని ఏదైనా పుస్తకం నుండి గ్రహించినట్లయితే, ఆ పుస్తకం తాలూకు వివరాలను పొందుపర్చండి.
- అభ్యాసాలను రాయడానికి మీ స్వంత కాగితాలను వాడండి.
- మీరు రాసే జవాబునకు ఇరువైపుల మూల్యాంకన కోసం అవసరమైన స్థలాన్ని వదలండి.
- ఈ అభ్యాసాన్ని పూర్తిచేయడానికి రెండు గంటలకు మించిన వ్యవధిని తీసుకోరాదు.

BRAOU

### భాగం–A

1. క్రింది ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు రాయండి.
   1. అంతర్యుద్ధం నాటి చైనా దేశ పరిస్థితులను విశ్లేషించండి.
   2. వియత్నాం ఏకీకరణ పోరాటానికి దారితీసిన పరిస్థితులను సమీక్షించండి.

### భాగం–B

2. క్రింది ప్రశ్నలకు లఘు వ్యాఖ్యలను రాయండి.
   1. కమ్యూనిస్ట్‌ల సుదీర్ఘ యాత్ర ఫలితాలు, ప్రాముఖ్యతను తెల్పండి.
   2. జెనీవా ఒప్పందం (1954) షరతులు, ప్రాధాన్యతను వివరించండి.

BRAOU

BRAOU

BRAOU